పార్లమెంటు లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాలు

2014-2021



పార్లమెంటు లో
ప్రధాన మంత్రి
నరేంద్ర మోదీ
ప్రసంగాలు
2014-2021

ఇది గౌరవనీయ ప్రధానమంత్రి గారి ప్రసంగాల
తెలుగు (సందర్భోచిత అనువాదం).

ప్రచురణ
లోక్ సభ సచివాలయం

ముందుమాట

ప్రజాస్వామ్యంలో పార్లమెంటు అత్యున్నత దేవాలయం. పార్లమెంటు ఉభయ సభలలో జరిగే నిర్మాణాత్మక చర్చలు మరియు సంభాషణలు బలమైన, అభివృద్ధి చెందిన, పరిపక్వ ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రతిబింబాలు. 75 సంవత్సరాల మన గణతంత్ర దేశం యొక్క అద్భుతమైన ప్రయాణంలో, 2014 లో దేశ ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించడం ఒక ముఖ్యమైన ఘట్టం. అప్పటి నుండి - మన దేశం సమగ్ర అభివృద్ధి, స్థిరత్వం మరియు సంపద కోసం కొత్త ప్రమాణాలను స్థాపించింది.

గౌరవనీయ ప్రధానమంత్రి గారి క్రియాశీలక నాయకత్వంలో, మన దేశ ఆర్థిక వ్యవస్థ ముఖ్యమైన నిర్మాణాత్మక సంస్కరణలను చూసింది. అది అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థలలో మన స్థానాన్ని కనుగొనటానికి వీలు కల్పించింది. GST, ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్‌రప్టీ కోడ్, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ, క్రిప్టో కరెన్సీ రెగ్యులేషన్‌లతో సహా అనేక వినూత్న చట్టాలను పార్లమెంటు ఆమోదించింది, ఇవి మన ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టంగా మరియు మరింత దృఢంగా మార్చాయి. కోవిడ్-19 మహమ్మారి విసిరిన తీవ్రమైన సవాలును మనం విజయవంతంగా అధిగమించగలిగామనే వాస్తవం మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని సూచిస్తుంది. మనము ప్రపంచ అస్థిరతను కూడా విజయవంతంగా తట్టుకుంటున్నాము. భారతదేశం 2026 నాటికి ప్రధాన మంత్రి కల అయిన 5 ట్రిలియన్ యుఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తోంది.

ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంపై దృష్టి పెట్టడమే కాకుండా, సాధారణ ప్రజల జీవితాల్లో సానుకూల సామాజిక మరియు ఆర్థిక మార్పులను తీసుకురావడానికి అనేక కొత్త కార్యక్రమాలను విధానాలను రూపొందించింది. ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా అందరికీ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. పీఎం-కిసాన్ సమ్మాన్ యోజన, ప్రధాన మంత్రి ఫసల్ యోజన పేద రైతుల జీవితాలపై సానుకూల ప్రభావం చూపాయి.

రైతుల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం మరియు వారి ఉత్పత్తులకు కనీస మద్దతు ధర స్థిరంగా పెంచడం వంటి నిర్ణయాలు రైతుల పరిస్థితిని గణనీయంగా మెరుగుపరిచాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అమలు ముఖ్యంగా మహిళల స్థితిని బలోపేతం చేసింది, ఎందుకంటే ఈ పథకం కింద కుటుంబంలోని మహిళా సభ్యుల పేరు మీద మాత్రమే ఆస్తి నమోదు చేయబడుతుంది. 'బేటీ బచావో, బేటీ పఢావో' వంటి పథకాలు మహిళా సాధికారతకు దారితీశాయి.

గౌరవనీయులు ప్రధాన మంత్రి 'సర్వజన్ హితాయ్ సర్వజన్ సుఖాయ్' అంటే "అందరి సంక్షేమం కోసం, అందరి సంతోషం కోసం" అనే స్ఫూర్తితో సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేశారు. గౌరవనీయులైన ప్రధాన మంత్రి అందరికీ తాగునీటిని అందించడానికి జల్ జీవన్ మిషన్‌ను కూడా ప్రారంభించారు; అందరికీ పారిశుద్ధ్యం ఉండేలా స్వచ్ఛ భారత్ మిషన్; సముద్రతీరం మరియు జలమార్గాల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించడానికి సాగరమాల ప్రాజెక్ట్; గిరిజన ప్రాంతాల్లో 300 కొత్త నగరాల అభివృద్ధి కోసం 'రుర్బన్' పథకం లాంటి అనేక సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

దేశంలోని యువ పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణాన్ని అందించడానికి, 21వ శతాబ్దానికి అనుగుణంగా ఆధునిక భారతదేశాన్ని రూపొందించడానికి డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్ అప్ ఇండియా వంటి కార్యక్రమాలు అమలు చేయబడ్డాయి. అవినీతి మరియు నల్లధనాన్ని నిర్మూలించడంలో సహాయపడిన భీమ్, రూపే కార్డ్ ల వంటి డిజిటల్ చెల్లింపు పద్ధతులను ప్రవేశపెట్టడంతో ఆర్థిక పర్యావరణ వ్యవస్థ ఆధునికీకరించబడింది. నేడు మధ్యవర్తులు లేకుండా నేరుగా లబ్ధిదారులందరి బ్యాంకు ఖాతాల్లోకి సబ్సిడీలు చేరుతున్నాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆధార్ ఆధారితంగా గుర్తించడంతో

సామాజిక సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుగుతుంది. పేదల వద్ద ఎక్కువ డబ్బు ఉండేలా చూడటమే కాకుండా, ఖజానాకు గణనీయమైన పొదుపు చేయడం జరిగింది.

ఈ పుస్తకం, దూరదృష్టి గల, ప్రగతిశీల ప్రధానమంత్రి స్ఫూర్తిదాయక ప్రసంగాల సంకలనం. ఇది పార్లమెంటు సభ్యులు మరియు పరిశోధకులతో పాటు సామాన్యులకు గౌరవనీయ ప్రధాన మంత్రి ఆలోచనలు, అభిప్రాయాల గురించి జ్ఞానోదయం చేస్తుంది. దేశంలోని సామాజిక, పరిపాలనా, ఆర్థిక మరియు రాజకీయ పరిస్థితులకు సంబంధించిన సమస్యలపై, అలాగే వివిధ జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై ఈ పుస్తకం ప్రధాన మంత్రి గారి అభిప్రాయాలపై అంతర్దృష్టిని అందిస్తుంది. దేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్న తరుణంలో ఈ పుస్తకాన్ని ప్రచురించడం మాకు చాలా సంతోషకరమైన విషయం. భారతదేశాన్ని బలమైన, సురక్షితమైన సంపన్న దేశంగా మార్చే గౌరవనీయ ప్రధానమంత్రి గారి ఆలోచనలను దేశ ప్రజలకు, ప్రపంచానికి విస్తృతంగా చేరువ చేసే ప్రయత్నం ఈ పుస్తకం.

గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రసంగాల సంకలనాన్ని ప్రచురించడానికి లోక్‌సభ సచివాలయం తీసుకున్న చొరవను నేను అభినందిస్తున్నాను. ఈ ఉదాత్తమైన ప్రయత్నం పార్లమెంటరీ చర్చను మరింత సుసంపన్నం చేస్తుందని, పార్లమెంటేరియన్లు, పరిశోధకులు, ప్రజా విధానం మరియు విదేశాంగ విధాన విద్యార్థులకు, భారత రాజకీయాలను, మన బలమైన ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకోవడానికి మరియు తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్నవారికి కూడా ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని నా దృఢ విశ్వాసం.

ఓం బిర్లా

స్పీకర్, లోక్ సభ

ఉపోద్ఘాతము

శ్రీ దామోదర్ దాస్ నరేంద్ర మోదీ గారు 2014లో భారత ప్రధానిగా ఎన్నికైనప్పుడు, స్వేచ్ఛాయుత భారత దేశంలో జన్మించిన తరానికి చెందిన మొట్టమొదటి వ్యక్తిగా ఆ అత్యుత్తమ స్థానాన్ని అలంకరించిన వ్యక్తిగా కీర్తిని పొందారు. ఆయన ప్రయాణం కొత్తగా వలస పాలన నుండి విముక్తి పొందిన దేశం భవితతో అనివార్య, విడదీయరాన్ని బంధం కలిగి ఉన్న ప్రయాణం. ఆయన జీవితం, అధిగమించలేని అవరోధాలతో సతమతమవుతున్నా, తన భవిష్యత్తు పట్ల ఒక బలమైన నమ్మకాన్ని కలిగి ఉన్న, ఆత్మవిశ్వాసం, స్థిరత్వం, బలం, ఐకమత్యం, పరిపక్వ ప్రజాస్వామ్యం గల ఒక దేశాన్ని ప్రతిబింబిస్తుంది. శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రయాణంలో ఎదురైన కష్టాలు, సవాళ్లు అసెంఖ్యాకమైన తోటి పౌరుల పోరాటాల గాదగా చెప్పవచ్చు. వారు ఎన్నో మార్గాల్లో కష్టాలనుంచి అణిచివేయబడకుండా, దృఢనిశ్చయంతో, సమదృష్టితో, సంయమనంతో, సహనంతో, కష్టంతో, ఒక యువ జాతిని, దాన్ని ప్రజాస్వామ్య రాజకీయాన్ని పెంచి పోషించారు. ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ మొదటిసారి పార్లమెంట్ భవనాన్ని సందర్శించినప్పుడు వారు ఆ ప్రజాస్వామ్య దేవాలయానికి నమస్కరించిన విధానం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వాదులందరి మదిలో చిరకాలం నిలిచిపోతుంది. ఆ చర్య వారికి ఈ దేశంలో ఎన్నో సహస్రబ్దాలుగా ఉన్న భాగస్వామ్య పాలన విధానం పై వారికున్న బలమైన నమ్మకానికి దృశ్యమానంగా నిలుస్తుంది.

ఈ సంకలనంలో భారత పార్లమెంటులో ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ గారు 2014 నుంచి 2021 వరకు చేసిన 34 ప్రసంగాలు కాలక్రమానుసారంగా ఉన్నాయి. ఆయనకు ప్రపంచం పట్ల ఉన్న దృష్టి కోణాన్ని ఈ ప్రసంగాలు పాఠకులకు పరిచయం చేస్తాయి. ఈ ప్రపంచ దృక్పథం మన నాగరికత ఆధ్యాత్మిక సారాంశం ద్వారా ప్రేరేపించబడినది, దాని సమ్మిళిత నైతికత సామర్థ్యం ద్వారా రూపొందించబడింది, అనేక సంస్కృతుల వైవిధ్యం ద్వారా సుసంపన్నం చేయబడింది. అలాగే కొత్త, హేతుబద్ధమైన, శాస్త్రీయత కలిగి ఉన్న సంసిద్ధతతో ప్రేరేపించబడింది. ఈ ప్రపంచ దృక్పథమే దేశాల మధ్య ప్రపంచ నాయకుడిగా భారతదేశం తన సముచిత స్థానం, ఏదైతే ప్రపంచ చరిత్రలో సాంప్రదాయకంగా ఎంతో కాలంగా అనుభవించిన ఆ హోదాను తిరిగి పొందగల మన దేశ సామర్థ్యం పై ప్రధాని మోదీకి తిరుగులేని విశ్వాసానికి పునాదిగా పనిచేసింది.

ప్రధాని మోదీ ప్రసంగాలు భారత రాజ్యాంగం, వాటి విలువలపై ఆయనకున్న స్థిరమైన విశ్వాసాన్ని పునరుద్ఘాటించడంలో ఎప్పుడు విఫలం కాలేదని పాఠకులు కనుగొంటారు. ఆయన దృష్టిలో భారత రాజ్యాంగం వేలాది సంవత్సరాల ప్రజల ఆలోచనలు, ఆత్మ విమర్శల నుంచి వడగట్టబడిన జ్ఞాన పరిణామం. ఇది సామాన్య ప్రజల ఆశలు, ఆశయాల భాండాగారం. దేశాన్ని ఏకతాటిపై తీసుకురాగలిగే బంధన శక్తి. దేశంలోని అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల ఉమ్మడి భవితకి నిదర్శనం. ప్రధానమంత్రి మాటల్లో చెప్పాలంటే భారత రాజ్యాంగం, భారతదేశ గౌరవానికి, ఐకమత్యానికి స్వరూపం. ఈ సందర్భంలోనే ప్రధానమంత్రి గారు భారత రాజ్యాంగాన్ని తన ప్రభుత్వపు ఏకైక మతంగా, ఏకైక మత గ్రంథం గా పరిగణించి, అభినందించాల్సిన అవసరం ఉందని వక్కానించారు.

శ్రీ నరేంద్ర మోదీ గారు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉంటూ, ప్రధానమంత్రి అయిన మొట్టమొదటి వ్యక్తి. ఒక దశాబ్దం కంటే ఎక్కువ కాలం ఒక పెద్ద రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవం ఆయనకు కేంద్ర రాష్ట్రాల మధ్య ఉండే పరస్పర సంబంధాల స్వభావం పై ప్రత్యేకమైన దృష్టి కోణాన్ని అందించింది. ఆయన పార్లమెంట్లో 'సహకార సమాఖ్య' అనే ఆలోచన గురించి గట్టిగా మాట్లాడే విధానం, రాజ్యాంగ నిబంధనలు ఈ సమాఖ్య లక్షణాన్ని మన రాజకీయ వ్యవస్థకు ఎలా ఆచరణలో ఉంచాలో చెప్పే విధానానికి ప్రతిబింబం. భారతదేశం లాంటి ఒక పెద్ద వైవిధ్యమైన దేశంలో సమాఖ్య వ్యవస్థ విజయవంతం కావాలంటే ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రులు ఒక బృందంగా పని చేయాలి అని ఆయన ప్రసంగాల ద్వారా తెలియజేసారు. అందువల్లనే జీఎస్టీ చట్టాన్ని విజయవంతంగా ఆమోదించడం, అమలు చేయడం, కేంద్ర-రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన, అనుకూలతల స్ఫూర్తి ఏదైతే కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య చర్చలకి మార్గనిర్దేశకంగా పనిచేసిందో, దానికి చిహ్నంగా నిలిచింది. ఈ సందర్భంలోనే ఈ విజయం, సహకార సమాఖ్య వ్యవస్థ ఆదర్శాన్ని సాధించడంలో ఒక్క ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

సామాన్యుల కష్టాలను ప్రధానమంత్రి మోదీ చాలా దగ్గర నుండి చూశారు. ఆయన జీవితం హక్కులు, అర్హతల మధ్య నలిగింది. ప్రధానమంత్రి గారి జీవన ప్రయాణం ప్రతి భారతీయుడి జీవితంతో ప్రతిధ్వనిస్తుంది. వారి తలవంచని వైఖరి, సహజసిద్ధమైన గౌరవం, నిజాయితీ, విధి పట్ల బాధ్యత, జ్ఞానం కోసం తపన, నేర్చుకోవడానికి సంసిద్ధత, అనుభవాల నుంచి నేర్చుకునే గుణం, అన్నిటికంటే ముఖ్యంగా మాతృభూమి పట్ల అచంచలమైన భక్తి. అందువల్లనే వారి ఉపన్యాసాలు, ప్రతి వ్యక్తిలో దాగి ఉన్న సహజ

సిద్ధమైన, అసాధారణ విజయాలు సాధించే సామర్థ్యం పట్ల బలమైన నమ్మకానికి స్వరమందించాయి. ప్రతి పౌరుడు తన స్థాయిని సాధించడానికి సహాయం చేయడం ప్రభుత్వపు పవిత్రమైన బాధ్యత అని ఆయన భావిస్తారు. మన దేశంలో యువత ప్రాతినిధ్యం వహిస్తున్న మెరిట్ పూల్ గొప్పతనం, గాఢత పై ప్రధానమంత్రి కి అపారమైన విశ్వాసం ఉంది. మంచి అవకాశాలు, సరైన ప్రోత్సాహకాలు, అలాగే సహాయక వాతావరణం ఏర్పాటు చేసినప్పుడు గ్రామీణ, చిన్న పట్టణాలలోని యువత ప్రజా క్షేత్రంలో, వృత్తిరంగంలో, ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా గొప్ప పోటీ స్వభావాన్ని, నైపుణ్యాన్ని కనబరిచారు. ఇటీవల కాలంలో వ్యాపారాలు, ఆవిష్కరణల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసే పర్యావరణంలో జరిగిన అపూర్వమైన అభివృద్ధిని చూసి, ఇప్పటివరకు నిర్లక్ష్యం చేయబడిన రెండవ మూడవ తరగతి నగరాల్లో పెరుగుతున్న చైతన్యం పై ప్రధాని మోదీకి గొప్ప ఆశ, నమ్మకం ఉన్నాయి. ప్రతి వ్యక్తి ప్రత్యేకత పై ప్రధానమంత్రి లోతైన విశ్వాసం ఈ శ్లోక పఠనం ద్వారా క్లుప్తంగా వ్యక్తీకరించబడింది.

అమంత్రమక్షరం నాస్తి, నాస్తి మూల మానవుషదం

అయోగ్యః పురుషో నాస్తి, యోజకస్తత్ర దుర్లభః

(మంత్రంలో చోటు దొరకని అక్షరం లేదు, ఔషధ గుణాలు లేని వేరు లేదు, పూర్తిగా అనర్హులు ఎవరూ లేరు, కానీ వాటిని ఎలా ఉపయోగించాలో తెలిసిన వ్యక్తి అరుదు)

ప్రతి వ్యక్తి విశిష్టమైన సామర్థ్యాలను కలిగి ఉన్నందున, భారతదేశంలోని ప్రతి పౌరుని సామర్థ్య నిరూపణకు అనుకూలమైన వాతావరణాన్ని అందించడానికి ప్రభుత్వాలు శక్తి మేరకు ప్రయత్నించాలని ప్రధానమంత్రి ఈ సంకలనంలోని ప్రసంగాల ద్వారా దృఢవిశ్వాసాన్ని వ్యక్తీకరించారు. అందువల్లనే **'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్'** అనేది ఈ ప్రభుత్వ విధాన నమూనాకు మూల స్తంభం. ప్రభుత్వం తన ప్రజలను విశ్వసిస్తుందని, ప్రతి వ్యక్తి తన జీవితంలో ఏ స్థాయిలో ఉన్నప్పటికీ గౌరవప్రదమైన జీవితం గడిపే హామీ ఇవ్వబడుతుందని, అలాగే ప్రతి ఒక్కరికి ప్రోత్సాహకాలు సృష్టించబడతాయని, వ్యక్తిగత ప్రతిభ వికసించడానికి ప్రతి పౌరుడికి ప్రభుత్వ విధానం ఒక హామీని ఇస్తుంది. ప్రజల చిత్తశుద్ధి పై ప్రధానమంత్రి కి ఉన్న విశ్వాసం, నిస్సందేహంగా పౌరులు ప్రభుత్వ అధికారుల మధ్య విశ్వసనీయమైన సద్గుణ పర్యావరణ వ్యవస్థను

కల్పించడంలో పరివర్తనాత్మక ప్రభావాన్ని చూపించింది. దీనికి ఒక ఉదాహరణ, ప్రభుత్వ అధికారులతో పౌరుల పత్రాలను ధ్రువీకరించే విధానానికి స్వస్తి చెప్పి, స్వీయ ధ్రువీకరణను ఆమోదించడం. ఇలా చేయడం ద్వారా ప్రజలకు కలిగే అపారమైన శ్రమను, కష్టాన్ని తొలగించడమే కాకుండా సమాజం పై, రాజకీయ వ్యవస్థ పై గొప్ప నమ్మకాన్ని చూపించడం జరిగింది.

ఈ సంకలనంలోని ప్రసంగాలలో జన్ ధన్ యోజన, ప్రత్యక్ష ప్రయోజన బదిలీ, ఆకాంక్షాత్మక జిల్లాల వేగవంతమైన అభివృద్ధి, వ్యవసాయ వర్గాల కోసం అనేక పథకాలు, అందరికీ ఆరోగ్య హామీని ఇచ్చే ఆయుష్మాన్ యోజన, వోకల్ ఫర్ లోకల్, స్టార్ట్ అప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, చిన్న వ్యాపారవేత్తలు వారి వ్యాపారాల కోసం పథకాలు, విధానాలను సరళీకృతం చేయడం, వెనకబడిన తరగతుల కోసం సాంకేతికతను ఉపయోగించడం, దేశంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను ప్రత్యేకంగా ఈశాన్య రాష్ట్రాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడం వంటి పథకాల గురించి ప్రస్తావించారు. ఆయన దృష్టిలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు పౌరులందరికీ విశ్వసనీయమైన, పంపిణీ చేయగల ఫలితాలను ఇవ్వగలిగే విధంగా రూపొందించి, అమలు చేయాలి. ఆ అభివృద్ధి ఫలాలు నిజమైన అట్టడుగు వర్గాలకు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి, మహిళలకు, రైతులకు, యువకులకు అందేలాగా చూడాలి. ప్రజాసేవను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, స్నేహపూర్వకంగా, ఊహ జనితంగా చేయడం ప్రధానమంత్రి లక్ష్యం. తద్వారా అసంతృప్తికి, నిరాసక్తతకు ఆస్కారం లేకుండా చేయడమే కాకుండా ఆశ, శ్రేయస్సు, సాధికారత, మనది అన్న యాజమాన్య భావనను సృష్టిస్తుంది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అత్యాధునిక సాంకేతికత ఆవిష్కరణలతో కూడిన వ్యాపార అనుకూలమైన ఆధునిక భారతదేశానికి అనుగుణంగా ఉండే సంక్షేమ రాజ్య అభివృద్ధి పై ప్రధాని మోదీ దృష్టి ఉంది. సంక్షేమం, అభివృద్ధి, విశ్వాసం ద్వారా దేశకీర్తిలో ప్రభుత్వం ఉమ్మడి భాగస్వామ్య భావాన్ని పెంపొందించగలిగినప్పుడే **'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్'** (ఒక భారతదేశం, ఉత్తమ భారతదేశం) అంతిమ గమ్యాన్ని సాధించగలమని ప్రధానమంత్రి విశ్వసించారు.

దేశ యువతకు ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ప్రధాని మోదీ ఉజ్వలమైన అవకాశాలను చూస్తున్నారు. ఆయన పార్లమెంట్ సభ్యులను, వారి ద్వారా దేశాన్ని గొప్పగా ఆలోచించాలని, తమ సామర్థ్యాలను నమ్మాలని, దూరదృష్టిని ప్రదర్శించి, అపశకునాలు వల్లించే ప్రవక్తలు ఇచ్చే నిరుత్సాహానికి గురి కావద్దని ఉద్బోధించారు. దేశ ఆర్థిక వ్యవస్థను సమీప భవిష్యత్తులో ఐదు ట్రిలియన్ డాలర్ల వ్యవస్థగా మార్చే

ప్రగతి పథంలో ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతుందని ఆయన పార్లమెంట్ సభ్యులకు హామీ ఇచ్చారు. భారతావనిని అవకాశాల గనిగా ప్రధానమంత్రి అభివర్ణించారు. మన దేశ ప్రజలు, మన దేశ స్వాతంత్ర శతాబ్ది సంవత్సరం అయినా 2047 సంవత్సరం నాటికి మన దేశాన్ని విశ్వవ్యాప్తంగా ఆదర్శవంత దేశంగా గుర్తించేలా కలలు కనాలి.

ఏ సమాజమైనా, సక్రమంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే పౌరులు తమ విధులను క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో నిర్వహించాలనేది ప్రధానమంత్రి దృఢ అభిప్రాయం. ప్రాథమిక విధులు, పౌరుల హక్కులు కలిసి సాగుతాయని ప్రతి ఒక్కరూ గ్రహించడం చాలా ముఖ్యం. తద్వారా భారతదేశం ఈ 'అమృత కాలం' లో తన ఆదర్శాన్ని సాధించేలా, మనస్సాక్షితో దేశం పట్ల తమ విధులను నిర్వర్తించాలని దేశ ప్రజలందరికీ ప్రధానమంత్రి గట్టిగా చెప్పారు.

భారతదేశం ఐక్యంగా, బలంగా అందర్నీ కలుపుకొని మరింత విశ్వాసంతో కొత్త శిఖరాలు అందుకుంటుందని ప్రధానమంత్రి మోదీ విస్పష్టమైన విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. మన సామూహిక అనుభవాలను, నమ్మకాలను గొప్పగా వ్యక్తీకరించే శ్లోకాలు, మంత్రాల నుండే ఆయన ప్రసంగాలు ఎక్కువగా ఉత్పన్నమైనట్లు పాఠకులు గమనించవచ్చు. కాలం పెట్టిన పరీక్షలో గెలిచిన ఈ జ్ఞాన గుళికలు, ఎన్నో యుగాల నుంచి అసంఖ్యాక తరాల పూర్వీకులకు మార్గదర్శకత్వాన్ని అందించాయి. ప్రధానమంత్రి అందమైన వేద మంత్రం ద్వారా వ్యక్తిని, భారత ప్రజల సామూహిక మేధస్సును ఈ విధంగా అభివర్ణించారు.

అయుతో అహం, అయుతో మే ఆత్మ, అయుతం మే

అయుతం చక్షు, అయుతం శ్రోత్రం

(నేను ఒక్కడిని కాదు, నేను ఏకాకిని కాదు. నాతో పాటు లక్షల మందిని నేను చూస్తున్నాను కాబట్టి, నా వద్ద లక్షలాది మంది ఆధ్యాత్మిక శక్తి, దృష్టి, వినికిడి శక్తి, అలాగే కర్మ శక్తి ఉంది.)

గౌరవనీయ ప్రధానమంత్రి గారు పార్లమెంట్లో 2014-21 కాలంలో చేసినా 34 ప్రసంగాలను ప్రధాన భారతీయ భాషలలో అనువదించి, ప్రచురించే సవాలుతో కూడిన కార్యాన్ని చేపట్టటం లోక్ సభ సెక్రటేరియట్ కి

గొప్ప గౌరవం. పాఠకులు తమ మాతృభాషలో ప్రధానమంత్రి గారి అభిప్రాయాలను, ఆలోచనలను బాగా అర్థం చేసుకోగలరని, ప్రశంసించగలరని, విమర్శనాత్మకంగా అంచనా వేయగలరని మా నమ్మకం. గౌరవనీయులు లోక్ సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా గారి మార్గదర్శకత్వం, ప్రోత్సాహం వల్లనే ఇటువంటి సవాలుతో కూడిన ఈ బహుభాషా ప్రచురణ లాంటి వినూత్న కార్యాన్ని చేయగలిగాము. శ్రీ సత్పాల్ గులాటి, జాయింట్ సెక్రెటరీ, లోక్ సభ సెక్రటేరియట్ అధికారులు ఈ పనిని అనేక సవాళ్లు ఎదుర్కొంటూ అవిశ్రాంతంగా పనిచేసారు. లోక్ సభ సెక్రటేరియట్ లో అన్ని స్థాయిల్లో కనబరిచిన కృషి, అంకిత భావానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రసంగాల ప్రచురణ ఒక నిదర్శనం. భారతదేశంలోని వివిధ భాషల నేపథ్యం గల పాఠకులకు ఈ ప్రచురణ ఉపయోగకరంగా ఉంటుందని మా ప్రగాఢ విశ్వాసం.

ఉత్పల్ కుమార్ సింగ్

సెక్రటరీ జనరల్

లోక్ సభ

విషయసూచిక

క్రమ సంఖ్య	శీర్షిక	పేజి
1.	లోక్ సభ స్పీకర్ గా శ్రీమతి సుమిత్ర మహాజన్ గారు ఎన్నికైన సందర్భంగా ప్రధాన మంత్రి గారి స్వాగతోపన్యాసం. [06-06-2014]	3
2.	లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం . [11-06-2014]	7
3.	రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [11-06-2014]	29
4.	లోక్ సభ డిప్యూటీ స్పీకర్ గా డాక్టర్ ఎం తంబిదురై గారు ఎన్నికైన సందర్భంగా ప్రధాన మంత్రి గారి అభినందనలు. [13-08-2014]	49
5.	కేంద్రమంత్రి ఉపయోగించిన అభ్యంతరకర భాష పై లోక్ సభ లో ప్రధాన మంత్రి గారి ప్రకటన. [05-12-2014]	51
6.	ముంబై దాడి నిందితుడికి పాకిస్తాన్ లో బెయిల్ ఇవ్వడం పై ప్రధాన మంత్రి గారి ప్రకటన. [19-12-2014]	53
7.	లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [27-02-2015]	57
8.	జమ్మూ-కాశ్మీర్ లో వేర్పాటు వాద నాయకుడిని విడుదల చేయడం పై ప్రధాన మంత్రి గారి వ్యాఖ్య. [09-03-2015]	89

క్రమ సంఖ్య	శీర్షిక	పేజి
9.	రైతు ఆత్మహత్య పై ఉత్పన్నమైన పరిస్థితి పై ప్రధాన మంత్రి గారి వ్యాఖ్య. [23-04-2015]	93
10.	డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 125 వ జయంతి ఉత్సవం పై ప్రధాన మంత్రి గారి ఉపన్యాసం. [27-11-2015]	97
11.	లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం . [03-03-2016]	123
12.	జీ ఎస్ టీ బిల్లు పై లోక్ సభలో ప్రధాన మంత్రి గారి ఉపన్యాసం [08-08-2016]	147
13.	లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [07-02-2017]	163
14.	రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [08-02-2017]	195
15.	క్విట్ ఇండియా ఉద్యమం 75 వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి గారి ఉపన్యాసం. [09-08-2017]	223
16.	లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [07-02-2018]	237
17.	రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [07-02-2018]	269

క్రమ సంఖ్య	శీర్షిక	పేజి
18.	రాజ్యసభలో పదవీ విరమణ పొందిన సభ్యులకు వీడ్కోలు సందర్భంగా ప్రధాన మంత్రి గారి ఉపన్యాసం. [28-03-2018]	297
19.	లోక్ సభలో అవిశ్వాస తీర్మానానికి ప్రధాన మంత్రి గారి సమాధానం. [20-07-2018]	301
20.	రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ గారికి ప్రధానమంత్రి గారి అభినందనలు. [09-08-2018]	329
21.	లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం.[07-02-2019]	337
22.	శ్రీ అటల్ బిహారీ వాజ్పేయి గారి చిత్రపటం ఆవిష్కరణ సందర్భంగా ప్రధాన మంత్రి గారి ఉపన్యాసం. [12-02-2019]	371
23.	16వ లోక్ సభ, చివరి సమావేశం లో ప్రధాన మంత్రి గారి ప్రసంగం. [13-02-2019]	375
24.	శ్రీ ఓం బిర్లా లోక్ సభ స్పీకర్ గా ఎన్నికైన సందర్భంగా ప్రధాన మంత్రి గారి ప్రసంగం. [19-06-2019]	389
25.	లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [25-06-2019]	395
26.	రాజ్యసభ 250 వ సమావేశం సందర్భంగాప్రధాన మంత్రి గారి ప్రసంగం. [18-11-2019]	417
27.	70 వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ప్రధాన మంత్రి గారి ప్రసంగం. [26-11-2019]	427

క్రమ సంఖ్య	శీర్షిక	పేజి
28.	శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ యొక్క స్థాపన సందర్భంగా ప్రధాన మంత్రి గారి ప్రసంగం. [05-02-2020]	437
29.	లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [06-02-2020]	443
30.	రాజ్యసభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం.[06-02-2020]	477
31.	రాజ్య సభ డిప్యూటీ చైర్మన్ గా శ్రీ హరివంశ్ సింగ్ గారి ఎన్నిక సందర్భంగా ప్రధాన మంత్రి గారి ప్రసంగం. [14-09-2020]	511
32.	రాజ్యసభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం.[08-02- 2021]	521
33.	రాజ్యసభ సభ్యులకు వీడ్కోలు సందర్భంగా ప్రధాన మంత్రి గారి ప్రసంగం. [09-02-2021]	549
34.	లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం పై ప్రధాన మంత్రి గారి సమాధానం. [10-02-2021]	555



67th Mahaparinirvan Diwas of Dr. B. R. Ambedkar



Floral Tribute to Pandit Madan Mohan Malviya and Shri Atal Bihari Vajpayee



Floral Tribute to Netaji Subhash Chandra Bose



IPU President Address in the Central Hall of Parliament

2014



శ్రీ నరేంద్ర మోదీ పార్లమెంట్ సెంట్రల్ హాలులో మొదటిసారి విచ్చేసినప్పుడు, ప్రవేశ ద్వారం మెట్లపై శిరస్సు వంచి నమస్కరించారు.

"పార్లమెంటు దేశ
ప్రజాస్వామ్య మందిరం."

లోక్ సభ స్పీకర్ గా శ్రీమతి సుమిత్ర మహాజన్ ఎన్నికైన సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి స్వాగతోపన్యాసం.

6 జూన్ 2014

లోక్ సభ స్పీకర్ శ్రీమతి సుమిత్ర మహాజన్ గారికి అభినందనలు - 06 జూన్ 2014

గౌరవనీయులైన మేడం స్పీకర్, ఈ సభలోని అన్ని పార్టీలకు, సభ్యులందరికీ నా హృదయపూర్వక అభినందనలు. ఈ సభ గొప్ప సాంప్రదాయాన్ని అనుసరించి ఏకాభిప్రాయం ద్వారా స్పీకర్ ని ఎన్నుకోవడం జరిగింది. ఇది మన అందరికీ కూడా గౌరవప్రదమైన విషయం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం లోని ప్రజాస్వామ్య మందిరంలో ఉన్న పీఠంపై ఒక మహిళను కూర్చోబెట్టి, సభా కార్యకలాపాలను నడపాల్సిన బాధ్యత ఇచ్చి, సామాన్య ప్రజల సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా మీ విలువైన మార్గదర్శనాన్ని కోరుకోవడం జరిగింది. గౌరవనీయులైన మేడం స్పీకర్, ఈ సభకు ఇది గర్వకారణమైన విషయం. మీరు ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఒక సామాన్య సభ్యులుగా ఉంటూ ఎన్నో దశాబ్దాలు ప్రజా జీవితంలో ప్రజల ప్రతినిధిగా పనిచేస్తూ ఈ సభలో ఎనిమిది సార్లు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నిక కాబడిన మీరు, మీ అనుభవంతో ఈ సభ సజావుగా నడుస్తుందని మేము నమ్ముతున్నాం. స్పీకర్ మేడం, 16వ లోక్ సభలో, మొదటి లోక్ సభలో లభించిన అవకాశమే దాదాపు ఇప్పుడూ లభించింది. దేశంలో మొదటి లోక్ సభ ఏర్పడినప్పుడు సభ్యులందరూ మొదటిసారి ఎన్నికై వచ్చారు, ఆ తర్వాత ఎన్నో సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఈ సభలో దాదాపు మూడు వందల పదిహేను మంది సభ్యులు మొదటి సారి ఎన్నిక అయి వచ్చారు. దీని తాత్పర్యం, పాత సంప్రదాయాలను వదిలి కొత్త సాంప్రదాయాలను ప్రారంభిస్తూ, ప్రపంచం ఈ ప్రజాస్వామ్యం పట్ల ఏ విధంగా అయితే ఆశగా చూస్తుందో, ఒక కొత్త రూపు తో ప్రపంచం ముందు మనల్ని నిలబెట్టుకునే అవకాశం ఈ సభ ద్వారా మనకు లభించింది. పాత గొప్ప సాంప్రదాయాలను ముందుకు తీసుకు వెళుతూనే, కొత్త రక్తం, కొత్త శక్తి ఈ సభలోకి వచ్చాయి. ప్రపంచం ముందు ఒక బలమైన ప్రజాస్వామ్యాన్ని ప్రదర్శించే

అవకాశం ఈ సభ ద్వారా మనకి లభించింది. ఇది ప్రజాస్వామ్య మందిరంలో కొత్త సభ్యుల ఉత్సాహంతో ఇది దేశ అభివృద్ధికి శక్తినిచ్చే మందిరంగా అవతరించనుంది.

మీ అధ్యక్షతన మాకు మార్గదర్శకత్వం తప్పకుండా లభిస్తుందన్న ఆశతో ఉంది. మన దేశ ఆకాంక్షలను నెరవేర్చడంలో విజయం సాధిస్తాం. గౌరవనీయులైన స్పీకర్ మేడం, మీ పేరులో అందరితో మిత్రత్వం, స్నేహశీలత స్ఫురించే అర్థం ఉంది. దానితో ఒక ఆత్మీయ అనుభూతి కలుగుతుంది, మన శాస్త్రాలలో ఏమి చెప్పారంటే "మహాజన్ యేన్ గతా స పంథ:". దాని అర్థం మహాజనులు ఏ దారిలో వెళ్తారో ఆ దారిలో వెళ్లడం మంచిది, ఇక్కడ మహాజన్ స్వయంగా ఆసీనులై ఉన్నారు కాబట్టి ఈ సభ ఆ దారిలో వెళ్లడం మంచిది. నేను మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను, మీ ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఈ సభ మీ పనిలో సహకారం అందిస్తూ భారతదేశ సామాన్య ప్రజల ఆకాంక్షలను పూర్తి చేయడంలో ఎటువంటి అవకాశాన్ని వదలదని నేను నమ్ముతున్నాను. మరోసారి నేను మీకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ అన్ని పార్టీలను అభినందిస్తున్నాను. ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వారి మద్దతు వలన ఈరోజు ఏకాభిప్రాయంతో మనం ఈ సాంప్రదాయాన్ని కొనసాగించగలిగాము.చాలా చాలా ధన్యవాదాలు.

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

11 జూన్ 2014

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 11 జూన్ 2014

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఈ సభలో నేను కొత్తగా ప్రవేశించాను, మొదటి సారి నాకు మాట్లాడే అవకాశం లభించింది.ఈ సభ ప్రతిష్ట, సాంప్రదాయాలు చాలా ఉన్నతమైనవి. ఈ సభలో గత మూడు, నాలుగు దశాబ్దాలుగా ఈ దేశ సమస్యలను లేవనెత్తుతూ, పరిష్కరిస్తూ, నిరంతరంగా ప్రయత్నం చేస్తున్న అనుభవజ్ఞులు ఇక్కడ కూర్చుని ఉన్నారు. నాలాంటి కొత్త వ్యక్తి మాట్లాడుతున్నప్పుడు సభ ప్రతిష్ట, గౌరవానికి భంగం వాటిల్లితే నన్ను క్షమిస్తారని నేను విశ్వసిస్తున్నాను. గౌరవనీయులు రాష్ట్రపతి గారి ప్రసంగం పై లోక్ సభలో 150 కంటే ఎక్కువ గౌరవనీయ సభ్యులు వారి అభిప్రాయాలను వ్యక్తపరిచారు. సభలో ఉంటూ కొన్ని, కొన్ని గదిలో కూర్చుని, దాదాపు అన్ని ప్రసంగాలు విన్నాను.

గౌరవనీయులు మల్లిఖార్జున గారు, గౌరవనీయులు ములాయంసింగ్ గారు, డాక్టర్ తంబిదురై గారు, భర్తృహరి గారు, టి ఎం సి నాయకులు, ఇతర సీనియర్ సభ్యుల ప్రసంగాలను నేను విన్నాను. ఇక్కడ ఎన్నో విషయాలను తెలియజేసి, వాటిని ఎప్పుడు చేస్తాం, ఎలా చేస్తామో అడిగారు. ఇక్కడ సరైన విషయాలని స్పృశించారు, మదిలో ఈ విషయాలు ఉత్పన్నం అవ్వడం స్వాభావికం. నేను నా అనుభవాన్ని చెప్తాను. నేను కొత్తగా గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాను. ఒకసారి నేను అక్కడి శాసనసభలో గుజరాత్ లోని గ్రామాలలో, ఇళ్లల్లో 24 గంటలు విద్యుత్ ఇవ్వాలనుకుంటున్నాను అని చెప్పాను. అప్పుడు పాలక పక్షం చప్పట్లు కొట్టింది కానీ, ప్రతిపక్షం వైపు నిశ్శబ్దం ఆవరించింది. అప్పుడు మా ప్రతిపక్షనేత చౌదరి అమర్ సింగ్ గారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, తెలివైన నాయకుడు. తర్వాత ఆయన నన్ను కలవడానికి వచ్చారు. వారు మోడీ గారు, మీరు తప్పు చేయడం లేదు కదా?

మీరు కొత్తగా వచ్చారు. అనుభవం లేదు. ఇక్కడ 24 గంటలు విద్యుత్ ఇవ్వడం అసాధ్యం. మీరు ఎలా ఇవ్వగలరు? వారు ఒక శ్రేయోభిలాషిగా ఈ మాట అన్నారు. నేను వారితో నాకు ఈ పని చేయగలనని అనిపిస్తుంది అని అన్నాను. వారు మళ్ళీ ఇది అసాధ్యం అన్నారు. రెండు వేల మెగావాట్ల లోటు ఉన్నట్టయితే, మీరు ఎలా చేయగలరు? ఇలాంటి ఆలోచన వారి మదిలో కలగడం స్వాభావికం. కానీ గుజరాత్ లో ఆ పని చేయగలగడం నాకు సంతోషాన్నిచ్చింది. అందుకే ఇక్కడ ఉన్న సీనియర్ సభ్యుల మనసులో కూడా ప్రశ్నలు ఉత్పన్నమవడం సహజం. ఇంతవరకు జరగలేదు, ఎలా జరగబోతుంది? ఇలాంటి సందేహం కలగడం సహజం. కానీ నేను ఈ సభ కు భరోసా ఇస్తాను. గౌరవనీయులైన రాష్ట్రపతి గారు చూపించిన మార్గాన్ని అనుసరించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తాం. రాష్ట్రపతి గారి ప్రసంగం మా దృష్టిలో కేవలం ఒక సాంప్రదాయం లేదా ఆచారం కాదు. వారు చెప్పిన ప్రతి మాట మాకు పవిత్రమైనది, వాటిని నెరవేర్చడానికి మేము ప్రయత్నాలు చేస్తాం. ఈ భావనే మా ప్రేరణగా ఉంటుంది. ఇది మాకు పని చేయడానికి ప్రేరణ ఇస్తుంది. అందుకే రాష్ట్రపతి గారి ప్రసంగానికి రానున్న రోజులలో ఒక గౌరవం ఇవ్వాలి. దానికి ఒక గాంభీర్యత ఇవ్వాలి. ఈ సభలో మనందరం కలిసి దాన్ని నెరవేర్చడానికి ప్రయత్నించాలి.

ఎన్నికలు జరిగినప్పుడు, ఎన్నికలు జరిగే వరకూ మనం అభ్యర్థులం. కానీ సభలోకి ప్రవేశించాక మనం ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులం. అప్పుడు మనం అభ్యర్థులైతే, ఇప్పుడు మనం ప్రజల ఆకాంక్షలను సంరక్షించే వాళ్ళం. కొంతమంది దూతలుగా ఆకాంక్షలను నెరవేర్చడం వారి బాధ్యత. లోపాలు ఉన్నట్లయితే కొంతమంది సంరక్షకుడిగా గళం ఎత్తాలి. ఇది గొప్ప బాధ్యత. మనమందరము కలిసి ఆ బాధ్యతను నెరవేరుస్తాం.

ఈ సభలో చాలా విషయాల్లో చిన్న చిన్న అసంతృప్తులు ఉండొచ్చు కానీ సంతోషించాల్సిన విషయం ఏమిటంటే ఇది పూర్తిగా సానుకూలమైన వాతావరణంలో జరిగింది.

ఇక్కడ కూడా కొన్ని విషయాలు లేవనెత్తారు. వాటిలో కూడా ఒక ఆశ ఉంది. దాని అర్థం దేశంలోని నూట పాతిక కోట్ల పౌరులు ఏవిధమైన ఆశతో ఇక్కడ సభ్యులను ఎన్నుకున్నారో, ఆ ప్రతిధ్వని ఇటు వైపు కూర్చుని ఉన్నా సరే, అటు వైపు కూర్చుని ఉన్నా సరే అందరి మాటలలో ప్రతిధ్వనించింది అని నేను నమ్ముతాను.

ఇది భారత దేశ భవిష్యత్తుకి శుభ సంకేతం. రాష్ట్రపతి గారి ప్రసంగం లో ఎన్నికలు, ఓటర్లు, ఫలితాలను ప్రశంసించారు. నేను కూడా దేశపౌరులను అభినందిస్తూ వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎన్నో సంవత్సరాల తర్వాత ఈ దేశంలో స్థిరమైన పాలన కోసం, అభివృద్ధి కోసం, సుపరిపాలన కోసం ఓటు వేసి, ఐదు సంవత్సరాల అభివృద్ధి యాత్రను వారు నిర్ధారించారు. భారత ఓటర్ల ఆలోచన ఆందోళనలు ఏవైతే ఉన్నాయో వాటిని మేము బాధ్యతగా తీసుకొని నెరవేర్చడానికి ప్రయత్నిస్తాము. ప్రపంచంలో భారతదేశం ఒక పెద్ద ప్రజాస్వామ్యం అని మన దేశం గురించి అప్పుడప్పుడు మాట్లాడుతూ ఉంటారు. కానీ కాలానుగుణంగా, ప్రపంచం ముందు మనం ఒక పెద్ద ప్రజాస్వామ్య శక్తి అనీ మన ప్రజాస్వామ్య సంప్రదాయాలు చాలా ఉన్నతమైనవి అనీ, సాధారణ నిరక్షరాస్య వ్యక్తుల నరాల్లో కూడా ప్రజాస్వామ్యం పట్ల అపారమైన శ్రద్ధ ఉందని మనం తెలియజెప్పాలి. మన ఆశలు, ఆకాంక్షలు, ప్రజాస్వామ్య సాంప్రదాయాల ద్వారా పరిపూర్ణం చేసుకోవడానికి ఎంత జాగరూకత తో ఉన్నామో తెలియజెప్పాలి. మన దేశ శక్తిని ప్రపంచం ముందు ఎప్పుడైనా, సరైన విధంగా చూపించామా? ఎన్నికల తర్వాత ఇది మనందరి సమిష్టి బాధ్యత. ప్రపంచానికి ఈ విషయాలు వివరిస్తాం. ప్రపంచాన్ని మనం ప్రభావితం చేస్తాం. మన దేశ ఎన్నికలలో, యూరప్, అమెరికాలో ఉన్న ఓటర్లను కలిపితే, అంతకన్నా ఎక్కువ మంది పాలుపంచుకుంటారు. ఇది చాలా పెద్ద శక్తి. ప్రపంచం ముందు భారత్ సమర్థవంతమైన రూపాన్ని మనం ఎప్పుడు వెల్లడించనున్నాము? ఇది మనందరి బాధ్యత అని నేను నమ్ముతున్నాను. కొంత స్తబ్దత

ఉండడం నిజం. పన్నెండు వందల సంవత్సరాల బానిసత్వపు మనస్తత్వం మనల్ని ఇబ్బంది పెడుతుంది. మనకంటే ఉన్నతమైన వ్యక్తులని కలిసినప్పుడు తల ఎత్తి మాట్లాడే శక్తి మనకు ఉండేది కాదు. అప్పుడప్పుడు చర్మం రంగు మన ఆలోచనలను ప్రభావితం చేస్తుంది. ఆ విషయాల నుంచి బయటికి వచ్చి భారత్ లాంటి సమర్థవంతమైన ప్రజాస్వామ్యం, ఈ ఎన్నికలలో చూపించిన రూపాన్ని ఇప్పుడు ప్రపంచం ముందు శక్తివంతమైన దేశంగా వెల్లడించాల్సిన సమయం వచ్చింది. ప్రపంచం ముందు మనం తల ఎత్తుకొని కళ్ళలోకి చూస్తూ, ఛాతి ఉప్పొంగే లా భారతదేశంలోని నూట పాతిక కోట్ల పౌరుల సామర్థ్యాన్ని వెల్లడించే శక్తి మనకి ఉండాలి. దానిని మనం ముందుకు తీసుకువెళ్లాలి. దీనివల్ల భారతదేశ గౌరవం, ప్రతిష్ఠ పెరగనుంది.

గౌరవనీయులైన మేడం స్పీకర్, ఈ దేశంలో మొదటి హక్కు ఎవరిది? ప్రభుత్వం ఎవరికోసం ఉండాలి? ప్రభుత్వం కేవలం చదువుకున్న వారికోసం ఉండాలా? ప్రభుత్వం కేవలం ఇలాంటి కొంత మందికి ప్రయోజనం కలిగించడానికి ఉండాలా? నా దృష్టిలో ప్రభుత్వం పేదల కోసం పని చేయాలి.

ధనవంతులు వారి పిల్లలకు చదువు చెప్పడానికి ప్రపంచంలో ఎక్కడి నుంచైనా అధ్యాపకుడిని తీసుకు రాగలరు. ధనవంతుల ఇంట్లో ఎవరికైనా జబ్బు చేస్తే, వారికి ఎంతో మంది డాక్టర్లు ఉన్నారు. కానీ పేదలు ఎక్కడికి వెళ్తారు? వారికి ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులే ఉంటాయి, కాబట్టి ప్రతి ప్రభుత్వ మొదటి బాధ్యత పేదల మాటలు వినడం, పేదల కోసం జీవించడం. మన ప్రభుత్వ కార్యకలాపాలు పేదల కోసం, వారి సంక్షేమం కోసం కాకపోతే ఈ దేశ ప్రజలు మిమ్మల్ని ఎప్పటికీ క్షమించరు.

స్పీకర్ మేడం, ఇది మా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత. పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శాల తో మేము పెరిగాము, వారు మాకు అంత్యోదయ గురించి నేర్పించారు. గాంధీ గారు, లోహియా గారు, దీన్దయాళ్ గారు - ఈ ముగ్గురి భావజాలాన్ని మేము అనుసరిస్తున్నాము. చివరి పంక్తిలో కూర్చుని ఉన్న వ్యక్తి సంక్షేమమే మాకు ముఖ్యం. మేము దీని పట్ల నిబద్ధతతో ఉన్నాము. అంత్యోదయ సంక్షేమం పట్ల మేము నిబద్ధతతో ఉన్నాము. పేద వారిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి వారిలో అలాంటి శక్తి తీసుకువచ్చి పేదరికానికి వ్యతిరేకంగా పోరాడేలా చెయ్యాలి. పేదరికానికి వ్యతిరేకంగా పోరాడడానికి కావలసిన పెద్ద ఆయుధం - విద్య. పేదరికంతో పోరాడడానికి మనకి అవసరమయ్యే గొప్ప సాధనం గుడ్డి విశ్వాసం నుంచి విముక్తి.

పేదవారి లో మూఢ నమ్మకాలు, అవిద్య ఉన్నట్లయితే మనం వారిని అందులోనుంచి బయటకు తీసుకు రావడంలో విజయం సాధిస్తే, ఈ దేశంలోని పేదవారు ఇతరుల దయాదాక్షిణ్యాలపై బతకడానికి ఇష్టపడరు. వారు వారి శక్తి సామర్థ్యాలతో వారి ప్రపంచాన్ని నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. గౌరవంగా బతకడం పేద వారి స్వభావం, మనం ఆ మౌలిక శక్తి ద్వారా వారికి బలాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. అందుకే ప్రభుత్వ పథకాలు పేదలను పేదరికం నుంచి బయట పడడానికి శక్తినిస్తాయి. పేదరికానికి వ్యతిరేకంగా పోరాడడానికి బలాన్నిస్తాయి. పరిపాలనలోని అన్ని వ్యవస్థలు పేదవారిని బలోపేతం చేయడానికి పని చేయాలి, వాటి అంతిమ ఫలితం ఆఖరి వరస లో కూర్చుని ఉన్న వ్యక్తికి ఉపయోగపడేలా ఆ దిశలో ప్రయత్నాలు చేయాలి. అప్పుడే వారికి సంక్షేమం అందించగలుగుతాం.

శతాబ్దాలుగా మన దేశం వ్యవసాయ ఆధారిత దేశం అని, గ్రామాల దేశం అని చెబుతూ వచ్చాము. ఇటువంటి నినాదం వినడానికి బాగుంటుంది, కానీ ఈరోజు మనం మన గుండెలపై

చేతులు వేసుకొని గ్రామాల్లోని జీవనవిధానాన్ని మార్చగలిగామా? మన రైతుల జీవితాన్ని మార్చగలిగామని చెప్పగలమా? నేను ఇక్కడ ఏ ప్రభుత్వాన్ని విమర్శించడానికి నిలబడలేదు. ఇది మన అందరి సమిష్టి బాధ్యత. మన దేశంలోని గ్రామాల్లో జీవన విధానాన్ని మార్చడానికి మనం అందరమూ ప్రాధాన్యం ఇవ్వాలి. రైతుల జీవితాన్ని మార్చడానికి కూడా మనం ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రపతి ప్రసంగంలో ఆ విషయాన్ని చెప్పడానికి ప్రయత్నం జరిగింది. ఎలా చేస్తామనే విషయం ఇక్కడ తెరపైకి వచ్చింది. మేము రర్బన్(RURBAN) అనే పదాన్ని ప్రయోగించాము. రాష్ట్రపతి గారి ప్రసంగంలో గ్రామాల అభివృద్ధి కోసం, పట్టణాలలో ఉన్న సదుపాయాలు ఉండాలి కానీ ఆత్మ గ్రామం లా ఉండాలి అని అన్నారు. గ్రామాల గుర్తింపు గ్రామాల ఆత్మలోనే ఉంది. ఈరోజు కూడా అక్కడ ఆత్మీయత ఉంది. గ్రామాల్లో పెళ్ళి ఊరేగింపు జరిగినప్పుడు మొత్తం గ్రామం, వారి గ్రామానికి చెందిన వారుగా భావిస్తారు. గ్రామానికి ఒక అతిధి వస్తే మొత్తం గ్రామానికి వచ్చినట్టుగా భావిస్తారు. మన దేశానికి చెందిన విలువైన వారసత్వం మనం కాపాడుకోవాలి. అలాగే మన గ్రామాల్లో నివసించే ప్రజలకు ఆధునిక సదుపాయాలు కూడా లభించాలి. నేను నా అనుభవంతో చెబుతున్నాను - గ్రామాలకు ఆధునిక సదుపాయాలు కల్పించడం మన అభివృద్ధిలో ఎక్కువ తోడ్పాటును అందజేస్తాయి.

గ్రామాలలో 24 గంటల విద్యుత్ ఉంటే, గ్రామానికి బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటి లభిస్తే, గ్రామాల్లో ఉండే పిల్లలకు ఉత్తమ విద్య లభిస్తే, ఒక్క క్షణం మన గ్రామాల్లో మంచి ఉపాధ్యాయులు లేరను కుందాం. కానీ మనకున్న విజ్ఞానం, దూర విద్యకు బలాన్ని ఇస్తుంది. పట్టణాలలో ఉన్న ఉత్తమమైన ఉపాధ్యాయుల ద్వారా గ్రామంలోని చివరి వరుసలో కూర్చుని ఉన్న స్కూలు పిల్లల్ని మనం చదివించ వచ్చు. మనం గ్రామాలలో ఈ విధమైన మార్పులు తీసుకు రాగలిగితే ఎవరు కూడా గ్రామాలు వదిలి వెళ్లడానికి ఇష్టపడరు. గ్రామాల్లోని యువత

కి ఏం కావాలి? మనం అక్కడ ఉపాధి కల్పిస్తే, వారు వారి తల్లిదండ్రుల దగ్గరే ఉండగలుగుతారు. గ్రామాల్లో పరిశ్రమలు నెలకొల్పాలి. కనీసం మనం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పడం వైపు దృష్టి సారించవచ్చు. మనం అదనపు విలువను జోడించి దానిని బలోపేతం చేస్తే, ఆ అదనపు విలువ కి ఒక శక్తి ఉంది. ఆ శక్తిని మనం స్వీకరిస్తే గ్రామాల్లోని ఆర్థిక జీవనాన్ని, వ్యవస్థలను మనం మార్చవచ్చు ఆ విధంగా రైతుల లాభం వాటితో ముడిపడి ఉంటుంది.

సిక్కిం, ఒక చిన్న రాష్ట్రం. అక్కడ చాలా తక్కువ జనాభా. కానీ ఆ చిన్న రాష్ట్రం ఒక ముఖ్యమైన పని చేసింది. సమీప భవిష్యత్తులో భారత దేశానికి కీర్తిని ఇవ్వడం. ఆ రాష్ట్రం సేంద్రియ రాష్ట్రం గా మారడంతో అక్కడి నుంచి వచ్చే ప్రతి ఉత్పత్తి సేంద్రియంగా ఉంటుంది. ఈ రోజు ప్రపంచంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు చాలా డిమాండ్ ఉంది. సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రపంచంలోని ఒక వర్గం, సేంద్రియ వస్తువులను కొనడానికి ఎంతైనా డబ్బు చెల్లించడానికి క్యూల్లో నిలుచుని ఉంది. ఇది విశ్వ మార్కెట్ పై ఆధిపత్యం పొందడానికి సిక్కిం రైతులు పడిన కష్టం. ఈ పథకాన్ని మనం ముందుకు తీసుకు వెళ్ళ గలిగితే సుదూర హిమాలయాల ఒడిలో ఉన్న సిక్కిం రాష్ట్రం ఎంత పెద్ద శక్తిగా అవతరించనుందో చూడండి. అందుకే మనం ఒక స్వప్నాన్ని చూడాలి. మొత్తం ఈశాన్య రాష్ట్రాలు సేంద్రియ రాష్ట్రాలుగా ఎదిగేలా చూడాలి. ఈశాన్య రాష్ట్రాలు సేంద్రియ రాష్ట్రాలుగా ఎదగ గలిగితే, భారత ప్రభుత్వం వారికి సహాయపడి ప్రపంచ మార్కెట్ పై ఆధిపత్యం చలాయించేలా చూడవచ్చు.

మన వద్ద ఎన్నో వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఎంతో పరిశోధన జరుగుతుంది. కానీ దౌర్భాగ్యం ఏమిటంటే ప్రయోగశాలలో ఉన్నది నేలపై లేదు. ప్రయోగశాల నుంచి నేల వరకు జరగాల్సిన పయనం పై మనం దృష్టి సారించాలి. ఈ రోజు మనం

సాంప్రదాయ వ్యవసాయం నుంచి బయటికి వచ్చి ఆధునిక వ్యవసాయం వైపు మళ్లాల్సిన అవసరం ఉంది.

గుజరాత్ లో సాయిల్ హెల్త్ కార్డ్ అను ఒక చిన్న ప్రయోగం చేశాం. మనదేశంలో మనుషులకు ఇంకా హెల్త్ కార్డులు లేవు. వాటి వలన తెలిసిందేమిటంటే వారి నేల ఏ పంట కైతే అనుకూలము కాదో, అక్కడ ఆ పంటకి ఖర్చు చేస్తూ ఉండేవారు. ఎక్కడ ఎరువులు అవసరం లేదో, అక్కడ వాళ్ళు వాటిని వాడేవారు. ఏ మందుల అవసరం అస్సలు లేదో, ఆ మందులు వాడడం జరిగింది. అనవసరంగా సంవత్సరానికి 50 వేల రూపాయల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు చేసేవారు. కానీ సాయిల్ హెల్త్ కార్డ్ వచ్చాక వారికి వ్యవసాయం ఎలా చేయాలో అర్థమైంది. మనం మన దేశంలో ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డ్ ఇచ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయలేమా? మనం దీన్ని చెయ్యగలం. కొంత మంది దీన్నిఎలా చేయగలం అని అడగడం వలన ఇదంతా వివరించాల్సి వస్తుంది.

మన వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో గ్రామాలకు వెళ్తారు. భారతదేశంలో టెన్ ప్లస్ టు పాఠశాలలు, ప్రయోగశాలలు ఎక్కడెక్కడ ఉంటాయో అక్కడ సెలవుల సందర్భంగా ఆ ప్రయోగశాలలని మట్టిని పరీక్షించే ప్రయోగశాలలుగా మార్చి వేయవచ్చు. వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎవరైతే సెలవులకి వారి గ్రామాల కి వెళ్తారో, వారు స్కూల్లో పనిచేసి వారి సెలవు కాలంలోనే నేలని పరీక్షించే పని ప్రయోగశాలలో చేయవచ్చు. ఆ స్కూలుకి ఆదాయం కూడా లభిస్తుంది, దాని నుండి మంచి ప్రయోగశాలగా ఎదగాలనే కోరికా కలుగుతుంది. ఒక ప్రజా ఉద్యమం లాగా దీన్ని మనం మార్చవచ్చు. దీని అర్థం ఏమిటంటే చిన్న చిన్న ప్రయోగాలు, పరిష్కారాలు చేయడం ద్వారా మనం మార్పు తీసుకురావచ్చు.

ఈరోజు మన రైల్వే లో ఉన్న అలవాటు ఏంటి? వారు మూస పద్ధతిలో పనిచేస్తున్నారు. వారిని సోమవారం వచ్చిన సరుకుల్ని ఒక వారం లోపు పంపించాల్సిందిగా నిర్దేశించడం జరిగింది. స్టేషన్ కి సోమవారం మార్బుల్ రాయి వచ్చి, ఆ తర్వాత మంగళవారం టమాటాలు వచ్చినట్లయితే, వారు ముందు మార్బుల్ ని పంపి తర్వాత టమాటాల ని పంపుతున్నారు. ఎందుకు? మార్బుల్ నాలుగు రోజులు ఆలస్యంగా వెళ్ళినా ఏమీ కాదు. కానీ టమాటాలు ముందు వెళ్లగలిగితే అవి పాడైపోకుండా ఉంటాయి. మనం మన వ్యవస్థలని ఈ దిశగా జాగృతం చెయ్యాలి.

మన దేశం దురదృష్టం ఏమిటంటే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లో మంచి పేరు ఉంది. సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు గా మనకి మంచి గుర్తింపు ఉంది. కానీ మన దేశం వద్ద ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల రియల్ టైం డేటా మన వద్ద లేదు. మనం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నెట్వర్క్ ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల రియల్ డేటాను సేకరించగలమా? మేము ద్రవ్యోల్బణాన్ని తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేశాం, ఆ దిశగా నాణ్యమయిన ప్రయత్నాలు చేస్తున్నాం. ఎందుకంటే ఇది కేవలం ఎన్నికల వాగ్దానం అని కాదు, ఇది ఎందుకు అంటే, పేద వారి ఇంట్లో రాత్రి తిండి ఉండాలనే ఆలోచనతో. పేదవారి పిల్లలు కన్నీళ్లు తాగి పడుకోకూడదు, ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ఇది మనందరి కర్తవ్యం. రాష్ట్ర ప్రభుత్వాలు కానివ్వండి లేదా కేంద్ర ప్రభుత్వం కానివ్వండి. అధికారంలో ఉన్నవారు కానివ్వండి, ప్రతిపక్షంలో ఉన్నవారు కానివ్వండి, భారతదేశంలో ఎవరూ ఆకలితో ఉండకుండ చూడడం మన అందరి సమిష్టి బాధ్యత.

ఆ కర్తవ్యాన్ని పూర్తి చేయడానికి మనం ఈ పని చేయాలి. మన వద్ద రియల్ టైం డేటా ఉన్నట్లయితే దేశంలో ఉన్న ఆహార నిల్వలను తెలుసుకోవచ్చు. మన వద్ద ఆహార నిల్వలు ఉన్నాయి కానీ వ్యవస్థల లోపం ఉంది. ప్రభుత్వం వద్ద ఈ సమాచారం ఉన్నట్లయితే రైల్వేలలో ఎప్పుడైతే తక్కువ పని ఉంటుందో ఆ సమయంలో ఆహార నిల్వ రవాణా చేయవచ్చు. అలాగే

గోదాములు నిర్మించాల్సి వస్తే అక్కడ వీటిని నిల్వ చేయవచ్చు. ఆ విధంగా మనం ఈ సమస్యకి పరిష్కారం కనుగొనవచ్చు. భారత ఆహార సంస్థ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తుంది. మనం దానిని ఆధునీకరించ లేమా? సేకరించే పని ఒకరు చేయాలి, సంరక్షించే పని మరొకరు చెయ్యాలి. పంపిణీ చేసే పని వేరుగా చేయాలి. ఒకే వ్యవస్థని మూడు భాగాలుగా విభజించి, ఆ మూడు విభాగాలకు బాధ్యతలు ఇచ్చినట్లయితే, ఈ పరిస్థితులని మార్చవచ్చని నేను గట్టిగా చెప్పగలను.

వ్యవసాయ రంగంలో మన వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, మన రైతులు, కాలానుగుణంగా ఒక విషయంపై దృష్టి సారించాలి. నేను ఆధునిక వ్యవసాయం గురించి మాట్లాడాను. మనం ఎంత త్వరగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలోకి తీసుకు వస్తామో, మనకి అంతే లాభం జరుగుతుంది. ఎందుకంటే కుటుంబాలు విస్తరిస్తున్నాయి, భూమి తగ్గిపోతుంది. మనం భూమి ఉత్పాదకత పెంచాలి. అందుకోసం మన విశ్వవిద్యాలయాల్లో పరిశోధన పని పెరగాలి. చాలా సంవత్సరాలుగా పప్పు దినుసుల పై ఏ విధమైనా పరిశోధన జరగలేదు. పప్పుధాన్యాల లభ్యత మన ముందు ఒక పెద్ద సవాలుగా ఉంది. ఈ రోజు ఒక పేద వ్యక్తి ప్రోటీన్ పొందడానికి పప్పుధాన్యాల పైనే ఆధారపడుతున్నాడు,పప్పు ధాన్యాల ద్వారా ప్రోటీన్ లభిస్తుంది, శరీరానికి ప్రొటీన్ల అవసరం చాలా ముఖ్యం. మనం పోషకాహార లోపానికి వ్యతిరేకంగా పోరాడాలంటే ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. పప్పుధాన్యాల లో చాలా సంవత్సరాలుగా ఉత్పాదకత పెంచలేక పోయాం. అలాగే పప్పుధాన్యాల లో ప్రొటీన్ శాతాన్ని పెంచలేక పోయాం. మనం చెరుకులో చక్కెర శాతాన్ని పెంచగలిగాం. కానీ పప్పు ధాన్యాల్లో ప్రొటీన్ శాతాన్ని పెంచడం లో విజయం సాధించలేకపోయాము. ఇది ఒక పెద్ద సవాలు. మన శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఈ దిశగా ప్రేరణ పొందుతూ ఈ సమస్యలకు పరిష్కారం కనుగొనవచ్చు. దీనికి మార్గం ఉంది.

మన తల్లులు, సోదరీమణులు జనాభాలో 50 శాతం ఉన్నారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో నిర్ణయం తీసుకోవడంలో వారిని భాగస్వామ్యులు చేయవలసిన అవసరం ఉంది. వారిని ఆర్థిక ప్రగతి తో జోడించాలి. అభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహించాలి. మన దేశంలోని 50 శాతం స్త్రీ శక్తి ని చురుకైన భాగస్వామిగా చేయడానికి మనం నిర్ణయించుకోవాలి. వారి గౌరవం, భద్రత గురించి మనం ఆలోచించాలి.

ఈ మధ్య కొన్ని సంఘటనలు జరిగాయి. మనం అధికారంలో ఉన్నా లేకపోయినా అవి బాధ కలిగించే సంఘటనలు.అది పూనాలో జరిగిన హత్య కావచ్చు, లేదా ఉత్తరప్రదేశ్ లో జరిగిన హత్య కావచ్చు లేదా మనాలిలో మునిగిపోయిన యువకులు కావచ్చు, లేదా మన ఆడబిడ్డల పట్ల జరిగిన అత్యాచారాలు కావచ్చు, ఈ ఘటనలన్నీ మనందరినీ ఆత్మ పరిశీలన చేసుకునేలా ప్రేరేపిస్తాయి. ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోవాలి. దేశం దీర్ఘకాలంగా వేచి చూడదు. బాధితులు కూడా ఎక్కువసేపు వేచి ఉండరు, మన ఆత్మ మనల్ని క్షమించదు. అందుకే నేను రాజకీయ నాయకులు అందరికీ మనవి చేస్తున్నాను. మన దేశంలో ఉన్న రాజకీయ నేతలందరినీ నేను చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను. అత్యాచార ఘటనల పై మానసిక విశ్లేషణలు చెయ్యడం మానేయండి. అది మనకి సరిపడదు. మన తల్లులు, సోదరీమణుల గౌరవంతో మనం ఆడుకోకూడదు. మనం రాజకీయంగా ఈ విధమైన ప్రకటనలు చేయడం మంచిది కాదు. మనం మౌనంగా ఉండలేమా? అందుకే మహిళల గౌరవం, మహిళల భద్రత, 125 కోట్ల దేశపౌరుల ప్రాధాన్యం అయి ఉండాలి.

ఈ దేశంలో 65 శాతం జనాభా 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన వారు. ఇది మన అదృష్టం. మనం ఈ యుగ చక్రంలో ఈరోజు జీవించి ఉన్నాము. ఈ యుగ చక్రం లో మనం పార్లమెంట్ లో కూర్చుని ఉన్నాము. ఈ సమయంలో భారతదేశం ప్రపంచంలోనే అందరికంటే యువ దేశంగా ఉంది. జనాభా శక్తిని మనం గుర్తించాలి. రాబోయే రోజుల్లో

ప్రపంచానికి శ్రామిక శక్తి, నైపుణ్య శ్రామిక శక్తి అవసరం చాలా కలగనుంది. మన పొరుగు లోని చైనా దేశం వృద్ధాప్యం వైపు వెళ్తుంటే మనం యవ్వనం వైపు వెళ్తున్నాం. ఇది మనకి కలిసొచ్చే అంశం. అందుకే ప్రపంచంలోని సంపన్న దేశాలు కూడా నైపుణ్య అభివృద్ధి అనే ఎజెండాతోనే ముందుకు వెళ్తున్నాయి. మన దేశ ప్రాధాన్యం కూడా నైపుణ్యాభివృద్ధి అయి ఉండాలి. దానితో పాటు, మనం విజయం సాధించాలంటే 'శ్రమేవ జయతే' అనే మంత్రాన్ని జపించాలి. దేశ నిర్మాణంలో కార్మికులు ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. వారు విశ్వకర్మతో సమానం. వారిని మనం ఏ విధంగా సన్మానించాలి!

సోదర సోదరీమణులారా, ప్రపంచం భారతదేశం గురించి ఒక అభిప్రాయంతో ఉంది. మన దేశాన్ని స్కామ్ ఇండియా గా గుర్తిస్తారు. ఇప్పుడు మన దేశ గుర్తింపు నైపుణ్యం కలిగిన భారత్ గా మార్చాలి. ఆ కలని మనం నిజం చేయగలం. అందుకే తొలిసారిగా దీనికోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశాం – వ్యవస్థాపకత, నైపుణ్య అభివృద్ధి శాఖ. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నాము.

మనదేశంలో ఒక దురదృష్టం ఏంటంటే ఎవరినైనా ఏమి చదువుకున్నావు అని అడిగితే, నేను గ్రాడ్యుయేట్ అని, డబల్ గ్రాడ్యుయేట్ ని అని చెబుతారు. వినడానికి అది బాగానే ఉంటుంది. నేను నా చిన్నప్పుడు దాదా ధర్మాధికారి గారు రాసిన ఒక పుస్తకం చదివాను. మహాత్మా గాంధీ ఆలోచనల ను ఆయన అనుసరించేవారు. వినోబా గారితో ఎక్కువగా ఉండేవారు. దాదా ధర్మాధికారి గారు ఒక అనుభవాన్ని రాస్తూ, ఒకసారి ఒక యువకుడు వారి వద్ద కి ఉద్యోగం కోసం వచ్చాడు. అప్పుడు ఆయన నువ్వు ఏం చేస్తావు? ఏం చదివావ్? అని అడిగారు. అతను నేను గ్రాడ్యుయేట్ ని, నాకు ఉద్యోగం కావాలి అని చెప్పాడు. దాదా ధర్మాధికారి గారు అతనిని నువ్వు ఏం చేయగలవు అని అడిగారు. దానికి అతను నేను గ్రాడ్యుయేట్ ని అని సమాధానమిచ్చాడు. దానికి అతను నువ్వు గ్రాడ్యుయేటు సరే కానీ నీకు

ఏం పని వచ్చు అని అడిగారు. దానికి మళ్లీ ఆ యువకుడు నేను గ్రాడ్యుయేట్ ని అని అన్నాడు. నేను నాలుగు సార్లు అడిగాను నువ్వు ఏం చేయగలవు అని. తను నేను గ్రాడ్యుయేట్ అనే సమాధానం ఇచ్చాడు. దీని నుండి మనం అర్థం చేసుకోవచ్చు. జీవితాన్ని జీవించడానికి మన చేతిలో నైపుణ్యం ఉండాలి, చేతిలో సర్టిఫికెట్ ఉన్నంత మాత్రాన పని జరగదు. అందుకే మనం నైపుణ్య అభివృద్ధి పై దృష్టిసారించాలి. నైపుణ్యం కలిగిన కార్మికులు ఎవరైనా సరే, వారికి ఒక సామాజిక స్థాయిని మన సృష్టించాలి. ఏడవ తరగతి వరకు చదువుకున్న పిల్లవాడు పేదరికం వల్ల చదువు ఆపేస్తాడు. ఎక్కడికైనా వెళ్లి నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకునే కోర్సు దొరికితే చేస్తాడు. కానీ ప్రజలు దానికి అంత ప్రాముఖ్యం ఇవ్వరు. వారు ఏడవ తరగతి చదువుకున్నావ్, వెళ్ళిపో అని అంటారు. అందుకే మనం దానికి సమానమైన వ్యవస్థని నిర్మించాలి. నేను గుజరాత్ లో ఈ ప్రయోగం చేశాను. ఎవరైతే రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సు చేసేవారో నేను వారికి పదో తరగతి కి సమానంగా చేసాము. ఎవరైతే పదో తరగతి తర్వాత వచ్చారో వారిని పన్నెండవ క్లాస్ కి సమానంగా చేశాము. వారు డిప్లమో లేదా పై చదువులు చదవాలి అనుకుంటే మార్గాలు తెరిచి ఉంచాము. డిగ్రీ చదవాలనుకుంటే కూడా వారికి దారి ఉంది. ఏడవ తరగతి పాస్ అయినా, డిగ్రీ వరకు చదువుకోవచ్చు. చాలా ధైర్యంగా కొత్త నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. మనం నైపుణ్యాభివృద్ధిని పటిష్టం చేయాలంటే, దానికి సామాజిక గౌరవాన్ని జోడించాలి.

నేను చెప్పినట్టుగా ప్రపంచంలో శ్రమశక్తి అవసరం ఉంది. ప్రపంచంలో ఉపాధ్యాయుల అవసరం కూడా ఉంది. భారతదేశం ఉపాధ్యాయులను ప్రపంచమంతా పంపలేదా? గణితం, సైన్స్ టీచర్లను మనం ప్రపంచానికి అందించలేమా? ఒక వ్యాపారి విదేశాలకు వెళ్ళినప్పుడు ఎక్కువ డాలర్లు తీసుకువస్తాడు. ఒక టీచర్ విదేశాలకు వెళ్తే వారు ఒక తరాన్ని తన తో తీసుకువస్తాడు. ఈ శక్తి మన వద్ద ఉండాలి. ప్రపంచంలో మన సామర్థ్యాన్ని

నిరూపించుకోవడానికి ఈ అవకాశాలు ఉన్నాయి. మనం మన దేశంలోని యువకులను ఈ విధంగా తయారు చేయలేమా? ఇలాంటి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఈ అవకాశాలను తీసుకుని మనం ముందుకు వెళ్లే నిర్ణయం తీసుకుంటే, మనకి మంచి ఫలితాలు లభిస్తాయి అన్న నమ్మకం నాకు ఉంది.

మన దళిత, గిరిజన సోదరీ సోదరీమణుల జీవితాలలో స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా మార్పు తీసుకు రాగలిగామని నమ్మకం గా మనం చెప్పగలమా? వారి కోసం నిధులు ఖర్చు చేయలేదని కాదు. కానీ ఏ ప్రభుత్వం కూడా వారి పట్ల సీరియస్ గా ఆలోచించలేదు. నేను ఎవరి మీద ఆరోపణలు చేయడం లేదు. కానీ వాస్తవమేమిటంటే, పరిస్థితుల్లో మార్పు రాలేదు. మనం పాత పద్ధతుల నుంచి బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నామా? మనం ప్రభుత్వ కార్యక్రమాలలో మార్పులు తీసుకువచ్చి కనీసం వీరిని బయటకు తీసుకు రాలేమా? వారి జీవితాలను ఎందుకు మార్చలేము? ముస్లిం సోదరులను చూసినట్లయితే, నా చిన్నప్పుడు ఎవరైతే సైకిల్ మరమ్మతు చేసేవారో ఈ రోజు వారి మూడవ తరం కూడా ఆ పనే చేస్తుంది. ఎందుకు ఈ విధమైన పరిస్థితి ఉంది? వారి జీవితాలు ఎందుకు మారలేదు? అలాంటి మార్పు తీసుకురావడానికి మనం దృష్టి పెట్టలేదు. ఆ విధమైన కార్యక్రమాలను, ఆకట్టుకునే కార్యక్రమాలుగా చూడను. వాటిని వారి జీవితంలో మార్పు తీసుకువచ్చే పథకాలు గా మాత్రమే చూస్తాను. శరీరంలో ఒక్క అవయవానికి లోపం ఉంటే, శరీరం ఆరోగ్యంగా లేనట్టు. శరీరంలోని అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ శరీరాన్ని బలమైన శరీరం గా పరిగణిస్తాము. అందుకే సమాజంలోని ఏ ఒక్క భాగము బలహీనంగా ఉన్నా, సమాజం బలంగా తయారవ్వదు. అందుకే సమాజంలోని అన్ని భాగాలు బలంగా ఉండాలి. ఆ స్ఫూర్తితోనే మనం ప్రేరణ పొంది పనిచేయాల్సిన అవసరం ఉంది, మేము దానికి కట్టుబడి ఉన్నాము. మేము ఆ పని చేయాలనుకుంటున్నాం. మన దేశ అభివృద్ధికి

కొత్త నిర్వచనం వైపు వెళ్లే అవసరం ఉందని నాకు అనిపిస్తుంది. పన్నెండు వందల సంవత్సరాల స్వాతంత్ర్య పోరాటంలో, స్వాతంత్ర్య సమరయోధుడు చనిపోని సంవత్సరం ఒక్కటి కూడా ఉండదు. 1857 తర్వాత జరిగిన స్వాతంత్ర సంగ్రామ చరిత్ర మన ముందు ఉంది. అమర వీరులు గా చావడానికి సిద్ధంగా లేని వ్యక్తి ఉన్న భూభాగం మొత్తం భారతదేశంలో ఎక్కడ ఉండి ఉండదు. ఆ పోరాటం అలాగే కొనసాగుతూ ఉంది. ఉరికంబం ఎక్కి, దేశం కోసం త్యాగం చేసిన వ్యక్తులు ఎక్కడా ఆగలేదు.

సోదర సోదరీమణులారా! మీలో చాలామంది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టి ఉంటారు. కొంత మంది మహానుభావులు స్వాతంత్ర్యం రాకముందు జన్మించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పోరాడి ఉండి ఉండవచ్చు. నేను స్వాతంత్ర్యం తరువాత జన్మించాను. నా మనసులో ఒక ఆలోచన వస్తుంది, నాకు దేశం కోసం మరణించే అవకాశం లభించలేదు కానీ దేశం కోసం జీవించే అవకాశం లభించింది. ఈ విషయాన్ని ప్రజలకు మనం దేశం కోసం జీవించమని ఎలా చేరవేయాలి? 2022 నాటికి స్వాతంత్ర్యం లభించి 75 సంవత్సరాలు పూర్తవుతాయి. దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహాపురుషులను స్మరించుకుంటూ మనం ఒక పని చేయవచ్చు. ఇంకా ఎన్నో పనులు చెయ్యాలి, కానీ ఒక పనిని మాత్రం మనం ప్రముఖంగా చేద్దాం. భారతదేశంలో ఉండడానికి ఇల్లు లేని కుటుంబము లేకుండా చేద్దాం. ఎలాంటి ఇల్లు అంటే ఇంట్లో కొళాయి ఉండాలి, నీరు ఉండాలి,విద్యుత్ ఉండాలి, మరుగుదొడ్డి ఉండాలి. ఇది మనం చేయాల్సిన కనీస పని. ఒక ఉద్యమంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం, అలాగే ఈ సభలోని సభ్యులందరూ కలిసి ఒక ఎనిమిది తొమ్మిది సంవత్సరాల కార్యక్రమాన్ని తయారుచేసి నిధులు ఖర్చు చేసి, స్వాతంత్ర్యం లభించిన 75 సంవత్సరాల పండగ మనం చేసుకుంటున్నప్పుడు భగత్ సింగ్, రాజ్గురు, మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ మహాపురుషులను స్మరించుకుంటూ ఇల్లు లేని వారందరికీ ఇల్లు ఇచ్చి, ఈ విధంగా మనం

ఈ సంకల్పాన్ని పూర్తి చేసి ముందుకు వెళ్ళినట్లయితే మన దేశం కన్న కలలు నిజం చేయగలుగుతాం.

నాకు తెలుసు, అధికారంలోకి వచ్చిన తర్వాత మనం ప్రామాణికమైన కార్యక్రమాన్ని చేతిలో తీసుకోవడం కష్టం అని. గౌరవనీయులైన ములాయం సింగ్ గారు ప్రభుత్వాన్ని నడిపారని చెప్పారు. అందుకే నేను అడుగుతున్నాను ఎలా చేద్దాం? ఇది ఎలా అవుతుంది అని. వారి సహృదయతకి వారికి నా ధన్యవాదాలు. వారు వారి ఆలోచనల్ని వ్యక్తపరిచారు కానీ మనం కలిసి కూర్చుని పరిష్కారాలు కనుక్కుందాం. మనం కలలు కన్నాం. కాబట్టి వాటిని నిజం చేయడానికి ప్రయత్నించాలి. కొన్ని కష్టాలు రావచ్చు, మీలాంటి అనుభవజ్ఞులు మాకు మార్గదర్శనం చేస్తారు. పేద వారి కోసం పనిచేయడానికి, మనం ముందుకు సాగాలి.

ఇక్కడ కొంతమంది, కొత్త సీసాలో పాత మద్యం అని చెప్పారు. వారికి మద్యం గుర్తుకు రావడం చాలా సహజం. వారు ఇంకా ఏమన్నారంటే ఇవన్నీ మా విషయాలు,మీరు వాటిని కొంచెం అటూ ఇటూ చేసి కొత్త విషయం గా చూపిస్తున్నారు, ఇందులో కొత్త ఏమీ లేదు. దీని అర్థం ఏమిటో నేను చెబుతున్నాను. అది మీకు తెలుసు. నిన్నటి నుంచి మహాభారతం గురించి చర్చ జరుగుతుంది. ఈ సందర్భంగా దుర్యోధనుని ఈ విధంగా అడిగారు.ఏది ధర్మం, ఏది అధర్మం. ఏది సత్యం, ఏది అసత్యం నీకు తెలుసు కదా? దానికి దుర్యోధనుడు జూనామి ధర్మం నా చా మే ప్రవృత్తిः నాకు ధర్మం ఏంటో తెలుసు. కానీ ఇది నా ప్రవృత్తి కాదు. సత్యం ఏంటో నాకు తెలుసు, మంచి ఏంటో నాకు తెలుసు కానీ అది నా DNA లో లేదు. అందుకే మీకు అన్నీ ముందే తెలుసు. మీరు ఆలోచించేవారు. దీని పట్ల నాకు అభ్యంతరం లేదు. కానీ, దుర్యోధనుడికి కూడా తెలుసు అందుకే మహాభారతం గురించి చర్చ జరిగినప్పుడు, ఆ మహా భారతం చాలా సంవత్సరాలుగా మా చెవుల్లో మారుమోగుతూ ఉంది. అది వింటూ వచ్చాం. కానీ మహాభారత యుగం సమాప్తం అయిపోయింది. పాండవులు లేరు, కౌరవులు లేరు. కానీ

ప్రజల మనసులో ఈరోజు కూడా పాండవులు విజయం సాధించారు. ఈ భావం ఎప్పటికీ ఉంటుంది. పాండవులు ఓడిపోయినట్టు, ఈ విధమైన భావం ప్రజలకి ఎప్పటికీ కలగదు.

సోదరి సోదరీమణులారా, విజయం మనకు ఎంతో నేర్పుతుంది. మనం నేర్చుకోవాలి కూడా. విజయం మనకి వినయం నేర్పుతుంది. ఈ సభకి నేను భరోసా ఇస్తున్నాను. ఇక్కడ ఉన్న సీనియర్ సభ్యులు, వారు ఏ పార్టీకి చెందిన వారైనా సరే, వారి ఆశీర్వాదంతో మేము అహంకారం నుంచి మమ్మల్ని రక్షించే శక్తిని పొందుతాం. మాకు ప్రతిక్షణం వినయాన్ని నేర్పించాలి. ఇక్కడ మా సంఖ్య ఎంత ఉన్నా సరే, మేము మీరు లేకుండా ముందుకు వెళ్లము. మేము సంఖ్యా బలంతో ముందుకు వెళ్లము, మేము సామూహిక బలంతో వెళ్లాలనుకుంటున్నాము. అందుకే ఈ సమిష్టి భావాన్ని తీసుకుని ముందుకు సాగాలి.

ఈరోజుల్లో నమూనాల ని చర్చిస్తున్నాం. ఎవరైతే నా ప్రసంగాన్ని విన్నారో, వారికి గుజరాత్ మోడల్ ఏంటో నేను చెప్తాను. గుజరాత్ లో ఒక్క జిల్లాకి నప్పే నమూనా మరొక జిల్లాకి నప్పదు. ఎందుకంటే దేశంలో వైవిధ్యం నిండి ఉంది. గుజరాత్ లో కచ్ ఎడారి లో పనిచేసే నమూనా, వల్సాడ్ లాంటి సస్యశ్యామలమైన జిల్లా లో పని చేయదు. ఈ విధమైన అవగాహన ఉండడం వల్లనే గుజరాత్ ముందుకు సాగింది. ఇదే ఆ నమూనా. గుజరాత్ మరో నమూనా, భారతదేశంలో ఎక్కడ మంచి ఉన్నా, ఆ మంచిని నేర్చుకుంటాము. ఆ మంచి మాటలు మేము స్వీకరిస్తాము. రానున్న రోజుల్లో కూడా ఆ నమూనా ని తీసుకుని మనం ముందుకు వెళ్తాము. భారత దేశంలో ఏ మూల ఏ మంచి ఉన్నా అది మన అందరిదీ. ఆ మంచిని వేరే చోట్ల కూడా అమలు చేయడానికి ప్రయత్నిస్తాము.

నిన్న తమిళనాడు తరఫున మాట్లాడుతూ, తమిళనాడు నమూనా గుజరాత్ నమూనా కంటే మంచిదని అన్నారు. నేను ఈ విషయాన్ని స్వాగతిస్తాను. మనదేశంలో నమూనాల

మధ్య పోటీ ప్రారంభం అవ్వడం సంతోషించాల్సిన విషయం. ఒక రాష్ట్రం ఇంకో రాష్ట్రం తో మేము మీకంటే ముందు ఉన్నామని అంటుంది. గుజరాత్ నమూనా ఈ దిశగా మంచి తోడ్పాటు అందించింది. ఇంతకుముందు మనం పోటీ పడే వాళ్ళం కాదు. ఇప్పుడు పోటీ పడుతున్నాము. రానున్న రోజుల్లో రాష్ట్రాల మధ్య అభివృద్ధి చెందడం లో పోటీ ఉండాలి.

రాష్ట్రం, కేంద్రాల మధ్య కూడా అభివృద్ధి పట్ల పోటీ ఉండాలి. ప్రతి ఒక్కరూ గుజరాత్ వెనకబడి పోయింది, మేము ముందుకు వెళ్ళిపోయాము అని అనాలి. ఇది వినడానికి నా చెవులు ఆరాట పడుతున్నాయి. దేశంలో ఇలా జరిగితేనే మార్పు వస్తుంది. చిన్న చిన్న రాష్ట్రాలు కూడా మంచి పనులు చేస్తున్నాయి. నేను చెప్పినట్టు సిక్కిం రాష్ట్రం సేంద్రియ రాష్ట్రంగా అవతరించింది. తమిళనాడులో కూడా పట్టణ ప్రాంతాలలో రైన్ హార్వెస్టింగ్ పని జరుగుతుంది. ఇవన్నీ కూడా మనం నేర్చుకోవాలి. మావోయిస్టుల దురాగతాల మధ్య నివసిస్తున్న చత్తీస్ ఘఢ్, పిడిఎస్ వ్యవస్థని కొత్తగా తీసుకు వచ్చింది, పేద వ్యక్తి కడుపు నింపడానికి కొత్త పథకాన్ని తీసుకు వచ్చింది.

మన సోదరి మమతా గారు పశ్చిమ బెంగాల్ ని 35 సంవత్సరాల చెడు నుండి బయటకు తీసుకురావడానికి చాలా కష్టపడుతున్నారు. వారి ఈ ప్రయత్నాలను నేను గౌరవిస్తాను. అందుకే ప్రతి రాష్ట్రంలో, అది కేరళ కానివ్వండి. ఈ విషయం ఆనందాన్ని కలిగిస్తుంది. నేను కేరళలోని ఒక అధికారిని పిలిపించాను. వారు చాలా జూనియర్ అధికారి, అక్కడ వామపక్ష ప్రభుత్వం ఉంది. అతని వయసు కూడా తక్కువే. నేను ఒక ధ్యాన శిబిరాన్ని నిర్వహించి అందులో నేను, మా మంత్రివర్గం అంతా విద్యార్థులుగా కూర్చున్నాము. నేను అతని నుండి “కుటుంబ శ్రీ” పథకం గురించి తెలుసుకున్నాను. ఆయన మాకు రెండు గంటలు నేర్పించాడు.

అలాగే నేను నాగాలాండ్ ప్రధాన కార్యదర్శి ని పిలిచి నాకు కొన్ని విషయాలు నేర్పించమని కోరాను. నాగాలాండ్ లో గిరిజనుల కోసం చాలామంచి ప్రణాళిక రూపొందించబడింది. ఇది మన దేశానికి ఒక నమూనాగా ఉండాలి. భారతదేశంలోని ఏ మూల నుంచి అయినా ఆలోచనా స్రవంతిలోని మంచిని ప్రభుత్వం గౌరవించాలి. మంచిని స్వీకరించాలి.

ఈ నమూనా మన దేశానికి పనిచేస్తుంది. మేము ఒక పెద్ద అన్నయ్య లాగా ప్రవర్తించి నువ్వు రెండు మూడు ముక్కలు తీసుకుపో అని చెప్పదలుచుకోలేదు. మనమందరము కలిసి దేశాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలి. అందుకే నేను సహకార సమాఖ్య వ్యవస్థ గురించి మాట్లాడాను. సహకారాన్ని సంఘటిత రూపంలో తీసుకువెళ్లే మాట మనం మాట్లాడదాం. అందుకే ఆ విధమైన కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి మనం ప్రయత్నాలు చేయాలి. ఆ విధంగా మనం ముందుకు వెళ్తామని నేను నమ్ముతున్నాను.

గౌరవనీయులైన మేడం స్పీకర్, ఇక్కడ ఏదయితే ప్రతిపాదించబడిందో, అందుకు నేను సీనియర్ నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈరోజు ఒక ఫలవంతమైన చర్చ జరిగిందని, సమర్థించే విధంగా చర్చ జరిగిందని నేను నమ్ముతున్నాను. ఒకవేళ విమర్శలు చేసినా, అది కూడా ఒక అపేక్షతో చేశారని నమ్ముతున్నాను. ఇలాంటి వాటిని నేను ఆరోగ్యకరంగా భావిస్తూ స్వాగతిస్తాను. ఈరోజు ఏ పార్టీ నుంచైనా మంచి సలహాలు దొరికినట్లు అయితే వాటిని విమర్శగా నేను తీసుకోను. వాటిని నాకు మార్గదర్శకత్వంగా భావిస్తాను. వాటిని మేము ఉపయోగిస్తాం, మంచి కోసం ఉపయోగిస్తాము, ప్రజాస్వామ్యంలో విమర్శలు మంచికోసమే జరుగుతాయి. జరగాలి కూడా. కేవలం ఆరోపణలు చేయడం మంచిది కాదు. విమర్శ ఎప్పుడూ చెడ్డది కాదు. విమర్శ బలాన్నిస్తుంది. విమర్శ - ప్రజాస్వామ్యం లో శక్తివంతమైన ఔషధం.

అలాంటి విమర్శలకి మేము ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాము. మీరు విధానాలని అధ్యయనం చేసి, లోతుగా ఆలోచించి, ఆ తర్వాత మీ ఆలోచనలకి సానబెట్టి, రానున్న రోజుల్లో దేశం కోసం పని చేస్తారని నేను భావిస్తున్నాను. ఇలాంటి భావాన్ని మనం ముందుకు తీసుకువెళ్లాలి.

ఈరోజు ఈ కొత్త సభలో నా అభిప్రాయాలు వెల్లడించే అవకాశం లభించింది. గౌరవనీయులైన స్పీకర్ మేడం, ఎక్కడైనా ఒక పదం అటు ఇటు అయి ఉంటే లేదా నియమాలను నేను అతిక్రమించి ఉంటే ఈ సభ నన్ను తప్పకుండా క్షమించాలి. ఈ సభ సహాయంతో నేను ఇంతకుముందు చెప్పినట్టుగా, ఎన్నికలకు ముందు మనం అభ్యర్థులం. ఎన్నికల తర్వాత మనం ప్రజల ఆకాంక్షలకు సంరక్షకులం. వారి ఆకాంక్షలకు దూతలం. నూట పాతిక కోట్ల దేశ ప్రజల ఆకాంక్షలు నిజం చేయడానికి మనం ప్రయత్నాలు చేస్తామని నేను నమ్ముతున్నాను. ఈ ఆశయం లో మీ అందరి మద్దతు నాకు లభించాలి. ఈ విషయాన్నే పునరావృతం చేస్తూ మీ అందరికీ చాలా ధన్యవాదాలు.

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

11జూన్ 2014

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 11 జూన్ 2014

గౌరవనీయులైన అధ్యక్షా, గౌరవనీయులైన సీనియర్ సభ్యులారా. ఈ రోజు ఈ సభలో తొలిసారిగా మాట్లాడే అవకాశం నాకు లభించింది. ఇక్కడున్న సభ్యులు నాకంటే సీనియర్లు, అనుభవజ్ఞులు. వారి నుండి భవిష్యత్తులో ఎంతో నేర్చుకోవలసి ఉంది, ఇప్పుడు ఈ తొలి దశలో నేను నా అనుభవలేమి వల్ల ఏమైనా మర్చిపోయినా, మీరంతా అలాంటి పొరపాటును క్షమించాల్సిందిగా కోరుతున్నాను.

గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగం పై 42 మంది గౌరవనీయ సభ్యులు, వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. గౌరవనీయులు శ్రీ గులాం నబి ఆజాద్ గారు, శ్రీ సతీష్ చంద్ర మిశ్రా గారు, శ్రీ డెరెక్ ఓ బ్రియన్ గారు, శ్రీ త్రిపాఠి గారు, ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్ గారు, శ్రీ సీతారాం ఏచూరి గారు, ఇతర సీనియర్ సభ్యులు వారి అభిప్రాయాలను ఇక్కడ తెలియజేశారు. అన్ని పార్టీల నాయకులు వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు, ఎక్కువమంది రాష్ట్రపతి గారి ప్రసంగానికి మద్దతుగా ధన్యవాదాలు తెలియజేశారు. కొన్ని సలహాలు ఇవ్వడం జరిగింది అలాగే కొన్ని డిమాండ్లు చేయడం జరిగింది. ఈ చర్చ చాలా అర్థవంతమైనదిగా జరిగింది. గౌరవనీయ సభ్యులు ఎటు వైపు కూర్చుని ఉన్నా, వారి ఆమోదయోగ్య సలహాలను వీలైనంత బాగా ఉపయోగించడానికి ప్రయత్నిస్తాము.

గౌరవ సభ్యులు చేసిన నిర్మాణాత్మక సలహాలకు నేను వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. కొంతమంది గౌరవ సభ్యులు ఇవన్నీ, ఎప్పుడు, ఎలా సాధ్యం? అని వారి ఆందోళనలను వెలిబుచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా నిరాశ నిస్పృహల వాతావరణం ఉండేది అనేది మనందరికీ తెలిసిన వాస్తవం. అంతా కోల్పోయాము ఇంకేమీ చేయలేము అనే

నిర్ణయానికి అందరూ వచ్చారు. ఆ భావన నీడలు ఇంకా ఉండడంవల్ల, ఎవరు చేస్తారు? ఎలా చేస్తారు? ఎప్పుడు చేస్తారు? లాంటి ప్రశ్నలు ఉత్పన్నం అవ్వడం సహజం. కొన్ని రోజులలోనే మా మిత్రులు అలాంటి నిరాశావాద వాతావరణం తొలగి పోయిందని, దేశం కొత్త ఆశ, విశ్వాసంతో ముందుకు సాగాలని సంకల్పించుకుందని నమ్ముతారు.

చాలా సంవత్సరాల తర్వాత దేశ ప్రజలు స్థిరత్వానికి, స్థిరమైన ప్రభుత్వానికి ఓటేసి అధికారాన్ని మాకు కట్టబెట్టారు. భారతదేశ ఓటర్ల, ఈ నిర్ణయం సాధారణ నిర్ణయం కాదు. భారతీయ పార్లమెంటరీ వ్యవస్థ పై ఉత్సాహంగా నమ్మకాన్ని చూపించిన దేశ వాసులకు మన ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మన గొప్ప ప్రజాస్వామ్యం పట్ల గర్వాన్ని వ్యక్తపరుస్తూ, తలెత్తుకుని ప్రపంచాన్ని కళ్ళలోకి సూటిగా చూసే సమయం ఆసన్నమయింది. మన దేశంలోని ఓటర్ల సంఖ్య, అమెరికా, యూరప్ లో ఉన్న ఓటర్ల సంఖ్య కంటే ఎక్కువ.

మన దేశం విశాలమైన దేశం, అతి పెద్ద ప్రజాస్వామ్యం. నిరక్షరాసి అయినా, పేదవాడైనా, గ్రామస్తుడైనా లేక సరైన బట్టలు లేని వాడైనా సరే, ప్రతి ఒక్కరి నరనరాల్లో ప్రజాస్వామ్యం లోతుగా నాటుకుని ఉండడం మనం ఎంతో గర్వించదగ్గ విషయం. కానీ మనం ప్రపంచానికి, మన ప్రజాస్వామ్యాన్ని ఈ రూపంలో చూపించలేకపోయాము. భారత ప్రజాస్వామ్య శక్తిని ప్రపంచానికి చూపించడం మనందరి సామూహిక బాధ్యత. ఆ విధంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా మనం కష్టపడుతూ ఉండాలి.

గౌరవనీయులైన రాష్ట్రపతి గారు వారి ప్రసంగంలో ఎన్నో విషయాల గురించి మాట్లాడారు, గౌరవనీయ సభ్యులు వారికి నచ్చిన రీతిలో ఆ విషయాలని ఇక్కడ ప్రస్తావించారు. ఇక్కడ నేను ఒక విషయం నొక్కి వక్కాణించాలనుకుంటున్నాను, విజయం నుండి, అపజయం నుండి నేర్చుకోవడానికి మనకు ఏదో ఒక పాఠం ఉంటుంది. అలా

నేర్చుకోవడం అవసరం కూడా. విజయం నుంచి పాఠాలు నేర్చుకోని వ్యక్తి ఓటమికి బీజాలు వేస్తున్నట్టు, అలాగే ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోని వ్యక్తి వినాశనానికి బీజాలు వేస్తున్నట్టు.

మనం జయాపజయాల పరిశీలనల నుంచి బయటపడి పాఠాలు నేర్చుకోవాలి. నేను ఒకసారి ఆచార్య వినోబా భావే గారి తత్వశాస్త్రాన్ని చదువుతున్నప్పుడు వారు యువతని ఈ విధంగా నిర్వచించారు. అది అతి సరళమైన మంచి నిర్వచనం. యువత అంటే రేపటి గురించి ఆలోచిస్తూ, భవిష్యత్తు గురించి మాట్లాడేవారు. ఎవరైతే గతాన్ని తవ్వుతూ ఉంటారో వారు యువత కాదు, వారి ఆలోచనల్లో యవ్వనం ఉండదు. ఎప్పుడూ గతం గురించే ఆలోచించడం సరైన పద్ధతి కాదు. గతానికి అతుక్కుపోయి ప్రజలు దీన్ని స్వీకరిస్తారో లేదో అని ఆలోచించడం సరైనది కాదు. మనం రైలులో కానీ బస్సులో కానీ ప్రయాణిస్తున్నప్పుడు కొంతమంది పెద్ద వారి మాటలు చాలాసేపు వింటూ ఉంటాం. వారు గతంలో ఏమి చేశారు, వారి జీవితంలోని వృత్తాంతాలు వారు చెప్తూ ఉంటారు. నా ఉద్దేశంలో వినోబా భావే గారు యువతని నిర్వచించిన విధానం చాలా గొప్పది, ఎందుకంటే మనం భవిష్యత్ గురించి ఆలోచిస్తూ, అటువైపు చూడడానికి ప్రేరేపించబడతాము. భారత సమాఖ్య విధానం మన ముఖ్యమైన బలం. బాబాసాహెబ్ అంబేద్కర్, ఇతర మేధావులు మనకు ఇచ్చిన రాజ్యాంగం, ఈ సమాఖ్య విధానానికి ఒక మార్గదర్శక శక్తి.

మనం ఇక్కడ ఢిల్లీలో కూర్చుని ఆ విధానాన్ని బలోపేతం చేస్తున్నామా లేదా అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనం దానిని ప్రభావవంతం చేశామా? భారత్ ముందుకు సాగాలంటే, రాష్ట్రాలు ముందుకు సాగాలి, భారత్ సంపన్నం అవ్వాలంటే రాష్ట్రాలు కూడా సంపన్నమవ్వాలి, అలాగే భారత్ బలపడాలంటే రాష్ట్రాలు కూడా బలపడాలి. కాబట్టి నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒకే మంత్రం మేము పాటించే వాళ్ళం

గుజరాత్ అభివృద్ధే, భారత అభివృద్ధి అని. మేము ఎప్పుడూ ఇదే మాట అంటూ ఉండేవాళ్ళం. ఇప్పుడు అలాంటి వాతావరణం ఎన్ని రాష్ట్రాలలో ఉన్నది? ఒక రాష్ట్రానికి పెద్దగా, ఏ విధమైన అడ్డంకులు, కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందో వాటిని నేను అనుభవించాను. ఢిల్లీలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పుడు కొన్ని రాష్ట్రాలు ఏవిధంగా అభివృద్ధి చెందాయో నేను చూశాను. అలాగే ఢిల్లీలో ప్రతికూలమైన ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్రాలు ఏ విధంగా వెనకబడేవో చూశాను. ఈ విధమైన అనుభవం నాకు ప్రత్యక్షంగా ఉంది. రాష్ట్రాలు ఏ విధమైన కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందో ఆ కష్టాలు నేను ఎదుర్కొన్నాను. ఏ విధంగా రాష్ట్రం తడబడుతుందో, ఏ విధంగా రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తారో, వ్యక్తిగత స్వార్థం కోసం ఏ విధంగా రాష్ట్ర పథకాలను ఆపడం జరుగుతుందో, ఏ విధంగా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్రలు చేయబడతాయో ఇవన్నీ చూశాను. కాబట్టి ఈరోజు రాష్ట్ర సమస్యల పట్ల మంచి అవగాహన ఉన్న వ్యక్తికి ఈ దేశ ప్రధానమంత్రి గా దేశానికి సేవ చేసే అవకాశం ఇవ్వడం జరిగింది. రాష్ట్రాల వేదనకి సాక్షి అయిన నేను, మంచి ఫలితాలు ఇవ్వగలనని ఈ సభకి భరోసా ఇస్తున్నాను.

గౌరవనీయులైన చైర్మన్ గారు, ఈ విషయాన్ని గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగంలో ప్రస్తావించడం జరిగింది. అలాగే సహకార సమాఖ్య వ్యవస్థ గురించి చెప్పడం జరిగింది. పెద్దన్నయ్య, చిన్నన్నయ్య అనే భావం ఇకముందు పనిచేయదు. అన్ని రాష్ట్రాలని సమానంగా చూడాల్సిన అవసరం ఉంది. మేము రాష్ట్రాలతో భుజం భుజం కలిపి పనిచేసే నిర్ణయం తీసుకున్నాము. మనము ఒక ఆరోగ్యకరమైన కార్య సంస్కృతిని పెంపొందించాలి. అందులో, రాష్ట్రాలు దేశప్రగతికి పని చేస్తున్నట్టుగా అనుకోవాలి. అలాగే దేశాన్ని నడిపిస్తున్న వారు, ఎంత చిన్న రాష్ట్రం అయినా, వాటి అభివృద్ధి జరగకుండా దేశం ముందుకు వెళ్లలేదు అని అనుకోవాలి. ఈ విధమైన ఆలోచనా సరళి తోనే మనం మన దేశం వ్యవహారాలు నడపాలి.

గౌరవనీయులైన చైర్మన్ సర్, మనం అన్ని రాష్ట్రాల ని కలుపుకుని ముందుకు వెళ్లగలిగితే అభివృద్ధిని త్వరితగతిన సాధించవచ్చు అని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ విషయాన్ని గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగంలో ప్రస్తావించడం జరిగింది. సమాఖ్య వ్యవస్థ ఉన్న భారతదేశంలో జాతీయ వ్యవహారాలు నడపడానికి ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రులు ఒక జట్టుగా పని చెయ్యాలి. కేవలం ప్రధానమంత్రి, వారి క్యాబినెట్ లోని మంత్రులు అలాంటి జట్టుని కూర్చడం సాధ్యం కాదు. ప్రధానమంత్రి, రాష్ట్రాల ముఖ్యమంత్రుల బృందమే మనం ఏర్పాటు చేసుకోవాలి. దాని మీద మనం దృష్టి పెట్టగలిగితే రాష్ట్రాల శక్తిని దేశ అభివృద్ధికి ఉపయోగించవచ్చు. నేను మైత్రేయన్ గారి ప్రసంగం విన్నాను, వారు, వారి ముఖ్యమంత్రి 40 ఉత్తరాలు వ్రాసారని, వారికి ఏ విధమైన ప్రత్యుత్తరం లభించలేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితులని మనం మార్చాలి. కాబట్టి ఈ దిశగా ఒక యంత్రాంగాన్ని వికసింప చేయాలని, నేను దానికి అనుకూలంగా ఉన్నాను. ఆ దిశగా మనం ముందుకు వెళ్లాలని నేను కోరుకుంటున్నాను.

కొంతమంది గుజరాత్ మోడల్ గురించి ఎక్కువగా ఆలోచిస్తున్నారు. కొంతమంది మనసులో గుజరాత్ మోడల్ గురించి కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. నేను వారి కష్టాన్ని అర్థం చేసుకోగలను. గుజరాత్ మోడల్ ని సరళమైన పదాలలో అర్థం చేసుకోవాలంటే ఉదాహరణకి ఉత్తరప్రదేశ్ లో మాయావతి గారి ప్రభుత్వం ఏదైనా మంచి పని చేస్తే, ఆ పనిని ప్రశంసించి, స్వీకరించి, మన రాష్ట్రంలో అమలు చేయడమే గుజరాత్ మోడల్. కేరళ రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వం ఉంది. వారు 'కుటుంబ శ్రీ' అనే పథకాన్ని అమలు చేస్తున్నారు. ఆ కార్యక్రమం గురించి వారి నుంచి నేర్చుకుని తగిన మార్పులు చేసి మా రాష్ట్రంలో ఆ పథకాన్ని అమలు చేయడం జరిగింది. ప్రధానంగా మనం రాష్ట్రాల గురించి చర్చిస్తున్నప్పుడు, మోడల్ గురించి మాట్లాడాలి. మోడల్ అనేది అభివృద్ధి దృష్టితో ఉండాలి. ఇలాంటి దృక్పథం ఒక మంచి

వాతావరణాన్ని సృష్టిస్తుంది, ఎక్కడైతే ఒక రాష్ట్రం మరో రాష్ట్రంతో అభివృద్ధి చెందడం లో పోటీ పడుతుందో, ఆ వాతావరణం ఏదో ఒక రోజు బెంగాల్, అభివృద్ధిలో గుజరాత్ ని అధిగమించిందని లేదా తమిళనాడు, గుజరాత్, బెంగాల్ లను అభివృద్ధిలో అధిగమించింది అని, ఏదో ఒక రోజు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కంటే ముందు ఉందని లేదా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కంటే ముందు ఉందని, బీహార్, గుజరాత్ కంటే అభివృద్ధిలో ముందంజలో ఉందని వినడానికి ఆసక్తిగా ఉన్నాను. మన దేశ అభివృద్ధిలో ఈ విధమైన పోటీతత్వాన్ని చూడాలని, ప్రోత్సహించాలని కోరుకుంటున్నాము. మన దేశంలోని ప్రతి రాష్ట్రానికి సొంత బలాలు, ప్రత్యేకతలు ఉన్నాయి. వాటిని మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. గుజరాత్ ఒక చిన్న రాష్ట్రం, కానీ ప్రతి జిల్లా కోసం ఈ రాష్ట్రంలో ఒకే విధంగా పని చేయలేరు. ప్రపంచం మొత్తం ఒకే విధమైన ఆహార్యాన్ని ధరించడం కుదరదు. ఆ రాష్ట్రం వింత ఏంటంటే ఎడారి అయిన కచ్ జిల్లాకి వర్తించే మోడల్, హరిత జిల్లా అయిన వల్సాడ్ కి వర్తించదు. అలాగే ఒక రాష్ట్రానికి సరి పడే విధానం మరో రాష్ట్రానికి సరిపడదు. ఢిల్లీ అభిప్రాయాలని వేరే రాష్ట్రాల మీద రుద్దడం తగదు. రాష్ట్రాల ప్రాధాన్యతలు ఏమిటో తెలుసుకోవాలి, వారి కష్టాలు ఏంటో తెలుసుకుని తదనుగుణంగా వనరులను ఉపయోగించాలి. ఆ విధంగా చేసినప్పుడే మనం ముందుకి త్వరగా వెళ్లగలం. కాబట్టి ఒక రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందే దిశగా మనం వెళ్లాలని, ఇది అందరి సామూహిక బాధ్యత అని తెలియజేస్తున్నాను. మనం భారత చిత్ర పటం చూసినట్టయితే పశ్చిమ భారతాన ఉన్న కేరళ, కర్ణాటక,గోవా, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలలో అభివృద్ధి కనిపిస్తుంది. మరి తూర్పు ప్రాంతాలైన ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ లోని పూర్వాంచల్ ప్రాంతాల సంగతేంటి? మనం మన భరతమాత, ఒక్క చేయి బలంగా మరో చేయి బలహీనం గా ఉండాలని కోరుకుంటామా? కాబట్టి తూర్పు భారతదేశం ఏదైతే అభివృద్ధిలో వెనుకబడి ఉందో ఆ ప్రాంతం అభివృద్ధి మన

ప్రాధాన్యత అయి ఉండాలి, ఆ ప్రాంతాన్ని కనీసం పశ్చిమ భారతానికి సమానంగా అభివృద్ధి చేసే ప్రయత్నం చేయాలి.

మనం 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అని అంటున్నప్పుడు అది అందర్నీ కలుపుకొని వెళ్లే అభివృద్ధి అని అర్థం. అందర్నీ స్పృశిస్తూ, సార్వత్రికంగా స్వీకార యోగ్యమైన అభివృద్ధి మన అందరికీ మంచి చేయాలి. కాబట్టి అభివృద్ధి ఏదో ఒక ప్రాంతానికి పరిమితం కాకూడదు.

మనం అభివృద్ధి గురించి మాట్లాడుతున్నప్పుడు, అందరి సంక్షేమం అందులో ప్రతిబింబించాలి. అందుకే మనమందరము కూడా తూర్పు ప్రాంతాల పట్ల శ్రద్ధ వహించాలి. ఈశాన్య రాష్ట్రాల కి ఆర్థిక సహాయం అందించి వారిని వారి అదృష్టానికి వదిలేయడం, ఎన్నాళ్ళు చేస్తాం? మనం కొత్తగా ఆలోచించలేమా? మనదేశంలో దాదాపు 20 వేల కళాశాలలున్నాయి. విద్యార్థులు ప్రతి సంవత్సరం 8 నుండి 10 రోజుల విహార యాత్రలకి వెళుతుండటం సర్వసాధారణం. మనం ఎప్పుడైనా ఈ కళాశాలలకు ప్రతి సంవత్సరం ఒక పది రోజులు ఈశాన్య రాష్ట్రాలలో గడపాలని సూచించామా? ఒక్కొక్క కళాశాల నుండి 100 విద్యార్థులు ఈ 30 వేల కళాశాలల నుంచి వెళ్లి ఈశాన్య రాష్ట్రాలలో సంవత్సరానికి ఒక వారం రోజులు గడిపితే, వారి పర్యాటక రంగం ఎంతగా అభివృద్ధి చెందుతుందో ఊహించగలరా? అలాగే వారి పర్యావరణ పర్యాటకానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. ఈ విధంగా చేయడం వల్ల దేశ ప్రజలకు ఈశాన్య రాష్ట్రాల వారి కష్టసుఖాల గురించి తెలుస్తుంది, వారి పట్ల ఒక విధమైన బంధాన్ని వీరు పెంచుకోగలరు. అలాగే వారు కూడా, దేశం నలుమూలల నుంచి ప్రజలు మన దేశాన్ని గౌరవిస్తున్నారని అర్థం చేసుకుంటారు. ఇది వారిని దగ్గర చేసుకునే ఒక విధానం. మనం మన దేశ వ్యవహారాలు నడపడానికి కొత్త పద్ధతులు కనుక్కోవాలి. అందుకు ఒక ప్రణాళిక ఉండాలి. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖను రాశాను. శ్రీ మన్మోహన్ సింగ్ గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఎన్ డి సి

సమావేశాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఈ మాటని నేను సార్వజనీనంగా చెప్పాను, ఒక రెండు వందల మంది మహిళా పోలీసులను మా రాష్ట్రానికి రెండు సంవత్సరాలకు గాను పంపమని, వారిని వంతులవారీగా మార్చమని నేను సలహా ఇవ్వడం జరిగింది. ఈ విధానం వల్ల వారికి మా రాష్ట్రంలో పనిచేసే అవకాశం దొరకడమే కాకుండా వారు వారి వారి రాష్ట్రాలకు తిరిగి వెళ్ళేటప్పటికి ఇక్కడి కుటుంబాలతో వారికి దగ్గరి సంబంధాలు ఏర్పడి ఉంటాయి. ఇది ప్రజల్ని ఏకీకృతం చేసే ఒక మంచి పద్ధతి. మనం 'వన్ ఇండియా' గురించి మాట్లాడుతున్నప్పుడు ఇదే వన్ ఇండియా కల. ఇది రెండు లేక మూడు భారత్ లను ఏకీకృతం చేయడం కాదు, ఇది భారత్ ఐక్యతకు సంబంధించిన విషయం.

ఈరోజు మన దేశం కులం అనే జాడ్యం లో కూరుకుపోయింది. ప్రాంతీయ వాద దళాలు మన దేశాన్ని నాశనం చేశాయి. మనం ఈ విధమైన విచ్ఛిన్నకర భాషకి స్వస్తి చెప్పి, ఒకే స్వరంలో మాట్లాడాల్సిన సమయం ఇది. అందుకే మేము "ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్" అనే దృక్పథంతో ముందుకు వచ్చాము. ఒకవేళ ఎవరైనా మనదేశంలో రెండు భారత్ లను చూస్తున్నట్లయితే, అది వారి మానసిక రుగ్మత. మేము మాత్రం ఐక్యత అనే మంత్రాన్నే తీసుకువచ్చాం. మనమంతా కులం, మతం, భాషలకి అతీతంగా ఒకే జాతి పట్ల దార్శనికత తో ముందుకు వెళ్దాం.

మనదేశంలో ఐక్యత లో వైవిధ్యం ఉంది. మనదేశంలో ఏకరూపత లేదు. అలాగే ఏక రూపము ఉండకూడదు కూడా. మనదేశంలో ప్రతి ఇరవై కిలోమీటర్ల కి ఒకే రకమైన పిజ్జా తినటం జరగదు. మనం దక్షిణాన ఇడ్లీలతో మొదలెడితే ఉత్తరానికి వచ్చేటప్పటికి పరాటాలతో ముగుస్తుంది. మన దేశం వైవిధ్యంలో సుసంపన్నమైనది, అందులో ఏకరూపత తీసుకు రావడం కుదరదు. అందుకే మనం "ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్" అనే దృష్టితో అందరి సంక్షేమం గురించి మాట్లాడుతున్నాం.

మనం కొత్త విధానంతో మన దేశ వనరులను దృష్టిలో పెట్టుకొని అందరినీ ఏవిధంగా ప్రేరేపించగలం? రాష్ట్రాలకి విశిష్ట లక్షణాలతోపాటు, ప్రత్యేక సమస్యలు ఉంటాయి. మనం ఈ సమస్యలని సమకాలీన పద్ధతులతో పరిష్కరించే సంస్కృతిని ఎందుకు సృష్టించకూడదు? ఉదాహరణకి హిమాలయ రాష్ట్రాలకు తరాయ్ ప్రాంతపు అభివృద్ధి నమూనాను ఉపయోగించలేము. అక్కడికి బదిలీ పై వెళ్లిన మన అధికారి 60 కిలోమీటర్ల వేగంతో వాహనాలు నడపాలని అనవచ్చు, కానీ హిమాలయ ప్రాంతాల్లో 60 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ఎలా నడుస్తాయి? ఆ అధికారి ఒక నిర్ణీత దూరానికి నిర్ణీతమైన డీజిల్ ఇస్తాడు కానీ హిమాలయ ప్రాంతంలో అన్ని కిలోమీటర్లు వాహనం ఎలా నడుస్తుంది? కాబట్టి మనం ఒక ప్రాంతానికి అనుకూలంగా ఉండే పరిష్కారాలను కనుక్కోవాలి. అందుకే రాష్ట్రపతి గారి ప్రసంగంలో, మనమంతా కూర్చుని హిమాలయ రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకుని, ఒక ఉమ్మడి వ్యవస్థను అభివృద్ధి చేయగలమేమో చూసి ఆ దిశగా మనం అడుగులు వేయాలి అని చెప్పడం జరిగింది.

అలాగే తీర ప్రాంత రాష్ట్రాల అభివృద్ధి కూడా ఒక విషయం. మనం విశ్వ వ్యాపార పరిస్థితులలో జీవిస్తున్నాము కానీ మన తీరప్రాంతాలు దానికి అనుగుణంగా, అంత వేగంగా అభివృద్ధి చెందలేదు. భారత తీర ప్రాంతాలకి భారతీయ సమృద్ధి కి ముఖద్వారం అవ్వగలిగే సామర్థ్యాలు ఉన్నాయి. మన తీరప్రాంతాలు మన దేశ విలువైన వనరులు.

కానీ మనం వాటిని చాలా నిర్లక్ష్యం చేశాము. మనం కేవలం మత్స్యకారుల గురించే ఆలోచించాము. తీర ప్రాంతపు సమగ్ర అభివృద్ధి గురించి మనం ఆలోచించలేదు. అందుకే తీర ప్రాంత అభివృద్ధిని చూడడానికి ఒక ప్రత్యేక వ్యవస్థ గురించి గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగంలో ప్రస్తావించడం జరిగింది. తీరప్రాంత రాష్ట్రాలు అన్ని కలిసికట్టుగా ముందుకు రావాలి. తీర ప్రాంత అభివృద్ధికి ఉమ్మడి ఆలోచనలు ఉండాలి, అలాగే వారి ఇబ్బందులు చర్చించాలి,

సమన్వయం ఏర్పరచుకోవాలి, ఒకరిని ఒకరు బలోపేతం చేసుకోవాలి, వారి అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకోవాలి. మన దేశానికి పొడవైన తీర ప్రాంతం ఉంది. భౌగోళికంగా మనమున్న స్థానం పశ్చిమ, తూర్పు భూభాగాన్ని కలపడంలో ఒక ముఖ్యమైన నావికా శక్తిగా ఎదగగలదు. కానీ ఆ దిశగా మనం ఎంత అభివృద్ధి సాధించాలో అంత సాధించలేదు. శ్రీలంకలోని కొలంబో ఒక చిన్న ప్రాంతం కానీ అది విశ్వ సముద్ర వ్యాపారానికి ఒక కేంద్ర బిందువుగా నిలిచింది. అలాగే మరోవైపు సింగపూర్, చైనా దేశాలు కూడా పాకిస్తాన్ లో తమ కేంద్రాలను స్థాపించాయి. ఇలాంటి పరిస్థితులలో మన దేశం మన తీర ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మనం తీరప్రాంత రాష్ట్రాలతో కూర్చుని ఒక అభివృద్ధి నమూనాను తయారు చేయలేమా?

అలాగే మన దేశంలో చుట్టూ భూభాగాలు ఉన్న రాష్ట్రాలు ఉన్నాయి. అవి కూడా వైవిధ్యంలో సంపన్నమైన రాష్ట్రాలు. వాటి వైవిధ్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. కొన్ని ప్రాంతాలు మావోయిజం తో ప్రభావితమై ఉన్నాయి. కొన్ని ప్రాంతాలు మావోయిస్టులతో ప్రభావం చెందవచ్చు. అలాంటి ప్రాంతాలని గుర్తించి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు కూర్చుని,చర్చించి వాటికి ఉన్న సమస్యలకి పరిష్కారాలు కనుగొనలేమా? మనం ఈ విషయాలని ఎలా ముందుకు తీసుకెళ్లాలి? ఈ దేశంలోని ప్రతి రాష్ట్రం ముందుకు సాగి, అభివృద్ధి పథంలో వాటి బలాలు, సామర్థ్యాల ఆధారంగా వికసించాలి. ఈ మధ్య ఏం జరుగుతుంది? ఢిల్లీలో కూర్చుని రాజకీయ లబ్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటాం, చట్టాలని ఆమోదిస్తాం కానీ వాటిని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రాలపై ఉంటుంది. రాష్ట్రాలకి సరిపడే వనరులు లేవు. దాని ఫలితంగా కొన్ని పథకాలు అమలు చేయడం సాధ్యం కాదు. వార్తాపత్రికలు వీటి గురించి కొన్ని రోజులు వార్తలు ప్రచురిస్తాయి. రాష్ట్రాలు ఆ పథకాలను అమలు చేయకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతాయి. ఈ విధమైన ఆందోళనకరమైన

వాతావరణాన్ని మనం ఎందుకు సృష్టిస్తున్నాం? నేను కూడా రాష్ట్రం లో పని చేశాను కాబట్టి ఈ విధమైన ఆందోళనలు మనల్ని విపరీత దిశ వైపు నెట్టుతాయని చెప్పగలను. అందుకే ఇలాంటి పరిస్థితులను మార్చాల్సిన దిశగా మనం తీవ్రంగా ఆలోచించాలి.

మన వ్యవసాయం కూడా వ్యవసాయ వాతావరణ ప్రాంతాలుగా విభజించబడింది. ప్రతి రాష్ట్రంలో ఒక పంట కోసం ఖచ్చితమైన ప్రాంతాన్ని గుర్తించడం జరుగుతుంది. ఈ సందర్భంలో మ్యాపింగ్ చేయడం జరిగిపోయింది. కానీ గోధుమలు పండించే రాష్ట్రాలలో కొన్ని సమస్యలు ఉన్నాయి. ఆ రాష్ట్రాలతో వేరుగా చర్చించాలి. అలాగే ధాన్యం పండించే రాష్ట్రాలకు వేరే సమస్యలున్నాయి, వారితో కూడా వేరేగా చర్చించాలి. చెరుకు పండించే రాష్ట్రాలకు కూడా ప్రత్యేక సమస్యలు ఉన్నాయి, వారితో కూడా విడిగా చర్చించాలి. మనము సమస్య కేంద్రిత చర్యలు తీసుకోకపోతే, మనం దేశాన్ని ఢిల్లీ నుంచే నడిపిస్తూ ఉంటాము, మనం ఎన్నో చట్టాలను చేశామని ప్రపంచానికి చెప్పవచ్చు కానీ వాస్తవం మాత్రం మారదు. కాబట్టి మనం ఈ రోజున మన ఆలోచనలు, అభిప్రాయాలు ప్రజలందరికీ చేరుతున్నాయా లేదా అని ఆలోచించాలి. సమాజంలోని చివరి వ్యక్తికి లబ్ధి చేకూర్చడం పెద్ద సవాలు. దానికి కారణం పరిపాలనలోనే దాగి ఉంది.

మనం స్వపరిపాలనను సాధించాము కానీ సుపరిపాలనను అందించడంలో విఫలమయ్యాం అనే విషయాన్ని అంగీకరించాలి. నేను ఈ సభా నాయకుడిగా ఎన్నుకోబడిన రోజే నా ఉపన్యాసంలో ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాను. గత ప్రభుత్వాలు ఏమీ చేయలేదు అనే అభిప్రాయం నాకు లేదు. ఏ ప్రభుత్వం కూడా అధికారంలోకి ఏమీ చేయకుండా ఉండడానికి రాదు. ప్రతీ ప్రభుత్వం ఏదో ఒకటి చేస్తుంది. ప్రతీ ప్రభుత్వం వారి కార్యకాలంలో దేశం కోసం ఏవో పనులు చేసి ఉంటుంది. వారందరి కృషి ఫలితమే మనం ఈరోజు ఇక్కడ ఉన్నాం. కానీ మనం ఎంత చేయాలో అంత చేయలేకపోయాం. ఏ దిశలో అయితే మనం మన

శక్తిని ఉపయోగించుకోవాలో అలా చేయలేదు. కాబట్టి ఈ లోపాలని సరిదిద్దే దిశగా మనం ఇప్పుడు కృషి చేయాలి.

మహాశయా, ఈ దేశ నాయకులు విదేశాల లో మాది పేద దేశం అని మనకి ఇక్కడ ఉదాహరణలు చూపిస్తారు. ఈ దేశం ఒక బంగారు పక్షిగా ఒక సమయంలో గుర్తించబడింది. ఒకప్పుడు మన దేశం, ప్రముఖ సంపన్న దేశాలలో ఒకటిగా లెక్కించబడినది. మన దేశం పాండిత్యము, విజ్ఞాన రంగాలలో అభివృద్ధికి పేరుగాంచినది. ఆ పేరు మొత్తం మన బానిసత్వంలో కోల్పోయాం, కానీ మనం ఇప్పుడు ఆ పరిస్థితుల నుంచి బయటపడ్డాం. కాబట్టి మనం సుపరిపాలనను ఏ విధంగా పటిష్ఠపరచగలం? మనం మన ప్రజాస్వామ్య వ్యవస్థ తో చుట్టుముట్టబడి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. అందువల్లే సుపరిపాలన వైపు దృష్టి సారించ లేకపోయాము. సుపరిపాలన అంటే ఒక సామాన్య పౌరుడికి జవాబుదారితనం.

ఈ రోజున మన పరిపాలనా వ్యవస్థ సామాన్య పౌరుడికి జవాబుదారీగా ఉందని మనం చెప్పగలమా? ఒక మంచి పరిపాలన మొదటి షరతు, అది పౌరులకు జవాబుదారీగా ఉండడం. కానీ అలాంటి పరిస్థితి లేదు. ప్రస్తుత వ్యవస్థలో పేద వారి సమస్యలను వింటున్నారా? ప్రభుత్వం పేద వారి కోసం పని చేయటం లేదంటే, అలాంటి లోపం మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎక్కడినుంచి పుట్టింది? కాబట్టి మనము మన దేశంలో సుపరిపాలన దిశగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. మనము సురాజ్యం, సుపరిపాలనపై దృష్టి పెట్టాలి.

సర్ ఒక వ్యక్తి ఎంత ఆరోగ్యంగా కనిపించినా, ఎంత పొడవుగా ఉన్నా, ఏ వ్యాధి లేకుండా మంచి బరువు ఉన్నా సరే, అతని శరీర వ్యవస్థలోకి డయాబెటిస్ ప్రవేశించినట్లయితే అతని శరీరమంతా వివిధ వ్యాధులకు కొలువుగా మారిపోతుంది. డయాబెటిస్ వ్యాధి ఏవిధంగా

అయితే మొత్తం శరీరాన్ని నాశనం చేస్తుందో అదే విధంగా అధికార యంత్రాంగం లోని చెడు పరిపాలన మొత్తం దేశాన్ని నాశనం చేస్తుంది. చెడు పరిపాలన డయాబెటీస్ వ్యాధి కన్నా చెడ్డది. అందుకే సుపరిపాలన తీసుకురావడానికి మేము చొరవ తీసుకుని, కృషి చేస్తున్నాము.

సర్, అవినీతి అనేది మన దేశంలో ఒక పెద్ద సమస్య. ప్రపంచంలో మనకి ఆ విధమయిన గుర్తింపు ఉంది. మంచో, చెడో, తప్పో, ఒప్పో, దాని పట్ల అందరికీ ఒక అభిప్రాయం ఉంది. అందుకే ప్రపంచంలో భారతదేశం స్కామ్ ఇండియాగా పేరు సంపాదించింది. ఇది మన దేశం పట్ల ఉన్న సాధారణ అభిప్రాయం. అందుకే మన దేశ అభివృద్ధి కుంటుపడింది. మన పర్యాటక రంగం వెనకబడింది. ఎందుకలా జరిగింది? పర్యాటకుల పై అత్యాచార ఘటనలు వేరే పర్యాటకులని మన దేశాన్ని పర్యటించకుండా నిరుత్సాహ పరిచాయి. మన దేశంలో జరిగే ప్రతి చిన్న సంఘటన మన దేశ అభివృద్ధిని నిర్ణయిస్తుంది. ఇలాంటి విషయాలని రాజకీయం చేయకూడదు. మనం ఉగ్రవాదాన్ని రాజకీయం చేయగలమా? మనం మావోల దాడుల్ని రాజకీయం చేయగలమా? అలాగే మన తల్లులు, సోదరీమణుల పై జరిగే అత్యాచారాలని రాజకీయం చేయాలా? అమాయకుల మరణాలతో రాజకీయం చేయాలా? కాబట్టి ఇప్పుడున్న పరిస్థితులలో మనం వీటన్నిటికీ అతీతంగా మన సమస్యల తో ఏ విధమైన రాజీలేని పోరాటం చేయాలి. మనమంతా కలిసి కూర్చుని, పరిష్కారాలు వెతికి ఎటువంటి పరిస్థితులు మన దేశం మంచిపేరుని పాడు చేస్తున్నాయో వాటి నుంచి బయట పడాలి.

మహాశయా, ప్రపంచం భారత్ పట్ల ఎక్కువ ఆకర్షితమవుతుంది. ప్రజలు పర్యాటకం కోసం భారత్ వైపు చూస్తున్నారు కానీ ఈ మధ్య అకస్మాత్తుగా వారి సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది. ఇలాంటి సంఘటనల వల్లే ఈ సంఖ్యలో తగ్గుదల వచ్చింది. ఈ సందర్భంగా

మనమందరము దీనికి బాధ్యత వహించాలి కదా? రాజకీయాలకి అతీతంగా మనం ఈ సమస్యలకు పరిష్కారాలు కనుగొనలేమా?

సర్, దేశం నలుమూలల నుంచి ప్రతిభావంతులు ఈ సభలో కూర్చున్నారు. ఈ సభలో మేధావుల మండలి ఉంది. వారు మార్గదర్శకత్వం వహించాలి. మనం అందరం కలిసికట్టుగా మార్గాలు అన్వేషించాలి. ఇక్కడ కూర్చుని మన దేశ సమస్యలకు పరిష్కారాలు వెతికి మన దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లడమే మన ప్రయత్నం కావాలి.

మహాశయా, ఈ దేశంలో అవినీతి పట్ల ప్రజలకి తీవ్ర ఆగ్రహం ఉంది. ప్రజలు అవినీతిపరులు జైలుకెళ్లే వరకూ వేచి ఉండలేరు. వారి వద్ద ఉన్న ఆయుధంతో వారు రాజకీయ నాయకులను ఈరోజు శిక్షిస్తున్నారు. కానీ అది పరిష్కారం కాదు.

అవినీతి జరిగిన తర్వాత ఏమి చర్యలు తీసుకోవాలి అని ఆలోచించడం కంటే ముందు మనం అవినీతి జరగకుండా మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగంలో అవినీతి జరిగిన తర్వాత తీసుకోవలసిన చర్యలను చర్చించడం జరిగింది. ఇందులో ఎన్నో విషయాలు ఉన్నాయి. కానీ కొన్ని చర్యలు తీసుకోవడం వల్ల అవినీతి జరగకుండా చూడొచ్చు. అలాంటి కొన్ని చర్యలలో రాష్ట్రం విధాన బద్ధంగా నడుచుకోవడం ఒకటి. రాష్ట్రం విధానాలపై నడుచుకుంటే, విధానాలన్నీ లిఖితపూర్వకంగా ఉంటే, ఏ విధమైన పక్షపాతానికి వీలు ఉండదు. మొదటి, చివరి అనే మాటలకు ఆస్కారం ఉండదు, అందరికీ సమాన హక్కు లభిస్తుంది. అలాగే పారదర్శకత ఉంటే ఎవరైనా ప్రశ్నలు అడగవచ్చు. అందుకే రాష్ట్రం విధాన బద్ధంగా నడుచుకోవాలి. అలా నడుచుకున్న పక్షంలో అవినీతి తగ్గుముఖం పట్టి, అలాంటి అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.

మరొక పద్ధతి సాంకేతిక విజ్ఞానం. ఈరోజు అవినీతిని అరికట్టడంలో సాంకేతికత ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. పర్యావరణ మంత్రిత్వ శాఖ కి సంబంధించిన ఫైళ్లు పోగు పడినట్లయితే ఎన్నో ఆరోపణలు చేస్తారు కానీ అవే ఫైళ్ళు ఆన్లైన్లో ఉంటే దరఖాస్తుదారుడు వారి ఫైల్ స్థితిని ఒక పాస్వర్డ్ సహాయంతో వారి ఇంటి నుండే తెలుసుకోవచ్చు. సాంకేతికత తెచ్చిన పారదర్శకతతో ఒక సామాన్య వ్యక్తి అవినీతి చేయడానికి 50 సార్లు ఆలోచిస్తాడు. సీసీటీవీ లాంటి పరికరాల వల్ల కూడా ప్రజలు భయపడుతున్నారు. అతి భయంకరమైన వ్యక్తులు కూడా భయపడుతున్నారు. కాబట్టి మనం సాంకేతికతను మరింత ఉపయోగించాలి. ఇ-టెండరింగ్ లాంటి చిన్న చర్యలు అవినీతిని నియంత్రణలో ఉంచుతున్నాయి. కానీ ఇలాంటి పనులు మనం పెద్ద ఎత్తున చేపట్టాలి. అలాగే స్కూల్లో విద్యార్థుల హాజరు బయోమెట్రిక్ విధానంతో అనుసంధానిస్తే 40 మంది విద్యార్థులు ఉన్నప్పుడు వారిని 80 మంది గా చూపించి తప్పుడు సహాయం తీసుకోకుండా అవినీతిని ఆపివేయవచ్చు. అవినీతి అన్ని స్థాయిల్లో అంటే కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు జరుగుతుంది. సీసీటీవీ కెమెరాలు రైల్వేస్ లో ఉంచినట్లయితే అక్కడ జరిగే అవినీతి మనం ఆపవచ్చు. ఇలా ఎన్నో ఉన్నాయి. దేశం విధాన బద్ధంగా నడుచుకోవడం, సాంకేతికతను విరివిగా వాడడం, అలాగే అవినీతికి పాల్పడే వారి పట్ల కఠినమైన శిక్షలు విధించడం. ఇవన్నీ చేసినట్టయితే పరిస్థితులు మారుతాయని నేను విశ్వాసంతో చెప్పగలను.

మనకి నచ్చినా, నచ్చకపోయినా ఈ సభ ప్రతిష్ట, దేశం దృష్టిలో దిగజారిపోయింది. పార్లమెంటుకు ఎన్నుకోబడిన సభ్యుడికి నేరచరిత్ర ఉంటుందని విస్తృతంగా చెప్పుకుంటున్నారు. అలాంటి వ్యక్తులు ఐదుగురు లేదా పదుగురో ఉన్నా ఆ విధమైన అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవడం జరుగుతుంది. కాబట్టి ఈ సభల ని అటువంటి కళంకం నుంచి విముక్తి కలిగించడం మనందరి సామూహిక బాధ్యత. ఈ విధంగా చేయాలంటే

మనందరం కలసి నిర్ణయించాలి. మనం సుప్రీం కోర్టుని, ఏ సభ్యుని పైన అయినా ఎఫ్ఐఆర్ నమోదు అయిన ఒక సంవత్సర కాలంలో ఆ కేసుని పరిష్కరించే ఒక న్యాయ తంత్రం తీసుకురావాలని విన్నవించుకోవాలి. ఎవరైతే దోషులో, వారిని జైలుకు పంపించాలి, ఎవరైతే నిర్దోషులో వారిని నిర్దోషిగా ప్రకటించాలి. అప్పుడు వారు ఒక నిర్దోషిగా సమాజాన్ని ఎదుర్కొన గలరు. ఎందువల్ల రాజకీయ కారణాలతో అన్ని కేసులు నమోదవుతున్నాయి? ఎందుకు ఎంతో మంది అమాయకులు చనిపోతున్నారు? మనమందరము కూడా దేశానికి, ప్రపంచానికి 2015 కల్లా భారతదేశంలో, ఈ సభలో, లోక్ సభ కానివ్వండి లేదా రాజ్యసభ కానివ్వండి ఏ సభ్యుని పైన కూడా ఎటువంటి మరక ఉండదని చెప్పగలగాలి. ఒక ప్రారంభం ఖచ్చితంగా చేయొచ్చు. లోక్ సభ ను రాజకీయంగా మనం శుద్ధి చేసినట్లయితే, రాజకీయ పార్టీలు వారి టిక్కెట్లు ఇచ్చే ముందు 50 సార్లు ఆలోచించాలి. ఒక్క సంవత్సరంలో మనం ఈ విధంగా అభివృద్ధి చేసినట్టయితే ఏవైతే పదవులు ఖాళీ అవుతాయో అందులో నేర చరిత్ర గల వారు రావడానికి సాహసించలేరు. ఈ విధానాన్ని ఆ తరువాత రాష్ట్ర శాసనసభలో కూడా అమలు చేయాలి. నెమ్మదిగా కార్పొరేషన్ కి కూడా ఈ విధానాన్ని పాటించాలి. ఎప్పుడైతే ఒక సర్వ సమ్మతి వాతావరణం ఉంటుందో మనం రాజకీయాలని నేరం నుంచి విముక్తి చేయవచ్చు. ఈ పని చేయడానికి ఇదే సరైన విధానం. అందుకే ఈ విషయాన్ని గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగం లో ప్రస్తావించడం జరిగింది. నాకు తెలిసినంతవరకు ప్రతి ఒక్కరూ ఈ కళంకం నుంచి విముక్తి పొందాలి అనుకుంటారు. ఎవరి మీద అయితే ఎఫ్ఐఆర్ నమోదైందో, ఈ కళంకం 15 ఏళ్ల పాటు వారిపై వేలాడుతున్న కత్తి వలె ఉంటుంది. వారు ఎప్పుడు నామినేషన్ పేపర్లు వేసినా, దాని గురించి ప్రస్తావించాలి. ప్రతిసారి ఏదో ఒక ఎన్జీవో దాని గురించి వార్తా పత్రికలలో వారిపై 25, 30 కేసులు ఉన్నాయని ప్రచురిస్తుంది. ప్రతి ఒక్కరూ ఈ విధమైన కళంకం నుంచి విముక్తి పొందాలి అనుకుంటారు. ఒక న్యాయ ప్రక్రియ ఈ విధంగానే జరగాలి. సభ్యులందరూ

లోక్ సభ నుంచి కానివ్వండి, లేదా రాజ్యసభ నుంచి కానివ్వండి వారంతా ఇది సాధ్యం అయ్యే దిశగా సహకరిస్తారని, సుప్రీంకోర్టు సహకారంతో, తప్పు చేసిన వారిని జైలుకి పంపించి, నిర్దోషులని ఏ విధమైన మచ్చ లేకుండా ప్రపంచాన్ని ఎదుర్కొనే విధంగా విడుదల చేసే ఒక వ్యవస్థని రూపొందించ గలమని నేను నమ్ముతున్నాను. ఉభయ సభల కి అలాంటి పని చేసే అధికారం ఉంది. ఇలాంటి సమస్యలు మరిన్ని ఉన్నాయి. కానీ మనం ఇక్కడి నుంచే ప్రారంభం చేయాలి, మిగతావి వాటికవే సర్దుకుంటాయి. ఎవ్వరినీ విడిచి పెట్టొద్దన్న మీ భావనని నేను గౌరవిస్తాను. న్యాయ పాలన ఉండాల్సిందే. అమాయకుల్ని రక్షించాలి, దోషుల్ని శిక్షించాలి.

అందుకే నల్లధనంపై ఒక SIT ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చర్య నేను ఈ పదవిని చేపట్టిన గత రెండు సంవత్సరాలుగా ఊగిసలాడుతుంది. ఇది మా ప్రాధాన్యం కాబట్టి చేసాము. ఈ నల్లధనం ఎవరి వద్ద ఉందో మాకు తెలియదు. కానీ వారి గురించి ఈ దేశానికి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. నల్ల ధనం ఉందా? లేదా? ఉన్నట్టయితే ఎవరి వద్ద ఉంది? ఎంత ఉంది? ఎక్కడ నుంచి వచ్చింది? ఎక్కడికి వెళ్ళింది? దేశానికి కనీసం అది ఉందో లేదో స్పష్టంగా తెలియాలి. దేశం శాంతిని కోరుకుంటుంది. ఇలాంటి విషయాలలో మనం అశ్రద్ధ చేయకూడదు. ధైర్యంగా ముందుకు వెళ్లాలి. ఆ దిశగా మనం వెళ్ళినట్లయితే సామాన్య ప్రజలకి పార్లమెంటుపై ఉన్న నమ్మకాన్ని తిరిగి పొందగలము. వారికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం పెరుగుతుంది. అలాగే వారు ప్రభుత్వ వ్యవస్థను నమ్మడం ప్రారంభిస్తారు.

దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య నమ్మకం లేకపోవడం. అది ఎంతగా ఉంది అంటే ఇక్కడ కూర్చున్న వ్యక్తి ఒక ఎస్ఎంఎస్ పంపిన తర్వాత కూడా ఫోన్ చేసి అది అందిందో లేదో తెలుసుకోవాల్సిన పరిస్థితి. ఎందుకు? ఎందుకంటే నమ్మకం లేదు. కాబట్టి నమ్మకాన్ని కోల్పోయాం. లేనిచో సందేశాన్ని పంపించిన వ్యక్తి ఆ సందేశం అందుతుందనే నమ్మకంతో ఉండేవాడు, కానీ తను ఒక ఫోన్ చేసి ఆ విషయాన్ని నిర్ధారించుకున్నాడు. ఈ విధమైన

నమ్మక లోపాన్ని మనం సరిదిద్దాలి. ఒక వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రి లో చేరితే, తనకి నయమవుతుంది అని నమ్మకం ఉండాలి. ఒక పిల్లవాడు ప్రభుత్వ పాఠశాల కి వెళితే వారి తల్లిదండ్రులకు వారి పిల్లవాడి విద్య పట్ల ఏ సమస్య ఉండదని నమ్మకం ఉండాలి. ఈ విధమైన నమ్మకాన్ని పెంపొందించాలి. అదే మనకు ఉన్న పెద్ద సవాలు. కానీ మనం అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే ఆ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం. మీ అందరి సలహాలను నేను గౌరవిస్తాను. నేను వినమ్రంగా చెప్పేది ఏమిటంటే, మేము ఎన్నికల్లో గెలిచినా, ఇన్ని సంవత్సరాల తర్వాత దేశంలోని ప్రజలు ఇంత పెద్ద ఆధిక్యం ఇచ్చినా, మీ సహకారం లేనిదే ఆ ఆధిక్యం అసంపూర్ణం. అందుకే మనందరం కలిసి నడవాలని నేను కోరుకుంటున్నాను. అవసరమైతే మీ మార్గదర్శకత్వాన్ని నేను కోరుకుంటాను.ఇది కొత్త విషయమేమీ కాదు.నరసింహారావు గారి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా ఒకరు జెనీవా సమావేశం హాజరవడానికి ఎన్నుకోబడ్డారు. పాకిస్తాన్ కి వ్యతిరేకంగా మద్దతు కూడగట్టే పని నరసింహారావు గారు అటల్ బిహారీ వాజ్పేయి గారికి ఇచ్చారు. వారిని ప్రతినిధి బృందంలో సభ్యుడిగా పంపి దేశానికి అవసరమైన పని చేశారు. కాబట్టి అలాంటి మంచి పనుల్ని మనం ఎప్పుడూ ప్రోత్సహించాలి. అలా చేయడం వల్ల మనం మన దేశం మేలు కోసం పని చేస్తున్నామని తెలుస్తుంది. దేశం, పార్టీ కంటే గొప్పది. ఈ విధమైన మంత్రాన్ని మనం అనుసరించాలి. ఆ మంత్రం ఈ పవిత్రమైన సభలో ప్రతిబింబించాలి.

మీ అందరి సహకారంతోనే సమస్యలని త్వరితగతిన, సునాయాసంగా పరిష్కరించడం సాధ్యమవుతుంది. ఆఖరి సంవత్సరం రాజకీయాలకి వదిలేద్దాం. కానీ మొదటి నాలుగు సంవత్సరాలు మనం దేశం మేలు గురించి, మన దేశం విధానాల గురించి ఆలోచిద్దాం. జయాపజయాలు చేదుని మిగిల్చ వచ్చు, కానీ వాటిని పక్కన పెడదాం. చేదు కొంత ఇంకవచ్చు. అంత ద్వేషం తో మనం ముందుకు వెళ్ళలేము. కానీ ఇది పెద్దల సభ. పెద్దల

సభలో వాతావరణం ఉన్నతంగా, ఉత్సాహంగా ఉండాలి. ఆ విధమైన వాతావరణాన్ని పెంపొందించడం కోసం మనందరం ప్రయత్నించాలి. నా దృష్టిలో కేవలం గెలిచిన పార్టీ యే కాదు, ఎన్నుకోబడిన ప్రతి సభ్యుడికి దేశం కలల్ని నిజం చేసే బాధ్యత ఉంటుంది. కాబట్టి ఆ బాధ్యత నిర్వర్తించడం కోసం మనం వేచి ఉండకూడదు. మరోసారి నా అభిప్రాయాలని ఈ సభలో వ్యక్తీకరించే అవకాశం లభించినందుకు ధన్యవాదాలు. నేను సభకి ఈ తీర్మానానికి సర్వ సమ్మతితో మద్దతు పలికి ఈ దేశానికి కొత్త దిశ, కొత్త శక్తిని ఇవ్వాలని కోరుకుంటున్నాను. ధన్యవాదాలు.

లోక్ సభ డిప్యూటీ స్పీకర్ ని అభినందిస్తూ

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి

ప్రసంగం.

13 ఆగస్టు 2014

లోక్ సభ డిప్యూటీ స్పీకర్ డాక్టర్ ఎం తంబిదురై గారికి అభినందనలు - 13 ఆగస్టు 2014

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఈ సభలోని ఉన్నత సాంప్రదాయాలను అనుసరించి మరొక్కసారి అన్ని పార్టీలు, సభ్యులందరూ కలిసి శ్రీ తంబి దురై గారిని ఏకగ్రీవంగా ఈ సభకి డిప్యూటీ స్పీకర్ గా ఎన్నుకున్నారు. నేను ముందుగా ఈ సభకు, ప్రత్యేకించి ప్రతిపక్షం లోని సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. శ్రీ తంబి దురై గారు ఇంతకు ముందు కూడా డిప్యూటీ స్పీకర్ గా ఈ సభకి మార్గదర్శకత్వం చేశారు, సభా కార్యకలాపాలు నిర్వహించారు. వారు ఒక సభ్యుడిగా కూడా చాలా చురుకుగా ఉండేవారు. ప్రతి విషయంపై వారికున్న జ్ఞానం వల్ల ఈ సభకు, దేశానికి ప్రయోజనం లభించింది. కొంత సమయం మంత్రిగా కూడా పని చేసి పరిపాలన వ్యవస్థ అనుభవం కూడా వారికి ఉంది. వారి మరో ప్రత్యేకత, వారు విద్యావేత్త కూడా. వారి విద్య, చాలా వైవిధ్యమైన విషయాలతో కూడుకున్నది. వారు విద్యావేత్త తో పాటు క్రియాశీల కార్యకర్త కూడా. అంతకంటే ఎక్కువ ఆయన వ్యవసాయ దారుడు కూడా. ఇన్ని వైవిధ్యాలు ఆయన జీవితంలో ఉన్నాయి. డిప్యూటీ స్పీకర్ గా వారు ఈ సభను సజావుగా నడపడంలో వారి మార్గ నిర్దేశం లభిస్తుందని నేను నమ్ముతున్నాను. నేను వారికి భరోసా ఇస్తున్నాను, వారికి ఉన్న బాధ్యతలను నెరవేర్చడానికి పాలక పక్షం వైపు నుంచి, ప్రభుత్వం వైపు నుంచి సంపూర్ణ సహకారం లభిస్తుంది. సభలో జరిగే చర్చల వాతావరణం లో మనకు లభించిన అనుభవాన్ని మరింత మెరుగుపరచడం లో మీ పాత్ర ఉంటుందని నేను నమ్ముతున్నాను. నా తరపున, ఈ సభ తరపున మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు, శుభాభినందనలు.

సాధ్వి నిరంజన్ జ్యోతి వ్యవహారంపై లోక్ సభలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రకటన.

5 డిసెంబర్ 2014

కేంద్రమంత్రి ఉపయోగించిన అభ్యంతరకర భాష పై లోక్ సభ లో ప్రకటన - 05 డిసెంబర్ 2014

పార్లమెంటులో ఈ సమస్య లేవనెత్తే ముందు నేను మా పార్టీ ఎంపీలతో సమావేశం అయినప్పుడు, చాలా కఠినమైన శబ్దాలతో చెప్పాను. ఈ విధమైన పదాలను, భాషను ప్రయోగించ వద్దని సలహా ఇచ్చాను. నా అసంతృప్తిని కూడా వ్యక్తం చేశాను. ఇలాంటి విషయాలని ఎవరూ ఆమోదించరు. ఆ తర్వాత మంత్రి గారు క్షమాపణ కోరారు. వారు కొత్తవారు. వారి సామాజిక నేపథ్యం మనకు తెలుసు. వారు గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు. అందుకే క్షమాపణ కోరారు. ఈ సభలోని సీనియర్ సభ్యుల నుంచి ఆశించేది ఏమిటంటే, సభలో ఒక సహచరుడు క్షమాపణ కోరినప్పుడు మనం దాన్ని ఉదారంగా స్వీకరించాలి.

కాబట్టి నేను ఈ సభలోని సభ్యులందరికీ, ఈ సభను పని చేయడానికి అనుమతించినందుకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా ఈ సభ ని, ఎందుకంటే మనం ప్రజా జీవితంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాం కాబట్టి, సభా మర్యాదలలో ఉండడం మన బాధ్యత, ఆ పరిమితుల్లోనే మనం మన మాటని చెప్పాలి. సభ లోపల కానివ్వండి లేదా బయట కానివ్వండి, మనం ఆ విధంగానే నడచుకోవాలి - ఆ విషయంలో ఏ విధమైన వివాదం లేదు. ఎప్పుడైతే మంత్రిగారు క్షమాపణ కోరారో వారు కొత్త మంత్రి కాబట్టి నేను సీనియర్ నాయకులు, వారి వారి పార్టీ సభ్యులు ఎవరైతే ఇక్కడ కూర్చుని ఉన్నారో వారందరికీ మనవి చేసేది ఏంటి అంటే, ఈ విషయాన్ని ఇంతటితో ముగించి, దేశ ప్రయోజనాల కోసం మనం పని చేస్తూ ముందుకు సాగాలి.

“

26/11 నిందితుడు జాకి ఉర్ రెహమాన్ లక్వికి పాకిస్తాన్ లో బెయిల్ ఇచ్చిన సందర్భంగా లోక్ సభలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రకటన.

19 డిసెంబర్ 2014

”

ముంబై దాడి నిందితుడికి పాకిస్తాన్ లో బెయిల్ ఇవ్వడంపై ప్రకటన - 19 డిసెంబర్ 2014

గౌరవనీయులైన మేడం స్పీకర్, బంగ్లాదేశ్ రాష్ట్రపతి గారు ఇక్కడికి వచ్చినందువల్ల నేను ఆయనతో సమావేశంలో బిజీగా ఉన్నాను. ఈ రోజు సభ పాకిస్తాన్ లో జరిగిన సంఘటన గురించి ఒకే స్వరం లో ఆందోళన వ్యక్తం చేసింది, ఖండించింది. భారత ప్రభుత్వం ఈ సంఘటన జరిగిన వెంటనే పాకిస్తాన్ కు కఠినమైన పదాలలో భారత్ భావాలను తెలియజేసింది. వారికి సందేశాన్ని అందించింది. ఇప్పుడే జరిగిన ఘోరమైన సంఘటన తర్వాత ఏ విధంగా అయితే పిల్లలను భయంకరంగా చంపడం జరిగిందో, పాకిస్తాన్ కు ఎంత బాధ కలిగిందో, భారత్ కు కూడా అంతే బాధ కలిగిందని వారికి చెప్పడం జరిగింది. భారత్ లోని ప్రతి బిడ్డ కళ్ళల్లో నీళ్లు వచ్చాయని,ప్రతి భారతీయుని కళ్ళల్లో అశ్రువులు వచ్చాయని సందేశాన్ని వెంటనే పంపించాము. ఈ విధమైన వైఖరి ప్రపంచంలోని ప్రతి మానవతావాదికి పెద్ద గాయం చేయనుంది. పాకిస్తాన్ కు సరైన సందేశం పంపించడం జరిగింది, ఈ సభ ఏ భావం అయితే వ్యక్తపరిచిందో, ఆ భావాలను గౌరవిస్తూ ప్రభుత్వం భవిష్యత్తులో చేపట్టే కార్యకలాపాలు అదే విధంగా ఉంటాయి. విదేశాంగ మంత్రి బంగ్లాదేశ్ రాష్ట్రపతి గారి పర్యటన వల్ల ఉన్న బాధ్యతలు తీరాక సోమవారం ఈ సభలో వివరంగా ఒక ప్రకటన చేసి ఈ సభకు, దేశానికి తెలియజేస్తారు.

2015



డిజిటల్ ఇండియా కార్యక్రమంలో ఉపన్యసిస్తున్న శ్రీ నరేంద్ర మోదీ.

"డిజిటల్ ఇండియా కోసం మన తపన ప్రతిచోట ఆవరించి ఉంది. అది మన జీవితాలను ఎన్నో విధాలుగా స్పృశిస్తూ, సులభతరం చేయనుంది."

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

27 ఫిబ్రవరి 2015

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 27 ఫిబ్రవరి 2015

నేను రాష్ట్రపతి గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియ చేయడానికి నిలబడ్డాను. అలాగే ఈ చర్చలో పాల్గొన్న గౌరవనీయ సభ్యులు అందరికీ నా కృతజ్ఞతలు. చాలా మంచి చర్చ జరిగింది. దాదాపు 60 మంది సభ్యుల అభిప్రాయాలు వినే అవకాశం నాకు లభించింది. దాదాపు 40 మంది గౌరవనీయ సభ్యులు రాతపూర్వకంగా వారి స్పందనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చాలా ఫలవంతమైన చర్చ జరిగింది, అనేక విషయాలు చర్చించబడ్డాయి. నేను, ప్రత్యేకించి ప్రతిపక్ష నాయకుడు శ్రీ ఖర్గే గారు, వేరే పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు వారివారి అభిప్రాయాలు ఇక్కడ వెల్లడించారు.

రాష్ట్రపతి గారు వారి ప్రసంగంలో దేశం ఏ సమస్యలను ఎదుర్కొంటుందో, ఆ సమస్యల పరిష్కారం దిశగా ఏం ప్రయత్నాలు జరుగుతున్నాయో, ఏ దిశలో జరుగుతున్నాయో, ఏ వేగంతో జరుగుతున్నాయో వివరించారు. కొంతమంది గౌరవనీయ సభ్యులకు ఇలా జరిగి ఉంటే బాగుండేది, అలా జరిగి ఉంటే బాగుండేది అని అనిపించి ఉండవచ్చు. నేను దీనిని సానుకూలంగా చూస్తాను. వారి అభిప్రాయాలు వ్యక్తపరిచిన గౌరవ సభ్యులు, వారు ఇటువైపు వారైనా సరే, అటువైపు వారైనా సరే, వారి ఆకాంక్షలకు ప్రాముఖ్యం ఉంది. మీ అంచనాలకు ప్రాముఖ్యం ఎందుకు ఉంటుందంటే బహుశా ఈ సమస్యలకు పరిష్కారం మా ప్రభుత్వ పదవీ కాలం లోనే జరుగుతుందన్న నమ్మకం మీకు ఉంది. ఇది మంచి విషయం.

కొంతమంది సభ్యులు, మేము పథకాల పేర్లు మారుస్తున్నామని అన్నారు. విషయం పథకానికి సంబంధించి లేదా పథకం పేరు కు సంబంధించి కాదు, ఆ సమస్యను ఈ పథకాల ద్వారా పరిష్కరిస్తున్నామా లేదా అనేదే ముఖ్యం.

పథకాలు కొత్తవా లేక పాతవా అనే విషయం పై వివాదం ఉండొచ్చు, కానీ సమస్య పాతదే అనే విషయం పై వివాదం లేదు. అందుకే మాకు వారసత్వంగా వచ్చిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో వాటికి మార్గాలు మేము వెతుకుతున్నాము. వారికి ఈ పథకం మాదే, కానీ పేరు మార్చబడింది అని అనిపించొచ్చు. నాకు అర్థం అయినంతవరకు ఇలాంటి విషయాల పై విమర్శలు జరగకూడదు. పైగా గర్వించాలి. మీరు సంతోషించాల్సిన విషయం ఏమిటంటే, ఈ సమస్యకి పరిష్కారం లో కొన్ని విషయాలు ఇక్కడి వారైనా సరే, అక్కడి వారైనా సరే, పాత వారైనా సరే, కొత్తవారైనా సరే, అందరి ఆలోచన ఒకే దిశలో ఉంది. ఇది చాలా మంచి విషయం అని నేను నమ్ముతున్నాను.

కొన్ని సందర్భాలలో మా పై చాలా విమర్శలు జరిగాయి. మేము స్వాతంత్ర్య ఉద్యమంలో ఎక్కడ ఉన్నామని అడిగారు. దానికి సమాధానంగా ఒక్కసారి అటల్ గారు సూటిగా జవాబు ఇస్తూ,1857లో స్వాతంత్ర్య సంగ్రామంలో మీరు ఎక్కడ ఉన్నారు అని అడిగారు. ఈ మాటలు కొంచెం సేపు బాగానే అనిపిస్తాయి. మీరు ఇప్పుడు నిర్మల్ భారత్ పై చర్చ అంటారు, మేము స్వచ్ఛ భారత్ తీసుకొచ్చామని అంటారు. 1999 లో అటల్ గారు తీసుకొచ్చిన టోటల్ శానిటేషన్ ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాంటప్పుడు నిర్మల్ భారత్ పథకానికి మరోపేరు అనుకోవచ్చా? అందుకే నేను చెప్పేది ఏంటంటే విషయం సమస్య గురించి. పేరు పెద్ద విషయం కాదు. అందుకే అపరిశుభ్రత మనదేశంలో ఒక సమస్య, అది మన మనస్తత్వంతో ముడిపడి ఉంది. నేను స్వచ్ఛత అభియాన్ గురించి మాట్లాడుతున్నప్పుడు పేదవారు నా మనసులో ఉంటారు.

వరల్డ్ బ్యాంక్ ఇచ్చిన నివేదిక ప్రకారం అపరిశుభ్రత వలన వ్యాధులు వ్యాపిస్తాయి. ఆ విధంగా ఒక పేదవాడు సంవత్సరానికి 7 వేల రూపాయలు ఖర్చు చేస్తున్నాడు. పరిసరాలని పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత. ఒక పేదవాడి కుటుంబంలో ఐదుగురు

సభ్యులు ఉన్నట్లయితే, వ్యాధుల చికిత్స కోసం 35 వేల రూపాయలు ఖర్చు పెట్టినట్టు. పరిశుభ్రత మహిళల గౌరవంతో పాటు ముడిపడి ఉంది. ఈరోజు కూడా గ్రామాలలో మన తల్లులు, సోదరీమణులు బహిరంగంగా మలవిసర్జన చేయవలసి వస్తుంది. వారు చీకటి పడే వరకు వేచి చూస్తారు. సమస్య ఇటువైపు అటువైపు అని కాదు, సమస్య ఉన్న తల్లులు, సోదరీమణుల గౌరవానికి సంబంధించినది, వారికి జీవించే హక్కు ఇవ్వడానికి సంబంధించి. అందుకే పరిశుభ్రత లాంటి విషయాలు మనకి గుర్తు వచ్చినప్పుడు ఈ పని మనం చేయాల్సిందిగా అనుకుంటాము. ఆడపిల్లలు పాఠశాలలో చదువు మానేస్తున్నారు ఎందుకు? ఒక ముఖ్యమైన కారణం మా దృష్టికి వచ్చింది ఏంటంటే ఆ పాఠశాలల్లో ఆడపిల్లలకి మరుగుదొడ్లు లేవు.

ఇక్కడ ఒకరిని నిందించడం కాదు. ఈ సమస్యకు పరిష్కారాన్ని వెతకాలి. అందుకే స్వచ్ఛత కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతున్నాం. ఎందుకంటే ఈ మూడు విషయాలు నన్నెప్పుడూ కదిలిస్తూ ఉంటాయి. స్వచ్ఛత కార్యక్రమం ఒక ప్రారంభోత్సవం కాదు. ఇది మనం నిరంతరం చేయవలసిన పని, ఇది మనందరం కలిసి చేయాల్సిన పని. మనలో ఎవరూ అపరిశుభ్రత ని ఇష్టపడరు. పరిశుభ్రత మనమే ప్రారంభించాలన్న స్పృహ మనకి లేదు. మన దేశంలోని నూట పాతిక కోట్ల దేశ వాసులను ఈ కార్యక్రమంతో మనం జోడించాలా వద్దా? నిన్న సుప్రియ గారు ఇది ఒక మంచి కార్యక్రమం అని, ఎంపీలు ఏవిధంగా ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని ఈ సభలో ఆమె అడిగినప్పుడు నాకు సంతోషం కలిగింది. మనకి MPLADS నిధులు లభిస్తాయి. సాధారణ ప్రజలు ఈ పనిని ఎంతగా ఇష్టపడుతున్నారో మన ఊహకి అందదు.

నన్ను ఒక మీడియా గ్రూప్ కి సంబంధించిన వ్యక్తులు కలిశారు. వారు కేదార్ నాథ్ లో జరిగిన విపత్తు లో పని చేశామని డబ్బులు వసూలు చేశామని, నాలుగు కోట్ల రూపాయలు

వసూలు అయ్యాయని చెప్పారు. అలాగే గుజరాత్ లో భూకంపం వచ్చినప్పుడు కూడా వారు పని చేశారని వారికి ప్రజలు 3 కోట్ల రూపాయలు సహాయం చేశారని చెప్పారు. ఇప్పుడు వారు స్వచ్ఛత కార్యక్రమం గురించి టీవీ ద్వారా ప్రచారం చేస్తున్నారు, వారికి నాలుగు వందల కోట్ల రూపాయలు ప్రజలు సహాయం చేశారు. రాజకీయాలలో ఎవరైతే ఉన్నారో, వారు ఓట్ల కోసం ఈ పని చేసినా, సమాజానికి ఈ పని ఎంతో నచ్చుతుంది. వారు సమాజ సేవ చేసినా, ఇంతకంటే తృప్తిన్నిచ్చే పని మరొకటి ఉండదు. కాబట్టి పేరు ఏదైనా ఉండొచ్చు, వీటన్నిటికీ అతీతంగా ఈ సమస్యని పరిష్కరించడానికి మనం దృష్టి సారించాలి. అలా చేసినట్లయితే మనం చాలా సాధించగలం.

గౌరవనీయులైన ములాయం సింగ్ గారు నిన్న ఒక మంచి విషయం చెప్పారు. వారు ఏమన్నారంటే మోడీ గారు స్వచ్ఛత గురించి మాట్లాడుతున్నారు. వారు అస్సీ ఘాట్ ని శుభ్రపరచడానికి వెళ్లారు. ఇప్పటి వరకు ఆ పని పూర్తి కాలేదు. ఆ మాట విని నాకు నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. వారు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వం రిపోర్ట్ ఇస్తున్నారో? లేక కేంద్ర ప్రభుత్వం రిపోర్టు ఇస్తున్నారో అర్థం కాలేదు. దాదాపు మూడు నెలలుగా అస్సీ ఘాట్ ని శుభ్రపరచడం జరుగుతుంది. మీరు ఊహించగలరు అక్కడ ఎంతగా చెత్త పేరుకుపోయిందో. ఈ అస్సీ ఘాట్ వల్లనే వారణాసికి ఒక గుర్తింపు ఉంది. నేను మీకు కృతజ్ఞుణ్ణి. ములాయం సింగ్ గారు, లోహియా గారు కూడా స్వచ్ఛత ని ఒక ఉద్యమం లా చేసేవారు. మీరు లోహియా గారి మాటలు విన్నట్లయితే వారు మహాత్మాగాంధీ తరువాత స్వచ్ఛత ని పాటించాలని గట్టిగా మాట్లాడిన వ్యక్తి. ఈ విషయం లోహియా గారు మాట్లాడారు కాబట్టి మోడీ గారు ఆ విషయాన్ని పట్టించుకోకూడదని ఏమీ లేదు. లోహియా గారు ఒక మంచి మాట చెప్పినట్లయితే మోడీ గారు ఆ మార్గంలో నడవడానికి గర్వపడాలి. కాబట్టి మీరు చూడండి ఎంత చెత్త పేరుకుపోయిందో, ఎంత కాలం తర్వాత అక్కడ శుభ్రం చేయబడుతుందో?

విదేశాలలో మన రాయబార కార్యాలయాలు ఉన్నాయి. సుష్మ గారు అన్ని దేశాల లోని రాయబార కార్యాలయాల కు ఉత్తరాలు రాశారు. భారతదేశంలో స్వచ్ఛత కార్యక్రమం ప్రారంభం అయింది. మీరు మీ కార్యాలయాల పరిస్థితి చూడండి అని. ఆ తర్వాత నాకు రాయబార కార్యాలయాల నుంచి ఫోటోలు వచ్చాయి, ఆ కార్యాలయాలు ముందు ఎలా ఉండేవో, తర్వాత ఎలా ఉన్నాయో అందులో చూపించారు. ఎక్కడ మన వారు ఉండేవారో, అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి, కాగితాలు నీటిలో నాని రాయిలా తయారయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాట్లు లేవా? కానీ స్వభావం లేదు.

అందుకే ఈ పవిత్రమైన పనిని మేము చేస్తున్నాం. ఈ పని, ప్రభుత్వానిదో, ప్రభుత్వం పెద్దదో కాదు. ఈ పని 125 కోట్ల దేశ ప్రజలది. మీరు ఏ పేరుతో అయితే ఈ పనిని మొదలుపెట్టారో అందుకు నేను నమస్కరిస్తున్నాను. మీరు ఇంతవరకు ఏదైతే చేశారో దానికి నేను వందనాలు తెలుపుతున్నాను. ఈ విషయంలో ఏ విధమైన వివాదం లేదు. అందుకే ఎర్రకోటపై నుంచి కూడా ఈ మాట చెప్పే సామర్థ్యం నాకు ఉంది. ఈ దేశంలో ఇప్పటి వరకు వచ్చిన ప్రధాన మంత్రులు, ఇప్పటి వరకు పనిచేసిన ప్రభుత్వాలు వారందరూ కూడా ఇచ్చిన తోడ్పాటు వల్లే మనం ముందుకి వెళ్ళగలిగాము. ఎర్రకోట పైనుంచి మన దేశంలోని అన్ని ప్రభుత్వాల గురించి నేను మాట్లాడాను. నేను మరో విషయం కూడా చెప్తాను. 9 నెలల్లో మేము వచ్చాక అన్నీ చేశామని మేము చెప్పడం లేదు, 1947, 15 ఆగస్టున ఈ దేశం పుట్టిందని మేము అనడం లేదు. ఈ దేశం వేల సంవత్సరాల వారసత్వం కలిగి ఉన్నది. ఋషులు, మునులు, ఆచార్యులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు వీరందరూ కూడా ఈ దేశాన్ని నిర్మించారు, ప్రభుత్వాలు కాదు. ప్రభుత్వాలు మారుతుంటాయి. దేశాన్ని ప్రభుత్వం తయారు చేయదు. దేశం, జనాల శక్తి, సామర్థ్యాలతో తయారవుతుంది.

దేశం ఒక విధానం వల్ల నడుస్తుంది. ఒక తత్త్వం వల్ల నడుస్తుంది. భావజాలం మారుతూ ఉంటుంది. ఈ దేశాన్ని ఒక మూలతత్వం నడిపిస్తుంది. ఆ మూలతత్వం ఏంటంటే

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఇది భారత్ మూలతత్వం

సర్వే భవంతు సుఖినః

సర్వే సంతు నిరామయాః

సర్వే భద్రాణి పశ్యంతు

మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్

ఇది భారతదేశం మూల మంత్రం. అందరి మేలు గురించి ఇక్కడ చెప్పడం జరిగింది. అందుకే ఈ దేశం ఎక్కడికి చేరుకుందో, ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, ఏర్పడతాయి, పడి పోతూ ఉంటాయి, కానీ వీటి మీద ఆధారపడి దేశం తయారు కాదు. కొంతమంది ఢిల్లీలో ఉన్నారు, నాకేం అవుతుంది అనుకుంటున్నారు. నేను అడుగుతున్నాను, గత మూడు వారాలలో మధ్యప్రదేశ్ లో వేరువేరు ఎన్నికల ఫలితాలు వచ్చాయి. పంచాయతీలు, పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థల ఫలితాలు వచ్చాయి. ఏం జరిగింది? అస్సాంలో గొప్ప విజయం లభిస్తుండగా ఏం జరిగింది? పంజాబ్, రాజస్థాన్ లో మనం చూద్దామా? ఇవన్నీ మాట్లాడడానికి బాగుంటాయి.

ఇదే ముఖ్యమైతే మీరు భూసేకరణ చట్టం తీసుకుని మైదానంలో దిగారు. చరిత్రలోనే కాంగ్రెస్ కి ఇన్ని తక్కువ సీట్లు రాలేదు. గతంలో ఎమర్జెన్సీ తరువాత కూడా కాంగ్రెస్ పరిస్థితి ఇంత హీనంగా లేదు. మీరు చట్టాలు తీసుకు వచ్చి గెలవాలనుకుంటే, రైతులకి అది నచ్చి

ఉంటే, మీరు గెలిచి ఉండేవారు. ఆ తర్కాన్ని చెప్పడానికి బాగానే ఉంటుంది కానీ, ఆ తర్కం తో మీరు నిజాన్ని నిరూపించలేరు. అందుకే మేము సమస్యలకి పరిష్కారాలు వెతుకుతున్నామని చెప్పదలుచుకున్నాను. ఇక్కడ మేధోమథనం చేసి మార్గాలు వెతకాలి.

కొన్ని సందర్భాలలో మేము MNREGA ని ఆపు చేస్తామనో లేక ఆపు చేశామనో చెప్తారు. నేను ఒక విషయాన్ని నమ్ముతున్నాను, నా సామర్థ్యంపై మీకు అనుమానం ఉండొచ్చు. మీకు నా గురించి వేరు వేరు అభిప్రాయాలు ఉండొచ్చు. మోదీకి ఈ విషయాల పట్ల ఎక్కువ అనుభవం కానీ జ్ఞానం కానీ లేదని మీరు అనుకోవచ్చు, కానీ ఒక్క విషయం మీరు ఖచ్చితంగా ఒప్పుకుంటారు. నాకు రాజకీయ జ్ఞానం బాగానే ఉంది, నా రాజకీయ వివేకం ఏం చెబుతుందంటే MNREGA ని ఎప్పటికీ ఆపు చేయవద్దని. ఆ విధమైన తప్పు నేను చేయను. ఎందుకంటే MNREGA మీ వైఫల్యాల సజీవ స్మారక చిహ్నం. 60 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా మీరు ప్రజల్ని గోతులు తవ్వడానికి పంపుతున్నారు అంటే అది మీ వైఫల్యాల స్మారక చిహ్నం, ఈ విషయాన్ని నేను డోలు కొట్టి మరి చెప్తాను. మీరు తవ్వుతున్న గోతులు ఆ 60 సంవత్సరాల పాపాల ఫలితం అని ప్రపంచానికి చెప్తాను. అందుకే నా రాజకీయ చతురత పై మీరు సందేహించవద్దు. MNREGA ఉంటుంది, శోభాయమానంగా, హుందాగా, డోలు కొట్టి మరీ ప్రపంచానికి దీని గురించి చెప్పబడుతుంది.

ఒక విషయం ఖచ్చితంగా జరుగుతుంది. ఎందుకంటే నేను దేశం మేలుకోసం జీవిస్తాను. దేశం కోసమే జీవించాలి అనుకుంటున్నాను కాబట్టి ఆ పథకం ద్వారా పేదలకు ఎక్కువ మేలు ఎలా చేయవచ్చు? అందులో ఇంకేమైనా జోడించవలసి వస్తే జోడిస్తాం. అందులో నుంచి ఏమి తొలగించం, మీరు చింతించకండి. ఏదైనా సాధించాలంటే నా శక్తిని అందులో జోడించి మేము ప్రజలకి అందిస్తాం. భవిష్యత్తులో ఈ విధమైన శిధిలాలను ఎవరు వదిలివెళ్లారు అని ఆలోచించాలి. ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా గోతులు తవ్వడానికి

ఎవరు బలవంతం చేశారో, దేశానికి తెలియాలి. ఇది వారికి తెలియడం అవసరం. మీరు మీ అడుగుజాడలు వదిలి ఒక మంచి పని చేశారు, తద్వారా ప్రజలకు మీ గురించి తెలుస్తుంది.

మనం తరచుగా అవినీతి గురించి చర్చిస్తాం. అవినీతి మన దేశాన్ని సర్వ నాశనం చేసిందని నేను నమ్ముతున్నాను, అవినీతిపై చర్చ రాజకీయ దృష్టికోణంలో చేయకూడదు. ఎందుకంటే ఆ విధంగా చర్చించడం ద్వారా ఈ భయంకరమైన సమస్య అలాగే ఉండి పోతుంది.

మనం ఒకరిని ఒకరు విమర్శించుకోవడం లో గడిపేస్తాం. ఎవరి చొక్కా ఎక్కువ తెల్లగా ఉందో ఆ విషయానికే మనం పరిమితమై ఉంటాం. నేను అటువైపు ఆరోపణలు చేస్తే, వారు ఇటువైపు ఆరోపణలు చేస్తారు, దోచుకునేవారు దోచుకుంటూనే ఉంటారు. మనము అందరము కలిసి పాత అవినీతి గురించి ఏమి చేయగలమో నిర్ణయించాలి. మనమందరం కలిసి అవినీతి జరగకూడదని అనుకుంటే, అవినీతి ఆగిపోతుంది. దేశంలో, రాజకీయాలకి అతీతంగా ఏ సమస్య లేదా? దేశంలో ఒకరిని ఒకరు నిందించు కోకుండా సమస్యలకి పరిష్కారం వెతకలేమా? అవినీతి ఒక సమస్య. ఆ సమస్య కి పరిష్కారం వెతకడం, పరిపాలన వ్యవస్థలో కూర్చున్న వారి బాధ్యత. దేశాన్ని విధాన ఆధారంగా గడపాలి. ఎప్పుడైతే దేశం ఒక విధానాన్ని అనుసరిస్తుందో, అప్పుడు లోపాలకి తక్కువ ఆస్కారం ఉంటుంది. మాకు ఆ భగవంతుడు చాలా తెలివితేటలు ఇచ్చాడు, మేము తీసుకు రాబోయే చట్టాలలో లేదా విధానాలలో ఏ విధమైన లోపం ఉండదు అని నేను చెప్పడం లేదు. మనుషులకి అంత సామర్థ్యం లేదు. ఈరోజు సమస్య ఉండకపోవచ్చు. కానీ రాబోయే ఐదు లేదా ఏడు సంవత్సరాల తర్వాత సమస్య బయటికి రావచ్చు. కానీ లోపాలు తక్కువగా ఉంటే, అప్పుడు అధికార యంత్రాంగం ఆ విషయాన్ని వారికి ఇష్టం వచ్చినట్టు అర్థం వివరించే అవకాశం ఉండదు. అలాగే, వారి ఇష్టానుసారం ప్రాధాన్యతని నిర్ధారించే అవకాశం ఉండదు. అందుకే ప్రభుత్వాలు విధానాల పై ఆధారపడే నడవాలి. ఒక వ్యక్తిపై ఆధారపడి దేశం నడవదు,

ప్రభుత్వాలు నడవవు. అలాగే అన్ని విషయాలు రాజ్యాంగ పరిధిలోనే ఉండాలి. అప్పుడే సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి.

ఉదాహరణకి బొగ్గు కేటాయింపుని చూసినట్లయితే సి ఏ జి నివేదిక తయారు చేస్తున్నప్పుడు, నివేదిక తయారు చేస్తున్న వారికి కూడా అనిపించి ఉండవచ్చు ఇంత పెద్ద కుంభకోణం ఎలా జరిగింది అని. ఇంతకుముందు 600 కోట్ల కుంభకోణం, 500 కోట్ల కుంభకోణం విన్నాం. కానీ ఒక లక్షా 86 వేల కోట్ల కుంభకోణం దేశాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. రాజకీయాలలో విమర్శించడానికి ఇవి ఉపయోగపడతాయి కానీ మనసులో కూడా ఒక లక్షా 86 వేల కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుంది అని ఒక అనుమానం ఉంటుంది. ఇప్పుడు బొగ్గు కేటాయింపు జరిగింది. 204 గనుల అనుమతి సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇప్పటివరకు 18 లేక 19 గనులు వేలం వెయ్యడం జరిగింది. అందులో దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయలు లభించాయి. అవే 204 గనుల వేలం జరిగితే, CAG ఎంత ఆలోచించిందో, అంతకంటే ఎక్కువ ఆదాయం ఈ వేలం పాట ద్వారా లభించనుంది. ఆ సమయంలో శూన్య సిద్ధాంతం నడిచింది.

ఇది వారి సమయంలో జరిగిందని నేను అన దలుచుకోలేదు. వారు ఏమి చేయాలి అనేది నా పరిధి కాదు. అది వారికీ, వారి పరమాత్మ కి తెలుసు. కానీ మనం ఈ దిశలో వెళ్ళినట్లయితే, మనం మార్గాలు అన్వేషించవచ్చుఅని నేను అనుకుంటున్నాను. మార్గాలు అన్వేషించి, మన వ్యవస్థలని అవినీతి నుంచి విముక్తి చేయవచ్చు. ఎలాంటి వ్యవస్థలలో అయితే అవినీతి చేయడానికి తక్కువ ఆస్కారం ఉంటుందో? అలాంటి వ్యవస్థలన్నీ అభివృద్ధి చేయడానికి మీరు ఉత్తమమైన సూచనలు చేయండి. ఈ విషయాన్ని చర్చించడానికి మీరు నా సమయం కోరవచ్చు. నేను మీకు సమయం ఇచ్చి ఆ విషయాన్ని మీ నుంచి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. మీరు కూడా మాకు మార్గనిర్దేశం చేయండి. ఈ

భయంకరమైన సమస్య నుండి బయట పడడానికి ఈ మార్గాలు ఉన్నాయి అని మీరు వివరించండి. పాలనా వ్యవస్థ ఆ సమస్యని చూసుకుంటుంది కానీ మనం అందరము కలిసి ఈ చెడు నుంచి మన దేశానికి విముక్తి కలిగించడానికి ప్రయత్నాలు చేయాలి.

చాలామంది గౌరవనీయ సభ్యులు నల్లధనం గురించి చర్చించారు. ఎవరైతే నల్లధనం గురించి చర్చించడానికి సంకోచించే వారో, నల్లధనం గురించి ప్రస్తావించినప్పుడు ఎవరి మొహం రంగు మారేదో, వారి నోటి నుంచి నల్లధనం గురించి వింటున్నప్పుడు చాలా సంతోషం కలుగుతుంది. ఎంత ఆనందం అంటే దాన్ని ఊహించలేము. మన దేశానికి చెందిన నల్లధనంపై వారు బలవంతంగా మాట్లాడాల్సి రావడం మన గొప్ప విజయం అని నేను నమ్ముతాను.

సుప్రీం కోర్టు గురించి చాలా చర్చలు జరుగుతాయి. కానీ సుప్రీం కోర్టు, నల్లధనంపై సిట్ ని ఏర్పాటు చేయమంటే, మనం సుప్రీంకోర్టు ఆదేశాన్ని గౌరవించ లేకపోయాము. సుప్రీం కోర్టు నల్లధనంపై సిట్ ని ఏర్పాటు చేయమని అన్నప్పుడు ఆలస్యం చేయకుండా మనం సిట్ ని ఏర్పాటు చేయవలసింది. మూడు సంవత్సరాల వరకూ సిట్ నీ ఏర్పాటు చేయలేదు. సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాత కూడా ఏర్పాటు చేయలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి క్యాబినెట్ సమావేశంలో నల్లధనంపై సిట్ ని ఏర్పాటు చేయ్యాల్సిందిగా మొదటి నిర్ణయం చేశాము.

నల్లధనం పై చర్చ జరిగినప్పుడు, స్విస్ బ్యాంక్ కూడా చర్చకు వస్తుంది. నేను శ్రీ అరుణ్ జైట్లీ గారిని అభినందిస్తున్నాను,వారు ఈ చట్టాన్ని అధ్యయనం చేశారు. అంతర్జాతీయ చట్టాలను కూడా అధ్యయనం చేశారు, స్విట్జర్లాండ్ ప్రభుత్వాన్ని ముఖ్యమైన సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవడానికి ఒప్పించారు. కాబట్టి ఆ బ్యాంకుల వద్ద ఉన్న సమాచారం

రాబట్టడానికి మనకు మార్గాలు తెరిచి ఉన్నాయి. ఈ సందర్భంగా నేను ఆర్థిక మంత్రి గారిని అభినందిస్తున్నాను.

అలాగే జీ-20 లో మీరూ వెళ్లేవారు.నేను మొదటి సారి వెళ్ళాను,చాలామంది మొహాలు మొదటి సారి చూసే అవకాశం లభించింది. మనకి జీ-20 ఉపయోగం ఏమిటి? జీ-20 సమావేశం లో చేసిన సంయుక్త ప్రకటన ఏదైతే ఉందో, అందులో మనం నల్లధనం, మత్తుపదార్థాల రవాణా కి వ్యతిరేకంగా జీ-20 చర్యలు తీసుకోవాలని కోరాము. ఆ దిశగా మేము తోడ్పాటును అందజేస్తామని, నల్లధనాన్ని నిరోధించడానికి ఒకరికి ఒకరు పరస్పర సహాయం చేసుకుంటామని, ఎక్కడైతే ఒత్తిడి అవసరం ఉంటుందో, అక్కడ ఒత్తిడి చెయ్యాలని జీ-20 సమావేశంలో నిర్ణయించడం జరిగింది.

ఆ దిశగా మా ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. మేము వెనకడుగు వేయం, ఎవరూ కూడా దీని నుంచి తప్పించుకోలేరు. నేను చెప్తున్నాను, మీరు దయచేసి దీనిని ప్రతీకార చర్యగా చిత్రించవద్దు. మేము వాగ్దానం చేసి వచ్చాము, ఎవరైతే ఆ పని చేశారో వారు రాజకీయ నాయకులే కానక్కర్లేదు. ఎవరైనా అయి ఉండవచ్చు. దేశానికి నష్టం వాటిల్లింది అందుకే అన్ని రకాల సంకల్ప శక్తి మనకి అవసరం. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, మేము తీసుకుంటున్నాం. అంతిమ విజయం సాధించేవరకు ప్రయత్నిస్తూనే ఉంటాము. ఈ సందర్భంగా నేను ఈ సభకు భరోసా ఇస్తున్నాను.

కొన్నిసార్లు, మేము కొత్తగా ఏమి చేసాము అని అడుగుతుంటారు. నేను పని ఎలా చేయాలో, ఒక ఉదాహరణ చెప్తాను. ఒకవైపు మనం రైతుల గురించి చాలా మాటలు మాట్లాడతాం. కానీ రైతులకు ఉన్న సమస్యల నుంచి వారిని బయటకు తీసుకురావడానికి మనం దారులు అన్వేషించాలి. ఎన్నో పరిష్కారాలు ఉన్నాయి. మేము ఫర్ డ్రాప్ మోర్ క్రాప్

అనే కార్యక్రమాన్ని ప్రారంభించాము. మనదేశంలో నీటి కొరత ఉంది. ప్రపంచమంతా ఈ సమస్యను ఎదుర్కోబోతుంది. రాబోయే 30,40 సంవత్సరాలలో మనకు ఎదురు కాబోయే సమస్యల గురించి కొన్ని విషయాలు చేపట్టడం ప్రభుత్వం బాధ్యత కాదా? కేవలం తాత్కాలిక ప్రయోజనం కోసమే పని చేస్తామా? అలా చేస్తే బహుశా రాజకీయంగా ప్రయోజనం జరగొచ్చు. కానీ దేశ విధానం ఆ త్రాసులో తూగదు.

మేము సాయిల్ హెల్త్ కార్డ్ గురించి మాట్లాడాము. సాయిల్ హెల్త్ కార్డ్ ద్వారా మేము ఒక మంత్రాన్ని ఇచ్చాము "ఆరోగ్యకరమైన భూమి, పచ్చని పొలం" కానీ ఈ పనిని విజ్ఞాన్ భవన్ లో రిబ్బన్ కత్తిరించి, జ్యోతి వెలిగించి చేయలేము. మేము అధికారులకు సూచనలు ఇచ్చాము. మనం డాక్టర్ల వద్ద కి వెళ్లేముందు రక్త పరీక్ష చేయించుకోమని చెప్తారు. మూత్ర పరీక్ష కూడా చేయించుకోవాలి అంటారు. ఆ తర్వాత మనకు మందులు రాసి ఇస్తారు. అప్పటివరకు వారు మనకి మందులు ఇవ్వరు. ఏ విధంగా అయితే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఇవి అవసరమో, అదే విధంగా మనదేశంలోని రైతులకి ఈ మాట చేరాలి. వారి పంట వేసే ముందే భూమి నుంచి ప్రయోజనం పొందే ముందే ఆ నేల ఆరోగ్యం ఎలా ఉందో వారు ముందే తెలుసుకోవాలి. భూమిని మనం భరతమాత అంటాము. ఆ మట్టి పరిస్థితి ఎలా ఉంది? దాని గురించి మనం ముందే తెలుసుకోవాలి. మన పాపాల వల్ల మనభూమి అనారోగ్యంతో అయితే లేదు కదా? మనం చాలా ఎక్కువ మోతాదులో వాడే యూరియా గురించి మాట్లాడుకుందాం. యూరియా వాడకం వల్ల మన భూమిని మనం నాశనం చేసుకున్నాం. ఇది మనకి ఎప్పుడు అర్థమవుతుంది? మనం మట్టిని ఎప్పుడైతే పరీక్షిస్తామో అప్పుడు తెలుస్తుంది. ఇప్పుడు మట్టిని పరీక్షించి కార్డు ఇవ్వడం తో పని అయిపోయినట్టు కాదు. ప్రతీ గ్రామంలో మట్టిని పరీక్షించే ప్రయోగశాలల కోసం వ్యవస్థాపకులు కావాలి అని నేను సూచించాను.

గ్రామంలో ఉన్న చదువుకున్న యువత కి ఆ దిశగా శిక్షణ ఇవ్వాలి. గ్రామాల్లో ప్రయోగశాలలు నెలకొల్పడానికి యువతకు బ్యాంకు నుంచి రుణాలు మంజూరు చేయాలి.

దానిద్వారా గ్రామంలోని ప్రజలకు ఆ ప్రయోగశాలకు వెళ్లే అలవాటు అవుతుంది. ప్రతి సంవత్సరం కంటే ముందు వారి వారి నేలని ఒకసారి పరీక్ష చేయించుకోవాలి, తద్వారా మార్గదర్శకత్వం పొంది సూక్ష్మ పోషక వివరాలు తెలుసుకోవాలి.

అదేవిధంగా, మన వద్ద పదో తరగతి, 12వ తరగతి వరకు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించి ప్రయోగశాలలు ఉన్నాయి. అలాగే విజ్ఞాన కళాశాలల వద్ద కూడా ప్రయోగశాలలు ఉన్నాయి. మన దేశంలో ఆ ప్రయోగశాలలు ఫిబ్రవరి నుంచి జులై వరకూ మూసి ఉంటాయి, ఎందుకంటే విద్యార్థులు పరీక్షలు ఇస్తారు. స్కూలు జూన్, జులై మాసంలో తెరుస్తారు. కాబట్టి నాలుగు ఐదు నెలలు ఈ ముఖ్యమైన సమయం లో ఈ స్కూళ్ల ప్రయోగశాలలు ఖాళీగా ఉంటాయి. నేను చెప్పినట్టుగా పదవ తరగతి విద్యార్థులకు కూడా మట్టిని పరీక్షించే టెక్నాలజీ నేర్పవచ్చు. ఎందుకంటే అది కఠినమైన టెక్నాలజీ కాదు, చాలా సులువుగా చేయవచ్చు. వారికి శిక్షణ ఇచ్చి స్కూల్లో వారికి సెలవులు ఉన్నప్పుడు ఆ ప్రయోగశాలలను మట్టిని పరీక్షించే ప్రయోగశాలలుగా మార్చవచ్చు. దీని ద్వారా ఆ పాఠశాలలకు ఆదాయం లభించడంతో పాటు ఆ గ్రామంలోని యువకులకు కూడా ఆదాయం లభిస్తుంది, గ్రామ ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. మన దేశం పేద దేశం. రాత్రికి రాత్రి మనం డబ్బులు ఖర్చు పెట్టి ప్రయోగశాలలు నెలకొల్పవచ్చు. కానీ మన వద్ద ఉన్న మౌలికసదుపాయాలని గరిష్ఠంగా ఉపయోగించాలి. ఇది సుపరిపాలన. ఇవే మంచి పద్ధతులు. ఈ పద్ధతుల ద్వారా మనం సమస్యలకి పరిష్కారం కనుగొనవచ్చు. ఒక్కసారి మన రైతులకు ఈ విషయం తెలిశాక, వారు వేయబోయే పంటలకు వారి నేల అనువైనవో, కాదో? తెలుసుకోగలిగితే మన రైతులు, వెంటనే మరింత విశ్వాసం తో పని చేస్తారు. ఈరోజు రైతులకు ఏదైతే ఖర్చు అవుతుందో, ఆ ఖర్చు ఆదా అవుతుంది.

అంతర్జాతీయంగా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గినప్పుడు ఇక్కడ ఎందుకు తగ్గించలేదని అడిగారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఇక్కడ కరువు పరిస్థితి ఉండేది.12 శాతం వర్ష పాతం తగ్గింది. అప్పుడు మేము డీజిల్ పై ఏదైతే సబ్సిడీ ఇస్తున్నామో, దాన్ని 50 శాతం పెంచాలని, అలాగే విద్యుత్ చార్జీలపై కూడా 50 శాతం సబ్సిడీ పెంచాలని నిర్ణయించాము. దానివల్ల డీజిల్ పై ప్రభుత్వానికి ఎక్కువ ఆర్థిక భారం పడింది. రైతులకి మేము సహాయం అందించాం. ఎవరైతే మేము సహాయం చేయమని అంటున్నారో, వారు గత మే, జూన్, జూలై నెలలు గుర్తుంచుకోరు. వారు కేవలం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాలనే గుర్తు తెచ్చుకుంటారు. ఈ ప్రభుత్వం ఎవరి కోసం? ఇది పేదల ప్రభుత్వం. పేదల కోసం అంకితమైన ప్రభుత్వం.

మేము ఖర్చులు తగ్గించడానికి ఒక కమిషన్ ని ఏర్పాటు చేశాం.ఎందుకంటే పరిపాలనా వ్యవస్థలో ఎన్నో అనవసరపు ఖర్చులు అవుతున్నాయి, వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది. అలా చేస్తే ఆ నిధులు పేదవారికి ఉపయోగపడతాయి. పేద వారి సంక్షేమానికి ఉపయోగపడతాయి. ఆ దిశగా మేము దృష్టి సారిస్తున్నాము, సుపరిపాలన వైపు వెళ్తున్నాం.

మేము ఎలాంటి వాళ్లమో చూడండి, మీరు ఇప్పుడు మీ కాలం నుంచే ఇలా ఉందని చెప్పలేరు. నాకు అర్థం కాని విషయం ఏమిటంటే నా చిన్నప్పటి నుంచి జిరాక్స్ సదుపాయం ఉండేది. అయినా సర్టిఫికెట్లను ధృవీకరించడానికి ఒక గెజిటెడ్ అధికారి వద్దకి వెళ్ళవలసి వచ్చేది. ఒక ఎమ్మెల్యే ఇంటి బయట గాని లేదా మీ ఎంపీ ఇంటి బయట గాని క్యూలో నిలబడవలసి వచ్చేది. ఎమ్మెల్యేలు, ఎంపీలు లేనప్పుడు వారి సహాయకుడు ముద్రవేసి, మీ సర్టిఫికెట్ బాగానే ఉంది అని చెప్పేవాడు. మనం ఆ వ్యక్తిని నమ్ముతాము, కానీ మన దేశ

పౌరులను నమ్మడం లేదు. అందుకే, మేము వచ్చాక నియమాన్ని మార్చి స్వీయ ధ్రువీకరణ చేసుకునే వీలు కల్పించాము. పని పూర్తయ్యాక అసలు పత్రాలని చూపించాలి.

మీకు ఇది చిన్న విషయంలా అనిపించొచ్చు కానీ ఈ దేశ సామాన్య పౌరుడి పై ఈ ప్రభుత్వం నమ్మకం ఉంచుతుందన్న భరోసా ఈ పని వల్ల నిరూపించబడింది. మన వద్ద ఒక్కొక్క పనికి 30 నుంచి 40 పేజీల దరఖాస్తులు నింపవలసి వచ్చేది. మేము అధికారంలోకి రాగానే అంత పొడవైన దరఖాస్తుల వల్ల ప్రభుత్వం ఫైళ్లు పెరుగుతాయి కాబట్టి వీలైనంత వరకూ ఆన్లైన్ చేయాల్సిందిగా, తక్కువ పేజీలు ఉంచవలసిందిగా ప్రయత్నం చేశాం. ఎన్నో చోట్ల దరఖాస్తు పొడవు కేవలం ఒక పేజీకి పరిమితం చేశాము. మేము వ్యవస్థలని సరళీకరణ చేయడంలో విశ్వసిస్తున్నాము. అలాగే ప్రభుత్వ వ్యవస్థలో రెడ్ టేపిజం ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాము. దీని వల్ల సామాన్య ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఆ దిశలో మేము చర్యలు చేపడుతున్నాం. ఒకదాని తర్వాత ఒకటి చేస్తూనే ఉంటాం, వీటి వల్ల ప్రయోజనం లభించబోతుంది.

పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు ప్రతి సంవత్సరం పెన్షన్ తీసుకోవడానికి నవంబర్ నెలలో సజీవంగా ఉన్నట్లు రుజువు ఇవ్వాలి. అలాగే మాజీ ఎంపీలు కూడా ఇవ్వాలి. వారు కార్యాలయానికి వెళ్లి ఈ పని చేయాలి. ఒక వయసు వరకు ఇలా చేయడం పర్వాలేదు. ఆ వంకతో వారు బయటికి వెళ్ళ వచ్చు, కానీ ఒక వయసు దాటాక ఇలా చేయడం సాధ్యం కాదు. మనం ఇలాంటి వ్యవస్థలను మార్చలేము. మేము టెక్నాలజీని ఉపయోగించి ఇంట్లోనే కూర్చుని, వారు జీవించే ఉన్నారని రుజువు చేయవచ్చు. వారి పెన్షన్ వారికి లభిస్తూనే ఉండేలాగా ఒక యంత్రాంగాన్ని తయారు చేసాం. మనం మన పేద పెన్షన్ దారులకు గౌరవం ఇవ్వలేమా?

మీరు అనొచ్చు ఇంత పెద్ద దేశంలో మోడీ చిన్న చిన్న మాటలు మాట్లాడుతున్నారు అని. సమస్యల వేళ్ళు చిన్నగానే ఉంటాయి, ఆ తర్వాత అది ఒక పెద్ద వటవృక్షంగా మారుతుంది, విషవృక్షం గా మారిపోతుంది. ఆ తర్వాత సమస్యలతో అందరినీ చుట్టేస్తుంది. అందుకే ఇలాంటివి చేయడం అవసరం.

నాకు గుర్తుంది, గత సమావేశంలో మమ్మల్ని అవహేళన చేశారు. ఏ విధమైన భాష అయితే మా పట్ల ఉపయోగించారో, అది సరైనదో కాదో నాకు తెలీదు. నేను పార్లమెంటుకు రావడానికి వారు వీసా ఇస్తున్నట్లు కూడా చెప్పారు. ఈ విధమైన భాష ఉపయోగించే వారికి నేను ఏమి చెప్పదలుచుకోలేదు. కానీ అంతర్జాతీయ ప్రదేశాలలో కొన్ని చేయవలసిన పనులు ఉంటాయి. ఆ సమావేశాలలో ప్రధాన మంత్రులు వెళ్ళవలసి ఉంటుంది. ఈ ప్రధానమంత్రి కూడా వెళ్లాల్సిందే, భవిష్యత్తులో రాబోయే ప్రధానమంత్రి కూడా వెళ్లాలి. కానీ అది అవహేళన చేసే విషయం కాకూడదు. మన రాజకీయాలు ఇంతగా దిగజారిపోయాయా? ఇలాంటి విషయాలు చర్చిస్తామా? మీ వద్ద నన్ను విమర్శించడానికి ఇంకే విషయం లేదా? కానీ నేను ఒకటి చెప్పదలుచుకున్నాను. మీరు దేశం గురించి ఇంతగా ఆలోచిస్తున్నట్లు అయితే ఈ దేశ ప్రధానమంత్రి విదేశాల కి వెళ్ళినప్పుడు ఎంత సమయం ఎక్కడ గడిపారో కనుక్కోండి. ఆ విషయాన్ని కూడా మీరు శోధించండి.

నేను జపాన్ పర్యటించినప్పుడు, నా కార్యక్రమంలో ఒక అదనపు కార్యక్రమాన్ని జోడించాను. నోబెల్ పురస్కార గ్రహీత శాస్త్రవేత్త యమనకా ని ఫోటో తీసుకోవడానికి కలవ లేదు. నేను వారు స్టెమ్ సెల్ లో చేసిన పరిశోధన గురించి కొంత చదివాను. అందుకే వారిని కలిసి వారి పరిశోధన మనకి ఉపయోగపడుతుంది ఏమో తెలుసుకుందామని వెళ్లాను. ఎందుకంటే మన దేశంలో గిరిజనులు సాంప్రదాయంగా సికిల్ సెల్ అనే వ్యాధిని భరిస్తున్నారు, ఈ సికిల్ సెల్ వ్యాధి క్యాన్సర్ కంటే కూడా భయంకరమైన వ్యాధి. సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులని

ఆ వ్యాధి గురించి అడిగితే అది ఎంత బాధాకరమైనదో తెలుస్తుంది. ఆ వ్యాధి ఒక తరం నుంచి మరో తరానికి వ్యాప్తి చెందుతూ ఉంటుంది. ఇంతవరకూ ఆ వ్యాధికి మందు లభించలేదు. స్టెమ్ సెల్ ద్వారా సికిల్ సెల్ వ్యాధి కి చికిత్స లభించే ఆశ నాకు ఉంది. నేను జపాన్ వెళ్ళినప్పుడు ఈ విషయాన్ని చర్చించాం. బెంగళూరు లోని మన సైన్స్ ఇన్స్టిట్యూట్ తో మేము ఆ దిశగా పని చేస్తున్నాము. స్టెమ్ సెల్ ద్వారా మన యువ శాస్త్రవేత్తలు పరిష్కారాలు కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. గిరిజన సోదరులకు తరతరాలుగా వస్తున్న ఈ వ్యాధి వల్ల జీవితం గడపవలసి వస్తుంది. వారు దీని నుంచి విముక్తి పొందేలా చేయాలి.

నేను ఆస్ట్రేలియా పర్యటించాను, G-20 సమావేశం లో పాల్గొన్నాను. నేను అక్కడి రైతులను, వ్యవసాయ శాస్త్రవేత్తలను కలిసి వారి ప్రయోగశాలలు చూసాను. వారు ఎక్కువ శనగలు పండిస్తున్నారు, వారి వద్ద ఉన్న భూమి బాగోక పోయినా శనగలు పండించడం లో విజయం సాధించారు. వారు పరిశోధించారు. నేను ఎక్కడో ఈ విషయం చదివాను. అందుకే వారిని కలవడానికి వెళ్లాను. మనదేశంలో మనం పప్పు ధాన్యాల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నాం. మనకి పప్పుధాన్యాల అవసరం చాలా ఉంది. పేద వారికి పౌష్టికాహారం లభించడం కోసం ప్రోటీన్ అవసరం ఉంటుంది. మనదేశంలోని పేదలకు ఈ ప్రోటీన్ పప్పుధాన్యాల ద్వారా లభిస్తుంది. మన రైతులు పప్పు ధాన్యాల ఉత్పత్తి చేయగలిగితే ఎక్కువ పప్పు ధాన్యాలు పండించ గలిగితే వారికి ఎక్కువ ఆదాయం కలగడంతో పాటు, పేద వారికి కూడా మేలు జరుగుతుంది. అందుకే నేను ఆ శాస్త్రవేత్తల వద్ద కొన్ని గంటలు గడిపాను. మన దేశంలో రైతులు కూడా ఎక్కువ పప్పు ధాన్యాలు పండించే దారులు ఉండి ఉండవచ్చు. ఎక్కువ సెనగలు పండించడానికి ఏం మార్గాలు ఉన్నాయో అలాగే కందులు ఎక్కువ పండించడానికి ఏం మార్గాలు ఉన్నాయో వాటి కోసం నేను సమయాన్ని వెచ్చించాను.

నేను మరో శాస్త్రవేత్తని కలిసాను. ఎందుకు కలిశానంటే, వారు అరటిలో కొత్త రకాన్ని కనుగొన్నారట. నేను దాని గురించి తెలుసుకోవాలి అనుకున్నాను కాబట్టి నేను వెళ్లి వారితో కూర్చుని, వారి ప్రయోగశాలను చూసి,వారి ప్రయోగాలను చూశాను. వారు, అరటి పళ్ల పోషక విలువలు పెంచే దిశగా విజయాన్ని సాధించారు. ఎక్కువ విటమిన్ పొందేలా వారు చేశారు. అరటిపండు ధనవంతుల ఫలం కాదు. అది పేద వారి ఫలం. అరటి పండులో పోషక విలువ పెరిగి, విటమిన్ ఎక్కువ లభిస్తే, ఈ విధమైన పరిశోధన వల్ల అరటి పళ్ళు లభిస్తే మన దేశంలోని పేదవ్యక్తులు, అరటి పళ్ళు తినడం ద్వారా ఎక్కువ శక్తిని పొందగలరు. నేను విదేశాలు ఏ పని కోసమైనా వెళ్ళినప్పుడు నా మనసులో మనదేశ పేదలు మెదులుతూనే ఉంటారు. మన దేశంలోని గిరిజనులు నా మనసులో ఉంటారు. మన దేశం రైతులు నా మది లో ఉంటారు, ప్రపంచంలో జరుగుతున్న మంచి పనులు, మనదేశంలోని పేదలకు పని కొస్తే దాన్ని మన దేశానికి తీసుకురావాలనే ఆరాటం ఉంటుంది. అందుకే, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మన దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళే దిశగా ఆలోచిస్తూ ఉంటాను. పేదల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి మంచి పద్ధతులు అవలంబిస్తూ ఉంటాము.

జన్ ధన్ పథకం కూడా మా సమయం లో ఉండేది అని అన్నారు. బ్యాంకుల జాతీయకరణ చేసి 40 సంవత్సరాలు అయ్యాక కూడా ఏ పేద వారి కోసం అయితే జాతీయకరణ చేశారో వారు ఇప్పటికీ బ్యాంకుల నుంచి దూరంగానే ఉన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థకి ఉన్న ముఖ్యమైన ప్రవాహం. ఏవైనా పథకాలు రూపొందించాలి అనుకున్నప్పుడు, ఇక్కడి నుంచే ప్రారంభించాలి. అందుకే 15 ఆగస్టు న మేము ఏం ప్రకటించామంటే, 26 జనవరి జెండా ఎగరేసే సమయాని కంటే ముందు ఈ పని అయిపోవాలని. సమయం మిగిలి ఉండగానే పని చేశామా? లేదా? ఏ బ్యాంకులో కైతే

పేదవారు వెళ్లలేకపోయారో ఆ బ్యాంకు సిబ్బంది, ఎవరైతే కోటు, టై వేసుకుంటారో, ఎయిర్ కండిషన్ గదిలో నుంచి బయటికి రాకుండా ఉండేవారో, అలాంటి సిబ్బంది ఈరోజు మన పేదవారి గుడిసెల వరకు వెళ్తున్నారు, పేద వారి ఇంటి వరకు వెళ్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి ప్రేరణ ఇవ్వలేదా? ఈ విధమైన మార్పు తీసుకు రాలేదా? తీసుకొచ్చాం కాబట్టి ఈరోజు బ్యాంకింగ్ రంగంలో పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు ఉన్న సిబ్బంది అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. వారు ఈ పనిని తమ భుజంపై వేసుకున్నారు, పూర్తి చేశారు. ఈ విధమైన ఏర్పాట్లు జరిగిన తర్వాత ఇప్పుడు నేను MGNREGA పథకం గురించి చెప్తాను. ఇందులో చాలా లీకేజీలు ఉండేవి. ఇప్పుడు MGNREGA డబ్బులు, జన్ ధన్ అకౌంట్ల ద్వారా, ఆధార్ కార్డు తో అనుసంధానం చేశాం, కాబట్టి లీకేజీలు తగ్గుతాయి డబ్బులు నేరుగా వారి అకౌంట్ లోకి వెళ్తాయి. ఇది జన్ ధన్ ప్రయోజనం.

మా మనసులో పేదలు ఉన్నారు కానీ పేదల పేరు మీద రాజకీయం చేయాలనే ఆలోచన లేదు. పేదల రూపంలో మా మనసులో ఆ దేవుడికి సేవ చేసుకునే అవకాశాన్ని మేము చూస్తాం, అందుకే మేము ఏ పని చేసిన అందులో పేద వారి సంక్షేమం ఉండేలా చూస్తాను, ఆ దిశగా మేము ప్రయత్నాలు చేస్తున్నాం.

నేను మరుగుదొడ్ల గురించి మాట్లాడుతున్నప్పుడు ఎంత పని జరిగిందో మీకు చెప్పాలనుకుంటున్నాను. దాదాపు 4 లక్షల 25 వేల మరుగుదొడ్లు, పాఠశాలల కి అవసరం. అందులో నుంచి దాదాపు ఒకటిన్నర లక్ష కొత్తవి కట్టాలి. మిగతావి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఒక ఆన్లైన్ పోర్టల్ తయారు చేయడం జరిగింది. దాన్ని మ్యాపింగ్ చేయడం జరిగింది. అందులో మరుగుదొడ్లు ఎక్కడ కావాలో ఆ చిరునామా ఖచ్చితంగా ఉంటుంది. అన్ని వివరాలు అందులో పొందుపరచబడ్డాయి. నేను ఈ విషయం చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఇప్పటివరకు 60 నుంచి 65 వేల మరుగుదొడ్లు ఆడపిల్లల కోసం కట్టడం

పూర్తయింది. నేను ఈ సందర్భంగా ఎంపీలు అందరిని అభినందిస్తున్నాను. చాలామంది ఎంపీలు ఎంతో చురుకుగా ఈ పని చేశారు. వారి నియోజకవర్గాల్లో ఎంపీ ల్యాడ్ ఉపయోగించారు. సి ఎస్ ఆర్ లో కూడా ఈ పనులు చేశారు. ఎక్కడైతే జిల్లా అధికారులు చురుగ్గా ఉన్నారో, వారు వేగంగా ఈ పనులు చేశారు. రాబోయే రోజులలో, సెలవు దినాలలో మనమందరం నిర్ణయించుకుంటే ఆ జిల్లా కలెక్టర్ ద్వారా, జిల్లా అధికారుల ద్వారా మనం వివరాలు కనుక్కోవచ్చు. ఈ పని చేయించడానికి మీరు కూడా రెండు మూడు సార్లు ఉత్తరాలు రాయండి. నాకు నమ్మకం ఉంది, జూన్ నెలలో కొత్త సంవత్సరం మొదలు అయ్యేటప్పటికి మరుగుదొడ్ల పని పూర్తి అయిపోతుంది. ఈ పని మన అందరి కోసం కాబట్టి ఈ పని పూర్తి అవుతుందని నాకు విశ్వాసం ఉంది.

పరిశుభ్రత ప్రభావం ఎలా ఉందో చూడండి. దీనివల్ల పర్యాటక రంగంపై మంచి ప్రభావం పడింది. మేము ఆన్ లైన్ వీసా, ఆగమనం పై ఇచ్చే వీసా ని ప్రవేశపెట్టాం, మరోవైపు పరిశుభ్రత, ఈ రెండింటి ప్రభావం పర్యాటక రంగంపై పడింది. గత సంవత్సరంతో పోల్చి చూస్తే పర్యాటక రంగంలో చాలా అభివృద్ధి జరిగింది. ఎన్నో విషయాలలో ప్రతికూల ప్రచారం జరిగినప్పుడు, కొన్ని విషయాలు మన పర్యాటక రంగంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. కానీ మన వ్యవస్థల కారణంగా పర్యాటక రంగం లో చాలా వృద్ధి జరిగింది. ఇప్పుడు మనం విపత్తు నిర్వహణ పై మాట్లాడదాం. ఒక్క విషయం చెప్పండి, ఏ ప్రభుత్వ పరిపాలనలో విపత్తులు జరగలేదు? విపత్తులు జరిగాయి. ఆ దిశగా ప్రభుత్వాలు పని చేశాయి, కానీ ఆ విపత్తు నిర్వహించే పద్ధతిలో మనం మార్పు తీసుకురావచ్చు. జమ్మూకాశ్మీర్లో వరదలు వచ్చినప్పుడు ముందుగా మేము జమ్మూ కాశ్మీర్లోని భారత ప్రభుత్వ అధికారులు ఎవరైతే ఉన్నారో వారి జాబితాను తయారు చేశాం ఆ తర్వాత వారిని అక్కడికి పంపించాము. హోం శాఖ కార్యదర్శి, పాత జమ్మూకాశ్మీర్ నుంచి వచ్చినవారు అందుకే వారిని

ఒక వారం రోజులకి అక్కడికి పంపించాము. ఎందుకు? ఇది భారత ప్రభుత్వం బాధ్యత. కేవలం నిధులు ఇవ్వడంతో సరిపోదు. మేము మా మొత్తం శక్తియుక్తులతో, భుజం భుజం కలిపి వారి వెంట నిలుచున్నాము.

హుద్ హుద్ తుఫాన్ వచ్చినప్పుడు నేను స్వయంగా వెళ్లాను. కాశ్మీర్ కూడా వెళ్లాను. ఎన్నో సార్లు వెళ్ళాను. ఎన్నో బృందాల తో సూక్ష్మ విషయాలు తెలుసుకున్నాను. నేను శ్రీనగర్ వెళ్లి దీపావళి వారి మధ్య జరుపుకున్నాను. ఎందుకు? ప్రభుత్వంలో కూర్చున్నవారు, ఇతరులు కూడా స్పందించేలా, చేయడం మన బాధ్యత. అక్కడ వరద పూర్తిగా తగ్గిపోయిందని, వారిని వారి కర్మకి వదిలేయలేదు. ఎందుకంటే ఇది మన బాధ్యత, మనం అలాంటి విపత్తు లో ఒకరిని ఒకరు విమర్శించుకోవడం కాదు. ఒక బాంధవ్యంతో కూడుకున్న బాధ్యతతో మన వద్ద ఏ శక్తి అయితే ఉందో, దానిని సరైన పద్ధతిలో ఉపయోగిస్తూ, ఈ సమస్య నుంచి బయట పడేలా ప్రయత్నాలు చేశాము.

ఇక్కడ భూసేకరణ చట్టం గురించి గొప్ప మాటలు విన్నాను. మన కంటే గొప్ప పని వేరే వారు చెయ్యలేరు అనే అహంకారం ఉండకూడదు. భూసేకరణ చట్టం రూపొందించినప్పుడు మేము కూడా మీతో భుజం భుజం కలిపి నిల్చున్నాము. ఆ చట్టాన్ని ఆమోదించడానికి మేము ఏ విధమైన అవరోధాలు చేయలేదు. కానీ మీరు దీని నుండి కూడా రాజకీయ ప్రయోజనం పొందడానికి ఆతృతగా ఉన్నారు. ఇది అందరికీ తెలుసు అయినా సరే మేము మీతో నిలబడే ఉన్నాం. మేము మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతున్నాం. 1894 లో చట్టం చేయబడింది, వాటిలోని లోపాలని చూస్తూ మీరు 2013 వరకు వచ్చారు. 120 సంవత్సరాలు గడిచిపోయాయి. 60 సంవత్సరాల వరకూ ఈ దేశం, ఈ దేశంలోని రైతులు 1894లో చేయబడిన ఆ చట్టం ప్రకారమే జీవించారు. రైతులకు చెడు జరిగినట్లయితే, ఎవరి వల్ల జరిగింది? ఆ రోజు ఈ చట్టం మారుతున్నప్పుడు మేము మీతోనే నిలబడ్డాం. చట్టం

తయారయ్యాక, మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు అన్ని రాష్ట్రాల్లోని అన్ని పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు ఒకే కాలంలో ఏమన్నారంటే, మీరు రైతుల కోసం ఏమైనా ఆలోచించండి అని. రైతులు నీరు లేకుండా చనిపోతారు. వారికి నీటి పారుదల అవసరం. అందుకు నీటి పారుదలకి సంబంధించిన మౌలిక సదుపాయాలు కావాలి. గ్రామాల్లో రోడ్లు కావాలి. గ్రామంలోని పేదలకు ఉండడానికి ఇల్లు కావాలి. కాని మీరు చేసిన చట్టం వల్ల ఏ ప్రయోజనం జరగలేదు. ఈ మాట ప్రతి రాష్ట్రంలోని ప్రతి ముఖ్యమంత్రి అన్నారు. మనం సమైక్య సహకారం గురించి మాట్లాడుతున్నాము. సమైక్య వ్యవస్థ గురించి చెప్పుకుంటున్నాం ఎందుకు మనం ఇంత అహంకారంగా ఉన్నాం? మన రాష్ట్రాలు వాటి ముఖ్యమంత్రుల మాట వినడం లేదు. మనకి ఎంత అహంకారం అంటే రాష్ట్ర ముఖ్యమంత్రులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రాలు ఇబ్బందుల్లో ఉన్నాయి. వారిని మనం కాదనుకుంటామా? వారి మాటలు మనం వినవద్దా? వారి అభిప్రాయాలు మనం తెలుసుకోవాలి కదా? అందుకే మనము వాటిని సానుకూలంగా గౌరవించాలి, వారి డిమాండ్లు ఏమిటో రైతుల కోసం అమలు చేయాలి.

నన్ను కొంతమంది సైన్యాధికారులు కలిశారు. వారు మేము ఏ చట్టమైతే చేసామో; దాని గురించి వారు నాతోనే మాట్లాడుతున్నారు. ఎందుకంటే నేను వారికి తోడుగా ఉన్నాను. రక్షణ సంస్థ పనులు ఏవయితే చేయాల్సి ఉంటాయో, ఇప్పుడు ఈ చట్టం వల్ల అవి సాధ్యం కావు. మనం మన అణు వ్యవస్థల కోసం కూడా మౌలిక సదుపాయాలు నిర్మించాలి. దీనికోసం ఏమి కావాలో? మనం అడగడానికి వెళ్దామా? లేక వాటి గురించి రాస్తామా? అలాంటప్పుడు మనం పాకిస్తాన్ కి రాయడం మంచిది. రాసి మేము ఈ ప్రదేశంలో ఈ పని చేస్తున్నామని చెప్పవచ్చు.

సైన్యంలోని అధికారులు ఇబ్బంది పడుతున్నారు. జవానులు ఇబ్బంది పడుతున్నారు. ఏమవుతుంది? మా రక్షణ వ్యవస్థలో ఎవరో ఏదో తప్పు చేశారు అనడం కాదు. ఏదో లోపం ఉండిపోయింది. ఏదో తప్పు జరిగింది. ఆ తప్పుని సరి చేయడం మన బాధ్యత కాదా? ఇది చాలా చిన్న పరిష్కారం. తప్పును సరి చేయడం. మీరు తప్పు చేసి ఉండొచ్చు. కాదనడం లేదు. మీరు ప్రయత్నాలు చేశారు, అందులో కొన్ని ఉండిపోయాయి. కాబట్టి వాటిని మేము చేపడతాం. అందుకే మేము మీ సహాయం ఆశిస్తున్నాము. దయచేసి ఈ విషయాలని రాజకీయ త్రాసులో తూకం వేయవద్దు. అందుకే నేను మీకు భరోసా ఇస్తున్నాను. ఇందులో రైతులకు వ్యతిరేకంగా ఏవైనా ఉందని మీకు ఎప్పుడు అనిపిస్తే అందులో మార్పులు చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాలు, ఒడిస్సా, తూర్పు ఆంధ్ర ప్రదేశ్ వైపు మీ దృష్టిని ఆకర్షించాలని అనుకుంటున్నాను. భారతదేశంలో పశ్చిమాన, గ్రామాలలో కూడా ఏదో ఒక మౌలిక సదుపాయం ఉంది. గ్రామాల్లో రోడ్లు ఉన్నాయి. ఈ చట్టం వలన ఎక్కువ నష్టం ఎవరికైనా జరిగిందంటే అది మన తూర్పు భారతదేశానికి జరిగింది. ఇప్పుడే ఇక్కడ ఒక ముఖ్యమంత్రి బిగ్గరగా ఈ విషయాన్ని చెప్పారు. ఈ ప్రాంతాలకి ఇదే ముందుకు వెళ్ళడానికి అనువైన సమయం, కానీ మీరు బ్రేక్ వేస్తున్నారు. మన దేశంలోని తూర్పు ప్రాంతంలో కూడా పశ్చిమ ప్రాంతాలలో ఉన్నట్టు మౌలిక సదుపాయాలు, ఆ గ్రామాలకి లభించాలా? వద్దా? వారికి కూడా సదుపాయాలు కల్పించాలా? వద్దా? అందుకే నేను మీరు ఏదైతే చేశారో దానిని నెత్తిపై పెట్టుకుని, మీ పట్ల నేను గర్విస్తున్నాను.

నేను మీ అందరికీ మనవి చేస్తున్నాను, ఏవైతే లోపాలు ఉన్నాయో వాటిని సకాలంలో సరి చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం లోపాలను సరిదిద్దే ప్రయత్నం. అది కూడా

రైతుల కోసం. నేను ఈ సభలోని సభ్యులందరికీ మనవి చేస్తున్నాను. దీనిని ప్రతిష్ట కి సంబంధించిన విషయంగా చేయవద్దు, చట్టం తయారయిన తర్వాత దానిని రూపొందించిన వారికే గుర్తింపు లభించేలా నేను బహిరంగంగా చెప్తాను. ఇది రాజకీయం కోసం కాదు. నేను ముఖ్యమంత్రుల మాటలు విన్నాను. వారికున్న కష్టాల గురించి విన్నాను. నేను కూడా ముఖ్యమంత్రి గా ఉన్నాను. నాకు తెలుసు మనం ఢిల్లీలో కూర్చుని చట్టాలు చేస్తే రాష్ట్రాలకు ఎంత ఇబ్బంది గా ఉంటుందో. మనకి వారి ఇబ్బంది గురించి అంచనా లేదు. అందుకే ఒక విధంగా నేను వారికి ప్రతినిధిగా కూడా ఉన్నాను, ఎందుకంటే నేను చాలా కాలంగా ఆ సమూహానికే చెంది ఉన్నాను. అందుకే వారి బాధ నాకు తెలుసు.

అవును. రైతులకు వ్యతిరేకంగా ఒక్క విషయం ఉన్నా దాన్ని సరి చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. బహుశా మేము పని చేస్తున్నప్పుడు కొన్ని లోపాలు జరిగి ఉండవచ్చు. కానీ మన పని ఆ లోపాలను దూరం చేయడమే. దీని రాజకీయ ప్రయోజనం మీరే తీసుకోండి. నాకు ఏ సమస్య లేదు. మీరు ఊరేగింపులు చేయండి, ర్యాలీలు చేయండి, కానీ దేశం కోసం నిర్ణయం తీసుకోండి. కాబట్టి నేను మీకు మనవి చేసేది ఏంటంటే మీరు అటువైపు వెళ్ళకుండా, ఇటువైపు ఆలోచించండి.

ఈశాన్య భారత దేశం గురించి మాట్లాడితే, మేము యాక్ట్ ఈస్ట్ విధానాన్ని అవలంబిస్తున్నాము. నేను ఇప్పటికీ నమ్ముతున్నాను, నేను నా జీవితంలో ఒక కుటుంబ సభ్యుడిగానే ఉన్నాను. నాకు భారతదేశంలోని అన్ని జిల్లాలలో ఒక రాత్రి గడిపే సౌభాగ్యం లభించింది. నేను 40 సంవత్సరాలు ఒక కుటుంబం లాగా దేశమంతా తిరిగాను. అందుకే నాకు తెలుసు నేను ఈశాన్య భారతదేశంలో కూడా చాలా రోజులు ఉన్నాను. అక్కడ అభివృద్ధికి అవకాశాలు ఎక్కువ. అది మన దేశానికి సేంద్రియ రాజధానిగా మారగలదు. అక్కడ అంత శక్తి ఉంది. నేను కూడా ఈశాన్య భారత దేశం తరచూ వెళుతున్నాను. నాకు

రాజకీయ ఉద్దేశాలు ఉన్నట్లయితే ఎక్కడైతే ౬౦ నుంచి ౮౦ సీట్లు బలముందో అక్కడికే వెళ్తాను. కానీ ఎక్కడైతే ఒక్క సీటుందో, అక్కడికి వెళ్లి రెండు రెండు రోజులు గడుపుతున్నాను. నా పనులు రాజకీయ ఉద్దేశంతో నేను చెయ్యను. ఇవి మన దేశానికి చెందిన ఆస్తి. వారి గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. వారితో సంబంధం కలిగి ఉండాలి. అందుకే నా ఉద్దేశం, ఏ విధంగా అయితే పశ్చిమ భారతదేశం అభివృద్ధి చెందిందో? తూర్పు భారతదేశం కూడా వేగంగా పశ్చిమం తో సమానంగా అభివృద్ధి చెందాలి. అది బీహార్ అయ్యుండొచ్చు. బెంగాల్ అయ్యుండొచ్చు. అస్సాం అయ్యుండొచ్చు. ఈశాన్యం అయ్యుండొచ్చు లేదా తూర్పు ఉత్తర ప్రదేశ్ అయ్యుండొచ్చు.... వీటన్నిటిని సమానంగా అభివృద్ధి చేయాలి. ఈ దేశంలో ఒక ప్రాంతంలో లోపం ఉంచి, మరోవైపు సమృద్ధిగా తయారుచేసి, మనం ముందుకు వెళ్ళలేము. అందుకే నేను అటువైపు అభివృద్ధిని ఆశిస్తున్నాను. నేను మీ నుండి తోడ్పాటును ఆశిస్తున్నాను.

మీరు సహకార సమాఖ్య వ్యవస్థ గురించి ఇక్కడ చర్చించారు. ఏమి జరిగేదో మాకు గుర్తుంది. రైల్వేలో వంతెన నిర్మించబడింది కానీ దాన్ని రెండువైపులా జోడించలేదు. అలా ఆ వంతెన రెండు రెండు సంవత్సరాలు అలాగే ఉండేది. అప్పుడప్పుడు రెండు వైపుల నుంచి కనెక్టివిటీ ఉన్నా, వంతెన నిర్మించబడలేదు. ఎందుకు? ఎందుకంటే వారికి ప్రభుత్వం నచ్చక పోయి ఉండవచ్చు లేదా ఒక విభాగం మరో విభాగం మాట వినకపోయి ఉండవచ్చు పని ఆ విధంగా అగాధంలో ఉండేది.

వందలాది ప్రాజెక్టులు, ఒక గ్రామం లోకి రైలు వెళ్ళేది. ఆ రైలు లైన్ కి అటువైపు ఒక బస్తీ ఏర్పడింది ఇప్పుడు తాగునీరు తీసుకువెళ్లడానికి పైపు లైన్ వేయాలి. రైల్వే వారు రెండు సంవత్సరాల వరకు పైప్ లైన్ వేయడానికి అనుమతి ఇవ్వలేదు. మీరు చెప్పండి వారు చేసిన తప్ప ఏంటి? ప్రభుత్వము ఎవరిదైనా కానివ్వండి ఆ గ్రామ ప్రజలు చేసిన తప్ప

ఏంటి? ఆ రైల్వే లైన్ కిందినుంచి పైపు వేసి వారికి నీరు ఇవ్వాలి. ఆ పని జరగలేదు, ఇవ్వలేదు. మేము అధికారంలోకి వచ్చాక ఇలాంటి సమస్యలు ఏవైతే ఉన్నాయో వాటిని పరిష్కరించాల్సి ఉంది అని కోరాము. ఈరోజు నేను గర్వంగా చెప్పగలను, వీటన్నిటిని మేము పరిష్కరించాలని. అక్కడ ఏ స్థాయి ప్రభుత్వం ఉందో నేను చూడలేను, అభివృద్ధి ఇలాగే జరుగుతుంది. అందుకే మేము ఆ దిశగా ప్రయత్నాలు చేసాము.

కొన్ని విషయాలలో రైల్వే నుంచి చాలా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే మేము వాటిలోని వేర్వేరు విభాగాల నీటిని జోడించాను. నేను ఈ విభాగాలు అన్నీ కలిసి పని చేయాల్సిందిగా కోరాను. అన్ని రాష్ట్రాలు కూడా కలిసి పని చేయాలి. రైలు నడుస్తున్నప్పుడు, ప్రజలందరూ ఆగిపోతే పని జరగదు మేము అభివృద్ధి కి ఒక నిర్వచనం ఇచ్చి ముందుకు వెళ్తున్నాం. అందుకే సహకార సమాఖ్య వ్యవస్థ గురించి నేను మాట్లాడుతున్నాను. ఏ రాష్ట్రాలలో అయితే సమస్యలు ఉన్నాయో వాటిని మనము పరిష్కరించాలని మేము ఇది చేస్తాం అది చేస్తాం అంటే ఈ దేశం ఆ ప్రాతిపదికన పనిచేయదు. దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లాలంటే రాష్ట్రాలు కూడా ముందుకు సాగాలి.

నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎప్పుడూ చెప్పేవాడిని, భారతదేశం అభివృద్ధి కోసం గుజరాత్ అభివృద్ధి అనే ఈ మంత్రాన్ని నేను నా జీవితంలో ఎప్పుడూ నమ్మాను, అందుకే అందరితో పంచుకున్నాను. ఈరోజు మన దేశం సమృద్ధిగా ఎదగాలంటే రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలి, దేశాన్ని బలోపేతం చేయాలంటే రాష్ట్రాలను కూడా మనం బలోపేతం చేయాలి.

మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ఖనిజాల రాయల్టీని ఒకటిన్నర రెట్లు పెంచాను. ఆ డబ్బు ఎవరికీ వెళుతుంది? రాష్ట్రాలకు వెళ్తుంది. ఆ రాష్ట్రాలు ఏవి? ఎక్కడైతే ఎక్కువగా

ఖనిజాలు ఉన్నాయో అవి. నేను తూర్పు భారతదేశం అభివృద్ధి గురించి మాట్లాడుతున్నాను. దానికి మూలం అందులోనే ఉంది. ఎందుకంటే మన దేశంలో ఖనిజాలు ఎక్కువగా తూర్పు ప్రాంతాలలో ఉన్నాయి. దీని వల్ల దేశం మొత్తానికి ప్రయోజనం చేకూరుతుంది.

బొగ్గు వేలం వేస్తే ఎవరికి ప్రయోజనం? రాష్ట్రాల ఖజానా లోకి ఆ డబ్బులు వెళ్తాయి. కొన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని ఊహించక పోయి ఉండవచ్చు. వారి బడ్జెట్ కంటే ఎక్కువ డబ్బు వారి ముందు ఉంది. ఇది సమాఖ్య విధానంలో రాష్ట్రాలని బలహీన చేసే పద్ధతి కాదా? ఇప్పుడు మేము ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం 42 శాతం ఇవ్వడానికి అంగీకరిస్తున్నాము. ఈ సందర్భంగా ఆర్థిక సంఘం ఏకగ్రీవంగా లేదు. ఆర్థిక సంఘం లోని సభ్యుల మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. మనం ఆ పరిస్థితి నుంచి ప్రయోజనం పొందవచ్చు. కానీ అలా చేయను. ఎందుకంటే వాస్తవాల పట్ల మేము నిబద్ధులై ఉన్నాము. రాష్ట్రాల సమృద్ధి కోసం వాటిని బలోపేతం చేయడం కోసం 42 శాతం మేము ఇవ్వనున్నాం. ఇది చిన్న మొత్తం కాదు, ఆ మొత్తం ఎంతో వింటే మీరు ఆశ్చర్యపోతారు. కొన్ని రాష్ట్రాల వద్ద ఆ డబ్బు పెట్టడానికి అంత పెద్ద ఖజానా కూడా లేదు.

అంతేకాదు, ఆ తరువాత పంచాయితీలకు, మున్సిపాలిటీలకు, మహా నగర పాలక సంస్థలకు వేరేగా నిధులు లభిస్తాయి. అంతేకాకుండా విపత్తులు సంభవించినప్పుడు వేరేగా నిధులు లభిస్తాయి. ఇవన్నీ కలిపితే దాదాపు 47 నుంచి 48 శాతం అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చాక మొదటి సారి ఈ విధంగా జరుగుతుంది, ఇది మీకు సంతోషం కలిగించవచ్చు. అలాగే రాష్ట్రాలలో ఉన్న ప్రభుత్వ పెద్దలకు కూడా నేను విషయం తెలియజేస్తున్నాను. భారతదేశంలోని రాష్ట్రాల వద్ద ఉన్న మొత్తం ఖజానా, భారత ప్రభుత్వం వద్ద ఉన్న ఖజానా ను చూసినట్టయితే, మనం లెక్క వేసినట్టయితే, 62 శాతం రాష్ట్రాల వద్ద, 38 శాతం కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంటుంది. మొదటిసారి ఈ విధంగా చేశాం. ఢిల్లీ ప్రభుత్వం ఖజానా తక్కువ

చేసి, రాష్ట్రాల ఖజానాని నింపాము. రాష్ట్రాలను బలోపేతం చేయాలి, రాష్ట్రాలకు అభివృద్ధి అవకాశాలు లభించాలి, అందుకే నేను ఈ పని చేస్తున్నాను, రాజకీయాలకి అతీతంగా ఈ పనులు చేస్తున్నాను. ఈ పార్టీ లేదా ఆ పార్టీ లేదా జెండా రంగు చూసి దేశ అభివృద్ధి జరగదు. మాకు జెండా రంగు కనిపిస్తే అది కేవలం మువన్నెల జెండా అని కనిపిస్తుంది, మాకు ఇంకే రంగు కనిపించదు. మువన్నెల జెండా ని తీసుకునే మేము ముందుకు వెళ్తాము.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, మనదేశంలో రాజకీయ కారణాల వల్ల మతాల విషం కలుస్తుంది. ఇది ఇప్పుడు జరుగుతున్న విషయం కాదు, చాలా కాలంగా జరుగుతోంది. ఈ మతాల విషం మన దేశాన్ని నాశనం చేసింది, హృదయాలను విచ్ఛిన్నం చేసింది, కానీ నన్ను ప్రశ్నిస్తున్నారు. అందులో మా పాత్ర ఎక్కడ ఉంది? నేను ఈ సభలో ఒక మాట చెప్పదలుచుకున్నాను. 27 అక్టోబర్ 2013 నాడు, నేను పాట్నా లో ఉన్నాను. గాంధీ మైదానం లో ఉన్నప్పుడు బాంబు పేలుళ్లు జరిగాయి. నిర్దోషులు చనిపోయారు. అక్కడ లక్షల్లో జనం ఉన్నారు, కానీ చాలా కలుషితమైన వాతావరణం అక్కడ ఉంది. రక్తం అక్కడ ధారలుగా ప్రవహించింది. ఆ సమయంలో మనిషి హృదయంలో నుంచి వచ్చే మాటలు సత్యం అనే త్రాసులో 100% నిజం గా తేలుతాయి. అందులో ఏ విధమైన బూటకం ఉండదు. బాంబులు, తుపాకుల హోరులో రక్తం ప్రవహిస్తుంది. ప్రజలు చనిపోతున్నారు. ఆ సమయంలో నా ఉపన్యాసంలో నేను ఏం చెప్పానంటే - హిందువులు ఎవరితో యుద్ధం చేయాలి? ముస్లింలతోనా లేక పేదరికంతోనా? అలాగే నేను ముస్లింలను అడుగుతున్నాను - మీరు హిందువుల తో యుద్ధం చేయాలనుకుంటున్నారా లేక పేదరికంతోనా? అప్పుడు నేను హిందూ ముస్లిం అంటూ చాలా జరిగింది. ఇప్పుడు మనం ఒక్కటై పేదరికానికి వ్యతిరేకంగా పోరాడాలి. పట్టణంలోని గాంధీ మైదానం లో బాంబులు, తుపాకులు, బుల్లెట్ల మధ్య ఆ మాట నేను పలికాను.

అందుకే దయచేసి కాల్పనిక విషయాల ఆధారంగా ఇక్కడ మాట్లాడకూడదు, దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరికి ఈ విషయం స్పష్టంగా తెలుసు - ఈ దేశం వైవిధ్యాలతో నిండి ఉందని. భిన్నత్వంలో ఏకత్వం మన దేశం గుర్తింపు. ఇది మన బలం కూడా.

మేము ఏకరూపత పక్షంలో లేము. మేము కేవలం ఐకమత్యం వైపే ఉన్నాము. అన్ని సాంప్రదాయాలు సమానంగా అభివృద్ధి చెందాలి. ఈ భారత భూమి పైన ఇది సాధ్యం. ఇది మన దేశం విశేష గుణం. అందుకే నేను ఇక్కడ ఒక విషయం చెప్పదలుచుకున్నాను - మన రాజ్యాంగం ఏదైతే ఉందో, అది వేల సంవత్సరాల ఆలోచనకి ప్రతిరూపం. మన రాజ్యాంగం సామాన్య ప్రజల ఆశలు ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది. అందుకే ఈ రాజ్యాంగాన్ని మనం గౌరవంగా చూసుకున్నప్పుడే ఈ దేశం నడుస్తుంది. దేశం రాజ్యాంగానికి బయట నడవదు. ఎవరికీ కూడా చట్టాన్ని చేతిలో తీసుకునే అధికారం లేదు. ఎవరికీ కూడా మతాల ఆధారంగా వివక్ష చూపించే అధికారం లేదు. ప్రతి ఒక్కరికీ వారికి నచ్చినట్టుగా నడుచుకునే అధికారం ఉంది. నేను ప్రభుత్వం లో కూర్చున్నాను, అందుకే నాకు బాధ్యత ఉంది, ప్రభుత్వం ఎలా నడపాలో ఆ బాధ్యత నాకు ఉంది. అందుకే నేను చెబుతున్నాను - మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను, మతం పేరు మీద ఇష్టం వచ్చినట్టు మాట్లాడే వారికి కూడా చెబుతున్నాను. వారి నోళ్ళు మూయించడానికి నా వద్ద ఎన్నో విషయాలు ఉన్నాయి అని నేను చెప్పదలుచుకోలేదు. నేను సమయాన్ని వృధా చేయను. ఇలాంటి విషయాల కోసం సమయాన్ని కేటాయించాలని కోరుకోను. కానీ నేను మీకు ఒక విషయం చెప్తాను. మా నిబద్ధత ఏంటో నేను మీకు చెప్తాను. మా ప్రభుత్వం ఒకటే ధర్మాన్ని అనుసరిస్తుంది, అది ఇండియా ఫస్ట్. మా ప్రభుత్వానికి ఒకటే ధర్మ గ్రంథం – అది భారత రాజ్యాంగం. మా ప్రభుత్వానికి ఉన్న ఒకటే భక్తి - భారత భక్తి. మా ప్రభుత్వం చేసే ఒకటే పూజ, నూట పాతిక కోట్ల దేశపౌరుల సంక్షేమం. మా ప్రభుత్వానికి ఉన్న కార్య శైలి 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్'.

అందుకే మేము రాజ్యాంగం ద్వారా రాజ్యాంగం పరిధిలో ఉండి, దేశాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలి అనుకుంటున్నాము.

మన తత్వజ్ఞానం “ఏకం సద్విప్రా బహుధా వదంతి”. సత్యం ఒక్కటే కానీ విప్రులు దాన్ని వేరువేరు విధాలుగా చెబుతారు. ఈ విషయాన్ని చెప్పే వాళ్ళము మేము. అంతేకాదు, ఈ దేశంలో గురునానక్ దేవ్ గారు ఇలా చెప్పారు. ఒకే దేవుడు అందరిలో వ్యాపించి ఉన్నాడు. ఆ దేవుణ్ణి అందరిలో చూసి నానక్ సంతోషించాడు. ఇది మన జ్ఞానం మూలాధారం. ఇది మన సంప్రదాయం. అందుకే మనం ఎక్కడ ఉన్నామో అక్కడ,

సత్యేస్ ధార్యతే పృథ్వి

సత్యేస్ తపతే రవి

సత్యేస్ వాయవొ వాంతి

సర్వ సత్యే ప్రతిష్ఠితం!!

ఈ మంత్రం తీసుకునే మేము పని చేస్తాం. అందుకే నేను 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అని అన్నప్పుడు మీ తోడు కావాలి, మీకూ తోడు కావాలి, ఎందుకంటే మనం అందరి అభివృద్ధి చేయాలి.

నేను మరో సారి ఇక్కడ, వారి వారి అభిప్రాయాలను వ్యక్తపరిచిన మహానుభావులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీ ద్వారా ఉత్తమమైన ఆలోచనలు వచ్చాయి. వాటిని కూడా పరిశీలించి దేశానికి మేలు జరిగేలా ఎక్కడ ఉపయోగించ వచ్చో మేము ప్రయత్నాలు చేస్తాం. మరోసారి గౌరవనీయులైన రాష్ట్రపతి గారికి

హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ భవిష్యత్తులో వారి మార్గనిర్దేశం లభిస్తుందని ఆశిస్తున్నాను.

ఇదే ఆశతో చాలా చాలా ధన్యవాదాలు.

“

లోక్ సభ లో ప్రధానమంత్రి

శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రకటన

9 మార్చి 2015

”

జమ్మూ-కాశ్మీర్ లో వేర్పాటు వాద నాయకుడిని విడుదల చేయడంపై వ్యాఖ్య -9 మార్చి 2015

గౌరవనీయులైన మేడం స్పీకర్, దేశంలో, ఈ సభలో ఆక్రోశం వుంది. నేను ఆ ఆక్రోశంతో నా గొంతు కలుపుతాను. ఈ దేశం వేర్పాటువాద సమస్యపై ఉగ్రవాద సమస్యపై పార్టీల ఆలోచన ఆధారంగా ముందు ఆలోచించలేదు ఈరోజు ఆలోచించచడం లేదు, భవిష్యత్తులో కూడా ఆలోచించదు.. ఈ సభలో ఒకే స్వరం తో ఈ విధమైన సంఘటన కి వ్యతిరేకంగా ఏ విధంగా అయితే కోపాన్ని వ్యక్తం చేశారో నేను ఈ సభ కి భరోసా ఇస్తున్నాను, ఈ దేశానికి భరోసా ఇస్తున్నాను. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ సంఘటనలు మన దేశంలో జరుగుతున్నాయి. అవి ప్రభుత్వాన్ని సంప్రదించి కానీ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చి కానీ జరగడం లేదు.

అందుకే ఈ సభలోని గౌరవనీయ సభ్యులకు నేను చేసే మనవి ఏంటంటే సమయం వచ్చినప్పుడు మీరు రాజకీయ వ్యాఖ్యలు చేయండి. భారతీయ జనతా పార్టీ అక్కడి ప్రభుత్వంలో భాగస్వామి కాబట్టి మీరు పూర్తిగా విమర్శించొచ్చు, అది మీ హక్కు. కానీ మన దేశ ఐక్యతకు సంబంధించి మనం భిన్నమైన స్వరాలలో మాట్లాడకూడదు. ఈ విధమైన సందేశం ప్రపంచానికి, కాశ్మీర్ కి, దేశానికి పంపకూడదు. అందుకే నేను ఈ సభకి, సమస్త దేశానికి భరోసా ఇస్తున్నాను - ఈ ప్రభుత్వం ఇలాంటి చర్యలని ఎట్టి పరిస్థితులలో స్వీకరించదు. దేశ ఐక్యత, సమగ్రత విషయంలో ఏ విధమైన రాజీ ఉండదు. రాజ్యాంగం పరిధిలోనే చర్యలు తీసుకుంటాము, ఇక ముందు కూడా అలాంటి చర్యలు తీసుకుంటాము.

మరో విషయం, మోడీ గారు ఎందుకు మౌనంగా ఉన్నారు? నేను ఆ సభలో కూడా ఈ విషయం వివరంగా మాట్లాడాను. కాబట్టి మనం మౌనంగా ఉండడానికి ఎటువంటి కారణం

లేదు. ఈ ఆదర్శాల కోసం మేము శ్యాం ప్రసాద్ ముఖర్జీ గారిని త్యాగం చేశాం. కాబట్టి దయచేసి మాకు దేశభక్తి నేర్పించకండి. మేము కొన్ని విషయాలు స్పష్టం చేయమని గౌరవనీయులైన హోం మంత్రి గారి ని అడిగాము. ఆ స్పష్టత వచ్చిన తర్వాత సభకు తెలియజేయడం జరుగుతుంది.

అందుకే నేను ఈ ఆక్రోశం ఏ పార్టీకి చెందినది కాదని, ఇది దేశానికి చెందినది అని తెలియజేస్తున్నాను. ఈ ఆక్రోశం ఈ బెంచ్ లేదా ఆ బెంచ్ కి సంబంధించింది కాదు, ఇది మొత్తం సభకి సంబంధించింది. అందుకే వేర్పాటువాద శక్తులకి, వేర్పాటువాదానికి మద్దతు ఇచ్చే వారికి, చట్టాన్ని దుర్వినియోగం చేసే వారికి మేము మన కోపాన్ని వ్యక్తపరుస్తున్నాము. రాబోయే రోజుల్లో సభలో ఐక్యత, సమగ్రత పట్ల కట్టుబడి ఉండి, దానికి అవసరమైన చర్యలు ఈ ప్రభుత్వం తీసుకుంటుంది.

“

లోక్ సభలో ప్రధానమంత్రి

శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రకటన.

23 ఏప్రిల్ 2015

”

రైతు ఆత్మహత్య పై ఉత్పన్నమైన పరిస్థితి పై వ్యాఖ్య - 23 ఏప్రిల్ 2015

గౌరవనీయులైన చైర్మన్ గారు, చాలా సంవత్సరాలుగా రైతుల ఆత్మహత్యలు దేశానికి ఒక ఆందోళనకర విషయంగా ఉంది. ఎప్పటికప్పుడు ప్రభుత్వాలు వాటికి ఏమి సాధ్యమో అవి చేస్తూ ఉండేవి. నిన్నటి సంఘటన వల్ల దేశానికి కలిగిన బాధని సభలోని గౌరవనీయులైన సభ్యులందరూ వ్యక్తపరిచారు. నేను కూడా ఈ బాధలో పాలు పంచుకుంటున్నాను. ఈ సందర్భంగా మనం ఒక సంకల్పం తీసుకోవాలి. మన అందరం కలిసి ఈ సమస్య కి పరిష్కారం ఎలా వెతకాలో ఆలోచించాలి. సమస్య చాలా పాతది, అలాగే ఈ సమస్య చాలా పెద్దది మనం ఈ సమస్యని ఆ రూపంలోనే తీసుకోవాలి. అన్ని మంచి సలహాలను స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతుల జీవితం కంటే పెద్ద విషయం మరొకటి లేదు. ఒక వ్యక్తి జీవితం కంటే గొప్ప విషయం మరి ఏమీ ఉండదు.

అందుకే రాజ్ నాథ్ గారు ప్రభుత్వం తరఫున ఏ సమాచారం అయితే ఇవ్వాలో, అది వారు మీకు ఇచ్చారు. కానీ నేను ఈ సభ పడుతున్న వేదన లో పాలు పంచుకోవాలనుకుంటున్నాను. మనమందరం ఏ పార్టీకి చెందినా, దేశం చాలా పెద్దది. సమస్య చాలా పాతది, లోతైనది. మనం అందరము ఎక్కడ తప్ప జరిగిందో ఆలోచించాలి. ఏ తప్పదారిలో మనం వెళుతున్నామో వాటిని చూడాలి. ఆ లోపాలు ఏమిటో వెతకాలి. ముందు ఏ లోపాలు ఉండేవి? గత పది నెలలుగా ఏ లోపాలు ఉన్నాయి? వీటన్నిటికీ మనం బాధ్యత వహించాలి.

కానీ రైతుల సమస్య పరిష్కారానికి ఒక మార్గం మనం వెతకాలి. అందుకే ఈ విషయంపై మనసు విప్పి మీరు సలహాలు ఇస్తే ఏదో ఒక మార్గం దొరికేలా మనం ప్రయత్నం

చేయవచ్చు. రైతు ని మనం నిస్సహాయంగా వదలకూడదు. మనం వారికి తోడుగా, వారి దుఃఖాన్ని పాలుపంచుకుంటూ, వారి భవిష్యత్తులో భాగస్వాములం కావాలి.

ఆ సంకల్పంతో ఈరోజు జరిగిన చర్చ లో సామూహిక తీర్మానం వెలువడింది, మనందరం కలిసి మన రైతులను ఇక చనిపోనివ్వవద్దు. నేను ఈ సభను ఈ సందర్భంగా ప్రార్థిస్తున్నాను.

“డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 వ జయంతి సందర్భంగా రాజ్యాంగం పట్ల నిబద్ధత పై లోక్ సభలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు చేసిన ప్రకటన.

27 నవంబర్ 2015”

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 125 వ జయంతి ఉత్సవం పై ప్రకటన - 27 నవంబర్ 2015

గౌరవనీయులైన మేడం స్పీకర్, మీరు చాలా ముఖ్యమైన చర్చను ప్రారంభించారు. రాజ్యాంగం గొప్పదనం, రాజ్యాంగం ఉపయోగం, రాజ్యాంగాన్ని నిర్మించిన గొప్ప వ్యక్తుల దూరదృష్టిని మీరు గొప్ప ఆలోచనలతో ఈ దేశం ముందు ఎంతో ప్రభావవంతంగా ఉంచారు. ఈ చర్చలో ఆసక్తిగా పాల్గొని, ఒకే స్వరంతో సమర్థించి వారి వారి పద్ధతులలో రాజ్యాంగం గొప్పతనాన్ని, దాని పట్ల వారికి ఉన్న నిబద్ధతని చాటుకున్న ప్రతి సభ్యుడికి నేను హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. వారికి నా ధన్యవాదాలు.

కొంత మందికి ఉన్న అపోహలు అయ్యుండొచ్చు లేదా కొన్ని పాత అలవాట్ల కారణంగా ఇది ఇలా జరుగుతూ ఉండొచ్చు, కానీ నేను వీటిని అంగీకరించను. ప్రధానమంత్రి చర్చ ముగింపు తర్వాత సమాధానం ఇస్తారని నేను విన్నాను. కానీ ఈ చర్చ ఆ రూపంలో ఉందని నేను అనుకోవడం లేదు. నేను కూడా అందరిలాగానే ఈ సభలోని సభ్యుడిని. గౌరవనీయులైన సభ్యులందరూ వారి వారి అభిప్రాయాలను ఏ విధంగా వ్యక్తం చేశారో, నేను కూడా నా మనోభావాలను వ్యక్తపరచడానికి నిలుచున్నాను. ఈ చర్చ స్ఫూర్తి అదే. ఈ చర్చలో నువ్వా? నేనా? అనే ప్రసక్తి లేదు. మనము, సమస్త సభ ఈ చర్చ ముఖ్య ఉద్దేశం. దేశంలోని ప్రజాప్రతినిధులందరూ ఈ చర్చ ముఖ్య ఉద్దేశం. మనం జనవరి 26న గణతంత్ర దినోత్సవం చేసుకుంటాము, కానీ నవంబర్ 26న ఒక చరిత్రాత్మక ప్రాముఖ్యం ఉన్న ఘట్టం జరిగింది. ఈ విషయాన్ని కూడా చర్చించుకోవడం అంతే ముఖ్యం. 26 నవంబర్ ని మనం ప్రస్తావించి 26 జనవరి ని దిగజార్చే ప్రయత్నం కాదు. 26 జనవరి బలం 26 నవంబర్ లో దాగి ఉంది. ఈ విషయాన్ని అందరికీ తెలియ చేయవలసిన అవసరం ఉంది.

ఈ రోజు పాఠశాల లో ఉండే పాఠ్యాంశాల గురించి నాకు వివరంగా తెలియదు. రాష్ట్రాలు వారి వారి పాఠశాలలలో వారు నిర్ణయించిన పాఠ్యాంశాలు ఉంటాయి. మా చిన్నతనంలో పౌరశాస్త్రం బోధించేవారు, అందులో రాజ్యాంగం గురించి కొంత వివరించేవారు. ఆ తర్వాత నెమ్మదిగా ఆ విషయం మర్చిపోతాము, కేవలం న్యాయవాద వృత్తి లోకి వెళ్ళే వారు లేక రాజకీయాల్లోకి వచ్చే వారి వరకే రాజ్యాంగం కార్యకలాపాలు పరిమితమై ఉంటాయి.

భారతదేశం వైవిధ్యాలతో నిండిన దేశం. మనందరినీ ఐక్యంగా ఉంచే శక్తి రాజ్యాంగానికి ఉంది. మనందరినీ ముందుకు తీసుకెళ్లగలిగే శక్తి రాజ్యాంగానికి ఉంది. అందుకే కాలానుగుణంగా రాజ్యాంగం పవిత్రత, రాజ్యాంగం శక్తి, రాజ్యాంగంలో నిగూఢంగా దాగి ఉన్న విషయాలను ప్రజల దృష్టికి తీసుకు వెళ్లడానికి నిరంతరం ప్రయత్నం జరగాలి. అందుకే ఈ పనిని ఒక ధర్మంగా, అంకితభావంతో చేయాల్సిన అవసరం ఉంది. ఇది 26 నవంబర్ న చేసుకునే రాజ్యాంగ దినోత్సవం ద్వారా ముందుకు తీసుకు వెళ్లాలని ప్రభుత్వం ఆలోచన. ఇందులో క్రమంగా మెరుగులు దిద్దడం జరుగుతుంది. ఈ విషయం కూడా నెమ్మదిగా అవతరిస్తుంది. ఎందుకంటే ఇది ప్రారంభ స్థాయి. ఇది అంతిమం కాదు. ఇందులో నిరంతరంగా అభివృద్ధి జరుగుతూ ఉంటుంది.

ఈ ఏర్పాటును ప్రతి సంవత్సరం ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచిస్తాం.ఈసారి ప్రత్యేక పర్వము అని మేము చెప్పడం లేదు. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 125 వ జయంతిని దేశమంతా జరుపుకుంటున్న సందర్భంలో ఈ కార్యక్రమాన్ని పార్లమెంటు తో అనుసంధానించి రూపొందించబడింది. అయితే భవిష్యత్తులో దీనిని లోక్ సభకు మాత్రమే పరిమితం చేయకూడదు, బహిరంగ సభలకు తీసుకుని వెళ్లాలి. విస్తృతంగా సమావేశాలు, చర్చలు, పోటీలు నిర్వహించి, ప్రతీ తరం ప్రజలు రాజ్యాంగం గురించి ఆలోచించేలా, అర్థం చేసుకుని చర్చించేలా చేయాలి. ఇది ఒక నిరంతర ప్రక్రియ కావాలి, అందుకే ఇది ఒక చిన్న

ప్రయత్నం. ఈ సభలో సభ్యులు వారి వారి మనోభావాలు వ్యక్త పరిచిన విధానాన్ని చూసినట్లయితే, ఇది గొప్ప ప్రాముఖ్యం కలిగి ఉన్న అంశమని, భవిష్యత్తులో దీనిని మరింత ముందుకు తీసుకు వెళ్లాలని అనిపిస్తుంది. మేము భవిష్యత్తులో ఈ విషయాన్ని ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తాము.

నాకు కలిగిన ఆలోచన ఏంటంటే మనం దేశమంతా రాజ్యాంగానికి సంబంధించి ఆన్లైన్ పోటీలు, ప్రశ్నలు నిర్వహించినట్లయితే మొత్తం దేశమంతా ఒక అలవాటుగా మారనుంది. పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని ముందు ముందు ఇలాంటి విషయాలకి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. మన రాజ్యాంగం గురించి సమగ్ర పద్ధతిలో నిరంతరం చర్చలు జరుగుతూ ఉండాలి. ఇలాంటి అనేక కార్యక్రమాలు రూపొందించడానికి మనం ఇక ముందు కూడా ఆలోచించవచ్చు.

నేను ఎర్రకోట నుంచి ఒక విషయం చెప్పాను. ఈ సభలో కూడా ఆ విషయాన్ని చెప్పాను. కానీ బహుశా కొన్ని విషయాలను అర్థం చేసుకుని మర్చిపోయే అలవాటు ఉంటుంది, కొన్ని విషయాలు ఊరికే మరిచిపోతాము. ఇంతకుముందు ఏ ప్రధానమంత్రి అయినా ఎర్రకోట నుండి ఈ మాట చెప్పారో లేదో నాకు గుర్తులేదు. ఒకవేళ అలా చెప్పినట్లయితే వారికి నేను నమస్కరిస్తున్నాను. కానీ నేనేం చెప్పాను అంటే, ఈ దేశం లో ఎన్నో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి, ఎంతోమంది ప్రధాన మంత్రిగా పని చేశారు. వారందరి తోడ్పాటుతో నే ఈ దేశం ప్రగతి సాధించింది. నేను ఈ మాటని ఎర్ర కోట నుండి చెప్పాను. నేను సభలో కూడా ఈ విషయం చెప్పాను, మళ్లీ చెప్తున్నాను. ఈ దేశం ఎంతో మంది మహానుభావుల తపస్సు వల్ల ముందుకు సాగింది. అన్ని ప్రభుత్వాల తోడ్పాటుతో నే ప్రగతిని సాధించాము. కాకపోతే కొన్ని ఫిర్యాదులు ఉంటాయి. మనం ఎంత ఆశించామో, అంత పురోగతి సాధించలేదు. ప్రజాస్వామ్యంలో ఫిర్యాదు చేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ

ఎవరూ కూడా పాత ప్రభుత్వాలు ఏమీ చేయలేదని చెప్పలేరు. అందుకే నేను ఈ విషయాలన్నీ ఎర్ర కోట నుండి చెప్పాను. నేను ఈ విషయాన్ని ఇప్పుడు చెప్పడం లేదు ఎందుకంటే నాకు ఈ విషయం పట్ల పూర్తి నమ్మకం ఉంది. ఈ దేశం రాజులు, మహారాజులు, పాలకులు తయారు చేసినది కాదు. ఈ దేశాన్ని కోట్ల జనాభా తయారు చేశారు. శ్రామికులు తయారు చేశారు. రైతులు నిర్మించారు. పేదలు వారి శ్రమతో తయారు చేశారు. ఉపాధ్యాయులు, ఆచార్యులు ఈ దేశాన్ని నిర్మించారు. కోట్ల కొద్దీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా వారి పాత్రలని నిర్వహిస్తూ ఈ దేశాన్ని నిర్మించారు. అందుకే వారి రుణాన్ని తీర్చుకుంటూ వారికి నమస్కరించడం మనందరి బాధ్యత.

రాజ్యాంగంలో కూడా ప్రతి ఒక్కరికి పాత్ర ఉంది, ఆ సమయంలో దేశంలో ఎవరి నాయకత్వం ఉండేదో వారికి ప్రత్యేక పాత్ర ఉంది. అందు వల్లనే మనకు ఇంత గొప్ప రాజ్యాంగం లభించింది. దీన్ని మనం ఎంతగా ప్రశంసించినా తక్కువే. మన రాజ్యాంగం గురించి సరళమైన భాషలో చెప్పవలసి వస్తే, భారతీయుల గౌరవం, భారతీయుల ఐక్యత అనే ఈ మూల మంత్రాలను సాకారం చేస్తుంది. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి పాత్రని మనము ఎప్పటికీ కాదనలేము. దీని అర్థం బాబా సాహెబ్ అంబేద్కర్ గారి గురించి మాట్లాడుతున్నప్పుడు వేరే వారికి పనిలేదని కాదు. కానీ ఒకరి పేరు చెప్పితే ఇంకొకరి పేరు ఉండిపోతుంది. ప్రతి ఒక్కరికి వారు కూడా తోడ్పాటు అందించారని అనిపిస్తుంది. కొంతమంది వారి జీవితాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు అయినా వారికి లభించాల్సిన గుర్తింపు లభించలేదు. అయినప్పటికీ వారి పేరు ప్రతిష్టలు తగ్గవు. వారి అస్తిత్వాన్ని ఎవరూ తగ్గించలేరు. మనకి ఆ మాత్రం నమ్మకం ఉండాలి అందుకే ఆ నమ్మకాన్ని పునఃస్థాపితం చేయవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ దేశం చాలామంది మహానుభావుల కృషివల్ల తయారయింది, దానికి ప్రాముఖ్యం ఉంటుంది. ఈ విషయాన్ని మనం అందరమూ స్వీకరించాలి.

2009 నాటికి రాజ్యాంగం వచ్చి 60 సంవత్సరాలు అయ్యింది. నేను ఈరోజు రాజ్యాంగానికి సంబంధించిన కార్యక్రమాన్ని మీ ముందుకు తీసుకు వచ్చాను. ఇది మొదటిసారి కాదు. నేను ఆ సమయంలో ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా ఉన్నాను. 2009లో రాజ్యాంగం 60 సంవత్సరాల ఉత్సవం జరిగినప్పుడు మా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏనుగు పై కూర్చుని ఏర్పాట్లు చేశాము, దానిపై రాజ్యాంగాన్ని అలంకరించి పెట్టాము. ఆ తర్వాత ఆ యాత్రను ప్రారంభించారు. ముఖ్యమంత్రి స్వయంగా ఏనుగు ముందు నడిచారు. రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి ఆ పని చేశాము. రాజ్యాంగం 60 సంవత్సరాల పండుగని మేము గుజరాత్ గడ్డపై జరుపుకున్నాము. ఎందుకంటే నేను ఆ సమయంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నాను, మేము రాజ్యాంగ విలువలను స్వీకరించాము. మనకి రాజ్యాంగం ఉంది, ఈ సభలో చాలా మంది పెద్దలు ప్రజాప్రతినిధులుగా వచ్చి ఉన్నారు. మనకి రాజ్యాంగానికి సంబంధించి పని అప్పగించినట్లయితే, అందులో కొన్ని చిత్రాలో, రంగులో ఎన్నుకోవాల్సిన పని ఇచ్చినట్లయితే, మనకి ఎన్నికల పట్ల భక్తి ఎక్కువగా ఉంది, కాబట్టి రాజ్యాంగం కాదు కదా అందులోని చిత్రాల పట్ల కూడా మనం సమ్మతితో అంగీకరించలేము. ప్రతి చిత్రం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తాం. ఆ చిత్రం రంగు పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తాం. ఇటువంటి మానసిక స్థితిలో మనం ఉన్నాము. అందుకే ఆ మహానుభావులు చేసిన పని ఎంత గొప్పదో నేను అర్థం చేసుకోగలను. ఈ రాజ్యాంగాన్ని మూడు సంవత్సరాల లోపు తయారు చేయడం జరిగింది. బహుశా చాలా దేశాలలో రాజ్యాంగాన్ని తయారు చేయడం అంత కష్టమైన పని కాకపోవచ్చు. భారత్ లాంటి దేశంలో రాజ్యాంగాన్ని తయారు చేయడం చాలా పెద్ద పని. ఏ దేశంలో అయితే ప్రపంచంలోని 12 మతాలూ ఉన్నాయో, ఆ పన్నెండు మతాలను ఇక్కడ శ్రద్ధగా పాటిస్తారు. ఈ దేశంలో వేరు వేరు మూలాల నుంచి నూట ఇరవై రెండు భాషలు ఉన్నాయి. ఈ దేశంలో పదహారు వందల కంటే ఎక్కువ మాండలికాలు

ఉన్నాయి. ప్రతి ఒక్కరికి ప్రాధాన్యతలు వేరు. ఇక్కడ భగవంతుడిని నమ్మే వాళ్ళు ఉన్నారు నమ్మని వాళ్ళు ఉన్నారు. ఇక్కడ ప్రకృతిని పూజించే వారు ఉన్నారు, రాతిలో దైవాన్ని చూసే వాళ్ళు ఉన్నారు. ఈ విధమైన వైవిధ్యాలతో మనదేశంలో ప్రజలు ఉన్నారు. వారి వ్యక్తీకరణలు ఎలా ఉంటాయి? వారి ఆకాంక్షలు ఎలా ఉంటాయి? వారితో కూర్చుని చర్చించి వీటిని తయారు చేయాల్సి ఉంటుంది. ఈ రోజు కూడా మనం ఏదైనా చట్టం చేసినప్పుడు మరుసటి సమావేశంలోనే ఆ చట్టంలోని కొన్ని పదాలను తొలగించమనో లేక సరి చేయమనో అడగడం జరుగుతుంది. ఈ సభ అనుభవం అలాంటిది. మనము ఒక ఖచ్చితమైన చట్టాన్ని చేయలేకపోతున్నాము, ఇది వాస్తవం. ఈరోజు ఉన్న లోపాలు, తరువాతి సమావేశంలో సరి చేయవలసి ఉంటుంది. ఆ తరువాత ఈ చట్టంలో తప్పులు ఉన్నాయి, సరిదిద్దాలని చెప్పాల్సి ఉంటుంది.

రాజ్యాంగ రూపకర్తలు ఎంతో తపస్సు చేసి ఉండాలి. వారు రూపొందించిన అంశాలు బయటికి వస్తున్నప్పుడు వారి మానసిక స్థితి ఎలా ఉండి ఉంటుందో? వారు ఈరోజు కూడా మనకి మార్గదర్శకులు. రాజ్యాంగాన్ని ఈ విధంగా కీర్తిస్తూ రాబోయే తరాలకు వీటిని పరిచయం చేస్తూ, అర్థం చేసుకునేలా చూస్తే మన దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసినవాళ్లమవుతాం.

ప్రజాస్వామ్యం ఈ సభ కే పరిమితం చేయబడినా లేదా ప్రభుత్వాన్ని నడిపించే పత్రం గా మారినా, ప్రజాస్వామ్యం మూలాలకు నీరందించడానికి మనం చేస్తున్న ప్రయత్నాలలో లోపం ఉందని నేను భావిస్తున్నాను. అందుకే భారతదేశం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి రాజ్యాంగం భావన, దాని సామర్థ్యాన్ని ప్రజల మధ్యకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిదీ. ఎవరైతే మహానుభావులు ఇందులో తోడ్పాటు అందించారో, వారందరి గురించి ప్రస్తావిస్తూ మనం ఈ విషయాలు మాట్లాడాలి. మన రాజ్యాంగం రూపొందించబడుతున్నప్పుడు అప్పటి

రాజ్యాంగ పరిషత్తు తాత్కాలిక అధ్యక్షుడు శ్రీ సచ్చిదానంద సిన్హా గారు ఒక విషయం చెప్పారు. నేను దానిని ప్రస్తావించాలనుకుంటున్నాను. వారు ప్రారంభోపన్యాసంలో అమెరికా రాజ్యాంగం గురించి జోసెఫ్ స్టోరీ చెప్పిన మాటలను ప్రస్తావించారు. జోసెఫ్ స్టోరీ గారు ఈ విధంగా చెప్పారు" The constitution has been reared for immortality if the work of man may justly aspire to such a title." (రాజ్యాంగానికి అమరత్వం కలగాలంటే, మనిషి కృషి అందుకు సమర్ధవంతంగా ఆకాంక్షించాలి). బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ప్రత్యేకతను గమనించినట్లయితే దూరదృష్టిగల మహా పురుషుడు ఎలా ఉంటారో, దానికి ఉదాహరణగా వారు చెప్పిన సూక్తులు ఏ ప్రభుత్వం పైన విమర్శలు చేయడానికయినా పనికొస్తాయి. విమర్శల నుంచి కాపాడుకోవడానికి కూడా వారి సూక్తులు పనికొస్తాయి. ఎవరికైనా వారి అభిప్రాయాన్ని తటస్థంగా చెప్పాలనుకున్నా బాబాసాహెబ్ గారి సూక్తులు పనిచేస్తాయి. దీని అర్థం ఆ మహాపురుషుడికి ఎంత దూరదృష్టి ఉండేదో, విస్తృతమైన అభిప్రాయాలు ఏ విధంగా తెలిపేవారో, వాటిని ఈరోజు ఎవరినైనా వ్యతిరేకించాలి అంటే కూడా పనికి వస్తాయి. అలాగే పరిపాలించే వారికి కూడా మార్గదర్శిగా ఆ ఆలోచనలు ఉన్నాయి. తటస్థంగా, మౌనంగా కూర్చునే వాళ్లకి కూడా ఈ ఆలోచనలు ఉపయోగ పడతాయి. ఇది ఒక విచిత్రం, ఎందుకంటే ఎన్నో అభిప్రాయాలు ఉండొచ్చు ఒక అభిప్రాయము కేవలం ఒకే ఆలోచన ధోరణికి పనికొస్తాయి. అన్ని రకాల ధోరణులకు పనిచేయవు. ఒకే కాలానికి అవి పరిమితమవుతాయి. అన్ని కాలాలకు ఆ ఆలోచనలు ఉపయోగపడవు. బాబా సాహెబ్ గారి ప్రత్యేకత ఏమిటంటే వారి ఆలోచనలు ప్రతీ కాలానికి, ప్రతీ తరానికి, ప్రతీ వర్గానికి ఉపయోగపడతాయి. దాని అర్థం వారి ఆలోచనలలో బలం ఉంది ఒక తపస్సు ఫలం దేశానికి అంకితం చేయబడింది. వంద సంవత్సరాల తర్వాత దేశం ఏ విధంగా ఉండబోతుందో ముందే చూడగలిగే సామర్థ్యం వారికి

ఉంది. అలాంటి సామర్థ్యం తోనే ఈ విధమైన విషయాలు బయటికి వస్తాయి. అందుకే సహజంగానే మహాపురుషులకు నమస్కరించాలనే కోరిక కలగడం స్వాభావికం.

ఈ రాజ్యాంగం గురించి ఆలోచిస్తున్నప్పుడు ఇది ఒక పత్రమని అందులో భాగాలు ఉన్నాయని అనుకుంటున్నాము. ఈ భాగాలలో మనం ఏమి చేయాలో? ఏమి చేయకూడదో దానికి సంబంధించిన మార్గాలు అన్వేషించాలి. ప్రభుత్వం ఎలా పని చేయాలి? ఏ విధమైన నియమాలు ఉన్నాయి? పార్లమెంట్ ఎలా పని చేయాలి? ఏ విధంగా చేయాలి? ఇవన్నీ కూడా భారత రాజ్యాంగం గురించి వర్ణిస్తూ గ్రాన్ విల్లే ఆస్టిన్ చెప్పారు. ఇది చాలా ఆసక్తికరమైన విషయం. వారు దీనిని సామాజిక దస్తావేజుగా పరిగణించారు. లేనిచో రాజ్యాంగం ఒక న్యాయ దస్తావేజుగా ఉండి ఉండేది. ఒకవేళ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఉండి ఉండకపోతే, నన్ను క్షమించండి, నేను ఎవరిని విమర్శించడం లేదు, బహుశా మన రాజ్యాంగం దేశాన్ని నడపడానికి, పాలనా వ్యవస్థను నడపడానికి ఉపయోగపడి ఉండేదేమో కానీ ఆ రాజ్యాంగం సామాజిక పత్రంగా మారడంలో విఫలమయ్యేది. రాజ్యాంగాన్ని సామాజిక పత్రం గా మార్చిన బాబాసాహెబ్ అంబేద్కర్ గారు వారి బాధను వారు ఎదుర్కొన్న సమస్యలు, కష్టాలను పదాలుగా మార్చి ఈ రాజ్యాంగాన్ని తయారు చేశారు. అందుకే ఒక విదేశీ వ్యక్తి మన రాజ్యాంగాన్ని ఒక సామాజిక దస్తావేజు గా వర్ణించారు. అందుకే దీన్ని ఒక చట్టపరమైన పత్రంగా కాకుండా సామాజిక దస్తావేజు గా పరిగణించాలన్న విషయం మనకూ తెలుసు. మనందరము మనుషులం. మనందరి లో లోపాలు ఉంటాయి. ఏదైనా తప్పు జరిగినప్పుడు ఆ విషయం మన మనసు నుంచి చాలా కాలం వరకు బయట పడదు. ఎవరైనా ఏమైనా అన్నట్లయితే అది మనకి గుచ్చుకుంటుంది. వారు మన ముందుకు వచ్చినప్పుడు, వారు కనబడరు వారి మాటలే గుర్తుకు వస్తాయి. ఇది మన స్వభావం. ఒక దళిత తల్లి కొడుకు పుట్టినప్పటినుంచి కష్టాలను ఎదుర్కొంటూ అవమానాలు ఎదుర్కొంటూ నిర్లక్ష్యం చేయబడి

ఎన్నో బాధలు అనుభవించాల్సి వచ్చింది. అదే వ్యక్తి చేతిలో దేశం భవిష్యత్తుకు సంబంధించిన పత్రాలు తయారు చేయాల్సిన అవకాశం లభించినప్పుడు వారు అలాంటి వ్యక్తి అయినట్లయితే వారి కాఠిన్యం, విష తత్వం ఎక్కడో ఒక చోట కనబడి ఉండేది. ప్రతీకార జ్వాల కనబడి ఉండేది. కానీ బాబా సాహెబ్ గారి గొప్పతనం ఏమిటంటే వారు జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా, రాజ్యాంగం పట్ల ఏ విధమైన ప్రతీకార భావం చూపించలేదు. ఇది వారి గొప్పతనం, వ్యక్తిత్వం ఎత్తైన స్థాయి. దానివల్లనే ఇది సాధ్యమైంది. లేనిచో మనందరికీ తెలుసు సామాన్య మనుషులుగా ఒక్క మాట అయినా పొరపాటున అనేస్తాం. అతని జీవితం శిఖరమంత ఎత్తులో ఉండడమే కాకుండా, అంతర్గత ఆలోచన ఎంతో బలంగా ఉండేది. ఆ మహానుభావుడు విషం తాగేసి మన కోసం అమృతాన్ని విడిచిపెట్టాడు.

అందువల్లనే అలాంటి గొప్ప వ్యక్తుల కోసం సంస్కృతంలో కొన్ని పదాలు నాకు గుర్తుకొస్తున్నాయి.

స్వభావం నా జుః త్యేవ సాధురా ఆపద్ గతోపి సన్!

కర్పూరః పావక స్పర్శః సౌరభం లభించే తరాం!

ఒక సాధువు నిజమైన పరీక్ష కఠిన పరిస్థితులలోనే జరుగుతుంది. ఏ విధంగా అయితే కర్పూరాన్ని అగ్నికి దగ్గరగా తీసుకు వచ్చినప్పుడు కాలి పోవడానికి భయం ఉండదో, అదే విధంగా అతను తనను తాను కాల్చుకుని తన సువాసనతో అందరినీ ఆకర్షిస్తాడు.

బాబా సాహెబ్ గారి విషయంలో ఇది పూర్తిగా నిజం. దీని అర్థం ఒక సాధువుకి నిజమైన పరీక్ష కఠినమైన పరిస్థితుల లోనే ఉంటుంది. ఏ విధంగా అయితే కర్పూరం అగ్ని కి దగ్గరగా వెళ్ళినప్పుడు కాలుతుందని భయం ఉండదు, తాను కాలిపోతూ వేరొకరికి సుగంధాన్ని అందిస్తుంది. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు అలాంటి వ్యక్తి. వారు ఎన్నో కష్టాలను

ఎదుర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయినా సరే రాజ్యాంగంలో ఎక్కడా ప్రతీకార భావాన్ని వ్యక్త పరచ లేదు.

అందరినీ జోడించే ప్రయత్నం చేశారు. ప్రతి ఒక్కరిని రాజ్యాంగంలో భాగం అయ్యేలా చేశారు. అందుకే నేను బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి నమస్కరించాలి అనుకోవడం స్వాభావికం. 26 నవంబర్ 1949 న బాబాసాహెబ్ అంబేద్కర్ గారు స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడానికి స్వతంత్ర భారతదేశంలో పౌరుల పట్ల ఏ విధంగా వ్యవహరించాలో వారు ఉపన్యసించారు. " మనం ప్రజాస్వామ్యాన్ని వస్తు రూపంలో కాకుండా వాస్తవంగా నిర్వహించడానికి ఏమి చేయాలి? నాకు అర్థం అయినంతవరకూ మొట్టమొదటిగా మనం రాజ్యాంగ విధానాలకు కట్టుబడి సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించాలి. ఎక్కడైతే రాజ్యాంగ పద్ధతులు ఉంటాయో అక్కడ రాజ్యాంగ విరుద్ధమైన పద్ధతులకు ఆస్కారం ఉండదు. ఆ పద్ధతులు అరాచకాలు తప్ప మరొకటి కావు అందుకే వాటిని ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిది."

మనం ప్రజాస్వామ్య సాంప్రదాయాల మధ్యనే పెరిగాము. మనకి ఏం చేయాలో ఏం చేయకూడదో అనే దృష్టికోణంలో ఇవి చాలా ముఖ్యమైనవి. పండిట్ నెహ్రూ గారు రాజ్యాంగ సభలో ఒక ముసాయిదాను, ఉద్దేశాన్ని ప్రవేశపెట్టి ప్రస్తావించారు. దానిని మన మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ గారు సమర్థించారు. ఆ సందర్భంగా పండిత నెహ్రూ కు, వారి ప్రతిపాదనకు మద్దతు గా చాలా మంచి విషయం చెప్పారు.

ధర్మం క్షత్రస్య క్షత్రం (ధర్మం రాజులకే రాజు)

ధర్మం నిజమైన రాజుల కి చాలా ముఖ్యమైనది.

ఇది ప్రజలకు, పాలకులకు పాలకుడు లాంటిది.

మేము పేర్కొన్నట్టుగా ఇది చట్టం సార్వభౌమాధికారం. ఇక్కడ ధర్మం అంటే నియమాలకు సంబంధించినది కాదు. ఇది రాజ్యాంగానికి సంబంధించిన విషయం, వారు ఆ విషయాన్ని మనకి చాలా ఉన్నతమైన మార్గములో చూపించారు. అదేవిధంగా మేధావుల సమితికి అధ్యక్షుడిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు 368వ అధికరణ గురించి చేసిన వ్యాఖ్యలు మనం తెలుసుకోవాలి. ఎందుకంటే ఈ రోజు ఈ విషయాల పట్ల కొంత విమర్శలు వింటున్నాము అందుకే వీటిని అర్థం చేసుకోవడం చాలా అవసరం.

"రాజ్యాంగం ఒక ప్రాథమిక దస్తావేజు అందులో దేశం మూడు విభాగాల స్థాయి, అధికారాల గురించి చెప్పడం జరిగింది. అవి కార్య నిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, శాసన వ్యవస్థ. అందులో పౌరుల పట్ల కార్యనిర్వాహక వ్యవస్థకు, శాసన వ్యవస్థకు ఉండే అధికారాలను, ప్రాథమిక హక్కులకు సంబంధించిన అధ్యాయంలో వివరించినట్టుగానే నిర్వచించడం జరిగింది. వాస్తవానికి రాజ్యాంగం ఉద్దేశం కేవలం దేశం విభాగాలను సృష్టించడం కాదు వాటి అధికారాలను పరిమితం చేయడం. పరిమితులు విధించక పోయి ఉంటే, అది పూర్తిగా దౌర్జన్యం, అణచివేతకు దారితీస్తుంది. శాసనసభ ఏ చట్టమైనా చేసి ఉండవచ్చు. కార్యనిర్వాహక వ్యవస్థ ఏ విధమైన నిర్ణయమైనా తీసుకుని ఉండి ఉండవచ్చు, సుప్రీంకోర్టు చట్టాన్ని నిర్వచించే స్వేచ్ఛ తీసుకుని ఉండవచ్చు. ఇది పూర్తిగా గందరగోళానికి దారితీస్తుంది." బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఈ విషయాన్ని బలంగా చెప్పారు. ఇదే విషయాన్ని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గజేంద్ర గడ్కర్ అధ్యక్షతన లా కమిషన్ ఇచ్చిన నివేదికలో ఒక ముఖ్యమైన అంశంగా పేర్కొన్నారు.

"వ్రాతపూర్వక రాజ్యాంగం చేత పాలించ బడే భారతదేశం లాంటి ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం తన ఆధిపత్యాన్ని చట్టబద్ధంగా పొందవచ్చు. రాజ్యాంగమే సర్వోన్నతం. అది చట్టాల కే చట్టం. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలకు, కార్యనిర్వాహక వ్యవస్థకు, న్యాయ వ్యవస్థలకు

వాటి అధికారాలను ఇస్తుంది. అలాగే వారికి సంబంధించిన విధులను అప్పగిస్తుంది. కొన్ని పరిమితులలో వారికున్న అధికారాలను, విధులను చట్టబద్ధంగా నిర్వహించేలా సూచిస్తుంది." అని గజేంద్ర గడ్కర్ గారు చెప్పారు. దీని అర్థం మన రాజ్యాంగం స్పష్టంగా, సూటిగా ఉన్నది. ఈ విషయాలన్నిటినీ ప్రజలకు తెలియజేస్తూ ముందుకు వెళ్లడం మన అందరి బాధ్యత.

ఈరోజు మనకి రాజ్యాంగం మరింత ముఖ్యమైనది, ఎందుకంటే మన దేశం వైవిధ్యాలతో నిండి ఉంది. వేరు వేరు ప్రదేశాలలో వేరు వేరు వ్యక్తీకరణలు మన బాధ్యత. ఈ రోజు మనం ఈ ప్రజాస్వామ్య దేవాలయంలో సమావేశం అయినప్పుడు మనల్ని ఐక్యంగా ఉంచుతున్న ఆ సంకల్పం ఏమిటి? డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఈ విధంగా చెప్పారు "ఒక మంచి రాజ్యాంగం చెడుగా కూడా అవ్వచ్చు. ఎందుకంటే ఎవరైతే పని చేయడానికి పిలువబడ్డారో, వారు చెడ్డ వారు అయి ఉండవచ్చు. అలాగే ఒక చెడ్డ రాజ్యాంగం మంచిది అవ్వచ్చు. ఒకవేళ అక్కడ పని చేయడానికి పిలవబడిన వారు మంచి వారు అయినట్లయితే. కాబట్టి రాజ్యాంగం పనితనం రాజ్యాంగం స్వభావం పై ఆధారపడి ఉంటుంది."

నిన్న సోనియా గాంధీ గారు ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈరోజు కూడా రాజ్యసభలో ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. రాజ్యాంగం పవిత్రతను కాపాడడం మన అందరి బాధ్యత.

చివరికి ఆధిపత్యమే ఎన్నో విషయాలకి ముఖ్యం. కానీ ప్రజాస్వామ్యంలో సమ్మతితోనే బలం వస్తుందన్న విషయం మనం మర్చిపోకూడదు. మేము రాజీ, సమ్మతి ద్వారానే ప్రయత్నాలు చేస్తున్నాము కానీ అన్ని ప్రయత్నాలు బెడిసి కొట్టిన తర్వాత చివరి మార్గంగా ఆధిపత్యాన్ని ఉపయోగిస్తాము. ఈ సభలో ఒక వైపు ఎక్కువ సభ్యులు ఉన్నంత మాత్రానా,

బలవంతంగా ఏ నిర్ణయాన్ని రుద్దే అధికారం వారికి లభించదు. మనం సమ్మతం మరియు ఒప్పందం అనే మార్గాలనే అనుసరించాలి.

మనకి ప్రతి ఒక్కరి సహకారం, సహచర్యం లభించాలి. అన్నీ విఫలమైతే ఏ పని జరగదు. ఆ తర్వాత తుది నిర్ణయం జరుగుతుంది. నిర్ణయాలన్నీ ఆధిక్యం, అల్పం అనే త్రాసులో తూయ బడతాయి. ఈ భావాన్ని మనం ముందుకు తీసుకువెళ్లాలి. అటల్ బిహారీ వాజ్పేయి గారి ప్రభుత్వం ఉండేది, వారు ఈ సభలో బల పరీక్ష ఎదుర్కొన్నారు. ఆ పరిస్థితిలో నువ్వా నేనా అన్నట్టు గా ఉండేది. ఒడిస్సా ముఖ్యమంత్రి శ్రీ గిరిధర్ గారు ఈ సభలో సభ్యుడిగా ఉండేవారు. శాసనసభ సభ్యుడిగా గెలుపొంది ఉన్నారు. ముఖ్యమంత్రి కూడా అయ్యారు. కానీ ఈ సభలో రాజీనామా చేయలేదు. పదిహేను రోజుల సమయం అప్పుడు ఉండేది. ఆ సమయంలోనే వాజ్పాయ్ గారు బలపరీక్ష ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో ఒక వివాదం ఉండేది, వారు సభకి వస్తే,ఏం చేస్తారు అని. అప్పటి స్పీకర్ గారు వారికి ఒక సూచన చేశారు. వారి అంతరాత్మకు ఏది సరైనది అనిపిస్తే అది చేయమని. ఆ తరువాత వారు అటల్ గారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు, అటల్ గారు ఒక్క ఓటు తేడాతో బలపరీక్ష ఓడిపోయారు. రాజ్యాంగం ఉన్నతమైన చేతులలో ఉన్నట్లయితే ఏ విధంగా జరుగుతుంది, ఎప్పుడైనా పొరపాటు జరిగితే అది ఏ విధంగా ఉంటుందో ఇంతకంటే పెద్ద ఉదాహరణ ఉండదు. అందుకే నేను నమ్మేది ఏంటంటే ఆ రోజు అటల్ గారి ఉపన్యాసం, వారు అధికారాన్ని వదిలిన ఈ పరిస్థితిని మనం ఎప్పటికీ మర్చిపోలేము. వారు ప్రజాస్వామ్యం ఉన్నతత్వాన్ని అంగీకరించారు.

మన దేశం ఎన్నో వేల సంవత్సరాల దేశం, మనలో లోపాలు ఉంటాయి. కొన్నిసార్లు చెడు మన సమాజంలో ప్రవేశిస్తుంది. అయినా సరే, మన అస్తిత్వం ఎక్కడికీ పోదు.

నేను మాట్లాడుతున్న మాటలకి మూల బలం ఏమిటి? అది వేల సంవత్సరాల సమాజం మనకి ఉంది. అందులో ఆటో పైలట్ అంటే తనకు తాను అర్హత నిర్ణయించే ఒక వ్యవస్థ ఉంది. మనం గమనించాము. చెడు మన సమాజంలో కి ప్రవేశించ లేదని చెప్పలేము. చెడు వచ్చింది, కొన్ని సందర్భాలలో వేళ్ళూనుకుంది. కానీ ఇదే సమాజంలో ఈ రుగ్మతలను నశింప చేయడానికి కొంతమంది వారి జీవితాన్ని ధారపోసారు. సమాజం వారిని వ్యతిరేకించినా, వారు పోరాడారు. సమాజం ఐక్యత కోసం వారు కృషి చేశారు. సమాజంలో సమయానుకూలంగా కొన్ని మార్పులు వారు తీసుకువచ్చారు. మనదేశంలో ధార్మిక సాంప్రదాయాలు మన సమాజాన్ని కట్టి పడేశాయి. పురోహితులు తాండవం చేసేవారు, ఈ సమాజం ఒకరకంగా దిగజారిపోయింది. అలాంటి పరిస్థితులలోనే దేశంలో భక్తి యుగం వచ్చింది. చైతన్య మహాప్రభు కానివ్వండి, మీరాబాయి కానివ్వండి, నరసింహ మెహతా కానివ్వండి. ఎంతోమంది ఈ సమాజాన్ని రుగ్మతల బారి నుండి కాపాడారు. ఇదే సమాజంలో సతీ సహగమనం పట్ల గర్వంగా ఉండేవారు. రాజా రామ్మోహన్ రాయ్ గారు జన్మించారు. సమాజానికి వ్యతిరేకంగా ఆ వ్యక్తి నిలబడి సతీసహగమనం పాపమని, అది వితంతు దహనం అని చెప్పారు. ఈ విధంగా దేశంలో సాగదు. సమాజం మార్పుని స్వీకరిస్తుంది. విద్యాసాగర్ రావు జన్మిస్తారు ఒక మహిళ వితంతువు అయినప్పుడు, జీవితాంతం ఆవిడ కష్టాలు అనుభవిస్తుంది. ఆ యుగం లోనే కాకుండా ఇప్పుడు కూడా సమాజంలో అలాంటివి మనం చూస్తూ ఉంటాము. విద్యాసాగర్ గారు అప్పట్లో వారు చూసిన పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో మనం ఊహించవచ్చు. అందుకే వారు వితంతువులకు మళ్లీ వివాహం చేయాలని చెప్పేవారు. ఆడపిల్లలను చదివించాలి అని చెప్పారు. బాబాసాహెబ్ అంబేద్కర్, జ్యోతిబా పూలే, సమాజం చేత అణిచివేయబడిన, పీడించబడిన, విస్మరించబడిన పేదల దయనీయ పరిస్థితి చూసి వారి కోసం మైదానంలోకి వచ్చారు. అంటరానితనం ఉన్న ఆ కాలంలో

మహాత్మా గాంధీ, నర్సింహా మెహతా లాంటివారు ముందుకు వచ్చారు. రాజకీయాలను పక్కన పెట్టి అంటరానితనాన్ని అంతమొందించడానికి వారు వారి జీవితాన్ని ప్రారంభించారు. అదే సమయంలో మన సమాజంలో అవినీతి తారాస్థాయికి చేరుకుంది. అప్పుడు జయప్రకాశ్ నారాయణ గారు ముందుకు వచ్చారు, వారి జీవితాన్ని ఈ పోరాటంలో గడిపేశారు. ఈ దేశంలోని సమాజంలో చెడులను ఎదుర్కోవడానికి ఒక వ్యవస్థ ఎప్పుడూ ఉంటుంది. ఒక ఆటో పైలెట్ వ్యవస్థ ఉంది ప్రతి ఈ కాలంలో ఎవరో ఒక మహాపురుషుడు వచ్చి ఈ సమాజానికి ఒక దిశని చూపిస్తాడు, సమాజాన్ని రక్షిస్తాడు. అందుకే ఇదే మన బలం. ఈరోజు రాజ్యాంగం మనకి దారి చూపిస్తుంది. కానీ ఒక యుగంలో అది లేనప్పుడు కూడా సమాజం ఉండేది ఆ తర్వాత మనకి రాజ్యాంగం ఆసరా లభించినప్పుడు మనం సమాజ హితం కోసం ఎంత చేయగలము? మన సమూహానికున్న మంచిపేరు కి ఎక్కువ నష్టం వాటిల్లింది.

స్వాతంత్ర ఉద్యమంలో దేశం కోసం పోరాడిన వ్యక్తులను సమాజం ఎంతో గర్వంగా చూసేది.వారి కుటుంబం పట్ల కూడా వారు ఎంతో గౌరవంగా చూపేవారు. కానీ ఒకటి మాత్రం నిజం, ఏవో కారణాలవల్ల రాజకీయ రంగం గౌరవం తగ్గింది. సమాజం వారిని చూసే వైఖరి మారింది. నాయకులు అర్థం చేసుకోగలరు. ఇది మనందరికీ ఒక సవాలు లాంటిది. మన ప్రవర్తన ద్వారా మరోసారి ఈ రంగం ప్రతిష్ట పెంచుకోవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఈ సంస్థ ప్రజాస్వామ్యం అనివార్యమైన భాగం. దీని బలాన్ని ఎలా పెంచాలి. ఇంత అపఖ్యాతి పాలైన్నప్పటికీ మనల్ని సమాజం ఇంకా నిందిస్తూనే ఉంది. నాయకులందరూ చెడ్డవారని, రాజకీయ కార్యకర్తలు చెడ్డవారని, ప్రతీ పాపం మనపై వేసి పగలు రాత్రి మనకి వినిపిస్తూ ఉంటారు. కానీ నేను దేశానికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను, ఇదే రాజకీయ నాయకులు ఈ సభలో కూర్చొని వారిపై కొన్ని పరిమితులు విధించుకున్నారు. మీరే చూడండి, మనం ఎన్నికలకి వెళ్లేముందు ఒక దరఖాస్తు నింపి ఇస్తాము. ఇందులో మన పై

ఉన్న కేసుల గురించి, మన వద్ద ఉన్న ఆస్తుల గురించి తెలియజేస్తాము. ఇది మన పై రుద్దబడిన విషయం కాదు. రాజకీయ నాయకులు ఎవరు, ప్రభుత్వం ఎవరిదో అనేది నాకు అనవసరం. ఇదే సభలో కూర్చుని ఉన్న సభ్యులు, రాజకీయ పార్టీలు ఈ ఆత్మ పరిశీలన స్వీకరించారు, వారే ఈ మార్పు తీసుకు వచ్చారు. అంతేకాదు ఎన్నికలలో ఖర్చు ఎక్కువ జరుగుతుందని అందుకే నల్లధనం తగ్గించాలని నిర్ణయించారు. ఈ రాజకీయ నాయకులు ఎన్నికల సంఘం తో ఏకగ్రీవంగా ప్రమాణం చేశారు. మనము అకౌంటింగ్ వ్యవస్థని ప్రవేశపెట్టాం. అంతేకాకుండా ఎన్నికల సంఘానికి రోజు వారి లెక్కలు ఇచ్చాము. ఎన్ని పరిమితులు వచ్చినా రాజకీయ పార్టీలు వాటిని స్వీకరిస్తూనే ఉన్నాయి. ఎందుకంటే వారికి కూడా రాజకీయ నాయకులు సున్నితమైన వారని తెలుసు. ఏ పార్టీకి చెందిన వారైనా ఏ సంప్రదాయానికి చెందిన వారైనా సరే వారు దేశ సంక్షేమం కోసం వారి బాధ్యతలను సున్నితంగా నిర్వహించారు. కానీ దురదృష్టం ఏమిటంటే దేశంలోని రాజకీయాల పట్ల ఆ విధమైన అభిప్రాయం ఉండడం.

ఒకప్పుడు మంత్రుల సంఖ్య పెరగడం ఒక సమస్యగా మారింది. రాజకీయ ఒత్తిడి వల్ల సమన్వయాన్ని పాటించడం కష్టమయ్యేది. అటువంటి పరిస్థితిలో రాజకీయ నాయకులు, ఈ సభలో ఉన్న రాజకీయ పార్టీలు కలిసి ఒక కోటా వ్యవస్థని తీసుకురావడం జరిగింది. ఒక పరిమిత శాతం కంటే ఎక్కువమంది మంత్రులు ఉండకూడదని నిర్ణయించడం జరిగింది.

మేము ఆ వ్యవస్థని పాటించాము. మన పై కొన్ని పరిమితులు విధించకున్నాము. రాజకీయ రంగానికి చెందిన వారు వారిపై పరిమితులు విధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకి అవసరం. సమయానుకూలంగా అవసరం పడినప్పుడు, అప్పుడప్పుడు ఆలస్యమైనా ఆ మార్పులు చేసాము. సుప్రీంకోర్టు, ఇంత కాలం శిక్ష పడినట్లయితే ఎన్నికలలో పోటీ చేయకూడదని నిర్ణయించింది. పార్లమెంటులో చట్టాలు చేయగలరు, చట్టాలు చేసి విముక్తి

పొందగలరు కానీ ఇదే పార్లమెంట్ లో ఈ రాజకీయ నాయకులు చట్టాలని వారికి వర్తించేలా నిర్ణయించారు. ఒకవేళ శిక్ష పడినట్లయితే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోనని పేర్కొంది. ఈ విషయాలన్నీ కూడా మనం గర్వించదగిన అంశాలు. అందుకే రాజకీయ జీవితంలో ఉన్నప్పటికీ మనం ఈ సాంప్రదాయాలను స్వీకరించి ఉన్నాము, ఆ దిశగా మనం కృషి చేస్తూనే ఉంటాము. ఈ సభలో ఒకరిని మించి ఒకరు గొప్ప వ్యక్తులు కూర్చున్నారు, ఇది ఈ సభ ప్రత్యేకత. నాకు ఒక విషయం గుర్తు ఉంది, నేను పార్టీ కోసం పనిచేస్తున్నప్పుడు, టీవీలో జరిగే చర్చా కార్యక్రమాల్లో పాల్గొనవలసి వచ్చేది. అందులో ప్రైమ్ టైం కూడా ఉండేది. ఆ సమయానికి ఎక్కువ డిమాండ్ ఉండేది. ఒకసారి నేను, గులాం నబీ ఆజాద్ గారు చర్చలో పాల్గొన్నాము. అందులో నువ్వా నేనా అని వాదించడం సహజం. కానీ ఆ కార్యక్రమం పూర్తయిన తర్వాత స్టూడియో లోపల మేము కలిసి టీ తాగడం జరిగేది. సీనియర్ పత్రికా విలేకరులు ఎవరో నాకు గుర్తులేదు. వారితో గులాంనబీ గారు ఒక ముఖ్యమైన విషయం చెప్పారు వారు ఏమన్నారంటే మీరు మేము పరస్పర శత్రువులు అనుకోవచ్చు కానీ ఎప్పుడైనా పార్లమెంట్ వచ్చి చూడండి ఎలా కుటుంబంలా మేము మెలుగుతామో, మా మధ్య ఎంతో అన్యోన్యత ఉంటుంది అని. ఇది మోడీ తీసుకు వచ్చిన సంప్రదాయం కాదు. గత 50 సంవత్సరాలుగా మనం తీసుకువచ్చిన సాంప్రదాయం. అందుకే ఇటువంటి గొప్ప విషయాలను మనం ప్రశంసించాలి, గౌరవించాలి, పెంపొందించాలి. ఇది మనపై ఉంది. ఒకప్పుడు ఈ సభలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నా సరే.

ఒకసారి రామ్ మనోహర్ లోహియా గారు ఈ సభలో ఒక చరిత్రాత్మక మాట చెప్పారు. గణాంకాల ద్వారా పండిత నెహ్రూ గారి తో మీ విధానాలు దేశానికి పనికిరావు, అవి తప్పుడు విధానాలని చెప్పారు. రామ్ మనోహర్ లోహియా గారు అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. అతను గట్టిగా చెప్పారు, కానీ గౌరవప్రదమైన విషయం ఏమిటంటే నెహ్రూగారు నిలుచుని

వారి గణాంకాలను కాదనలేను అని గౌరవంగా చెప్పారు. ఈ విధమైన ఉన్నతత్వం ఉండేది, అది పండిత నెహ్రూ గారు మనదేశానికి చూపించారు. మన సత్య నిష్టతో కూడిన బుద్ధితో మన సహచరులను గౌరవించాలి, రాజ్యాంగం యొక్క ఈ భావనను మనం అప్పుడే స్వీకరించగలం. అందుకే మన బుద్ధిలో సత్యనిష్ఠ ఉంది, మన సహచరులకు ఆ దేవుడు ఎంతోకొంత అలాంటి బుద్ధిని ఇచ్చాడు. ఆ విషయాన్ని ఆదరించి సత్కరించడం మనం అందరూ సహజంగా చేయాలి. కొన్ని సార్లు మనకు ఆందోళన కలిగించే విషయం ఉంటుంది. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహాపురుషులు మన సమాజానికి ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసే వారు. వారిలో ఆ విధమైన గుణం ఉండేది. వారు ఇది తప్పు, చేయవద్దు,చేయకూడదు అని చెప్పేవారు. అంత శక్తి ఉండేది.

మహాత్మా గాంధీ గారు ఎప్పుడు రాజీ పడలేదు. కానీ కాలక్రమేణా మనము ఎలాంటి పరిస్థితిలో ఉన్నామంటే, మనం ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజలకు కూడా ఏమీ చెప్పలేక పోతున్నాం. ఎక్కువగా మన రాజ్యాంగంలోని ఒక్క అంశమే వెలుగులోకి వచ్చింది. అదేమిటంటే మన హక్కులు, అధికారాలు ఏంటి? అనే విషయం. దేశమంతా కూడా వీటి చుట్టూనే తిరిగింది. ఈ పవిత్ర సందర్భంగా నేను సభని ప్రార్థిస్తున్నాను. దేశ పౌరులని విన్నవించుకుంటున్నాను, సమయానుకూలంగా మనం మన అధికారాలపై ఎంతగా నొక్కి మాట్లాడుతున్నామో అంతే ప్రాధాన్యతతో మన విధుల గురించి కూడా మాట్లాడాలి. దేశం అధికారాలు, విధులు అనే మిశ్రమ భావంతోనే ముందుకు వెళ్ళగలదు. మన ప్రభుత్వ అధికారులని ఏ పని గురించి అయినా అడిగి నట్లయితే అప్పుడు చూడండి ఏమవుతుందో? మొదటి ప్రశ్న అది సరే గానీ నాకేంటి అని అడుగుతారు. దానికి ప్రతికూల సమాధానం వచ్చినట్లయితే నాకేంటి అని వదిలేస్తారు. ఇలాంటి పరిస్థితి దేశానికి మంచిది కాదు. కర్తవ్య

భావాన్ని జాగృతం చేయాలి. మహాత్మా గాంధీ గారు ఒక మంచి విషయం చెప్పారు. నాకు ఆ కాగితం దొరికితే చెప్తాను. ఆ విషయం మనము, దేశము గుర్తుంచుకోవలసిన విషయం.

ఈరోజు పెట్టుబడిదారులు, జమీందారులు తమ హక్కుల గురించి మాట్లాడుతున్నారు. మరోవైపు కార్మికులు వారి ప్రయోజనాల గురించి మాట్లాడుతున్నారు. రాచరిక ఆధిపత్యం గురించి కొందరు మాట్లాడితే రైతులు ఆ అధికారాన్ని అవహేళన చేశారు. అందరూ అధికారాల గురించి మాట్లాడి, కర్తవ్యాలను విస్మరిస్తే, దాని పరిణామం గందరగోళం, అరాచకత్వం అవుతుంది.

అందరూ వారి అధికారాల స్థానంలో కర్తవ్యాల గురించి మాట్లాడినట్లయితే మానవాళి లో ఒక సవ్యమైన నియమావళి తీసుకురావడం సత్వరమే సాధ్యమవుతుంది. ప్రజలకు పాలించే నైతిక హక్కు లేదు, అలాగే రైతులు వారి యజమానుల ప్రతి ఆదేశాన్ని పాటించాలని లేదు ఇది గాంధీ గారి సందేశం. అందుకే మనం రాజ్యాంగం గురించి చర్చిస్తున్నప్పుడు ఈ విషయాలు ప్రముఖంగా మన ముందుకు వస్తాయి. మనం మన కర్తవ్యాలను మరింత బలంగా ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచించాలి. కర్తవ్యాల కి దగ్గరగా మనం మన సమాజాన్ని తీసుకు వెళ్లడంలో ఏ విధమైన పాత్ర పోషించగలమో చూడాలి. అది మనం తప్పకుండా చేయాలి.

రాజ్యాంగం గురించి ప్రస్తావిస్తూ ఉన్నప్పుడు డాక్టర్ రాజేంద్ర బాబు గారు ఒక విషయాన్ని చెప్పారు. వారు పేదరికం, దీనస్థితిని నిర్మూలిస్తూ, వ్యాధులు, ఆకలిని అంతమొందించేలా ప్రయత్నాలు జరుగుతాయని భరోసా ఇచ్చారు. అంతరాలు, దోపిడిని సమాప్తం చేసి జీవితానికి ఉత్తమమైన దిశా నిర్దేశాన్ని చేయాలని వారు చెప్పారు. మనం ఒక గొప్ప మార్గం పై ప్రయాణం చేస్తున్నాము. ఈ యాత్రలో అందరి ఉదార సేవ, సహాయం

లభిస్తుందని నేను ఆశిస్తున్నాను, వేర్వేరు సముదాయాల సానుభూతి, మద్దతు లభిస్తాయని ఆశిస్తున్నాను. ఈరోజు మన వద్ద రాజ్యాంగం ఉంది ఎవరైనా భ్రమలు వ్యాప్తి చేసినట్లయితే అది తప్పు. ఎవరూ రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన చేయరు. ఆ విధంగా ఎవరైనా ఆలోచించినట్లయితే ఆత్మహత్య చేసుకున్నట్టు అవుతుంది. ఎందుకంటే ఆ మహా పురుషులు ఏదైతే ఆలోచించారో ఈనాటి పరిస్థితులలో ఆ పని చేయడం కష్టం. అందుకే మనం పేదలు, దళితులు, పీడితుల కోసం ఏ విధంగా పని చేయగలమో దాని గురించి ఆలోచిస్తే మంచిది. మన దృష్టి దానిపై ఉండాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రిజర్వేషన్ల వ్యవస్థ పై శ్రద్ధ వహించి ఉండక పోయి ఉంటే మన దళిత, అణగారిన, దోపిడికి గురైన సమాజం పరిస్థితి ఎలా ఉండి ఉండేది? ఆ దేవుడు మన అందరికీ ఇచ్చినవే వారికీ ఇచ్చాడు, కానీ వారికి అవకాశం లభించక దీన స్థితిలో ఉన్నారు. వారికి అవకాశాలు ఇవ్వడం మనందరి బాధ్యత. సమాజంలోని ఇంత పెద్ద సమూహం అభివృద్ధి ప్రయాణంలో మనతో కలిసి నడుస్తున్నట్టయితే మనం దేశాన్ని ఎక్కడికో తీసుకు వెళ్ళవచ్చు.

ఏ ప్రాంతము అభివృద్ధిలో వెనుకబడ కూడదు. ఏ సమాజం వెనక పడకూడదు. మన శరీరంలోని ఏ అవయవం స్తంభించినా, ఆ శరీరాన్ని ఆరోగ్యకరంగా పరిగణించరు. శరీరంలోని ఏ అవయవం బలహీనంగా ఉన్నా, ఆ శరీరం ఆరోగ్యకరమైనది కాదు. సమాజంలో ఒక భాగం బలహీనంగా ఉంటే ఆ సమాజం బలమైనదిగా పరిగణించలేము.

ఈ దేశం బలమైనదని అనుకోలేము. అందుకే దేశాన్ని పటిష్ఠ పరచాలంటే సమాజంలోని ప్రతి అవయవం బలంగా ఉండాలి పురుషులు కానివ్వండి, స్త్రీలు కానివ్వండి. ఈ కులం కానివ్వండి, ఆ కులం కానివ్వండి. ఈ మతం లేదా ఆ మతం కానివ్వండి. ఈ భాష వారు లేదా ఆ భాష వారు కానివ్వండి. ఈ భూభాగం మీద ఉన్న వారందరూ శక్తివంతంగా ఉండాలి. అందరి సాధికారత కోసం మనం ఏమి చేయాలో ఆలోచించాల్సిన అవసరం ఉంది, ఆ

పనిని మనం పూర్తి చేయాలి. మన ముందు మంచి అవకాశం తోపాటు సవాళ్లు కూడా ఉన్నాయి.

ఎనిమిది వందల మిలియన్ల యువత ఉండడం ఈ దేశం అదృష్టం. వారికి ఉపాధి కల్పించడం, వారికి నైపుణ్యాలు ఇవ్వడం, భారతదేశం భవిష్యత్తు మార్చడానికి మన వద్ద ఉన్న తెలివితేటలు, జ్ఞానం, సంపద, వ్యవస్థ, రాజ్యాంగాన్ని ఉపయోగించి ఈ శక్తిని మనం బయటకు తీసుకు రావాలి. మనదేశంలో ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా మన అందరిని వేధించే విషయం, న్యాయం సహజంగా సులభంగా, వేగంగా లభించాల్సిన ఆవశ్యకత. ప్రజాస్వామ్యంలో ఉన్న ముఖ్యమైన అంశాలలో ఒక ముఖ్యమైన అంశం - ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ. ఈ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది అదేవిధంగా గా సామాజిక న్యాయం గురించి కూడా మనం ఆలోచించాలి. వాటితో పాటు సామాన్య ప్రజానీకం జీవితంలో కూడా న్యాయం ఎలా అని ఆలోచించాలి. లోక్ అదాలత్ వల్ల ఎన్నో మంచి ఫలితాలు సాధించాము, ఆ దిశగా ముందుకు వెళ్లాలి, ఆ దిశగా ప్రయత్నం చేసినట్లు అయితే చాలా వరకూ మనం పని చేయగలం. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఏదైతే గొప్ప పని చేశారో అది ఈ నాడు శ్రామికుల చెవులకు చేరలేదు. ఖర్గే గారు నిజమే చెప్పారు. ఇంతకుముందు నియమాలు ఉండేవికావు. కార్మికులు ఎన్ని గంటలు పని చేయాలో, ఎవరికీ ఆ విషయం తెలియదు. వారు అలిసిపోయినంతవరకు పనిచేసేవారు. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు బలంగా వాదించి కార్మికుల కోసం ఎనిమిది గంటల పని వేళలు నిర్ధారించడం జరిగింది.ఎవరైనా మహాపురుషుడు ఒక మంచి పని చేసి వెళితే అది తరాల వరకు ఎంతో మేలు చేస్తుందని మనం చూడవచ్చు. మనం అలాంటి పని చేయడం చాలా అవసరం అని నేను నమ్ముతున్నాను. ఈ బాధ్యతని తీసుకున్నప్పుడు ఇక్కడ కార్మికుల ఈపీఎఫ్ ఖాతాలు ఉన్నాయి. ఈ కార్మికులు ఒక చోటి నుంచి మరో చోటికి వెళ్ళి నప్పుడు వారి డబ్బులు

ఏమయ్యాయో తెలిసేది కాదు. వారి సొమ్ము చాలా తక్కువ ఉండేది కాబట్టి వాటిని తీసుకోవడానికి వారు వెళ్ళేవారు కాదు. అందువల్ల ప్రభుత్వం వద్ద 27 వేల కోట్ల రూపాయలు ఉండిపోయాయి. అవన్నీ కార్మికుల డబ్బులు. వారు కష్టపడి సంపాదించిన సొమ్ము. కానీ వారి వద్ద ప్రశ్నించే తత్వం లేక, ఏ వ్యవస్థ లేక ఇబ్బంది పడ్డారు. మేము అధికారంలోకి వచ్చాక పోర్టబులిటీ పొందుపరిచాము. వారికి ఒక యు ఎం సంఖ్య నిర్ధారించాము. దానివలన కార్మికులు ఎక్కడికి వెళ్ళినా, ఉద్యోగం వదిలేసినా, రాష్ట్రం వదిలి వెళ్ళినా, గ్రామం వదిలి వెళ్ళినా, ఎక్కడికి వెళ్ళినా, ఆ యు ఎం సంఖ్య ఆధారంగా వారి ఖాతాని అనుసంధానించి బదిలీ చేయడం జరుగుతుంది. వారి డబ్బులు వారితోనే ఉంటాయి. వాటిని ఎవరు దోచుకోలేరు. ఈ పని చేసే ప్రయత్నం మేము చేసాము. ఎల్ ఐ ఎన్ నెంబర్, ఆన్ లైన్ వ్యవస్థ కార్మికుల కోసం రూపొందించాము. ఎల్ ఐ ఎన్ సంఖ్య ఉన్నట్టయితే వారికి లభించాల్సిన ప్రయోజనాలన్నీ వారికి లభిస్తాయి. మనదేశంలో ఈపీఎఫ్ పెన్షన్ లభిస్తుంది.. నేను అధికారంలోకి వచ్చినప్పుడు నా దృష్టికి వచ్చింది – కొంతమందికి 7 రూపాయలు పెన్షన్, కొంతమందికి పది రూపాయల పెన్షన్ లేదా 20, 25 రూపాయల పెన్షన్ లభిస్తుంది, కొంతమందికి 250. ఆ సొమ్ము వారు పోస్ట్ ఆఫీస్ కి వెళ్లి తీసుకురావడానికి ఆటో చార్జీలకు కూడా సరిపోవు. కానీ ఆ వ్యవస్థ అలాగే నడుస్తూ ఉండేది. మేము అధికారంలోకి వచ్చాక కనీస పెన్షన్ ఒక వెయ్యి రూపాయలుగా నిర్ణయించాము. దానితో పాటు వారికి ఆధార్ కార్డు ద్వారా ప్రత్యక్ష ప్రయోజన పథకం తో అనుసంధానించాము. ఈ సభలో ఒక చట్టం ఉంది. బోనస్ చట్టం కింద ముప్పై ఐదు వందల పరిమితిని పెంచి ఏడు వేల రూపాయలు చేయబోతున్నాం. అర్హత పరిమితి ఏదయితే పదివేల రూపాయలు ఉందో దాన్ని ఇరవై ఒక్క వేల రూపాయలు చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సభలో ఈసారి మన కార్మికుల కోసం ఇంత ముఖ్యమైన అడుగు వేయబోతున్నాం. అందుకే ఒక నిర్ణయం తర్వాత

మరో నిర్ణయం మన దేశంలోని పేదల సంక్షేమం కోసం తీసుకుంటున్నాం.. ఆ దిశగా పని చేయడానికి మేము ప్రయత్నిస్తున్నాము.

కొన్ని సందర్భాలలో మనం ఎన్నో విషయాలు చర్చిస్తాం. నేను ఇంతకుముందు కూడా ఈ సభలో చెప్పాను, ఈ రోజు మరోమారు చెప్పదలుచుకున్నాను. ప్రభుత్వానికి ఒకటే ధర్మం ఉంటుంది, అది ఇండియా ఫస్ట్. ప్రభుత్వానికి ఒకటే గ్రంథం ఉంటుంది - అది భారత రాజ్యాంగం. దేశం రాజ్యాంగం తోనే నడుస్తుంది, రాజ్యాంగం తోనే నడవాలి. రాజ్యాంగం శక్తి వల్లనే దేశానికి శక్తి లభిస్తుంది. అందులో ఏ విధమైన అయోమయం లేదా సందేహం ఉండాల్సిన అవసరం లేదు. భారతదేశం ఏ ఆదర్శాలు, అభిప్రాయాల మధ్య అవతరించినదో అది మన బలం. అది మన ఆత్మబలం. అందుకే మన దేశం ఆంతరంగిక శక్తిని మనం తక్కువ అంచనా వేయాల్సిన అవసరం లేదు. వేల సంవత్సరాలు తపస్సు ద్వారా ఆంతరంగిక శక్తి లభిస్తుంది, అదే మన దేశానికి ఒక వేగాన్ని ఇస్తుంది. సమాజానికి ఒక గతిని ఇస్తుంది, సమస్యల నుంచి బయట పడడానికి శక్తినిస్తుంది.

నేను ఐడియా ఆఫ్ ఇండియా గురించి చెప్పాలనుకుంటున్నాను.

నా ఐడియా ఆఫ్ ఇండియా - సత్యమేవ జయతే

నా ఐడియా ఆఫ్ ఇండియా - అహింసా పరమో ధర్మః

నా ఐడియా ఆఫ్ ఇండియా - ఏకం సత్ విప్రా బహుదాఃవదంతి సత్య

నా ఐడియా ఆఫ్ ఇండియా - మొక్కలలో దైవాన్ని చూడడం

నా ఐడియా ఆఫ్ ఇండియా - వసుధైవ కుటుంబకం

నా ఐడియా ఆఫ్ ఇండియా - అన్ని మతాలు కలిసి ఉండడం

నా ఐడియా ఆఫ్ ఇండియా - అప్ప దీపో భవ

నా ఐడియా ఆఫ్ ఇండియా - టెన్ త్యాక్టెన్ భుంజిత

నా ఐడియా ఆఫ్ ఇండియా - సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాఃు

నా ఐడియా ఆఫ్ ఇండియా - న త్వహం కామయే రాజ్యం న స్వర్గం న పునర్భవం కామయే దుఃఖతప్తానం ప్రాణినామిర్తి నాశనం

నా ఐడియా ఆఫ్ ఇండియా - వైష్ణవ జనతో తేనే కహియె జె పీడ పరాయి జాణె రే

నా ఐడియా ఆఫ్ ఇండియా - మానవుని సేవే మాధవ సేవ

నా ఐడియా ఆఫ్ ఇండియా - సహ నావవతు సహ నౌ భునక్తు సహ వీర్యం కరువా వహై తేజస్వి నవదీత మస్తు మా విద్విషావహై

నా ఐడియా ఆఫ్ ఇండియా - నరుడు తన పని తను చేస్తూ ఉంటే నారాయణుడు అవుతాడు
నా ఐడియా ఆఫ్ ఇండియా - నారీ తు నారాయణి

నా ఐడియా ఆఫ్ ఇండియా - యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాఃు

నా ఐడియా ఆఫ్ ఇండియా - ఆనోభద్రాఃు క్రతవో యంతు విశ్వతఃు

నా ఐడియా ఆఫ్ ఇండియా - జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి

ఇదే భావంతో మరొక్కసారి సభలోని గౌరవనీయ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు. మీ అందరికీ నేను ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మీరు తీసుకున్న చొరవ కి ఈ దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. చాలా ధన్యవాదాలు.

2016



మహిళా లబ్ధిదారులతో మాట్లాడుతున్న శ్రీ నరేంద్ర మోదీ.

"మాతృ శక్తి మనకి గర్వకారణం.
మహిళా సాధికారత మన అభివృద్ధికి
చాలా కీలకం."

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

3 మార్చి 2016

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 3 మార్చి 2016

గౌరవనీయులైన స్పీకర్ గారు, ముందుగా నేను గౌరవనీయులైన రాష్ట్రపతి గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. రాష్ట్రపతి గారి ప్రసంగం ద్వారా ఉభయ సభల ముందు, దేశం ముందు, ప్రపంచం ముందు భారత్ గౌరవం, ప్రతిష్ట, ఉత్తమ అభివృద్ధి ప్రయాణం, విశ్వం పట్ల భారత్ కు ఉన్న అపేక్షలు, సామాన్య ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి చేస్తున్న ప్రయత్నాలు, దానికి సంబంధించి, వారి ప్రసంగంలో ఒక విస్తారమైన వివరణ ఇచ్చారు. అందుకు నేను గౌరవనీయులైన రాష్ట్రపతి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

సభలో ఈ ముఖ్యమైన చర్చలో పాల్గొని, గౌరవనీయ సభ్యులు వారి అనుభవాలు, అభిప్రాయాల ద్వారా దేశానికి ప్రయోజనం కలిగేలా చేశారు. గౌరవనీయులైన శ్రీ మల్లికార్జున్ గారు,శ్రీ వెంకయ్య నాయుడు గారు, మీనాక్షి లేఖి గారు, హర్సిమ్రత్ కౌర్ గారు, పి నాగరాజన్ గారు, శ్రీ సౌగత రాయ్ గారు, శ్రీ భర్తృహరి మెహతాబ్ గారు, శ్రీ జితేందర్ రెడ్డి గారు, శ్రీ మహ్మద్ సలీం గారు, సుప్రియ సూలే గారు, ములాయం సింగ్ యాదవ్ గారు, రాహుల్ గాంధీ గారు, అనుప్రియా పటేల్ గారు, శ్రీ రియో గారు, శ్రీ ఓవైసీ గారు ఇంకా ఎందరో మహానుభావులు, వారి అభిప్రాయాలను ఇక్కడ వెల్లడించారు. వారందరికీ నేను ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఎందుకంటే వారి అభిప్రాయాల ద్వారా ప్రజలని శక్తివంతం చేయడంలో, వారి శ్రేయస్సు కోసం దోహదపడ్డారు.

ఈరోజు ఈ సభలో సభ్యులందరి తరఫున స్పీకర్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఎందుకంటే రాష్ట్రపతి గారి ప్రసంగం లో పార్లమెంట్ కార్యకలాపాలు ఎలా

ఉండాలి, పార్లమెంట్ నుంచి ఏమి ఆశిస్తున్నారో వ్యక్తపరచడం జరిగింది. మన పెద్దల సలహాలను పాటించడం మంచి పద్ధతి. రాష్ట్రపతి గారు మన రాజ్యాంగ వ్యవస్థలో అందరి కంటే పెద్ద పదవిలో ఉన్నారు. వారి సలహాలు మనం తప్పకుండా పాటించాలి.

మేడం స్పీకర్ గారికి ప్రత్యేకంగా నేను ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. గత కొంతకాలంగా వారు కొన్ని కొత్త విషయాలు తీసుకున్నారు. వారు ఎస్ ఆర్ ఐ(Speakers Research Initiative) కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. పార్లమెంట్ సభ్యులు అందరికీ వేరువేరు విషయాలపై పరిశోధన సామాగ్రి లభించింది. దీనివల్ల మాకు జ్ఞానోదయం కలిగేలా ఒక మంచి కార్యక్రమం మీరు నడుపుతున్నారు. దీనివల్ల పార్లమెంట్ లో గుణాత్మక మార్పు తీసుకురావడానికి వీలవుతుంది. అందుకు నేను మీకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

వచ్చే నెల 5, 6 తేదీలలో మన దేశంలోని శాసన సభలు, లోక్ సభకు ఎన్నికైన మహిళా సభ్యుల అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు గౌరవనీయులైన స్పీకర్ గారికి నా అభినందనలు. మన మాజీ రాష్ట్రపతి తో సహా అందరూ మహిళా నాయకులు అందులో పాలుపంచుకోనున్నారు. ఇది మహిళా సాధికారత దిశగా నిర్ణయం చేసే ప్రక్రియలో మహిళల భాగస్వామ్యాన్ని నిర్ధారించే దిశగా మీరు తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం. మీరు భారత పార్లమెంట్ కార్యకలాపాలలో ఒక మంచి అడుగు వేశారు, దీనికి అన్ని పార్టీలు సహకారం అందించాయి. అన్నిటికంటే పెద్ద విషయం ఏమిటంటే, అన్ని పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు ఈ కార్యక్రమాన్ని జరిగేలా చూస్తున్నారు. దీనివల్ల ఒక మంచి వాతావరణం ఏర్పడింది. అందుకు నేను మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

అలాగే కొత్తగా ఎన్నుకోబడిన ఎంపీలకు BPST ద్వారా శిక్షణ కార్యక్రమం అందిస్తూ మీరు చాలా మంచి పని చేస్తున్నారు. ఓరియంటేషన్ కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి. వీటన్నిటికీ నేను నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

సభలు చర్చ కోసమే ఉండాలని రాష్ట్రపతి గారు అన్నారు. కానీ ఇటీవల సభలో జరిగిన కార్యకలాపాల వల్ల మన దేశం ఆందోళన చెందుతూ బాధపడుతుంది. సభ జరగనప్పుడు పాలకవర్గ నష్టం తక్కువ జరుగుతుంది, దేశ నష్టం చాలా ఎక్కువ జరుగుతుంది. పార్లమెంట్ సభ్యులకు కూడా నష్టం జరుగుతుంది, ప్రత్యేకించి ప్రతిపక్షానికి చెందిన సభ్యులకు ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. ఎందుకంటే వారు ప్రజల గొంతు ని ఆపే ప్రయత్నం చేశారు. కాబట్టి పార్లమెంటులో ఎంత వ్యతిరేకత ఉన్నా, కోపంగా ఉన్నా, అది బహిర్గతం కావాలి. ఈ సభ ఒక వేదిక లాంటిది, ఎక్కడైతే తర్కంతో కూడిన ప్రశ్నలు వేస్తారో, ఎక్కడైతే సూటిగా జవాబులు చెప్తారో ఆ వేదిక. ఎవరి తరఫు వాదన వారు చేస్తారు. అలాంటి వాదనలు ఎవరిని వదలవు. అలా ఆశించకూడదు కూడా. కానీ అలాంటి చర్చలు సభా గౌరవాన్ని, మర్యాదని పాటించినప్పుడే మన మాట ని బలంగా చెప్పగలం. అలాగే విశ్వసనీయతను కూడా కాపాడుకోగలం.

ఇది నరేంద్ర మోది చెబుతున్న ఉపదేశం కాదు, ఇది భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారికి చెందినది.

రాష్ట్రపతి గారి మాటలు చాలా ముఖ్యమైనవి ఎందుకంటే వారు ఈ ప్రక్రియలో చాలా సంవత్సరాలు గడిపారు. మనం వారి నుంచి ఎక్కువ ఆశించడం స్వాభావికం. నేను మీకు మరో విషయం చెప్పదలుచుకున్నాను. ఈ సభలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు ఒక ముఖ్యమైన బిల్లు ఆమోదించడానికి తోడ్పడాలని మనవి చేస్తున్నాను. నేను ఈ సభ అని

అన్నప్పుడు రెండు సభలు అని అర్థం. ఈ బిల్లు ప్రజల కోసం. ఈ బిల్లు వల్ల వ్యవస్థలోని దళారులు అంతమై పోతారు. ఈ బిల్లు వల్ల కింది స్థాయిలో బాధ్యతలు పంచుకోవచ్చు. ఈ బిల్లు ద్వారా పరిపాలనను జవాబుదారీగా మార్చవచ్చు. ఈ బిల్లు ద్వారా పథకాలలో ప్రజల భాగస్వామ్యం పెంచవచ్చు. సామాజిక న్యాయం, అభివృద్ధిలో కూడా వారి భాగస్వామ్యాన్ని మనం పెంచవచ్చు. ఈ బిల్లు ఈ ప్రజాస్వామ్య పునాదిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. ఇది నరేంద్ర మోడీ మాట కాదు.ఇది కూడా మన మాజీ ప్రధానమంత్రి శ్రీ రాజీవ్ గాంధీ గారు చెప్పారు. మనం మన పెద్దల మాటలు వినాలి.

సభా కార్యకలాపాలని ఆపడానికి కొన్ని విషయాలు చర్చించడం ఇక్కడ అవసరం అనిపిస్తుంది. మన మాజీ స్పీకర్ గారు ఎవరైతే ఇక్కడ కూర్చున్న కొంతమంది మహానుభావులకు మార్గదర్శిగా, తత్వవేత్త గా చాలా కాలం వరకు ఉన్నారు, వారు శ్రీ సోమ్ నాథ్ చటర్జీ గారు. ఏవైతే సమస్యలు ముఖ్యమైనవి అని అనుకుంటామో, వాటికోసం సమావేశాలను ఆపడం ప్రతికూల ఫలితాలను ఇస్తాయి.

దురదృష్టవశాత్తు రాజకీయ పార్టీలు పార్లమెంటు కార్యకలాపాలలో అంతరాయం కలిగించడం, సభని సమయానికి ముందే వాయిదా వేయించడం ద్వారా వేర్వేరు పార్టీలు లేవనెత్తుతున్న సమస్యకి ప్రాధాన్యం లభించినట్టు భావిస్తున్నాయి. పార్లమెంట్ కార్యకలాపాలలో అంతరాయం కలిగించడం ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం అని పరిగణించక పోయినా, కనీసం పార్లమెంట్ వ్యవస్థపై నమ్మక లోపం అని నమ్మాలి. దురదృష్టవశాత్తు అన్ని రాజకీయ పార్టీలు చిన్న చిన్న పార్టీలు కూడా ఇలాంటి అభిప్రాయం, దృష్టి కోణం కలిగి ఉన్నాయి. దీని పట్ల శ్రీ సోమ్ నాథ్ చటర్జీ గారు సభ్యుల ముందు ఆందోళన వ్యక్తం చేశారు.

సభ నిర్వహణకు సంబంధించి నేను మరో విషయం చెప్పాలనుకుంటున్నాను. ఇక్కడ మన పార్లమెంటులో భారత సార్వభౌమాధిపత్యం ఉంది. దేశాన్ని పాలించే బాధ్యతను తీసుకుని వచ్చాము. ఖచ్చితంగా ఒక సార్వభౌమ సంస్థ సభ్యుడిగా ఇది ఒక పెద్ద బాధ్యతతో పాటు గొప్ప సౌభాగ్యంగా నేను భావిస్తున్నాను. ఎందుకంటే ఈ దేశంలోని విశాలమైన జనాభా విధి నిర్వర్తించే బాధ్యత ఈ సభ కి ఉంది. మన అందరికీ, ఎల్లప్పుడూ కాకపోయినా, జీవితంలో అప్పుడప్పుడు ఈ బాధ్యత అనుభవించి ఉంటాము. మన విధి, బాధ్యత కోసం మనల్ని పిలిచినప్పుడు మనం ఆ బాధ్యతని నిర్వర్తించి ఉంటాం. మనం యోగ్యులమో కాదో అనేది మరో విషయం. కాబట్టి ఈ ఐదు సంవత్సరాలలో మా కార్య కాలంలో చరిత్ర ఒడ్డున నిలుచుని ఉన్నా, అప్పుడప్పుడు చరిత్రని రాసే ప్రక్రియలో భాగస్వాములం అయ్యాం. ఈ విధమైన ఆలోచన పార్లమెంట్ సభ్యుల పట్ల మన తొలి ప్రధానమంత్రి గౌరవనీయులు పండిట్ జవహర్లాల్ నెహ్రూ గారు 1957లో వ్యక్తపరిచారు. ఆ సమయంలో మనం కూడా సభ్యులము కాదు. అప్పుడు కూడా ఇదే ఆలోచన మా లో లేదా? మా పార్టీ నుండి ఎవరూ లేరు. అప్పుడు మీరు ఈ మాట అని ఉన్నారు. ఇది నేను ఎందుకు చెప్తున్నాను అంటే ఈ విషయం దేశానికి తెలియడం అవసరం. ఇదే లోక్ సభలో గొడవల మధ్య మీ మనో బలం వల్ల, దృఢత్వం వల్ల కొన్ని చట్టాలు ఆమోదించబడ్డాయి, కానీ అవి ముందు కి వెళ్ళలేకపోయాయి.

మన దేశంలో జలశక్తి చాలా ఉంది. ఎంతో ఉపయోగం ఉంది. నీరు పుష్కలంగా ప్రవహిస్తుంది. ఈ దిశగా ప్రభుత్వం ఒక కార్యక్రమం చేయాలనుకుంటుంది. ఆ పని చేయకుండా ఆపడం వల్ల దేశానికి ఏం ప్రయోజనం కలుగుతుంది? రాష్ట్రపతి గారు వారి ప్రసంగంలో ఏదైతే చెప్పారో ఆ విధంగానే స్పెషల్ ప్రొటెక్షన్ సవరణ బిల్లు ఈ విషయం పౌరుల కేంద్రీకృతంగా ఉండాలి. మనం చైతన్యవంతులైన పౌరుల హక్కుల గురించి మాట్లాడుతున్నాం. కాబట్టి అలాంటి బిల్లు ని ఆపడం వెనక నాకు ఏ విధమైన తర్కం కనిపించడం లేదు. జిఎస్టి బిల్లు

గురించి నిన్నటి నుంచి వింటున్నాను. ఇది మా బిల్లు,మా బిల్లు అని అంటున్నారు. ఈ బిల్లు కూడా మీదే. జిఎస్టి బిల్లు కూడా మీదే, కానీ దాన్ని కూడా అపడానికి ప్రయత్నాలు జరిగాయి. వినియోగదారుల రక్షణ బిల్లు, వినియోగదారులు ఎవరు? ఆ బిల్లును కూడా ఆపడం జరిగింది. అలాగే దివాలా స్మృతి. రాజ్యాంగంలోని పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి అయిన రాష్ట్రపతి గారి సలహాలు మేము ఖచ్చితంగా పాటించాలి అనుకుంటున్నాం. నేను పార్లమెంట్ గురించి మాట్లాడుతున్నప్పుడు గౌరవనీయులైన సభ్యులందరితో నేను నా ఆలోచనలను పంచుకోవాలని అనుకుంటున్నాను. ఈ ఆలోచన ఈ సభకి మొదటిసారి ఎన్నుకోబడి వచ్చిన సభ్యుడిది. ఈ ఆలోచనని ఒక ప్రధానమంత్రి ఆలోచనగా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ విషయాలు మనకు ఈ రోజు పనికి వస్తాయి

నాది ఒక సలహా. మీరు 5, 6 వ తేదీలలో మంచి కార్యక్రమాన్ని చేస్తున్నారు. 8 మార్చి ఈ సభ సమావేశం కానుంది.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోజు ఎజెండా ఇదే ఉండనిద్దాం. మనందరం కలిసి మార్చి 8 న కేవలం మన మహిళా సభ్యులు మాట్లాడే విధంగా అవకాశం ఇవ్వొచ్చు.

అదేవిధంగా మా కాలంలో ఇలా ఉండేది. మీ కాలంలో ఎలా ఉంది? మీరు ఎలా ఉన్నారు? మేము ఎలా ఉండేవాళ్ళం? దేశానికి మన గురించి ఇవి పూర్తిగా తెలుసు. అందుకే దేశానికి ఏ విధమైన ఇబ్బంది ఉండకూడదు. మనమందరం ఎవరం? ఎక్కడ ఉన్నాం? ఏమి ఆలోచిస్తున్నాము? దేశం మొత్తానికి తెలుసు. కానీ నేను ఈ సభలోని సీనియర్ మహానుభావుల మార్గదర్శకత్వం కోరుకుంటున్నాను. సంవత్సరంలో ఒకటి లేదా రెండు సమావేశాలలో, అందులో ఒక వారం ని మనం నిర్ణయించుకుని ఆ వారం రోజులు మొదటిసారిగా ఎంపీగా ఎన్నికై వచ్చిన సభ్యులను మాట్లాడడానికి ఆహ్వానిద్దాం. నేను మొదటి సారి ఎన్నుకోబడిన సభ్యుడిని కాబట్టి ఈ మాట అనడం లేదు. కానీ మన ఆలోచనలో

తాజాదనం తీసుకురావడానికి ఇలాంటి అవసరం ఉందని నాకు అనిపిస్తుంది. నాకు నమ్మకం ఉంది మీరు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో కొత్తగా ఎన్నికైన సభ్యులు ఏ విధంగా ఆసక్తి చూపిస్తున్నారో, దాని ఆధారంగా మనం వారికి అవకాశాలు ఇవ్వాలి. దేశం కోసం ఎన్నో కొత్త విషయాలు వారు మన ముందు ఉంచగలరు.ఆ దిశగా మనం ఏదో ఒకటి చెయ్యాలి.

మూడవ సలహా ఏమిటంటే ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. ప్రపంచం అంతా కలిసి ఈ నిర్ణయం తీసుకుంది. మన సుష్మా గారు దీనికి "సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు" అనే మంచి పదాన్ని ఇచ్చారు. హిందీలో ఆ పదానికి మంచి అనువాదం చేశారు. ఇలాంటివి నిర్ణయించాక ప్రభుత్వాలు వెళ్లిపోతాయి. మనం అందరం కలిసి ఎప్పుడైనా శనివారం సభలో కూర్చుని లేదా ఒకటి రెండు రోజుల సమావేశం చేసి అంతర్జాతీయంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు ఏవైతే నిర్వహించబడ్డాయో వాటిలో భారత పాత్ర ఎంత, వాటిని చేయడానికి మనం ఏమి చేయాలో చర్చించవచ్చు. మన ఎజెండాలో బోలెడు పనులు ఉన్నాయి. కానీ ఎప్పుడైనా మనం రాజకీయాలు లేకుండా కేవలం జాతీయ విధానం పట్ల, మానవతావాదం పట్ల మనం ఏమి చేయవచ్చో చర్చించాలి. ఈ దిశగా మనం ఆలోచిస్తాము అని నేను ఆశిస్తున్నాను.

అదే విధంగా నేను మరో మూడు విషయాలను మీ ముందు ఉంచుతున్నాను. ప్రభుత్వం ఏదైనా సరే, మన రాష్ట్రాలలో విద్యా వ్యవస్థ లో, ప్రాథమిక విద్య స్థాయి చింతించాల్సిన విషయం, బాధపడాల్సిన విషయం. మన దేశ బాలల భవిష్యత్తు గురించి మనం ఆలోచించక పోతే, ఏమౌతుందో ఆలోచించండి.

ఆ విధంగానే పర్యావరణం, గ్లోబల్ వార్మింగ్, CoP21 ఇవన్నీ కూడా మనం చేయాలి. ముందు ఒక పెద్ద సామాజిక బాధ్యత ఉంది. మరో విషయం దేని నుంచి మనం

భయపడతాము? భయపడడానికి కారణాలు ఉన్నాయి, ఆ విషయం లోతులోకి నేను వెళ్ళను. కానీ ఆలస్యంగా న్యాయం లభించడమంటే అన్యాయం జరిగినట్లు. ఈరోజు కూడా దిగువ న్యాయస్థానాలలో చాలా కేసులు పెండింగ్ లో ఉన్నాయి. మనందరం ఈ సభలో చర్చించి దానికి ఒక మార్గాన్ని వెతకవచ్చు, ఆ దిశగా కొన్ని పరిష్కారాలు కొనుక్కోవచ్చు. ఇలాంటి రెండు మూడు విషయాలు మేము నిర్ణయిస్తున్నాము. ఆరు నెలల ముందు మనం నిర్ణయించాము.

మనం నిపుణులు రాసిన పత్రాలను తెప్పించి, వాటిని అందరికీ పంచి, ఒక నాణ్యమైన చర్చ జరిపి అందులోనుంచి ఏవైనా చర్యలు తీసుకోగలమా? అలాంటి నిర్ణయాలు ఈ సభ సొంతం, ప్రభుత్వ యాజమాన్యం ఉండదు. ఇక్కడ ప్రభుత్వాన్ని కీర్తించాల్సిన అవసరం లేదు. ఈ సభలో ఎంతోమంది అనుభవజ్ఞులు కూర్చున్నారు. కాబట్టి మనం ఈ విషయం పట్ల ఆలోచించాలి. శ్రీ సత్పతి గారు ఒక చాలా మంచి విషయం మన ముందు ఉంచారు. అదే విషయాన్ని నేను కొంత విస్తారంగా మీ ముందు ఉంచుతాను. ఈ ఆలోచన సత్పతి గారి ప్రసంగం విన్నప్పుడు కలిగింది. అందుకే నాకు ఆ పని చేయగలం అని అనిపిస్తుంది. అప్పుడప్పుడు సభా కార్యకలాపాలు గొడవలు చేసి ఆపినప్పుడు, బయట బహిరంగ చర్చ జరుగుతుంది. అందులోఒక వైపు, చూడండి ప్రభుత్వాన్ని పనిచేయనియ్యడం లేదు అని, మరో వైపు, చూడండి ప్రభుత్వం మా మాట వినడం లేదు అని, వాదన జరుగుతుంది. కొంతమందికి మేము మా బలాన్ని చూపించాం అని అనిపిస్తుంది. మేము తక్కువ సంఖ్యలో ఉండి ఉండవచ్చు కానీ మేము ..... అంటూ ఏవేవో చెబుతూ ఉంటారు.

కానీ మనం మరో విషయంపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఎందుకు సభ కార్యకలాపాలని జరగనివ్వరు? ఎందుకంటే అది ప్రభుత్వం పై కోపం తో కాదు, ఒక ఆత్మనూన్యత లోపం వల్ల కార్యకలాపాలు జరగనివ్వరు. ప్రతిపక్షాల లో కూడా తెలివి,

మేధస్సు ఉన్న సభ్యులు ఉన్నారు. అందుకే వారి అభిప్రాయాలు వినాలని, వారి అభిప్రాయాలు మనకి పెద్ద ఆస్తి అని నేను నమ్ముతున్నాను. ఎప్పుడైతే సభా కార్యకలాపాలు జరుగుతాయో అప్పుడే వారికి మాట్లాడే అవకాశం లభిస్తుంది. వారు మాట్లాడితే వారికి ప్రశంసలు లభిస్తాయి, అప్పుడు మాకు ఏమి ఒరుగుతుంది. ఈ చింత వారికి కలుగుతుంది. ఇది ఈ విధమైన ఆత్మనూన్యత వల్లే ప్రతి పక్షంలోని సమర్థవంతుడైన సభ్యులు మాట్లాడ లేక పోతున్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమర్థవంతులైన సభ్యులు దేశానికి తెలియకూడదు. అందుకే ప్రభుత్వాన్ని పని ఎలాగో ఉంది కానీ, ప్రతిపక్షంలో ఎవరు బలంగా అవ్వకూడదు. ఎవరూ తెలివిగా కనిపించకూడదు. ఇది ఆత్మనూన్యత వల్ల వచ్చిన పరిణామం. అందుకే ఈసారి సమావేశాలు జరుగుతున్నప్పుడు నేను ఎంతోమంది తెలివైన సభ్యుల ని చూశాను. వారు గొప్ప అభిప్రాయాలు కలిగి ఉన్నారు. గత రెండు సమావేశాలలో వారి వల్ల ఏ ప్రయోజనం కలగలేదు. అందుకే నేను ఏమి అనుకుంటున్నాను అంటే వారు చాలా అధ్యయనం చేసి వస్తారు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు, నలుగురు లేదా ముగ్గురు సభ్యులు ఉన్న చిన్న పార్టీలు. వారిలో కూడా కొంతమంది మనల్ని వినోద పరుస్తున్నారు.

నేను ఏదైనా చదువుతున్నప్పుడు నాకు కొన్ని విషయాలు మంచిగా అనిపిస్తాయి. మనం ఎవరిని ఎగతాళి చేయకూడదు. మేకిన్ ఇండియా గురించి ఎగతాళి చేస్తున్నారు. మేకిన్ ఇండియా దేశం కోసం రూపొందించడం జరిగింది. విజయం సాధించి ఉండకపోవచ్చు, కానీ విజయం సాధించడానికి మనం ఏమి చేయవచ్చు? విజయం లభించకపోవడానికి లోపాలు ఏంటి అని చర్చ జరగాలి. ఇక్కడ నేను ఒక మాట చెప్పదలుచుకున్నాను మనం ఎందుకు మన దేశాన్ని గిన్నెతో యాచించే దేశంగా చిత్రిస్తున్నాము? మనమే ఇలా మాట్లాడితే, ఇతరులు ఇంకెంత చెడుగా, గట్టిగా మాట్లాడుతారో ఆలోచించండి. ఈ మాట నేను అనడం లేదు శ్రీమతి ఇందిరా గాంధీ గారు అన్నారు. 1974లో ఇంద్రప్రస్థ కాలేజీలో

ఇందిరాగాంధీ గారు ఉపన్యాసం ఇచ్చారు. అందుకే మేము కొత్త పథకాలు, కొత్త పద్ధతులు తీసుకువచ్చినప్పుడు, కొంతమందికి వయసు పెరుగుతుంది కానీ తెలివి పెరగదు, అందుకే వాటిని అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది. కొంతమందికి సమయం అయిపోయాక కూడా విషయాలు అర్థం కావు. అందుకే వారు వాటిని వ్యతిరేకించడం మంచి గా భావిస్తారు. అందుకే వారు వ్యతిరేకించే పద్ధతులు వెతుకుతూ ఉంటారు. నేను ఇక్కడ ఒక బాధ గురించి చెప్తాను. మన దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. చాలా వరకు సమస్యలు చాలా పాతవి. పేదరికం, వెనుకబాటుతనం, అంధ విశ్వాసం, కొన్ని చెడు సంప్రదాయాలు. కొన్ని సమస్యలు అభివృద్ధి ద్వారా కూడా వచ్చాయి.కానీ, మనదేశంలో అన్నిటికంటే పెద్ద సవాలు వేగంగా జరుగుతున్న మార్పులను వ్యతిరేకించడం. ఈ వ్యతిరేకత చదువుకున్న వారి నుంచి కూడా ఎక్కువగా వస్తుంది. ఒక ముఖ్యమైన పని ముందుకు తీసుకు వెళ్తున్నప్పుడు, వంద కారణాలు ఆ పనికి వ్యతిరేకంగా చెప్తారు. నాకు ఏమనిపిస్తుంది అంటే ఒక బలమైన, ఎత్తైన గోడ మనల్ని నాలుగు వైపుల నుంచి చుట్టి ఉందని. ఎంత స్పష్టమైన మాట ఇది. ఈమాట 1968లో ఇందిరా గాంధీ గారు చెప్పారు.

ఇక్కడ ఏ విషయాన్ని ప్రస్తావించినా అవి వారి కాలానికి చెందినవిగా చెబుతారు. వారు ఇచ్చినట్టు చెప్తారు. కొన్ని విషయాలు ఖచ్చితంగా వారు తీసుకువచ్చినవే. ఈ మధ్య మేము ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాము. పాఠశాలల్లో మరుగుదొడ్లు కట్టించే కార్యక్రమం. ఇప్పుడు మీ మాట నిజమే, "మోడీ గారు మా కాలంలో అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు కట్టించి ఉంటే, ఇప్పుడు మీరు ఏం చేసి ఉండేవారు. ఇవి మేము అయితే తయారు చేయలేదు. అందుకే మీరు నాలుగు లక్షల మరుగుదొడ్లు కట్టించ గలిగారు." ఇదీ మీరు ఇచ్చినదే.

బంగ్లాదేశ్ సరిహద్దు వివాదం, ఇన్ని దశాబ్దాల తరువాత ఈ వివాదం పరిష్కరించబడింది. మీరు ఈ విధంగా అనొచ్చు "మేము మా కార్య కాలంలో ఈ పని చేసి

ఉంటే, మోదీ! మీ గొప్పతనం ఏమీ ఉండేది? ఈ పని మేము మీ కోసం వదిలేసాము." ఇది కూడా మీరు ఇచ్చినదే. 18 వేల గ్రామాలు స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా అంధకారంలోనే ఉన్నాయి. మేము ఆ గ్రామాల కి విద్యుత్తు అందించినప్పుడు, మీరు గర్వంగా చెప్పవచ్చు మోడీ గారు ఈ పద్దెనిమిది వేళ్ళ గ్రామాలు మేము ఇచ్చినవే. అందుకే మీరు ఈ పని చేయగలిగారు అని. అందుకే ఇవన్నీ కూడా మీరు ఇచ్చినవే. దీన్ని ఎవరు కాదనలేరు. 60 సంవత్సరాలుగా మీరు చేసిన కార్యకలాపాల ఫలితమే ఇది. దీన్ని ఎవరు కూడా కాదనలేరు. అందుకే అప్పుడప్పుడు చాలా గర్వంగా MNREGA గురించి చర్చిస్తున్నాము. దీని చరిత్ర 50 సంవత్సరాలు పాతది దానికి పూర్వం కూడా రాజుల కాలంలో అలాంటి విషయాలు జరిగాయి. మీరు 1972లో మహారాష్ట్రలో ఉపాధి హామీ పథకం వచ్చింది. 1980లో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఆ పథకానికి మరో రూపంగా వచ్చింది. 1983లో గ్రామీణ భూ రహిత ఉపాధి హామీ పథకం వచ్చింది. ఇవన్నీ కూడా ఒక కార్యక్రమం నుంచి పునర్జన్మ తీసుకున్న వేరే కార్యక్రమాలు.

ఆ తర్వాత 1989లో జవహర్ రోజ్ గార్ యోజన(JRY), ఇది MNREGA కార్యక్రమానికి ముందు జన్మ. ఆ తరువాత జవహర్ లాల్ గారి పేరు తీసివేయడం నన్ను ఆశ్చర్యపరిచింది, ఆ పని మమ్మల్ని నిందించే పార్టీ యే చేసింది. 1993 లో కార్మికుల బీమా పథకం కింద ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ తరువాత భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం వచ్చింది అప్పటివరకు ఏవైతే కార్యక్రమాలు ఉన్నాయో, వాటిలోనుంచి కొన్ని అంశాలను తీసుకుని సంపూర్ణ గ్రామీణ రోజ్గార్ యోజన ప్రారంభించారు. ఆ పథకం 2004లో పునర్జన్మ తీసుకుని, జాతీయ పనికి ఆహార పథకం గా వచ్చింది. ఆ తర్వాత 2006లో MNREGA గా కొత్త రూపం దాల్చింది. ముందు NREGA ఆ తర్వాత కొంత జ్ఞానం వచ్చాక MNREGA గా రూపు మారింది. కాబట్టి పేదల సంక్షేమం కోసం ఏదో ఒక పథకం వస్తూనే

ఉంటుంది. మీరు, "మోడీ గారు ఎన్నికలలో ఉపన్యాసాలు ఇవ్వడం వేరే విషయం. మీరు పేదరికాన్ని నిర్మూలిస్తామని అంటారు కానీ మీకు మా గురించి తెలియదు మేము పేదరిక వేళ్లను చాలా బలంగా నాటాం. మోదీ గారు మీరు ఆ వేళ్ళను పెకిలించలేరు" అంటారు.

నేను ఇక్కడికి వచ్చాక మీరు ఎన్ని వేళ్ళు నాటారో తెలుసుకోగలిగాను. అందుకే క్రితం సారి కూడా నేను ఈ మాట చెప్పాను. గత అరవై సంవత్సరాలలో మీరు పేద వాళ్లకి మేలు చేసి ఉండి ఉంటే ఈ రోజు ఈ దేశ పేదలకు మట్టి మోసి, గోతులు తవ్వాల్సిన అగత్యం కలిగేది కాదు. ఇది మన విజయానికి చిహ్నం కాదు, ఇది మనందరం ఒప్పుకోవాలి. అందుకే క్రమంగా జరుగుతున్న అభివృద్ధి పథకాలని మరింత మెరుగు చేసే బాధ్యతను నిర్వర్తించే దిశగా కృషి చేస్తున్నాం. మనం ఒక విషయాన్ని అంగీకరించాలి, మనం మన దేశాన్ని ఎలాంటి స్థితికి తీసుకు వచ్చామంటే నైపుణ్యం ఉన్న కార్మికులు కూడా నైపుణ్యం లేని వారిగా ఉండడానికి ఆనందిస్తున్నారు. అందుకే నేను ఈ పథకం మన వైఫల్యాల చిహ్నంగా భావిస్తాను. దీని అర్థం ఏమిటంటే పేదరికం ఉండి ఉండక పోయి ఉంటే NREGA లేక MNREGA లాంటి పథకాల అవసరం ఉండేది కాదు. కానీ వాస్తవం ఏమిటంటే నేను ఇక్కడికి వచ్చాక పేదరికం వేళ్ళు ఎంత బలంగా నాటుకుని ఉన్నాయో చూశాను, వాటిని పెకిలించడానికి నేను ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుంది. అందుకే ఇప్పుడు ఉన్న పథకాలు ఏవైతే ఉన్నాయో వాటి లోని లోపాలను దూరం చేయడానికి మేము ప్రయత్నాలు చేస్తున్నాం.

గౌరవనీయులైన ఖర్గే గారు MNREGA లో అవినీతి చాలా ఉందని చెప్పారు. నేను వారితో 1000% అంగీకరిస్తాను. దీన్ని నేను వ్యతిరేకించను. మీరు 2012 CAG నివేదికని చూడండి. ఏ విధంగా ఈ పథకం తో అవినీతి అల్లుకుని పోయిందో చెప్పబడింది. పేదరికం పేరు చెప్పి ఏవిధంగా డబ్బులు దోచుకోబడుతున్నాయో? 2012 నివేదికలో చెప్పారు. అందుకే మేము అందులోంచి కొంత సేర్చుకోవడానికి ప్రయత్నం చేసాము. మేము ఎంతో సేర్చుకోవాలి

అనుకుంటున్నాము, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాము. CAG ఒక పెద్ద విషయం చెప్పింది, అది మనందరినీ విభ్రాంతికి గురిచేసే విషయం.

మన దేశంలో ఏ రాష్ట్రలనయితే పేద రాష్ట్రాలుగా పరిగణిస్తామో, అక్కడ పేదలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. CAG ఏం చెప్పిందంటే ఎక్కడైతే పేదలు తక్కువ సంఖ్యలో ఉన్నారో, ఎక్కడైతే పరిపాలన వ్యవస్థ సజావుగా సాగుతుందో, అలాంటి రాజ్యాలలో NREGA, MNREGA ఎక్కువగా ఉపయోగించారు. కానీ ఎక్కడైతే పేదరికం వాస్తవంగా ఉందో, ఎక్కడ ఈ పథకాల అవసరం ఎక్కువ ఉందో, అక్కడ వీటిని చాలా తక్కువ అమలు చేశారు. కాబట్టి మనం పేదల ను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయలేకపోయాము. అందుకే ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని మరింత మెరుగు పరుచుకుని ఏ రాష్ట్రాలలో అయితే పేదలు ఎక్కువగా ఉన్నారో, ఏ రాష్ట్రాలలో పేదరికం ఎక్కువగా ఉందో, అటువైపు ఈ పథకాన్ని తీసుకెళ్లే బాధ్యత మనందరిదీ. సంపన్న రాష్ట్రాలు ఈ పనులు వాటి వ్యవస్థ ద్వారా చేయగలవు.కానీ మనం పేద రాష్ట్రాలకు ఈ ఫలితాలు ఎలా చేరవేయాలో ఆ దిశగా ప్రయత్నాలు చేయాలి. మేము JAM పథకం తోపాటు జన ధన్, ఆధార్, మొబైల్ ద్వారా ప్రత్యక్ష లబ్ది దారులకు, లాభం కలిగేలా చూస్తున్నాము. ఈ దిశగా మేము ఒక పెద్ద కార్యక్రమం ప్రారంభించాము. దాని వలన మధ్యవర్తులను నిర్మూలించడంలో మనకి విజయం లభించవచ్చు. అయితే MGNREGA కార్యక్రమాన్ని మనం ఇంతగా ప్రశంసిస్తుంటే CAG మరోవైపు ఏడు సంవత్సరాల తర్వాత కూడా 5రాష్ట్రాలు నిబంధనలు రూపొందించ లేదు అని చెప్పింది. బాధించే విషయం ఏమిటంటే ఆ అయిదు రాష్ట్రాల లో నాలుగు రాష్ట్రాలు MGNREGAని ప్రశంసిస్తూ ఉన్నాయి. ఇవి ఏడు సంవత్సరాలలో నిబంధనలు కూడా రూపొందించలేదు. అలాగే కేంద్రపాలిత ప్రాంతాలలో కూడా ఇలాంటి సమస్యలు మా దృష్టికి వచ్చాయి. అలాగే ఎనిమిది రాష్ట్రాలలో వందరోజుల లక్ష్యాన్ని మనం అందుకోలేకపోయాము.

సగటున 30 లేదా 40 రోజులే ఇవ్వగలిగాము. మనము ఆ పథకానికి ఒక కొత్త రూపుని ఇచ్చే ప్రయత్నం చేశాము. అందులో లక్ష్యం అత్యధికంగా ఉపాధి లభించాలని, అది ఎక్కువ రోజుల వరకు లభించాలని, మధ్యవర్తులు నశించాలని, ప్రతి రూపాయి సరిగ్గా ఉపయోగించాలని, దాని ఆడిట్ కోసం ఒక వ్యవస్థ ఉండాలని మేము పూర్తిగా ప్రయత్నిస్తున్నాం. అందుకే నాకు నమ్మకం ఉంది. ఈరోజు కార్మికులు వారి బ్యాంక్ లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాలలో నేరుగా బదిలీ అయి ఎలక్ట్రానిక్ మార్గం ద్వారా ఈ డబ్బులు అందుతున్నాయి. 94 శాతం కార్మికులకు ఈ మాధ్యమం ద్వారా చెల్లింపులు జరిగేలా మేము చర్యలు తీసుకున్నాము.

మరోవైపు ఈ సభ అసూయా భావంతో పని చేయకూడదు. వారి చొక్కా, నా చొక్కా కంటే తెల్లగా ఎందుకు ఉంది,లాంటి అసూయ పనికిరాదు. గౌరవనీయులైన స్పీకర్ గారు, వారు నన్ను విమర్శిస్తున్నారు కానీ ఆ విమర్శ నేను తప్పు చేస్తున్నందుకు కాదు. నేను వారి కంటే మంచి పనులు ఎలా చేస్తున్నాను అనేది వారు నిందిస్తున్న విషయం. అందుకే వారికి ఇబ్బందిగా ఉంది. వారు 60 సంవత్సరాల లో ఏ పనులు చేయలేక పోయారో, మేము ఎలా చేయగలుగుతున్నాము అనే విషయం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఈ పథకాలు ఎలా ఉన్నాయి, దీర్ఘకాలంగా ఏవిధంగా ప్రయోజనాలు కలిగిస్తాయి అనేది వారు చింతిస్తున్న విషయం.

నేను ఈ దేశంలోని మేధావి వర్గాన్ని ఈ రెండు పథకాల తులనాత్మక అధ్యయనం చేయాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. ఒకటి అటల్ గారి సమయంలో ప్రారంభమైన ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, రెండవది MNREGA. మీరు విశ్లేషణ చూసినట్టయితే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, పేద వర్గంలో ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ ప్రయోజనం కలిగించింది.

రోడ్లు నిర్మిస్తే ఉపాధి లభిస్తుంది. రోడ్లు నిర్మిస్తే సదుపాయాలు వస్తాయి. తద్వారా విద్యా, ఆరోగ్యం, సంపద లో ఒక మార్పు వస్తుంది.

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కోసం ప్రభుత్వం నిధులు ఇచ్చింది,MNREGA లో కూడా నిధులు ఇవ్వడం జరిగింది. సంపదను సృష్టించడం జరిగింది. అందుకే మనం MNREGA ద్వారా కూడా సంపద సృష్టి పై ఎక్కువ దృష్టి సారిస్తున్నాము. అందులో కూడా నీటి పై ఎక్కువగా మేము ప్రాధాన్యం ఇస్తున్నాం. వాటి ఫలితాలు లభించనున్నాయి. ఆ దిశగా మేము ప్రయత్నిస్తున్నాము, నాకు నమ్మకం ఉంది.

మల్లిఖార్జున గారు ఆహారభద్రత బిల్లు గురించి ప్రస్తావించారు, గుజరాత్ గురించి మాట్లాడినప్పుడు వారికి చాలా ఆనందం కలుగుతుంది. ఆ తర్వాత వారికి ఇంక మాట్లాడడానికి ఏమీ లేక, అవే మాటల్ని తిప్పి తిప్పి మాట్లాడుతారు. నాకు వారి దివాళాకోరుతనం తెలుసు. వారి వద్ద మాట్లాడడానికి ఏమీ లేదు. జాతీయ ఆహార భద్రత చట్టాన్ని దేనినయితే వారు ఇంతగా పొగుడుతున్నారో, అది మళ్లీ మళ్లీ వారే తీసుకొచ్చారని చెబుతున్నారు. మేము 2014 మే నెలలో అధికారంలోకి వచ్చాం. స్పీకర్ మేడం మే 2014 వరకు కేవలం 11 రాష్ట్రాల్లో హడావిడిగా ఆహార భద్రత చట్టంలో ఏవైతే ఆకాంక్షలు ఉన్నాయో వాటిని పూర్తి చేసే వ్యవస్థని కేవలం కాగితాలకే పరిమితం చేసి హడావిడిగా స్వీకరించారు. ఏ విషయం గురించి అయితే ఇంతగా మాట్లాడుతున్నారో, ఆ చట్టం దుస్థితి ఇది. అంతేకాదు ఇప్పుడున్న పరిస్థితి కూడా నేను చెప్తాను. నేడు కూడా మొత్తం ఎనిమిది రాష్ట్రాలలో నాలుగు రాష్ట్రాల్లో జాతీయ ఆహార భద్రత చట్టం నామరూపాలు లేవు. అందులో వారు పరిపాలిస్తున్న రాష్ట్రాలు, కేరళ, మణిపూర్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ ఉన్నాయి. గుజరాత్ లో ఆ చట్టాన్ని అమలు చేసి అందులోని సూక్ష్మ విషయాలను కూడా పూర్తి చేయడం జరిగింది. ఆ చట్టాన్ని అధ్యయనం చేయడానికి మీరు ఒక బృందాన్ని పంపించండి.

మీరు కేరళలో ఎన్నికల కి వెళ్ళబోతున్నారు. మీరు ఏ విధంగా అయితే ఇక్కడ మాట్లాడుతున్నారో కేరళలో ప్రజలు మీ నుంచి సమాధానాలు కోరతారు. మీరు ఏ చట్టాన్ని అయితే ప్రస్తావిస్తూ ఇక్కడ పెద్దపెద్ద మాటలు మాట్లాడారో, ఆ చట్టం నుంచి కేరళ ఎందుకు దూరంగా ఉంచబడింది? అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, మణిపూర్ లు కూడా ఈ చట్టం నుంచి ప్రయోజనం పొందలేదు. 8 రాష్ట్రాలలో నాలుగు రాష్ట్రాలు మీ పాలనలో ఉన్నాయి. అప్పుడప్పుడు మనం చాలా ఎక్కువ మాట్లాడతాం. కొన్ని సందర్భాలలో, ప్రధానమంత్రి పంట బీమా యోజన గురించి శ్రీ వెంకయ్య నాయుడు గారు మాట్లాడుతున్నప్పుడు మన సౌగత రాయ్ గారు నిలబడ్డారు.వారు ఏ విషయంపైనా మాట్లాడడానికి త్వరగా నిలబడిపోతారు. వారు నిలబడినప్పుడు వారి పార్టీ సభ్యులు కూడా వారు ఏం చేస్తారా అని చూస్తూ ఉంటారు.

సౌగత రాయ్ గారు మాట్లాడుతూ ప్రధానమంత్రి పంట బీమా పథకం కేవలం 45 జిల్లాలకే పరిమితం అని చెప్పారు. కానీ నేను ఒక సమాచారం చెప్పదలుచుకున్నాను. సౌగత రాయ్ గారు, ఏప్రిల్ 1 నుంచి దేశమంతా ప్రతి గ్రామంలో ప్రతి రైతుకు ఈ బీమా పథకం వర్తిస్తుంది. ఈ పథకం మరో మంచి గుణం ఏమిటంటే ఈ పథకాన్ని ముందు మేము పైలెట్ ప్రాజెక్టుగా 45 జిల్లాలో అమలు చేశాం. ఇది పైలెట్ ప్రాజెక్టుగా ఎందుకు తీసుకున్నామంటే, ఈ పథకం విజయవంతం కావచ్చు లేదా కాకపోవచ్చు. ప్రజలకి నచ్చొచ్చు, నచ్చకపోవచ్చు. అలాంటి ఎన్నో విషయాలు ఉంటాయి. మేము ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి మరో 2 విషయాలు జోడించవచ్చా అని అడిగాం. అందుకు మేము రైతులకు 7 ప్రత్యామ్నాయాలు ఇచ్చి ఈ 45 జిల్లాలలో ఒక ప్రయోగంగా చేసి చూసాము.

ఒకటి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, రెండు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, మూడు విద్యార్థి సురక్ష యోజన, నాలుగు గృహ అగ్ని ప్రమాద బీమా పథకం, ఐదు వ్యవసాయ పనిముట్లు, పంపుసెట్టు బీమా యోజన, ఆరు ట్రాక్టర్ బీమా యోజన, ఏడవది

మోటార్ బైక్ బీమా యోజన. ఈ ఏడు రైతులకు సంబంధించినవి. వారు పంట బీమా తో పాటు అనుకూలంగా ఉంటే వీటిలో నుంచి రెండిటిని తీసుకొని తక్కువ ప్రీమియం చెల్లించి అదనపు ప్రయోజనం పొందవచ్చు. వారి పంపు సెట్లు పాడవుతూ ఉంటాయి. అందుకే ఒక ప్రయోగంగా బీమా కంపెనీలకు కొంత ఇబ్బంది ఉన్నా, నేను వారిని ఇవి చేయాల్సిందిగా మనవి చేశాను. ఇది ఒక ప్రయోగం. నేను సభ్యులందరికీ మనవి చేసేది ఏమిటంటే వారు దీనిని మరింత మెరుగు చేసి వారికి మంచి అనిపిస్తే వీటిని ముందుకు తీసుకువెళ్లాలి. మంచిగా అనిపించకపోతే వదిలేయవచ్చు. కానీ ఇది 45 జిల్లాలలో trial గా ప్రయోగించిన ప్రధానమంత్రి పంటల బీమా పథకం లాంటిది కాదు

అప్పుడప్పుడు మీరు ఈ పథకాలు మావే అని అంటారు. నేను రైల్వేలు మేము ప్రారంభించామని ఎలా చెప్పగలను? మీరు చెప్పగలరు. మీరు ఏమైనా చెప్పగలరు. మాకు అంత ధైర్యం లేదు. అందుకే యూపీఏ పాలనలోని పది సంవత్సరాలలో రైల్వేలో సగటున సంవత్సరానికి అభివృద్ధి పనుల కోసం 9291 కోట్లు ఖర్చు అయ్యేవి. మేము వచ్చిన రెండు సంవత్సరాలలో 32 వేల 587 కోట్లు ఖర్చు పెట్టాం. అలాగే ప్రతి సంవత్సరం UPA-1 లో కొత్త లైన్లు సగటున 1477 కిలోమీటర్లు వేసేవారు. UPA-2 లో కొంత మెరుగ్గా పదిహేను వందల ఇరవై కిలోమీటర్లు వేసేవారు. అదే NDA కాలంలో 2292 అంటే దాదాపు 23 వందల కిలోమీటర్లు వేశారు. పని ఎలా జరుగుతుందో, ఎంత వేగంగా చేయవచ్చో, పనిచేసే ప్రభుత్వం ఎలా ఉంటుందో, ఇందులో మనం చూడొచ్చు. వనరులు అవే, రైలు పట్టాలు అవే, విభాగాలు అవే, సిబ్బంది వారే, చట్ట వ్యవస్థ అదే, ఇది ఒక సజీవ ఉదాహరణ. నేను ప్రతి రంగంలో ఇలాంటి ఉదాహరణలు చూపించగలను. కానీ రాష్ట్రపతి గారి ప్రసంగ సందర్భంలో నేను ఎక్కువగా మాట్లాడకుండా ఇంత మాత్రమే చెప్తాను.

గౌరవనీయులైన మేడం స్పీకర్ ఆర్థిక రంగానికి సంబంధించి ఒక విషయం ఎప్పుడూ చర్చించబడింది. అది రాష్ట్రానికి నిధులు తక్కువ చేశామని అని చెప్తున్నారు. ఇలాంటి ఒక పవిత్ర ప్రదేశంలో దేశం ముందు కొన్ని విషయాలు ఉంచాలి. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు 2015-16 నుంచి రాష్ట్రాలకు 2014-15తో పోలిస్తే కేంద్రం నుంచి ఎక్కువ ఆర్థిక సహాయం లభిస్తుంది. రాష్ట్రాల ఆర్థిక వనరులు మూడు ముఖ్యమైన భాగాలు కింద ఇవ్వబడుతుంది. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా, ప్రణాళికేతర నిధులు, రాష్ట్రాల ప్రణాళికకు అనుగుణంగా కేంద్ర సహాయం. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు 2014 -15 లో మొత్తం 6,78,682 రూపాయలు ఇవ్వడం జరిగింది సవరించిన అంచనాల ప్రకారం 2015 -16 లో రాష్ట్రాలకు 8,20,133 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగింది. 2015- 16 లో 2014-15 కంటే 1,41,314 కోట్ల రూపాయలు ఎక్కువ ఇవ్వడం జరిగింది. ఈ మూడు భాగాల కింద ఈ నిధులు క్రితం సంవత్సరం కంటే 20.8 శాతం ఎక్కువ లభించింది. అందుకే ఏ కారణం లేకుండా, వాస్తవాలు చెప్పకుండా, అబద్దాలు చెప్పే ప్రయత్నం ఏదైతే జరుగుతుందో దానిని మనం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

అదేవిధంగా మన దేశం ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే దేశం, ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్న దేశం. కానీ మన దేశంలో ప్రజా జీవితంలో మనమందరము కూడా జవాబుదారీ కలిగి ఉన్నాము. ఎవరైనా నన్ను ప్రశ్నలు అడగవచ్చు, వారికి అడిగే హక్కు ఉంది. కానీ కొంతమందికి జవాబుదారీతనం లేదు. ఎవరు కూడా వారిని అడిగే ధైర్యం చేయరు. ఎవరికి కూడా వారిని అడిగే బలం లేదు. ఎవరైతే ప్రశ్న అడగాలని చూస్తారో వారి పరిస్థితి ఏమవుతుందో మనం చూశాం. నేను కేవలం ఆ సంఘటనని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను, మీరు అర్థం చేసుకోండి. స్టాలిన్ మరణించినప్పుడు రష్యా కి అధిపతి అయిన కృష్చేవ్ అతనికి తోడుగా ఉండే వాడు. స్టాలిన్ మరణం తర్వాత ఎక్కడికి వెళ్ళినా, కృష్చేవ్, స్టాలిన్ ను తీవ్రంగా

విమర్శించే వాడు. అతన్ని చాలా కఠోరమైన పదాలతో నిందించే వాడు. మనసుకు ఏది తోస్తే అది చెప్పేవాడు. ప్రతి చోటా అతను ఇలా చేసేవాడు. ఒకసారి ఒక సమావేశమందిరంలో కృష్చేవ్ కొన్ని విషయాలు మాట్లాడుతూ స్టాలిన్ గురించి చాలా తీవ్రంగా విమర్శించారు. అతను అతని మాజీ నాయకుడిని గురించి అతని మరణం తర్వాత చాలా ఎక్కువగా నిందించాడు. ఒక యువకుడు నిల్చుని కృష్చేవ్ ని ఒక ప్రశ్న అడగాలి అంటూ అనుకుంటున్నానని చెప్పాడు. మీరు స్టాలిన్ ని ఇంతగా నిందిస్తున్నారు ఇంతగా చెడు చెప్తున్నారు కానీ వారు జీవించి ఉన్నప్పుడు మీరు వారితో కలిసి పనిచేసే వారు, అప్పుడు మీరు ఏం చేశారు? ఏ పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయో మీరు ఏం చేశారు? అప్పుడు ఆ సమావేశ మందిరంలో నిశ్శబ్దం అలుముకుంది. కొన్ని క్షణాల తర్వాత క్రిష్చేవ్ ఎవరయితే, ఈ ప్రశ్న అడిగారో వారిని నిల్చోమని అడిగారు. దానికి ఆ వ్యక్తి నిలబడ్డాడు. అప్పుడు అతను నీ ప్రశ్నకు జవాబు దొరికిందా? అని అడిగారు. ఈ రోజు నువ్వు ఏ పని అయితే చేయగలిగావో, స్టాలిన్ కాలంలో నేను అలాగే చేద్దాం అనుకునే వాడిని కానీ చెయ్యలేకపోయాను. అందుకే ఇది అర్థం చేసుకోవడానికి సమయం పడుతుంది, ఇందులో బాదాం ఉపయోగ పడదు. మీకు కొంత అర్థం అవ్వచ్చు కానీ మిగతా వారి గురించి నేను చెప్పలేను.

మన శాస్త్రాలలో కొన్ని సామెతలు చాలా బాగా చెప్పబడ్డాయి. అందులో ఒకటి వేరే వాళ్ళకి ఉపదేశాలు ఇచ్చే నైపుణ్యం చాలా మందికి ఉంటుంది కానీ ఆ ఉపదేశాన్ని పాటించే వారు చాలా తక్కువ మంది ఉంటారు. నేను మీలాగానే ఉపదేశాలు వింటూ వచ్చాను. సలహాలు వింటూ వచ్చాను.విమర్శలు ఎదుర్కొన్నాను. విమర్శ కన్నా ఎక్కువ ఆరోపణలు నేను భరించాను. ఇవన్నీ కూడా జరుగుతూ ఉండేవి. కానీ 14 సంవత్సరాల తర్వాత నా పని వల్ల నేను ఎలా జీవించాలో నేర్చుకున్నాను. కానీ ఈ దేశం కొన్ని విషయాలు మర్చిపోదు. మేడం స్పీకర్ 27 సెప్టెంబర్ 2013న మన దేశ గౌరవనీయ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్

సింగ్ గారు అమెరికాలో ఉన్నారు. అమెరికా రాష్ట్రపతి తో వారి ద్వైపాక్షిక చర్చ జరగాల్సి ఉంది. వారు దేశానికి చెందిన గౌరవనీయ నాయకుడు. భారతీయ క్యాబినెట్ లో ఫారూక్ అబ్దుల్లా గారు ఆంటోని గారు శరద్ పవార్ గారు లాంటి గొప్ప నాయకులు ఉండేవారు.

అలాంటి కేబినెట్ నిర్ణయాన్ని 27 సెప్టెంబర్ 2013న ఒక పత్రికా సమావేశంలో చించి వేయబడింది. ఒక ఆర్డినెన్స్ ని అక్కడ చించడం జరిగింది. మన పెద్దల పట్ల గౌరవం, ఆదరణ ఇప్పుడు ఉండాలి. స్పీకర్ మేడం, ములాయం సింగ్ గారు, నేను వేరు వేరు అభిప్రాయాలు కలిగిన వారం. వారి మాటలు నేను అంగీకరించలేను అలాగే వారు నా మాటలు అంగీకరించరు. కేవలం లోహియా గారికి సంబంధించిన మాటలే మేము అంగీకరిస్తాం. ఎందుకంటే నేను ఎక్కడైతే జన్మించానో నాకు లోహియా గారు నచ్చడం స్వాభావికం.కానీ ములాయం సింగ్ గారు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడం కోసం వారు ఉత్తరప్రదేశ్ లో ఎన్నో పనులు చేస్తామని వాగ్దానం చేశారు. ములాయం సింగ్ గారు అంటే నాకు ఇష్టం ఉండొచ్చు ఉండకపోవచ్చు. కానీ వారు చాలా పెద్ద సీనియర్ నేత. బహిరంగ సభలో ములాయం సింగ్ గారు కాగితాలు చించి వేయడం జరిగింది. అందుకే నాకు మళ్ళీ మళ్ళీ ఆ సామెత గుర్తొస్తుంది, "ఘర్ ఉపదేశ్ కుశల్ బహు తేరే, జె ఆచరహీం తె నర్ న ఘనేరె".

గౌరవనీయులైన మేడం స్పీకర్, దేశం, ప్రజాస్వామ్యం ముందుకు సాగ వలసిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. నేను ఇప్పుడు చెప్పబోయే మాట మన అందరికీ నచ్చుతుందని అనుకుంటున్నాను. నేను చిన్నతనంలో ఏ గ్రామం లో అయితే పెరిగానో అక్కడ ఒక ఎమ్మెల్యే ఉండేవారు. వారు ఎప్పుడూ ఓడిపోయే వారు కాదు. ఎల్లప్పుడూ గెలుస్తూనే ఉండేవారు. వారు రైల్లో ప్రయాణం చేసే వారు. నేను వారికి టీ తాగించడానికి ప్రయత్నించే వాడిని. ఏదైనా సమస్య వస్తే రైల్వేలో నేను దానిని చూసుకునేవాడిని. వారి నోటి నుంచి నేను ఒకసారి ఒక పదం విన్నాను అది elective. ఆ పదం అర్థం ఏమిటో నాకు

తెలీదు. కానీ కొన్ని రోజులు గడిచాక నాకు అర్థమైంది ఏమిటంటే వారు ఎలెక్టివ్ అని. అక్కడ ఎలక్టివ్ వచ్చారంటే మొత్తం ప్రభుత్వ యంత్రాంగం వణికిపోయింది. కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులు ఆందోళన గా ఉండే వారు. ఎందుకంటే కొన్ని ప్రశ్నలు అసెంబ్లీ లేదా పార్లమెంటు లో లేవనెత్తినప్పుడు, ఒక ఆందోళన ఉండేది. సభలో ఏ విషయం పైన అయినా చర్చ జరుగుతున్నప్పుడు అధికారులు ఏం జరుగుతుందని ఆందోళన చెందేవారు. మన ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ కార్యకలాపాలు,మనం ఏ స్థాయికి తీసుకువచ్చాం అంటే ఈరోజు మన సభ్యులు, ప్రశ్నలు వేసినప్పుడు పాలనా యంత్రాంగం లోని ఏ అధికారి కి చెమటలు పట్టవు. ఆందోళన కలగదు. మన ఈ విధమైన కార్యకలాపాలతో మన అధికారుల కి ఏ విధమైన భయం లేదు. ప్రశ్న ఈ ప్రభుత్వం లేదా ఆ ప్రభుత్వానికి సంబంధించింది కాదు. కాలక్రమంగా పరిస్థితులు క్షీణించాయి.

పార్లమెంట్ లో ప్రతిపక్షాలకు చెందిన ఒకే ఒక్క సభ్యుడు ఉండి ఉండవచ్చు. మరో సభ్యుడు లేకపోయి ఉండవచ్చు. కానీ ప్రభుత్వ అధికారులకి, ప్రభుత్వ యంత్రాంగానికి అతను ప్రధాన మంత్రి కంటే తక్కువ కాదు. కానీ ఈరోజు నేను మీరందరూ కూడా ఒకటి నిర్ణయించాలని కోరుకుంటున్నాను. మనం ఒకరిని ఒకరు విమర్శించుకుంటూ వార్తాపత్రికలలో ఉంటాము. మనకి వారు ఎంతో చేశారు అని అనిపిస్తూ ఉండవచ్చు. కానీ అధికారుల జవాబుదారీతనం క్రమంగా తగ్గిపోతుంది. ప్రజాస్వామ్యంలో మనల్ని ప్రతి ఐదు సంవత్సరాలకి ప్రజలు లెక్క అడుగుతారు. మనం మళ్ళీ తిరిగి రావొచ్చు రాకపోవచ్చు కానీ వారిని లెక్క అడిగే ప్రదేశం ఇదే. అందుకే కొందరు పార్లమెంటరీ వ్యవస్థలో మన అందరికీ కూడా అందరి సభ్యులు,వారు ఒక్కరే అయినా, వారు ప్రధానమంత్రి కంటే తక్కువ కాదు. అందుకే మన కార్య నిర్వాహక జవాబుదారీతనం ఎలా పెంచాలో మనం ఆలోచించాలి. మనం అందరం కలిసి ఈ పని చేయకపోతే ఈ జవాబుదారీతనం సాధ్యం కాదు, అంతవరకూ ప్రభుత్వానికి నిందలు

తప్పవు. మరో ప్రభుత్వం వస్తుంది వారికి కూడా నిందలు తప్పవు. మన ముందు సవాళ్లు ఉన్నాయి. సవాళ్లను ఎదుర్కోవడానికి మనమందరము కలిసి ఆ దిశగా సమిష్టి కృషి చేయాలి.

మీరు కూడా ఈ వ్యవస్థలో ఇబ్బంది పడ్డారు నాకు తెలుసు నేను చాలా కాలం నుండి ఈ పని చేసి వచ్చాను. నేను ఎవరిని నిందించడం లేదు. కానీ మనం వార్తలలో ఎక్కడానికి ఒకరిని ఒకరు విమర్శించుకుంటూ ఉంటున్నాం. అందువల్ల లక్షల మంది ఉద్యోగులు కోట్ల కోట్ల జీతాలు తీసుకుంటున్నారు. పథకాలకు కొరత లేదు.సమయానికి కూడా కొదవ లేదు. నా దగ్గర సమయం ఉంది. ప్రశ్న ఏమిటంటే జవాబుదారీతనం ఎలా తీసుకురావాలి?

మరో విషయం ఏమిటంటే భారతదేశం లాంటి ప్రజాస్వామ్యంలో మన దేశ పౌరులను అధికార యంత్రాంగం పై వదిలేయలేము. మనం మన నూట పాతిక కోట్ల దేశపౌరుల పై నమ్మకం ఉంచాలి. ఒక్కసారి మనం వారిపై నమ్మకం చూపిస్తే నాకు విశ్వాసం ఉంది ఈ దేశ పౌరుడు మన నుంచి ఎక్కువ ఏమీ ఆశించడం లేదు వారు మనతో నడవడానికి సిద్ధంగా ఉన్నారు. మేము ఆ దిశగా కొన్ని ప్రయత్నాలు చేశాము. అవి చాలా పెద్ద ప్రయత్నం అని నేను అనడం లేదు కానీ ఆ దిశలో మనం వెళ్లాలని చెబుతున్నాము.

మనం చిన్న ఉద్యోగుల కోసం ఇంటర్వ్యూలు ఆపేసాం. ఎందుకంటే మనం ఆ పౌరుల మీద విశ్వాసం చూపించాలి. అలాగే మన దేశ పౌరులు, జిరాక్స్ ఉన్న ఈ కాలంలో గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కోసం వెళ్ళనవసరం లేదు. ఎంపీ, ఎమ్మెల్యే లు ఇళ్ల దగ్గర పెద్ద క్యూ లో నిలబడాల్సి వస్తుంది. ఎంపీ, ఎమ్మెల్యే వారి మొహం కూడా చూడకుండా ఒక చిన్న ఉద్యోగి స్టాంపు కొట్టి ఇచ్చేస్తాడు. మనం పదవ మరి 12వ తరగతి చదివిన పిల్లల పై నమ్మకం చూపిస్తున్నాము కానీ మన దేశ పౌరుని పై నమ్మకం చూపించడం లేదు. మనం దానిని

నాశనం చేసాము. ఎందుకంటే మనం మన పౌరులపై నమ్మకం చూపించాలి. వారు అంతిమంగా ఉద్యోగం కోసం ఎంపికైన ప్పుడు వారి పత్రాలను చూడవచ్చు. అలాగే మేము బడ్జెట్లో ఒక ముఖ్యమైన విషయం తీసుకు వచ్చాము రెండు కోట్ల రూపాయల వరకు మేము ఎలాంటి ప్రశ్న వేయట్లేదు మీరు ఎంత ఇచ్చినా మేము తీసుకుంటాం. ఇది నమ్మకమయిన వాతావరణం పెంచే ప్రయత్నం. ఇలాంటి కొత్త సలహాలు ఏమైనా ఉంటే మీరు కచ్చితంగా ఇవ్వండి.

ప్రభుత్వం కూడా కొన్ని అలవాట్లు చేసుకోవాలి. ప్రభుత్వం కూడా మెరుగవ్వాలి. మీ సహాయం లేకుండా ఈ సంస్కరణలు రావు. మీ సహాయం మాకు కావాలి. మీ తోడు మాకు కావాలి. మీ అనుభవం వల్ల ప్రయోజనం లభించాలి. నేను కొత్త వ్యక్తిని, మీకు అనుభవం ఉంది. మనం భుజం భుజం కలిపి కలిసి నడిస్తే కొన్ని మంచి పనులు జరుగుతాయి. దేశానికి ప్రయోజనం కలుగుతుంది. ప్రభుత్వాలు వస్తాయి, వెళ్తాయి, వ్యక్తులు వస్తారు వెళ్తారు, కొన్ని విషయాలు చెడు కావచ్చు, సరి కావచ్చు. కానీ ఈ దేశం అమరం. ఈ దేశం ఎప్పటికీ ఉంటుంది,

ఈ దేశం కోసం మనం కృషి చేయాలి. ఇదే అపేక్ష తో మరోసారి గౌరవనీయులైన రాష్ట్రపతి గారికి హృదయపూర్వక అభినందనలు తెలియ చేసుకుంటూ,వారికి నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. చాలా చాలా ధన్యవాదాలు.

జీఎస్టీ బిల్ పై లోక్ సభలో
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ
గారి ప్రసంగం.

8 ఆగస్టు 2016

జీఎస్టీ బిల్ పై ప్రసంగం. 8 ఆగస్టు 2016

ఈరోజు ఆగస్టు 8. ఆగస్టు విప్లవ శంఖారావం 8 ఆగస్టు న మోగించబడింది. మహాత్మా గాంధీ క్విట్ ఇండియా మంత్రంతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ఆగస్టు 9న స్వాతంత్ర్య సమరయోధులు పై ఎన్నో దారుణాలు జరిగాయి. ఈరోజు ఆ ఉదంతం జరిగి 75 సంవత్సరాలు గడిచాయి. ఆ స్వాతంత్ర్య సమరయోధులందరినీ స్మరించుకుంటూ ఈరోజు 8 ఆగస్టు న పన్ను ఉగ్రవాదం నుంచి మన దేశాన్ని విముక్తి చేసే దిశగా పార్లమెంటులోని ఉభయసభల్లో సభ్యులందరూ కలిసి ఒక ముఖ్యమైన అడుగు వేయబోతున్నాము. మన దేశంలో పన్నుల పరిస్థితి ఎలా ఉందో మీకు తెలుసు. బహుశా కొంతమందికి తెలుసు. పన్ను కి సంబంధించి సుప్రీంకోర్టు లో ఒక విషయం వచ్చింది. అది ఏంటంటే కొబ్బరికాయని పండు గా పరిగణించాలా లేక కూరగాయగా పరిగణించాలా అని. కొబ్బరికాయ మీద ఫలాల ఆధారంగా పన్ను వేయాలా లేక కూరగాయల ఆధారంగా పన్ను నుంచి విముక్తి కల్పించాలా? ఈ విషయం సుప్రీం కోర్టు వరకు వెళ్ళింది. పన్ను వ్యవస్థ మనకున్న పాత సంప్రదాయం. అందులో ఎన్నో ఎత్తుపల్లాలు వచ్చాయి. వీటిని అర్థం చేసుకోవడానికి ఈ సంఘటన సరిపోతుంది.

ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రభుత్వాలకు నేను ధన్యవాదాలు తెలపడానికి నిలుచున్నాను. మేము తీసుకున్న నిర్ణయంలో రాజ్యసభ, లోక్ సభ, 29 రాష్ట్రాలు, ఎంతోమంది గెలిచి వచ్చారు కాబట్టి అలాంటి 90 రాజకీయ పార్టీలు వీరంతా కలిసి మేధోమధనం చేసి ఈరోజు మనల్ని ఈ స్థాయికి తీసుకొచ్చారు. కొంత సమయం తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నాం. అందుకే ఎవరో జన్మనిస్తే, ఇంకెవరో పెంచిపెద్ద చేసారు అనడం

సరైనదే. కృష్ణుడికి ఎవరో జన్మనిచ్చారు, కృష్ణుని పెంచింది మరెవరో. కాబట్టి ఈ విజయం ఒక ప్రభుత్వానిదో లేక ఒక రాజకీయ పార్టీతో కాదు. ఈ విజయం భారతదేశ ప్రజాస్వామ్య ఉన్నత సాంప్రదాయాల విజయం. ఇది అన్ని రాజకీయ పార్టీల విజయం. ఇందులో ఇంతకుముందు ఉన్న ప్రభుత్వాలు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం తోడ్పాటు ఉంది. అందుకే ఎవరు గెలిచారు ఎవరు ఓడారు అనే విషయాన్ని ఇక్కడ ఒక వివాదంగా మార్చాల్సిన అవసరం లేదని నేను నమ్ముతున్నాను.

అందుకే GST అంటే Great Step by TEAM INDIA (టీం ఇండియా వేసిన గొప్ప అడుగు), GST అంటే Great Step towards Transformation, (పరివర్తన వైపు గొప్ప అడుగు) GST అంటే Great Step towards Transparency (పారదర్శకత వైపు గొప్ప అడుగు). మనం కొత్త వ్యవస్థ వైపు వెళ్తున్నాం.

ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ మనందరి కల. మనం రైల్వేల గురించి మాట్లాడుతున్నప్పుడు, ఒకే భారత్ అని అనిపిస్తుంది.అలాగే మనం పోస్టాఫీసు ని చూసినప్పుడు, ఒకే భారత్ అన్న భావన కలుగుతుంది. అలాగే అఖిల భారత పౌర సేవలను చూసినప్పుడు, భారతదేశ గుబాళింపు వస్తుంది. మనం ఐపీసీ, సి ఆర్ పి సి వైపు చూసినప్పుడు, ఒకే భారత గుర్తింపు లభిస్తుంది. మనం భారత్ నెట్ గురించి మాట్లాడినప్పుడు, డిజిటల్ ఇండియా గురించి మాట్లాడినప్పుడు, సాగర్ మాల గురించి మాట్లాడినప్పుడు ఇవన్నీ కూడా ఒకే భారతాన్ని సూచిస్తాయి. ఈ భావనని బలోపేతం చేసి శక్తినిస్తాయి. ఈ సందర్భంగా ఈరోజు ఈ దండలో జిఎస్టి అనే ఒక కొత్త ముత్యాన్ని మనం జోడిస్తున్నాము. ఇది కూడా ఒకే భారత్ అనే భావన ని బలోపేతం చేస్తుంది. ఇది కేవలం ఒక వ్యవస్థ కాదు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం కలిసి ఇలాంటి ఒక వ్యవస్థను అభివృద్ధి చేసి, చిన్న చిన్న రాష్ట్రాల నుంచి పెద్ద పెద్ద రాష్ట్రాల వరకు ఈ

వ్యవస్థ వారిది అనిపించేలా చేసాము. ఇది ఒక దేశం అనే భావన నుంచి బలోపేతం చేస్తూ, దీనికి గొప్ప ప్రాముఖ్యం ఉందని నేను అనుకుంటున్నాను.

కొన్ని సందర్భాలలో జిఎస్టి పై కొన్ని సందేహాలు ఉండేవి. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా నాకు సందేహాలు ఉండేవి. ప్రణబ్ ముఖర్జీ గారితో చాలాసార్లు చర్చించాను. అందుకే ఈనాడు నేను జీఎస్టీ ని ముఖ్యమంత్రి దృష్టికోణంలో చూడడం వల్ల ప్రధానమంత్రి అయ్యాక ఈ సమస్యలను పరిష్కరించడం నాకు సులువైంది. ఆ అనుభవాలు నాకు పనికొచ్చాయి. అందువల్లే ఆ సమయంలో రాష్ట్రాలు కొన్ని అంశాలను పరిష్కరించలేక పోయేవి. కొన్ని విషయాలు బయటకి రాకుండానే ఉండిపోయేవి. ఈ విషయాలన్నీ ఒక సుదీర్ఘమైన సామూహిక మేధోమథనం కారణంగా జరిగాయి, ఇందులో కేవలం నేను ఒక్కడిని సహాయ పడ్డానని అనుకోవడం లేదు. అందరి సహాయం ఉంది. ఎన్నో లోపాలని తొలగించడంలో మేము విజయం సాధించాం, ఇది సామూహిక మేధోమథన ఫలితం. మేము పరిపూర్ణులు అయ్యుండొచ్చు, ఇక ముందు ఏ విధమైన లోపం రాకపోవచ్చు, ఈ విధమైన గర్వం మనుషులకు ఉండకూడదు. అందుకే అందరూ కలిసి కష్ట పడ్డారు. ఒక మంచి చేయడానికి ప్రయత్నించారు. ఈ ప్రయత్నాల ఫలితం మనకి లభించనుంది. ఈరోజు మన దేశం ఒక వేదిక, ఒక అభిప్రాయం, ఒక మార్గం, ఒక లక్ష్యం అనే మంత్రాన్ని ఈ జీఎస్టీ ద్వారా మనము అనుభూతి చెందుతాం. అందుకే రాజ్య సభ లోని అంకెలు చూసినట్టయితే ఈ బిల్లు సంక్షోభం లో పడి ఉండేది. రాష్ట్రాలకు కేంద్రం పట్ల విశ్వాసం ఉండేది. వారి వారి అనుభవాల వల్ల అలా ఉండేది. అందుకే రాష్ట్రాలు, కేంద్రం మధ్య నమ్మకం ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే ఆధిక్యం ఆధారంగా నిర్ణయాలు జరగకూడదు. నేను ఇంతకుముందు కూడా సభలో చెప్పాను - ప్రజాస్వామ్యం అంటే కేవలం అంకెల గారడీ కాదు. ఇది సమ్మతి యొక్క గణాంకం. సమ్మతి ఇక ముందు ఉంటుంది. అలాగే మేము సంప్రదింపులు చేస్తూనే ఉంటాం.

ఈ రోజు మౌళివి గారు ఈ సభని జూనియర్ సభ అని అన్నందుకు చాలా బాధ పడ్డారు. ఎవరైతే ఇలాంటి పదాలు ఉపయోగిస్తారో, వారికి మీ సందేశం తప్పకుండా చేరుతుంది. వారు మారతారో మారరో చెప్పడం కష్టం, కానీ ఈ సందేశం వారి వరకు చేరుతుంది. నేను సంప్రదింపుల కోసం సోనియా గారిని పిలిచాను. అలాగే మన్మోహన్ సింగ్ గారిని కూడా పిలిచాను. ఒకరు లోక్ సభ నుంచి, ఒకరు రాజ్యసభ నుంచి ఇద్దరికీ ప్రాముఖ్యం ఇస్తూ జిఎస్టి కి సంబంధించి సంప్రదింపుల కోసం ఆహ్వానించాం. సలహాలు, సంప్రదింపులు తీసుకుని మేము ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.మాకు తెలుసు ఒక అపూర్వ సమ్మతి లాంటి వాతావరణం ఇక్కడ ఉంది. అలాంటి సమ్మతి నుంచి ఒక శక్తి జనిస్తుంది. అలాంటి శక్తి ఒక దేశానికి చాలా పెద్ద ఆస్తి. మనం వేరు వేరు రాజకీయ అభిప్రాయాలతో ఉన్నాము. రాజకీయం మన రక్తంలో ఉంది. మన మాటలలో ఉంది. అది ఎప్పుడో ఒకప్పుడు బయటపడడం సహజం. కానీ జీఎస్టీ పై చర్చలో ఈ పవిత్ర స్థానాన్ని ఎవరూ కూడా రాజకీయానికి వేదికగా వాడుకోలేదు. ఇది జాతీయ వేదిక గా జాతీయ మేలు కోసం ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చింది.

భారత ప్రజాస్వామ్యంలో ప్రకాశవంతమైన అంశాలలో ఇది ఒకటి. రాజకీయాల కంటే దేశ విధానం గొప్పది. దీని అర్థం ఏదైనా ప్రతిపాదన చేస్తే అందులో ఎవరికీ ఏ విధమైన ఫిర్యాదు లేదని కాదు. కచ్చితంగా ఫిర్యాదు చేయాలని లేదు. ఎక్కడ కూర్చున్నా కొంతమందికి బహుశా ఇలా కాకుండా వేరేలా జరిగి ఉంటే బాగుండేది అని అనుకోవచ్చు. ఫుల్ స్టాప్ బదులు కామా ఉండి ఉంటే బాగుంటుందని అనుకోవచ్చు. అలా ఉండాలి. ఇది ప్రజాస్వామ్య బలం. ఇవన్నీ ఉన్నా కూడా ఈ విషయాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి మేము ప్రయత్నించాం. ఈ జీఎస్టీ వ్యవస్థ వల్ల సరళీకరణ జరిగే అవకాశాన్ని నేను చూస్తున్నాను.

మనం చూసినట్లయితే, ప్రతి రాష్ట్రంలో ఎన్నో రకాల దరఖాస్తుల్ని నింపే దీర్ఘ ప్రక్రియ ఉంది. ప్రభుత్వ అధికారులు ఆ పత్రాలని చూసే విషయంలో కూడా ఏకరూపత వస్తుంది. పన్ను చరిత్రలో పన్ను ప్రాసెసింగ్ లో, పన్ను ధరలు వీటివల్ల ప్రత్యక్ష పరిణామాలు రానున్నాయి. ఈ సందేశం చాలా స్పష్టంగా ఇవ్వబడుతుంది. వినియోగదారుడే రాజు. జిఎస్టి విధానం ద్వారా ఈ సందేశం చాలా స్పష్టంగా వెళ్లబోతుంది.

అంతిమంగా వినియోగదారుడే రాజు. ఒక చట్టం - ఒక వ్యవస్థ, వినియోగదారున్ని రాజుని చేస్తాయి. నాకు తెలిసినంతవరకూ ఇది ఒక పెద్ద సహకారం.

ఈ జీఎస్టీ పన్ను విధానం ప్రవేశపెట్టిన తర్వాత 7 నుంచి 11 వరకు వేరువేరు పన్ను వ్యవస్థల లో చిన్న చిన్న వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలు పన్ను చెల్లించాల్సి వచ్చేది. ఇవన్నీ సమాప్తం అయిపోతాయి. దీనివల్ల సరళీకరణ వస్తుంది. అలాగే చిన్న పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలుగుతుంది. వినియోగదారులకి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. చిన్న ఉత్పత్తిదారులకు జిఎస్టి భద్రత కల్పిస్తుంది. మన దేశంలోని ఆర్థిక గమనంలో చిన్న చిన్న పారిశ్రామికవేత్తలు చాలా పెద్ద శక్తిగా ఉన్నారు. వీరిని ఎంత సురక్షితంగా మనం ఉంచగలిగితే అంతే ప్రయోజనం మనదేశానికి కలుగుతుంది. ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకువెళ్లడానికి విభిన్న అంశాలు ఉంటాయని మాకు తెలుసు.

ఆర్థిక వ్యవస్థను సమర్థవంతంగా, వేగంగా అభివృద్ధి చేయడానికి ఐదు అంశాల పట్ల మనం శ్రద్ధ వహించాలి అవి మానవ వనరులు, యంత్రాలు, ముడిసరుకు, నిధులు, సమయం.

మనము సమయాన్ని సమర్ధవంతంగా వాడుకోగలిగిన్నట్టయితే మన వ్యవస్థలు ముందుకు సాగుతాయి. దానివల్ల ఆర్థిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి మనం కొత్త అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం లేదు.

ఈరోజు మనం మన రాష్ట్రాల్లో విధించే OCTROI పన్నుని చూసినట్లయితే, రాష్ట్ర సరిహద్దుల్లో మైళ్ళ కొద్దీ క్యూలు కనిపించేవి. మనదేశంలో యంత్ర వాహనాలు కేవలం 40% ఉపయోగించబడుతున్నాయి. మిగతా 60 శాతం ని ఎక్కడో ఓ చోట ఆపాలి. ఇటీవలే ఆర్థిక దృష్టితో పరిశోధన చేసే ఒక సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ కారణాల వల్ల భారత్ లో ఒక లక్షా 40 వేల కోట్ల రూపాయలు వృధా అవుతున్నాయి అని తెలిసింది. కేవలం ఈ వాహనాలు ఆగి ఉండటం వల్ల. దీనికి కారణం OCTROI పన్ను ఒకటే కాదు కానీ చాలా వరకు అదే కారణం. జి.ఎస్.టి వల్ల ఈ అవరోధాలు అన్నీ సమసిపోతాయి, అలాగే పర్యావరణానికి కూడా మేలు జరుగుతుంది. ఏ వాహనాలు అయితే నిలబడి ఉంటాయో, అందులో పెట్రోల్, డీజిల్ వృధా అవుతూ ఉంటుంది, మన సామానులు ఒక స్థానం నుంచి మరో స్థానానికి వెళ్లడానికి ఆలస్యమవుతుంది. వీటన్నింటిలో కూడా ఒక పెద్ద సౌకర్యం లభించనుంది. ఇలాంటి సరళీకరణ కారణంగా, మనదేశం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే పెట్రోల్ పై కూడా భారం తగ్గుతుంది. మన రాష్ట్రాల వద్ద అన్ని రకాల శక్తులు లేవు. అన్ని రాష్ట్రాలు ఒకదాని పై ఒకటి ఆధారపడి ఉన్నాయి. రాష్ట్రాలు కొన్ని వస్తువులు తీసుకుంటాయి, కొన్ని వస్తువులు ఇస్తాయి. అప్పుడే వాటి కార్యకలాపాలు జరుగుతాయి.

ఈనాడు ఈ వ్యవస్థలో కొంత అవరోధం కనిపిస్తోంది. ఈ వ్యవస్థ వలన ఏవైతే సమస్యలు ఉన్నాయో వాటిని దూరం చేయవచ్చు. అలాగే రాష్ట్రాల ఆదాయం పెరుగుతుంది.

ఈరోజు మన దేశంలో వెనుకబడిన రాష్ట్రాలు ఏవైతే ఉన్నాయో వాటి ఆదాయం పెరగడం తథ్యం. కాబట్టి ఈ రాష్ట్రాలు విద్యలో నిధులు ఖర్చు పెట్టాలనుకున్నా, క్రీడలలో నిధులు ఖర్చు పెట్టాలనుకున్నా, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవాలనుకున్నా ఈ వ్యవస్థ ద్వారా ఏ ఆదాయం పెరుగుతుందో, ఆ ఆదాయం ఈ రాష్ట్రాలకి ఎంతో మేలు చేయనుంది. తూర్పు భారతదేశంలో అభివృద్ధిని చూసినట్లయితే, ఆ భాగాన్ని భారతదేశంతో ముందు సమానంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. లేకపోతే అసమతుల్య అభివృద్ధి, మన దేశం కొత్త శిఖరాలను చేరుకునే ప్రయత్నంలో అడ్డంకిగా మారవచ్చు. జీఎస్టీ వలన ఈ రాష్ట్రాలకు కొత్త అవకాశాలు లభించాయి, నేను ఈ రాష్ట్రాలకి, జిఎస్టి అమలు చేసిన తర్వాత దీని ప్రయోజనం అధికంగా పొందమని మనవి చేస్తున్నాను. వారి వద్దకు వచ్చే అదనపు ఆదాయం వారి మౌలిక అవసరాలకి ఉపయోగపడతాయి. ఈ విధంగా మనం ఈ దేశం కంటున్న కలలు నిజం చేయడం సాధ్యం అవుతుంది. జీఎస్టీ వలన కొన్ని ఉత్పాదన చేసే రాష్ట్రాలకి కొన్ని సమస్యలు ఉండవచ్చు. కానీ వినియోగించే రాష్ట్రాలకు ఎక్కువ ప్రయోజనం కలగనుంది. కానీ భారత ప్రభుత్వం జీఎస్టీ ద్వారా వీరికి పరిహారం చెల్లించే ఒక నిబంధన చేసింది. దీని ప్రయోజనం ఆ రాష్ట్రాలకు లభించనుంది. ఈ దిశగా పరిష్కారం దొరకనుంది.

సాధారణంగా ఇద్దరు సోదరుల మధ్య ఆస్తి కోసం తగాదా జరుగుతుంది. అలాగే రాష్ట్రాలు, కేంద్రం మధ్య కూడా ఉద్రిక్తతకి కారణం ఎక్కువగా సహజ వనరులు లేదా సంపద. మాకు అవి లభించాలి,ఇవి లభించాలి అనే గొడవ జరుగుతూనే ఉంటుంది. ఈ వ్యవస్థ వల్ల పారదర్శకత వస్తుంది. కేంద్రం, రాష్ట్రాలలో ఎంత ఆదాయం వస్తుందో తెలుస్తుంది. ఏది, ఎంత జమ అవుతుందో రాష్ట్రాలకు, కేంద్రానికి కూడా తెలుస్తుంది, నియమాల ఆధారంగా విభజించబడుతుంది. లెక్క కూడా స్పష్టంగా ఉంటుంది. అందుకే సమాఖ్య వ్యవస్థలో నమ్మకం చాలా అవసరం. ఈ నమ్మకాన్ని పెంపొందించడంలో ఈ వ్యవస్థ ఒక పెద్ద ఉత్ప్రేరకంగా పని

చేయబోతోంది. అది సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయనుంది. పన్నులు ఏవైతే వసూలు చేయబడతాయో వాటి వివరాలు వీరికి తెలుస్తుంది, దీనివల్ల సౌలభ్యం మరింత పెరగనుంది.

ఖర్గే గారు ఈ చట్టం లోని అంశాలను సూక్ష్మంగా చూసి ఉండాల్సింది. బహుశా దీన్ని రూపొందిస్తున్న సమయంలో వారికి ఆ అవకాశం లభించి ఉండకపోవచ్చు. నేను వారికి ఎప్పుడైనా వివరిస్తాను. ఈ జి ఎస్ టి బిల్లు లో పేదలకు ఉపయోగపడే వస్తువులు చాలా ఉన్నాయి. అవన్నీ కూడా పన్ను పరిధి నుంచి తీసివేయబడ్డాయి. వినియోగదారుల ద్రవ్యోల్బణాన్ని నిర్ధారించడానికి ఉపయోగించే వస్తువులలో 55 శాతం ఆహారం, అత్యవసర మందులు ఏవైతే ఉన్నాయో, అవి జిఎస్టి పరిధి నుంచి తీసివేయబడ్డాయి.

ఈ వ్యవస్థ కారణంగా కొన్ని విషయాల్లో మనకి ప్రయోజనం కలుగుతుంది. మనందరికీ తెలుసు, మన దేశంలో రెవెన్యూ లేదా ద్రవ్యలోటు దాదాపు సమానంగానే ఉంటాయి. అందువల్ల రాష్ట్రాలు అప్పుల్లో మునిగిపోతుండేవి. ఆ తర్వాత అందరూ కలిసి ఎఫ్ ఆర్ బి ఎం చట్టాన్ని ఆశ్రయించాము. ఆర్థిక క్రమశిక్షణ కోసం రాష్ట్రాలు కూడా ఆ చట్టాన్ని స్వీకరించాయి. కేంద్రం కూడా ఒత్తిడి చేసింది. ఒక విధంగా రెవిన్యూ, లోటు మధ్య సమన్వయం, సమతుల్యాన్ని తీసుకు వచ్చే ప్రయత్నం జరిగింది. అందువల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి ఆరోగ్యకరంగాను, సానుకూలంగానూ మారింది.

ఈ ప్రభుత్వం చట్టపరంగా ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. చట్ట ప్రకారం ఈ నిర్ణయం చాలా గొప్పది. మనదేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆలోచనా తీరు, ప్రభుత్వ ఆలోచన తీరు వేరు వేరుగా ఉంటుందని చర్చించుకుంటున్నారు. ఎల్లప్పుడూ అభివృద్ధి, ద్రవ్యోల్బణం రెండింటిని కలిపి చూడడం జరుగుతుంది. ద్రవ్యోల్బణం వల్లనే వడ్డీ రేట్ల పరిస్థితి ఇలా ఉందని,

వడ్డీరేట్ల వల్లనే పెట్టుబడులు రావడంలేదని, పెట్టుబడులు రాక పోతే అభివృద్ధి ఉండదని, ఇవన్నీ కూడా మనము వింటూనే ఉన్నాము.

మొట్టమొదటిసారి ఈ ప్రభుత్వం రిజర్వు బ్యాంకు కి చట్టపరంగా, ద్రవ్యోల్బణం రెండు శాతం ఎక్కువో, తక్కువో, నాలుగు శాతం వద్ద స్థిరీకరించాలని చెప్పింది. ఈ ఏర్పాటు 2021 వరకు ఉంటుంది. దీనివలన ఆర్థిక రంగంతో సంబంధం ఉన్న సంస్థలు అన్నీ ఆర్థిక బలానికి సంబంధించి బాధ్యత తీసుకోనున్నాయి. ఇది మొదటిసారి చట్టప్రకారం చేయబడింది. దీనివల్ల రాబోయే రోజులలో పన్ను వసూలు వ్యవస్థ, ఎక్కడైతే మన డబ్బు పుష్కలంగా ఉంటుందో, దానిని అభివృద్ధి దిశగా ఉపయోగించి ఎక్కువ బాధ్యత గా ఉండే వాతావరణం రాబోతుందని నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను. దేశం స్వాతంత్ర్యం పొందాక కూడా, మనం ఇంకా పేదరికంతో పోరాడుతూనే ఉన్నాం. మన దేశంలో 65 శాతం మంది పేదరికంలో ఉండడం మనకి వారసత్వంగా వచ్చిందని తెలుసు. కొన్ని సందర్భాలలో మనకి మంచి దొరుకుతుంది, అలాగే కొంచెం తక్కువ మంచి దొరుకుతుంది. ఈ రెండింటిని స్వీకరించాలి. దేశం పేదరికం మనల్ని బాధించింది. పేదరికంతో పోరాడాలి అన్న కోరిక మనందరిదీ. మనం ఇటు వైపు కూర్చుని ఉన్నా అటువైపు కూర్చున్నా మనందరం కూడా పేదరికాన్ని పారద్రోలాలని అనుకుంటున్నాం. పద్ధతులు వేరు వేరు కావచ్చు. కానీ, పేద వారిని ఆర్థికంగా బలోపేతం చేసి, విద్య సాధికారత అందిస్తే ఆ పేదవారు వారి కాళ్ల పై వారు నిలబడి, స్వయంగా ఒక సైన్యం గా తయారయ్యి పేదరికాన్ని నిర్మూలించగలరు.

ఈ సందర్భంగా జీఎస్టీ ఇలాంటి వాతావరణాన్ని సృష్టించడానికి ఒక పెద్ద వేదిక కానుంది. పేదరికానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి కూడా ఇది పనికి వస్తుంది. మనకి తెలుసు చిన్న పారిశ్రామికవేత్తలు బ్యాంకుల్లో ఋణం తీసుకోవడానికి వెళితే ఎన్నో సమస్యలు ఉంటాయి. మేము పాత పద్ధతులను, అలవాట్లను మార్చడానికి ప్రయత్నిస్తున్నాము. కానీ

ఇన్ని సంవత్సరాలలో అలవాట్లు మారడం కొంచెం కష్టం. కానీ మేము కృషి చేస్తున్నాము. ఒకటి మాత్రం నిజం. చాలా చెడ్డ అలవాట్లు ఏర్పడి ఉన్నాయి. చిన్న పారిశ్రామిక వేత్తలు బ్యాంకులో రుణం తీసుకోవడానికి వెళ్ళినప్పుడు ఎన్నో కాగితాలు అడుగుతారు. ఎన్నో ప్రశ్నలు వేస్తారు. ఆ తర్వాత రుణాన్ని తిరస్కరిస్తారు. ఆ తర్వాత వాళ్ళకి నచ్చిన వారికి రుణాలు ఇస్తారు. జీఎస్టీ వల్ల ప్రతి వ్యక్తి ఆర్థిక పరిస్థితి ధృవీకరించబడి, ప్రతి నిమిషం అందుబాటులో ఉండేలా చేస్తున్నాం. ఒక వ్యక్తి బ్యాంకు ముందు ఆ వివరాలు ఉంచినప్పుడు, ఆ బ్యాంకు కు వివక్ష చూపించే శక్తి ఉండదు. రుణం తీసుకోవాలనుకునే వారు తీసుకోవచ్చు. ఒక పేద వ్యక్తి కి కూడా ఈ విధమైన రుజువు చేతిలో ఉండబోతుంది. వీటి ద్వారా ఒక సామాన్య వ్యాపారం చేసుకునే వ్యక్తి, పాలు అమ్మే వ్యక్తి అవ్వచ్చు, టీ అమ్మే వారు కావచ్చు, క్షౌర శాల నడిపే వ్యక్తి అవ్వచ్చు, వార్తాపత్రికలు అమ్మే వ్యక్తి కావచ్చు, ఎంత చిన్న వ్యక్తి అయినా సరే వారి ముడి వస్తువులు తీసుకుని, వారు ఈ పని చేయవచ్చు. జిఎస్టి యొక్క పెద్ద బలం టెక్నాలజీ. దాని కారణంగా రియల్ టైం డేటా అందుబాటులో ఉంటుంది. అలాంటి సమాచారం అందుబాటులో ఉన్నప్పుడు వ్యక్తులకు వారి శక్తి, సామర్థ్యాలని రుజువుగా చూపించడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఆ విధంగా వారికి ప్రయోజనం లభించనుంది.

ఈ కారణంగా సహజంగా డబ్బు అందుబాటులోకి వచ్చినప్పుడు, ఒక పోటీ కూడా ఉంటుంది. తయారీ రంగంలో పోటీకి అవకాశం ఉంది. ఎప్పుడైతే తయారీ రంగంలో పోటీతత్వం ఉంటుందో, అప్పుడు ఆర్థిక వ్యవస్థ కి ఒక వైద్యం లభిస్తుంది. కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయి. ఈ వ్యవస్థ కారణంగా డబ్బు ప్రవాహం పెరిగి, ఉపాధి అవకాశాలు పెరిగే ఆస్కారం ఉంది. ఈ వ్యవస్థ ద్వారా అలాంటి అవకాశాలు పూర్తిగా లభించనున్నాయి. మన దేశంలో పెట్టుబడుల దృష్టితో జి ఎస్ టి పి నిష్పత్తి ఎప్పుడూ ఒక ప్రశ్నా చిహ్నంగా ఉండేది. ఈ కొత్త వ్యవస్థ వలన ఇలాంటి ప్రశ్నలు శాశ్వతంగా చెరిగిపోనున్నాయి. ఈ కారణంగా రాష్ట్రాలు

అభివృద్ధికి సంబంధించి, మౌలిక సదుపాయాలకు సంబంధించి, సామాజిక రంగానికి సహాయ పడటం నుంచి మిగతా అన్ని విషయాలలో వేగవంతంగా ముందుకు వెళ్లగలుగుతాము. ఇవన్నీ కూడా మరింత పెరుగుతాయని నేను భావిస్తున్నాను.

అప్పుడప్పుడు మనం అవినీతికి వ్యతిరేకంగా చాలా మాట్లాడతాము. కానీ అవినీతిని అంతమొందించడానికి వ్యవస్థలని అంతే బలోపేతం చేయాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి బాగానే పని చేస్తాడు అనే నమ్మకంతో పెద్ద పెద్ద విషయాలు కొనసాగవు. అందుకే వ్యవస్థలు సరిగ్గా ఉంటే ఒక తప్పుడు వ్యక్తి కూడా క్రమబద్ధంగా ఉండవలసి వస్తుంది.

జీఎస్టీ లో పన్ను ఎగవేత గురించి ప్రస్తావించారు. వ్యాపారుల మధ్య తప్పుడు బిల్లు, సరైన బిల్లు అనే శబ్దాలు బాగా ప్రాచుర్యం పొందాయి. జి ఎస్ టి వలన వ్యాపారులు స్వయంగా ప్రేరితులై సరైన బిల్లు తయారు చేస్తారు. ఉదాహరణకి ఆరోగ్య బీమా ఉన్నప్పుడు, మనం ఏమి చేస్తాం? మన మందుల బిల్లులను జాగ్రత్తగా ఉంచుకుంటాము. వాటిని ఎక్కడపడితే అక్కడ ఉంచము. ఎందుకంటే మనకి తెలుసు కదా, అవన్ని ఒకచోట ఉంటేనే మనం దానిని క్లైమ్ చేయగలము. అప్పుడే మనకి డబ్బు లభిస్తుందని తెలుసు. జి ఎస్ టి లో కూడా అలాంటి వ్యవస్థ ఉంది. ఎవరైతే వారి బిల్లు ఇస్తారో, అతను కొనుగోలు చేసిన వస్తువులు ఏవైతే ఉన్నాయో వాటికి డబ్బు వాపసు లభిస్తుంది. కాబట్టి ఈ పాత పద్ధతులలో సృష్టించిన బిల్లులు ఒక విధంగా నల్లధనాన్ని కూడా పెంచుతాయి. ఆ విధంగా మనం నల్లధనాన్ని కూడా కట్టడి చేశాం. ఇది పూర్తిగా నిర్మూలించబడుతుంది. ఈ విధానం వల్ల అవినీతి ద్వారా లభించే నల్లధనం మనం తొలగించేలా ఈ వ్యవస్థ పని చేయనుంది. ఆ దిశగా మేము ప్రయత్నాలు చేస్తున్నాం. అవి ప్రయోజనం చేకూరుస్తాయి అని నేను నమ్ముతున్నాను.

మన దేశంలో పన్నుల ని వసూలు చేయడానికి ఒక భారీ సైన్యమే ఉంది. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు సేకరణ ఖర్చు పెరుగుతుంది. ఈ వ్యవస్థ వల్ల టెక్నాలజీ ఆధారంగా ఆన్ లైన్ కార్యకలాపాలు చెయ్యడం వల్ల సేకరణ ఖర్చు చాలా వరకు తగ్గిపోతుంది. ఆ డబ్బు ఈ దేశంలోని పేద వ్యక్తి అభివృద్ధి, మేలు కోసం ఉపయోగించవచ్చు. ఆ విధంగానే ఎక్కడయితే ప్రభుత్వ వ్యవస్థలలో జోక్యం చేసుకునే అవకాశం లభిస్తుందో, ఎక్కడో ఒక చోట అవినీతి వాసన మొదలవుతుంది. మేము అభివృద్ధి చేస్తున్న వ్యవస్థ వలన సేకరణ ప్రక్రియ లో అవినీతి సున్నా వైపు వెళ్తుంది. ఈ వ్యవస్థ వలన కూడా దేశాన్ని అవినీతి నుంచి విముక్తి కల్పించే దిశగా మనకి అవకాశం ఉంటుంది. ఇక్కడ సమాచారం అనుసంధానించబడి ఉంది. దాని అర్థం ముడి సరుకు నుంచి అంతిమ ఉత్పాదన వరకు ప్రతి స్థాయిలో ఆన్ లైన్ లో నమోదు చేయబడతాయి. అందుకే సహజంగా సరి చూసుకునే విధానం ఈ వ్యవస్థలో ఉంది. ఈ సరి చూసుకునే విధానం వల్ల ఎక్కడ పొరపాటు జరిగినా తెలిసిపోతుంది. ఎలాంటి అతుకులు లేని వ్యవస్థ వలన మనకి లాభం చేకూరుతుంది. అలాంటి వ్యవస్థ తయారు అవుతుంది. ఇందులో పన్ను చెల్లింపుదారు, పన్ను వసూలు చేసే వారి మధ్య హ్యూమన్ ఇంటర్ఫేస్ దాదాపు చెరిగిపోతుంది. అందువల్ల అవినీతికి ఆస్కారం ఉండదు. ఇలాంటి వాటినుండి సామాన్య ప్రజలు విముక్తులు అవుతారు. ఆ దిశలో మనకి చాలా పెద్ద ప్రయోజనం లభించనుంది. జి ఎస్ టి వలన టాక్స్ చెల్లింపుదారుల వ్యవస్థలో నిజాయితీ వల్లనే ప్రయోజనం ఉంటుందని తెలుస్తుంది. దీనివల్ల నల్లధనాన్ని రూపుమాపడంలో కూడా మనం విజయం సాధిస్తాం. రాష్ట్ర, కేంద్రాల పన్నుల వివరాలు ఒకేచోట లభ్యమవుతాయి. రిజిస్ట్రేషన్ కానివ్వండి, రిటర్నులు కానివ్వండి, పన్ను చెల్లింపులు కానివ్వండి, వీటన్నిటికీ డిజిటల్ వ్యవస్థ ఉంటుంది. ఆన్ లైన్ అవ్వడం వల్ల, పారదర్శకత కోసం ఈ వ్యవస్థ ద్వారా ఒక పెద్ద వేదిక మనకి లభించనుంది.

ఇక ముందు ఏం జరగబోతుందో, దాని గురించి అరుణ్ గారు మన ముందు వివరాలు ఉంచుతారు. ఈరోజు ఇక్కడ మనం ఓటు వేసే పవిత్రమైన పనిని పూర్తి చేద్దాం. 16 కంటే ఎక్కువ రాష్ట్రాలు దీనిని ఆమోదించాలి. ఇది అవసరం. ఆ తర్వాత కూడా ఎన్నో రాజ్యాంగ ఏర్పాట్లని మనం పూర్తి చేయాలి. ఆ తర్వాత కూడా కేంద్ర జిఎస్టి, ఇంటిగ్రేటెడ్ జిఎస్టి, స్టేట్ జిఎస్టి, లాంటి చట్టాలు అన్నింటినీ ఆమోదించాలి. కానీ ఈరోజు ఈ ప్రక్రియలో అన్నింటికి ఒక ద్వారం తెరుచుకోనుంది. ఒక శుభారంభం తో మనం ముందుకు వెళ్తున్నాం. రానున్న కొన్ని రోజులలో మనం దీని నుంచి ఫలితం పొంద బోతున్నాం. ఇది కొత్త విషయం కాబట్టి ప్రజలకి దీనిని వివరించాల్సిన అవసరం కూడా ఉంది. ఐ టి సంసిద్ధత కూడా అవసరం. చట్టపరమైన సంసిద్ధత కూడా అవసరం. అలాగే టాక్స్ అధికారుల సంసిద్ధత కూడా అవసరం. వినియోగదారుల సంసిద్ధత కోసం మనం పని చేయాలి, అప్పుడే మనం ఈ పని చేయగలం.

దీని అర్థం ఏమిటంటే, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశాలు, వేటికయితే ప్రజాస్వామ్యం గురించి ప్రపంచానికి ఉపన్యాసం ఇచ్చే సామర్థ్యం ఉందో - అలాంటి దేశంలో కూడా ఆర్థిక బిల్లు లాంటి పెద్ద విషయం ఆమోదించ గలగడం కష్టంగా ఉంటుంది. ఇది భారతదేశ ప్రజాస్వామ్యం. ఇది భారతీయుల పరిపక్వత. ఇది భారతీయ రాజకీయ నాయకుల దూరదృష్టి వల్ల ఈ రోజు ఆలోచనలలో వైరుధ్యం ఉన్నా, వైవిధ్య నేపథ్యాలున్నా మనం ఇంత పెద్ద పనిని చేయగలిగాం. ఇది భారత ప్రజాస్వామ్య శక్తిని చూపిస్తుంది. బయట మన గురించి ఏ అభిప్రాయం ఉన్నాసరే నేను గర్వంగానూ, అణకువతోనూ అన్ని రాజకీయ పార్టీలని, గౌరవ సభ్యులను గౌరవిస్తూ, వారు ప్రతిపక్షంలో కూర్చుని ఉన్నా, తటస్థంగా కూర్చుని ఉన్నా, వారందరికీ ఒక విషయం చెప్పదలుచుకున్నాను. ఈ ప్రభుత్వం గత 100 వారాలుగా పనిచేస్తూ 100 చట్టాలను తీసుకు వచ్చింది. ఇది ఈ సభ బలం, ఇది ప్రజలలో కొత్త విశ్వాసాన్ని కల్పిస్తుంది. అందరూ కూడా ఈ విషయం లో చాలా మంచి పాత్రని పోషించారు.

ఈ పని చేసినందుకు అందరూ ప్రశంస కి హక్కుదారులు. నేను ఈ విషయం అఖిల పక్ష సమావేశంలో కూడా చెప్పాను. అన్ని రాజకీయ పార్టీలు, సభ్యులందరూ ఎవరైతే ఆ దిశగా కృషి చేశారో, వారందరూ కూడా ప్రశంసలకు అర్హులు. గౌరవనీయులైన స్పీకర్ గారికి, ఈ పవిత్రమైన సభకు, నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. మనం ఆ దిశగా ముందుకు సాగడానికి నా శుభాకాంక్షలు, ధన్యవాదాలు.

2017



ప్రధానమంత్రి ఆవాస్ యోజన - గ్రామీణ్ లబ్ధిదారితో శ్రీ నరేంద్ర మోదీ.

"ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పేదల కలలు సాకారం చేసే మార్గం."

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

7 ఫిబ్రవరి 2017

లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 7 ఫిబ్రవరి 2017

స్పీకర్ మేడం, గౌరవనీయులైన రాష్ట్రపతి గారు పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి 2017 ఆరంభంలోనే ప్రసంగించారు. మానవ వనరులకు సంబంధించి ఒక ప్రణాళికని వారు ప్రస్తావిస్తూ గ్రామాలు, రైతుల జీవితాలు ఏ విధంగా మారాయో చెప్పారు. ఈ సందర్భంగా నేను వారి ప్రసంగానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

గౌరవనీయులైన మల్లికార్జున్ గారు, తారిక్ అన్వర్ గారు, జై ప్రకాష్ నారాయణ గారు, తథాగత్ సత్పతి గారు, కళ్యాణ్ బెనర్జీ గారు, జ్యోతిరాదిత్య సింధియా గారు, ఇతరులు వారి అభిప్రాయాలను వెల్లడించి చర్చను మరింత ప్రభావవంతం చేశారు. వారు ఎన్నో విషయాలపై విజయవంతంగా వారి అభిప్రాయాలను వెల్లడించారు. అందుకు వారికి నేను, చర్చలో పాలు పంచుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

నిన్న భూకంపం సంభవించింది. భూకంపం వల్ల కష్టాలను ఎదుర్కొంటున్న వారందరికీ నేను నా సానుభూతిని తెలియజేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం వారిని సంప్రదిస్తూ ఉంది. మరింత సహాయం అవసరమైతే మా ప్రభుత్వం ఉంది. కొన్ని బృందాలను ఇప్పటికే అక్కడికి పంపించాము. ఎలాగైతేనేం ఈ భూకంపం సంభవించింది. ఈ భూకంపం ఎలా సంభవించిందో అని ఆలోచిస్తూ ఉన్నాను. భూమాత కోపానికి ఏవో స్పష్టమైన కారణాలు ఉండి ఉంటాయి.

స్పీకర్ మేడం, భూకంపం ఎందుకు సంభవించిందో అని నేను ఆశ్చర్యపోయాను. ఎవరైనా కుంభకోణంలో సేవ మరియు వినయాన్ని చూస్తే, తల్లే కాదు భూమాత కూడా అసంతృప్తికి లోనయ్యి, భూకంపం సంభవిస్తుంది.

అందుకే గౌరవనీయ రాష్ట్రపతి గారు వారి ప్రసంగంలో మానవ వనరుల గురించి విస్తారంగా చెప్పారు. ఏ వ్యవస్థ అయినా సరే అది ప్రజాస్వామిక వ్యవస్థ కానివ్వండి లేదా ప్రజాస్వామ్యేతర వ్యవస్థ కానివ్వండి, మానవ వనరుల విలువ వేరు. నిన్న మల్లికార్జున ఖర్గే గారు మాట్లాడుతూ కాంగ్రెస్ వల్లనే ప్రజాస్వామ్యం ఇంకా మిగిలిఉందని, ఆ కారణంగానే నేను ప్రధాన మంత్రి అయ్యానని చెప్పారు. భలే కవిత వినిపించారు. ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడిన మీరు ఈ దేశం పై చాలా దయ చూపించారు. మీరు చాలా గొప్ప వ్యక్తులు. కానీ స్పీకర్ మేడం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యం ఎలాంటిదో దేశానికి తెలుసు. మొత్తం ప్రజాస్వామ్యాన్ని ఒక కుటుంబానికి అంకితం చేశారు. '75 కాలంలో ఈ దేశం పై ఎమర్జెన్సీ విధించడం జరిగింది భారతదేశాన్ని ఒక జిల్లాగా మార్చారు దేశంలోని గొప్ప నాయకులైన జయప్రకాష్ బాబు తో సహా లక్షల మందిని చెరసాలలో బంధించారు. వార్తాపత్రికల నోరు మూసేసారు. వారికి మానవ శక్తి విలువ తెలియదు. ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ఎన్నో ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజాశక్తి వలన ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడింది. ప్రజాశక్తి ద్వారా ఒక పేద తల్లి కొడుకు దేశానికి ప్రధాని అయ్యాడు.

అందుకే గౌరవనీయ రాష్ట్రపతి గారు ప్రజాశక్తి గురించి మాట్లాడుతూ చంపారన్ సత్యాగ్రహం శతాబ్ది సంవత్సరం గురించి మాట్లాడారు. చరిత్ర పుస్తకాలను ఆటక కే పరిమితం చేస్తే సామాజిక జీవనం ప్రేరేపించబడదు. ప్రతి యుగంలో చరిత్రని తెలుసుకోవడం, చరిత్రని జీవించడానికి ప్రయత్నించడం చాలా అవసరం. అందులో మనం ఉన్నామా లేదా, మన కుక్కలు ఉన్నాయా లేదా, ఇతరుల కుక్కలు ఉండి ఉండవచ్చు. మేము కుక్కల సాంప్రదాయంలో పెరగలేదు. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ పుట్టక ముందు కూడా ప్రజలు ఉన్నారు. 1857లో స్వతంత్ర సంగ్రామంలో ఈ దేశ ప్రజలు కలిసి పోరాడారు. సాంప్రదాయాల

మధ్య వేర్పాటు ఉండేది కాదు అప్పుడు కూడా కమలం ఉండేది, ఇప్పుడు కూడా కమలం ఉంది.

స్వాతంత్ర్యం అనంతరం జన్మించినవారు నాలాగా ఈ సభలో చాలా మంది ఉన్నారు. మనకు స్వాతంత్ర సంగ్రామంలో పోరాడే సౌభాగ్యం లభించలేదు కానీ ఈ దేశం కోసం జీవించే అదృష్టం పొందాం. ఆ దిశగా జీవించడానికి మేము ప్రయత్నిస్తాము.

గౌరవనీయులైన మేడం స్పీకర్ అందువల్లనే దేశం అపారమైన జన శక్తి ని చూసింది. లాల్ బహదూర్ శాస్త్రి గారి కి ఒక వినూత్న వ్యక్తిత్వం ఉండేది. అవి యుద్ధం జరుగుతున్న రోజులు. ప్రతి భారతీయుడి గుండెల్లో భారతదేశం విజయం సాధించాలి అనే భావనతో నిండి ఉండేది. ఆ సమయంలో లాల్ బహదూర్ శాస్త్రి గారు మన దేశం అన్నాన్ని త్యాగం చేసే దిశగా చొరవ తీసుకుందని చెప్పారు.

ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నేటి రాజకీయ వాతావరణం ఏమిటో మనకు తెలుసు. రాజకీయ వ్యవస్థలో ఎక్కువగా రాజకీయ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలు ప్రజల సామర్థ్యాన్ని గుర్తించడం దాదాపు వదిలేశారు. ఇది ప్రజాస్వామ్యం లో ఆందోళన చెందాల్సిన విషయం. నాలాంటి ఒక సామాన్య వ్యక్తి మాటల్లో స్తోమత ఉన్నవారు గ్యాస్ సబ్సిడీని వదులుకోవాలి అని చెప్పాను. అలా మాట్లాడినప్పుడు మేము ప్రజల నుండి, వారి మనసులో నుండి దూరం అయి ఉండవచ్చు. 2014లో మేము ఎన్నికలలో పోటీ చేస్తున్నాము, అప్పుడు ఒక పార్టీ 9 సిలిండర్లు ఇవ్వాలా లేక 12 సిలిండర్లు ఇవ్వాలా అనే అంశంపై పోటీ పడుతుంది. మేము వచ్చాక 9 లేదా 12 సిలిండర్లు చర్చా పక్కనపెట్టి స్తోమత ఉన్నవారు సబ్సిడీ ని వదిలి వేయ గలరా అని అడిగాము. మేము కేవలం అడిగాము. కానీ ఈ దేశంలోని ఒక కోటి ఇరవై లక్షల కంటే ఎక్కువ మంది గ్యాస్ రాయితీ వదులుకోవడానికి

ముందుకు వచ్చారు. ఈ విషయం ఈ ప్రభుత్వం, అక్కడ కూర్చున్న వ్యక్తుల గర్వానికి పరిమితమయ్యే విషయం కాదు. ఇది 125 కోట్ల దేశపౌరుల శక్తి పరిచయం. అందుకే నేను ఈ సభ ని అర్థిస్తున్నాను. రాష్ట్రపతి గారి ప్రసంగం ద్వారా ఈ అభ్యర్థన చేస్తాను, దేశ రాజకీయ జీవితంలో నిర్ణయాత్మక పాత్ర పోషించే వారిని నేను వేడుకునేదేమిటంటే, దేశంలోని ప్రజాశక్తి ని, వారి సామర్థ్యాన్ని గుర్తించి మన దేశాన్ని కొత్త ఎత్తులకు తీసుకు వెళ్లే దిశగా జన ఉద్యమం చేసి, ఒక మంచి వాతావరణాన్ని సృష్టించి, దేశాన్ని ముందుకు తీసుకెళ్ళే దిశగా పని చేయాలి. అలా చేసినట్లయితే మనం ఇంతకుముందు చూడని ఫలితాలను చూడగలుగుతాం.

అలా చేస్తే మన శక్తి కూడా ఎన్నో రెట్లు పెరుగుతుంది.దేశం అభివృద్ధి చెందుతుంది. మనలో ఎవరూ కూడా రాబోయే రోజులలో చెడు చూడాలని కోరుకోరు. మనలో ఎవరూ కూడా మన దేశానికి చెడు జరగాలని కోరుకోరు. ప్రతి ఒక్కరూ పేదలకు మేలు జరగాలని కోరుకుంటారు. ప్రతి ఒక్కరూ గ్రామ, పేద రైతు కి ఏదో ఒక మేలు జరగాలని కోరుకుంటారు. ఇంతకు ముందు ఇలాంటి ప్రయత్నాలు జరిగ లేదని చెప్పే వారిలో నేను ఉండను. ఈ సభలో నేను పదేపదే చెప్పాను, నేను ఎర్రకోటపై నుండి కూడా చెప్పాను. ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వాలు అయితే వచ్చాయో, ఎంతమంది ప్రధాన మంత్రులు అయితే ఉన్నారో, ప్రతి ఒక్కరూ ఈ దేశం కోసం ఏదో ఒకటి చేశారు.

అటు వైపు కూర్చున్న వారి నుండి ఎప్పుడూ చాపేకర్ బంధు అనే వ్యక్తి ఈ దేశ స్వాతంత్ర్యం లో బలిదానం చేశాడని వినలేదు. వారి నుంచి సావర్కర్ ఎవరైతే కాలాపానీ లో శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఈ దేశం స్వాతంత్ర్యం పొందిందో, వారి గురించి కూడా వినలేదు. వారినుంచి భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ ఈ దేశం కోసం చేసిన త్యాగం గురించి వినలేదు. వారి దృష్టిలో ఈ దేశానికి స్వాతంత్ర్యం కేవలం ఒక కుటుంబం వల్లే లభించింది. సమస్యకు మూలం అక్కడే ఉంది.

ప్రజాశక్తి ని జోడించి మన దేశాన్ని సంపూర్ణంగా స్వీకరిద్దాం. మన శాస్త్రాలలో ఈ విధంగా చెప్పబడింది.

అమంత్రం అక్షరం నాస్తి, నాస్తి మూలం అనౌషిధం

అయోగ్య పురుషో నాస్తి యోజకః, తత్ర దుర్లభః.

మంత్రంలో చోటు పొందే యోగ్యత లేని అక్షరం లేదు. ఔషధం లో చోటు సంపాదించ లేని మూలిక ఏదీ లేదు. అలాగే సమాజానికి దేశానికి ఏమి ఇవ్వలేని వ్యక్తి లేడు. కాబట్టి వీటిని గుర్తించి వాటి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలి. కానీ అలా ఉపయోగించుకునే వారు చాలా అరుదు.

ఈ ప్రభుత్వం అలాంటి సామర్థ్యాన్ని ప్రజల మద్దతుతో పోషించి, ప్రోత్సహించింది. స్వచ్ఛభారత్ యోజన నాకు స్వాతంత్ర్యం వచ్చి ఎన్ని సంవత్సరాలు అయ్యాక కూడా మనం ఈ విషయం పట్ల శ్రద్ధ వహించక పోవడం ఆశ్చర్యానికి గురి చేసింది. మనము మహాత్మాగాంధీ పేరుని స్మరించుకుంటూ ఉంటాము, గాంధీ గారికి రెండు ప్రియమైన సంకేతాలు ఉన్నాయి. గాంధీ గారు స్వాతంత్ర్యానికి ముందు కూడా అనేవారు - నేను ఏదైనా సాధించాలి అనుకుంటున్నాను అంటే అది స్వచ్ఛత, పరిశుభ్రత అని. గాంధీ గారి ఈ మాట తీసుకుని మీ ముందుకి, దేశం ముందుకి వచ్చాము. ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, ఎన్నో సమావేశాలు జరిగాయి, ఎప్పుడైనా పార్లమెంటులో పరిశుభ్రతపై సభ్యులు చర్చించారా? అందుకే ఈ ప్రభుత్వం వచ్చాక మొట్టమొదటిసారి ఈ పనిని చేపట్టింది. మనం పరిశుభ్రతను కూడా రాజకీయంగా చూస్తామా? మనలో ఎవరు అపరిశుభ్రంగా జీవించాలని అనుకోరు. ఇటు వైపు కూర్చున్న వారు కానీ అటు వైపు కూర్చున్న వారు కానీ ఎవరూ కూడా మురికిని కోరుకోరు. కానీ మనము కలిసి ఒకే స్వరములో సమాజానికి ఈ పవిత్రమైన పని చేసేందుకు

పిలుపునిచ్చి గాంధీజీ గారి కలని నిజం చేయడానికి ముందుకు సాగలేమా? మనల్ని ఎవరు ఆపుతున్నారు?

అందుకే స్పీకర్ మేడమ్, ఈ అపారమైన ప్రజాశక్తి ని ముందుకు తీసుకు వెళుతూ మనం రాష్ట్రపతి గారి ప్రసంగం పై చర్చిస్తూ, అలాగే బడ్జెట్ కూడా వస్తుంది కాబట్టి బడ్జెట్ పై కూడా చర్చ జరుగుతుంది. బడ్జెట్ పై చర్చ జరుగుతున్నప్పుడు ఆర్థికమంత్రి ఈ విషయంపై విస్తారంగా మాట్లాడుతారు. కానీ ఇంకో చర్చ కూడా జరుగుతోంది, బడ్జెట్ ఇంత త్వరగా ఎందుకు వచ్చిందని. భారతదేశం, ఒక వ్యవసాయ ఆధారిత దేశం, చాలావరకు వ్యవసాయ పరిస్థితులు దీపావళి వరకు మనకి తెలిసి పోతాయి. మన దేశంలో ఉన్న ఒక ఇబ్బంది ఏమిటంటే బ్రిటిష్ వారు వదిలి వెళ్లిన వారసత్వాన్ని మనం పాటిస్తున్నాము.

మే నెల వరకు మనం బడ్జెట్ ప్రక్రియ దాదాపు ముగిస్తాము. జూన్ 1 తర్వాత మన దేశంలో వర్షాలు ప్రారంభం అవుతాయి. మూడు నెలల వరకు బడ్జెట్ ను ఉపయోగించడం సాధ్యం కాదు. ఒక విధంగా మనకి పని చేయడానికి సమయం చాలా తక్కువగా ఉంటుంది. సమయం ఎప్పుడైతే ఉంటుందో చివరి రోజులలో, మనందరికీ తెలుసు, ప్రభుత్వానికి తెలుసు, డిసెంబర్ నుంచి మార్చి వరకు ఏ విధంగా బిల్లులు చేయబడతాయో, ఏ విధంగా డబ్బులు ఖర్చు చేయబడతాయో. ఇది మనం ఆలోచించాల్సిన విషయం, నేను ఎవరిని విమర్శించడం లేదు. స్వాతంత్ర్యం వచ్చిన చాలా సంవత్సరాల వరకు బడ్జెట్ సాయంత్రం ఐదు గంటలకి ఎందుకు వచ్చేదో ఎవరికైనా అర్థం అయిందా? ఎవరు దాని గురించి ఆలోచించలేదు. ఐదు గంటలకి ఉండనివ్వండి అన్నట్టుగా ఉండేది. అలా ఎందుకు జరిగేది? మన దేశంలో బ్రిటిష్ పరిపాలన జరిగే రోజుల్లో బ్రిటిష్ పార్లమెంట్ లెక్క ప్రకారం, ఐదు గంటలకి బడ్జెట్ ప్రవేశపెట్టబడేది. మనం ఆ విధానాన్ని పాటిస్తూ వచ్చాం. ఈ విషయం చాలా కొద్ది మందికి తెలిసి ఉంటుంది. మనం గడియారాన్ని ఇటు నుండి చూస్తే అది భారత్ సమయం.అటు నుంచి

పట్టుకొని చూస్తే అది లండన్ సమయం. మీ దగ్గర గడియారం ఉంటే దాన్ని చూసి మీరు తెలుసుకోండి.

అదేవిధంగా అటల్ జి గారి ప్రభుత్వం వచ్చినప్పుడు ఆ సమయాన్ని మార్చారు. మేము ఆ దిశగా ప్రయత్నాలు చేసాము. మీ ప్రభుత్వం కూడా ఉన్నప్పుడు మీరు బడ్జెట్ కి సంబంధించి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ వివరణాత్మక నివేదిక ఉంది. మీరు కూడా ఈ సమయాన్ని మార్చాలని అనుకున్నారు. ఆ కమిటీ అలాంటి ప్రతిపాదన చేసింది, ఆ ప్రతిపాదన ప్రకారమే ఈ మార్పు తీసుకువచ్చాం. ఈ పనిని మీరు చేయలేకపోయారు, ఎందుకంటే మీ ప్రాధాన్యాలు వేరు. మీరు ఈ పని చేయకూడదు అని అనుకుంటున్నారు అని కాదు, కానీ ప్రాధాన్యాలలో అది ఎప్పుడొస్తుందో తెలీదు. అందుకే మీ కాలంలో జరిగిన విషయాలు మీరు ఇక్కడ గర్వంగా చెప్పొచ్చు. మా సమయంలో ఆ పనులు జరిగాయని మీరు చెప్పొచ్చు. మీరు మరిచిపోయిన విషయాలు నేను గుర్తు చేశాను, కాబట్టి దీని ప్రయోజనాలు మీరు ఇవ్వండి.

రైల్వే ల విషయానికి వస్తే బడ్జెట్ పై చర్చ జరిగినప్పుడు విస్తారంగా చర్చించవచ్చు. కానీ ఒక విషయం అర్థం చేసుకోండి, 90 సంవత్సరాల క్రితం రైల్వే బడ్జెట్ వచ్చిన్నప్పుడు రైల్వే అనేది రవాణా వ్యవస్థలో ఒక ముఖ్యమైన రవాణా విధానం. నేడు రవాణా ఒక అత్యవసరంగా మారిపోయింది, రైల్వే ఒకటే కాకుండా అనేక రకాల రవాణా పద్ధతులు ఈరోజు ఉన్నాయి. రవాణా వ్యవస్థ ని సంపూర్ణంగా తీసుకోక పోయినట్లయితే మనం ఈ సమస్యలతో బాధపడుతూనే ఉంటాం అందుకే ముఖ్యమైన రవాణా పద్ధతులలో రైల్వే కూడా ఉంటుంది. అందులో ప్రైవేటీకరణ వల్ల సమస్య ఉండదు, దాని స్వాతంత్ర్యానికి ఏ విధమైన ఇబ్బంది ఉండదు కానీ నీ ప్రభుత్వం ఒక సమగ్రమైన ఆలోచనతో ప్రతి రవాణా విధానాన్ని చూడాల్సిన అవసరం ఉంది. అందుకే మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వేలో, బడ్జెట్లో

మార్పులు తీసుకు వచ్చాము. మా తొలి బడ్జెట్ లో గౌడ గారు దాదాపు పదిహేను వందల ప్రకటనలు ఉన్నాయని చెప్పారు. ఎవరైతే బలవంతులో, సభలో ఎవరైతే ఇబ్బంది పెడతారో, వారిని సంతోష పెట్టడానికి రెండు మూడు ప్రకటనలు చేయబడతాయి. వారు ఆ సందర్భంగా చప్పట్లు కొడతారు, వారి నియోజకవర్గంలోకి వెళ్లి ఆ పని పూర్తి అయిపోయిందని చెప్తారు. మేము అలాంటి 1500 విషయాలు చూశాం. కాగితాల లోనే అవి విముక్తి పొందాయి. మనం అలా ఎందుకు చేస్తాం? ఎందుకంటే దీనివల్ల రాజకీయంగా మనకు నష్టం వాటిల్లుతుంది. కానీ ఎవరో ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి కదా. మన దేశంలో ఇలాంటి తప్పులు జరుగుతున్నప్పుడు వాటిని ఆపే బాధ్యత మేము తీసుకున్నాం. ఇలాంటి పద్ధతి బ్యూరోక్రాట్స్ కి నప్పుతుంది. నాయకులు చప్పట్లు కొట్టించుకుని వారి పబ్బం గడుపుకుంటూ ఉంటారు. నాకు అలాంటి కోరిక లేదు.

దేశంలోని సామాన్య ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసం నిర్ణయాలు తీసుకోవాలి. ఆ దిశగా మంచి నిర్ణయాలు తీసుకునే ప్రయత్నం జరుగుతుంది, ఆ పనిని బాగా చేసేలా చూస్తున్నాం, అందుకే మేము ఆ దిశగా పయనిస్తూ ఆ పని చేస్తున్నాము. నోట్ల రద్దు విషయం కూడా ప్రస్తావించబడింది. మా ప్రభుత్వం మొదటి నుంచే నోట్ల రద్దు పై చర్చకు సిద్ధమని చెప్పాము. కానీ మీరు టీవీలలో ప్రజలు క్యూ లో నిల్చోవడం చూసి, రేపు ఇంకా ఏదో జరుగుతుందని ఊహించారు. ఈ సమయంలో ఆ విషయంపై చర్చ జరిగితే మోదీకి ప్రయోజనం జరుగుతుందని మీరు భావించారు. అందుకే ఈ విషయం పై చర్చించే బదులు మీరు టీవీలలో మీ అభిప్రాయాలు చెప్తూ ఉన్నారు అందుకే చర్చ జరగలేదు. ఈసారి అందుకే ఇంత పెద్ద మార్పు సాధ్యం అయింది. ఎవరైతే విషయాలని సూక్ష్మంగా అధ్యయనం చేస్తారో, వారి దృష్టి కొన్ని విషయాల వైపు ఇంకా వెళ్ళలేదు, అందుకే వారి దృష్టి ఆ విషయాలపై వెళ్లాలని నేను కోరుకుంటున్నాను. 2014 కంటే ముందు ఎలా ఉండేదో చూడండి. 2014 కి ముందుమాట

ఇది. అటువైపునుంచి ఎంత బొగ్గు కుంభకోణం జరిగిందో అని గొంతు వినిపించేది, నీటిలో అలాగే గాలి లో ఎంతో అవినీతి జరిగిందని కొన్ని గొంతులు వినిపించేవి. ఆకాశం అవినీతిలో ఎంత దోచుకో బడింది, ఎన్ని లక్షలు నష్టపోయాం వీటి గురించే ఆ గొంతులు అడిగేవి. ఇప్పుడు మోదీ ఎంత తెచ్చారు ఎంత తెచ్చారు అనే స్వరాలు వింటుంటే నాకు సంతోషంగా ఉంటుంది. అప్పట్లో ఎంత పోయింది అని అడిగేవారు, ఇప్పుడు ఎంత తీసుకు వచ్చాము అని అడుగుతున్నారు. ఇది జీవితంలో అత్యంత సంతోషకరమైన విషయం. ఇదే సరైన అడుగు.

రెండవ విషయం ఖర్గే గారు మాట్లాడుతూ నల్లధనం వజ్రాలు, ఆభరణాలు,బంగారం, వెండి, ఆస్తిలో దాగి ఉన్నాయని చెప్పారు. నేను వారితో అంగీకరిస్తున్నాను. వారికి ఈ జ్ఞానం ఎప్పుడు లభించిందో ఈ సభ తెలుసుకోవాలనుకుంటుంది. ఎందుకంటే అవినీతి డబ్బు తోనే ప్రారంభం అవుతుంది. ఈ విషయం మనందరికీ తెలుసు. ఆ తర్వాత అది ఒక ఆస్తిగా, ఆభరణం గా లేదా బంగారంగా మారుతుంది. కానీ ప్రారంభం మాత్రం నగదు తోనే అవుతుంది. ఇది చెడుకి కేంద్రబిందువు. బినామీ ఆస్తులు,ఆభరణాలు, బంగారం, వెండిగా ఇది తరువాత రూపాంతరం చెందుతుంది. మీరు ఒక విషయం చెప్పండి, 1988లో శ్రీ రాజీవ్ గాంధీ గారు ఈ దేశ ప్రధాన మంత్రిగా ఉండేవారు, పండిట్ నెహ్రూ గారి కంటే కూడా ఎక్కువ ఆధిక్యం ఈ సభలో మీ వద్ద ఉండేది. రెండు సభలలో ఆధిపత్యం మీకు ఉండేది. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ప్రతీదీ మీ అధీనంలో ఉండేవి. ఎక్కడ చూసినా మీరే, ఎవరూ లేరు.

1988లో మీరు బినామీ ఆస్తి చట్టాన్ని రూపొందించారు. మీరు ఈ రోజు జ్ఞానం అయితే ఇక్కడ పంచుకుంటున్నారు. 26 సంవత్సరాల వరకు ఆ చట్టాన్ని ఎందుకు ప్రకటించలేదు? ఆ చట్టాన్ని నొక్కి పెట్టడానికి కారణం ఏమిటి? ఆ చట్టం 26 సంవత్సరాల క్రితమే ప్రకటించబడి ఉండి ఉంటే ఈ రోజు మీరు మాతో పంచుకుంటున్న జ్ఞానం అలాగే అప్పటి పరిస్థితులు ఇప్పటికీ అంటే బాగుండేది. దేశంలో అవినీతి త్వరగా అంతమై పోయి ఉండేది ఈపాటికి ఆ పని

చేయవలసిన అవసరం మాకు తప్పేది. ఆ వ్యక్తులు ఎవరు? ఎవరైతే చట్టం తయారు చేసిన తర్వాత, దాన్ని నొక్కి పెట్టడంలోనే లాభం ఉంది అనే జ్ఞానాన్ని పొందిన వారు. ఆ కుటుంబం ఏది? ఈసారి మీరు తప్పించుకోలేరు. వేరే వారి పేరు చెప్పి తప్పించుకోవడం కుదరదు. ఈ దేశానికి మీరు జవాబు చెప్పాలి. ఈ ప్రభుత్వం నోట్ల రద్దు చేసిన ప్రభుత్వం, అవినీతి పరులకు వ్యతిరేకంగా అడుగు వేసిన ప్రభుత్వం. నేను దేశ ప్రజలకు ఈ సభ ద్వారా ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. ఎవరు ఎంత పెద్ద వ్యక్తి అయినా సరే, పేదవారి హక్కు ను మీరు తిరిగి ఇవ్వాల్సిందే. నేను ఈ దారిలో వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదు. నేను పేద వారి కోసం పోరాటం చేస్తున్నాను, వారి కోసం పోరాటం చేస్తూనే ఉంటాను. దేశంలో బోలెడంత సహజ సంపద ఉన్నా, మానవ వనరులకు కొరత లేకున్నా, మనదేశంలో ఒక వర్గం ప్రజల హక్కును దోచుకుంటూ వచ్చింది, ఇదే దేశంలో పేదరికానికి మూలం. అందుకే ఈరోజు మన దేశం ఏ విజయ శిఖరాలను అధిరోహించాలో, అక్కడికి చేరుకోలేకపోయింది.

నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను, మన ఆర్థిక వ్యవస్థ కి సమాంతరంగా మరొక వ్యవస్థ అవతరించింది అన్న విషయం మనం కాదనలేము. ఈ విషయం మీ దృష్టికి ఇంతకుముందు తీసుకురాబడింది. మీ ప్రభుత్వం, మీ కమిటీలు ఈ దిశగా సూచించాయి. ఇందిరా గాంధీ గారు ఈ దేశాన్ని పాలించే టప్పుడు యశ్వంతరావు చౌహాన్ గారు ఈ విషయాన్ని ఆవిడ దగ్గర ప్రస్తావించారు. అప్పుడు "కాంగ్రెస్ ఎన్నికల కి వెళ్ళ వద్దా" అని చెప్పారు. ఆ నిర్ణయం తప్పు కాదు ఎందుకంటే వారికి ఎన్నికల భయం ఉండేది. మాకు ఎన్నికల గురించి చింత లేదు. మా ఆలోచన దేశం గురించే. అందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నాము. "నగదు ఎంత చెక్కు వద్దు" అనే పద్ధతి ఈ వ్యవస్థలో పాతుకుపోయింది. ఈ విధమైన వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. ఈ విధానం మన జీవితంలో ఒక భాగం

అయిపోయింది. మనం ఆ విధానాన్ని గట్టి దెబ్బ కొట్టకపోతే ఆ పరిస్థితి నుంచి మనం బయటకి రాలేము. అందుకే మేము ఆ నిర్ణయాలు తీసుకున్నాము.

మీరు దేశాన్ని ఏ విధంగా పాలించారు? బహుశా చార్వాక మంత్రం మీ హృదయంలో, మదిలో నాటుకుపోయి మీకు బాగా ఉపయోగపడింది. బహుశా చార్వాక మంత్రాన్ని మీరు బాగా పాటించారు. అందుకే ఆంగ్ల కవి గురించి ప్రస్తావిస్తూ పెద్ద వ్యక్తులు చనిపోయాక ఏం చూశారు ఇప్పుడైతే చార్వాక తత్వం ఉంది, నేను ఆ సభలో కి వెళ్ళినప్పుడు దాని గురించి విస్తారంగా మాట్లాడతాను. చార్వాకుడు ఏం చెప్పాడంటే

యవజ్జీవేత్ సుఖం జీవేత్

ఋణమ్ రిత్వ ఘ్రితం పీబేత్

భస్మీ భూతస్య దేహస్య

పునార్గమనమ్ కుతః

మీరు జీవించినంతకాలం ఆనందంగా జీవించండి. దేని గురించి ఆందోళన చెందకండి. అప్పు చేయండి. ఆ రోజుల్లో సంస్కారం ఉండేది కాబట్టి నెయ్యి తాగమని చెప్పాడు. అదే భగవంత్ గారు ఉన్నట్టయితే ఇంకేదో తాగమనే వారు. కానీ ఆ కాలంలో పురుషులు చాలా సంస్కారవంతులు అందుకే నెయ్యి తాగాలి అని చెప్పారు. ఈ రోజుల్లో అయితే ఇంకేదో తాగాలి అని చెప్పేవారు. కానీ ఈ విధమైన ఆలోచన కొంతమంది వ్యక్తులు ఆర్థిక వ్యవస్థ మంచి గా ఉన్నప్పుడు ఆలోచించేవారు. ఎందుకు అలాంటి నిర్ణయాలు తీసుకున్నారు? మీకు ఏదైనా వ్యాధి ఉన్నప్పుడు డాక్టరు ఆపరేషన్ చేయాలని చెప్పినప్పుడు ఆపరేషన్ అవసరమే కానీ ముందు మీ శరీరాన్ని మీరు సరిచేసుకోవాలని చెబుతారు. డయాబెటిస్ నియంత్రించాల్సి

ఉంటుంది, బీపీ నియంత్రించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్నో సార్లు సంప్రదింపులు జరిగిన తరువాత డాక్టర్ ఆపరేషన్ చేస్తారు. రోగి ఆరోగ్యవంతుడు అవ్వకుండా డాక్టర్ ఆపరేషన్ చేయడానికి ఇష్టపడరు, రోగి ఎంత తీవ్రమైన పరిస్థితుల్లో ఉన్నా సరే. నోట్ల రద్దు విషయానికొస్తే, ఆ విధమైన చర్య తీసుకోవడానికి భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగానే ఉంది. ఒకవేళ మన ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉండి ఉంటే ఈ పనిని మేము విజయవంతంగా చేసి ఉండే వాళ్ళం కాదు.

రెండవది, ఈ నిర్ణయాన్ని అమలు చేసిన సమయం. కంగారుగా దీన్ని అమలు చేయలేదు. ఆ విధానాన్ని అర్థం చేసుకోడానికి మీరు మోడీని అధ్యయనం చేయాలి. మీరు చూసినట్లయితే దేశంలో ఏ సంవత్సరంలో ఎంత వ్యాపారం అయితే జరుగుతుందో అంతే వ్యాపారం దీపావళి పండుగ సమయంలో జరుగుతుంది. అంటే 50% దీపావళి రోజులలో వ్యాపారం జరుగుతే మిగతా 50 శాతం సంవత్సరం అంతా జరుగుతుంది. ఒక విధంగా పరిశ్రమల వ్యాపారం, వ్యవసాయం దీపావళి అప్పుడే శిఖరానికి చేరుకుంటాయి. ఆ తర్వాత కొంత స్తబ్దత దేశమంతా ఉంటుంది. దీపావళి తర్వాత కూడా వ్యాపారులు వారి ఇ వ్యాపారాలను 15 రోజుల వరకు విరామం ఇచ్చి తిరగడానికి వెళ్ళిపోతారు. ప్రజలు కూడా తిరగడానికి వెళ్ళిపోతారు. అందుకే అదే సరైన సమయం. ఎప్పుడైతే సాధారణ వ్యాపారాలు శిఖరానికి చేరుకుని ఆ తర్వాత పదిహేను ఇరవై రోజులు వ్యాపారం పెద్దగా ఉండదో అప్పుడు. ఆ తర్వాత 50 రోజులలో అంతా సర్దుకుంటుంది. అందుకే నేను ఇవన్నీ లెక్క వేసి ఆ విధంగానే నిర్ణయం తీసుకోవడం జరిగింది.

మీ అందరికీ తెలుసు ఒకప్పుడు ఆదాయపు పన్ను శాఖ ఇష్టానుసారం పనిచేసేది. కొంతమంది అధికారులు బెదిరించే వారు అలాంటి పాత చరిత్రని ఇక్కడ పునరావృతం చేయాల్సిన అవసరం లేదు. నోట్ల రద్దు తర్వాత ప్రతిదీ రికార్డులో ఉంది. ఎక్కడి నుంచి

వచ్చింది, ఎవరు తెచ్చారు, ఎక్కడ ఉంచారు? టెక్నాలజీ ఉపయోగించి డేటా మైనింగ్ ద్వారా పెద్ద పేర్లను తొలగించడం జరిగింది. ఇప్పుడు ఇన్ కం టాక్స్ కార్యాలయం ఎక్కడికి వెళ్లవల్సిన అవసరం లేదు, వారు కేవలం ఒక ఎస్ఎంఎస్ పంపించి వారి డబ్బు వివరాలు అడగవచ్చు. మీరు చూడండి, ఏ విధమైన అధికార దర్పం ఉపయోగించకుండా వారిని ముఖ్య స్రవంతిలోకి తీసుకురావడానికి ఒక అవకాశం మనకు లభించింది. కాబట్టి దీనివల్ల క్లీన్ ఇండియా సాధించడం సాధ్యం. ఏ విధంగా అయితే స్వచ్ఛభారత్ ప్రచారం జరుగుతుందో అలాగే ఆర్థిక జీవితంలో కూడా స్వచ్ఛభారత్ ప్రచారం వేగంగా ముందుకు వెళుతుంది.

బినామీ ఆస్తుల చట్టం ఆమోదించబడింది, ప్రకటించబడింది. ఖర్గే గారు చెప్పినట్టు అక్కడే అంతా ఉంది. వారు మంచి సలహా ఇచ్చారు. మేము కూడా ఏదో ఒకటి చేసి చూపిస్తాం. అందుకే ఎవరైతే ఈ మాటలు వింటున్నారో వారు అర్థం చేసుకుని చట్టంలోని నిబంధనలు ఎంత కఠినంగా ఉన్నాయో తెలుసుకోవాలి. ఎవరి వద్ద అయితే బినామీ ఆస్తులు ఉన్నాయో వారికి నేను చేసే పని ఏంటంటే - వారి చార్టర్డ్ అకౌంటెంట్ ని అడిగి ఇందులో ఉన్న నిబంధనల గురించి తెలుసుకోవాలి. అందుకే నేను ప్రతి ఒక్కరిని ముఖ్య స్రవంతిలోకి వచ్చి ఈ దేశంలోని పేదలకోసం సహకరించాలని కోరుతున్నాను. కొన్నిసార్లు ఈ నిర్ణయం హఠాత్తుగా జరిగిందని అనుకోవచ్చు. ఈ సందర్భంగా నేను ఒక ఒక సమాచారం ఇవ్వాలనుకుంటున్నాను. ఏ రోజైతే మా ప్రభుత్వం ఏర్పడిందో క్యాబినెట్ లో మొట్టమొదటి పని ఏర్పాటు చేయడం. సుప్రీం కోర్ట్ చెప్పాక కూడా చాలా కాలంగా ఈ విషయం వాయిదా పడింది. సుప్రీంకోర్టు విదేశాల నుంచి వచ్చే నల్లధనానికి సంబంధించి SIT ఏర్పాటు చేయమని కోరింది. సుప్రీం కోర్టు కోరిన విధంగానే మేము తయారు చేసాం, సుప్రీం కోర్టు 26 మార్చి 2014 న, ఏమన్నారంటే, "1947 నుంచి 65 సంవత్సరాలుగా విదేశీ బ్యాంకుల్లో దాచి పెట్టబడిన నల్లధనాన్ని భారత్ తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం తన పాత్ర

పోషించడంలో గత 65 సంవత్సరాలుగా విఫలమైంది. ఈ కోర్టు, వారు వారి బాధ్యతలు నిర్వర్తించడంలో విఫలం అయ్యారని భావిస్తోంది. అందుకే ఒక మాజీ జడ్జి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించడం జరిగింది. మూడు సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ ఆ ఆదేశాన్ని అమలు చేసే దిశగా ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదు. మీరు ఏమి చేశారు? కేవలం ఒక నివేదిక తప్ప మీరు ఏమీ చేయలేదు."

ఈ విషయాన్ని సుప్రీం కోర్టు 24 మార్చి 2014 న ఆ ప్రభుత్వానికి చెప్పింది. అందుకే చెప్పాను ఆ సమయంలో ఏమి కోల్పోయామో ఎంత కోల్పోయాము అని స్వరాలు వినిపించేవి. ఇప్పుడు ఎంత వచ్చింది, వస్తూనే ఉంటుంది అని స్వరం వినిపిస్తుంది. మీరు చూడండి ఒక దాని తర్వాత ఒకటిగా విదేశాలలో నిల్వచేసిన నల్ల ధనానికి వ్యతిరేకంగా కఠినమైన చట్టాలు తయారు చేయబడ్డాయి, ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే విషయం కూడా చెప్పబడింది. ఈసారి బడ్జెట్లో ఒక కొత్త చట్టం ప్రస్తావించబడింది, శిక్ష కూడా ఏడు సంవత్సరాల నుంచి పది సంవత్సరాలకి పెంచబడింది. మారిషస్, సింగపూర్ లాంటి టాక్స్ హవెన్ లకు పాత నిబంధనలు గుర్తు చేశారు. ఆ దేశాలతో మేము చర్చలు జరిపాము. మన పరిస్థితుల గురించి వివరించాము. మేము స్విజర్లాండ్ తో కూడా ఒప్పందం కుదుర్చుకున్నాము. వారు రియల్ టైం సమాచారాన్ని మనకి ఇవ్వబోతున్నారు. ఎవరైనా భారతీయ పౌరులు వారి బ్యాంకుల్లో డబ్బు జమ చేస్తే దాని గురించి మనకి తెలుస్తుంది. అమెరికాతో సహా ఎన్నో దేశాలతో ఈ విధమైన ఒప్పందాలు మనం చేశాం. ఎక్కడైనా భారత పౌరుడు లేదా భారత మూలాలు ఉన్న వ్యక్తి డబ్బులు జమ చేశాడో అలాంటి వ్యక్తి సమాచారం మన దేశానికి లభిస్తుంది. ఆ విధంగానే ఆస్తి అమ్మకం కూడా. ఒక నిబంధన తీసుకు వచ్చాము, 20 వేల కంటే ఎక్కువ నగదు ఇవ్వడానికి లేదు. అలాగే రియల్ ఎస్టేట్ బిల్లును కూడా ఆమోదించాము. ఆభరణాల మార్కెట్లో కూడా 1% ఎక్సైజ్ ని విధిస్తున్నారు. ఆ విధంగా అన్నిటిని క్రమబద్ధీకరిస్తున్నాము.

ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది లేదు. మేము ఆభరణాలు కొనేటప్పుడు రెండు లక్షల కంటే ఎక్కువ ఎవరైతే కొనుగోలు చేస్తారో, వారి నుంచి పాన్ నెంబర్ తీసుకోవాల్సిందిగా నిబంధన తీసుకు వచ్చినప్పుడు, నాకు కొన్ని ఉత్తరాలు వచ్చాయి. ఎవరైతే నల్లధనం, అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడారో, వారే అలాంటి ఉత్తరాలు రాసి పాన్ నెంబర్ అడిగే నియమాన్ని రద్దుచేసి ప్రజలు నగదుతో బంగారం, ఆభరణాలు కొనేలా చేసి, నల్లబజారు నడిచేలా కోరారు. మేము మా నిర్ణయానికి కట్టుబడి ఒక్కొక్క అడుగు వేస్తూ ఉన్నాము. నాకు తెలుసు రాజకీయ లబ్ధి కోసం అలాంటి పనులు చేయలేము. లేకపోయి ఉంటే ఇంతకుముందే వారు ఈ పని చేసి ఉండేవారు. ఇది కష్టం కానీ నీ దేశానికి మేలు చేయాలంటే నిర్ణయాలు తీసుకోవాలి, పేదలకు మేలు చేయాలి కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నాము. రెండు లక్షలకు పైగా వస్తువులకు, 10 లక్షల విలువైన కారుపై ఒక శాతం పన్ను విధించాము. మేము ఆదాయపు పన్ను ప్రకటించే పథకాన్ని తీసుకు వచ్చాము, ఆ పథకం కింద చాలా మంది వ్యక్తులు వారి ఆదాయాన్ని ప్రకటించారు. పదకొండు వందల కంటే ఎక్కువ పాత చట్టాలని మేము రద్దు చేసాము. నోట్ల రద్దు కు సంబంధించి కొంతమంది 150 సార్లు అని కొంతమంది 130 సార్లు నిబంధనలు మార్చాము, అని చెప్పారు. వారు చాలా బాగా గుర్తుంచుకున్నారు.

ఇది ఎలాంటి పని అంటే ప్రజల కష్టం అర్థం అయిన వెంటనే దానికి పరిష్కారం వెతికే దిశగా పని చేశాము. మరో విషయం ఏమిటంటే ఎవరికైతే సంవత్సరాలుగా దోచుకునే అలవాటు ఉందో వారు వేరే దారులు వెతికేవారు. అందుకే అలాంటి దారులు మూసివేయడానికి మేము ఏదో ఒకటి చేయాల్సి వచ్చింది. ఇది ఒక పోరాట కాలం. ఒకవైపు దేశాన్ని దోచుకునేవారు ఇంకోవైపు దేశాన్ని నిజాయితీ వైపు తీసుకువెళ్లే ప్రయత్నం. ప్రతి నిముషం యుద్ధం జరిగేది కానీ ఇది వారికి ప్రియమైన కార్యక్రమం. ఈ విధమైన పని చేస్తూ కూడా వారు ఒకరినొకరు వెన్నుతట్టుకుంటున్నారు. దానికోసం నీకు హక్కు లేదు ఎందుకంటే

మన దేశంలో రాచరికం ఉన్నప్పుడు కూడా పేదల సహాయం కోసం కొన్ని పథకాలు వుండేవి. ఆ తర్వాత కూడా మన దేశంలో పనికి ఆహార పథకం ఉండేది. మన దేశం స్వాతంత్ర్యం పొందాక వేరు వేరు పేర్లతో తొమ్మిది పథకాలు ఉండేవి. ఆ పథకాలు కాలక్రమంగా MGNREGA గా రూపొందాయి. నేను ఎన్నో చోట్ల తిరిగాను ఎక్కడైతే కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్నాయో వారు పశ్చిమబెంగాల్లో అమలు చేశారు. అలాగే శరద్ పవర్ గారి ప్రభుత్వం మహారాష్ట్రలో అమలు చేసింది. గుజరాత్ లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. దేశంలో స్వాతంత్ర్యం అనంతరం ఏదో ఒక పేరుతో ఈ పథకాలను అమలు చేశారు, అందరూ చేశారు కాబట్టి ఇది కొత్త కార్యక్రమం కాదు, కానీ పేరు కొత్తగా పెట్టారు. కానీ ఒక విషయం తెలుసుకుని మీరు ఆశ్చర్యపోతారు. ప్రశాంతంగా ఎన్నో సంవత్సరాలుగా అమలు చేయబడుతున్న MGNREGA పథకంలో కూడా 1035 సార్లు మార్పులు చేయబడ్డాయి. 1035 సార్లు నియమాలను మార్చారు. మీరు ఎప్పుడూ అద్దంలో చూసి తెలుసుకోరు. ఎందుకంటే అందులో యుద్ధం లేదు. ఆ పథకంలో ఒత్తిడిలో పని చేయాల్సిన అవసరం లేదు. MGNREGA ఏదైతే, చాలా సంవత్సరాలుగా అమలు చేయబడుతుందో, అందులో కూడా మీకు 1035 సార్లు మార్పులు చేయాల్సి వచ్చింది. ఆ చట్టం ఒకసారి చెయ్యబడింది, 1035 సార్లు మార్చబడలేదు.

అందుకే ఈ సందర్భంగా నేను కాకా హత్రాసి కవితను మీకు వినిపిస్తాను. కాకా హత్రాసి గుర్తు చేసుకోవడాన్ని, ఉత్తరప్రదేశ్ ఎన్నికలతో ముడి పెట్టొద్దు. ఎందుకంటే ప్రతి ఎన్నికలలో కాకా హత్రాసి గురించి నేను మాట్లాడుతాను. వారు ఏం చెప్పారంటే

మనసులో వెతకండి, దాగివున్నాయి లోపాలు.

మీకు దొరుకుతుంది కచ్చితమైన రిపోర్ట్.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, ఇంకో విషయం వైపు కూడా అందరి దృష్టి మళ్లించాలి అనుకుంటున్నాను. ప్రభుత్వం నియమాలను పాటిస్తుంది, రాజ్యాంగ బాధ్యతలతో పనిచేస్తుంది. మీకు వర్తించే నియమాలే, మాకూ వర్తిస్తాయి.

కేవలం పని సంస్కృతి లో తేడా ఉంటుంది. విధానాల శక్తి మన ఉద్దేశాలతో ముడిపడి ఉంటుంది. ఉద్దేశాలలో లోపం ఉంటే విధానాల బలం తగ్గిపోతుంది. అది పాతాళం లోకి వెళ్లి పోతుంది. అందుకే మన దేశంలో కార్య సంస్కృతిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

నేను ఎప్పుడు ఏది మాట్లాడినా మా సమయంలో కూడా ఇది ఉంది అది ఉంది అని వినబడుతూ ఉంటాయి. అందుకే నేను కూడా వారిలానే ఆడతాను, స్వారీ మైదానంలో ఆడడం నాకు ఇష్టం. మరి ఇలా ఎందుకు జరిగింది? మీకు దానికి సంబంధించిన జ్ఞానం లేదని నేను అనుకోను. మీకు జ్ఞానోదయం నిన్ననే అయింది అని కూడా అనుకోలేదు. మీకు సమాచారం ఉంది. మహాభారతంలో ఇలా చెప్పబడింది.

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః

జానామి అధర్మం న చ మే నివృత్తిః

ధర్మం ఏంటో మీకు తెలుసు, కానీ అది మీ ప్రవృత్తి కాదు. అధర్మం ఏంటో కూడా మీకు తెలుసు. కానీ దాన్ని వదిలే సామర్థ్యం మీకు లేదు. ఇప్పుడు నేను నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ గురించి మాట్లాడితే అటువైపునుంచి ఒక మాట వినబడుతుంది ఆ పని మేము మొదలు పెట్టామని. నేను ఈ మాట మీరు మొదలెట్టినప్పటి నుంచే మాట్లాడుతాను. నేషనల్ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ 2011 నుంచి 2014 వరకు మూడు సంవత్సరాలలో కేవలం 59 గ్రామాలలో ఏర్పాటు చేయబడింది. అందులో last mile కనెక్టివిటీ లేదు. అలాగే సేకరణ కూడా పూర్తిగా కేంద్రీకృతమై లేదు. దానికి కారణం ఏమిటో అందరికీ తెలుసు. ఇప్పుడు మీరు

చూసినట్లయితే మేము కార్య సంస్కృతిని మార్చి మా విధానాన్ని మార్చాం. అన్నిటికంటే ముఖ్యంగా రాష్ట్రాలను కలుపుకుని వెళ్ళాము. లాస్ట్ మైల్ కనెక్టివిటి అంటే స్కూల్లో ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ లభించాలి, ఆసుపత్రులలో లభించాలి, పంచాయతీలో కూడా ఉండాలి. ఈ విధంగా ప్రాముఖ్యతను నిర్ణయించాం. సేకరణ అంటే ఏమిటి? భారత ప్రభుత్వం చేతిలో ఉంచుకుని మేము దానిని కేంద్రీకరించాము. దాని వల్ల ఫలితం ఏమిటంటే ఇంత తక్కువ సమయంలో ఇప్పటివరకు 76000 గ్రామాలలో లాస్ట్ మైల్ కనెక్టివిటీ తో సహా ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ ని ఏర్పాటు చేశాం.

మీరు నిన్న నగదు రహిత సమాజం లేదా తక్కువ నగదు ఉన్న సమాజం గురించి చెప్పారు. ప్రజల వద్ద ఏమి ఉంది? మొబైల్ ఫోన్. ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే, 2007 ఎన్నికల సమావేశాల నుండి మీ నాయకులు ప్రతి గ్రామానికి వెళ్లి రాజీవ్ గాంధీ కంప్యూటర్ విప్లవాన్ని తెచ్చారని రాజీవ్ గాంధీ మొబైల్ ఫోన్ తెచ్చారని రాజీవ్ గాంధీ ప్రతి గ్రామానికి కనెక్టివిటీ తీసుకు వచ్చారని చెప్తున్నారు. ఇవన్నీ మీరు మాట్లాడిన మాటలే కానీ నేను మొబైల్ ఫోన్ ని బ్యాంక్ అవసరాలకి ఉపయోగించమని చెబుతున్నప్పుడు మీరు మొబైల్ ఫోన్లు ఎక్కడ ఉన్నాయి అని అంటున్నారు? నాకు అర్థం కానిది ఏమిటంటే మీరు ఈ పనులన్నీ చేశామని చెబుతున్నారు. నేను ఆ పనులకు కొంత మంచి జోడిస్తున్నప్పుడు, అసలు ఆ పనులే జరగలేదని అంటున్నారు. అలాంటప్పుడు మీరు నాకు ఏమి వివరిస్తున్నారు? దేశంలో అందరి దగ్గర అన్నీ లేవని మనందరికీ తెలుసు. కానీ 40 శాతం మంది దగ్గర అవి ఉండే ఉంటాయి. అలాంటప్పుడు ఆ 40 శాతం మందిని ఆధునిక వ్యవస్థతో జోడించే ప్రక్రియలు మేము చేస్తున్న ప్రయత్నానికి మీరు తోడవ్వాలి కదా? 60 శాతం మందిని మనం తర్వాత చూడొచ్చు. ఎక్కడో ఓ చోట మనం మొదలు పెట్టాలి కదా! ఆ విధంగా మనం డిజిటల్ కరెన్సీని తక్కువగా చూడకూడదు. ఈరోజు మన దగ్గర ఉన్న ఏటీఎం ని

కాపాడుకోవడానికి, డబ్బుని ఒక చోటి నుంచి మరో చోటికి తీసుకువెళ్లడానికి దాదాపు 5గురు పోలీసుల అవసరం ఉంది. పాలు కూరగాయలు రవాణా కి ఎంత ఖర్చు అవుతుందో అంతకంటే ఎక్కువ ఖర్చు అవుతుంది. ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోగలిగితే, ఈ దిశగా ఏమైనా చేయగలిగితే, లేదా ఎవరైనా ఆ పనులు చేస్తుంటే వారిని ప్రోత్సహించడం నాయకుడి పని, ఏ పార్టీ అయినా చేయొచ్చు, కానీ దీనివల్ల ప్రజలకి మేలు జరుగుతుంది. ఇప్పుడే నాకు ఎవరో చెప్పారు ఒక కూరగాయలు అమ్మే వ్యక్తి ఈ పని మొదలు పెట్టారు అని. ఆ వ్యక్తిని మీకు కలిగిన లాభం ఏమిటి అని అడిగిన్నప్పుడు అతను నావద్ద ఇంతకుముందు శాశ్వత వినియోగదారులు ఉండేవారు. అందరిని నేను ఎరుగుదును. ఉదాహరణకి వారు యాభై రెండు రూపాయల కూరగాయలు కొన్నారు, అప్పుడు ఆ మేడంగారు చిల్లర లేదు 50 రూపాయలు తీసేసుకో అని అన్నప్పుడు నాకు రెండు రూపాయలు నష్టం వచ్చేది. ఇప్పుడు ఆ విధంగా చెప్పలేరు. అలాంటి లెక్క ఒక సంవత్సరంలో ఎనిమిది వందల నుంచి వెయ్యి రూపాయలు వరకు అయ్యేది. ఆ తర్వాత భీమ్ యాప్ ద్వారా52 రూపాయలకి యాభై రెండు రూపాయలు, 53 రూపాయలు కి 53 రూపాయలు లభిస్తున్నాయి. 48 రూపాయల 45 పైసలు లెక్క అయితే అది కూడా లభిస్తుంది. దాని అర్థం సంవత్సరానికి నాకు 800 నుంచి వెయ్యి రూపాయల వరకు జరిగే నష్టం ఆగిపోయింది.

చూడండి,ఏ విధంగా పరిస్థితులు మారుతాయో! మీరు మోదీని వ్యతిరేకించండి విమర్శించండి. మీరు ఆ పని చెయ్యాలి కూడా.కానీ ఏవైతే మంచి పనులు జరుగుతున్నాయో వాటిని మీరు ప్రోత్సహించండి. కొన్ని గ్రామాలలో ఇవి అమలు చేయడం సాధ్యం కాకపోవచ్చు, కానీ నగరాలలో వాటికి మద్దతు తెలపండి. దేశానికి వాటి వల్ల మేలు జరుగుతుంది.ఇందులో వ్యక్తిగత లాభం లేదు అందుకే నేను ఇలాంటి విషయాలలో మీరు అందరూ కూడా మద్దతు తెలపాలని కోరుతున్నాను.

పని, సంస్కృతి ఎలా మారుతుంది? ఈ రోడ్లు నిర్మించే పనులు మేము వచ్చాక మొదలయ్యాయా? ఇవన్నీ కూడా తోడర్మల్ కాలం నుంచి జరుగుతున్నాయి, షేర్ షా సూరి కాలంనుంచి కూడా ఈ పనులు జరుగుతున్నాయి. కాబట్టి ఇవి మా కాలంలో ఉండేవి అని చెప్పుకుంటూ పోకూడదు. మీరు ఇంకా ఏమి మాట్లాడగలరు? గత ప్రభుత్వంలో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద ప్రతిరోజూ 69 కిలోమీటర్ల పని జరిగేది. మేము అధికారంలోకి వచ్చాక 111 కిలోమీటర్లు పని జరుగుతుంది. ఇదీ వ్యత్యాసం. మేము రోడ్ల నిర్మాణంలో అంతరిక్ష విజ్ఞానాన్ని ఉపయోగించాం. ఉపగ్రహాల ద్వారా చిత్రాలు తీసి పనిని పర్యవేక్షించడం జరిగేది. అలాగే రైల్వేలలో కూడా డ్రోన్లను ఉపయోగించాము. అక్కడ కూడా ఫోటోలు తీసి పని ఎలా జరుగుతుందో చూసేవాళ్ళం. కార్య సంస్కృతిని విజ్ఞాన సహాయంతో మార్పు చేయవచ్చు.

ఆవాస్ యోజన, గ్రామీణ ఆవాస్ యోజన లాంటి పథకాలు రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించబడ్డాయి. అయినా, మీ పదవీ కాలంలో ఒక సంవత్సరంలో పది లక్షల 73 వేల ఇల్లు కట్టారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క సంవత్సరంలో 22 లక్షల 27వేల ఇళ్లు నిర్మించారు. జాతీయ పట్టణ పునరుద్ధరణ మిషన్ కింద ఒక్క నెలలో 8017 ఇళ్లు నిర్మించారు. మా ప్రణాళిక ప్రకారం 13 వేల ఐదు వందల ముప్పై ఇళ్లు నిర్మించాము.

రైల్వేలో బ్రాడ్ గేజ్ పనులు ఒక సంవత్సరంలో 1500 కిలోమీటర్లు జరిగేది. గత సంవత్సరం ఇది మూడువేల కిలోమీటర్లకు పెరిగింది. దాన్ని 3500 కిలోమీటర్ల వరకు తీసుకు వెళ్తాము, ఈ ఫలితాలు హఠాత్తుగా జరగలేదు. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రతి విషయాన్ని పర్యవేక్షిస్తూ అదే సిబ్బంది, అవే చట్టాలు, అవే ఫైళ్లు, అదే వాతావరణం. అయినా మేము వేగంగా మార్పు తీసుకొచ్చి ముందుకు వెళ్తున్నాము. ఇది అకస్మాత్తుగా జరగలేదు. దీని కోసం పురుషార్థం

చేయాలి, అందుకే మన శాస్త్రాలలో ఈ విధంగా చెప్పబడింది.

ఉద్యమేన హి సిధ్యంతి కార్యాణి న మనోరథైః

న హి సుప్తస్య సింహస్య ప్రవిశంతి ముఖే మ్రిగాః

ఒక పరిశ్రమ తోనే పని జరుగుతుంది, మనోరథం తో కాదు.అలాగే నిద్రపోయే సింహం నోటి లోకి జింక రాదు. దానికి వేటాడాలి.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, కొన్ని ప్రాథమిక మార్పులు ఎలా వస్తాయో మాకు తెలుసు. రాష్ట్రాలలోని విద్యుత్ బోర్డు, డిస్కాంలు సంక్షోభంలో ఉన్నాయి. అందుకే ఎర్రకోట పై ప్రధానమంత్రి ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. అంతగా పరిస్థితులు క్షీణించాయి. గత రెండు సంవత్సరాలలో విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం పెరిగింది. దానిని సాంప్రదాయ శక్తితో జోడించారు. ప్రసార మార్గాలని పెంచారు. సౌర శక్తిని కూడా తీసుకు వచ్చాము. 2014లో ఇది రెండువేల ఏడువందల మెగావాట్లుగా ఉండేది. ఈరోజు దీని సామర్థ్యం తొమ్మిది వేల ఒక వంద మెగావాట్లకు పెంచాము. అన్నిటికంటే ముఖ్య విషయం డిస్కాం పథకం వలన ఉదయ్ పథకం ద్వారా రాష్ట్ర ఖజానాలో ఒక లక్ష 60 వేల కోట్ల రూపాయలు మిగులుతాయి. రాష్ట్రాలతో కలిసి భారత ప్రభుత్వం ఒక లక్ష 60 వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించి ఉంటే నాలుగు వైపుల నుండి మోడీ ప్రభుత్వం ఇంత డబ్బు ఇచ్చింది అని ప్రశంసించేవారు. కానీ మేము పథకాల రూపకల్పన ఈ విధంగా చేసి ఒక లక్ష 60 వేల కోట్ల రూపాయలు రాష్ట్రాలకి డిస్కాం ల ద్వారా, ఉదయ్ యోజన ద్వారా మిగిలేలా చేస్తున్నాము. ఈ నిధులు ఆ రాష్ట్రాల అభివృద్ధిలో ఉపయోగపడుతూ, విద్యుత్ శక్తి వ్యయ భారం నుంచి బయట పడేలా చేస్తాయి.

బొగ్గు ఎక్కడి నుంచి వస్తుందో మీకు తెలుసు, కానీ దానికి దగ్గరగా ఉండే పరిశ్రమలకి ఆ బొగ్గు ని ఇవ్వరు. దూరదూరంగా వాటిని రవాణా చేస్తారు. అడిగితే రైల్వే కి ఆదాయం పెరగాలి కదా అని అంటారు. మేము హేతుబద్ధం చేశాము. బొగ్గు ఏ ప్రాంతాలలో అయితే లభిస్తుందో అక్కడికి దగ్గరలో ఉన్న పరిశ్రమలకు వాటిని రవాణా చేసి వాడడం జరుగుతుంది. అలా చేయడం వల్ల బొగ్గు రవాణా లో దాదాపు 13 వందల కోట్ల రూపాయలు పొదుపు చేశాము.

ఎల్ఈడీ బల్బుల విషయానికి వస్తే అవి మేము తెచ్చామని మాత్రం చెప్పడం లేదు. శాస్త్రీయ పరిశోధనలు జరిగాయి, మీరు వాటిని ప్రారంభించారు. కానీ ఆ సమయంలో ఎల్ఇడి బల్బులు దాదాపు 300 నుంచి 380 రూపాయల వరకూ ఉండేది. ఎల్ఈడీ బల్బులు వల్ల విద్యుత్ శక్తి ఆదా అవుతుంది కాబట్టి మేము ఆ పనిని ఒక ఉద్యమంలా చేసాము. 8, 9 నెలల్లో ఈ పథకాన్ని బలోపేతం చేశాము. ఇంత తక్కువ సమయంలో ఇరవై ఒక్క కోట్ల ఎల్ఈడీ బల్బులు ఉపయోగించడంలో విజయం సాధించాము, వేగంగా ముందుకు వెళ్తున్నాం. కాబట్టి ఇప్పటి వరకు పెట్టిన ఎల్ఈడీ బల్బుల వల్ల ఎన్నో కుటుంబాలకు కరెంట్ బిల్లు తగ్గింది. ఆ కుటుంబాలకు దాదాపు 11 వేల కోట్ల రూపాయలు మిగిలాయి. ఏ ప్రభుత్వమైనా బడ్జెట్లో వినియోగదారుల కోసం 11 వేల కోట్ల రూపాయలు కేటాయించి ఉండి ఉంటే వార్తాపత్రికలలో ముఖ్య వార్తగా ప్రచురించబడేది. మేము కేవలం ఎల్ఈడీ బల్బుల వాడకం వల్ల 11 వేల కోట్ల రూపాయలు సామాన్య ప్రజలకు ఆదా చేశాం. కార్య సంస్కృతి వేరు వేరుగా ఉంటుంది. అలా ఉండడం వల్ల ఏ విధమైన మార్పులు వస్తాయో దానికి ఇదే ఉదాహరణ.

మన ప్రతిపక్ష నేత షెడ్యూల్ కులాల బడ్జెట్ గురించి ప్రసంగించారు. కానీ ఎంతో తెలివిగా 2013-14 కి సంబంధించిన వివరాలు ఇక్కడ ప్రస్తావించలేదు. 2013-14 సంవత్సరం ప్రస్తావన

వచ్చినప్పుడు వారు ఇబ్బంది పడేవారు. షెడ్యూల్ కులాల కోసం సబ్ ప్లాన్ కింద 2012 -13 లో 37,113 కోట్లు, 2013 -14 లో 41,561 కోట్లు,2016 -17 లో 30,833 కోట్లు, 2016 -17 లో 40,920 కోట్లు. 33.7% పెరుగుదలతో ఈ సంవత్సరం బడ్జెట్లో ఆ నిధులు 52,393 కోట్లకి పెంచడం జరిగింది. అందుకే సత్యాన్ని వినే ధైర్యం ఉండాలి. మేము పనుల గురించి మాట్లాడతాం. ఈ ప్రభుత్వం అవినీతికి వ్యతిరేకంగా యుద్ధం చేసే ప్రభుత్వం. అవినీతికి వ్యతిరేకంగా పని చేస్తున్నప్పుడు ఏ విధమైన పనులు చేయాలి?

17 మంత్రిత్వ శాఖలలో 84 పథకాలలో మేము ఆధార్ ద్వారా ప్రత్యక్ష ప్రయోజన బదిలీ పథకాన్ని జోడించి, 32 కోట్ల లబ్ధిదారులకు ఒక లక్షా 86 వేల కోట్ల రూపాయల ప్రత్యక్ష ప్రయోజన బదిలీ కల్పించాం. దీని వల్ల జరిగిన ప్రయోజనం ఏమిటంటే ప్రతి వీధిలో దోచుకునే వ్యవస్థ ఉండేది. నాకు తెలుసు ఇంత సూక్ష్మంగా దోపిడీని ఆపు చేస్తే నా వైపు తుఫాన్ వస్తుందని. నేను గోవా వెళ్ళినప్పుడు ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటాను అని చెప్పాను. నాకు ఏమి జరుగుతుందో నాకు తెలుసు. అందుకే నేను మళ్లీ చెప్తున్నాను, పెద్ద పెద్ద వ్యక్తులకి కష్టంగా ఉంది, ఆ కష్టాలు ఇంకా పెరగబోతున్నాయి. ఆ కారణం చేతనే నాకు తెలుసు నాపై ఎలాంటి కుట్రలు జరుగుతాయో. దానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఎందుకంటే దేశం కోసం నేను ఈ పని చేస్తున్నాను.

అందుకే నేను ఆ దిశగా అడుగులు వేస్తున్నాను. పహల్ పథకం కింద గ్యాస్ సిలిండర్లు పంపిణీ జరిగేవి. అందులో సబ్సిడీ లభించేది. ఎప్పుడైతే ఆ పథకాన్ని ఆధార్ తో అనుసంధానించామో, అందులో దాదాపు 26 వేల కోట్ల రూపాయలు ఏవైతే దారి మళ్లేవో వాటిని ఆదా చేయడం జరిగింది. అలా చేయడం వల్ల దాదాపు కోటిన్నర పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడంలో మేము సఫలీకృతులయ్యాము. మీరు ఆ విషయాన్ని అధ్యయనం చేయవచ్చు. నేను సభలో మాట్లాడుతున్నప్పుడు బాధ్యత తో మాట్లాడతాను. గత రెండున్నర

సంవత్సరాలలో,నకిలీ రేషన్ కార్డు దారులు, పేద వారి హక్కులను హరించే వారు. పేద వారికి లభించవలసినవి ఈ నకిలీ రేషన్ కార్డు వారు దోచుకుని దొంగ మార్కెట్లో అమ్ముకునే వారు. మేము టెక్నాలజీని ఉపయోగించి, ఆధార్ తో అనుసంధానించి, దాదాపు మూడు కోట్ల 95 లక్షల నకిలీ రేషన్ కార్డులను పట్టుకున్నాము. అలా చేయడం వల్ల 14 వేల కోట్ల రూపాయలు ఏవైతే మధ్యవర్తులు దోచుకునేవారో, అది ప్రధాన స్రవంతిలోకి వచ్చి పేదల వైపు మళ్ళింది.

MGNREGA చెల్లింపులు ఆధార్ తో జోడించడం ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం దాదాపు 94 శాతం విజయవంతం అయ్యింది. అలా చేయడం వల్ల 7,633 కోట్ల రూపాయల లీకేజీని ఆపగలిగాము. ఇలా ఒక్క సంవత్సరమే కాదు ప్రతి సంవత్సరం ఆదా చేయబడుతుంది. అలాగే నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రాం,(NSAP) పథకం కింద దాదాపు నాలుగు వందల కోట్ల రూపాయలు ఖర్చు అయ్యాయి. కానీ ఆ పథకం లబ్ధిదారులు దొరకలేదు. నిధులు అయితే వెళ్ళాయి కానీ మాకు తెలిసిందేమిటంటే ఎవరైతే జన్మించలేదో ఆ ఆడపిల్ల విధవరాలు కూడా అయిపోయింది. ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బు తీసుకుంది. ఇవన్నీ ఆపడానికి మేము కార్య సంస్కృతి లో మార్పు తీసుకు వచ్చాము. స్కాలర్షిప్ లాంటివి ఇంకా చాలానే ఉన్నాయి. ఒక సంవత్సరం లో ప్రతి సంవత్సరం దాదాపు నలభై తొమ్మిది వేల 500 కోట్ల రూపాయలు మధ్యవర్తుల దగ్గరికి వెళ్లేవి. మీరు ఊహించవచ్చు దాదాపు 50 వేల కోట్ల రూపాయలు పేదవారి హక్కు వాటిని మధ్యవర్తులుఅవినీతి పేరుమీద, దోపిడి పేరుమీద దోచుకునేవారు. వారిని ఆపే పని మేము ఎంతో ధైర్యంగా చేసి చూపిస్తున్నాం.

గౌరవనీయులైన మేడం స్పీకర్, నేను కార్య సంస్కృతికి సంబంధించి మరో ఉదాహరణ చెప్పాలనుకుంటున్నాను. రైతుల గురించి చాలా పెద్ద మాటలు మాట్లాడుతారు. ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వానికి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు యూరియా గురించి లేఖలు రాసే వారు. నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, ఈ విధంగా వ్రాసేవాడిని, యూరియా లభించడం

లో కొన్ని సమస్యలు ఉండేవి. గత రెండు సంవత్సరాలుగా ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి యూరియా కోసం ప్రభుత్వానికి లేఖ రాయాల్సిన అవసరం కలగలేదని నేను సంతోషంగా చెప్పగలను. ఎక్కడా యూరియా కోసం క్యూలో నిలబడాల్సిన అవసరం లేదు. ఎక్కడా యూరియా కోసం లాఠీచార్జి జరగలేదు. కానీ పాత వార్తాపత్రికలు తిరగేసి చూస్తే రైతులకు యూరియా లభించడం లో ఎన్ని సమస్యలు ఉండేవో అర్థమవుతుంది. ఇప్పుడు వేప పూత గురించి చెప్పండి. దీనికి సంబంధించిన జ్ఞానం మాకే ఉందా మీకు కూడా దీని గురించి తెలుసు కదా మీరు 5 అక్టోబర్ 2007న యూరియా పై వేపపూత గురించి మీ మంత్రుల బృందంతో చర్చించారు, ఆ తర్వాత సైద్ధాంతికంగా ఆమోదించారు. ఆ తరువాత ఆరు సంవత్సరాలు మీరు ఏం చేశారు? పైగా 35శాతం మీరు పరిమితి విధించారు. 100% వేపపూత ఎందుకు అనుమతించలేదు? ఎందుకంటే ఆ యూరియా పరిశ్రమలకి దొంగతనంగా తరలించబడేది. రైతుల పేరుమీద సబ్సిడీ తీసుకునేవారు. కానీ రైతులకు ఏ విధమైన లాభం లభించేది కాదు. యూరియా ని మరో రకంగా దుర్వినియోగం చేసే పని, సింథటిక్ పాలను తయారు చేయడం. దాని వల్ల పేద పిల్లల జీవితాలతో ఆడుకునే వారు. యూరియా పై 100% వేపపూత చేయాలని మీరు నిర్ణయించారు. కానీ ఆరు సంవత్సరాలలో కేవలం 20 శాతం నుంచి 35 శాతం పరిమితి పెట్టారు. ఆ తర్వాత కూడా మీరు 35 శాతం కూడా చేయలేకపోయారు. కేవలం 20 శాతమే చేయగలిగారు. మేము అధికారంలోకి వచ్చాక ఈ సమస్య వైపు దృష్టి సారించాము. మీరు ఆరు సంవత్సరాలు తీసుకుంటే మేము ఆరునెలల్లోనే 100% చేసాము. దిగుమతి చేసుకున్న యూరియా పై కూడా 100% వేపపూత చేసాము. అలా చేయడం వల్ల మేము చేయించిన సర్వే ప్రకారం మీ కార్య సంస్కృతి, మా కార్య సంస్కృతిలో తేడా కనిపించింది. వేప పూత గురించి మాట్లాడినప్పుడు మీరు నిల్చుని ఇది మా సమయంలో జరిగింది అని చెప్తారు. నేను అందుకే మీ మైదానంలో ఈ ఆట ఆడుతున్నాను. వేప పూత గురించి అధ్యయనం

చేయించాం. అగ్రికల్చర్ డెవలప్మెంట్ అండ్ రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ సెంటర్(వ్యవసాయ అభివృద్ధి, గ్రామీణ పరివర్తన కేంద్రం) వారు విశ్లేషణ చేసి ఒక నివేదిక ఇచ్చారు. రైతులకు ఎంత మేలు జరుగుతుందో చూడండి. ధాన్యం ఉత్పాదనలో ఐదు శాతం పెరిగింది. చెరుకు దిగుబడిలో 15 శాతం పెరిగింది. మీరు ఊహించవచ్చు దీనివల్ల రైతులకు ఎంత డబ్బు ఆదా అవుతుందో.

గౌరవనీయులైన రాష్ట్రపతి గారు లోక్ సభ, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపే దిశగా మనం ఆలోచించాల్సిన సమయం వచ్చిందని వారు పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని రాజకీయ కోణంలో చూడకూడదు. ప్రతి ఒక్కరూ ఎంతో కొంత రాజకీయంగా నష్టపోతారు, కానీ ఈ విషయాన్ని గంభీరంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. ప్రతి సంవత్సరం ఐదు నుంచి ఏడు రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్నాయి. దాదాపు ఒక కోటి మంది ప్రభుత్వ సిబ్బంది ఆ పనులు చేస్తూ ఉంటారు. అందరికంటే ఎక్కువగా పాఠశాలలో చదువులు చెప్పే అధ్యాపకులు ఈ పనులు చూసుకోవలసి ఉంటుంది. అలా చేయడం వల్ల భవిష్యత్తు తరాలు నష్టపోతున్నాయి. తరచుగా ఎన్నికలు జరగడం వల్ల జరుగుతున్న ఖర్చులు కూడా పెరుగుతూనే వున్నాయి.

అందుకే 2009లో జరిగిన లోక్ సభ ఎన్నికలకు 1,100 కోట్ల రూపాయలు ఖర్చు అయితే 2014లో లోక్ సభ ఎన్నికలకు నాలుగు వేల కోట్ల రూపాయల కంటే ఎక్కువ ఖర్చు అయ్యింది. మీరు ఊహించొచ్చు మన లాంటి పేదదేశంలో ఇలాంటి ఖర్చు చాలా భారంగా ఉంటుంది. ఈరోజు చట్టం దృష్టికోణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాల లో కూడా భద్రతా దళాలు సహాయం చేస్తుంటాయి. అలాగే ప్రపంచ వ్యాప్తమైన ఉగ్రవాదం, శత్రు దేశాలు చేసే చర్యలను మన భద్రతా దళాలు వారి శక్తి మేరకు ఎదుర్కుంటూ ఉంటాయి. కాబట్టి వారి పని ఎక్కువ విస్తారమైన ది కానీ మరోవైపు భద్రతా దళాలను ఎన్నికల నిర్వహణ

కోసం ఉపయోగిస్తున్నాం. వారిని ఎన్నికల ప్రక్రియకి మోహరిస్తున్నాం. ఈ కష్టాలను మనం అర్థం చేసుకుందాం.దీర్ఘ దృష్టి తో ఒక పార్టీ నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోలేదు. కానీ అనుభవం, బాధ్యత గల వ్యక్తుల తో కలిసి ఈ సమస్యకి పరిష్కారం వెతకాలి. రాష్ట్రపతి గారు ఈ చర్చని మనముందుకు తీసుకు వచ్చారు కాబట్టి దీనిని మనం ముందుకు తీసుకువెళ్లాలి. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఆ దిశగా మనం కృషి చేయాలి.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, మన దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయకుండా దేశ ఆర్థిక వ్యవస్థను మనం ముందుకు తీసుకు వెళ్ళలేము. రాష్ట్రపతి గారి ప్రసంగం లో దళితులు, బాధితులు, వంచితులు, యువకులు, కూలీల గురించి ప్రస్తావించడం పట్ల కూడా ప్రతిపక్ష నేతకు ఇబ్బందిగా ఉంది. ఈ దేశంలోని దళితులు బాధితులు వంచితులు యువకులు, కూలీలకు రాష్ట్రపతి గారి ప్రసంగంలో స్థానం లభించ కూడదా? ఈ విషయంలో కూడా వారు బాధపడుతున్నందుకు ఆశ్చర్యంగా ఉంది. మేము వ్యవసాయ సాగు పథకం పై సృష్టి సారించాము. మీరు చూసినట్లయితే MNREGA లో కొన్ని మార్పులు తీసుకు వచ్చాం. అంతకుముందు మూడు సంవత్సరాలలో ఆరు వందల కోట్ల రూపాయలు పెంచారు. మేము వచ్చాక రెండు సంవత్సరాలలో 11 వేల కోట్ల రూపాయలు పెంచాం. మేము అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగించాము. అందులో జీరో టేకింగ్ కి ఏర్పాటు చేశాము. మేము చెరువులపై ఎక్కువ దృష్టి సారించాము. ఎందుకంటే వాటి వల్ల సాగు చేయడానికి ఎక్కువ వీలు అవుతుంది. అలాగే చేపల పెంపకం కోసం చిన్న చిన్న చెరువుల అవసరం ఉంటుంది. ఆ పని ఒక పేద వ్యక్తి కూడా చేయగలడు అందుకే దాదాపు 10 లక్షల కంటే ఎక్కువ చెరువులు తవ్వే సంకల్పం చేసుకుని మేము ముందుకు వెళ్తున్నాం. క్రితం సారి కూడా మేము చెరువుల పైనే దృష్టి సారించాము. వాటివల్లనే మన రైతులకు ఎక్కువ లాభం

కలిగే అవకాశం ఉంది. పర్యవేక్షించే వ్యవస్థ ఉంది. జీరో టేకింగ్ వల్ల పర్యవేక్షించడం ద్వారా దాని ప్రయోజనం ఉంటుంది. అలాగే అంతరిక్ష విజ్ఞానాన్ని ఉపయోగించే శాటిలైట్ తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. కానీ మనం ఉపయోగించుకోలేదు. కేవలం ఉపగ్రహాలను ప్రయోగించే వార్తాపత్రికలలో ముఖ్యవార్తలు గా మిగిలి పోయాము. ఈ ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తూ ముందుకు వెళ్ళే దిశగా పనిచేస్తుంది.

ప్రధానమంత్రి పంటల బీమా పథకం. పంటల బీమా అంతకుముందు ఉండేది. కానీ రైతులు పంటల బీమా తీసుకోవడానికి సిద్ధంగా ఉండేవారు కాదు. పంటల బీమా అంతకు ముందు ఉన్న రైతుల హక్కులు రక్షింపబడేవి కాదు. కాబట్టి ప్రజాసేవ చేసే మన లాంటి వారందరికీ, రాజకీయ పార్టీల పట్లే కాకుండా సమాజం పట్ల కూడా బాధ్యత ఉంటుంది. కాబట్టి ఈ సభలోని సభ్యులందరూ ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని అధ్యయనం చేసి వారి వారి నియోజకవర్గాల్లోని రైతులకు ఏ విధంగా సహాయం అందగలదో ఆ లాభాన్ని వారికి చేకూర్చాలి. మొదటిసారి విత్తనాలు వేయకపోయినా ప్రకృతి విపత్తు కారణంగా ఆ రైతు కి బీమా పొందడానికి అర్హత ఉంటుంది. అలాగే కోత కోసిన 15 రోజులలో ఏదైనా విపత్తు వచ్చినట్టయితే వారు కూడా బీమా కి హక్కుదారులు. ఈ నిర్ణయం చిన్నది కాదు. అందుకే ఈ బాధ్యత మన అందరిదీ. మన రైతులకు ఈ ప్రయోజనాన్ని ఆయా రాష్ట్రాల్లో లభించేలా పనిచేయాలి.

సాయిల్ హెల్త్ కార్డ్ - రాజకీయంగా మన మధ్య విభేదాలు ఉండొచ్చు కానీ మీ ప్రాంతంలోని రైతులకు సాయిల్ హెల్త్ కార్డు ప్రయోజనాలు వివరించండి. వారి పెట్టుబడి తగ్గి వారికి ప్రయోజనం కలుగుతుంది. సరైన నేలలో సరైన పంట వేయడం వల్ల వారికి లాభం కలుగుతుంది. ఇది చాలా సులభమైన విజ్ఞానం. ఇందులో రాజకీయం చేయాల్సిన అవసరం లేదు. ఈ విషయాన్ని మనం ముందుకు తీసుకు వెళ్ళాలి. అందుకే మనలోని చిన్నచిన్న

పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చి సొంత పరిశోధనశాలలు ఏర్పాటు చేసి, వారు స్వయంగా ఈ పరిశోధనశాలల ద్వారా నెమ్మదిగా ఈ గ్రామాల్లో కొత్త ఉపాధి కల్పించే దిశగా మనము పని చేయాలి.

గౌరవనీయులైన మేడం స్పీకర్, ఇక్కడ యువకులకు సంబంధించి ఎన్నో విషయాలు చర్చించాం ఉపాధి అవకాశాలపై కూడా చర్చించాము. ముద్ర యోజన ద్వారా దాదాపు రెండు కోట్ల కంటే ఎక్కువ మందికి ఏ విధమైన గ్యారెంటీ లేకుండా రుణం ఇవ్వడం జరిగింది. ఆ రుణంతో వారు వారి కాళ్లపై నిలబడి ఉండి ఉంటారు లేదా ముందు నుంచే వారికి ఉపాధి ఉండినట్లైతే ఒకరి కంటే ఎక్కువమందికి వారు ఉపాధి కల్పించి ఉంటారు. మా ఆలోచన ఆ దిశగానే ఉంది. మేము ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించే విధానాల వైపు మొగ్గు చూపిస్తున్నాము. ప్రతిచోటా ఉపాధి అవకాశాలు పెరిగేలా చూస్తున్నాము. నైపుణ్య అభివృద్ధి పై బిల్లు తీసుకు వచ్చాము. దానివల్ల వ్యవసాయ రంగంలో ఎప్పుడైతే ప్రధానమంత్రి వ్యవసాయ సాగు పథకం అమలు చేస్తామో అందులో ఉపాధి అవకాశాలు లభిస్తాయా? లభించవా? మేము 'ఉర్జా గంగ' యోజన కింద తూర్పు భారతాన్ని గ్యాస్ పైప్ లైన్ ద్వారా జోడించే ఒక పెద్ద పథకం అవలంబిస్తున్నాం. వందల కిలోమీటర్ల గ్యాస్ పైప్ లైన్ వేయబడుతుంది. ఆ పథకం లో ఎంతో మంది యువకులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

అందుకే అభివృద్ధి అనేది యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఉండాలి. ఈ మధ్య మేము వస్త్ర రంగంలో, చెప్పుల తయారీ రంగంలో ఎన్నో కార్యక్రమాలు చొరవతో చేశాము. దానివల్ల ఎంతో మందికి కొత్తకొత్త రంగాలలో కొత్త ఉద్యోగాలు లభిస్తున్నాయి. దేశంలోని చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ బడ్జెట్లో కొన్ని

ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. చిన్న పరిశ్రమలకు ఎంత బలం దొరికితే మన దేశంలో ఉద్యోగ అవకాశాలు అంతగా పెరుగుతాయి.

'జీరో డిఫెక్ట్ జీరో ఎఫెక్ట్' అనేది మన ఉత్పత్తి ప్రమాణం అయితే అప్పుడు మనం ప్రపంచ మార్కెట్ల పై ఆధిపత్యం సాధించవచ్చు, మన చిన్న పారిశ్రామికవేత్తలకు ఎగుమతి చేసే బలం లభిస్తుంది. అలాగే పెద్ద పారిశ్రామికవేత్తలకు చిన్నచిన్న విడిభాగాలు చిన్న పరిశ్రమల నుంచి లభిస్తాయి. ఆ విధంగా మనం ఒక పెద్ద ఇంజనీరింగ్ ప్రపంచంలో ఒక అద్భుతం సాధించగలం. అందుకే మా ప్రభుత్వం ఈ బడ్జెట్లో కొన్ని పథకాలు తీసుకువచ్చింది. కొత్త బడ్జెట్లో 96 శాతం పారిశ్రామికవేత్తలకు లాభం చేకూరుతుంది. మిగతా నాలుగు శాతం పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు వారు దేశం బయట ఉంటారు. కానీ 50 కోట్ల కంటే తక్కువ ఉన్న దాదాపు 96 శాతం మంది పారిశ్రామికవేత్తలకు లాభం లభించనుంది. అది ఒక పెద్ద ప్రయోజనం. దానివలన ఉద్యోగాలు పెరిగే అవకాశాలు ఎక్కువ కానున్నాయి.

మీరు మీ గుండెల పై చేతులు వేసుకుని చెప్పండి సర్జికల్ స్ట్రైక్ లో 24 గంటల ముందు రాజకీయ నాయకులు ఏ విధమైన ప్రకటనలు చేశారో? ఏ విధమైన భాష మాట్లాడారో? కానీ ఎప్పుడైతే దేశం మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారో వారు వారి భాషను మార్చుకున్నారు. అందుకే నేను మిమ్మల్ని మనవి చేస్తున్నాను, ఇది ఒక పెద్ద నిర్ణయం. ఆ నిర్ణయాన్ని గురించి ఎవరూ నన్ను అడగరు. నోట్ల రద్దు గురించి మాత్రం అడుగుతారు. ఎందుకు? దాన్ని రహస్యంగా ఉంచాలని క్యాబినెట్ మంత్రుల కి ఎందుకు చెప్పలేదు అని ఈ విధంగా అడుగుతుంటారు. క్యాబినెట్ కి కూడా నేను చెప్పలేదు. సర్జికల్ స్ట్రైక్ విషయానికొస్తే ఎవరూ అడగడం లేదు. మిత్రులారా, మన దేశ సైన్యాన్ని ఎంత పొగిడినా తక్కువే, ఎందుకంటే ఇంత పెద్ద దేశంలో ఇంత విజయవంతమైన సర్జికల్ స్ట్రైక్ వారు చేశారు. కానీ మిమ్మల్ని ఇబ్బంది పెడుతుందని నాకు తెలుసు. అందుకే సర్జికల్ స్ట్రైక్ మీకు ఒక సమస్య ఎందుకంటే మీరు

ప్రజలలోకి వెళ్లి ఈ విషయం చెప్పలేరు. లోపల మాత్రం బాధ అనుభవిస్తున్నారు. ఇది మీకున్న సమస్య. కానీ మీరు ఒక విషయం నమ్మండి, మన సైన్యం ఈ దేశ రక్షణలో పూర్తిగా సమర్థవంతంగా, శక్తివంతంగా ఉంది.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, ఈ సభలో వాదనలు జరగాలి, పరిశోధనలు జరగాలి, కొత్త ఆలోచనలు రావాలి అని నేను కచ్చితంగా నమ్ముతున్నాను. ఎందుకంటే మేము జ్ఞానాన్ని పూజిస్తాం, అందుకే కొత్త ఆలోచనలను స్వాగతిస్తాము. ఎన్ని కొత్త ఆలోచనలు మాకు లభిస్తే, అవి ఏ దిశలో ఆలోచనలు అయినా పర్వాలేదు. ఏ దిశలో ఉన్నా సరే, ఉత్తమమైన ఆలోచనలను మేము స్వాగతిస్తాం. ఎందుకంటే మన అందరి ఉద్దేశ్యం మన దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లడం. మన అందరి ఉద్దేశ్యం దేశాన్ని చెడు నుండి కాపాడడం. మన అందరి ఉద్దేశ్యం దేశాన్ని కొత్త శిఖరాల వైపు తీసుకు వెళ్లడం, ప్రపంచంలో ఇప్పుడు ఒక అవకాశం వచ్చింది. ఇలాంటి అవకాశాలు చాలా తక్కువగా వస్తాయి. ఇప్పుడు ప్రపంచంలో ఉన్న వ్యవస్థలో భారత దేశం కోసం అవకాశాలు ఉన్నాయి. ఈ అవకాశాన్ని మనం ఉపయోగించుకోవాలి, ఒకే గళంతో ఒకే శక్తి తో మనం ప్రపంచం ముందు మనల్ని ప్రదర్శించుకోవాలి. మన పూర్వీకులు కన్న కలల్ని మనం నిజం చేయగలమని నేను నమ్ముతున్నాను.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, మీరు నాకు మాట్లాడేందుకు సమయం ఇచ్చారు. ఈ సభ నా మాటలు విన్నది. అందుకు నేను మీకు నా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మరొక్కసారి నేను గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. చాలా ధన్యవాదాలు.

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

8 ఫిబ్రవరి 2017

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 8 ఫిబ్రవరి 2017

గౌరవనీయులైన అధ్యక్షా, గౌరవనీయులైన రాష్ట్రపతి గారు ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు నేను మీ ముందుకు వచ్చాను. దాదాపు 40 మంది గౌరవనీయ సభ్యులు ఈ చర్చలో పాల్గొన్నారు. శ్రీ గులాం నబీ ఆజాద్ గారు, శ్రీ నీరజ్ శేఖర్ గారు, శ్రీ ఏ నవనీత కృష్ణన్ గారు, శ్రీ డెరెక్ గారు, శ్రీ రాజా గారు, శ్రీ శరద్ యాదవ్ గారు, శ్రీ సీతారాం గారు, శ్రీ అహ్మద్ గారు, ఇప్పుడే శ్రీ ఆనంద్ శర్మ గారు మాట్లాడారు. మీ అందరికీ నా కృతజ్ఞతలు. ఇతర సభ్యులు ఎవరైతే వారి అభిప్రాయాలు ఇక్కడ వెల్లడించారో వారికి కూడా నా కృతజ్ఞతలు. చర్చలో ఎక్కువభాగం నోట్ల రద్దు గురించే జరిగింది. ఒక విషయం ఎవరూ కాదనలేనిది ఏంటంటే మన దేశంలో ఒక చెడు జరుగుతూ వచ్చింది ఆ చెడు మన ఆర్థిక వ్యవస్థ లో, సమాజ వ్యవస్థలో పాతుకుపోయి ఉంది. అందుకే మేము అవినీతికి, నల్లధనానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాము. ఇది రాజకీయ పోరాటం కాదు. ఇది ఏ రాజకీయ పార్టీని ఇబ్బంది పెట్టడానికి చేసే పోరాటం కాదు. అలా ఆలోచించడానికి ఏ కారణమూ లేదు. అందుకే ఈ విషయాన్ని ఎవరితో కూడా జోడించడానికి కారణాలు లేవు. ఈ సభలో మనం రాజ్యాంగ గౌరవానికి కట్టుబడి, మన జౌనానికి అనుగుణంగా ఏవైతే సాధ్యమో అవి చేయడం మన బాధ్యత.

ఈ సమాంతర ఆర్థిక వ్యవస్థ వల్ల ఎవరికైనా ఎక్కువ నష్టం వాటిల్లింది అంటే అది పేద వారికి మాత్రమే. పేదల హక్కులు హరింపబడ్డాయి, మధ్యతరగతి వారు దోపిడీకి గురవుతున్నారు. ఇంతకుముందు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు అని నేను అనడం లేదు.ముందు కూడా ప్రయత్నాలు చేశారు కానీ ఎక్కువ ప్రయత్నం చేయాల్సిన అవసరం

ఉండేది. ఇప్పుడు చేస్తున్న ప్రయత్నంలో కూడా ఎక్కువ శ్రమ చేయాల్సి వస్తే మనం చేయాలి. ఎందుకంటే ఇంకెంతకాలం మనం ఈ సమస్యలని చాపకింద దాచి కాలం గడిపేస్తాము? అందుకే చర్చలో నకిలీ నోట్ల గురించి చర్చించారు. ఈ గణాంకాలు అయితే ప్రచారంలో ఉన్నాయి అవి బ్యాంకు వరకు చేరిన నకిలీ నోట్ల గణాంకాలు. చాలా వరకూ నకిలీ నోట్లు బ్యాంక్ వరకు వెళ్లకుండానే చెల్లుబాటు అయ్యే వ్యవస్థ ఉండేది. ఉగ్రవాదం, నక్సలిజాన్ని ప్రోత్సహించడానికి ఈ నోట్లు ఉపయోగించేవారు. కొంతమంది ఇక్కడ అత్యుత్సాహంతో కొంతమంది ఉగ్రవాదుల చేతిలో రెండు వేల నోట్లు దొరికాయని చెబుతున్నారు. మనకి తెలియాల్సిన విషయం ఏంటంటే మనదేశంలో నోట్ల రద్దు జరిగిన తర్వాత బ్యాంకులను దోచుకునే ప్రయత్నం జరిగింది. బ్యాంకు నుండి కొత్త నోట్లు తీసుకు వెళ్లడానికి ప్రయత్నించారు. అది జమ్మూ కాశ్మీర్ లో జరిగింది. ఎందుకంటే నకిలీ నోట్లపై పరిస్థితి దిగజారి అక్కడ వారు చేసే రోజు వారి వ్యాపారం కష్టాలని ఎదుర్కొంది. ఆ విధంగా వారు బ్యాంకు నుండి కొత్త నోట్లు దోచుకున్న కొన్ని రోజుల తర్వాత ఉగ్రవాదులని చంపడం జరిగింది. వారి చేతులలో కొత్త నోట్లు అప్పుడు లభించాయి కాబట్టి ఈ సంఘటన సంబంధం దానితో ఉంది. ఇది మనం అర్థం చేసుకోవాలి. అలాంటి వ్యక్తులకి అనుకూలంగా మాట్లాడడానికి ఏ కారణం లేదు. కానీ అలాంటి వ్యక్తులకు వ్యతిరేకంగా మనం ఒక స్వరంలో మాట్లాడాలి. మనం అవినీతి పరుల పట్ల కఠినంగా వ్యవహరించకపోతే నిజాయితీపరులకి బలం లభించదు. అందుకే ఈ చర్యల వల్ల నిజాయితీపరులకు శక్తి లభించనుంది. ఇది మాకు ఉన్న స్పష్టమైన అభిప్రాయం.

గౌరవనీయులైన అధ్యక్షా, చాలా సంవత్సరాల క్రితం వాంఛూ కమిటీని ఏర్పాటు చేసారు. నోట్ల రద్దు వల్ల ఏర్పడే ఆర్థిక అవసరాలకి సంబంధించి ఆ కమిటీ వారు ఆ సమయంలో శ్రీమతి ఇందిరా గాంధీ గారికి ఒక నివేదిక ఇచ్చారు. ఆ నివేదికతో శ్రీ యశ్వంత్ రావ్ చౌవన్ గారు సమ్మతించి దాన్ని ముందుకు తీసుకెళ్లాలని అనుకున్నారు. కానీ అప్పుడు

ఇందిరాగాంధీ గారు “మనం రాజకీయాలలో ఉన్నాము. ఎన్నికలలో పోటీ చేయాలి కదా” అని అన్నారు. ఈ విషయం గాడ్ బోలె గారి పుస్తకంలో ప్రస్తావించబడింది. ఈ పుస్తకం ప్రచురించబడింది. ఇంత జాగురూకత మీరు అప్పుడే చూపించాల్సింది. ఆ పుస్తకానికి వ్యతిరేకంగా మీరు మాట్లాడాల్సింది. ఆ సమయంలో మీరు నిద్ర పోతున్నారా? మీరు అప్పుడు ఏం చేస్తున్నారు? ఇందిరా గాంధీ గారి మీద ఇంత పెద్ద ఆరోపణ చేయబడింది. అది కూడా ఒక అధికారి చేశారు. మీరు ఇప్పటివరకు నిద్రపోతున్నారా? నేను నీ స్థానంలో ఉండి ఉంటే గాడ్ బోలె గారికి వ్యతిరేకంగా కేసు వేసే వాడిని. కానీ మీరు అలా చేయలేదు. ఈరోజు గాడ్ బోలే గారి పుస్తకం పై చర్చ జరుగుతున్నప్పుడు, ఈరోజు పరిస్థితులు ఇంకా ముందుకు వెళ్లాయి. వాంఛూ కమిటీ వారి నివేదిక ఇచ్చినప్పుడు సమస్యలు కేవలం నల్లధనానికి పరిమితమై ఉండేవి. ఈరోజు నల్లధనం ఉగ్రవాద సంస్థలు, నకిలీ నోట్ల వ్యాపారం, మత్తు మందుల వ్యాపారం, హవాలా ఇలా మన జీవితాలలో ఇది వ్యాప్తి చెంది ఉంది.

నవంబరు 8న ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు కేవలం నకిలీ నోట్లు వెనక్కి వస్తాయి అన్నది ప్రశ్న కాదు. ఒక చిన్న బ్యాంకు అయి ఉండొచ్చు, ఏ విధమైన సదుపాయాలు లేకపోయి ఉండొచ్చు అందులోకి ఎవరైనా బలవంతంగా దూరితే, రిజర్వ్ బ్యాంక్ కనుగొంటుంది. కానీ నకిలీ నోట్లని అదే సమయంలో అరికట్టడం జరిగింది. అందుకే ఈ లెక్క ఎవరి వద్దనైనా ఉంటే, వారు ఎలా ఉన్నారో అని ఆశ్చర్యం వేస్తుంది. వారి వద్ద ఉన్న నకిలీ నోట్లు వెంటనే విలువ కోల్పోయి ఉంటాయి. మీరు టీవీ లో ఈ వార్తలు చూసి ఉంటారు. మన శత్రు దేశాల్లో నకిలీ నోట్ల, పెద్ద వ్యాపారం చేసే వాళ్ళు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చింది. ఇది టీవీ వార్తల్లో చాలా రోజులు వచ్చింది.

మనదేశంలో 30-40 రోజుల వ్యవధిలో ఏడు వందల మంది కంటే ఎక్కువ మావోయిస్టులు లొంగి పోయారు. నవంబర్ డిసెంబర్ నెలల మధ్య ఈ 40 రోజులలో 700

మంది లొంగిపోయారు, ఆ తర్వాత ఈ ప్రక్రియ నడుస్తూనే ఉంది. మావోయిస్టులు లొంగిపోతే ఈ సభలో ఎవరికి సంతోషం కలగదు? ఎవరికైనా సంతోషం కలగడం లేదంటే వేరే అర్థం ఏదో ఉన్నట్టే.

అలాగే ఒక దేశ అధికారిక వ్యవస్థలో డబ్బు ఉండడం అవసరం. వెయ్యి రూపాయల నోట్లు ముద్రించిన తర్వాత అవి సాధారణ వాడకంలోకి వచ్చేవి కాదు. ఐదు వందల రూపాయల నోట్లు కూడా తక్కువగానే వెళ్లేవి. కట్టల కొద్ది వ్యాపారం నడుస్తూ ఉండేది. ఇది వాస్తవం, దీన్ని మనం కాదనలేం. ఇప్పుడు ఇంత పెద్ద నోటు బ్యాంకులో వాడకంలోకి వచ్చినప్పుడు సామాన్యులకు డబ్బు ఇచ్చే శక్తి పెరుగుతుంది. అలాగే బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించాయి. ఆ విధంగా దేశంలో మొదటి సారి జరిగింది. బ్యాంకు లాభం సామాన్య వ్యక్తుల కోసం. కానీ ఇక్కడ అసంఘటిత కార్మికుల గురించి మాట్లాడడం జరిగింది. మీ నుండి ప్రత్యేకించి, సీతారాం గారి నుండి, వారి పార్టీ నుండి నేను ఆశించేది ఏమిటంటే అసంఘటిత కార్మికుల వేతనాలకు సంబంధించి భద్రత లభించాలని కోరుకుంటారని. ఇది నిజం. ఎంత చెబుతారో అంతా ఇవ్వరు. ఇచ్చిన దాంట్లో కూడా ఒక వ్యక్తి బయట నుంచుని కొంత తీసుకుంటాడు. ఈ రుగ్మతల గురించి మనకు తెలుసు. ఇలాంటి ఎన్నో రుగ్మతల్ని మనం చూశాం. అందుకే మేము ఈ వ్యవస్థని నిలబెట్టి ఆ లాభం శ్రామికులకి లభించేలా చూస్తున్నాం. సమయానికి ఈపీఎఫ్, ఈ ఎస్ ఐ సి పథకంతో జోడించడం వల్ల వారికి భద్రత కల్పించడం సాధ్యం అవుతుంది. ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

అస్సాంలోని తోట సాగు గురించి నేను ఒక ఉదాహరణ మీకు ఇక్కడ చెప్తాను. అక్కడి ప్రభుత్వం చొరవ తీసుకుని కార్మికుల కోసం బ్యాంకులలో ఖాతాలు తెరిచారు. ఏడు లక్షల ఖాతాలు తెరిచి వారికి మొబైల్ యాప్ ద్వారా ఎలా పని చేయాలో నేర్పించారు. మొదట్లో యూనియన్ వాళ్ళు అభ్యంతరం వ్యక్తం చేశారు, నగదు రూపంలోనే చెల్లించాలని అడిగారు.

ఎందుకంటే నవ్వుతూ వేరే విషయాలు జోడించి ఉన్నాయి. అందుకే టీ తోటల లో పనిచేసే కార్మికులకు ఇప్పుడు పూర్తి వేతనం లభిస్తుంది. ఏ విధమైన తగ్గింపులు లేవు. ఇప్పుడు అక్కడ, వారు సురక్షితంగా ఉన్నారు. ఇది ఒక గొప్ప అనుభవం.

అలాగే నోట్ల రద్దు కు సంబంధించి కొంతమంది విదేశీ వార్తాపత్రికలు అని ప్రస్తావించారు. కొంతమంది విదేశీ ఆర్థిక శాస్త్రవేత్త అని ప్రస్తావించారు. మీరు 10 అలాంటి ప్రస్తావనలు తీసుకొస్తే నేను ఇరవై చెప్పగలను. మీరు 10 మంది గొప్ప వ్యక్తుల సూక్తులు చెప్తే నేను ఇరవై మందివి చెప్పగలను. ఇలా ఎందుకు జరుగుతుందంటే ప్రపంచంలో ఇలాంటి నిర్ణయం మరొకటి జరగలేదు. ప్రపంచంలో ఇంత పెద్ద, విస్తృతమైన నిర్ణయం ఎక్కడా జరగలేదు, అందుకే ప్రపంచంలోని ఆర్థిక శాస్త్రవేత్తల వద్ద దీన్ని విశ్లేషించడానికి, ఒక ప్రామాణికత లేదు. ఈ విషయం ప్రపంచంలోని ఆర్థిక శాస్త్రవేత్తలకు, విశ్వవిద్యాలయాలకు ఒక పెద్ద కేస్ స్టడీగా లభించవచ్చు.

భారత్ ఎంత పెద్ద నిర్ణయం తీసుకుందో? ఒక దేశంలో సామాన్యుల ప్రజాశక్తి ఏంటో ఈ ప్రపంచానికి అర్థమవుతుంది. ఈ సభలో కూర్చున్న మహానుభావులకు నేను చెప్పేది ఏమిటంటే నోట్ల రద్దు తర్వాత సమాజ శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని అధ్యయనం చేస్తారు. మొదటిసారి సమాంతర విభజన మనం చూస్తున్నాం. నేను సమాంతర విభజన అని అన్నప్పుడు సామాన్య ప్రజలు ఒక వైపు, రాజకీయ నాయకులు మరోవైపు ఉంటారు. వారు ప్రజల నుంచి అంతగా విడిపోయి ఉన్నారు. సాధారణంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి ప్రజలు వ్యతిరేకం గా ఉంటారు, ఏ ప్రభుత్వం అయినా కానివ్వండి. కానీ ఇది మొట్టమొదటి ఉదాహరణ. కొంతమంది అటు వైపున ఉన్నా, జనాలు మాత్రం ప్రభుత్వంతోనే ఉన్నారు.

అలాగే మనం గర్వించ దగ్గ విషయం ఏమిటంటే కొన్ని కష్టాలు ఉండొచ్చు కానీ మనం ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలి. ప్రపంచం ముందు గర్వంగా ఈమాట చెప్పవచ్చు. ఈ దేశంలోని నూట పాతిక కోట్ల ప్రజల్లో అందులో నిరక్షరాస్యులు ఉండొచ్చు, కొంత మందికి విద్య లభించక పోయి ఉండవచ్చు. మీ నివేదికలను మీరు ఏ విధంగా వర్ణిస్తారో, వారు ఇలా ఉంటారు ఆలా ఉంటారు అని. ఇవన్నీ ఉన్నా కూడా ఈ దేశం తనలోని చెడు బయటికి తీయడానికి కష్టపడుతుంది. ఏ నాయకుడికైనా, ఏ రాజకీయ పార్టీకి అయినా, ఇది మన అందరికీ కూడా గర్వించదగ్గ విషయం. ఈ దేశ ప్రజలు ఎటువంటి పౌరులు అంటే వారిలోని చెడుకి వ్యతిరేకంగా పోరాటం చేయడానికి, కష్టాలు ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. చెడు నుండి బయటపడడానికి దారులు వెతుకుతున్నారు. ఈ విషయం మనం అందరం అర్థం చేసుకోవాలి.

అధ్యక్షా, గత సమావేశంలో శ్రీ మన్మోహన్ గారు వారి అభిప్రాయాలు వెల్లడించారు. బహుశా ఇప్పుడు ఒక్క పుస్తకమే వచ్చింది, దాని ముందు మాట డాక్టర్ గారు రాశారు. నేను వారి నివేదిక చదువుతున్నప్పుడు నాకు ఏమి అనిపించింది అంటే ఇంత పెద్ద ఆర్థిక శాస్త్రవేత్త కచ్చితంగా ఈ పుస్తకంలో వ్రాసి ఉంటారని. కానీ నాకు తెలిసింది ఏమిటంటే ఈ పుస్తకం వేరే వారు రాశారు, ముందు మాట వీరు రాశారని. వారి ఉపన్యాసం విన్నాక నాకు అలా అనిపించింది. ఇది అర్థం చేసుకోవాల్సిన విషయం. దాదాపు 30-35 సంవత్సరాల నుంచి నేను మాట్లాడని మాటలు కూడా వారు అర్థం చేసుకోగలగడం అద్భుతం. ఇప్పుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు మాజీ ప్రధానమంత్రి, గౌరవనీయులైన వ్యక్తి. గత 30-35 సంవత్సరాల నుండి మనదేశంలో తీసుకున్న ఆర్థిక నిర్ణయాలతో వారికి ప్రత్యక్ష సంబంధం ఉంది. వారు అందులో ఒక నిర్ణయాత్మక పాత్ర పోషించారు. 70 సంవత్సరాల భారత స్వాతంత్ర్యం లో బహుశా ఆర్థిక రంగంలో 35 సంవత్సరాల పాటు ఒక వ్యక్తి ఆధిపత్యం ఉండడం అరుదు.

ఎన్నో కుంభకోణాలు ప్రస్తావించబడ్డాయి కానీ మన రాజకీయ నాయకులు అందరూ డాక్టర్ గారి నుంచి ఎంతో నేర్చుకోవాలి. ఎన్ని కుంభకోణాలు జరిగినా వారిపై ఒక్క మరక కూడా అంటలేదు. అది స్నానాల గదిలో రైన్ కోటు వేసుకుని స్నానం చేసే కళ, కేవలం డాక్టర్ గారికి తెలుసు. ఇంకెవరికీ తెలియదు.

అధ్యక్షా, ఇంత పెద్ద పదవిలో ఉన్న వ్యక్తి సభలో 'దోచుకోవడం' 'మరో దోపిడీ' లాంటి పదాలు ప్రయోగించినప్పుడు అటువైపునుంచి ఆలోచించాల్సిన అవసరం ఉంది. గౌరవాన్ని అతిక్రమించినది ఎవరని? అలా మాట్లాడినప్పుడు వినడానికి సిద్ధంగా ఉండాలి. మేము రాజ్యాంగ గౌరవాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్యాన్ని గౌరవించే వ్యక్తులం. కానీ ఎట్టి పరిస్థితులలో పరాజయాన్ని అంగీకరించకూడదు అనేది ఎంతవరకు చెల్లుతుంది?

అధ్యక్షా! ప్రజా ఆందోళన చేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఎక్కడైనా ఒక చిన్న విషయం జరిగినా 2,3 వాహనాలు కాల్చేస్తున్నారు. ఎక్కడైనా బస్సు ఆలస్యంగా వచ్చినా అలాంటి విషయాల్లో కూడా ఒకటో రెండో బస్సులని కాల్చేస్తున్నారు. వీటి ప్రభావం ఏంటి అనేది విశ్లేషించాల్సిన విషయం. కానీ ఇలాంటి ఘటనలు ఇప్పుడు రోజువారి దృశ్యాలుగా ఉన్నాయి. కానీ మేము ఈ యుద్ధానికి ప్రతి బద్ధులై ఉన్నాము. ఎన్ని కష్టాలు వచ్చినా అలాంటి ఘటనలు జరగనివ్వలేదు. ప్రపంచం ముందు భారతీయుల సామర్థ్యాన్ని మనం గర్వంగా ప్రదర్శించాలి. ఈ విషయం మనం మాట్లాడాలి, అప్పుడే ప్రపంచం మనం ఏ విధంగా ఆలోచిస్తున్నామో అర్థం చేసుకుంటుంది.

నేను మరో విషయం చెప్పదలుచుకున్నాను. అదేంటంటే మాది సీతారాం గారి ఆలోచన స్రవంతి కన్నా వేరుగా ఉంటుంది కాబట్టి మా అభిప్రాయాలు వెల్లడిస్తున్నప్పుడు అవి వేరు గా ఉండడం స్వాభావికం. కానీ ఈ విషయం పట్ల నేను ఆలోచిస్తున్నప్పుడు సీతారాం గారు, వారి

పార్టీ మాకు తోడుగా నిలబడతారని నమ్మాను. దానికి కారణం ఏమిటంటే వారి సీనియర్ నేత శ్రీ జ్యోతి బసు గారు 1972లో వాంఛూ కమిటీ నివేదిక సభలో ప్రవేశపెట్టాలని కోరారు. దానికోసం ఆయన చాలా పెద్ద యుద్ధమే చేశారు. ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు, ఆ నివేదికను ప్రవేశపెట్టలేదు. చివరికి ఆ నివేదిక ప్రతిని ఆయన స్వయంగా ప్రైవేట్ మెంబరుగా టేబుల్ పై పెట్టారు. వారు ఆ రోజు చేసిన ప్రసంగం ఈరోజు కూడా మనం చూడవచ్చు. వారు 26 ఆగస్టు 1972 న ఏం చెప్పారంటే - "సర్,12 నవంబర్ 1970 న ఏర్పాటు చేసిన ఒక శక్తివంతమైన, ప్రతిష్టాత్మకమైన కమిటీ ప్రాథమిక సేవలలో ఒకటి విముద్రీకరణ. శ్రీమతి ఇందిరా గాంధీ నల్లధనం వల్లనే కాపాడ బడింది. వారి రాజకీయం, నల్లధనం వల్లనే బతికి ఉంది. అందుకే ఆ నివేదిక ని అమలు చేయకుండా సంవత్సరంన్నర వరకు దాన్ని నొక్కి పెట్టారు." ఈమాట జ్యోతిబసు గారు 1972లో చెప్పారు. మరో సారి 4 సెప్టెంబర్ 1972 న లోక్ సభలో మాట్లాడుతున్నప్పుడు జ్యోతిబసు గారు మేము నోట్ల రద్దుతో పాటు ఇంకొన్ని ఉపాయాలు సిఫార్సు చేయడం జరిగింది. నేను వాటిని మళ్లీ చెప్పదలుచుకోలేదు. ప్రభుత్వం నిజాయితీగా ప్రజల కి సహాయం చేయాలి కానీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ, వారి ప్రభుత్వం చరిత్ర, నల్ల ధనం నుంచి, నల్ల ధనం కోసం, నల్లధనం ద్వారా ముడిపడి ఉంది. అంతేకాకుండా సిపిఎం సీనియర్ నాయకుడు శ్రీ హరికిషన్ సింగ్ సూర్జిత్ గారు 27 ఆగస్టు 1981 న ఇదే సభలో ప్రసంగించారు. వారు ఏమన్నారంటే, "నల్లధనాన్ని కట్టడి చేయడానికి ఈ ప్రభుత్వం తీవ్రమైన చర్యలు తీసుకుంటుందా? వంద రూపాయల నోటు రద్దు చేసే నిర్ణయం తీసుకోవచ్చా?" ఈ ప్రశ్న వారు ఇదే సభలో 1981లో లేవనెత్తారు. అందుకే నేను వామపక్షాలతో మనవి చేసేది ఏమిటంటే ఈ యుద్ధం లో మాకు తోడుగా నిలవండి. మీ సహకారం లభిస్తుంది అని నేను ఆశిస్తున్నాను. మీరు మీ ఆలోచనలు విస్తారంగా చెబుతూ ఉండండి. కానీ ఈ పని లో అయితే మీరు వేరుగా లేరు ఎందుకంటే మీ గుణం అలాంటిది

కాదు. అయినా అది సమయమే చెప్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో కొన్ని కఠిన నిర్ణయాలు సాధారణంగా ప్రజలు ఒప్పుకుంటారు. జన ప్రియమైన అడుగులు తీసుకోవడం ప్రజాస్వామ్య స్వభావం. స్వల్పకాలిక ప్రయోజనాల కోసం స్వభావం అలా అవుతుంది.అందుకే ఇంత పెద్ద నిర్ణయాలు అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. దీనికి నేను ఎవరిని తప్పు పట్టడం లేదు. నెమ్మదిగా ప్రజలు అర్థం చేసుకుంటారు. ఎవరైతే ఈ రోజు ఈ పనిని వ్యతిరేకిస్తున్నారో వాళ్లకి కూడా అర్థమవుతుంది. ఇంత పెద్ద దేశంలో ఇంత పెద్ద నిర్ణయం దేశానికి మేలు చేసే అవకాశాలు ఉన్నాయి. అందుకే ఈ చర్య ని మేము ముందుకు తీసుకు వెళ్లాలి అనుకుంటున్నాము.

ఇక్కడ డిజిటల్ వ్యవస్థకు సంబంధించి కూడా చర్చ జరిగింది. నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే ఇక్కడ జరిగిన చర్చలో దేశంలో ఇది లేదు, అది లేదు, ఇది జరగలేదు, అది జరగలేదు, మరుగుదొడ్ల లో నీరు లేవు, ఇలా ఎన్నో మాట్లాడారు. నేను మీరు ఏం మాట్లాడుతున్నారా అని ఆలోచించాను. 70 సంవత్సరాల తర్వాత ఈ దేశ ప్రభుత్వం ఒక నివేదిక తయారు చేసి ఇస్తుంది. 70 సంవత్సరాల కాలంలో నా సహకారం కేవలం రెండున్నర సంవత్సరాలు మాత్రమే. ఇక, మీరు మరుగుదొడ్లు కట్టించి ఇస్తే, మేము వాటికి తాళం వెయ్యలేదు కదా? మీరు రోడ్లు వేస్తే నేను వాటిని పీకి వేయ లేదు కదా? మీరు నీటి కొళాయి వేస్తే, నేను వాటిని తీసి వేయలేదు కదా? ఇది వాస్తవం. ఎవరు కూడా భారతదేశంలోని ప్రతీ మూలలో డిజిటల్ వ్యవస్థ ఉందని అనడం లేదు. ప్రశ్న ఏమిటంటే మనం మన ఆలోచించే విధానం మార్చుకోవాలి.ఎక్కడైతే, ఏ పని అయితే సాధ్యమో అక్కడ ఆ పని చేయాలి.

ఉదాహరణకి ఈ పని ఢిల్లీలో సాధ్యం అనుకుందాం. కాబట్టి ఢిల్లీలో ఆ పని ప్రారంభించి కొంత సానుకూలంగా సహాయ పడదాం. ఇది మన ప్రవర్తనలో రావాల్సిన మార్పు. ఒకవేళ కలకత్తాలోని ప్రజల దగ్గర మొబైల్ ఫోన్లు ఉంటే, కలకత్తా ప్రజల వద్ద కనెక్టివిటీ ఉన్నట్టయితే

అక్కడి నుంచే ప్రారంభించాలి. బంగ్లాదేశ్ లో సుదూర గ్రామాలలో ఆ సదుపాయం ఉండకపోవచ్చు ఈ విధంగా మేము ఇది చేశాం అది చేశాం అని గొప్పలు చెప్పుకోకూడదు. ఇప్పుడు మేము కొన్ని విషయాలని అమలు చేస్తుంటే మీకు కష్టంగా ఉంది.

ఇంకో విషయం ఏమిటంటే నేను మాటలతో ఆడతానని ప్రతి ఒక్కరికి తెలుసు. ఏ పిల్లవాడిని అయినా నువ్వు స్కూల్ కి వెళ్తున్నావా అని అడగండి, మీ పిల్లల్ని కూడా అడగండి, అప్పుడు వారు అవును నేను రోజు వెళ్తున్నాను అంటారు. కానీ మీకు తెలుసు నాకు తెలుసు ఆ పిల్లలు ఆదివారం స్కూలుకి వెళ్ళరని. కాబట్టి ఇది అందుకే దేశంలో నగదు రహిత వ్యవస్థ అంటే అర్థం సమాజంలోని చెల్లింపులు నగదు రహితంగా ఉండాలి అని. ప్రపంచంలో పెద్దపెద్ద దేశాలలో ఈ రోజు కూడా ఎన్నికలు నిర్వహించిన్నప్పుడు బ్యాలెట్ పేపర్లు ప్రచురించి వాటిపై ముద్రవేసి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఏ దేశంలో అయితే ఎక్కువగా నిరక్షరాస్యులు ఉన్నారని అనుకుంటున్నారో ఆ భారతదేశంలో, ఎక్కడైతే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం ఉందో, అక్కడ మీట నొక్కి ఓట్లు వేస్తున్నారు. ఏ రోజైతే మీటనొక్కే వ్యవస్థ వచ్చిందో, మన దేశంలోని పేద వ్యక్తి టెక్నాలజీని ఈ విధంగా స్వీకరిస్తాడు అని ఎవరూ ఊహించి ఉండరు

దీని అర్థం మన దేశ శక్తిని తక్కువగా అంచనా వేయకూడదు. మనకి ఈ దారి తప్పు అని అనిపించవచ్చు, కొన్ని సౌకర్యాలు కొన్ని సమస్యలు ఉండవచ్చు. కానీ మనం ముందుకు వెళ్లాలి కదా! కొంతమంది ఈ ప్రపంచంలో ఎన్నో దేశాలు మన కంటే ఎక్కువ అభివృద్ధి చెందాయని అన్నారు. నాకు ఆశ్చర్యమేసింది. ఆనంద్ శర్మ గారు ఈ మాట అన్నారు. ఆశ్చర్యం ఏమిటంటే,కొరియాలో డిజిటల్ వ్యవస్థని స్వీకరించడానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం జరిగింది. మీరు మమ్మల్ని డిజిటల్ వ్యవస్థని ప్రోత్సహించడానికి కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని అన్నారు. ఇప్పుడు భీమ్ ఆప్ తయారు చేశాం. దాన్ని తయారు

చేయడానికి ఒక్క పైసా కూడా ఖర్చు అవ్వలేదు. ఎలాంటి ఖర్చు లేకుండా దానిపై చెల్లింపులు జరుగుతున్నాయి. ఒక్క రూపాయి కూడా బ్యాంకుకి కమిషన్ గా వెళ్లడం లేదు. దీనివల్ల ప్రపంచం, కాగిత రహితంగా, కార్యాలయ రహితంగా బ్యాంక్ కార్యకలాపాలు చేసే దిశగా పయనిస్తుంది. భారత్ ఈ విషయంలో వెనుక పడాల్సిన అవసరం లేదు. బహుశా తన వద్ద వ్యవస్థలు తక్కువ ఉండొచ్చు, మనకి ఈ పని చేయడానికి రెండు సంవత్సరాలు లేదా ఐదు సంవత్సరాలు ఎక్కువ సమయం పట్టొచ్చు, కానీ మనం ప్రారంభం చేయాలి. ఈ దిశ ఫిదా ఈ ఆలోచన తప్పు అనేది మనకి ఉపయోగకరం కాదు. మనం ఆదిశగా ప్రయత్నాలు చేయాలి. మీ మీ ప్రాంతాలలో ఉండే ప్రజలకి ఈ విషయాలు అర్థమయ్యేలా చెప్పి ఆ దిశగా మనం ముందుకు సాగాలి.

ఇక రైల్వేలో విషయానికి వస్తే మన దేశంలో సామాన్యులు రైల్వే లని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఈ రోజున రైల్వేలో 60 శాతం కంటే ఎక్కువగా ఆన్ లైన్ బుకింగ్ లు జరుగుతున్నాయి. వాటి చెల్లింపులు కూడా ఆన్ లైన్ లోనే జరుగుతున్నాయి. వారు వారి టికెట్ ని రద్దు చేసుకున్నా, వారి డబ్బులు ఆన్ లైన్ లోనే తిరిగి వచ్చేస్తాయి. ఈరోజు పట్టణాలలో ఎన్నో కుటుంబాలు ఉన్నాయి. వారు కరెంట్ బిల్లు కట్టడానికి సగం రోజు సెలవు పెట్టాల్సి వచ్చేది. ఈరోజు వారు వారి ఇంటి నుంచి రాత్రి 12:00 కి కూడా వారి మొబైల్ ఫోన్ నుంచి కరెంటు బిల్లు కట్టొచ్చు. సదుపాయాలు పెరుగుతూనే ఉన్నాయి.ఈ సదుపాయాలు టెక్నాలజీ ద్వారా లభిస్తున్నప్పుడు వాటిలో ఏవైనా లోపాలు ఉంటే మనం కచ్చితంగా చూడాలి. అలాగే వాటిని సరి చేసుకోవాలి. కానీ ప్రతికూలంగా ఆలోచించకూడదు. అలా చేయడం వల్ల మన దేశానికి మేలు జరగదు.

రూపే కార్డు గురించి ఇప్పుడే అరుణ్ గారు మాట్లాడారు. ఈ దేశంలో జన్ ధన్ ఖాతా లతోపాటు 21 కోట్ల ప్రజలకు రూపే కార్డులు ఇవ్వబడ్డాయి. వీటి శక్తి గురించి మీకు అంచనా

లేదు. మామూలుగా జేబులో ఈ కార్డు ఉండడం ఒక వర్గానికి గర్వించదగ్గ విషయం. చెల్లింపులు ఎప్పుడు చేసినా కార్డు తో చేసేవారు. ఇది పేదలకు సంబంధించిన విషయం కాదు అని ఒక తప్పుడు అభిప్రాయం ఏర్పడింది. ఇప్పుడే నాకు అనంత్ కుమార్ గారు చెప్పారు. వారు బెంగళూరు నుంచి వస్తున్నప్పుడు వారితో పాటు ఒక ఐ.టి ఉద్యోగి కూర్చున్నాడు. అతను వారి డ్రైవర్ ఉదాహరణ చెప్పారు. అతని డ్రైవరు ఈ నోట్ల రద్దు వల్ల చాలా సంతోషంగా ఉన్నాడంట. ఎందుకు అని అడిగితే, ఈరోజు ఒక పెద్దమనిషి లాగే తను కూడా కార్డు వాడుతున్నాను అని, అతనికి కార్డు చూపించాడు. ఆ డ్రైవరు చాలా సంతోషించాడట. ఇప్పుడు మీరు చూడండి సమాజంలోని ఒక సామాన్య వ్యక్తి జీవితంలో ఒక వ్యవస్థ వల్ల మార్పు వచ్చింది. ఒక కొత్త ఆత్మవిశ్వాసం జనించింది. ఎవరి ఇంట్లో అయితే సైకిల్ కూడా ఉండేది కాదో, వారి ఇంటికి ఒక మోటర్ సైకిల్ వస్తే కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. ఎవరైతే ఒక చిన్న స్కూటర్, పాతదే అయినా సరే ఉన్నప్పుడు గర్వంగా భావిస్తారు. మన సమాజం లోని సామాన్య వ్యక్తుల ఆశలు, ఆకాంక్షలను తీర్చే దిశగా మన ప్రయత్నాలు ఉండాలి.

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ - దీని వల్ల చాలా పెద్ద ప్రయోజనం జరిగింది. నేను వేరే సభలో దీని గురించి విస్తారంగా మాట్లాడుతూ దాదాపు 50 వేల కోట్ల రూపాయల లీకేజీని ఆపగలిగాము అని చెప్పాను. ఇది ప్రతి సంవత్సరం ఆదా అవుతుందని చెప్పాను. ముమ్ముందు ఎంత ఆదా అవుతుందో చెప్పలేము అన్నాను. అంతకు ముందు కొంత మంది ఆరు చోట్ల నుంచి స్కాలర్షిప్ లు తీసుకునేవారు. అలాగే విధవ పెన్షన్, ఎవరైతే జన్మించలేదో వారు విధవ అయిపోయి చెక్కులు కూడా తీసుకున్నారు. Direct Benefit Transfer పథకం రావడం వల్ల ఇలాంటి లీకేజీలు మధ్యవర్తుల దోపిడీ ఆపగలిగాము. ముఖ్యంగా ప్రభుత్వ ఖజానా దోచుకోవడం ఆగిపోయింది కాబట్టి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ వల్ల ప్రయోజనాలు చూశాం. అందుకే డిజిటల్ పేమెంట్ లు ప్రోత్సహించడానికి మనం ఎన్ని ప్రయత్నాలు

చేయగలమో, అన్ని ప్రయత్నాలు చేయాలి. ప్రభుత్వం అలాంటి వ్యవస్థ ని అభివృద్ధి చేసింది. pos మషీన్ల అవసరం పెరిగిపోయింది. వేగంగా pos మషీన్లను పెంచుతున్నాం, అలాగే మొబైల్ చెల్లింపుల కోసం e - వాలెట్ ని ప్రోత్సహించడం జరుగుతుంది. అలాగే ఇంటర్నెట్ బ్యాంకింగ్ వైపు కూడా పని జరుగుతుంది. ఆధార్ ఆధారిత చెల్లింపుల టెక్నాలజీని ఉపయోగించి, అభివృద్ధి చేసి ఆధార్ ద్వారానే మొబైల్ ఫోన్ అవసరం లేకుండా చెల్లింపులు చేయవచ్చు. ఆ రోజులు ఎక్కువ దూరం లేవు, అందుకే ఈ వ్యవస్థలని అర్థం చేసుకునే ప్రయత్నం మనం చేయాలి, మన బృందాలను ఈ వ్యవస్థ ని అమలు చేయడానికి ప్రయత్నాలు చేయాలి.

భీమ్ ఆప్ చాలా ఉత్తమమైన వ్యవస్థ. ఈ యాప్ భారత ప్రభుత్వం కనుసన్నలలో తయారు చేయబడింది. ఈ యాప్ ఎంతగా ప్రజాదరణ పొందితే బయటి వ్యక్తులు లేదా ఏజెన్సీలకు ఏమి ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ ప్లాట్ ఫామ్ ద్వారా ఎవరైతే ప్రయోజనం పొందాలని అనుకుంటారో వారు పొందవచ్చు.

ఇప్పుడు మీరు డ్రైవర్లు ఎవరైతే హైవేపై పైన వస్తారో వారిని చూడండి. వారు, వారి వాహనాన్ని ఆపడం వల్ల పెట్రోల్, డీజిల్ ఎక్కువ ఖర్చు అవుతుంది .8 నవంబర్ తర్వాత ఆ వ్యవస్థను కూడా బలోపేతం చేస్తున్నాం. దానివల్ల డ్రైవర్ టోల్గేట్ దగ్గర టాక్స్ ఇవ్వడానికి టెక్నాలజీని ఉపయోగించవచ్చు. RFID ద్వారా ఏది అయితే చాలా కొద్ది మంది దగ్గర ఉండేదో, ఇంత తక్కువ సమయంలో దాదాపు 20 శాతం ట్రాఫిక్ RFID ద్వారా చెల్లింపులు చేస్తుంది. అలాగే కారులు కూడా బ్యాంకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు అక్కడినుంచే చెల్లింపు జరిగేలా ఏర్పాటు చేశాము. ఆ వాహనం ఆగాల్సిన అవసరం లేదు వెళ్ళిపోతూ ఉండొచ్చు. ఇలాంటి వ్యవస్థలు మన దేశంలో పెరిగితే, పెట్రోలు,డీజిలు ఆదా అవుతుంది. అలాగే టోల్ టాక్స్ కేంద్రాల కి కూడా ప్రయోజనం కలుగుతుంది. అలాగే పెట్రోల్ బంకుల్లో కూడా దాదాపు

29 నుంచి 30 శాతం మంది డిజిటల్ కరెన్సీని వాడుతున్నారు. మేము చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశాం. వారి మధ్యంతర నివేదిక వచ్చింది. ఆ నివేదికను అధ్యయనం చేస్తున్నాం. వారి అంతిమ నివేదిక రావల్సి ఉంది. కానీ మనం మార్పుకి సిద్ధంగా ఉండాలి.

ఇక బ్యాంకింగ్ వ్యవస్థ కి వస్తే నేను ఏమైనా చెప్తే అది మీరు రిపోర్ట్ కార్డు అంటారు. మీ పాత పదవీకాలంలోని రిపోర్ట్ కార్డు అది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డెట్ రికవరి ట్రిబ్యునల్ ని ఏర్పాటు చేసింది. బ్యాంకులో అప్పులు ఏవైతే ఉన్నాయో వాటి కోసం ప్రభుత్వం చొరవ తీసుకుంది.. బ్యాంకులలో జరిగే నియామకాలకి ఎటువంటి నియమాలు ఉండేవి కాదు. అలాగే నడుస్తూ ఉండేవి. అది ఒక పాత వ్యవస్థ. ఈ ప్రభుత్వం బ్యాంక్ బోర్డ్ బ్యూరో ఏర్పాటు చేసింది. అది ఒక స్వతంత్ర సంస్థ, వారి నియామకాలు వారే చేపడతారు. వారి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్లను వారే నియమించుకుంటారు. బ్యాంకింగ్ వ్యవస్థలో నైపుణ్యాన్ని తీసుకురావడానికి మేము ప్రయత్నించాం.

బ్యాంకింగ్ రంగం, ఆర్థిక ప్రపంచంలో రెండు రోజుల రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ జరిగింది. మన దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ ని ప్రపంచ స్థాయి ప్రమాణాలకు ఎలా తీసుకురావాలో విస్తారంగా ఆత్మపరిశీలన చేయడం జరిగింది. మన లోపాలను వారు అర్థం చేసుకుని వాటిని సరిదిద్దే ప్రయత్నం చేశారు.

రిజర్వ్ బ్యాంక్ ప్రతిష్ట - మీరు నాపై దాడి చేయొచ్చు మా పార్టీ పై దాడి చేయవచ్చు, మా ప్రభుత్వంపై దాడి చేయవచ్చు, ఇది చాలా సహజంగా జరుగుతుండవచ్చు. కానీ రిజర్వ్ బ్యాంక్ ని ఇందులోకి లాగాల్సిన అవసరం ఏముంది? రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ గారి ని కూడా మీరు ఇందులోకి లాగారు. ఇలాంటి సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై

ఉంది. ఇంతకుముందు ఉన్న గవర్నర్ పై కూడా కొంతమంది మాట్లాడారు. అప్పుడు కూడా నేను ఇది మంచిది కాదని వ్యతిరేకించాను. ఇలాంటి విషయాలని వివాదాల్లోకి లాగా కూడదు. మిగతా ప్రభుత్వ వ్యవస్థలు ఏవైతే ఉన్నాయో అవి నడుస్తూనే ఉంటాయి. ఆర్థిక వ్యవస్థ ని నడపడంలో రిజర్వ్ బ్యాంక్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. రిజర్వ్ బ్యాంక్ విశ్వసనీయతను పెంచేందుకు మనమందరము అనుకూలంగా సహకారం అందించాలి. కానీ నేను ఎవరైతే ఈ ప్రభుత్వాన్ని విమర్శించే పనిలో రిజర్వు బ్యాంకును కూడా విమర్శిస్తున్నారో వారికి చెప్పాలనుకుంటున్నాను. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు గారు తన పుస్తకం who moved my interest rate?లో ఈ విధంగా రాశారు. "2008లో అప్పటి ఆర్థిక కార్యదర్శి చేత ప్రభుత్వం ఒక లిక్విడిటీ మేనేజ్మెంట్ కమిటీని ఏర్పాటు చేసే విషయం పై నాకు కొంత ఇబ్బంది ఉండేది. చిదంబరం గారు భారతీయ రిజర్వ్ బ్యాంక్ కార్యక్షేత్రం లో జోక్యం చేసుకున్నారని స్పష్టంగా చెప్పబడింది. లిక్విడిటీ మేనేజ్మెంట్ అనేది పూర్తిగా రిజర్వు బ్యాంకు కార్యం. వారు ఈ విషయంపై నాతో సంప్రదింపులు చేయకపోవడమే కాకుండా, నోటిఫికేషన్ జారీ చేసినట్టు కూడా చెప్పలేదు. నా పదవి కాలంలోని చివరి సంవత్సరంలో ఇలాంటి నిర్ణయం తీసుకుని మా మధ్య ఒక అసహజ సంబంధానికి తెర తీస్తారని నేను అనుకోలేదు." ఇది మాజీ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ పాత ప్రభుత్వం పై చేసిన గంభీర ఆరోపణలు. ఈ విషయాలు ఈ పుస్తకంలో ప్రచురించాక కూడా ఎవరు జవాబు ఇవ్వలేదు. ఇప్పుడు నేను అడుగుతున్నాను కాబట్టి వారు జవాబు ఇస్తే అది వేరే విషయం. అందుకే నేను కూడా వారికి ఉపదేశం ఇస్తున్నాను వారిని వారు ఒకసారి చూసుకోవాలని. ఈ విషయాన్ని రాజకీయాలకి అతీతంగా ఉంచాలి. ఈ సంస్థ గౌరవాన్ని కాపాడే దిశగా మనం ప్రయత్నం చేయాలి.

మేము ఏమి చేసాం? ఆర్బిఐ శక్తిని పెంచాం. ఆ నిర్ణయం ఈ ప్రభుత్వం వచ్చాక తీసుకుంది. మేము ఆర్బీఐ చట్టాన్ని సవరించి, మానిటరీ పాలసీ కమిటీని స్థాపించాం. ఎన్నో

సంవత్సరాలుగా ఆ విషయాన్ని చర్చించారు కానీ ఎవరూ ఆ పని చేయలేదు, మేము చేశాం. ఈ సమితి కి మానిటరీ పాలసీ అమలు చేయడంలో పూర్తి స్వయంప్రతిపత్తి ఉంటుంది. ఈ సమితి అధ్యక్షుడిగా ఆర్బిఐ గవర్నర్ ఉంటారు. ఇద్దరు ఆర్బిఐ అధికారులు తో పాటు ముగ్గురు విశేషజ్ఞులు ఈ సమితి లో సభ్యులుగా ఉంటారు. కేంద్ర ప్రభుత్వం తరపున ఒక్క సభ్యుడు కూడా ఉండరు. ఇంతకంటే ఎక్కువ స్వయంప్రతిపత్తి ఏం కావాలి? మానిటరీ పాలసీ చాలా పెద్ద విషయం. ఇంత ఎక్కువ స్వయంప్రతిపత్తి ఎవరూ ఊహించలేరు, ఈ ప్రభుత్వం ఆర్బిఐ కి అది కల్పించింది. అందువల్ల ఆర్బీఐ శక్తి పెరిగింది.

ఇక్కడ ఎన్నో విషయాల పై చర్చ జరిగింది. ఏ ప్రభుత్వం కూడా ఇక్కడ నిద్రపోవడానికి రాదు. ఇంతకుముందు ఉన్న ప్రభుత్వాలు కూడా ఏదో ఒక పని చేశాయి మేము ఎవరూ ఏమీ చేయలేదని అనడం లేదు. నేను ఎర్ర కోట నుండి మాట్లాడినప్పుడు కూడా భారతదేశంలో ప్రధానమంత్రి మాట్లాడని మాట నేను చెప్పాను. నేను దేశం స్వాతంత్ర్యం సాధించినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నయితే ప్రభుత్వాలు వచ్చాయో, ఎవరైతే ప్రధాన మంత్రులుగా పనిచేశారో, ఎవరైతే దేశం కోసం పని చేశారో వీరు అందరి సహకారంతోనే ఈ రోజు దేశం ఇక్కడికి చేరుకుంది అని చెప్పాను. మేము అలాంటి వ్యక్తులం. వారు మాత్రం వేరొకరి పేరు తీసుకోవడానికి సంకోచిస్తారు. ఇంకొకరు ఏదైనా పని చేశారన్న విషయాన్ని చెప్పడానికి వారు ఇష్టపడరు. దానికి చరిత్ర సాక్ష్యం. ఈ ప్రభుత్వం మాత్రం పరిపాలన అనే విషయంపై చాలా పనిచేసింది. చిన్నచిన్న నిర్ణయాలే అయి ఉండొచ్చు, కానీ అవి ప్రజలకి బలాన్ని చేకూర్చే నిర్ణయాలు.

మన దగ్గర అఫిడవిట్ సాంప్రదాయం ఉంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పోరేటర్ ఇళ్ల చుట్టూ తిరిగి ఈ అఫిడవిట్లు చేయించుకునేవారు. క్యూలో జనం నిలుచునే వారు. వీటిని ఎవరూ చూసే వారు కాదు. ఒక ఫ్యూన్ కూర్చుని కొంతమంది కార్యకర్తలతో కలిసి స్టాంపు

వేసేవారు. మేము అలాంటి సర్టిఫికెట్లను సెల్ఫ్ అటెస్టేషన్ ద్వారా మార్పు తీసుకు వచ్చాము. అలా చేయడం వల్ల ప్రజలకి ఈ సమస్య నుంచి విముక్తి కల్పించాం. ఎప్పుడైతే ఒక వ్యక్తిని ఉద్యోగానికి నియమించడం జరుగుతుందో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకువెళ్తాడు. ఈ రోజుల్లో జిరాక్స్ లు ఉన్నాయి కాబట్టి ఇవన్నీ చేయాల్సిన అవసరం లేదు.

అలాగే మేము ఇంటర్వ్యూలు కూడా తొలగించాం. ఇప్పుడు టెక్నాలజీ ద్వారా ఒకరి యోగ్యతని చూసి, ఆ యోగ్యత ఆధారంగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. అందుచేత అవినీతి కూడా తగ్గింది. పదకొండు వందల కంటే ఎక్కువ చట్టాలను ఈ రెండు సభలు రద్దు చేశాయి. సీనియర్ పదవుల్లో నియామకం గురించి వార్తా పత్రికలలో ప్రచురించారు. మొదటిసారిగా యోగ్యత ఆధారంగా నియామకం జరిగింది. పాత పద్ధతులలో ఇది నీది అది నాది అని నడిచాయి. కొన్ని నిష్పక్ష పత్రికలు, కొన్ని మంచి కథనాలు రాశాయి.

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ ద్వారా లీకేజీలు ఆపడం జరిగింది. ఇంతకు ముందు ఒక కంపెనీని రిజిస్టర్ చేయడానికి ఏడు రోజుల నుంచి రెండు నెలల సమయం పట్టేది. ఈ రోజు అదే పని 24 గంటలలో జరిగిపోతుంది. ఇది మేము ఏర్పాటుచేసిన వ్యవస్థ. ఇంతకుముందు పాస్ పోర్ట్ తెచ్చుకోడానికి నెల రోజులు పట్టేది. ఈరోజు పాస్ పోర్ట్ ఒక వారం రోజులలో లభిస్తుంది. అలాగే పోస్ట్ హెడ్ ఆఫీస్ లో కూడా పాస్ పోర్ట్ లభించే సదుపాయాన్ని ఏర్పాటు చేశాం. వీటి ప్రయోజనం కూడా సామాన్య ప్రజలకు లభించనుంది. ఈ దిశగా మేము ప్రయత్నాలు చేస్తున్నాం.

బొగ్గు వేలం వేయడం ఎంత పెద్ద విషయమో మనందరికీ తెలుసు. కానీ ప్రభుత్వం దీన్ని సునాయాసంగా అమలు చేసింది. పారదర్శకత తీసుకువచ్చింది. ఒక పెద్ద ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నాం. దాని గురించి చర్చ కూడా జరిగింది, కానీ నేను ఈ సభకి ఒక

విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రభుత్వ కొనుగోళ్ల కోసం GeM ని ప్రవేశ పెట్టాము. గవర్నమెంట్ ఈ మార్కెట్ (GeM) వ్యవస్థని ప్రపంచ బ్యాంకు, సౌత్ ఆసియా ప్రొక్యూర్ మెంట్ ఇన్నోవేషన్ అవార్డ్ ద్వారా సన్మానించింది. అందులో ఇప్పుడు ప్రపంచంలో ఏ ప్రభుత్వానికయినా, సరుకు అమ్మాలంటే ఆన్ లైన్ లోకి వచ్చి వారి లిస్టుని పెడితే అందులో నుంచి నిర్ణయం తీసుకోవచ్చు. దీని వల్ల ఆర్థికంగా లాభమే కాకుండా ఐదు వేల రూపాయల కంటే ఎక్కువ చెల్లింపు చేయాల్సి వచ్చినప్పుడు జి ఈ ఎం ద్వారా చేయవచ్చు. ఆ దిశగా మేము వ్యవస్థని తీసుకువచ్చాం. అవినీతికి వ్యతిరేకంగా మంచి పరిపాలన మరియు టెక్నాలజీని ఉపయోగించి పారదర్శకత తీసుకురావడంలో మేము పెద్ద విజయాన్ని సాధించాము.

ఈ ప్రభుత్వం మహిళల సాధికారత దిశగా ఎన్నో కొత్త పథకాలను తీసుకువచ్చింది. వాటిలో ఉజ్వల యోజన ఒకటి. మనందరికీ తెలుసు గ్యాస్ సిలిండర్ లు ఒకప్పుడు ఎలా లభించేవో. ఒక ఎంపీ కి 25 దొరికితే ఆ 25 తీసుకోవడానికి ప్రజలు పెద్ద క్యూలో నిలబడే వారు. అలాంటి రోజులు కూడా ఉండేవి. 2014 ఎన్నికలలో తొమ్మిది సిలిండర్లు ఇద్దామా లేక 12 సిలిండర్లు ఇద్దామా అనేది ఒక ఎన్నికల అంశంగా మారింది. ఈ ప్రభుత్వం చేసే పనిలో చాలా తేడా ఉంది. పేద మహిళలకు గ్యాస్ పొయ్యి అనేది ఒక కలగా ఉండేది. వారు వాటి గురించి ఆలోచించగలిగే వారు కాదు ఇప్పటివరకు దాదాపు ఒక కోటి 60 లక్షల కంటే ఎక్కువ పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వబడ్డాయి. ఐదు కోట్ల కుటుంబాలకు ఇంకా ఈ సదుపాయాన్ని ఇవ్వబోతున్నాము. దేశంలో 25 కోట్ల కుటుంబాలలో అయిదు కోట్ల కుటుంబాలకు ఈ సదుపాయాన్ని కల్పించే ప్రయత్నం చేసాము.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన మహిళల పేరుపై ఇంటిని రిజిస్ట్రేషన్ చేసే చట్టాన్ని తీసుకు వచ్చాము. MGNREGA లో 55 శాతం మహిళలు ఈరోజు పనులు చేస్తున్నారు. ఇంతకు ముందు అది కేవలం 40 నుంచి 45 శాతం మాత్రమే ఉండేది.

ముద్ర యోజన కింద బ్యాంకులు ఏ విధమైన హామీ లేకుండా రుణాలు ఇస్తున్నాయి. రుణం తీసుకుంటున్న వారిలో 70 శాతం మంది మహిళలు అంటే మన దేశంలో మహిళలు వ్యాపార వ్యవస్థాపకులు గా ఎదుగుతున్నారు.

పండిత్ దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - దక్షిణ భారతదేశంలో స్వయం సహాయక బృందాలు కొంతవరకు పనిచేస్తున్నాయి. కానీ మొత్తం భారతదేశం, తూర్పు భారతదేశంలో వీటిని ప్రోత్సహించే దిశగా మేము చర్యలు తీసుకుంటున్నాం.

పేద గర్భవతుల కోసం ఐ ఎం ఆర్, ఎం ఎం ఆర్ కోసం ఆరువేల రూపాయలు కేటాయించాము. దేశంలో "బేటీ బచావో బేటీ పడావో" ప్రచారానికి గుర్తింపు లభించి ఒక ప్రజా ఉద్యమంగా రూపుదాల్చింది. సుకన్య సమృద్ధి యోజన - ఆడపిల్లల పేరు మీద ఒక కోటి ఎకౌంట్లు తెరవబడ్డాయి, 11 వేల కోట్ల రూపాయలతో వారి భవిష్యత్తుకి హామీని ఇచ్చాము. 14 లక్షల అంగన్వాడీ కేంద్రాలలో 500 కోట్ల రూపాయలతో మహిళా శక్తి కేంద్రాలను స్థాపించాము.

మిషన్ ఇంద్రధనుష్ - పిల్లలకి టీకాలు వేసే వారు కాదు. ప్రభుత్వాలు ఉండేవి, టీకా కార్యక్రమాలు కూడా జరిగేవి. కానీ, 55 లక్షల మంది పిల్లలు టీకాలు పొందలేదు. మిషన్ ఇంద్రధనుష్ ద్వారా అలాంటి పిల్లలను వెతికి వారి జీవితాలను కాపాడే దిశగా మేము పని చేశాము.

స్వచ్ఛత కార్యక్రమాలని ఎగతాళి చేయడం నన్ను ఆశ్చర్యపరిచింది. దీనికి కారణం ఏమిటో నాకు అర్థం కాలేదు. మనల్ని ఎవరూ కూడా అపరిశుభ్రంగా ఉండాలని కోరుకోరు.

స్వచ్ఛత అనేది ప్రవర్తన కి సంబంధించిన విషయం అని కూడా మనకి తెలుసు. దానికి తోడు మౌలిక సదుపాయాలు కూడా ఉండాలి. ఈ విషయంలో రాజకీయ నాయకులు వెనుకబడ్డారు. మన దేశంలోని మీడియా ఈ విషయంలో అభినందనీయమైన పనిచేసి స్వచ్ఛత కి సంబంధించిన ఈ విషయాన్ని వారు బాగా లేవనెత్తారు. ఈరోజు అన్ని మీడియా చానల్స్ ద్వారా స్వచ్ఛత విషయంలో పురస్కారాలు అందజేస్తున్నారు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈరోజు భారతదేశంలో స్వచ్ఛత గురించి చర్చిస్తున్నారు. సాధారణంగా మీడియా ప్రభుత్వం చేసే కార్యక్రమాలకి ప్రతికూలమైన కథనం ప్రసారం చేయడం స్వాభావికం. కానీ ఈ కార్యక్రమంలో ప్రభుత్వం కంటే ఎక్కువ,రాజకీయ నాయకుల కంటే కూడా రెండడుగులు ఎక్కువ వేసి మీడియా వారు స్వచ్ఛత అనే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా చేసే దిశగా ప్రయత్నాలు చేశారు. అందుకు వారికి ఈ సభ తరఫున అభినందనలు తెలియజేస్తున్నాను. కానీ ఇక్కడ మరుగుదొడ్లు ఉన్నాయి, కానీ మీరు లేవని అన్నారు. మహాత్మా గాంధీ గారు కూడా ఈ విషయంలో ఎంతో చేయాలనుకునేవారు. ఈరోజు మహాత్మా గాంధీ గారు ఉండి ఉంటే ఇదే సంకల్పాన్ని వారు చెప్పి ఉంటే మనం ఈ భాష మాట్లాడే వాళ్ళ మనకి బాధ్యత లేదా ఈ సమాజంలో మార్పు తీసుకువచ్చి ఏమైనా పనులు చేయలేమా? ప్రతి పనిలో మనం వ్యతిరేకించాలి. అందుకే గ్రామీణ క్షేత్రంలో పారిశుద్ధ్య పెరగడం నాకు ఆనందాన్ని ఇస్తుంది. ఇంతకుముందు 42 శాతం ఉండి ఉంటే ఈ ఈ ఉద్యమం ద్వారా 60 శాతానికి పెరిగింది. మేము మరుగుదొడ్ల గురించి మాట్లాడుతున్నప్పుడు మీరు ఊహించవచ్చు మహిళలే కాదు పట్టణాల్లో గుడిసెల్లో జీవించే మహిళలకు కూడా ఈ విషయంలో ఎంత ఇబ్బందిగా ఉంటుందో! చీకటి పడే వరకు వారు మరుగుదొడ్ల కి వెళ్ళలేరు. ఈ బాధ మనకి తెలియాలి. ఈ విషయం పట్ల ఎవరైనా తేలికగా మాట్లాడితే నాకు బాధ కలుగుతుంది. ఇది అవహేళన చేసే విషయం కాదు.

మహిళల భద్రత కోసం ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, 24 గంటల అత్యవసర సేవ ప్రారంభించాము. 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేశాం. అలాగే పోలీసుల్లో 33శాతం మహిళలని నియమించే దిశగా కొన్ని రాష్ట్రాలు కదిలాయి. కేంద్ర పాలిత ప్రాంతాలలో అయితే దీన్ని తప్పనిసరి చేశాం. హర్యానాలో ఒక కొత్త ప్రయోగం చేశారు, దీన్ని భారత దేశంలో మిగతా వారు కూడా చేయాలి. నేను అందరి ముందు దీన్ని ప్రస్తావించాను, వారు మహిళా పోలీసు వాలంటీర్ల నెట్ వర్క్ ని ఏర్పాటు చేసి ఎవరికైతే సహాయం కావాలో వారికి సహాయ పడుతున్నారు. ఒక కొత్త పథకాన్ని వారు ప్రారంభించారు. దీని అర్థం ఏమిటంటే. ఒక పానిక్ బట్టన్ నుంచి టెక్నాలజీ ద్వారా ఉపయోగించే సదుపాయాన్ని రాబోయే కొన్ని రోజుల్లో మీ ముందుకు తీసుకురానున్నాం.

రైతుల సాధికారత దిశగా ఈ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన. మనకు నచ్చినా నచ్చకపోయినా రైతుకు భద్రత కల్పించాలంటే, అతని రాబడికి మనం హామీ కల్పించాలి. మన వద్ద సాగు సదుపాయం చాలా తక్కువగా ఉంది అందుకే వారు సహజ వనరులపై నే ఆధారపడుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో వారు విత్తనాలు నాటక పోయినా లేదా కోతలు కోశాక నష్టం వాటిల్లినా వారికి భీమా లభిస్తుంది. కొన్ని అభ్యుదయ రాష్ట్రాలు 40 నుంచి 50 శాతం రైతులకు భీమా కల్పించే పని చేశాయి. ప్రభుత్వం కూడా రైతుల కోసం పెద్ద ఎత్తున పంట బీమా పథకాన్ని ప్రోత్సహించే పని చేస్తుంది. మునుపటి కంటే ఇప్పుడు ఈ బీమా ఎక్కువగా పెరిగింది. కానీ కొన్ని రాష్ట్రాలు మాత్రం ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఇది చింతించాల్సిన విషయం. అవి కూడా ముందుకు సాగాలి.

కొత్త ఎరువుల విధానం - యూరియా ఉత్పాదన. వేప పూత వల్ల రెండు లాభాలు జరిగాయి. ఒకటి భూమికి ఉపయోగకరం. అలాగే దిగుబడి కూడా పెరుగుతుంది. కానీ

ఒకప్పుడు రైతు పేరుతో సబ్సిడీ లభించేది, బిల్లు రైతు పేరు మీద ఉండేది, కానీ రసాయన పరిశ్రమల కి ముడిసరుకుగా ఆ యూరియా సరఫరా అయ్యేది. అలాగే సింథటిక్ పాల తయారీలో కూడా యూరియా ని ఉపయోగించేవారు. 100% వేపపూత చేయడంవల్ల భూమికి లాభం జరగడంతో పాటు ఇంకా ఎన్నో ఉపయోగాలు సంభవించాయి. దొంగతనం ఆగిపోయింది. యూరియా వల్ల నల్లధనం ఏర్పడడం లేదు. యూరియా లభించడం లేదని ముఖ్యమంత్రులు ఉత్తరాలు రాయడం లేదు. యూరియా కోసం క్యూలో నిలబడాల్సిన అవసరం లేదు. యూరియా కోసం ఎవరూ ఇబ్బంది పడటం లేదు. చిన్న మార్పు వల్ల ఇంత పెద్ద మార్పు లభించడం మీరు చూస్తున్నారు.

మనదేశంలో పప్పు దినుసుల ఉత్పత్తి - ఈ ప్రభుత్వం పప్పుల ఉత్పాదనను ప్రోత్సహించడానికి కృషి చేసింది. అందువల్ల ఈ రోజు దాదాపు 50 నుంచి 60 శాతం వృద్ధి జరిగే అవకాశం ఉంది. మనదేశంలోని రైతులు, ప్రభుత్వ మనవిని స్వీకరించి అన్ని రికార్డులు బద్దలు కొట్టి, ఈ పని చేశారు.

e-NAM, ఐదు వందల మార్కెట్ లలో ఎలక్ట్రానిక్ మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పుడు రైతు, టెక్నాలజీ సహాయంతో ఎక్కడ ధర ఎక్కువ ఉంటే అక్కడ తన ఉత్పత్తిని అమ్ముకోవచ్చు. ఈ ఐదు వందల మార్కెట్ల లో మొబైల్ ఫోన్ ద్వారా మన రైతులు వ్యాపారం చేసే పరిస్థితి లో లేరు. దాదాపు 250 మార్కెట్లు ఈ పనిని పూర్తి చేశాయి. రాష్ట్రాలు కొన్ని చట్టాలను మార్చాల్సి వస్తే వాటిని మార్చాయి. ఆహార తయారీపై మనం దృష్టిసారించినప్పుడే మన రైతులకు దాని వల్ల లాభం ఉంటుంది. ప్రభుత్వం ఆహార తయారీ రంగంలో 100% FDI అనుమతించింది. దానివల్ల అదనపు విలువ జోడించి మన రైతులకి ఎక్కువ ఆదాయం లభించేలా చూడవచ్చు. ఆ దిశలో మేము పని చేసే ప్రయత్నం చేస్తున్నాము.

ఆదివాసుల సాధికారత - దాదాపు 28 విభాగాలలో ఆదివాసులతో ఏదో ఒక సంబంధం ఉంటుంది. మేము మొదటిసారి ట్రైబల్ సబ్ ప్లాన్ ద్వారా నిధులు పెంచాము కానీ, వన బంధు కళ్యాణ్ యోజన ద్వారా ఒక సంపూర్ణమైన ప్రణాళిక ని తయారుచేసి ఫలితాలు సాధించాము. ఆ దిశగా ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి.

అడవి హక్కుల చట్టం - ఆ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి పని చేసాం. తెగలు నివసించే ప్రాంతాలలో, ఎందుకంటే మన దేశంలో ఎక్కువగా ఖనిజాలు, గనుల తవ్వకాలు ఈ గిరిజనులు నివసించే ప్రాంతాలలో ఎక్కువగా జరుగుతాయి. అది బొగ్గు అవ్వచ్చు, ఇనుము అవ్వచ్చు లేదా ఇంకేదైనా కానీ వారికి వీటివల్ల లాభం లభించదు. మొదటిసారి ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది, ఏ ప్రాంతాలలో ఖనిజాలు తవ్వబడతాయో, అక్కడ పన్ను విధిస్తాయి. నాకు చత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రి గారు చెప్పారు. వారీ ఏడు జిల్లాల్లో ఎక్కడైతే ఖనిజాలు తవ్వుతారో, ఈ పథకం ద్వారా పౌండేషన్ ఏర్పాటు చేశాక ఆ జిల్లాలలో అభివృద్ధి కోసం అదనపు బడ్జెట్ అవసరం పడలేదని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఆ పేద ఆదివాసీల కోసం ఉపయోగపడ్డాయి. ఆ దిశగా మేము పని చేశాము.

మేము Rurban మిషన్ తీసుకు వచ్చాము. ఆ పథకం ప్రయోజనం ఎక్కువగా ఆదివాసి క్షేత్రాలలో లభించనుంది. ఆదివాసి మార్కెట్లను ఒక పెద్ద మార్కెట్ గా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఆ మార్కెట్ అభివృద్ధి చెందితే, అక్కడ విద్యా వ్యవస్థ కూడా వస్తుంది, అక్కడ వైద్య సదుపాయాలు కూడా వస్తాయి, అలాగే వినోదం కోసం కూడా సదుపాయాలు వస్తాయి. నెమ్మదిగా పక్కనున్న 50 నుంచి 100 గ్రామాలకి అది కేంద్రంగా తయారు అవుతుంది, 'రర్బన్' ద్వారా గిరిజన ప్రాంతాల లో 300 అలాంటి కొత్త పట్టణాలు

తయారు చేసే దిశగా మేము పని చేస్తున్నాం. ఇది ఆదివాసి ప్రాంతాల అభివృద్ధి కోసం మేము చేస్తున్న చాలా పెద్ద కార్యం.

అలాగే పారిశుద్ధ్యం - నేను మొదట్లోనే చెప్పాను. పారిశుద్ధ్యం ఒక ప్రజా ఉద్యమం అవ్వాలని. ఆ దిశగా మన అందరము ఎంతో కొంత తోడ్పాటును అందించాలి. మేము స్వచ్ఛత విషయంలో స్వతంత్ర సంస్థల ద్వారా ర్యాంకు లు ఇవ్వడం మొదలు పెట్టాము. పట్టణాల మధ్య పోటీ ప్రారంభమైంది. ఒక పట్టణం ముందంజలో ఉంటే మరో పట్టణం ఆ పట్టణం ముందుకు వెళ్లి పోయింది మనం ఎందుకు శుభ్రత పాటించటం లేదని అడుగుతుంది. నెమ్మదిగా ఈ విషయం కిందకి పాకుతుంది. మనం ఆ విషయంపై దృష్టి సారించాలి. నేడు మన దేశం లోని అన్ని రాజకీయ పార్టీలకు ఎక్కడో ఒకచోట ప్రభుత్వాన్ని నడిపే అవకాశం లభించింది. కొన్ని పురపాలక సంస్థ లో ఉంటే, కొన్ని జిల్లా పంచాయతీ లో, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. మీకు మీ పార్టీ ప్రభుత్వంతో సేవ చేయించే అవకాశం లభించింది. మీరు వారితో కూడా పోటీ పడండి. మరి వామపక్షాల ద్వారా పాలించబడుతున్న పట్టణాల మధ్య స్వచ్ఛత పోటీ చేయండి. వామపక్షాల జిల్లా పంచాయతీల మధ్య స్వచ్ఛత పోటీ పెట్టండి. ఒక వాతావరణం తయారవుతుంది. అలాగే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా అక్కడి పురపాలక సంస్థల్లో పోటీ ఉండాలి. ఒక్కసారి ఈ పోటీలు ముందుకు వెళ్తే, నాకు తెలిసినంతవరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం సఫలమైనట్లు. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాదు ఇది ప్రజా ఉద్యమం కావాలి. ప్రవర్తనలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం అపరిశుభ్రత వల్ల ఆరోగ్యం కోసం దాదాపు రెండున్నర లక్షల కోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. మనం కొంత శ్రద్ధ వహిస్తే దేశానికి రెండున్నర లక్ష కోట్ల రూపాయలు ఆదా చేసిన వాళ్ల మవుతాం. పేదవారికి దీనివల్ల సంవత్సరానికి ఒక్కొక్కరికి 7 వేల రూపాయలు ఖర్చు

అవుతున్నాయి. అపరిశుభ్రత వల్ల రోగాలు రావడం స్వాభావికం. మనం దీని నుంచి రక్షించుకోగలము.

పిల్లలు చేతులు కడుక్కునే ఆహారం తినాలి. ఇది అందరూ ఒప్పుకుంటారు. ఈ మాట మనం అంటే ఎవరో ఒకరు అక్కడ నీరు లేవు, కుళాయి లేదు, బావి లేదు, పిల్లలు ఎలా వెళ్తారు? లాంటి ప్రశ్నలు అడుగుతారు. మనం ఈ విధంగా ఆలోచించాలా? ఈ విధమైన ఆలోచనే దేశాన్ని వెనక్కి నెట్టి వేసింది. మనం ఆలోచన చేయాలి, బయటికి రావాలి. కష్టాలు వస్తాయి, దారులు దొరుకుతాయి. కానీ మనం ఇంట్లో కూర్చుని పిల్లలు చేతులు కడుక్కోవాలి అని చెప్పి అక్కడ ఇది లేదు అది లేదు అని అనడం వల్ల లాభం లేదు. ఈ విధంగా దేశం మారదు. అందుకే మన మనస్తత్వం వలన ఈ దేశానికి చాలా నష్టం జరిగింది. ఈ మనస్తత్వం నుంచి మనం బయట పడాలి. మనం ప్రపంచాన్ని, మన పక్క దేశాల ని చూడాలి. అది సౌత్ కొరియా కానివ్వండి, మలేషియా కానివ్వండి, థాయిలాండ్, సింగపూర్ ఇవన్నీ చిన్న చిన్న దేశాలు, ఇవి పదిహేను సంవత్సరాలలో స్వచ్ఛత సాధించాయి. ఈరోజు అవి మనకి ఒక మోడల్ గా కనిపిస్తున్నాయి. మనం మన దేశంలో ఈ పని చెయ్యలేమా? మనకి కూడా అలాంటి కలలు ఉండాలి. చిన్న చిన్న దేశాలు అలాంటి పనులు చేస్తున్నప్పుడు మనం ఎందుకు చేయలేము? మనం ఆ దిశలో ప్రయత్నాలు చేయాలి. కానీ అప్పుడప్పుడు నాకే అనిపిస్తుంది. మన వద్ద ఏ విధమైన వాతావరణం ఉంది? ఎక్కడో ఒక కవి ఇలా చెప్పాడు. "ఈ పట్టణం మీది, మీరే హంతకులు, మీరే అమరులు, మీరే వైద్యులు." నాకు కచ్చితంగా తెలుసు నా తప్పే వెతుకుతారు. కానీ ఆ విషయం నుంచి మనం బయటికి రావచ్చు అని నేను అనుకుంటాను.

ఇంకో విషయం చెప్పి నేను నా మాట ని ముగిస్తాను. ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ అనే కార్యక్రమం 31 అక్టోబర్ న ప్రారంభించాము. సర్దార్ పటేల్ గారి జయంతి సందర్భంగా ఈ పనికి

శ్రీకారం చుట్టాము. మన దేశం ప్రపంచం లోని వేరే దేశాలతో సిస్టర్ స్టేట్ లేదా సిస్టర్ సిటీ గా ఏర్పడింది. ఇలా ఎన్నో సంవత్సరాల నుంచి జరుగుతుంది. కానీ మన దేశంలోని వేర్వేరు వ్యక్తులను కలిసే అలవాటు మనం చేసుకోలేదు. మనం ఈ విధంగా ప్రవర్తించడం వల్ల కొన్ని రాష్ట్రాలకు వారిని మనం వేరుగా చూస్తున్నామని వారు అనుకుంటున్నారు. మన దేశ సామర్థ్యాన్ని మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మేము ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమం ద్వారా ఆ ప్రయత్నం చేశాము. నేను ఈ సభలోని సభ్యులందరూ ఈ విషయాన్ని అర్థం చేసుకుని, మేము ముందుకు సాగడానికి సహాయపడాలని కోరుకుంటున్నాను. రెండు రాష్ట్రాల మధ్య ఒక ఒప్పందం జరిగినట్టు, ఇప్పుడు పన్నెండు రాష్ట్రాలు ఒకటితో ఒకటి అలాంటి ఒప్పందం చేసుకున్నాయి అని అనుకుంటున్నాను. హర్యానా, తెలంగాణ రాష్ట్రాలు అలాంటి ఒప్పందం చేసుకున్నాయి. హర్యానాలో తెలుగు భాషకు సంబంధించి 100 వాక్యాలు హర్యానా ప్రజలు చెప్పాలి. హాస్పిటల్ ఎక్కడ ఉంది, రిక్షా ఎక్కడ దొరుకుతుంది, హోటల్ ఎక్కడ ఉంది, పోలీస్ ఎక్కడ ఉన్నారు? ఇవన్నీ నేర్చుకో గలిగితే తెలంగాణ ప్రజలు హర్యానా భాష నేర్చుకుంటారు. హర్యానాలో తెలంగాణ చిత్రాల పండగ జరగాలి. హర్యానా వారి చిత్రాల పండగ తెలంగాణలో జరగాలి. క్విజ్ పోటీలు జరగాలి. తెలంగాణకు సంబంధించి క్విజ్ పోటీ లో హర్యానాలోని పిల్లలు పోటీ చేయాలి. ఒక ప్రకారం గా దేశాన్ని తెలుసుకునే ప్రయత్నం, దేశంతో కలిసే ప్రయత్నం. ఇలాంటి కార్యక్రమాన్ని మనం ప్రోత్సహించాలి. అప్పుడప్పుడు ఇలా అనిపిస్తూ ఉంటుంది హిందీలో కొన్ని పదాలు లేకపోవచ్చు కానీ తమిళ భాషలో కొన్ని మంచి పదాలు ఉండొచ్చు.కానీ మనకి తెలియదు. మరాఠీ లో కూడా కొన్ని మంచి పదాలు ఉంటాయి, బెంగాలీ లో కూడా మంచి పదాలు ఉన్నాయి, కానీ అవి మనకి తెలియవు. మనదేశంలో ఇంత శక్తి ఉంది. ఈ శక్తిని జోడించే దిశగా 'ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్' అనే కార్యక్రమాన్ని నిర్వహించి ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం.

నేను మరోసారి గౌరవనీయ సభ్యులు, వారి అభిప్రాయాలను ఇక్కడ వెల్లడించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మీరు నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్రపతి గారి ప్రసంగానికి నేను మద్దతు తెలుపుతూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. చాలా చాలా కృతజ్ఞతలు.

క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షికోత్సవం సందర్భంగా లోక్ సభలో జరిగిన ప్రత్యేక చర్చలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రసంగం.

9 ఆగస్టు 2017

క్విట్ ఇండియా ఉద్యమం 75 వ వార్షికోత్సవం -9 ఆగష్టు 2017

గౌరవనీయులైన స్పీకర్ మేడమ్, ఈ సంద్భంగా మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు, సభ లోని గౌరవ సభ్యులకు నా కృతజ్ఞతలు. పార్లమెంటులో ఆగస్టు క్రాంతిని స్మరించుకొనేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పాల్గొంటున్నందుకు మనమందరం ఎంతో గర్వపడుతున్నాము. ఆగస్టు 9, అంటే ఆగస్టు క్రాంతి నేపథ్యంలో జరిగిన ఘటనలను మనలో చాలా మంది గుర్తు చేసుకుంటున్నారు. ఆగస్టు క్రాంతి ఘటన జరిగి చాలా సంవత్సరాలు అయినప్పటికీ అటువంటి గొప్ప ఘటన, దానికి సంబంధించిన జ్ఞాపకాలు ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. అటువంటి సంఘటనలను గుర్తుకుతెచ్చుకోవడం ద్వారా మన జీవితాలకు ఒక కొత్త ఉత్తేజం వస్తుంది. ఇది జాతిని బలోపేతం చేస్తుంది. మనం పొందిన స్ఫూర్తిని, ఈ సందేశాన్ని నూతన తరాలకు చేరేలా చూసే బాధ్యత మనది. మన ముందు తరాలు మనకు అందించిన వారసత్వాన్ని, ఉజ్జ్వలమైన చరిత్రను, అప్పటి వాతావరణాన్ని, వారి త్యాగాలను, వారి బాధ్యతల గొప్పదనాన్ని, వారి కున్న సత్తాను తరువాతి తరాలకు అందించే బాధ్యత ప్రతి తరం మీదా ఉంటుంది.

ఆగస్టు క్రాంతికి 25 సంవత్సరాలు, 50 సంవత్సరాలు నిండిన సందర్భాలలో దేశవ్యాప్తంగా గల ప్రజలు ఉత్సవాలు జరుపుకొన్నారు. ఇప్పుడు మనం 75వ వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఇది మనం ఎంతగానో గర్వించదగ్గ క్షణం.. అందుకే ఈ అవకాశమిచ్చినందుకు స్పీకర్ మేడమ్‌కు నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆగస్టు 9కి చాలా ప్రాధాన్యం ఉంది. ఈ ఉద్యమం ఎంతో విస్తృతమైంది. చాలా బలమైంది. ఇది ఎంతో గొప్పదనే విషయాన్ని బ్రిటిషు వారు కూడా పసిగట్టలేకపోయారు.

మహాత్మ గాంధీతో పాటు అనేక మంది సీనియర్ నేతలను జైలులో పెట్టారు. ఇదే సమయంలో నూతన తరం నేతలు ముందుకు వచ్చారు. లాల్ బహదూర్ శాస్త్రి, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్ మొదలైన వారు లక్ష్య సాధన కోసం ఉద్యమం లోకి ప్రవేశించారు. దేశ చరిత్రలో ఈ ఉద్యమాన్ని ఒక కొత్త స్ఫూర్తిగా చూడాలి. ఒక నూతనోత్సాహాన్ని, నూతన నిర్ణయాలను, వినూత్న ఆలోచనలను ప్రజలకు అందించింది.

దేశానికి స్వాతంత్ర్యం 1947 లో లభించింది. 1857 నుండి 1947 వరకు మన దేశ స్వాతంత్ర్య ఉద్యమం అనేక దశలను చూసింది. దేశం కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారు. దేశం అనేక ఎత్తుపల్లాలు చూసింది. ఏదీ ఏమైనప్పటికీ, 1942 నాటికి ఉద్యమం అంతిమ ప్రజా ఉద్యమంగా అవతరించింది. దీనికోసమే దేశ ప్రజలందరూ ఎదురు చూశారు. స్వాతంత్ర్య సాధన కోసం కావలసిన క్షేత్ర స్థాయి కృషికి 1942 ఉద్యమం దోహదం చేసింది. ఒకసారి 1857 నాటి స్వాతంత్ర్య పోరాట ఉద్యమాన్ని గుర్తు చేసుకుందాం. ఆ సమయంలో దేశంలో మూలమూలనా స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రతిధ్వనించింది. ఆ తరువాత విదేశాల నుండి మహాత్మ గాంధీ తిరిగి వచ్చారు. సంపూర్ణ స్వరాజ్యం కావాలని, స్వాతంత్ర్యం నా జన్మహక్కని లోక మాన్య తిలక్ నినదించారు. తదనంతరం 1930 లో మహాత్ముని దండి మార్చ్ మొదలైంది. ఐఎన్ ఏను ఏర్పాటు చేసిన నేతాజీ సుభాస్ బోస్ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. వీర భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ గురు, చంద్రశేఖర ఆజాద్, చాపేకర్ బంధు వంటి వారు దేశం కోసం వారి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. ఈ తరహా అనేక ఘటనలు కలసి స్వాతంత్ర్య ఉద్యమానికి కావలసిన జోరునందించాయి. 'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ స్వాతంత్ర్యం సాధించలేం' అనే

పరిస్థితి తయారైంది. ఇవాళ దీనిని సాధించలేకపోతే, ఇది మరెన్నటికీ జరగదు; అనే మానసిక అవస్థ లో దేశ ప్రజలు ఉన్నారు. ఆ విధంగా దేశంలోని ప్రతి పౌరుడు ఈ ఉద్యమంలో పాల్గొన్నాడు. రాజాజీ ఉద్యమం ఉన్నత వర్గాల ద్వారా కొనసాగింది. ఏదీ ఏమైనప్పటికీ 1942 నాటికి దేశంలోని ప్రతి ప్రాంతానికి, ప్రతి సామాజిక వర్గానికి ఉద్యమం విస్తరించింది. దీనికి మార్గదర్శకం వహించిన శక్తులు గాంధీ గారి వాక్కులే. 'క్విట్ ఇండియా' నినాదం ప్రతి ఒక్కరి నోటి నుండివెలువడింది. ఈ ఉద్యమంలో కొట్టొచ్చినట్టు కనిపించే అంశాల్లో ఒకటి ఇక్కడ ప్రస్తావిస్తాను. ప్రజల మనసుల్లో ఉన్న భావోద్వేగాలు గాంధీ గారి ఆలోచనలు, విలువలతో విభేదించాయి. ఈ ఉద్యమ సమయంలో మహానుభావుడు గాంధీ గారు 'మనం దీనిని సాధించాలి లేదా చచ్చిపోదాం' అని పలికారు. ఈ నినాదం గతంలో ఆయన నుండి వెలువడలేదు. ఈ నినాదం మొత్తం జాతికి అపూర్వమైనటువంటిది. ఈ రోజు నుండి ప్రతి ఒక్కరు తమను తాము స్వతంత్ర వ్యక్తిగా పరిగణించుకోవాలని, అదే విధంగా జీవించాలని గాంధీ గారు ప్రకటించారు. దేశానికి పూర్తి స్థాయిలో స్వాతంత్ర్యం తప్ప మరో ప్రతిపాదనకు ఒప్పుకొనేది లేదని ఆయన అన్నారు. "వీ విల్ డూ ఆర్ డై" (విజయమో లేదా వీరస్వర్గమో) అని దేశానికి సందేశమిచ్చారు. ఇవి బాపూ నోటి నుండి వెలువడిన మాటలు. అంతే కాదు, తాను అహింసా మార్గాన్నుండి వైదొలగడం లేదని వివరణ కూడా ఇచ్చారు. ఆయన నాయకత్వ స్థానాన్ని తీసుకుంటున్న సమయంలో పరిస్థితి ఎలా ఉండేదంటే ప్రజల భావోద్వేగాలకు ఆయన తలవంచాల్సి వచ్చింది.

విజయమో వీరస్వర్గమో అనే నినాదం చేస్తూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలోకి దూకారు. గ్రామాలు కదిలాయి. రైతులు, కార్మికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉద్యమంలోకి ఉరికారు. బ్రిటిషు పాలకుల హింస కారణంగా ఎవరైనా ప్రాణ త్యాగం చేయాల్సి వస్తే వారి దేహం మీద ఈ నినాదం రాయాలని గాంధీ గారు అంటుండే వారు.

స్వాతంత్ర్య ఉద్యమ త్యాగశీలి కాబట్టే అలా రాయాలని అనే వారు. క్విట్ ఇండియా ఉద్యమాన్ని బాపూ పతాక స్థాయికి తీసుకు పోయారు. దాంతో బానిస సంకెళ్లను తెంపుకొని దేశం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. స్వాతంత్ర్యం కోసం దేశమంతా తీవ్రస్థాయిలో పోరాటం చేసింది. నేత కావచ్చు, సాధారణ పౌరుడు కావచ్చు ఎలాంటి తేడా లేకుండా అందరిలోనూ స్వాతంత్ర్యం కోసం ఒకటే తపన. దేశమంతా ఐకమత్యంతో ఉంటే, ఐకమత్య శక్తిని మనం సాధించగలిగితే, లక్ష్యానికి రూపకల్పన చేయగలిగితే, ఆ మార్గం గుండా ప్రజలు ప్రయాణం చేస్తారని నేను నమ్ముతాను.

1942 తరువాత అయిదు సంవత్సరాల్లోనే, అంటే 1947 నాటికి, దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ సమయంలో రామ్ వృక్ష్ బేణిపురి ఒక పుస్తకాన్ని రాశారు. దాని పేరు జంజీరే అవుర్ దీవారే. ఆ పుస్తకంలో ఆయన ఏం రాశాడంటే, దేశమంతా ఎంతో అద్భుతమైన వాతావరణం నిండివుంది. ప్రతి పౌరుడు ఒక నేత అయ్యాడు. ప్రతి చౌరస్తా డూ ఆర్ డై నినాద ఉద్యమానికి వేదికగా మారింది. విప్లవ భావాలతో దేశమంతా రగిలిపోయింది. విప్లవ జ్వాలలు దేశమంతా విస్తరించాయి. దీనికి బొంబాయి దారి చూపింది. అన్ని రకాల రవాణా మార్గాలు స్తంభించిపోయాయి. న్యాయస్థాన కార్యకలాపాలు నిలచిపోయాయి. భారత దేశ ప్రజల ధైర్య సాహసాల వార్తలు, బ్రిటిషు పాలకుల రాక్షసత్వ చర్యల వార్తలు దేశంలోని ప్రతి మూలకు చేరాయి. ఆ విధంగా దేశ ప్రజలు గాంధీ గారు ఇచ్చిన డూ ఆర్ డై నినాదాన్ని సరైన రీతిలో ఆచరించారు. విస్తరింపచేశారు.

ఆ రోజుల్లో నెలకొన్న వాతావరణాన్ని గురించి, ఆ సమయంలో నెలకొన్న పరిస్థితులను గురించి ఈ పుస్తకంలో వివరణ ఉంది. బ్రిటిషు వలసవాదం భారతదేశంలో మొదలై భారతదేశంలోనే అంతమైందనేది వాస్తవం. భారతదేశ స్వాతంత్ర్య సాధన గురించి మాత్రమే కాదు. 1942 అనంతరం మన ఉద్యమ స్ఫూర్తి ప్రపంచమంతా విస్తరించింది. ఇతర దేశాల్లో గల

బ్రిటిషు వలస పాలనకు వ్యతిరేకంగా అక్కడి పౌరులను కదిలించింది. ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని పలు దేశాల్లో గల వలస పాలన నుండి విముక్తిని పొందడానికి ఆ దేశ పౌరులకు మన పోరాటం స్ఫూర్తినిచ్చింది. ప్రపంచం లోని పలు ప్రాంతాలకు మన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని విస్తరించడమనేది మన పౌరుల త్యాగాలకు నివాళిగా నిలచింది.

ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమిది. భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తే ఇతర దేశాలకు కూడా తప్పకుండా బ్రిటిషు పాలన నుండి విముక్తి లభిస్తుందని ఆనాడు మనం అనుకున్నాము. భారతదేశం ప్రజల పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోందనడానికి ఇదే ఉదాహరణ. ఉద్యమం మనకు నేర్పే పాఠం ఏదంటే, ఒక పనిని సాధించాలనే పట్టుదల మనలో ఉంటే మన క్రమంగా మన ఆశించిన లక్ష్యాన్ని చేరుకోగలము. అలా లక్ష్యాన్ని చేరుకొనే పట్టుదల అనేది దేశానికి బలమవుతుంది. తద్వారా మనం మన దేశాన్ని సంక్షోభాన్నుండి బయటపడేయగలుగుతాము. అంతే కాదు, కొత్త లక్ష్యాలకు అనుగుణంగా పోరాటాన్ని రూపొందించగలము. ఈ వాస్తవానికి చరిత్రే సాక్ష్యం. ఆ రోజుల్లో జాతీయ కవి సోహన్ లాల్ ద్వివేది రాసిన కవిత్వం బాపూ శక్తిని, ఉద్యమాన్ని, ఆ నాటి వాతావరణాన్ని చాలా స్పష్టంగా వర్ణించింది. ఆయన తన కవితలో ఏమన్నారంటే..

चल पड़े जिधर दो डग, मग में

चल पड़े कोटि पग उसी ओर

गड़ गई जिधर भी एक दृष्टि

गड़ गए कोटि दृग उसी ओर

ఈ కవితకు అర్థం మహాత్మ గాంధీ మార్గాన్ని లక్షలాది మంది అనుసరించారు. గాంధీ గారు తన దృష్టిని దేనిమీదనైతే కేంద్రీకరించారో లక్షలాది దేశ పౌరుల దృష్టి కూడా దాని మీదనే

ఉండేది. ఇక ప్రస్తుతానికి వస్తే, 2017లో మనకు గాంధీ గారు లేరనే వాస్తవాన్ని మనం అంగీకరించాలి. స్వాతంత్ర్య సమయంలో మన దేశంలో ఉన్న నాయకత్వ స్థాయి ఇప్పుడు లేదు. కానీ మనకు 125 కోట్ల మంది ప్రజలున్నారు. మనందరం ఐకమత్యంగా నిలబడి కృషి చేస్తే గాంధీ గారి కలల్ని, ఇతర స్వాతంత్ర్య సమరయోధుల కలల్ని నిజం చేయవచ్చు.

ఈ రోజున ఈ 2017లోనూ 1942 నాటి ఆందోళనకర పరిస్థితి ఉంది. ప్రపంచం ప్రస్తుతం సంక్షోభంలో చిక్కుకొని ఉంది. 1942 లో చేసిన పోరాటాల ద్వారా మనం ఎలాగైతే ప్రపంచానికి ఆదర్శంగా స్ఫూర్తిగా నిలచామో అలాగే మనం ఇప్పటి ప్రపంచానికి స్ఫూర్తిని ఇవ్వడానికి ఆస్కారముంది. ప్రపంచం మన ముందు ఉంచిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ బాధ్యతను ఎలా తలకెత్తుకోవాలి ? చారిత్రక ఘట్టాల నుండి మనం స్ఫూర్తిని తీసుకోవచ్చని నేను నమ్ముతున్నాను. దేశాన్ని పార్టీలకు అతీతంగా చూడాలి. దీని నుండి రాజకీయాలను విడదీయాలి. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు మన దేశంలోని 125 మంది ప్రజల సాయంతో పరిష్కారాలను విజయవంతంగా అన్వేషించి చాలా సులువుగా ప్రగతిని సాధించవచ్చు. అవినీతి అనేది చెద వంటిది. అది చెద మాదిరిగానే దేశాన్ని ధ్వంసం చేయగలదు. రాజకీయ అవినీతి కావచ్చు, సాంఘిక అవినీతి కావచ్చు, వ్యక్తిగతమైన అవినీతి కావచ్చు.. అది దేశాన్ని నాశనం చేస్తుంది. అవినీతిలో ఎవరున్నారు, ఎప్పుడున్నారనే వివాదంలోకి మనం వెళ్లొద్దు. ఈ రోజు ఎంతో పవిత్రమైన రోజు. ఈ వేడుకను ఎంతో నిజాయితీగా జరుపుకోవాలి. దేశాన్ని నిజాయితీగా ముందుకు తీసుకు పోవాలి. ఇది దేశంలోని సాధారణ పౌరుని వాంఛ. పేదరికం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత అనేవి మన ముందు ఉన్న సవాళ్లు. వీటిని ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లుగా పరిగణించవద్దు. ఇవి దేశం ఎదుర్కొంటున్న సవాళ్లు. మన దేశంలోని పేద ప్రజల మనస్సులలో అనేక కఠినమైన ప్రశ్నలు ఉన్నాయి. కాబట్టి మనందరం దేశ సవాళ్లను పరిష్కరించే నిబద్ధతను కలిగి

వుండడమనేది మన బాధ్యత. దేశం కోసం ప్రాణత్యాగం చేయాలి. 1942 ఉద్యమంలో దేశంలోని వివిధ వర్గాలు పాల్గొన్నాయి. అప్పుడు హింస పైన నమ్మకమున్నవారి తీరు వేరు. సుభాష్ బోస్ ఆదర్శాలు విభిన్నమైనవి. అయితే అందరూ కలిసి ఒకే నినాదం చేశారు.. 'క్విట్ ఇండియా' అన్నారు. గాంధీ నాయకత్వంలో ఇదే మన మార్గంగా ఉండింది.

మన పెంపకం, ఆదర్శాలు వేరు వేరు కావచ్చు. కానీ ఈ రోజు మన దేశం ఎదుర్కొంటున్న పేదరికం, ఆకలి, నిరక్షరాస్యత లాంటి సవాళ్ల నుండి దేశాన్ని విముక్తి చేయగలిగే అవకాశాన్ని మనం స్వీకరించాలి.

గ్రామ స్వరాజ్య సాధన అనే మహాత్మ గాంధీ కలను మనం ఎందుకు పక్కన పెట్టేశాం ? ఎందుకు ప్రజలు తమ గ్రామాలను వదిలేసి నగరాల్లో నివాసముంటున్నారు ? గ్రామాలకు సంబంధించి గాంధీ గారిని కలవరపెట్టిన సమస్య ఏది ? ఆయన కలను మనం సాకారం చేయలేమా ? దేశంలోని పేద రైతుల కోసం, దళితుల కోసం, అణగారిన వర్గాల కోసం మనం ఏమైనా చేయలేమా ? ఇవి ఏవో ఒక వ్యక్తిలో కలుగుతున్న ప్రశ్నలు కావు. లేదా ఒక సమూహానికి సంబంధించినవి కావు. ఈ ప్రశ్నలు దేశంలోని 125 కోట్ల మందికి సంబంధించిన ప్రశ్నలు. క్విట్ ఇండియా స్ఫూర్తి ఇస్తున్న శక్తితో దేశ పౌరుల కోసం ఏదైనా చేయాల్సిన సమయమిది. ఈ శక్తిని ఉపయోగించుకోవాలి. మనకు తెలుసు కొన్ని సార్లు విధులు నిర్లక్ష్యానికి గురవుతాయి. అధికారం దుర్వినియోగమవుతుంది. ఇది రాజకీయ జీవితంలోనూ, సామాజిక జీవితంలోను జరుగుతుంటుంది. దురదృష్టం కొద్దీ ఇటువంటి చెడ్డ లక్షణాలు మనలోని కొంతమంది జీవితాల్లోకి ప్రవేశించాయి. అవే వారి జీవన విధానమయ్యాయి. ఎర్ర లైటు పడినప్పుడు వాహనంతో దూసుకుపోయినా పశ్చాత్తాప పడడం లేదు. చట్టాన్ని గౌరవించడం లేదనే భావన కలగడం లేదు. రహదారుల మీద ఉమ్మి వేసే వారు వాళ్లు తప్పు చేస్తున్నట్టు అనుకోవడం లేదు. నియమ నిబంధనలను అధిగమించడం మన జీవన

విధానమైపోయింది. చాలా చిన్న చిన్న ఘటనలు కూడా మనల్ని హింసకు పురికొల్పుతున్నాయి. వైద్యుడిది తప్పు అయినా కాకపోయినా, ఆసుపత్రి తప్పు చేసినా చేయకపోయినా వైద్యుని మీద దాడి చేసి ఆసుపత్రిని తగలబెడుతున్నాము. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు దానికి కారణమైన కారును తగులబెట్టి, డ్రైవరు ను చంపేస్తున్నాం. చట్టాలను గౌరవించే పౌరులుగా మనము మన బాధ్యతలను సరిగా నిర్వహించాలి. మన జీవితం లోకి కొన్ని అవలక్షణాలు వచ్చి చేరాయి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నామని మనం భావించడం లేదు. అందుకే ఇటువంటి పరిస్థితుల్లో దేశ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించి, సమాజం బాధ్యతగా మెలిగి సమాజంలో విస్తరించిన ఈ మాదిరి అవలక్షణాలను తరిమికొట్టాలి. సామాజిక విధుల నిర్వహణ కోసం అందరూ మేలుకోవాలి.

మరుగుదొడ్లను, పరిశుభ్రతను నిర్లక్ష్యం చేసి వాటిని ఎగతాళి చేయవద్దు. దేశం లోని ఎంతో మంది తల్లులు, సోదరీమణులు వారి జీవితాల్లో నిండిన చీకటిలో నుండి బయటపడడానికి చాలా కాలం పాటు ఎదురుచూశారు. దేశ ఆలోచనా విధానంలో మార్పు రావాలి. మరుగుదొడ్లను వినియోగించుకొనేలా ప్రజల్లో చైతన్యం తేవడం చాలా ముఖ్యం. ఈ విషయంపట్ల మనం జాగ్రత్తగా ఉండాలి. చట్టాల వల్ల ఇటువంటి విలువలు విస్తరించవు. మన విధిని, బాధ్యతను మనం అర్థం చేసుకోవాలి. చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్న మన మాతృమూర్తులు, సోదరీమణుల గురించి మనం ఆలోచించవలసిన తరుణమిది.

దేశం లోని ఒక వర్గానికి చెందిన ప్రజలు, అందులోనూ మహిళల ఇబ్బందులను, దేశం తొలగించాలి. వారి బలాలు మనకు బలాన్నిస్తాయి. మహాత్మ గాంధీ గారు స్వాతంత్ర్య పోరాటాన్నినడిపించినప్పుడు మన మాతృమూర్తులు, సోదరీమణులు ముందుండి పని చేశారు. అందరితో పాటు సమానంగా సమరంలో వారి వంతు పాత్రను పోషించారు. ఈ రోజుల్లో

కూడా జాతి ప్రగతి కోసం వారు కృషి చేస్తున్నారు. వారిని ప్రగతి పథంలో నడిపించడానికి మనం ఈ విధి నిర్వహణలో ముందుకు పోవాలి.

1857 నుండి 1942 వరకు దేశ స్వాతంత్ర్య సమరం అనేక దశలలో ముందుకు సాగింది. అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. అనేక మలుపులు తిరిగింది. అనేక మంది నాయకత్వాలను చూసింది. కొన్ని సార్లు మన పోరాటం హింసాత్మకంగా కొనసాగింది. ఆ తరువాత అహింసకు పట్టం కట్టాము. హింసను, అహింసను నమ్ముకొనే ఇరు వర్గాలు కొంతకాలం ఘర్షణ వాతావరణం లోకి వెళ్లాయి. మరికొన్నిసార్లు ఇరు వర్గాలు ఒకరిని మరొకరు మెచ్చుకున్నాయి. అయితే ఈ దశలన్నీ 1857 నుండీ 1942 వరకు క్రమక్రమంగా కొనసాగడం చూశాము. పోరాటం క్రమక్రమంగా పెరిగింది. విస్తరించింది. చాలా నెమ్మదిగా ప్రజలు పోరాటంతో మమేకమవుతూ వచ్చారు. కానీ 1942 నుండి 1947 వరకు ఉన్న దశలో తగ్గుదల లేదు. విధ్వంసపూరిత వాతావరణం వచ్చేసింది. దాంతో బ్రిటిషు పాలకులు మనతో ఉన్న సంబంధాలను తెంపుకొని, స్వాతంత్ర్యం ఇవ్వడానికి ఒప్పుకొన్నారు. వారిని బలవంతంగా పంపించివేశాము. 1857 నుండీ 1942 వరకూ ప్రతిదీ నెమ్మదిగా ముందుకు సాగింది. కానీ 1942 నుండీ 1947 వరకు అలా జరగలేదు.

గత వందేళ్లు, రెండు వందల ఏళ్ల చరిత్రను తీసుకొంటే, అభివృద్ధి ప్రయాణమనేది ఒక నిర్ణీత క్రమంలో కొనసాగింది. ప్రపంచం నెమ్మదిగా ముందుకు సాగింది. క్రమక్రమంగా ప్రపంచం తనను తాను మార్చుకొంది. కానీ గత 30- 40 సంవత్సరాలను తీసుకుంటే, ప్రపంచవ్యాప్తంగా అకస్మాత్తుగా అనేక మార్పులు. సాంకేతిక విజ్ఞానం చాలా పెద్ద పాత్ర పోషిస్తోంది. ఈ 30- 40 సంవత్సరాలలో ఈ ప్రపంచంలో వచ్చిన మార్పులను ఎవరూ ఊహించలేదు. 30, 40 సంవత్సరాల క్రితం ఈ మార్పును పసిగట్టలేకపోయాము. సమస్యల కారణంగా ధనాత్మకమైన

మార్పును మనం చూడగలుగుతున్నాము. 30 -40 సంవత్సరాల అభివృద్ధిలో పెను మార్పులు చూసినట్టే మనము దీనిని చూడాలి.

2017, 2022 లను తీసుకోండి. క్విట్ ఇండియా ఉద్యమానికి 2017తో 75 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 సంవత్సరాలు అవుతుంది. అంటే ఈ రెండు సందర్భాల మధ్య అయిదు సంవత్సరాల సమయం ఉంది. 1942 నుండి 1947 మధ్య దేశంలో నెలకొన్న వాతావరణమే ఇప్పుడూ విస్తరించింది. 2022 లో దేశ స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవ వేడుకను జరుపుకొంటాము. స్వాతంత్ర్య సమర యోధులు కన్న కలల్ని ఆ వేడుక నాటికల్లా సాకారం చేసుకోవాలి. మనము తీసుకొన్న నిర్ణయాలను ముందుకు తీసుకు పోవాలి. దీని వల్ల దేశం ప్రగతిని సాధిస్తుందని నేను నమ్ముతున్నాను. అంతే కాదు, మనము గతంలో 1942 నుండి 1947 వరకు చేసిన పోరాట కృషితో సాధించిన విజయం ఆ నాడు అనేక దేశాలకు స్ఫూర్తినిచ్చి ఆయా దేశాలకు లబ్దిని చేకూర్చింది. స్వాతంత్ర్య కాంక్షను రగిల్చింది. ఆయా దేశాల సామర్థ్యాలను వెలికి తీసింది. అప్పుడు మనం ఇచ్చిన స్ఫూర్తిలాగానే ఇప్పుడు మన దేశం 2017నుండి 2022 వరకు చేసే కృషి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. మనం ఈ బాధ్యతను నిర్వహించి దేశాన్ని ప్రపంచం ముందు సగర్వంగా నిలపాలి. ఇప్పటి నాయకత్వం ముందున్న లక్ష్యం ఇదే. ఈ కృషిలో అందరం ఐకమత్యంగా నిలిస్తే, అది దేశానికి చేసే ఉన్నతమైన సేవ అవుతుంది.

అనేక అంశాలలో అందరమూ ఏకతాటి మీద నిలబడితే మనం చాలా సాధించగలమనే నమ్మకం నాలో ఉంది. మనం ఈ మధ్యే 'వస్తువులు, సేవల పన్ను' (జిఎస్ టి) అమలు లోకి రావడాన్ని చూశాము. ఇది రాజకీయ పరమైన ప్రకటన కాదని నేను పదే పదే చెబుతున్నాను. నా మనస్సాక్షి ప్రకటన. జిఎస్ టి సాధించిన విజయం ప్రభుత్వ విజయం

కాదు. జిఎస్ టి విజయం ఏదో ఒక పార్టీ సాధించిన విజయం కాదు. పార్లమెంటులో కూర్చున్న ఈ సభ్యుల మనోశక్తి కారణంగానే ఇది విజయవంతం అయింది. పార్లమెంటులో చట్టంగా మారిన జిఎస్ టి అన్ని రాష్ట్రాలకు విస్తరించింది. సాధారణ వ్యాపారి దగ్గరకు వెళ్లింది. అందువల్లనే ఇది విజయం సాధించింది. దేశ రాజకీయ నాయకత్వం తనకు ఉన్నటువంటి నిబద్ధత కారణంగా ఈ అమోఘమైన పనిని చేయగలిగింది. ఇది ప్రపంచంలోనే మొదటిసారి సాధించిన విజయం. మనం అమలు చేస్తున్న జిఎస్ టి ప్రపంచానికి ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇది సాధ్యమైనప్పుడు, భవిష్యత్తులో పార్లమెంటులో కూర్చొని అనేక నిర్ణయాలను చాలా సులువుగా తీసుకోవచ్చు. 125 మంది ప్రజల ప్రతినిధులుగా 2022 నాటికి సాధించవలసిన లక్ష్యాలను అందుకోవడానికి మనము ముందుకు సాగాలి.

'డూ ఆర్ డై' అనే నినాదాన్ని మహాత్మ గాంధీ గారు ఇచ్చారు. అది ఆ నాటి ఫార్ములా. ఇదే నినాదంతో 2017లో ముందుకుపోతే 2022 నాటికి భారతదేశంలో అవినీతి తొలగిపోతుంది. పేదలను ఏకం చేసి వారి హక్కులు వారికి దక్కేలా చేయాలి. ఐకమత్యంగా నిలచి మన యువతకు స్వతంత్రోపాధి అవకాశాలను కల్పించాలి. మనందరం ఏకతాటి మీద నిలచి, దేశంలో పోషకాహార లేమిని లేకుండా చేయాలి. మన మహిళలు ప్రగతిని సాధించకుండా అడ్డుపడుతున్న వాటిని అందరం కలసి తొలగించాలి. ఐకమత్యంగా నిలచి దేశంలో నిరాక్షరాస్యతను పారద్రోలాలి. ఈ క్రమంలో ఎన్ని సమస్యలైనా రావొచ్చు. డూ ఆర్ డై నినాదాన్ని మన మనస్సుల్లో నిలుపుకొని ముందుకు సాగాలి. ఈ తీర్మానాలు ఏదో ఒక పార్టీవి కావు. ప్రభుత్వానికి చెందినవి కావు. ఇవి దేశంలోని 125 కోట్ల ప్రజల తీర్మానాలు. ఈ రోజున ఆగస్టు విప్లవ దినాన, నాటి స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకొంటూ, వారి త్యాగాలను, తపస్సును గుర్తు చేసుకుంటూ వారి ఆశీర్వాదాలను కోరుకుంటూ మనందరం ఐకమత్యంగా నిలబడి దేశాన్ని ప్రగతి దిశగా తీసుకు పోదాము. ఇందుకుగాను అందరమూ

కొన్ని విషయాల్లో ఏకీభవించాలి. అవేంటంటే, మన కలల్ని సాకారం చేసుకొని శక్తి సామర్థ్యాల్ని పొందడానికిగాను, లక్ష్యాలను చేరుకోవడానికిగాను ముందుగా సమస్యల నుండి దేశాన్ని విముక్తం చేద్దాము. ఈ ఆకాంక్షతో మేడమ్ స్పీకర్ కు మరోసారి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను; స్వాతంత్ర్య సమరయోధులకు నేను నా శిరస్సును వంచి ప్రణమిల్లుతున్నాను.

2018



ఆయుష్మాన్ భారత్ యోజన లబ్ధిదారులతో శ్రీ నరేంద్ర మోదీ సంభాషణ.

"ఆరోగ్యకరమైన కుటుంబం మరియు ఆరోగ్యకరమైన సమాజం నుండే ఒక ఆరోగ్యకరమైన దేశాన్ని సృష్టించగలం."

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

7 ఫిబ్రవరి 2018

లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 7 ఫిబ్రవరి 2018

గౌరవనీయులైన స్పీకర్ మేడమ్,

గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ముందు ఆ ప్రతిపాదనకు మద్దతుగా సభలో కొన్ని విషయాలను తెలియచేయాలని నేను అనుకొంటున్నాను. ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై పలువురు సభ్యులు వారి అభిప్రాయాలను నిన్న వెల్లడించారు. శ్రీ మల్లికార్జున్, శ్రీ మహ్మద్ సలీమ్, శ్రీ వినోద్ కుమార్, శ్రీ నరసింహం తోట, శ్రీ తారీఖ్ అన్ వర్, శ్రీ ప్రేం సింగ్, శ్రీ అన్ వర్, శ్రీ జయ్ ప్రకాశ్ నారాయణ్ యాదవ్, శ్రీ కల్యాణ్ బెనర్జీ, శ్రీ పి. వేణుగోపాల్, శ్రీ ఆనందరావు అడ్ సుల్, శ్రీ ఆర్.కె. భారతి మోహన్ సహా 34 మంది గౌరవ సభ్యులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తీర్మానం పైన సవివరమైన చర్చ జరిగింది. కొందరు తీర్మానానికి అనుకూలంగా, మరికొందరు వ్యతిరేకంగా మాట్లాడారు. కానీ అర్ధవంతమైన చర్చ చోటు చేసుకొంది. రాష్ట్రపతి ప్రసంగం ఏ పక్షానికీ ఆపాదించలేము. ఆయన ప్రసంగం ఎల్లప్పుడూ దేశ ప్రజల ఆశలను, ఆకాంక్షలను ప్రస్తావిస్తూ ఆ దిశగా తీసుకొంటున్న చర్యలను వివరిస్తుంది. ఆ కోణంలో రాష్ట్రపతి ప్రసంగాన్ని అందరూ గౌరవించాలి. కేవలం వ్యతిరేకించాలన్న కాంక్షతో దానిని వ్యతిరేకించడం ఎంత వరకు సమంజసం ?

స్పీకర్ మేడమ్,

దేశంలో కొన్ని రాష్ట్రాలను గౌరవనీయులైన శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి కూడా ఏర్పాటు చేశారు. మూడు కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఉత్తర్ ప్రదేశ్ నుండి ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్ నుండి ఛత్తీస్ గఢ్, బిహార్ నుండి ఝార్ ఖండ్ ను వేరు చేశారు. అయితే నాటి

ప్రభుత్వం ఎంత దూరదృష్టితో వ్యవహరించిందంటే ఆ రాష్ట్రాల విభజన, అధికార బదిలీ, తదితర లాంఛనాలన్నీ ఎంతో సరళంగా సాగిపోయాయి. నాయకత్వానికి దూర దృష్టి ఉంటే సరైన నిర్ణయాలే తీసుకుంటారు; రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తొందరపాటు నిర్ణయాలను తీసుకోరు. శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి ఆ మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేయడం ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలచిపోతుంది. మీరు దేశాన్ని విభజించి విషబీజాలను నాటారు. 70 సంవత్సరాల స్వాతంత్ర్యం అనంతరం కూడా నేడు మీ పాపాల ఫలితాలను 125 కోట్ల మంది భారతీయులు అనుభవిస్తున్నారు.

ఆ విధంగా మీరు దేశాన్ని విచ్ఛిన్నం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాడు పార్లమెంట్ తలుపులను మూసివేసి, సభ లో గందరగోళం నిండి ఉండగా తెలంగాణ ఏర్పాటుకు తొందరపాటుగా చర్యలు తీసుకొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజల మనోభావాలను మీరు పరిగణన లోకి తీసుకోలేదు. మేం కూడా తెలంగాణ ఏర్పాటు కు అనుకూలమే, ఈ రోజు కూడా తెలంగాణ పురోగతి నే కోరుతున్నాం. కానీ మీరు ఆంధ్ర కు నాటిన విత్తనాలు, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాన్ని విభజించేందుకు మీరు ప్రదర్శించిన తొందరపాటు నాలుగు సంవత్సరాల అనంతరం సైతం సమస్యలకు కారణం అవుతున్నాయి. అలాంటి చర్యలను మీ నుండి ఆశించలేదు.

స్పీకర్ మేడమ్,

నిన్న కాంగ్రెస్ నాయకుడు శ్రీ ఖర్గే ప్రసంగాన్ని నేను విన్నాను. ఆయన అధికార పక్షాన్ని ఉద్దేశించి మాట్లాడారా, లేక కర్నాటక ప్రజలను ఉద్దేశించి మాట్లాడారా, లేక తమ పక్షం లోని విధానకర్తల ప్రాపకం కోసం మాట్లాడారా అనేది నేను అర్థం చేసుకోలేకపోయాను. ఆయన బషీర్ బదర్ గారి పద్యమొకటి చదివారు. ఆ పద్యాన్ని కర్నాటక ముఖ్యమంత్రి కూడా

వినే వుంటారని నేను అనుకొంటున్నాను. “దుశ్ మనీ జమ్ కర్ కరో, లేకిన్ యే గుంజాయిష్ రహే, జబ్ కభీ హమ్ దోస్త్ హో జాయే, తో శర్మిందా న హో” అంటూ సాగిన ఆ పద్యానికి.. వైరంలోనూ తిరిగి స్నేహితులు కావడానికి ఎంతో కొంత అవకాశం ఉంటుంది.. అని భావం.

దీనిని కర్నాటక ముఖ్యమంత్రి కూడా విని వుంటారని నేను భావిస్తున్నాను. బషీర్ బదర్ గారి పద్యం లోని ఇతర వాక్యాలను కూడా శ్రీ ఖర్గే చదివి వుంటే బాగుండేది. అప్పుడు మీ భావాలు ఏమిటన్నది దేశానికి తెలిసి ఉండేది. అదే పద్యంలో బషీర్ బదర్ గారు ఇది కూడా చెప్పారు..

“జీ చాహ్ తా హై సచ్ బోలో, జీ బహుత్ చాహ్ తా హై సచ్ బోలో, క్యా కరే, హౌస్ లా నహీ హోతా”.. అని. అయితే ఈ సత్యాన్ని చెప్పే ధైర్యం ఆయనకు లేదు.

కర్నాటక ఎన్నికల తరువాత శ్రీ ఖర్గే అదే స్థానంలో ఉంటారో లేదో నాకు తెలియదు. ఆ రకంగా ఇది ఆయన వీడ్కోలు ప్రసంగం గా కూడా భావించవచ్చు. ఏ సభ్యుడైనా మొట్టమొదటి సారిగా పెదవి విప్పి మాట్లాడుతున్నారంటే ఆ ప్రసంగాన్ని అందరూ ఎంతో గౌరవంగా వింటారు. అలాగే వీడ్కోలు ప్రసంగాన్ని కూడా అంతే ఆసక్తిగా ఆలకిస్తారు. కొందరు గౌరవ సభ్యులు నిన్న అదే గౌరవంతో శ్రీ ఖర్గే ప్రసంగాన్ని విని వుంటారు. ప్రజాస్వామ్యానికి అది చాలా ముఖ్యం. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది.. కానీ సభ ను అగౌరవ పరచే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

మేడమ్ స్పీకర్,

నిన్న ప్రతిపక్షం మా విధానాలను ఎలాంటి ఆధారాలతో లేదా వాస్తవాలతో పని లేకుండా విమర్శించడం నేను చూశాను. అదే సమయంలో వారు వారి గత విజయాలను యథాప్రకారం ఏకరువు పెట్టారు. కానీ ఒక్క విషయం మరచిపోవద్దు. భారతదేశం సరళీకృతం

అయింది. మన తరువాత సరళీకరణ విధానాలను రూపొందించిన పలు దేశాలు మన కన్నా ఎంతో పురోగమించాయి. దేశ విభజన అనంతరం దేశం మీ చేతి లోనే ఉంది. దేశాన్ని మీరు పాలించారు. అయినప్పటికీ దేశం సామర్థ్యం మేరకు పురోగమించ లేదన్న విషయాన్ని మనం అంగీకరించి తీరాల్సిందే. తొలి మూడు, నాలుగు దశాబ్దాల కాలంలో ప్రతిపక్షం నామమాత్రంగా ఉంది. ఆ రోజులలో ప్రసార మాధ్యమాలు ఇంతగా విస్తరించలేదు. ఉన్న ప్రసార మాధ్యమాలు కూడా ప్రభుత్వం దేశానికి ప్రయోజనం చేకూరుస్తుందన్న నమ్మకంతో ప్రభుత్వానికే మద్దతు పలికేవి. రేడియో మీరు పాడమన్నట్టే పాడేది. టెలివిజన్ వచ్చిన తరువాత అది కూడా మీకే అంకితమైపోయింది. అప్పట్లో న్యాయ వ్యవస్థ లో అత్యున్నత హోదాలలోని వారిని కాంగ్రెస్ పార్టీ యే నియమించేది. అన్ని రకాల విలాసాలు మీవే. ఆ రోజులలో న్యాయస్థానాలలో సవాలు చేయడానికి PIL లు లేవు, తగినంత సంఖ్యలో NGO లు లేవు. అలా సర్వత్రా సానుకూలమైనటువంటి వాతావరణంలో మీరు ఎదురనేది లేకుండా పెరిగారు. నిరసనలు లేవు. పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు మీ జెండాలే ఎగిరేవి. కానీ మీరు మొత్తం సమయాన్ని ఒకే ఒక కుటుంబం భజన లో గడిపే వారు. దేశ చరిత్రను కూడా విస్మరించి ఒకే ఒక కుటుంబాన్ని దేశం శాశ్వతంగా గుర్తుంచుకొనేటట్టు చేసేందుకు సర్వ శక్తులను కేంద్రీకరించారు. స్వాతంత్ర్యం తరువాత దేశ వాసులలో దేశాన్ని ముందుకు నడిపించాలనే ఒక కోరిక ఉండేది. మీరు కొంత బాధ్యతతో వ్యవహరించి వుంటే ప్రజాబలంతో దేశం ఉన్నత శిఖరాలకు ఎదిగేది. కానీ మీకు వ్యక్తిగత అజెండాయే గొప్పదయింది. మీరు సరైన నిర్ణయాలను తీసుకొని వుంటే, మీ ఆలోచనలలో హుందాతనం ఉంటే, మీరు విధానాలను బాధ్యతాయుతంగా రూపొందించి వుంటే కాలం కన్నా దేశం ఎంతో ముందు ఉండేదన్న వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. దానిని మీరు కాదనలేరు. 1947 ఆగస్టు 15 కు ముందు భారతదేశం లేదని, ఆ తరువాతనే భారతదేశం ఉందనే భావం కాంగ్రెస్ నాయకులలో ఉండడం

దురదృష్టకరం. నిన్న మరో ఆశ్చర్యకరమైన మాటను కూడా నేను విన్నాను. అది అహంకారపూరితంగా చెప్పిందా లేక వానాకాలంలో తన కుర్చీని కాపాడుకొనేందుకు తెలివితక్కువతనంతో చెప్పిందా.. ఏమనాలి ? నెహ్రూ యే దేశానికి ప్రజాస్వామ్యాన్ని తీసుకువచ్చారు; కాంగ్రెస్ పార్టీ యే తీసుకు వచ్చిందన్నదే ఆ మాట. ఖర్గే సాహెబ్, ఇది ఎంత బాధాకరమైన విషయం. బౌద్ధ మతం వర్ధిల్లిన కాలంలో లిచ్ఛవీ సామ్రాజ్యం ఉన్నప్పుడే మన దేశంలో ప్రజాస్వామ్యం ఉండేది. దేశానికి ప్రజాస్వామ్య భిక్షను పెట్టింది నెహ్రూ లేదా కాంగ్రెస్ పార్టీ కానే కాదు.

చర్చలు, గోష్ఠులు, వోటింగులతో నిర్ణయాలను తీసుకొన్న వ్యవస్థ బౌద్ధ సంఘ కాలం నాటిది. ఖర్గే గారూ, మీరు కర్నాటక కు చెందిన వారు. జగద్గురు మాన్య శ్రీ బసవేశ్వర్ కన్నా ఒక కుటుంబానికే అంకితమై పోయి మీరు కర్నాటక ఎన్నికలలో నెగ్గి ఈ రోజు ఈ స్థానం లో ఉన్నారు. కానీ మీరు ఒక విషయాన్ని తెలుసుకోవాలి. 12 వ శతాబ్ది కాలంలో అనుభవ మండపం ఏర్పాటు చేసి గ్రామంలో నిర్ణయాలన్నీ ప్రజాస్వామికంగా తీసుకున్న బసవేశ్వరుల వారు జన్మించిన కర్నాటక కు చెందిన వారు మీరు. అంతే కాదు, ఆ కాలంలో మహిళా సాధికారిత కు పట్టం కట్టబడింది. గ్రామ సభలో మహిళలు ఉండడం తప్పనిసరి చేశారు. 12వ శతాబ్దిలో జగద్గురు బసవేశ్వరుల వారి కాలం లోనే దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. ప్రజాస్వామ్యం మన నర నరాలలో, సంప్రదాయాలలో ఉంది. బిహార్ చరిత్ర ఇందుకు ప్రబల నిదర్శనం. ప్రాచీన చరిత్ర ను ఒక సారి గుర్తు చేసుకొంటే 2500 సంవత్సరాల క్రితమే, లిచ్ఛవి సామ్రాజ్య కాలంలో దేశంలో గణతంత్రం, ప్రజాస్వామ్యం ఉన్నాయి. ప్రజల ఆమోదానికి, నిరాకరణకు మనం గుర్తింపును ఇచ్చాం.

మీరు ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడుతారా ? ఎన్నికల సమయంలో మన్ మోహన్ సింగ్ ప్రభుత్వం లోని ఒక మంత్రి జహంగీర్ తరువాత శాహ్ జహాన్, షాజహాన్

తరువాత ఔరంగజేబు పాలకులు అయ్యారన్నారు. కానీ ఆ కాలంలో ఎన్నికలు జరిగాయా ? ఇక్కడ కూడా అదే పరిస్థితి. మీరా ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడేది ? ఏ తరహా ప్రజాస్వామ్యం గురించి మీరు మాట్లాడుతున్నారని నేను అడుగుతున్నాను. హైదరాబాద్ విమానాశ్రయానికి స్వాగతం చెప్పడానికి వచ్చిన దళిత కులానికి చెందిన ఒక ముఖ్యమంత్రిని అప్పటి ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ అవమానించారు. నెహ్రూ జీ పేరుతో మీరే ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడతారు, కానీ శ్రీ రాజీవ్ గాంధీ దళిత ముఖ్యమంత్రిని, ఎన్నికైన ప్రజాప్రతినిధిని హైదరాబాద్ విమానాశ్రయంలో అవమానించారు. ఒక దళిత ముఖ్యమంత్రి కి జరిగిన ఆ అవమానమే, మహా నటుడు శ్రీ ఎన్ .టి. రామారావు చలనచిత్ర జీవితాన్ని వదలి తెలుగుదేశం పార్టీ స్థాపించేందుకు ప్రేరణ అయింది.

మీరా మాకు ప్రజాస్వామ్యాన్ని గురించి బోధించేది ? ఈ దేశంలో 90 సార్లు రాజ్యాంగం లోని 356 వ అధికరణం దుర్వినియోగం జరిగింది. అప్పట్లో ఎదుగుతున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలన్నింటినీ మీరు దొంగ దెబ్బ తీశారు. పంజాబ్ లో అకాలీదళ్ కు మీరు ఏం చేశారు ?, తమిళనాడు లో ఏం జరిగింది ?, కేరళ లో ఏం జరిగింది ? దేశంలో ప్రజాస్వామ్యాన్ని వర్ధిల్లకుండా చేసింది మీరే. మీ కుటుంబ ప్రజాస్వామ్యాన్నే వాస్తవ ప్రజాస్వామ్యం గా మీరు భావిస్తారు. మీరు దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజాస్వామ్యం ఏమిటి ? నీలం సంజీవరెడ్డి గారిని రాష్ట్రపతి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీయే ఎంపిక చేసింది. రాత్రికి రాత్రి ఆయన కు వెన్ను పోటు పొడిచింది. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. ఆయన కూడా ఆంధ్రాకు చెందిన వారే. శ్రీ సంజీవరెడ్డి, శ్రీ అంజయ్య.. ఇద్దరినీ మీరే అవమానించారు. మీరు ప్రజాస్వామ్యాన్ని గురించి ఎలా మాట్లాడుతారు ? అంతదాకా ఎందుకు, డాక్టర్ మన్ మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగా ఆయన నాయకత్వంలోని మంత్రివర్గం ఒక నిర్ణయాన్ని తీసుకొంటే ఆయన మంత్రివర్గం ఆమోదించిన ఆర్డినెన్సును మీ

పార్టీ కార్యకర్తలలోనే ఒకరు చింపి ముక్కలు చేశారు. మీ నోటి నుండి ప్రజాస్వామ్యం అనే మాట అంత బాగుండదు. దయచేసి మీరు మాకు ప్రజాస్వామ్య పాఠాలను బోధించకండి.

ఈ రోజు ఒక సంఘటనను మీకు గుర్తు చేయాలని నేను అనుకొంటున్నాను. నాయకుడిని ఎన్నుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ లో ఎన్నికలు జరిగాయన్నది నిజమేనా ? అప్పట్లో 15 కాంగ్రెస్ కమిటీలలో 12 కమిటీలు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ గారిని నాయకునిగా ఎన్నుకొన్నాయి, కేవలం మూడే మూడు ఆయనకు అనుకూలంగా వోటు వేయకూడదని నిర్ణయించాయి. అయినా ఆయనకు బదులుగా పండిత్ నెహ్రూ గారిని ఎన్నుకొన్నారు. ఏ తరహా ప్రజాస్వామ్యం అది ? స్వాతంత్ర్య సాధన తరువాత సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ గారు ప్రధాన మంత్రి అయి వుంటే ఈ రోజు కశ్మీర్ లోని ఒక భాగం పాకిస్తాన్ అధీనంలో ఉండేది కాదు.

కాంగ్రెస్ అధ్యక్షుడు ఇటీవల డిసెంబర్‌లో ఎన్నికయ్యారు. ఇది ఎన్నికా ? లేక పట్టాభిషేకమా ? మీ పార్టీ నుండి ఒక యువకుడు తాను ఈ పదవికి అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్నట్టు చెప్పాడు. మీరు అతడిని అనుమతించలేదు. మళ్లీ మీరు ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడుతున్నారు. ఈ గొంతు ను నొక్కేందుకు జరిగే ప్రయత్నాలన్నీనిరుపయోగమైపోతాయని నాకు తెలుసు. విమర్శను ఎదుర్కొవడానికి ధైర్యం ఉండాలి.

స్పీకర్ మేడమ్, విభిన్నమైన పని సంస్కృతి మా ప్రభుత్వం ప్రత్యేకత. కేవలం కొత్త పథకాలను ప్రకటించి, పత్రికలలో పతాక శీర్షికలకు ఎక్కి, ఆ తరువాత ప్రజలను మోసం చేయడం మా నైజం కాదు. ఇది మా సంస్కృతి కాదు. సాధించడానికి అవకాశం ఉన్న పనుల్ని మాత్రమే మేము ప్రకటిస్తున్నాం. గత ప్రభుత్వం పూర్తి చేయకుండా వదలివేసిన మంచి

పనులను పూర్తి చేయడానికి మేం ప్రయత్నిస్తాం. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి; కానీ, దేశం ఎన్నటికీ ఉంటుంది. మేం అలాంటి తాత్వికతను విశ్వసిస్తాం.

అవే ఫైళ్లు, ఆ అధికారులే కదా ఇప్పుడూ ఉన్నది ? ఇది నిజం కాదా. గత ప్రభుత్వం రోజుకు 11 కిలోమీటర్ల జాతీయ రహదారులను మాత్రమే నిర్మించగలిగితే ప్రస్తుత ప్రభుత్వం రోజుకు 22 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మిస్తుండడానికి కారణం ఏమిటి ? ప్రతి ప్రభుత్వం రహదారులను నిర్మిస్తూ ఉంటుంది. గత ప్రభుత్వం తమ ప్రభుత్వ పదవీ కాలం లోని చివరి మూడు సంవత్సరాలలో 80 వేల కిలోమీటర్ల రోడ్లను మాత్రమే నిర్మిస్తే మా ప్రభుత్వం గత మూడు సంవత్సరాలలో ఒక లక్షా 20 వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించింది. గత ప్రభుత్వం వారి పాలన చివరి 3 సంవత్సరాలలో 1100 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ లను నిర్మించగా మా ప్రభుత్వం 2100 కిలోమీటర్ల రైల్వే లైన్ లను నిర్మించింది. గత ప్రభుత్వం తమ పాలన చివరి మూడేళ్లలో 2500 కిలోమీటర్ల రైలు లైన్ లను విద్యుదీకరించగా, ఈ ప్రభుత్వం గత మూడు సంవత్సరాలలో 4300 కు పైగా కిలోమీటర్ల రైల్వే లైన్ లను విద్యుదీకరించింది. ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ పథకం మా ప్రభుత్వ ఆలోచన నుండి రూపుదిద్దుకొంది. ఈ ఘనత మాకు దక్కుతుంది. మీరు ఎంచుకొన్న పని విధానం ఎలాంటిది? మీరు పక్షపాతంతో కూడిన రాజకీయాలను నమ్మారు. 2011 నుండి 2014 వరకు మీరు ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ ను కేవలం 59 పంచాయతీల లోనే ఏర్పాటు చేయగలిగారు. మేం ఎన్నికైన తరువాత అతి తక్కువ వ్యవధిలో మేం లక్ష పంచాయతీ లలో ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ ను ఏర్పాటు చేయగలిగాం. ఒక వైపు గత ప్రభుత్వం చివరి మూడేళ్లలో పట్టుమని 60 కంటే తక్కువ గ్రామాలకు ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ ను వేసిన చరిత్ర, మరో వైపు తక్కువ సమయంలో ఒక లక్ష గ్రామాలలో ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ ను వేసిన చరిత్ర ఉన్నాయి. ఈ గణాంకాలు పోలిక

కు ఏమాత్రం అందేవి కావు. గత ప్రభుత్వం 939 నగరాలలో శహరీ ఆవాస్ యోజన ను అమలు చేసింది. ఇవాళ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) పథకం దేశం లోని 4320 నగరాలలో అమలు చేయబడుతోంది. మీ అంకెలు, వెయ్యి లోపే ఉంటే , మావి 4000 కంటే ఎక్కువ. గత ప్రభుత్వం నవీకరణ యోగ్య శక్తి వనరులను తమ చివరి మూడు సంవత్సరాలలో 12 వేల ఎమ్ డబ్ల్యు అదనపు సామర్థ్యాన్ని మాత్రమే చేర్చగలిగితే గత మూడు సంవత్సరాలలో ఈ ప్రభుత్వం 22 వేల ఎమ్ డబ్ల్యు ను అదనంగా చేర్చగలిగింది. షిప్పింగ్ పరిశ్రమ, కార్గో హ్యాండ్లింగ్ రంగాలు నకారాత్మకమైన వృద్ధిని సూచిస్తుండగా ఈ ప్రభుత్వ హయాంలో ఈ రంగాలు గత మూడు సంవత్సరాలలో 11 శాతం వృద్ధిని సాధించాయి. మీరు వాస్తవాన్ని ఏమాత్రం గ్రహించి వున్నా ఈ గందరగోళం ఉండేది కాదు. ఖర్గే గారు రైల్వేలు, కర్నాటక.. ఈ రెంటిని గురించి ప్రస్తావించడం నాకు సంతోషం కలిగించింది. మీరు బీదర్, గుల్బర్గా రైల్వేలైన్ ను గురించి ప్రస్తావించారు. దేశ ప్రజలకు వాస్తవం తెలియాలి. కాంగ్రెస్ పార్టీ ఏనాడూ దీనిని ప్రస్తావించలేదు. కనీసం ప్రారంభోత్సవం రోజు కూడా దీని ప్రస్తావన లేదు. 110 కిలోమీటర్ల ఈ రైల్వే లైన్ ప్రాజెక్టు ను అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ వాస్తవాన్ని మీరు అంగీకరించాలి. 2013 వరకు మీ ప్రభుత్వం అధికారంలో ఉంది. మీరే రైల్వే మంత్రి. అది మీ పార్లమెంటరీ నియోజకవర్గం కూడాను. అటల్ గారి ప్రభుత్వం తరువాత ఎన్నో ఏళ్లు గడచిపోయాయి. 37 కిలోమీటర్లు మాత్రమే పూర్తి చేశారు. కేవలం 37 కిలోమీటర్లు!. ఇంకా చెప్పాలంటే, ఈ చిన్న పని కూడా ముఖ్యమంత్రి ఎడ్యూరప్ప గారి చొరవ తో చేపట్టబడింది. కేంద్ర ప్రభుత్వం కోరిన విధంగా ఆయన అనుమతులు ఇచ్చారు. అప్పుడు మాత్రమే మీ ప్రభుత్వం అటల్ గారి కలలను ముందుకు తీసుకు వెళ్లింది. అంతేకాదు, అది ఎన్నికల సమయం. అందువల్ల ఈ రైల్వే లైన్ ను ప్రారంభించడం మీ ఎన్నికకు ఉపయోగపడుతుందని అనుకున్నారు. 110 కిలోమీటర్ల రైల్వే లైన్ కు బదులుగా మీరు

కేవలం 30.5 కిలోమీటర్ల రైల్వే లైన్ కే సంతోష పడ్డారు. మేం చొరవ తీసుకొని మిగిలిన 72 కిలోమీటర్ల రైల్వే లైన్ ను స్వల్ప వ్యవధిలో పూర్తి చేశాం. ఈ రైల్వే ప్రాజెక్టు ప్రతిపక్షానికి చెందిన పార్లమెంటరీ నియోజకవర్గంలో ఉన్నందున దీనిని పక్కన పెట్టాలని మేం ఏనాడూ అనుకోలేదు. ఇది మీ నియోజకవర్గం, కానీ ఈ పని దేశానికి సంబంధించినది. మేం ఈ పనిని దేశ సంక్షేమం కోసం పూర్తి చేశాం. నేను ఈ రైల్వే లైన్ ను ప్రారంభించడం మీకు బాధ కలిగించినట్టుంది. కానీ ఈ బాధ కు మందును మీకు ఈ దేశ ప్రజలు ఏనాడో ఇచ్చారని నేను అనుకొంటున్నాను.

స్పీకర్ మేడమ్,

బాడ్ మేర్ లో రిఫైనరీ ని గురించి కూడా వారు మాట్లాడుతున్నారు. కేవలం ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేసేస్తే సరిపోతుందని వారు భావిస్తున్నారు. మీరు బాడ్ మేర్ లో శంకుస్థాపన చేశారు. కానీ, మేం అధికారం లోకి వచ్చిన తరువాత పత్రికలను గమనిస్తే, శంకుస్థాపన మాత్రం చేశారు కానీ, మిగిలినదంతా కాగితాలకే పరిమితమైనట్టు గమనించాం. క్షేత్ర స్థాయిలో పనులు ఏవీ చేపట్టని సంగతిని గమనించాం. దీనికి అనుమతులు లేవు. భూమి లేదు, లేదా కేంద్ర ప్రభుత్వంతో తుది ఒప్పందాన్ని చేసుకోలేదు. మీరు చేసిన తప్పులను సరిదిద్దడానికి, తిరిగి దీనికి ఒక సరైన రూపం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం, రాజస్థాన్ ప్రభుత్వం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. అన్నింటినీ చక్కదిద్ది మేం ఇప్పడు పనులను ప్రారంభించాం.

నేను, అసోమ్ లోని ధోలా- సాదియా సేతువు ను ప్రారంభించినపుడు అది చాలా మందికి మింగుడు పడలేదు. ఇది వాళ్ల చొరవ తో వచ్చిందని చెప్పుకోవడం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కూడా అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఆలోచన నుండి రూపుదిద్దుకొందని, ఆ

ప్రభుత్వం దీనిని ఆమోదించిందని చెప్పే నిజాయతీ వారిలో లేదు. దీనిపై క్షణ్ణంగా అధ్యయనం చేసిన ఒక బిజెపి నాయకుడు దీనిని డిమాండ్ చేశారు. 2014 తరువాత మేం అధికారంలోకి వచ్చాక ఈశాన్య రాష్ట్రాల ప్రగతిని ప్రాధాన్యంగా పెట్టుకొని ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశాం. ఫలితంగా ఈ సేతువు కల సాకారమైంది. పొడవైన సొరంగం, పొడవైన గొట్టపు మార్గం, సముద్రంపై పొడవైన వంతెన నిర్మాణం, వేగవంతమైన రైలుకు ఈ ప్రభుత్వం చొరవ తీసుకొందని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఇలాంటి నిర్ణయాలను తీసుకొనే సామర్థ్యం ఈ ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఇందులో చాలా వరకు పనులు నిర్ణీత కాలంలోగా పూర్తి అయ్యాయి. అంతేకాదు, ఏక కాలంలో రికార్డు సంఖ్యలో 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించింది కూడా ఈ ప్రభుత్వ హయాం లోనే.

మాన్యులు రాష్ట్రపతి గారు, తమ ప్రసంగంలో పేర్కొన్న వాస్తవాలను మనం తోసిపుచ్చలేం. ప్రజాస్వామ్యం అంటే ఏమిటో, ప్రభుత్వం లోని ప్రతి ఒక్కరినీ ఎలా గౌరవించాలో నేను చెప్పాలనుకొంటున్నాను. ఎర్ర కోట బురుజుల మీది నుండి ప్రధాన మంత్రులు చేసిన ప్రతి ప్రసంగాన్ని గమనించండి. దేశ ప్రగతికి ఏదో ఒక రకంగా ప్రతి ప్రభుత్వం ఎంతో కొంత చేసిందన్న వాస్తవాన్ని ఎవరైనా ప్రస్తావించారా ? ఏ కాంగ్రెస్ నాయకుడైనా ఎప్పుడైనా ఈ వాస్తవాన్ని ప్రస్తావించారా ? గత ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, అలాగే ఈ దేశ పౌరులు వారి చేయూత ను అందించారని ఈ నరేంద్ర మోదీ చెప్పాడు. దీనిని బహిరంగంగా ఒప్పుకొనే ధైర్యం మాకు ఉంది. ఇదీ మా స్వభావం.

నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ స్వర్ణోత్సవాలను జరిపాం. ఆ సందర్భంలో స్వర్ణోత్సవాలలో గవర్నర్ ప్రసంగాన్ని ఏర్పాటు చేశాం. గవర్నర్ ప్రసంగం ఎలా ఉంటుంది ? గవర్నర్ ప్రసంగం కూడా రాష్ట్రపతి ప్రసంగంలా ఉంటుంది. అది ఆ నాటి ప్రభుత్వం కార్యక్రమాలను వివరిస్తుంది. గవర్నర్ ప్రసంగం ఆ నాటి రాష్ట్ర ప్రభుత్వం చేసిన పనులను

ప్రస్తావిస్తుంది. అయితే , రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి 50 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ పరిపాలించింది. ఆ కాలంలోని గవర్నర్లు అందరి ప్రసంగాలను ప్రముఖంగా ప్రస్తావించి వాటన్నింటినీ భద్రపరచడం జరిగింది. ఇదీ ప్రజాస్వామ్యం అంటే..!

మీరు ప్రతి ఒక్కటి మీరు, మీ కుటుంబం చేసిందని చెప్పుకొంటున్నారు. కేవలం ఈ రకమైన ఆలోచనా విధానం వల్లే మీరు ఇవాళ అక్కడ కూర్చోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇవాళ రైల్వే లైన్ లను పెద్ద ఎత్తున విస్తరిస్తున్నాం. నౌకా కేంద్రాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. గ్యాస్‌పైప్‌లైన్ లను వేస్తున్నాం. గతంలో మూసివేసిన ఎరువుల కర్మాగారాలను తిరిగి తెరిపిస్తున్నాం. కోట్లాది ఇళ్లల్లో మరుగుదొడ్లను నిర్మిస్తున్నాం, కొత్త ఉపాధి అవకాశాలు వస్తున్నాయి.

కాంగ్రెస్ పార్టీ లోని మిత్రులను, ఉపాధి, నిరుద్యోగం లను గురించి మాట్లాడే వారిని నేను ఒక విషయం అడగదలచాను. మీరు ఎప్పుడైనా నిరుద్యోగం గురించిన లెక్కలు ప్రస్తావించేటపుడు దేశం మొత్తానికి సంబంధించిన లెక్కలు చెప్తారు. మరి ఉపాధికి సంబంధించిన లెక్కలు మాత్రం దేశం మొత్తానికి సంబంధించినవి ఎందుకు ప్రకటించరు ? ఇప్పుడు మీరు నన్ను నమ్మరు. అందుకే నేను మీ దృష్టికి కొన్ని విషయాలు తీసుకురాదలచాను. మీరు రికార్డులను కూడా పరిశీలించుకోవచ్చు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, కర్నాటక ప్రభుత్వం, ఒడిశా ప్రభుత్వం, కేరళ ప్రభుత్వం గత మూడు నాలుగు సంవత్సరాలలో సుమారు కోటి మందికి ఉపాధి ని కల్పించినట్టు చెప్పుకొన్నాయి. మా ప్రభుత్వం అక్కడ అధికారంలో లేదు. కనీసం ఎన్ డిఎ కూడా అక్కడ లేదు. ఈ వాస్తవాన్ని కూడా మీరు నిరాకరిస్తారా ? మీరు దానిని ఉపాధిగా గుర్తించరా ? నేను ఇక్కడ అబివృద్ధి చెందిన దేశాలను గురించి మాట్లాడడం లేదు. బిజెపి పాలిత రాష్ట్రలు లేక ఎన్ డిఎ పాలిత రాష్ట్రాలను గురించి మాట్లాడడం లేదు. నేను మాట్లాడుతున్నది మీ పార్టీలు, మీ అనుకూల

పక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలను గురించి. ఆ రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాలలో ఉపాధి స్థాయి పెరిగిందని చెప్తున్నాయి. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు పెరిగాయని ఇస్తున్న సమాచారం అసత్యమని అంటారా ? చెప్పండి.

అందువల్ల, దేశ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయకండి. ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యలు ఈ రాష్ట్రాలలో సత్ఫలితాలను ఇచ్చాయి. ఏడాదిలో 70 లక్షల కొత్త ఇపిఎఫ్ ఖాతాలు నమోదైన విషయం మీకు తెలుసు. ఇవి 18-25 సంవత్సరాల మధ్య వయస్సు కల యువతకు సంబంధించిన ఖాతాలు. ఇది ఉపాధి కాదా ? అంతేకాదు, వైద్యులు, ఇంజనీయర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్ లు తమ తమ వ్యాపారాలలో, కంపెనీలలో కొత్త ఉపాధి అవకాశాలను కల్పించారు. వారు తమ వ్యాపారాలను విస్తరించారు. రాబడి పెరిగింది. దీనిని గుర్తించడానికి మీరు సిద్ధంగా లేరు. సంఘటిత రంగంలో 10 శాతం మంది ఉద్యోగులు ఉంటే, అసంఘటిత రంగంలో 90 శాతం మంది ఉన్నారు. ఇవాళ మేం అసంఘటిత రంగం లోని వారిని క్రమబద్ధ రంగం లోకి తీసుకు వచ్చేందుకు ప్రోత్సాహకాలను ఇచ్చే విధంగా పలు పథకాలు ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నాం. అంతేకాదు, మధ్యతరగతి కుటుంబాలు పని కోసం ఇతరులను బతిమాలే పరిస్థితులు లేవు. వారు స్వతంత్రంగా గౌరవప్రదంగా బతకాలని అనుకొంటున్నారు. నేను చాలా మంది ఐఎఎస్ అధికారులను తమ పిల్లలు ఏం చేయాలని అనుకొంటారని అడిగాను. వారు వారి బాట లోనే ప్రభుత్వ సర్వీసు లో చేరాలని అనుకొంటామని చెప్తారని అనుకొన్నాను. కానీ ఈరోజు వారు చెప్తుతున్నారు.. కాలం మారింది; సర్, మేం మా తండ్రి, తాతల బాట లోనే ప్రభుత్వ సర్వీసు లో చేరాం, కానీ మా పిల్లలు ప్రభుత్వ సర్వీసులో చేరడానికి ఆసక్తిని కనబరచడం లేదు. మా పిల్లలు స్టార్ట్ - అప్ లను ప్రారంభించాలని అనుకొంటున్నారని చెప్పారు. మా బిడ్డ విదేశాలలో చదువుకొన్నాడు. అతను ఇప్పుడు స్టార్ట్ - అప్ ను పెట్టాలని

అనుకొంటున్నాడని చెప్తున్నారు. విదేశాలలో చదువుకొని తిరిగి వస్తున్న యువత ఆలోచనలు ఇలా ఉన్నాయి. ప్రతీ రాష్ట్ర ప్రభుత్వం, మధ్యతరగతి యువత ఆకాంక్షలను ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేయాలి. మనం వారిని నిరుత్సాహ పరచరాదు. అందుకే ముద్రా యోజన, నైపుణ్యాభివృద్ధి పథకం, వ్యాపారావకాశాల శిక్షణ కార్యక్రమం వంటి పలు కార్యక్రమాలను యువత ఆకాంక్షలు సాకారం చేసే దిశగా ప్రారంభించడం జరిగింది. ఫలితంగా నేడు ప్రధాన మంత్రి ముద్రా యోజన పథకం కింద పది లక్షల కోట్ల రూపాయలకు పైబడిన రుణాలకు ఆమోదం తెలపడం జరిగింది. ఇది చిన్న మొత్తం కాదు. ఈ రుణాలకు సంబంధించి మధ్యవర్తుల జోక్యాన్ని గురించి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఇది ఈ ప్రభుత్వ పని సంస్కృతి.

మా నిబంధనలు, విధానాల ఫలితంగా ఎవరైనా సరే ఏ పూచీకత్తు లేకుండానే రుణం కోసం బ్యాంకుకు వెళ్లవచ్చు. 10 లక్షల కోట్ల రూపాయల విలువ గల రుణాలు ఆమోదం పొందాయి. ఇందులో 4 లక్షల కోట్ల రూపాయలు ఇప్పటికే ఇవ్వడం జరిగింది. పైపెచ్చు, రుణం ఆశించిన వారిలో 3 కోట్ల మంది కొత్త వ్యాపారులు. వీరు ఎంతో కాలంగా తగిన అవకాశాలు లభించని అణగారిన వర్గాలు. దేశంలో ఉపాధి అవకాశాలను పెంచడానికి జరిగిన ప్రయత్నం కాదా ఇది ? ఓహో, మీరు మీ కళ్లు మూసుకున్నారు కాబోలు. అందుకే మీరు పదే పదే మీ గురించి చెప్పుకొంటున్నారు. ఈ రకమైన ఆలోచన ధోరణి మిమ్మల్ని వృద్ధి లోకి రానివ్వడం లేదు. అటల్ గారు ఒక అద్భుతమైన వాక్యం చెప్పారు. చిన్న మనస్సుతో ఎవరూ గొప్పవాళ్లు కాలేరు. విరిగిన మనసుతో ఎవరూ నిలబడలేరు. అందువల్ల మీరు ఎన్నటికీ మాలా ఎదగలేరు. మీరు ఎన్నటికీ ఇక్కడే ఉండిపోతారు.

మీరు పదే పదే మీ గొప్పలు చెప్పుకొంటున్నారు. మీకు నేను ఒక విషయం గుర్తు చేయదలచాను. 1980 లలో 21వ శతాబ్దాన్ని గురించిన మాట పదే పదే వినిపిస్తూ ఉండేది. అప్పట్లో ఒక కాంగ్రెస్ నాయకుడు 21వ శతాబ్దపు కలలను గురించి ప్రజలకు చెప్తుండే వారు.

ఆయన యువకుడు, కొత్త నాయకుడు. ఆయన వారి తాత గారు గెలిచిన స్థానాల కంటే ఎక్కువ స్థానాలను గెలిచారు. ఆ సమయంలో నేను ఒక ఆసక్తిదాయకమైన వ్యంగ్య చిత్రాన్ని చూశాను. ఒకాయన రైల్వేప్లాట్‌ఫారం మీద నిలబడి ఉంటాడు. ఆయన ముందు రైలు వెళ్తూ ఉంటుంది. ఆ రైలు పైన 21 వ శతాబ్దం అని రాసి ఉంటుంది. ఆ వ్యక్తి ఆ రైలు వెంట పడి అందులో ఎక్కడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. ఆ పక్కనే ఉన్న ఒక వృద్ధుడు చెప్తుంటాడు, వేచి ఉండండి, ఏదో రకంగా రావడానికే అది వెళుతోంది. మీరు ఏమీ చేయాల్సిన అవసరం లేదు అని అంటుంటాడు. 21 వ శతాబ్దపు కలల గురించి 1980 లోనే ప్రజలకు చెప్తూ వచ్చారు. 21వ శతాబ్దం గురించి వల్లిస్తూ వచ్చిన ఆ ప్రభుత్వం కనీసం విమానయాన విధానాన్ని కూడా రూపొందించలేకపోయింది. 21వ శతాబ్దానికి సంబంధించిన విమానయాన విధానమే లేకపోతే మరి ఇంకెందుకు ? ఎద్దుల బండి కోసమా మీరు ఆ వేగంతో వెళుతున్నారు.

స్పీకర్ మేడమ్, మేం ఒక విమానయాన విధానాన్ని ప్రారంభించాం. చిన్న పట్టణాలలో చిన్న రన్‌వేల ను వాడడం ప్రారంభించాం. ప్రస్తుతం మనకు 16 కొత్త ఎయిర్ స్ట్రిప్‌లు ఉన్నాయి. విమానయాన రంగంలో ఎన్నో నూతన అవకాశాలు ఉన్నాయి. ఆ దిశగా మేము ప్రయత్నిస్తున్నాం. రెండో అంచె, మూడో అంచె పట్టణాలలో విమానాలు రాకపోకలను సాగించనున్నాయి. ప్రస్తుతం 450 వరకు విమానాలు నడుస్తున్నాయి. ఈ చొరవతో మేం ఈ ఏడాది 900 కొత్త విమానాలను కొనుగోలు చేయనున్నాం. మా గట్టి సంకల్పంతో ఇది సాధ్యం అవుతోంది. మేం సాంకేతిక విజ్ఞానాన్ని వాడడమే కాదు, పనులను క్రమం తప్పకుండా పద్ధతి ప్రకారం గమనిస్తుంటాం. డ్రోన్ ల సహాయంతో రహదారులు, రైల్వే మార్గాల పనులను మేం పర్యవేక్షిస్తున్నాం. ఉపగ్రహ సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి జియో ట్యాగింగ్ చేస్తున్నాం. అంతేకాదు, ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్ల ఛాయాచిత్రాలను తీసి మొబైల్ ఫోన్ లతో ట్యాగ్

చేస్తున్నాం. సాంకేతిక విజ్ఞానం సహాయంతో పనులను పర్యవేక్షిస్తున్నందువల్ల పనులు వేగంగా సాగుతున్నాయి. ఇలా పర్యవేక్షించడవల్ల పారదర్శకత్వానికి వీలు ఏర్పడింది.

మేము ఎన్నికలలో గెలవగానే, మోదీ మీ ఆధార్ పథకాన్ని ఎత్తివేస్తారని అంటూ మీ పార్టీ అనుమానాలను రేకెత్తించింది. మోదీ పై దాడికి ఆధార్ ను వాడుకొన్నారు. ఎందుకంటే మోదీ ఆధార్ ను ఎత్తివేస్తారని మీరు అనుకున్నారు. మోదీ ఆధార్ ను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తే దానిని సానుకూలంగా స్వీకరించలేకపోతున్నారు. మోదీ దీనిని కొత్త పంథాలో తిరిగి తీసుకువస్తారని మీరు ఊహించలేకపోయారు. సమాజం లోని అత్యంత నిరుపేదలు ఈ పథకం ద్వారా ప్రయోజనాన్ని పొందుతుంటే అది మీకు నచ్చడం లేదు. బొమ్మ పడితే గెలుపు నాదే, బొరుసు పడితే ఓటమి నీదే అనే తత్వం మీది. కానీ ఇది సరి కాదు. ఇలాంటి విధానం ఎంతమాత్రం పనిచేయబోదు. ఇవాళ దేశవ్యాప్తంగా 115 కోట్ల మంది ప్రజలకు ఆధార్ కార్డులు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 450 పథకాలకు సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీ పథకం కింద నగదు ను లబ్ధిదారుల ఖాతాలలో నేరుగా జమ చేయడం జరుగుతోంది. చాలా సంవత్సరాల పాటు మీరు కేవలం కాగితాల మీద వితంతువులైన వారికి పెన్షన్ లు ఇచ్చారు. ఇందులో చాలామంది మహిళలు అసలు లేనే లేరు. ఈ డబ్బును మధ్యవర్తులు తీసుకొనే వారు. వయో వృద్ధులు, దివ్యాంగుల విషయం కూడా ఇలాంటిదే. వీరికి ఉద్దేశించిన డబ్బును మధ్యవర్తులు తీసుకొనే వారు. ఇలా 57,000 కోట్ల రూపాయలు మధ్యవర్తులకు వెళ్లాయి. ఇవాళ ప్రత్యక్ష నగదు బదిలీ పథకానికి ఆధార్ ను వాడుతుంటే మీకు సంతోషంగా లేదు. ఎందుకంటే మధ్యవర్తుల వ్యాపారం పోయింది. గుర్తుంచుకోండి.. మోసం చేసే వారు, దేశాన్ని దోచుకొనే వారి రాబడి పోయింది.

స్పీకర్ మేడమ్,

దేశం లోని 4 కోట్ల మంది పేద, మధ్య తరహా ఆదాయం కలిగిన కుటుంబాలకు ఉచిత విద్యుత్తును సమకూర్చడానికిగాను మేం '**సౌభాగ్య**' పథకాన్ని అమలు చేశాం. అలాంటి పథకమే మేమూ ప్రారంభించామని వారు అనవచ్చు. అలాంటి పథకం ఉందని నేను ఒప్పుకొంటాను. కానీ ప్రజలకు విద్యుత్తు ను సరఫరా చేశారా ? నాడు తగినన్ని విద్యుత్తు సరఫరా మార్గాలు ఉండేవా ? కరెంటు స్తంభాలను కూడా నిలబెట్టలేదు. మీ హయాంలో ప్రజలు 18వ శతాబ్ది పరిస్థితులలో జీవించే వారు. కానీ మీరు మాత్రం ఆ పథకం మాదే అంటూ గొప్పలు చెప్పుకొంటున్నారు. మేం అభివృద్ధిని విడిగా చూడం. అందరినీ కలుపుకు పోయే సమగ్రమైన దృక్పథంతో, దీర్ఘకాల దార్శనికతను మేం అనుసరిస్తున్నాం. నేను ఇప్పుడు విద్యుత్తు అంశాన్ని గురించి మాట్లాడాలని అనుకొంటున్నాను. తద్వారా మీకు మా ప్రభుత్వ పని విధానం అర్థమవుతుంది. దేశంలోని 25 కోట్ల కుటుంబాలకుగాను 4 కోట్ల కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ లేదు. అంటే దీనికి అర్థం దేశం లోని దాదాపు 20 శాతం జనాభా ఇంకా చీకటి లోనే జీవిస్తోంది. ఇది ఎంతమాత్రం గర్వకారణం కాదు. మీరు ఈ సమస్యను మాకు ఇచ్చిపోయారు. దీనిని పరిష్కరించడానికి మేం కృషి చేస్తున్నాం. అయితే ఈ పనిని మేం ఎలా చేస్తున్నాం? ఈ పనిని మేం నాలుగు భాగాలు.. విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, కనెక్షన్.. గా విభజించాం. వీటినన్నిటినీ అభివృద్ధి చేస్తున్నాం. అన్నింటి కన్నా ముఖ్యమైన విషయం సౌర విద్యుత్తు ఉత్పత్తి పైనా, జల విద్యుత్తు పైనా, బొగ్గు, అణు విద్యుత్తు లపైనా మేం దృష్టిపెట్టాం. విద్యుత్తు సరఫరా నెట్ వర్క్ ను చాలా వేగంగా అభివృద్ధి చేస్తున్నాం. గత 3 సంవత్సరాల్లో 1.5 లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను చేపట్టాం. గత ప్రభుత్వం తన చివరి మూడు సంవత్సరాల్లో చేపట్టి ప్రాజెక్టుల విలువ కంటే 83 శాతం ఎక్కువ. 2014 తరువాత విద్యుత్తు సరఫరా లైన్ ల విస్తరణలో పెరుగుదల 31 శాతం. గత మూడు

సంవత్సరాల్లో ట్రాన్స్ ఫార్మర్ సామర్థ్యాన్ని 49 శాతం పెంచాం. కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా, కచ్ నుండి కామ రూప్ దాకా విద్యుత్తు సరఫరా కు సంబంధించిన మొత్తం నెట్ వర్క్ ను ఏర్పాటు చేశాం. విద్యుత్తు పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉజ్జ్వల్ డిస్ కమ్ అశ్యూరెన్స్ యోజన అంటే 'ఉదయ్' పథకాన్ని రూపొందించి, ఆయా రాష్ట్రాలతో ఎమ్ఒయు చేసుకోవడం జరిగింది. విద్యుత్తు ప్రసార కంపెనీలు వాటి ఆర్థిక నిర్వహణను మేలుగా చేపట్టేలా చర్యలు తీసుకొన్నాం. సౌభాగ్య పథకాన్ని ప్రారంభించి దీని ద్వారా లబ్ధిదారుల గృహాలకు విద్యుత్తును సరఫరా చేస్తున్నాం. ఒక వైపు విద్యుత్తు కనెక్షన్ పై దృష్టి పెడుతూనే మరో వైపు విద్యుత్తు ఆదా పైన గట్టిగా కృషి చేస్తున్నాం. ఇంతవరకూ మేం 28 కోట్ల LED బల్బులను పంపిణీ చేశాం. విద్యుత్తు బిల్లుల విషయంలో 15 వేల కోట్ల రూపాయలను ఆదా చేశాం. సమయం వృథా ను అరికట్టడానికి, డబ్బు వృథాను అరికట్టడానికి మేం నిజాయతీ గా ప్రయత్నించాం.

మేడమ్ స్పీకర్,

అన్నదాతలకు సంబంధించిన అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలైన తరువాత కూడా ఒక లక్ష కోట్ల రూపాయల విలువైన పండ్లు, కూరగాయలు, ధాన్యం, పూలు మొదలైన వ్యవసాయ ఉత్పత్తులు వృథా అయిపోతున్నాయి. స్టోర్ రూముల వరకు తెచ్చి వాటిని విపణి వరకు తీసుకు పోయే లోపు సరైన సమర్థవంతమైన సరఫరా వ్యవస్థ లేకపోవడంవల్లనే ఇలా జరుగుతోంది. ఈ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన ను ప్రారంభించడమైంది. తద్వారా రైతులు సరైన గోదాముల సౌకర్యాలను, అందుబాటు ధరలలో పొందగలరు. వారి ఉత్పత్తులు చెడిపోకుండా ఉంటాయి.

సరఫరా గొలుసు సంబంధిత ప్రాథమిక సౌకర్యాలను బలోపేతం చేయాలని ప్రభుత్వం నిశ్చయించింది. వృధా ను అరికట్టడం ద్వారా ఆదా చేసే ఒక లక్ష కోట్ల రూపాయలను ఖర్చు పెట్టి ఫూడ్ ప్రాసెసింగ్ రంగంలో మధ్య తరగతి యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతాం. మన దేశంలో వ్యవసాయం ఎంత ముఖ్యమో పశు సంవర్ధక శాఖ కూడా అంతే ముఖ్యం. రెండూ ఒకదాని మీద మరొకటి ఆధారపడిన రంగాలు. పశు సంవర్ధక రంగంలో సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల ప్రతి ఏడాది దాదాపు 40 వేల కోట్ల రూపాయాలను నష్టపోతున్నాం. దీనిని అరికట్టడానికిగాను కామధేను పధకం ద్వారా ఈ రంగంపై మేము దృష్టిపెట్టాం.

పశు సంవర్ధక రంగంలో వున్నవారికి కామధేను పధకం తో భారీ స్థాయిలో మేలు జరుగుతుంది. 2022 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడానికి కృషి చేస్తున్నాం. 1980 లలో 21వ శతాబ్దాన్ని గురించి మాట్లాడినప్పుడు మీరు ఆమోదించారు. అయితే ఇప్పుడు మోదీ ఈ 2018 లో 2022 ను గురించి మాట్లాడుతుంటే దీనిని ఆమోదించడానికి మీకు ఇబ్బందిగా ఉంది. 1980 వ దశకంలో 21వ శతాబ్ది కలలను మీరు చూపించే వారు. దేశానికి స్వాంత్ర్యం వచ్చి 2022 కల్లా 75 సంవత్సరాలు నిండుతాయి. ఆ సమయానికిగాను చేరుకోవలసిన ప్రత్యేక లక్ష్యాలను రూపొందించి వాటి గురించి మా ప్రభుత్వం కసరత్తు చేస్తుంటే, ప్రజలకు స్ఫూర్తిని ఇవ్వడానికి కాలపరిమితి ప్రకారం పని చేస్తుంటే మీకు మింగుడుపడడం లేదు. 2022 వ సంవత్సరానికల్లా రైతుల ఆదాయన్ని రెట్టింపు చేయాలనే మా లక్ష్యం పట్ల మీరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే మీరు ఏనాడూ భారీ స్థాయిలో కలలు కనలేదు. కుత్సితమైన ఆలోచనలతో దేనినీ సాధించలేం. ఇన్ పుట్ వ్యయాన్ని తగ్గించడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయలేమా? భూసార పరీక్షల కార్డు, సోలర్ పంపులు, వేప పూత పూసిన యూరియా మొదలైన వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకు రావడం

వల్ల రైతులు పెడుతున్న పెట్టుబడి ఖర్చులు తగ్గుతున్నాయి. అలాగే రైతులు వారి వ్యవసాయ భూముల గట్ల మీద వెదురు పంటను పెంచడం ద్వారా వారి ఆదాయ అవకాశాలను పెంచుకోవడానికి వీలుగా మేం ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం. వెదురు పంటకు ఖచ్చితమైన విపణి ఉంది.

మీరు గతంలో అమలు చేసిన తప్పుడు విధానం కారణంగా, వేల కోట్ల రూపాయల విలువైన వెదురును మన దేశం దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. మీరు వెదురును వృక్షాల జాబితాలో ఉంచడం వల్ల దాన్ని నరికి లబ్ధి పొందడం కష్టమైన పనిగా మారిపోయింది. దీని కారణంగా ఈశాన్య భారతం లోని ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. మా ప్రభుత్వం ఈ విధానంలో మార్పు చేసి ఎంతో ధైర్యంగా వెదురును గడ్డి జాతి మొక్కల జాబితా లోకి తెచ్చింది. దీని కారణంగా రైతుల ఆదాయం పెరుగుతుంది. రైతులు వారి పొలాల మూలల్లో వెదురును నాటుకోవడం వల్ల దాని నీడ పంటల పైన ప్రభావం చూపదు. ఈ పని చేయడం వల్ల రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. అలాగే పాల ఉత్పత్తిని పెంచాలనుకొంటున్నాం. తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సాహించాలనుకొంటున్నాం. ఈ విషయం తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. తేనెటీగల పెంపకంలో 40 శాతం పెరుగుదలను సాధించాం. ఈ నిజం చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంపూర్ణ ఆరోగ్య భద్రత పైన, సులభతరమైన జీవనం మీదా దృష్టి పెట్టారు. దాంతో రసాయనిక మైనాన్ని వాడే వారు, తేనెటీగల మైనాన్ని వాడుతున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల మైనానికి డిమాండ్ అధికంగా ఉంది. కాబట్టి మన రైతులు వ్యవసాయంతో పాటు తేనెటీగల పెంపకాన్ని చేపట్టాలి. తేనెటీగల మైనం కారణంగా రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. తేనెటీగలు సమృద్ధిగా ఉంటే పంటల పెరుగుదలకు అవి దోహదం చేస్తాయనే విషయం మనకు తెలిసిందే. రైతుల ఆదాయాన్ని పెంచడానికి పలు రంగాలు అందుబాటులో ఉన్నాయి. పాల ఉత్పత్తి, కోళ్ల

పెంపకం, చేపల పెంపకం, వెదురు పెంపకం మొదలైన రంగాలు రైతుల ఆదాయాలను పెంచుతాయి.

ఆధార్ ను అమలు చేయడం కష్టమని నమ్మిన వారే జిఎస్ టిని అమలు చేయకుండా చేస్తామని నమ్మారు. వారు ప్రభుత్వం నాశనం కావాలని భావించారు. ఇప్పుడు ఆధార్, జిఎస్ టీ రెండూ అమలవుతున్నాయి. ఇప్పుడు వారు ప్రభుత్వాన్ని విమర్శించడానికి, సమస్యలను సృష్టించడానికి కొత్త కొత్త మార్గాలను వెతుకుతున్నారు. వారు ఇప్పుడు ఈ ఆట ఆడుతున్నారు. ఏదైనా పని దేశాన్ని నిరాశలో కూరుకుపోయేలా చేస్తుందనుకొంటే ఆ పనిని ప్రతి రాజకీయ పక్షం పక్కన పెడుతుంది. కానీ ఒక ముఠా కు చెందిన సభ్యులు ప్రజలను నిరాశపరచే మార్గంలో నడుస్తున్నారు. ఈ రోజున జిఎస్ టి అనేది లాజిస్టిక్స్ కు గణనీయంగా లబ్ధిని చేకూర్చింది. గతంలో రవాణా మార్గాల్లోని టోల్ ట్యాక్స్ లు, ట్రాఫిక్ జామ్ ల కారణంగా అనేక విధాలుగా వృధా జరిగేది. ఈ రోజున దానిని నివారిస్తున్నాం. మన రవాణా సామర్థ్యం 60 శాతం పెరిగింది. ఒక ట్రక్కు 5- 6 రోజుల్లో చేసే పనిని రెండు, రెండున్నర రోజుల్లో పూర్తి చేస్తోంది. దీని కారణంగా దేశం గొప్ప ప్రయోజనం పొందుతోంది.

దేశ ప్రగతిలో మధ్యతరగతి ముఖ్య పాత్రను పోషిస్తోంది. వదంతులను వ్యాప్తి చేయడం ద్వారా మధ్య తరగతి ప్రజలను ఆందోళన లోకి నెట్టే పనులు చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. మన దేశంలోని మధ్యతరగతి సుపరిపాలనను, మెరుగైన సౌకర్యాలను కోరుకొంటోంది. ఒక వ్యక్తి రైలు టికెట్ కొన్న తరువాత రైలులో లభించే సౌకర్యాలన్నిటిని ఒక హక్కుగా కోరుకొంటాడు. అతను తన కుమారుడిని బడికి పంపితే అక్కడ తన బిడ్డకు మంచి విద్య లభించాలని ఆశిస్తాడు. ఒక ఆహార పదార్థాన్ని కొనుగోలు చేస్తే అది మంచి నాణ్యతతో ఉండాలని భావిస్తాడు. అతనికి సరైన విద్యాసంస్థలను, అందుబాటు ధరలలో గృహాలను, సరైన రహదారులను, మెరుగైన రవాణా సౌకర్యాలను, పట్టణ, నగర ప్రాథమిక సౌకర్యాలను వంటి

వాటిని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మధ్యతరగతి ప్రజలు మెరుగైన జీవనాన్ని పొందడానికి వీలుగా, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికిగాను గత 1.5 సంవత్సరాలుగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది.

ఈ విషయం తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ప్రపంచంలోనే తీసుకుంటే, మన దేశంలో ప్రారంభ స్థాయిలో ఆదాయ పన్ను 5 శాతం ఉంది. ఇది ప్రపంచంలోకెల్లా అతి తక్కువ స్థాయి. అభివృద్ధి చెందిన ఏ దేశంలోను ఇలాంటి ఆదాయపు పన్నును అమలు చేయడం లేదు. 2000 సంవత్సరం కంటే ముందు ప్రవేశపెట్టిన బడ్జెటు లో పన్ను మినహాయింపు పరిమితిని 50 వేల రూపాయల నుండి 2.5 లక్షలకు పెంచడం జరిగింది. ఈ ఏడాది 40 వేల రూపాయల స్టాండర్డ్ తగ్గింపునకు మేం అనుమతిని ఇచ్చాం. అలాగే సీనియర్ సిటిజన్ లకు పన్ను మినహాయింపు సౌకర్యాన్ని కల్పించాం. మధ్యతరగతి ప్రజలకు అందే ప్రయోజనాలను పెంచడం ద్వారా వారికి ప్రతి ఏడాది 12 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరుతోంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (నగరాల్లో) కు 31 వేల కోట్ల రూపాయలను కేటాయించాం. మొదటి సారిగా మధ్యతరగతి ప్రజలు రుణాల రూపంలో లబ్ధి పొందబోతున్నారు. ఈ పనిని మా ప్రభుత్వమే చేసింది. మేం నూతన ఐఐటి లను, ఐఐఎమ్ లను, ఎఐఐఎమ్ఎస్ లను ప్రారంభించాం. 11 నూతన నగరాల్లో మెట్రో రైళ్లను ప్రారంభిస్తున్నాం. 32 లక్షల ఎల్ ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేశాం. ఈ పనులు చేయడం వల్ల మధ్య, చిన్న తరహా పరిశ్రమలు లబ్ధి ని పొందుతున్నాయి. ఈ విషయాన్ని ఎవరూ కాదనలేరు. ఎమ్ఎస్ఎమ్ఇ రంగానికి చెందిన ప్రజలు మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు. 2.5 కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలకు పన్ను రేటును తగ్గించాం. దీనిని 30 శాతాన్నుండి 25 శాతానికి తెచ్చాం. ఈ పనిని మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం చేశాం. 2 కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు నిర్వహించే వ్యాపారులు వారి బ్యాంకుల ద్వారానే ఆ పని ని చేయగలరు.

ప్రభుత్వం వారి ఆదాయాన్ని టర్నోవర్ లో 6 శాతంగానే పరిగణిస్తుంది తప్ప 8 శాతం కాదు. దీని వల్ల వారికి పన్నుల రూపంలో 2 శాతం లబ్ధి దక్కనుంది. జిఎస్ టి కింద 1.5 కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన వారు కాంపోజిషన్ పథకం కిందకు వస్తారు. వారు వారి టర్నోవర్ లో 1 శాతం పన్నును చెల్లిస్తే సరిపోతుంది. ఇది ప్రపంచంలోనే అతి తక్కువ మొత్తం.

గౌరవనీయులైన స్పీకర్ మేడమ్,

జన్ ధన్ యోజన లో భాగంగా 31 కోట్ల బ్యాంకు ఖాతాలను తెరిపించడం జరిగింది. ఆరోగ్య బీమా పథకం ద్వారా 18 కోట్లకు పైగా పేద ప్రజలు లబ్ధి పొందారు. ఇందుకు గాను వారు ప్రతి రోజు 90 పైసలు ప్రీమియమ్ గానీ, లేదా నెలకు ఒక రూపాయి ప్రీమియమ్ ను గానీ చెల్లిస్తే సరిపోతుంది. ప్రమాదంలో ఉన్న పేద కుటుంబాలు ఈ పథకం ద్వారా 2 వేల కోట్ల రూపాయలు పొందాయి.

ఇంతటి ఉదాత్తమైన ఈ పనిని మేం చేశాం.3 కోట్ల 30 లక్షల మంది పేద మాతృమూర్తులు, వారి బిడ్డలు ఉజ్జ్వల యోజన పథకం ద్వారా లబ్ధి ని పొందుతున్నారు. గతంలో గ్యాస్ కనెక్షన్ కావాలంటే ఎంపీల వెంట తిరగాల్సి వచ్చేది. మేం ఇప్పుడు గ్యాస్ కనెక్షన్ ను ప్రజల ఇంటి ముందుకు తెచ్చాం. ఈ సంఖ్యను 8 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం.

పేద ప్రజల ఆరోగ్య భద్రత మీద మనం దృష్టి పెట్టవద్దా? ఇందుకోసం ఆయుష్మాన్ భారత్ యోజన ను ప్రవేశపెట్టాం. చేతిలో డబ్బు లేకపోవడం కారణంగా పేద ప్రజలు చికిత్స తీసుకోలేక చనిపోయే వారు. అనారోగ్యం పాలైన పేద ప్రజలు అప్పులు చేసి చికిత్స తీసుకోవడానికి ఇష్టపడేవారు కాదు. ఎందుకంటే వారి పిల్లలు అప్పుల పాలవుతారనేది వారి భయం. ఈ భయం నుండి వారిని బయట పడేయడానికిగాను మేం నిర్ణయం తీసుకొన్నాం.

ఇది సరైనది కాదా? మేం ప్రవేశపెట్టిన పథకంలో మార్పులు చేయాలంటే మీరు సరైన మార్పులను సూచించండి. మీరు ఇచ్చే సూచనలను, సలహాలను మేం తప్పకుండా తీసుకొంటాం. తద్వారా ప్రభుత్వం 5 లక్షల రూపాయల వరకు చికిత్సలకు ఖర్చుపెట్టే వారికి ఆ మేరకు ప్రతి ఏడాది సాయం చేస్తుంది. కానీ దురదృష్టం కొద్దీ మీరు వారిని తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నారు. మీ దగ్గర సరైన ప్రణాళిక ఉంటే దయచేసి దానిని నాకు సూచించండి. మేము దానిని ఆచరిస్తాం.

స్పీకర్ మేడమ్,

ప్రభుత్వం తీసుకొన్న చర్యల వల్ల ప్రజల ఆలోచన విధానం కూడా మారింది. జన్ ధన్ యోజన పేదల ఆత్మస్థైర్యాన్ని పెంచింది. నిరుపేద కూడా తన ఖాతాలో డబ్బులు జమ చేసుకొని, రూపే డెబిట్ కార్డు ను ఉపయోగిస్తున్నాడు. ధనవంతుల కుటుంబాలలో తాను కూడా ఒకడినని భావిస్తున్నాడు. స్వచ్ఛ్ భారత్ అభియాన్ మహిళల ఆత్మస్థైర్యాన్ని పెంచింది.

బాధల నుండి వారిని విముక్తం చేసిన వాటిలో ఇది ఒకటి. దాచుకొన్న సొమ్ము పోతుందేమోనని చేస్తున్న ఉద్యోగాన్ని వదలి కొత్త ఉద్యోగానికి వెళ్లాలంటే కార్మికులు భయపడే వారు. క్లెయిము చేయని 27 కోట్ల రూపాయలను సార్వత్రిక ఖాతా సంఖ్య (యుఎఎన్) ద్వారా బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాం. ఇపుడు ఓ పేద కార్మికుడు తనతో పాటు తన బ్యాంకు ఖాతాను వెంట తీసుకుపోవచ్చు.

అవినీతి, నల్లధనం : మీకు నిద్రపట్టడం లేదని నాకు తెలుసు. అసహనానికి మీరు చెప్తున్న కారణాలను నేను అర్థం చేసుకోగలను. అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు ప్రశాంతంగా ఉండలేరు. ఎవరూ తప్పించుకోజాలరు! నలుగురు మాజీ ముఖ్యమంత్రులు అవినీతికి పాల్పడ్డట్లు భారతదేశ చరిత్రలో తొలి సారి న్యాయస్థానం ప్రకటించింది. వారు శేష

జీవితాన్ని కారాగారంలో గడపవలసివుంటుంది. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనం. దేశ సంపదను దోచుకున్న వారుతిరిగి ఇవ్వక తప్పదు. ఈ ప్రయత్నాలకు సంబంధించి మడమ తిప్పేది లేదు. నేను ఓ సైనికుడిని. అందువల్లనే ఈ రోజు దేశంలో నిజాయతీ తో కూడిన వాతావరణం ఉంది. నిజాయతీకి పట్టం కడుతూ మనం సంబరాలు చేసుకొంటున్నాం.

ఆదాయపు పన్ను కట్టేందుకు అనేక మంది ప్రజలు నేడు ముందుకు వస్తున్నారు. జమ చేస్తున్న ప్రతి పైసా సద్వినియోగం అవుతుందని తెలిసే ఈ ప్రభుత్వాన్ని నమ్ముతున్నారు.

దీనిని మరింత వివరంగా చెప్పాలని అనుకొంటున్నాను.. పదే పదే అబద్ధాలు చెప్పడం కొంత మందికి అలవాటుగా మారిపోయింది. వాస్తవ పరిస్థితులను ఆర్థిక మంత్రి ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు. అయినప్పటికీ నిజాలకు పాతర వేసి పదే పదే అబద్ధాలను వల్లిస్తున్నారు. వసూలు కాని రుణాల (నిరర్ధక ఆస్తులు) విషయాన్నే తీసుకొందాం. అధ్యక్షా, మీ ద్వారా ఎన్ పి ఎకు సంబంధించిన వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాలని ఉంది. ఎన్ పిఎ సమస్యకు 100 శాతం బాధ్యత ఇంతకు ముందున్న ప్రభుత్వానిదే అన్న సంగతి ముందు దేశ ప్రజలందరికీ తెలియాలి. దీనిలో ఇతరులకు ఒక్క శాతం బాధ్యత కూడా లేదు. బ్యాంకులపై ఒత్తిడి తెచ్చేలా విధానాలను రూపొందించుకొన్నారు. రుణాలను సొంత మనుషులకే ఇచ్చుకొన్నారు. వారు రుణాలను తిరిగి చెల్లించే పరిస్థితి లేదు. బ్యాంకులు, రాజకీయ నాయకులూ, ప్రభుత్వం, దళారులు కలసిపోయి రుణాలను పునర్వ్యవస్థీకరించారు. బ్యాంకుల నుండి బయటకు వెళ్లిన డబ్బు వెనుకకు రాలేదు. లావాదేవీలన్నీ కూడా కాగితాల మీదే ఉన్నాయి. దేశాన్ని యథేచ్ఛగా దోచుకొనే వైనం అలా కొనసాగుతూ పోయింది. లక్షల, వందల కోట్లను ఇచ్చేశారు. మేం అధికారంలోకి వచ్చిన తరువాత ఇది నా దృష్టికి వచ్చింది. ఒక వేళ దీనిపై రాజకీయం చేయదలచుకొంటే దేశ ప్రజల ముందు అన్ని వాస్తవాలనూ ఆనాడే

ఉంచే వాడిని. బ్యాంకుల దు:స్థితి ని గురించి చెప్పి ఉంటే అది ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేసేది. మీరు చేసిన పాపాలకు సంబంధించి రుజువులు నా దగ్గర ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకొని నేను మౌనంగా ఉన్నాను. ఇది దేశ సౌభాగ్యం కోసం చేసిందే. మీరు ఆరోపణలు చేస్తున్నప్పటికీ నేను క్షమిస్తోంది కూడా దేశ సౌభాగ్యం కోసమే. ఇపుడు బ్యాంకులను బలోపేతం చేశాం కాబట్టి, దేశ ప్రజల ముందు నిజాల్ని ఉంచే సమయం వచ్చింది. ఈ సభలో ఉండి నేను చెప్తున్నాను.. మీరు చేసిన తప్పిదాల వల్లనే వసూలు కాని రుణాల సమస్య ఉత్పన్నం అయిందని నేను చాలా స్పష్టంగా అంటున్నాను. ప్రజాస్వామ్య దేవాలయంలో ఉండి నేను ఈ విషయాన్ని చెప్తున్నాను. వసూలు కాని రుణాల సమస్య ఉత్పన్నం కావడానికి అవకాశం ఉన్న ఏ ఒక్క రుణాన్ని కూడా మా ప్రభుత్వం ఇవ్వలేదు. మీరు నిజాలకు పాతర వేశారు. అసలు సంఖ్యలను బయటకు చెప్పడం లేదు. ఎన్ పిఎలు 36 శాతం ఉన్నట్లు మీరు చెప్పారు. వాస్తవాలను బహిర్గతం చేయాల్సిందిగా 2014 లో మిమ్మల్ని అడిగాం. లేదని బొంక వద్దు. మేం అధికారంలోకి వచ్చిన అనంతరం కాగితాలలో చూస్తే వాస్తవంగా అది 82 శాతంగా ఉంది. 2008 మార్చి నెల లో బ్యాంకులు ఇచ్చిన రుణాలు రూ.18 లక్షల కోట్లు. 2014 వచ్చే సరికి ఇది రూ.52 లక్షల కోట్లకు చేరుకొంది. కాబట్టి, బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాలు రూ.52 లక్షల కోట్లు అయింది. ఇంత పెద్ద తేడా కేవలం 6 ఏళ్ల వ్యవధిలో! దేశాన్ని మీరు దోచుకొన్నారు. వ్యవస్థ ను పునర్వ్యవస్థీకరిస్తున్నాం. రుణాలు ఖచ్చితంగా ఎప్పుడు ఇచ్చారు ?, చెల్లింపులు ఎప్పుడు జరిగాయి ? అనే విషయాలను వెలికితీస్తున్నాం. మీరు దళారులను సమర్థించే పనిలోనే ఉన్నారు. ఎందుకంటే మీకు కావలసింది వాళ్లే. ఇందులో మీకు వ్యక్తిగత లాభం ఉన్నందునే ఇందులో మీరు పాలుపంచుకొన్నారు. దేశాన్ని ప్రక్షాళన చేసే పనిలో ఎదురయ్యే చిన్న చిన్న ఇబ్బందులను భరిస్తాం. ప్రక్షాళన అన్నది ఈ ఒక్క ప్రాంతానికే

పరిమితం కాదు. ప్రక్షాళన అన్నది నా దేశ ప్రజల హక్కు. వారి ఆలోచనలలో కూడా ఇదే ఉంది. అందుకే మేం ఈ పని చేశాం.

గత 4 సంవత్సరాలుగా ఈ పనిలోనే ఉన్నాం. ఇతర దేశాల అనుభవాలను కూడా పరిశీలించి, బ్యాంకులకు మరిన్ని నిధులను అందించే దిశగా ఎంతో ఆలోచించాం. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేశాం. బ్యాంకులను బలోపేతం చేసిన తరువాత కూడా మీ అబద్ధాలను భరిస్తున్నా. ఈ రోజు దేశ ప్రజలకు స్పష్టంగా చెప్తున్నాను.. మీరు ఈ దేశాన్ని రూ.18 లక్షల కోట్ల నుండి రూ.52 లక్షల కోట్ల వరకు దోచుకొన్నారు. 18 నుండి 52 కు మధ్య ఉన్న తేడా మీరు దోచుకొన్న డబ్బుకు చెల్లించవలసిన వడ్డీ. ఇవన్నీ మీరు ఒడిగట్టిన పాపాలు. ఈ డబ్బంతా మా ప్రభుత్వం ఇచ్చింది కాదు. ఇంత పాపానికి పాల్పడిన మిమ్మల్ని ఈ దేశం ఎన్నటికీ క్షమించదు. చేసిన పాపాలకు మీరు ఒక రోజు మూల్యం తప్పక చెల్లించవలసివుంటుంది.

ఇవి పిరికి వారు చేసే రాజకీయాలు. మా మీద బురద చల్లి దూరంగా పారిపోతారు. మీరు అనుకొన్నదే చేయండి. మీరు బురద చల్లే కొద్దీ కమలం మరింత వికసిస్తుంది. ఆరోపణల జోలికి వెళ్లకుండా ఓ కొత్త విషయాన్ని వెల్లడిస్తున్నాను. నిజానిజాలను దేశమే నిర్ణయిస్తుంది. మీరు ఖత్తర్ తో 20 ఏళ్ల కాల వ్యవధితో ఒక ఒప్పందం చేసుకొన్నారు. మేం ఖత్తర్ తో మాట్లాడి మా అభిప్రాయాన్ని వెల్లడించాం. పని మీరు ప్రారంభించినప్పటికీ, భారతదేశం సంతకం చేసింది కనుక, దానిని మేం పూర్తి చేస్తాం. ప్రతి ప్రభుత్వం ఈ తరహా బాధ్యతలు తీసుకోక తప్పదు. గ్యాస్ కొనుగోలు విషయమై, ఖత్తర్ తో మరోసారి చర్చించి 8 వేల కోట్ల రూపాయలను ఆదా చేశాం. నిష్కళంకమైన ఈ సభలో నిలబడి దేశ ప్రజలకు నేను ఈ విషయాన్ని చెప్తున్నాను.

మీరు అదనంగా 8000 కోట్ల రూపాయలను చెల్లించారు. ఎలా ?, ఏమిటి ? అన్న ప్రశ్నలు తెర పైకి రావచ్చు.. దీనిని దేశానికే వదిలిపెడదాం. ఇంతకు మించి దీనిని గురించి నేనేమీ చెప్పదలచుకోలేదు. గ్యాస్ కు సంబంధించి గతంలో ఆస్ట్రేలియాతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. మనం వారి వద్ద నుండి గ్యాస్ ను కొనుగోలు చేస్తున్నాం. వారితో కూడా మరోసారి చర్చలు జరిపి రూ.4,000 కోట్లు ఆదా చేశాం. వారికి సమయాన్ని పెంచడం వల్ల రూ.4,000 కోట్లు ఆదా అయ్యాయి. ఈ ప్రజా ధనాన్ని ఎప్పుడు, ఎలా, ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పండని దేశం మిమ్మల్ని ప్రశ్నిస్తుంది. దీనికి సమాధానాలు కావాలని మిమ్మల్ని నిలదీస్తారు.

ఎల్ఇడి బల్బులు : మీరు ప్రభుత్వంలో ఉన్నపుడు ఎల్ఇడి బల్బు ను 300- 350 రూపాయలకు ఏ కారణంతో విక్రయించారో చెప్పండి? భారత ప్రభుత్వం ఒక్కో బల్బు ను 300-350 రూపాయలకు కొంటోంది. అదే బల్బు, అదే సాంకేతికతతో, అదే నాణ్యతతో ఇపుడు కేవలం 40 రూపాయలకు కంపెనీలు విక్రయిస్తున్నాయి. దీనికి సమాధానం మీరు చెప్పాలి. మీ హయాంలో సౌర విద్యుత్తు 13, లేదా 14 లేదా 15 రూపాయల ధర ఎందుకు పలికేది? మీరు దేశాన్ని దోచుకున్నారు. మీరు పాటించిన ధర్మం ఇదే. మరి ఇప్పుడు సౌర విద్యుత్తు 2 నుండి 3 రూపాయలకే ఎందుకు లభిస్తోంది ? మేం మిమ్మల్ని అభిశంసించడం లేదు. ఆ పని ని అవసరమైతే ఈ దేశ ప్రజలు చూసుకొంటారు. నా పరిమితులలో నేను ఉండదలచుకొన్నాను. ఇవీ నిజాలు.

అందువల్ల ప్రస్తుతం ఈ దేశం పరువు ప్రతిష్ఠలు పెరిగాయని చెబుతున్నాను.ఈ రోజు ప్రపంచంలో మన పాస్ పోర్టుకు ఉన్న విలువ ఎన్నో రెట్లు పెరిగింది. మన పాస్ పోర్టు ఉన్న వారు విదేశాలలో ఎవరితో భేటీ అయినా, సగర్వంగా వారివైపు తలెత్తి చూస్తున్నారు. దేశంలో

ఉన్న సమస్యలను మీరు విదేశాలలో తప్పుగా అన్వయించడానికి మీకు సిగ్గుగా లేదా ? డోక్లామ్ సమస్య వచ్చినపుడు మీరు చైనా తో మాట్లాడుతారు. ప్రజాస్వామ్య సూత్రాలను మర్చిపోతారు.. బాధ్యతాయుత ప్రతిపక్షం అంటే ఎలా ఉండాలి ? ఒకసారి గుర్తు చేసుకోండి. ఇందిరాగాంధీ గారు బేనజీర్ భుట్టో తో సిమ్లా ఒప్పందం చేసుకొన్నారు. అప్పట్లో ఏకైక పెద్ద ప్రతిపక్షంగా మా పార్టీనే ఉంది. సమయం తీసుకొని అటల్ బిహారీ వాజపేయి గారు ఇందిరా గాంధీ గారితో భేటీ అయ్యారు. తీసుకొన్న నిర్ణయం తప్పుదారిలోకి వెళ్తోందని ఆమెను హెచ్చరించారు. ఆ తరువాత ఎలాంటి ఇబ్బందీ రాకుండా దేశాన్ని కాపాడుకోగలిగాం. ఈ దేశ ప్రజల క్షేమమే మా బాధ్యత. మన సైన్యం సర్జికల్ స్ట్రయిక్ లు చేసినపుడు మీరు దానిని ప్రశ్నించడం మొదలు పెట్టారు. కామన్ వెల్త్ గేమ్స్ గురించి ప్రజలు ఇంకా మర్చిపోలేదని నమ్ముతున్నాను. వారి మనస్సులలో నేటికీ ఇంకా ఎన్నో అనుమానాలు అలాగే ఉండిపోయాయి. భారతదేశం – ఆఫ్రికా సదస్సు ను 54 దేశాలతో ఈ ప్రభుత్వం నిర్వహించింది. బ్రిక్స్ సదస్సు, ఫీఫా అండర్- 17 ప్రపంచ కప్ నూ నిర్వహించాం. అనేక భారీ కార్యక్రమాలకు మేం శ్రీకారం చుట్టాం. జనవరి 26న ఆసియాన్ నుండి పది మంది నేతలు వచ్చారు. మన త్రివర్ణ పతాక ఆకాశంలో రెపరెపలాడుతోంది. నేను ప్రమాణ స్వీకారం చేసిన కార్యక్రమానికి సార్క్ దేశాలను ఆహ్వానించాం. ఇలాంటివి మేం చేయలేకపోయామే అని మీరు ఆశ్చర్యపోయారు. సంకుచితమైన వారు పెద్ద పెద్ద ఆలోచనలు చేయలేరు.

మేడమ్ స్పీకర్ ,

మేం అనుకొన్న ఓ సరికొత్త భారతాన్ని ఆవిష్కరిస్తున్నాం.. అది మా కోరిక. మహాత్మ గాంధీ 'యంగ్ ఇండియా' కోసం పని చేశారు. స్వామి వివేకానంద నవ భారతావని గురించి మాట్లాడారు. మాజీ రాష్ట్రపతి శ్రీ ప్రణబ్ ముఖర్జీ కూడా నవ భారతావని గురించే చెప్పారు. రండి, సరికొత్త భారతావనిని ఆవిష్కరించడానికి ప్రతిన చేద్దాం. విమర్శలు చేయడం

ప్రజాస్వామ్యానికి మంచిదే. ఈ సంఘర్షణ ఉంటేనే దాని నుండి మనం అమృతాన్ని సృష్టించవచ్చు. తప్పుడు ఆరోపణలు చేయడాన్ని మాత్రం ప్రజాస్వామ్యం అంగీకరించదు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను అవమానించే హక్కు మీకు లేదు.

రాష్ట్రపతి ప్రసంగాన్ని విమర్శించే వారు ఆయన ప్రసంగాన్ని మరో సారి చదవండి. ఒకసారి చదివినపుడు మీకు అర్థం కాకపోయి ఉండవచ్చు; దయచేసి మళ్లీ చదవండి. భాష పరంగా సందేహాలు ఉంటే పక్క వారి సాయం తీసుకోండి. రాసింది అక్షర సత్యం. దానిని మీరు కాదనలేరు. రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడిన గౌరవ సభ్యులందరికీ ధన్యవాదాలు చెప్తున్నాను. రాష్ట్రపతి ప్రసంగానికి ఏకగ్రీవంగా ఆమోదం చెబుదాం. మీ అమూల్యమైన సమయాన్ని కేటాయించినందుకు కృతజ్ఞతలు.

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

7 ఫిబ్రవరి 2018

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 7 ఫిబ్రవరి 2018

గౌరవనీయులైన చైర్మెన్ సర్,

గౌరవనీయ రాష్ట్రపతి గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఈ సభ కూలంకుషంగా చర్చించింది. 38 మంది గౌరవనీయ సభ్యులు వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. శ్రీ అమిత్ షా తన మొట్టమొదటి ప్రసంగంలో వారి ప్రతిపాదనలను సభ ముందుంచారు. వాటిని శ్రీ వినాయక సహస్ర బుద్ధె గారు సమర్థించారు. శ్రీ గులాం నబీ ఆజాద్ గారు, శ్రీ డి పి త్రిపాఠి గారు, శ్రీ ప్రమోద్ తివారి గారు, శ్రీ సర్దార్ బల్వంత్ సింగ్ గారు, శ్రీ నరేష్ అగర్వాల్ గారు, శ్రీ దిలీప్ కుమార్ గారు, శ్రీ సంజయ్ రౌత్ గారు, శ్రీ ఆనంద్ శర్మ గారు, శ్రీ డెరెక్ ఓ బ్రియన్ గారు, శ్రీ డి రాజా గారు, శ్రీ సంజయ్ సింగ్ గారు, శ్రీ సుఖేందు శేఖర్ రాయ్ గారు, శ్రీ టీకే రంగరాజన్ గారు, శ్రీ టీజీ వెంకటేష్ గారు, ఎంతోమంది గౌరవ సభ్యులు వారి అభిప్రాయాలను ఇక్కడ చెప్పారు. సభ్యులందరూ ఉపాధి, అవినీతి, రైతుల ఆదాయం, విదేశీ విధానం, భద్రతా వ్యవస్థ, ఆయుష్మాన్ భారత్ వంటి ఎన్నో విషయాలపై వారి అభిప్రాయాలను తెలిపారు. నేను గులాం నబీ ఆజాద్ గారిని ఇక్కడ కూర్చుని విన్నాను. మిగతా వారిని నేను నా గదిలో కూర్చుని విన్నాను. కాబట్టి నాకు వారి బాడీ లాంగ్వేజ్ ని గమనించే అవకాశం లభించింది. వారు కుటుంబ పాలన, రాజకీయాల గురించి మాట్లాడుతూ ఒక కుటుంబాన్ని కాపాడే ప్రయత్నం చేశారు. వారు ఏం మాట్లాడారో అది నిజమే కానీ అందులో కొంత అమాయకత్వం కనబడింది. గులాంనబీ గారి నుంచి ఆనంద్ శర్మ గారి వరకు వారంతా కూడా గత ప్రభుత్వం గురించే మాట్లాడారు. ఎవరూ గత ప్రభుత్వం గురించి ఎక్కడా వినరు, అందుకే వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు.కాంగ్రెస్ పార్టీ ఏమి చేయాలో, ఏమి

చేయకూడదో అనే దాని పై మాట్లాడే హక్కు నాకు లేదు. కానీ వారు ఆయుష్మాన్ భారత్ గురించి మాట్లాడుతూ అమెరికా, ఇంగ్లాండ్ ల ఉదాహరణలు చెప్పారు. కానీ భారత్ లో ఉన్న పరిస్థితులు, అమెరికా, బ్రిటన్ లలో ఉండే పరిస్థితుల మధ్య చాలా వ్యత్యాసం ఉంది. అక్కడ విజయవంతంగా అమలు చేయబడ్డవి ఇక్కడ విజయవంతం కాకపోవచ్చు.అలాగే అక్కడ విఫలం అయినవి ఇక్కడ మంచి ఫలితాలు ఇవ్వొచ్చు. కాబట్టి ఆ విధమైన వాదనలు సరైనవి కావు. మనము మన దృష్టి కోణంలో ఆలోచించాలి.వారు 50 నుంచి 55 సంవత్సరాలు అధికారంలో ఉన్నారు కాబట్టి వాస్తవానికి దూరంగా ఉండి ఉండొచ్చు. అందుకే, ఆ విధమైన అభిప్రాయాలు నిరంతరంగా ఉండడం సహజం. కానీ మనదేశంలో ఆరోగ్య రంగంలో చాలా చేయాల్సింది ఉంది అనే విషయంపై అందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తారు. నేను ఆరోగ్య రంగంలో చాలా చేయాల్సి ఉంది అని అంటే దాని అర్థం గులాంనబీ గారు ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడు ఏమీ చేయలేదని కాదు. కొన్ని కార్యక్రమాలు వారు చేపట్టి ఉంటారు. కానీ చాలా చేయవలసి ఉంది దీన్ని ఎవరూ కాదనలేరు. కాబట్టి ఈ విషయాలను మనము చర్చించి మన దేశ ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి. ఆ దిశగానే ఆయుష్మాన్ భారత్ యోజన తీసుకురావడం జరిగింది. ఆ పథకం లో కొన్ని లోపాలు ఉండి ఉండవచ్చు కానీ ఆ పథకం దేశం కోసం తీసుకురాబడింది. ఇది ఏ రాజకీయ పార్టీ కోసమో కాదు కాబట్టి కాంగ్రెస్, ఇతర పార్టీలలో ఉన్న నా మిత్రులు ఒక టాస్క్ ఫోర్స్ ని ఏర్పాటు చేసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అధ్యయనం చేయాలి. మీరు కనిపెట్టిన లోపాలకి నేను కచ్చితంగా సమయం ఇస్తాను. నేను వ్యక్తిగతంగా ఆ లోపాల వైపు దృష్టి సారిస్తాను. మన అంతిమ లక్ష్యం ఏమిటి? ఒక పేద లేదా దిగువ మధ్యతరగతి కుటుంబానికి ఏదైనా వ్యాధి సోకినప్పుడు వారు పొదుపు చేసిన డబ్బంతా ఆవిరైపోతుంది. అదే కాకుండా వారు అప్పు చేయవచ్చు. అలాంటి

సందర్భాలలో వారు ఎక్కువ వడ్డీ రేట్లకు డబ్బుని తెచ్చుకోవాల్సి వస్తుంది. వారి పిల్లల్ని వారు అప్పులపాలు చేయడానికి ఇష్టపడరు. అందుకే వారు వ్యాధులని భరిస్తారు.

ఈ విధమైన ఆలోచన వారిలో ఉంది. ఈ సందర్భంగా ఎన్నో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎవరు ఏం పని చేశారు? 70 ఏళ్లుగా ఎందుకు చేయలేదు? కానీ నా చర్చ ఈ విషయంపై కాదు. మా ఆలోచనా ప్రక్రియ మీలాంటిది కాదు. భగవంతుడు మనకి అన్నీ ఇచ్చాడు. మేము ఈ సభలో మా కంటే గొప్ప మేధావులు, అనుభవజ్ఞులు ఉన్నారని నమ్ముతాము. మనం అందరం కలిసి కూర్చుని, చర్చించి 40 నుంచి 50 కోట్ల మందికి మంచి ఆరోగ్యం పై ఆశని ఆయుష్మాన్ భారత్ ద్వారా ఇవ్వలేమా? ఇది బీమా పథకం, బీమా వ్యవస్థ గురించి మనందరికీ తెలుసు కాబట్టి మనం బడ్జెట్లో ఏ విధమైన ఏర్పాట్లు చేయాలో ఆ చర్చకే పరిమితమవుదాం. ఈ విషయం మనందరికీ బాగా తెలుసు. ఈ దేశంలోని పేద ప్రజలకు మేలు జరగాలి కాబట్టి ఈ పథకంతో ఎవరికీ ఏ విధమైన ఇబ్బంది ఉండదని అనుకుంటున్నాను. కానీ ఆ పథకం లో ఏవైనా లోపాలు ఉండి ఉండవచ్చు మేము దృష్టికి రాక పోయి ఉండవచ్చు. కాబట్టి ఆ విధమైన లోపాలు, విమర్శలని మేము స్వాగతిస్తున్నాం. సలహా సంప్రదింపుల సమయంలో ఈ పథకం ప్రాథమిక ఆలోచనని రూపొందించడం జరిగింది. ఇప్పుడు ఈ పథకాన్ని మరింత మెరుగ్గా మనం కలిసి ఎలా చేయాలి? కాబట్టి మీ నుండి ఉపయోగకరమైన సలహాలు, సమాచారం ఆశిస్తున్నాను. ఈ ఉపన్యాసాన్ని టీవీలో చూస్తున్న ప్రజలను కూడా వారి సలహాలను ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను. మనం ఈ దేశం లోని పేద ప్రజానీకానికి సేవ చేయాలంటే అది ఏదో ఒక్క రాజకీయ పార్టీ వల్లే అవ్వదు. కాబట్టి మనం అందరం కలిసి ఈ ఆలోచనను ముందుకు తీసుకువెళ్లాలి.

ఇప్పుడు ఇటు వైపు కూర్చుని ఆంగ్లంలో 9 అని రాస్తే ఇటు వైపు కూర్చున్న వారందరికీ అది 9 లానే కనిపిస్తుంది కానీ ఎవరైతే అటు వైపు కూర్చున్నారో వారికి 6 లా

కనిపిస్తుంది. నేను ఇటు 9 రాశాను నేను తప్పు కాదు కానీ మీరు అటు వైపు కూర్చోవడం వల్ల 6 లా కనిపిస్తుంది. దీనికి ఏం చేయాలి? ఒకవేళ మన దేశం లో సులభతర వ్యాపారం చేయడంలో భారత్ స్థానం మెరుగై తే మీకు ఎందుకు ఆ విషయం చెడుగా అనిపిస్తుంది? ప్రతీ భారతీయుడు మన దేశం లో సులభతర వ్యాపారం చేయడంలో తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటే గర్వపడాలి కదా? మన దేశ గౌరవం ప్రపంచం దృష్టిలో పెరిగింది. ఇది మన దేశానికి ఎంతో మంచి విషయం. మేము ఇది చేసాం మీరు అది చేశారు అని ఎన్నికల సమయంలో మనం వాదించొచ్చు. కొన్ని కొన్ని సార్లు మనం ప్రత్యక్షంగా ఒకరిని ఒకరు విమర్శించుకోవడం వీలు కానప్పుడు, మనం ఆ పనిని రేటింగ్ సంస్థల కి అప్పగించినప్పుడు ఆ రేటింగ్ సంస్థలని విమర్శిస్తారు. అలాంటి విషయం ప్రపంచంలో మరెక్కడా జరగదు. కొన్నిసార్లు భారతీయ జనతా పార్టీని విమర్శించే ప్రక్రియలో మీరు దేశాన్ని కూడా విమర్శిస్తారు. బీజేపీ ని విమర్శించడం మంచిదే, విమర్శలు ఉండాలి కూడా.అది మీ హక్కు. మీరు మోదీని కూడా విమర్శించొచ్చు,తీవ్రంగా విమర్శించ వచ్చు. ప్రజాస్వామ్యంలో మీకు సంపూర్ణ హక్కులున్నాయి. కానీ మీరు బీజేపీని ఖండిస్తున్న సమయంలో, దేశాన్ని కూడా ఖండించడం మొదలుపెట్టేస్తారు. మీరు మోడీ పై దాడి చేస్తున్నప్పుడు దేశంపై కూడా దాడి చేస్తూ ఉంటారు. రాజకీయంగా బీజేపీని మోడీని విమర్శించే హక్కు మీకు ఉంది. మీరు విమర్శించాలి కూడా కానీ అలా చేస్తున్నప్పుడు మీరు మీ హద్దుల్లో ఉండాలి. లేకపోతే ఈ దేశానికి ఎంతో నష్టం జరుగుతుంది. మీరు అలాంటి వ్యక్తులు మన మధ్య ఉన్నారన్న విషయాన్ని స్వీకరించక పోవచ్చు. మీరు ఎప్పటికీ ఆ విషయాన్ని స్వీకరించరు. నేను మీ బాధను అర్థం చేసుకోగలను. కానీ దయచేసి దేశానికి ఉన్న మంచి పేరు ని చెడగొట్ట వద్దు. గౌరవనీయులైన రాష్ట్రపతి గారు వారి ప్రసంగం లో నూతన భారతదేశం గురించి చెప్పారు. స్వామి వివేకానంద గారు కూడా నూతన భారత్ గురించి చర్చించారు.మహాత్మా గాంధీ గారు

కూడా యువ భారత్ గురించి మాట్లాడేవారు.మన మాజీ రాష్ట్రపతి గారు కూడా నూతన భారత్ గురించి ఊహించారు. అలాంటప్పుడు సమస్య ఎక్కడ ఉంది? మనకి నూతన భారత్ వద్దా?మనకి పాత భారతదేశమే కావాలా? నేను గాంధీ గారు కలలు కన్న భారతదేశం కావాలని నమ్ముతాను. గాంధీ గారి భారతదేశం మనకి కావాలి. భారతదేశం స్వతంత్ర దేశం కాబట్టి కాంగ్రెస్ అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాలని అప్పట్లో గాంధీజీ చెప్పారు. కాబట్టి కాంగ్రెస్ రహిత భారత్, మోదీ ఆలోచన కాదు. అది గాంధీ గారిది. మేము వారి అడుగుజాడల్లో నడుస్తున్నాము. ఇప్పుడు మీరు పాత భారతదేశాన్ని కోరుకుంటున్నారా? ఎక్కడైతే జీపు కుంభకోణం, సబ్ మెరైన్ కుంభకోణం, బోఫోర్స్ కుంభకోణం, హెలికాప్టర్ కుంభకోణాలు జరిగాయో? అలాంటి దేశానికి మీకు కొత్త భారత్ వద్దు. పాత భారత్ లోని ఎమర్జెన్సీ కాలంలో మొత్తం దేశం ఒక జైలు లా మార్చబడింది. ఎక్కడైతే జయప్రకాష్ నారాయణ్, మొరార్జీ దేశాయి లాంటి లక్షలమందిని ఎమర్జెన్సీ కాలంలో జైలులో పెట్టారో అలాంటి భారత్. మీకు ప్రజాస్వామ్య హక్కులు, పత్రికా స్వేచ్ఛని అణచివేసే భారత్ కావాలి. ఎక్కడైతే వేల కొలది అమాయక సిక్కు లను, ఒక పెద్ద వృక్షం పడిపోయాక చంపివేశారో అలాంటి భారత్. మీకు కొత్త భారత వద్దు. మీకు తాండూర్ కేసులో పలుకుబడి గల వ్యక్తుల ముందు మోకరిల్లే పరిపాలనా వ్యవస్థ కావాలి. ఎక్కడైతే వేలమందిని చంపిన అభియోగం ఎదుర్కుంటున్న వ్యక్తి విమానమెక్కి విదేశాలకు పారిపోతాడో,మీకు అలాంటి భారత్ కావాలి. డేవోస్ మీరు వెళ్లారు, మేము వెళ్ళాము. కానీ మీరు ఎవరితోనో, ఎవరో రాసిన ఉత్తరాన్ని ఇచ్చి పంపారు. మీకు అలాంటి భారతదేశం కావాలి, అందుకే మీకు కొత్త భారతదేశం వద్దనుకుంటారు.

గౌరవనీయులైన రాష్ట్రపతి గారు జన ధన్ యోజన గురించి కూడా మాట్లాడారు.కానీ మీరు ఆ పథకాన్ని కూడా విమర్శించారు, అది ప్రత్యేకమైనది కాదని అలాంటి పథకం

ఇంతకుముందు కూడా ఉండేదని చెప్పారు. మీరు కనీసం కొన్ని వాస్తవాలు అంగీకరించాలి. రాజకీయంగా మీరు ఏం మాట్లాడాలి అనుకుంటున్నారో మాట్లాడొచ్చు. కానీ, 31 కోట్ల జన్ ధన్ అకౌంట్లు, 2014 తర్వాత మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెరవబడ్డాయి. తథ్యాలని ఎవరూ మార్చలేరు ఈ వాస్తవం తెలుసుకొని మీరు మీ మాటల్ని సరి చేసుకుంటే మంచిది. అలాగే మీరు, మేము కేవలం పేరుని మారుస్తున్నామని,ప్రగతిని కాదని అన్నారు. మీరు మా పధకాలను గమనిస్తే, నిజాయితీగా మీరు మాట్లాడితే, మేము మా లక్ష్యాలని మారుస్తున్నామని అంగీకరిస్తారు. మేము లక్ష్యాలని చేధించి, వాటిని సాధించే వర్గం లో ఉన్నాము. కాబట్టి, ప్రతి లక్ష్యానికి ఒక సమయాన్ని నిర్దేశించి దానికి కావలసిన ప్రణాళిక సిద్ధం చేసి మా వద్ద ఉన్న వనరులను సమకూర్చుకుని, కష్టపడి, దేశాన్ని పీడిస్తున్న సవాళ్ల నుంచి దేశాన్ని విముక్తి చేసే దిశగా పని చేస్తున్నాము.

కాబట్టి కాంగ్రెస్ పార్టీ వారు సహజంగానే దీన్ని విమర్శిస్తారు. అలాగే వారు సహజంగానే ప్రశంసల్ని, దృష్టిని కోరుకుంటారు. మీరు వీటన్నిటికీ ఎంతగా అలవాటుపడిపోయారు అంటే ఇంకేమి కూడా మీకు కనిపించదు.

మీరు రికార్డులు చూసి 15 ఆగస్టు న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏ ప్రధానమంత్రి అయినా గత ప్రభుత్వాలు లేదా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన మంచి పనులను ప్రస్తావించారో లేదో చెప్పితే నేను సంతోషిస్తాను. నేను ఎర్రకోట నుంచి దేశాన్ని ఉద్దేశిస్తూ ప్రతి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటు తోనే మనం అధికారంలో ఉన్నామని చెబుతాను. ఈ మాట అనడానికి ఎవరు సంకోచించకూడదు. అలాగే అటల్ బిహారీ వాజ్పాయ్ గారిని స్మరించుకోమని మిమ్మల్ని మేము కోరము. మీరు బలవంతంగా అలా చేసి ఉంటే సరే. అలాగే 2014 ముందు మీరు చేసిన పనులన్నింటికీ మీకు గుర్తింపు దొరకాలి. మీకు గుర్తింపు కావాలని కూడా ఉంది. మీకు కొన్ని అద్భుతమైన నిబంధనలు ఉన్నాయి. మేము యువకులు గా ఉన్నప్పుడు గ్రామాల్లో

చిన్న పిల్లలు క్రికెట్ ఆడడం చూసేవాళ్ళం. చివరిగా వారు పోట్లాడుకునేవారు. మేము ఎందుకు పోట్లాడుకుంటున్నారో అని ఆశ్చర్య పోయే వాళ్ళం. ఇంత సేపు ఆడుకుంటూనే ఉన్నారు కదా? కానీ మాకు అర్థమైంది ఏంటంటే వారి వద్ద ఒక నిబంధన ఉండేది, ఎవరిది బ్యాటో, వారు బ్యాటింగ్ చేసేవారు. అతను అవుట్ అయ్యాక, తన బ్యాట్ తీసుకుని వెళ్ళిపోయేవాడు. మీరు కూడా అంతే. ఎప్పటికీ మీ వద్ద బ్యాట్ ఉంటుందని అనుకుంటున్నారు. ఇప్పుడు మీ వద్ద బ్యాట్ లేదు కాబట్టి ఆట అయిపోయింది అని అంటున్నారు. కానీ ఈ విధంగా వ్యవస్థ నడవదు.

అలాగే ఆధార్ విషయానికి వస్తే అది మీ పని అని మేము దానికి గుర్తింపు పొందుతున్నామని మీరు అన్నారు. కానీ మీరు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే, 7 జూలై 1998 న ఇదే సభలో గౌరవనీయులైన చైర్మన్ గారు ఎవరైతే అప్పుడు సభ్యుడిగా ఉండేవారో ఆయన ఒక ప్రశ్న అడిగారు. అప్పటి హోం మంత్రి శ్రీ లాల్ కృష్ణ అద్వానీ గారు ఇదే సభలో జవాబు ఇస్తూ, బహుళ ప్రయోజనాల జాతీయ గుర్తింపు-కార్డు ఏది అయితే పాస్ పోర్ట్ లు, డ్రైవింగ్ లైసెన్స్ లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సంబంధ, విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం, పబ్లిక్ ప్రైవేటు రంగాలలో ఉపాధి కోసం, జీవిత, సాధారణ బీమా కోసం, భూ రికార్డులు, పట్టణాలలోని ఆస్తుల రికార్డుల కోసం పనికి వస్తుందని, ఇవ్వాలని చెప్పారు. ఆధార్ కి బీజం అప్పుడే పడింది.

గౌరవనీయులైన చైర్మన్ సార్, మీరు రేణుకా గారిని వదిలేయండి. రామాయణం సీరియల్ చూశాక ఇన్ని రోజుల తర్వాత నాకు అలాంటి అట్టహాసం వినే అవకాశం దొరికింది. 20 ఏళ్ల క్రితం ఇది అటల్ బిహారీ వాజ్పేయి గారి దార్శనికత. కానీ కాంగ్రెస్ వారు ఆధార్ వారే ప్రారంభించారని వారికి గుర్తింపు కావాలని కోరుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు. ఆధార్ వీరిదే. మాకు పార్టీ కంటే దేశం ముఖ్యం. మా నిర్ణయాలకు ఆధారం దేశ సంక్షేమం.

ఈ రోజు మీరు గుర్తింపు కోసం పాకులాడడం సహజం. సుప్రీం కోర్ట్ ఆదేశించింది, ఆ విషయాన్ని మీరు మూడు సంవత్సరాలు వాయిదాలు పెట్టారు. ఆ గుర్తింపు కూడా మీకే లభించాలి. మేము మొదటి సెట్ ని అంగీకరించాము. కానీ మీరు ఈ సమస్య ఉత్పన్నం కాదని చెప్పవచ్చు. అలాగే కాంగ్రెస్ పార్టీ వారు నల్లధనానికి వ్యతిరేకంగా దర్యాప్తు వారే ప్రారంభించారని గుర్తింపు కోరవచ్చు. 28 సంవత్సరాల వరకు కాంగ్రెస్ పార్టీ బినామీ ఆస్తుల కి వ్యతిరేకంగా చట్టాన్ని అమలు చేయలేదు, దానికి కూడా గుర్తింపు వారికే దక్కాలి. ఇప్పటిదాకా 3500 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను జప్తు చేయడం జరిగింది. ఆనంద్ గారు, మీకు ఈ విషయం తెలిసే ఉంటుంది. మీరు ఈ సభలో చాలా కాలంగా ఉన్నారు, అలాగే విషయాలను చెప్పే ప్రత్యేక పద్ధతి మీకు తెలుసు. బినామీ ఆస్తుల చట్టం 28 సంవత్సరాల క్రితం ఉభయ సభలలో ఆమోదించబడింది.కానీ నిబంధనలు రూపొందించలేదు, ఆ చట్టాన్ని అమలు చేయలేదు. అందుకే ఆ చట్టం ఇన్ని రోజులు నిష్క్రియ గా ఉంది. ఎవరు ఆ చట్టం ఆపేశారు? ప్రతిపక్ష పార్టీలు దానికి బాధ్యులు కాదు. ఈ రోజున 35 వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు జప్తు చేయబడ్డాయి. కాబట్టి మీ పదవి కాలం లో బినామీ ఆస్తులు పెరగడానికి మీకు గుర్తింపు ఇవ్వాలి. ప్రపంచం మారిపోయింది. అలాగే మీకు దివాలా స్మృతి గురించి తెలియదని నేను అనుకోను. ఇలాంటి చట్టాలని వ్యక్తిగత స్వార్థం కోసం తీసుకు రాకపోవడాన్ని మీకు గుర్తింపుగా చెప్పాలి. మేము పారిశ్రామిక రంగం, విశ్వ సమాజం, భారత్, వాటి చట్టాలపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచే దిశగా నిర్ణయాలు తీసుకున్నాము. ఒక ర్యాంకు ఒక పెన్షన్ విషయానికి వస్తే వారు నాలుగు దశాబ్దాలుగా దేశానికి అబద్ధాలు చెబుతూ వచ్చారు. ఎన్నికలకు ముందు ఐదు వందల కోట్ల బడ్జెట్ కేటాయించారు. మేం అధికారంలోకి వచ్చాక ఏ విధమైన రికార్డులు లేవు అని, ఏ విధమైన అధ్యయనం జరగలేదు అని మేము గమనించాము. మేము ఒక ర్యాంక్ ఒక పెన్షన్ పథకాన్ని అమలు చేసినప్పుడు 11 వేల కోట్ల

రూపాయలు అవసరమయ్యాయి. అలాంటిది వీరు ఐదు వందల కోట్ల రూపాయలతో ఎలా చేసి ఉండేవారు? అందుకు వారికి తప్పకుండా గుర్తింపు లభించాలి. అలాగే జీఎస్టీ కోసం అర్ధరాత్రి ఒక కార్యక్రమాన్ని నిర్వహించాము. కాంగ్రెస్ పార్టీ దాన్ని బహిష్కరించింది. అన్ని పార్టీలు హాజరయ్యాయి. వారికి భయం ఎందుకంటే జి ఎస్ టి కి మాకు గుర్తింపు లభిస్తుందని. మీరు నమ్మండి, నమ్మకపోండి. జిఎస్టి కి వ్యతిరేకంగా మీరు ఏర్పరచిన అభిప్రాయం మీ ఖాతాలోకి వెళ్తుంది. దేశము ఇవన్నీ గమనిస్తుంది. ఊహించండి! వేరే వారికి గుర్తింపు దొరుకుతుందని వీరు భయపడుతున్నారు.

అలాగే వేపపూత విషయానికి వస్తే మీరు మొదలు పెట్టి మధ్యలో వదిలేశారు. దానికి ఒక పరిమితిని పెట్టారు. అలాంటి సందర్భంలో, అది మంచి కన్నా చెడే ఎక్కువ చేసింది. వేప పూత కి రెండు అంశాలు ఉంటాయి. అది వారికి తెలిసే ఉంటుంది. ఒకటి యూరియా బలాన్ని పెంచుతుంది కాబట్టి రైతులు తక్కువ మోతాదులో వాడవచ్చు. రెండవది గుణాత్మక మార్పు తీసుకువచ్చి ఉత్పత్తిని పెంచుతుంది. ఇంకో విషయం ఏమిటంటే యూరియా ని రైతులకి ఇవ్వకుండా పరిశ్రమలకు దారి మళ్ళించి, బిల్లు మాత్రం రైతుల పేరు మీద తీసుకునేవారు. ప్రభుత్వ సబ్సిడీ నీ పరిశ్రమలకు రైతుల పేరుమీద దోచిపెట్టే వారు. ఇప్పుడు వేపపూత 100% చేస్తే అది పరిశ్రమలకి ఉపయోగపడదు. ఈ విషయం వారికి బాగా తెలుసు, అందుకే 35 శాతానికి పరిమితం చేశారు. మిగతా 65 శాతాన్ని ఎవరి కోసం మీరు తెరిచి ఉంచారో తెలీదు.దీనికి గుర్తింపు ఎవరికీ లభించాలి? కాబట్టి మేము వేప పూత 100% ఉండాలని నమ్ముతున్నాము. అలాగే దిగుమతి చేసుకున్న యూరియా ముందుగా 100% వేప పూత వేయబడుతుంది. దాని ఫలితంగానే ఈ రోజు యూరియా కి ఏమాత్రం లోటు లేదు. లేనిచో నేను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం ప్రధానమంత్రి గారికి యూరియా కోసం రెండు మూడు ఉత్తరాలు రాయాల్సి వచ్చేది. నేను ప్రధానమంత్రి అయ్యాక యూరియా

కావాలని కోరుతూ ముఖ్యమంత్రులు ఉత్తరాలు వ్రాసేవారు. కానీ ఈరోజు యూరియా కోసం ఒక ఉత్తరము కూడా రావడం లేదు. అలాగే లాఠీచార్జీలు లేవు. రైతులకు యూరియా లభిస్తుంది. ఇలాంటి మార్పులు చేయొచ్చు. కానీ కొన్ని సందర్భాలలో రాజకీయాలు ఆధిపత్యం ప్రదర్శిస్తాయి.ఎందుకంటే మళ్లీ మళ్లీ ఎన్నికలు జరగడం వలన ప్రణాళికలు పూర్తికాకుండానే శంకుస్థాపనలు చేసి ప్రాజెక్టులను ప్రారంభించేవారు. దానివల్ల ఈసారి రైల్వే బడ్జెట్ లో ఏ విధమైన ప్రకటనలు చేయకుండా ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు రైల్వే బడ్జెట్ ను ఆమోదించారు. కానీ ఇలా ఎందుకు చేయాల్సి వచ్చింది? ఎందుకంటే గత ప్రభుత్వాలు పదిహేను వందల రైల్వే ప్రాజెక్టుల ను ప్రకటించాయి. వాటి ప్రగతిని చూడడానికి ఎవరు లేరు. వాటిని ప్రకటించడం, ఈ సభలో కొన్ని రోజులు వాటిని ప్రశంసించడం జరిగేది. కొన్ని వార్తా పత్రికలలో దీనికి సంబంధించి ఒక కథనాన్ని ప్రచురించి, ఒక ఎంపీ కొంత ప్రజాదరణ సంపాదించాక, అక్కడితో ఆ విషయాన్ని ముగించే వారు. కానీ ఈ విధమైన సంస్కృతి వల్ల దేశం చాలా నష్టపోయింది.

నేను ప్రగతి టెక్నాలజీ ద్వారా చొరవ తీసుకుంటున్నాను అన్న విషయం మిమ్మల్ని ఆశ్చర్యానికి లోను చేయవచ్చు. నేను పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులన్నిటిని వ్యక్తిగతంగా సమీక్షించాను. అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీ లు, భారత ప్రభుత్వ సెక్రెటరీ లతో ఆన్ లైన్ లో కూర్చుని చర్చిస్తాం. మీకు ఆశ్చర్యం గొలిపే విషయం ఏమిటంటే ఇలాంటి ప్రాజెక్టులు 30 నుంచి 40 సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్నాయి. వీటి శిలాఫలకాలు వేయబడ్డాయి కానీ ఈ ప్రాజెక్టులు కాగితాలకే పరిమితమయ్యాయి. నేను ప్రతి విభాగం, ప్రతి ప్రాజెక్టుని సమీక్షించడం మొదలెట్టాను. గత ప్రభుత్వాల బాధ్యత కాబట్టి ఈ ప్రాజెక్టులను నేను నిర్లక్ష్యం చేయను. ఎందుకంటే దేశం ముందుకు సాగాలి. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి. ఇది ప్రజాస్వామ్యం. జై రామ్ రమేష్ గారి పదవీ కాలంలో మొదలుపెట్టిన ప్రాజెక్ట్ ని మేము నిర్లక్ష్యం

చేయలేదు. అలా చేయడం. మనం పని చేయాల్సిన స్ఫూర్తి కాదు. మీకు ఆశ్చర్యం గొలిపే మరో విషయం ఏమిటంటే ఇప్పటిదాకా తొమ్మిది లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలపడం జరిగింది. నేను వివిధ మంత్రిత్వ శాఖల లో 30 నుంచి 40 సంవత్సరాలు గా అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టులు చూడమని చెప్పాను. ఆ ప్రాజెక్టులు సమయానికి పూర్తి అయి ఉంటే అవి కొన్ని వేల కోట్ల రూపాయలకే పూర్తి అయిపోయి ఉండేవి. కానీ ఈ రోజు వాటి విలువ 9 లక్షల నుంచి 10 లక్షల కోట్ల రూపాయలకు పెరిగిపోయింది. మీరు కూడా ప్రభుత్వాలు నడిపారు, ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటుందో వారు ఈ బాధ్యతని నిర్వహించాలి. మీ పేర్లు మాత్రం శిలాఫలకాలపై ఉన్నాయి.కొన్ని శిలాఫలకాలు దొంగిలించ బడ్డాయి. కాబట్టి ఈ గుర్తింపు మీకే లభించింది. ఎందుకంటే ఈ పథకాలు కూడా మీకు చెందినవే.

ఆజాద్ గారు తేదీ తో సహా ఆహార భద్రత చట్టం గురించి మాట్లాడారు. మీరు ఎవరినైనా అడగొచ్చు, మీరు చెప్పిన తేదీకి ఒక సంవత్సరం తర్వాత మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మీరు ఆ చట్టాన్ని ఒక సంవత్సర కాలంలో ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు మీరు సుప్రీంకోర్టు ఆదేశాలను ఊటంకిస్తున్నారు. కేరళలో మీ ప్రభుత్వం ఈ చట్టాన్ని అంగీకరించలేదు. సుప్రీంకోర్టు కొరడా ఝుళిపించాలసి వచ్చింది. కానీ మీరు మమ్మల్ని నిందిస్తున్నారు.మేము తీసుకున్న నిర్ణయాలు, లక్ష్యాలు పూర్తిచేసే దిశగా ఉంటాయని నేను నమ్ముతాను.

మీరు ఎరువుల పరిశ్రమ ఈ సమయంలో ప్రారంభించారని చెబుతున్నారు. అది నిజమే కానీ ఆ పరిశ్రమలు మీ పదవీ కాలం లోనే మూతబడ్డాయి. ఎంతో మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దానికి కూడా మీకు పేరు రావాలి. మేము చట్టాలలో మార్పులు చేసి కొన్ని అమలు చేస్తున్నాము. మేము యూపీలోని గోరఖ్ పూర్, బీహార్ లోని బరౌనీ, జార్ఖండ్ లోని

సిందీ్ర లోఎరువుల పరిశ్రమలను పున:ప్రారంభించడానికి త్వరితగతిన పని చేస్తున్నాము. పరిశ్రమలకు గ్యాస్ సరఫరా అందించడానికి మేము జగదీష్ పూర్ నుండి హల్దియా గ్యాస్ పైప్ లైన్ ని జోడించాము. ఆ ప్రాంతంలో ఆ విధమైన ఏర్పాటు చేయడం వల్ల తూర్పు భారత ప్రాంతాలలో అభివృద్ధి వేగవంతమవుతుంది. ఆ రాష్ట్రం భారతీయ జనతా పార్టీ పాలించడం లేదు. దేశ ప్రగతి కోసం తూర్పు భారతదేశంలోని రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెందాలి. దేశమంతా సమతుల్యమైన అభివృద్ధి జరగాలి. మేము అభివృద్ధి సూత్రాల ఆధారంగా ప్రత్యక్షం గా పని చేస్తున్నాము. మీరు ఈ విషయాన్ని ప్రశంసిస్తారు అని నమ్ముతున్నాను

గౌరవనీయ సభ్యులు అమిత్ షా గారు ఉపన్యాసం చేశారు. ఆ ప్రసంగం లో సర్దార్ పటేల్ గారి ప్రస్తావన లేదని ఆజాద్ గారు పేర్కొనడం నాకు సంతోషాన్ని కలిగించింది. వారు సర్దార్ పటేల్ గారి ని స్మరించినందుకు సంతోషం. ఈ మధ్య గుజరాత్ లో ఎన్నికలు జరిగాయి, ఆ ఎన్నికలలో బాబు బాయ్ గారు గెలిచారు. సర్దార్ పటేల్ గారు కాంగ్రెస్ పార్టీ ప్రతీ సాహిత్యంలో ఉన్నారు. ఇలాంటి రోజు చాలా సంవత్సరాల తర్వాత చూస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ విధమైన సాంప్రదాయం కొనసాగిస్తామని నేను అనుకున్నాను, కానీ గుజరాత్ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో సర్దార్ పటేల్ గారి ప్రస్తావన ఎక్కడా లేదు. మీరు పాత ఫోటోలు చూడొచ్చు, వార్తాపత్రికలు కూడా దీనిపై కథనాలు ప్రచురించాయి. అందులో ఎన్నికలు జరిగిన ఒక వారం తర్వాత సర్దార్ పటేల్ గారి ప్రస్తావన మర్చిపోయారు అని రాశారు. మా నాయకుడు సర్దార్ పటేల్ గారి పేరును ప్రస్తావించకుండా మీరు ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. కానీ మీరు గుర్తు చేసుకోవాల్సిన ఏంటంటే సర్దార్ పటేల్ గారికి, బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి భారతరత్న ఇవ్వడం జరిగింది. వారికి ఆ గౌరవం ఇవ్వడానికి ఎందుకు అన్ని సంవత్సరాలు పట్టింది? ఈ విషయం రాష్ట్రపతి గారి ప్రసంగానికి సంబంధించినది కాదు అయినా ఆ విషయాన్ని

లేవనెత్తారు. మీరు ఆ విషయాన్ని లేవనెత్తడం మంచిదే, కానీ మీరు ఎప్పుడు ఏ విషయాన్ని లేవనెత్తినా 4 వేళ్లు మీ వైపు చూపిస్తాయని గుర్తుంచుకోండి. మీరు మర్చిపోకూడదు - మనదేశంలో కార్య ప్రగతి ఏ విధంగా జరుగుతుందో బహుశా మీ కార్య సంస్కృతి లో అలాంటి విషయాలను గమనించే తత్వం లేదనుకుంటా.

ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసే భాగ్యం నాకు దక్కింది, అలాగే ఆజాద్ గారు కూడా ముఖ్యమంత్రిగా పనిచేసి ఉన్నారు. శరద్ పవార్ గారు కూడా ముఖ్యమంత్రిగా పని చేసి ఉన్నారు కాబట్టి అందులోని ప్రతి విషయం వారికి తెలుసు. ఒక ముఖ్యమంత్రి ఏ విషయం అయినా సూటిగానే చెప్పాలి, అన్ని విషయాలు వివరంగా తెలిసి ఉండాలి, ఎవరైతే ముఖ్యమంత్రిగా పని చేశారో వారికి ఇది తెలుసు. కానీ చాలా కొద్ది మంది ముఖ్యమంత్రులు ఈ సభ లోకి వస్తారు, ఇక్కడికి వచ్చాక వారికి విభాగాలు ఇవ్వబడతాయి. కానీ నాకు చాలా పెద్ద బాధ్యత ఇచ్చారు కాబట్టి నా గత అలవాట్లు నాకు సహాయం చేస్తున్నాయి.

నీటిపారుదల ప్రాజెక్టులు ఏళ్ళక్రితం కట్టారు, డ్యాములు కట్టారు, కానీ ఆ నీటి వల్ల ఎవరికి ఉపయోగం? అవి వ్యవసాయ అవసరాల కోసం నిర్మించినవి కానీ మీ గత నలభై యాభై సంవత్సరాలలో ఆ నీటిని ఉపయోగించే నెట్వర్క్ ని అభివృద్ధి చేయలేదు. ఒక ఆరు అంతస్తుల భవనాన్ని మెట్లు లేదా లిఫ్ట్ లేకుండా కట్టడం మనం ఊహించగలమా పని చేసిన విధానాన్ని చూడండి - నేను 99 అలాంటి ప్రాజెక్టులని గుర్తించి ఆ పనులన్నీ ప్రారంభించాము. ఆ పనుల కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించారు, ఎందుకంటే రైతులకు నీటి లభ్యత ఉండాలి కాబట్టి. అందులో 50 ప్రాజెక్టులు పూర్తి చేసాము, మిగతా వాటిపై పని జరుగుతూ ఉంది. త్వరలోనే మిగతా ప్రాజెక్టులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తాం.

మీరు సృష్టించడం, కట్టడం మంచిది. కానీ ఇక్కడ ప్రశ్న ఏంటంటే ఆలోచన అసంపూర్ణంగా ఎందుకు ఉంది? ఆ కార్యం ఎందుకు పూర్తి కాలేదు? దాని ఫలితంగా మనకి లభించాల్సిన ఫలితాలు లభించలేదు. ఒకవేళ మనం ఏకీకృత ఆలోచన విధానం, సంపూర్ణ ఆలోచనా విధానాన్ని పాటించి ఉంటే బాగుండేది. మీరు మీ కార్య కాలంలో మొదలెట్టిన పనులన్నీ పూర్తి చేసి ఉంటే ఈరోజు మన దేశం మంచి స్థితిలో ఉండేది. మీరు ఏమి చేయలేదు అని నేను అనడం లేదు, కానీ మీరు చేసిన విధానం పరిణామాల పై ప్రభావం చూపుతుంది. మీరు అందులో వెనుకబడ్డారు. మంచి పని చేసే అవకాశం ఎవరికి దొరుకుతుందో వారు బాధ్యతగా వ్యవహరించాలి.

కాబట్టి మేము ఏ విధంగా పెను మార్పులు తీసుకొస్తున్నామన్నది మీరు చూడాలి. మన దేశంలో ఎక్కువగా బడ్జెట్ కేటాయించడాన్ని ఒక తృప్తికరమైన చర్యగా చూస్తారు. దానికి ప్రశంసలు అందుతాయి. బడ్జెట్ కేటాయింపుల వైపు చూసేవారు తక్కువ, వాటి పరిణామాల వైపు చూసే వారు ఇంకా తక్కువ. ఎవరూ ఫలితాల గురించి మాట్లాడరు. మేము కార్య సంస్కృతిని మార్చాము, ఫలితాల నివేదికని రూపొందించి పార్లమెంట్ లో సమర్పిస్తున్నాము. ఈ విధంగా చేయడం వల్ల ఒక ప్రాజెక్ట్ కి కేటాయించిన నిధులు ఆ ప్రాజెక్టుకి వినియోగిస్తున్నారో లేదో తెలుస్తుంది. కాబట్టి మనం ఫలితాలపై దృష్టి పెట్టాలి.

రైతుల ఆదాయం రెట్టింపు చేసే విషయం ఇక్కడ చర్చించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తే ఎవరికైనా ఎందుకు సమస్య ఉంటుంది? ఆశ్చర్యం గొలిపే విషయం! నాకు తెలిసి ఎవ్వరికీ అభ్యంతరం వుండదు అందులో రాజకీయం కూడా లేదు. ఇక్కడ కూర్చున్న ప్రతి సభ్యుడికి తెలుసు, వారి హృదయంలో వారు ఈ పని చేయాలని కోరుకుంటున్నారు. ఈ పని ఏ విధంగా రూపుదాల్చుతుంది? భూమి పంపకాలు పెరుగుతూనే ఉంటాయి, ఒక కుటుంబంలో సభ్యులు పెరుగుతూనే ఉంటారు. ఒక రైతు కి పది ఎకరాల భూమి ఉంటే అది

వారి పిల్లల మధ్య పంచబడుతుంది. ఆ తర్వాత అది రెండు లేదా ఒక బిగా కి తగ్గిపోతుంది. అలాంటప్పుడు వ్యవసాయం చేయడం కష్టమవుతుంది అందుకే మనకి టెక్నాలజీ అవసరం ఉంది. ఆ దిశగా మనం టెక్నాలజీని అలవాటు చేసుకోవాలి. మనము అధునాతన పద్ధతులు పాటించాలి. అప్పుడే ఫలితాలు మారుతాయి. సాయిల్ హెల్త్ కార్డ్ అలాంటి ఒక ప్రయత్నం. పర్ డ్రాప్ మోర్ క్రాప్, సూక్ష్మ నీటి పారుదల కూడా అలాంటి ప్రయత్నమే. ఒక సమయంలో చెరుకు వరద నీటి పారుదల లేకుండా మనదేశంలో పండించలేకపోయారు. రైతులు చెరుకు సాగు చేయాలంటే వారి పొలాలు నీటితో నిండి ఉండాలని నమ్మేవారు. గుజరాత్ లో నాకున్న అనుభవంతో స్ప్రింక్లర్ ఇరిగేషన్ సిస్టం ద్వారా చెరుకు ని సాగు చేయడమే కాకుండా ఎక్కువ ఉత్పత్తిని సాధించాము. క్రమంగా దేశమంతా నీరు పొదుపు చేయడం జరిగింది, అలాంటి ఎన్నో ప్రయోగాలు జరిగాయి. ఇంతకు మునుపు ఎవరైతే అరటి సాగు చేసేవారో కోతలు కోశాక మిగిలిపోయిన అవశేషాలను శుభ్రం చేయడానికి ఖర్చు పెట్టాల్సి వచ్చేది. వారు దాదాపు ఒక ఎకరాకు, 5 వేల నుంచి 15 వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. మన వ్యవసాయ విశ్వవిద్యాలయం అరటి తోట లో మిగిలిన అవశేషాల నుంచి పీచుని ఉత్పత్తి చేసి వాటి నుంచి బట్టలను తయారుచేసింది. ఆ పద్ధతి ద్వారా మంచి నాణ్యత గల బట్టలు ఉత్పత్తి అవుతున్నాయి.

అవి పొడి నేలపై చల్లి ఉంటే ఆ నేలపై చెట్లు, మొక్కలు నీరు లేకుండా 90 రోజులపాటు ఎదగగలవు. ఆ విధమైన వ్యర్థాన్ని సంపదగా చేసుకున్నాం. ఈ రోజు ప్రజలు వాటిని వాడుకుంటున్నారు, ఎకరానికి 10 నుంచి 15 వేల రూపాయలు ఇచ్చి కొంటున్నారు. మన దేశంలో వ్యవసాయ వ్యర్థాల పై దృష్టి పెడితే మన రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా మనం ముందుకు సాగవచ్చు.

ఇప్పుడు రైతు రెండు విధాలుగా నష్టపోతున్నాడు - వారు ఎక్కువగా ఉత్పత్తి చేసినా లేదా తక్కువ ఉత్పత్తి చేసినా. చక్కెర పరిశ్రమలు ముఖ్యంగా రైతుల పైనే ఆధారపడి నడుస్తున్నాయి. ఇప్పుడు అవసరం 10 శాతం పెరిగింది. ఎప్పుడైతే ఒత్తిడి ఉంటుందో ప్రపంచ మార్కెట్లో ఆ ప్రభావం ఉంటుంది. దాన్ని మనం ఛానల్ వైపు మళ్లిస్తే మన రైతుల నుండి రక్షించిన వాళ్లమవుతాం. అలాగే కిసాన్ సంపద పథకాన్ని ప్రారంభించాము, మాకు తెలుసు చాలా వరకు నిధులు వ్యర్థం అవుతున్నాయని. ఎందుకంటే పొలాల నుంచి మార్కెట్ వరకు కొన్ని వేరు వేరు లోపాలు ఉన్నాయి. మనకున్న మౌలిక వసతులలో కూడా లోపాలు ఉన్నాయి. విత్తనాల నుంచి మార్కెట్ వరకు మనం ఒక సంపూర్ణ పద్ధతిని అవలంబించి నట్లయితే మన ప్రయత్నాలు ఫలప్రదం అవుతాయి కాబట్టి మేము ఆ దిశగా పని చేస్తున్నాము. ఈనామ్ స్కీం ఈమధ్య మొదలెట్టాం. ఇప్పటికే చాలా రాష్ట్రాలలో ఏపీఎంసీ చట్టంలో కొన్ని మార్పులు చేసి ఉండాల్సింది, కానీ చేయలేదు. అయిననూ రైతులు ఈనామ్ ద్వారా ఆన్లైన్ లో అమ్మకాలు చేసి 36 వేల కోట్ల రూపాయల వ్యాపారం చేశారు. 36 వేల కోట్ల రూపాయల వ్యాపారం ఒక గొప్ప ప్రారంభం. అది మరింత అభివృద్ధి చెందుతుంది అని నేను నమ్ముతున్నాను.

మనము అదనపు విలువ పెంచాల్సిన అవసరం ఉంది. కేవలం పచ్చిమిరప అమ్మడం వల్ల రైతులకు ఎక్కువ ఆదాయం రాదు, కానీ మంచి నాణ్యత గల ఎండుమిరప పండు ఇచ్చినట్లయితే దానిని పొడి చేసి ప్యాకెట్లు గా మార్చి సరైన పేరు పెడితే రైతుల ఆదాయం పెరుగుతుంది.

రైతుల కోసం అనుబంధ కార్యకలాపాలను చూసినట్లయితే ఈ రోజు వారి పొలంలోనే సౌర శక్తి కి సంబంధించి పని చేయవచ్చు. దాని ద్వారా వారికి సౌర విద్యుత్ శక్తి లభిస్తుంది. అలాగే డీజిల్, విద్యుత్ పై ఖర్చు తగ్గిస్తుంది, అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు వారి నుండి విద్యుత్తు

కొనుగోలు చేయవచ్చు. ఇలా చేయడం వల్ల వ్యయం చాలా వరకూ తగ్గుతుంది.

మనం వెదురు గురించి మాట్లాడుతున్నప్పుడు ఇది వారి తప్పు కాదు. 90 ఏళ్లుగా వెదురు ని చెట్టు గా పరిగణించే చట్టాన్ని మనం చూశాం. అందువల్ల వెదురు ని ఎవరు నరక లేరు. మరోవైపు ప్రపంచమంతా వెదురు ని గడ్డిగా పరిగణిస్తారు. ఈ పని మీ ప్రభుత్వం చేసి ఉండవచ్చు, దానికి తగ్గ గుర్తింపు కూడా లభించేది. మేము ఆ దిశగా ఆలోచించి, వెదురు ని గడ్డిగా వర్గీకరించి చొరవ చూపించాం. ఈరోజు రైతు వెదురు ని వారి పొలం చుట్టూ సాగు చేసుకుంటున్నారు. ఇలాంటి పంటలకి ఏ విధమైన హాని ఉండదు, ఇది అదనపు ఆదాయాన్ని ఇస్తుంది కూడా. ఈ రోజు భారతదేశం నుంచి వేల కోట్ల రూపాయల విలువ చేసే వెదురు విదేశాలకు ఎగుమతి అవుతుంది. మన దేశం నుంచి అగ్గిపుల్లల కోసం గాలిపటాల కోసం, అగరొత్తుల కోసం వాడుతున్నారు. ఇది ఒక చిన్న నిర్ణయం, దీనివల్ల రైతుల ఆదాయం గణనీయంగా పెరిగింది.

అలాగే తేనెటీగల పెంపకంలో కూడా మనం మంచి అభివృద్ధి సాధించి ఉండేవాళ్ళం. కానీ అది జరగలేదు. ఎందుకు జరగలేదు? గత నాలుగు సంవత్సరాలలో 11 తేనెటీగల అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా తేనె ఉత్పాదన లో 38 శాతం వృద్ధి జరిగింది. ఈ తేనె ని విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నాం. ప్రపంచం ఈరోజు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ దిశగా అడుగులు వేస్తోంది. ప్రపంచం పర్యావరణ సంరక్షణ పట్ల ఎక్కువ స్పృహతో ఉంది.

అందుకే ప్రజలు రసాయన మైనం కన్నా తేనెటీగల మైనాన్నే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. తేనెటీగల మైనాన్ని మనం ప్రపంచ మార్కెట్ లో ఆధిపత్యం సంపాదించే దిశగా అభివృద్ధి చేయవచ్చు. మన రైతులు ఒక మూలన ఉన్న చెట్టు కింద కూర్చుని పని చేయొచ్చు. మేము పశువుల పెంపకం, మత్స్య, కోళ్ల పెంపకం పై దృష్టి పెట్టాం. ఇలాంటివి

అదనపు విలువ ని జోడించి రైతులకు సహాయం చేస్తాయి. ఆ విధంగా చేస్తే రైతుల ఆదాయం రెట్టింపు చేయడం పెద్ద కష్టమేమీ కాదు, రైతులు ఈ విధంగా సాధికారత సాధించగలరు. ఈ దిశగా మనమందరం కూడా ప్రయత్నాలు చేయాలి. అప్పుడే మనకి కచ్చితమైన ఫలితాలు లభిస్తాయి. ఆ దిశగా మనం చర్యలు చేపట్టాలి. ఈరోజు స్వచ్ఛ భారత్ అభియాన్, మేక్ ఇన్ ఇండియా, జన్ ధన్ యోజన, అంతర్జాతీయ యోగా దినోత్సవం, నల్లధనం పై దర్యాప్తు, సర్జికల్ స్ట్రైక్ లను ఎగతాళి చేయడం జరిగింది.

మీరు చెప్పండి, ఓ బి సి కమిషన్ కి రాజ్యాంగ హోదా ఇవ్వడం పై అభ్యంతరం దేనికి? నాకు ఒక్క కారణం చెప్పండి! గత కొన్ని సంవత్సరాలుగా ఆ డిమాండ్ ఉండింది, మీరు ఆ పని చేయక పోవడానికి ఏదో ఒక కారణం ఉండే ఉంటుంది. ఈ సభలో కూడా ఆ విషయం చాలా రోజులుగా వాయిదాలు ఉంది. మనం కలిసి పని చేయలేమా?

అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపే ధైర్యం లేదు, ప్రజల్ని ఎదుర్కొనే ధైర్యం లేదు. ఈరోజు ఓబిసి సమాజాలలో ఆకాంక్షలు మేల్కొన్నాయి. ఈరోజు ఓబీసీ సమాజం వారు జాగరూకులై వారి హక్కుల కోసం గొంతెత్తి అడుగుతున్నారు. మీ రాజకీయం మిమ్మల్ని బాహాటంగా మాట్లాడనీయదు. అందుకే మీరు ఏదో ఒక వంక వెతుకుతూ ఉంటారు. ఈ రోజు దేశంలో ఓబిసి సమాజం వారు వారి హక్కుల గురించి అడుగుతున్నట్లయితే వారికి అవి ఇద్దాం. కాబట్టి రాజకీయాలను పక్కన పెట్టి వారిని అడ్డుకోకుండా వారిని ప్రోత్సహిద్దాం.

ముమ్మారు తలాక్ పై చట్టాన్ని చేయకుండా మిమ్మల్ని ఎవరు ఆపలేదు. 30 ఏళ్ల క్రితం మీ చేతిలో ఈ పని చేయడానికి అవకాశం లభించింది. మీరు ఆ పని చేయలేదు. మీ రాజకీయాలు, మీ మంత్రి ప్రసంగంలో త్రిపుల్ తలాక్ ఎందుకు ఉపసంహరించకూడదు అనే విషయం పై ప్రశ్నలు వేశారు. ప్రతి చోట నుంచి దానికి వ్యతిరేకంగా స్వరాలు వినబడ్డాయి. మీ

రాజకీయాలు, మీ ఓట్ బ్యాంక్ ప్రమాదంలో ఉంది కాబట్టి మీరు ఆ మంత్రిని తొలగించారు. ఇప్పుడు ఆ చర్య భారతదేశంలోని నేర చట్టం కిందకి వస్తుంది. మీ తర్కం, సమర్ధన ఈ కింది కథలా ఉంది. ఒక వ్యక్తి ఒక హత్య చేస్తాడు కానీ ఆ వ్యక్తిని జైలుకు పంపరు, ఎందుకంటే ఆ వ్యక్తి వారి తల్లిదండ్రులకు 30ఏళ్ల ఒకే ఒక్క కొడుకు. వారి తల్లిదండ్రులు ఎలా జీవిస్తారు? ఒక హిందువు ఇద్దరు మహిళలను పెళ్లి చేసుకుంటే అతను జైలు కి వెళ్ళాలి. ఆ సందర్భంలో అతని తల్లిదండ్రులు ఎలా జీవిస్తారో ఎవరికీ పట్టలేదు. కాబట్టి ఎవరైనా ఈ విషయాన్ని అధ్యయనం చేసి విశ్లేషిస్తే ఆ వ్యక్తులు ఇస్తున్న తర్కానికి ఆశ్చర్యపోతారు.

కొన్నిసార్లు నరేష్ గారిని విని నేను అయోమయానికి లోనయ్యాను. వారు మహిళల పట్ల సానుభూతిని చూపిస్తున్నారో లేక అవమానిస్తున్నారో అర్థం కాలేదు. దాని గురించి చెప్పడం కష్టం. వారు ఎన్నో చెప్పారు. 15 సంవత్సరాలుగా ఎంతో సహించాము. మాకు తెలుసు ఈ చట్టం పనిచేస్తుందో లేదో. మీరు ఎవరి పుత్రుడిని కేసులో ఇరికించే పని పడుతున్నారని చెప్పారు, అతన్ని అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. అలాంటి మాటలు ఎగతాళి చేయడమే అవుతుంది. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది, కాబట్టి నేను చెప్పేది ఒకటే - నాకు సహాయం చేయండి. ఈ సందర్భంగా కవి కుమార్ చెప్పిన కొన్ని పంక్తులు :

వారు సహాయం చెయ్యమని కోరుతున్నారు

వారు సహాయం చేయమని కోరుతున్నారు.

కత్తిలాంటి ఎముకలు ఉన్న వారి అభ్యర్థన చూడండి

మహిళలపై అత్యాచారాలు అనే విషయం కాంగ్రెస్ లేదా బిజెపి, ఇతర పార్టీలకు చెందిన అంశం అని నేను అనుకోవడం లేదు. అది ఎప్పటికీ అలా కాదు. కానీ ఆజాద్ గారు, ఇతరుల

అనుమానాలు సరైనవి. అందుకే నేను ఎర్రకోట నుంచి ధైర్యంగా చెప్పాను. మన ఆడబిడ్డల గురించి చాలా చెప్తాను, కానీ మన కొడుకులు ఇంటికెందుకు ఆలస్యంగా వస్తున్నారో అని ఎవరు అడగరు. కనీసం వారి కొడుకులు ఎక్కడికి వెళ్లారు, ఎవరిని కలిసారు అని అడగరు. విలువలు నేర్పే బాధ్యత ఎవరో ఒకరు తీసుకోవాలి కాబట్టి అలాంటి తల్లులు, తండ్రులు, ఉపాధ్యాయులు అందరిని మనం ఓకే మాటతో మందలించలేమా? ఆడబిడ్డ పై అత్యాచారం చేసిన ఆ వ్యక్తి ఎవరో ఒకరి కొడుకే కదా? కాబట్టి మనం అందరం కలిసికట్టుగా ఈ సామాజిక దురాచారాన్ని ఎదుర్కోవాలి. అందుకే మహిళల సాధికారత కోసం మేము ఉజ్వల యోజన తీసుకొచ్చాం. ఈ సభ ద్వారా నేను ప్రతి ఒక్కరికి స్టార్టప్ చేయాలని ప్రత్యేకంగా మనవి చేస్తున్నాను.

మనదేశంలో స్వచ్ఛమైన వంట కోసం మనమందరము యుద్ధ ప్రాతిపదికన పని చేయాలి. సాధ్యమైతే సౌరశక్తి పై పనిచేసే వినూత్నమైన వంట పొయ్యిలను రూపొందించాలి. అలా చేస్తే మన దేశం లోని పేద ప్రజలు వండుకోవడం కోసం అదనపు సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు, ఆ విధంగా గ్యాస్ ని రవాణా చేయడం కోసం మనం చేసే ఖర్చును కూడా తగ్గించవచ్చు, వారి ఇళ్లలోనే సౌరశక్తి కి ఒక ఏర్పాటు చేయొచ్చు. అలాగే గ్యాస్ పొయ్యిలను కూడా ఆధునిక, వినూత్న విజ్ఞానాన్ని ఉపయోగించి తయారు చేయొచ్చు. స్వచ్ఛమైన వంట మన దైనందిన జీవితాలలో, పర్యావరణం కోసం, మహిళల ఆరోగ్యం కోసం చాలా అవసరం. ఇది రాజకీయ అజెండా కాదు ఇది దేశ సంక్షేమం కోసం మనం అందరం కలిసి ముందుకు తీసుకు వెళ్లాల్సిన విషయం వారు స్వచ్ఛభారత్ ప్రచారం కోసం ఎంత ఖర్చు పెట్టామని అడుగుతున్నారు. నేను వారిని బాధ పెట్టే విషయాలు చెప్పదలుచుకోలేదు. ఎందుకంటే వారు కూడా ప్రభుత్వంలో ఉన్నారు, వారికి ప్రజా జీవితం ఉంది. మరుగుదొడ్ల శుభ్రత విషయానికి వస్తే అది ప్రవర్తన కి సంబంధించిన విషయం, మౌలిక సదుపాయాల కి సంబంధించిన

విషయం కాదు. అది ఒక అలవాటు కాబట్టి ప్రపంచంలో ఈ విషయాన్ని అధ్యయనం చేసిన వారందరూ కూడా ఈ మాట అని చెప్పారు. మీరు ప్రభుత్వాన్ని నడుస్తున్నప్పుడు కూడా ప్రవర్తనలో పరివర్తన మీద దృష్టి పెట్టడం జరిగింది. ప్రవర్తనలో మార్పు లేకుండా మనం ప్రగతి సాధించలేము. ఇప్పుడు ప్రభుత్వం కార్యక్రమాలపై ఎక్కువగా ప్రచారాలు జరగడం లేదు. ఇప్పుడు ప్రజలకు ఈ విషయాల పట్ల అవగాహన కల్పించడానికి ప్రవర్తనలో మార్పు తీసుకు రాగలిగే కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ విషయం చెప్పడానికి ముందు మనం ఒక విషయం మర్చిపోకూడదు. పేదల సొమ్ము ఉపయోగించి ఒక కుటుంబానికి చెందిన కొంత మంది సభ్యుల పుట్టినరోజుల ప్రకటనలు వార్తా పత్రికలలో పూర్తి పేజీలో వేసేవారు. వ్యక్తుల ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చే ప్రయత్నం చేయడానికి మనం కష్టపడాలి. మీ రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ లో కూడా ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి కేటాయింపులు చేయమని అడగండి. వారు కూడా ప్రజల కి అవగాహన కల్పించాలి.

గౌరవనీయులైన చైర్మన్ సర్, ఆజాద్ గారు బోఫోర్స్ విషయంపై విస్తారంగా చర్చించారు. దానికి గుర్తింపు పొందాలని అనుకున్నారు. నేను ఒక విషయం చెప్తాను. ఇది ఒకప్పటి సీనియర్ కాంగ్రెస్ మంత్రి, ఆ తర్వాత రాష్ట్రపతిగా పనిచేసిన శ్రీ ఆర్.వెంకటరామన్ గారి ఆత్మ కథలో రాశారు. వారి ఆత్మ కథ పేరు "మై ప్రెసిడెన్షియల్ ఇయర్స్" బై ఆర్.వెంకట్రామన్. వారు జె.ఆర్.డి.టాటా ని కలిసినప్పుడు వారి మధ్య జరిగిన సంభాషణ రాశారు. రాజీవ్ గాంధీ వారి కుటుంబం, ఆయుధాలు, రక్షణ ఒప్పందాల వల్ల ప్రయోజనం పొందారో లేదో తెలియదు, కానీ కాంగ్రెస్ పార్టీ ఏ విధమైన కమిషన్లు తీసుకోలేదు అనే విషయాన్ని కాదనడం కష్టం - అది వారు నమ్మేవారు. నేను ఈ విషయం చెప్పడంలేదు. నేను ఆర్.వెంకట్రామన్ గారికి పుస్తకంలో ఉన్నది చెప్పాను. 1980 తర్వాత పారిశ్రామికవేత్తల నుండి నిధులు తీసుకోలేదని పార్టీ ఖర్చులు ఈ విధమైన ఒప్పందాలలో లభించిన కమిషన్ల ద్వారా

చేసేవారనీ అన్నారు. ఆర్.వెంకట్రామన్ గారు మీ సీనియర్ నాయకుడు, వారు రాష్ట్రపతిగా కూడా చేశారు. వారసత్వ రాజకీయాల విషయానికి వస్తే నాకు నిరాశ తో పాటు కోపం కూడా కలుగుతుంది. అది సహజం ఎందుకంటే మీ రాజకీయ పరిధిని నేను బాధించదలుచుకోలేదు. నేను అలాంటి పని ఎప్పుడూ చేయను. కానీ, మీ పార్టీలోని కొంతమంది రాచరికం పోయింది కానీ మేము రాజు లాగానే ప్రవర్తిస్తాము అని అన్నారు. ఈ విషయం వార్తాపత్రికలలో వచ్చింది. జైరాం రమేష్ గారు ధైర్యంగా మాట్లాడినందుకు వారికి నా అభినందనలు.

సాధారణంగా ద్రవ్యోల్బణం ప్రభావం మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలపై ఎక్కువగా ఉంటుంది. అంతకుమునుపు ద్రవ్యోల్బణం ఏవిధంగా నియంత్రణలో లేకుండా పెరిగేదో మనందరికీ తెలుసు. మేము ఈ ద్రవ్యోల్బణాన్ని 2 నుంచి 6 శాతం మధ్య ఉండేలా కృషి చేశాం. ద్రవ్యోల్బణం ముందులాగా పెరుగుతూ పోయి ఉంటే ఇప్పుడు మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి వర్గాలకు జీవించడం కష్టమై ఉండేది. మధ్యతరగతి కుటుంబాలను సంరక్షించే దిశగా మేము అడుగులు వేస్తాం. ఎవరైతే సొంత ఇల్లు కట్టాలి అనుకుంటున్నారో వారికి ప్రభుత్వం వడ్డీ రేట్లు తగ్గించిన సబ్సిడీల రూపంలో సహాయం చేస్తుంది. ఆ విధంగా ఈ ముఖ్యమైన లక్ష్యాన్ని సాధించాము.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కొత్త వర్గాల ని రూపొందించాము. తొమ్మిది లక్షల వరకు ఉన్న గృహ రుణాలపై నాలుగు శాతం వడ్డీ రేట్లు తగ్గింపు నిచ్చి మధ్యతరగతి వర్గాలు ఇల్లు కట్టుకోవడానికి సహాయం చేస్తున్నాం. మధ్యతరగతి వర్గాల వారి ఆకాంక్షలు ఉంటాయి. అలాగే 12 లక్షల గృహరుణం పై 3 శాతం వడ్డీ రేట్లపై తగ్గింపు కల్పిస్తున్నాం. అలాగే, గ్రామాలలో ఎవరైనా పాత ఇళ్ళని కొత్తగా నిర్మించాలనుకుంటున్నా, ఒకటి లేదా రెండు గదులు అదనంగా కట్టుకోవాలి అనుకుంటున్నా వారికి రెండు లక్షల వరకు రుణాలపై వడ్డీ రేట్లపై

మూడు శాతం తగ్గింపు కల్పిస్తున్నాం. ఇలాంటి చర్యలు, మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడానికి సహాయపడతాయి.

అలాగే రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం తీసుకు రావడం వల్ల, సామాన్యులు - ప్రత్యేకించి మధ్యతరగతికి చెందిన వారు ఇల్లు కట్టుకోవాలి అనుకున్నప్పుడు వారికి ఈ చట్టం భద్రత కల్పిస్తుంది. మేము ఎన్నో నియమ నిబంధనలు రూపొందించడం ద్వారా సామాన్య వ్యక్తికి లాభం చేకూరుతుంది. ఆ విధంగానే, మేము వినియోగదారుల భద్రత చట్టం, వినియోగదారుల సాధికారత దిశగా దృష్టి సారించాము.

'భారతీయ జన ఔషధీ పథకం' కింద ఎనిమిది వందల కంటే ఎక్కువ మందులను అతి తక్కువ ధరలకే ప్రజలకు అందించడం జరుగుతుంది. లబ్ధిదారులు వారి వ్యయం 60 నుంచి 70 శాతం తగ్గిందని నమ్ముతున్నారు. అలాగే మోకాళ్ళ మార్పిడి ఆపరేషన్లు, స్టెంట్ల పై కూడా ఖర్చుని తగ్గించాము. ఈరోజు మన దేశంలో కిడ్నీకి సంబంధించి చాలా సమస్యలు ఉన్నాయి. ఒక రోగి డయాలసిస్ చేయించుకోవడానికి జిల్లా ముఖ్య కార్యాలయం లేదా ఒక పెద్ద పట్టణానికి వెళ్లాల్సి వచ్చేది. ఈ విషయంలో మేము యుద్ధప్రాతిపదికన పని చేశాము, ఇప్పుడు డయాలసిస్ సదుపాయం కనీస ధరలకే ఐదు వందల కంటే ఎక్కువ జిల్లాలలో లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం ఇప్పటివరకు 22 లక్షల డయాలసిస్ చికిత్సలు చేయడం జరిగింది. ఈ చర్యలన్నీ కూడా మానవ సంక్షేమానికే. అందుకే మేము అలాంటి పనులపై ఎక్కువ శ్రద్ధ వహిస్తున్నాము.

అలాగే మీ అందరికీ తెలుసు ఎల్ఈడీ బల్బులు వల్ల కలుగుతున్న లాభాలు. దాదాపు వేల కోట్ల రూపాయలు మధ్యతరగతి వర్గం వారు పొదుపు చేశారు, దాదాపు పదిహేను వేల కోట్ల రూపాయలు వారికి మిగిలాయి. రాష్ట్రపతి గారి ప్రసంగం లో మరో విషయం తో నేను

ఏకీభవిస్తాను - ఇది కేవలం ప్రభుత్వం లేదా ఒక రాజకీయ పార్టీ పనికాదు, ఈ పని ఈ దేశం గురించి ఆలోచించే ప్రతి వ్యక్తికి సంబంధించినది. ఈ సభలో కూర్చున్న ప్రతి సభ్యుడికి సంబంధించినది, ఇది అందరికీ సమానమైన బాధ్యత. గౌరవనీయులైన రాష్ట్రపతి గారు ఈ విషయం పై స్పష్టంగా చెప్పారు. ప్రణబ్ దా రాష్ట్రపతిగా ఉన్నప్పుడు కూడా వారు ఈ విషయాన్ని చెప్పారు. అలాగే మరెందరో ఈ విషయంపై వారి అభిప్రాయాలు వెల్లడించారు. అలాగే లోక్ సభ, విధాన సభ కి ఒకేసారి ఎన్నికలు జరిగే ప్రత్యేక గురించి కూడా మాట్లాడదాం. రాజ్యసభ సభ్యులకి ఎన్నికలతో పెద్దగా అవసరం ఉండదు, కానీ ఎవరైతే సభ్యులు రాజ్యసభ, లోక్ సభలో వస్తూ ఉంటారో వారికి ఎన్నికల ఇబ్బంది తెలుసు. కొంతమంది సభ్యులు లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయాక రాజ్యసభ కి రావడం జరుగుతుంది, కాబట్టి వారికి ఈ పరిస్థితి బాగా తెలుసు. భారతీయ ప్రజాస్వామ్యం గత కొన్నేళ్లుగా పరిపక్వత చెంది మనం ఒక ఆరోగ్యకరమైన సాంప్రదాయంతో ముందుకు వెళ్ళగలిగాము. 1967 వరకు లోక్ సభ, విధాన సభ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా కొన్ని చర్చలు తలెత్తుతాయి. ఒక వ్యవస్థ తన స్థానంలో ఎప్పుడూ ఉంటుంది, ఆ సమయంలో పెద్దగా సమస్యలు లేవు. కానీ ఆ తర్వాత రాజకీయ కారణాలతో సృష్టించడం జరిగింది. అందుకే ఈ రోజు మనం ఒక ఎన్నిక అయిన తర్వాత మరో ఎన్నికకి ఏర్పాట్లు చేస్తుండటం చూస్తూ ఉంటాము. ఆ విధంగానే ఎన్నికల తర్వాత ఎన్నికలు జరుగుతూనే ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతాయి. సమాఖ్య వ్యవస్థలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకి ఐదు నుంచి ఆరు నెలల ముందు రాజకీయాలు చేయవచ్చు, కానీ మిగతా నాలుగు నుంచి నాలుగున్నర సంవత్సరాలు మనం ప్రశాంతంగా పని చేయాలి. మన పూర్తి సామర్థ్యంతో పని చేయాలి. ఆ దిశగా మనం అడుగులు వేయాలి.

ఆ విషయంపై విస్తారమైన చర్చ జరగాలి. రాబోయే లోక్ సభ ఎన్నికలలో, నాలుగు రాష్ట్రాలు ఎన్నికల కి వెళ్లబోతున్నాయి,అవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అరుణాచల్ ప్రదేశ్, ఒడిస్సా. మనకి అవరోధాల గురించి బాగా తెలుసు. 2009లో లోక్ సభ ఎన్నికల కోసం దాదాపు 1000 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. 2014లో ఖర్చు నాలుగు వేల కోట్ల రూపాయలకు పెరిగింది. 2014 నుండి ఇప్పటిదాకా అసెంబ్లీ ఎన్నికల కోసం దాదాపు మూడు వేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి.

భారతదేశం లాంటి దేశంలో పేదలకు సౌకర్యాలు కల్పించే బాధ్యత మనకి ఉన్నప్పుడు, మనకున్న వనరులు, భద్రతా బలగాలను ఎన్నికల కోసం వాడుతున్నాం. 9 లక్షల 30 వేల పోలింగ్ బూత్ ల లో ఒక కోటి కంటే ఎక్కువ మంది సిబ్బందికి విధులు కేటాయిస్తున్నాం. మన బలగాలు ఆ సమయంలో కేవలం ఆ పని కే పరిమితమవుతున్నాయి. ఈ విషయం పార్టీ రాజకీయాలకు అతీతం. దేశ సంక్షేమం కోసం మన ఆలోచనలలో భేదం ఉండొచ్చు కానీ మన వాదనలు గొడవలు గా మారకూడదు. మన వాదనలు నిజాయితీగా ఉంటూ ఒక పవిత్రతని కాపాడుకోవాలి. మనం కలిసి పరిష్కారాల కోసం పని చేయాలి. మనం ఈ సాంప్రదాయాన్ని విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్ళగలమని నమ్ముతున్నాను. మనం తీసుకున్న నిర్ణయాలు ప్రపంచంలోని ఎన్నో దేశాల దృష్టిలో అద్భుతాలు. మనదేశంలో ఎన్నో పార్టీలు ఉన్నా, ఆ విధమైన నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నామా అని వారు ఆశ్చర్యపోతున్నారు. సభలో కూర్చున్న సభ్యులు గతంలో కూడా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. అలాంటి నిర్ణయాలలో కొన్ని ఉత్తమమైన నిర్ణయాలు ఉన్నాయి.ఆ నిర్ణయాల వల్ల భవిష్యత్తు తరాలకి లాభం చేకూరుతుంది. ఈ సభలో కూర్చున్న విశిష్టమైన వ్యక్తుల ముందు నాకు ఈ పని చేసే అవకాశం దొరుకడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

ఇక్కడ ఉన్న ప్రముఖ వ్యక్తులు వేరు వేరు విషయాలపై వారి అభిప్రాయాలు వెల్లడించారు. రాష్ట్రపతి గారి ప్రసంగం ఒక సంపూర్ణమైన ప్రసంగం. అది ప్రభుత్వ దశ, దిశ, ఆలోచనల సమాహారం. ఆ ఉపన్యాసం, మేము ముందుకి వెళ్తున్న విధానం, సామాన్య ప్రజల కోసం ఒక ఖచ్చితమైన సమయ సీమ లో రూపొందిస్తున్న సంక్షేమ పథకాల సారాంశం. ఈ విషయాలన్నీ మీ ముందు ఉంచే ప్రయత్నం జరిగింది. మనమందరము గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగాన్ని సర్వ సమ్మతితో అంగీకరించి, వారికి ధన్యవాద తీర్మానాన్ని ఆమోదిద్దాం. ఈ ఆశతో, ఈ తీర్మానానికి నా మద్దతు తెలుపుతూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. ధన్యవాదాలు.

పదవీ విరమణ చేస్తున్న రాజ్యసభ సభ్యులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి వీడ్కోలు ఉపన్యాసం.

28 మార్చి 2018

రాజ్యసభలో పదవీ విరమణ పొందిన సభ్యులకు వీడ్కోలు -28 మార్చి 2018

గౌరవనీయులైన చైర్మన్ గారు, గౌరవనీయ సభ. ఈ సభ లోని కొంతమంది సభ్యులు పార్లమెంటేరియన్లుగా అనుభవాన్ని గడించారు అని నేను నమ్ముతున్నాను. ఇప్పుడు వారు సామాజిక సేవలో వారి పాత్ర ని మరింత బలోపేతం చేసుకుంటారు. ఈ రోజు ఈ సభ నుంచి పదవీ విరమణ చేస్తున్న సభ్యులు, వారి తోడ్పాటును అందిస్తూ, గొప్పదనాన్ని కూడా పొందారు. ప్రతి ఒక్కరూ నిజాయితీగా దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేశారు. వారి తోడ్పాటును ఎప్పటికి మరువలేము. వారు అందించిన సేవలకి వారికి ధన్యవాదాలు. ఈ సభ సీనియర్ నాయకులకి చెందినది. వారి జీవిత అనుభవాలు ఈ సభకి అదనపు విలువని జోడించాయి.

సామాజిక జీవితానికి కావలసిన ఆశలు, ఆకాంక్షలను ఈ సభ నిష్పక్షపాతంగా విశ్లేషించి, భవిష్యత్తు సామాజిక వ్యవస్థ కి అవసరమైన పరిపూరకాలని అందిస్తుంది. ఇక్కడ చర్చించే ప్రతీ విషయం, విధాన రూపకల్పనలో చాలా ముఖ్యమైనవి, విలువైనవి. మన మధ్య సీనియర్ సభ్యుడు శ్రీ కె పరాశరన్ గారు ఉన్నారు. వారు ఒక ఋషి లాగా వృత్తి నైపుణ్యంతో జీవించారు. ఈ సభ అలాంటి గొప్ప వ్యక్తుల అనుభవాలతో గౌరవించబడుతుంది. మనదేశం గర్వించదగిన ఇద్దరు గొప్ప క్రీడాకారులు శ్రీ దిలీప్ టిర్కీ, శ్రీ సచిన్ రమేష్ టెండూల్కర్ త్వరలోనే పదవీ విరమణ చేయబోతున్నారు. మనము శ్రీ పీజే కురియన్ గారిని ఎప్పుడూ గుర్తుంచుకుంటాం. వారు ఎప్పుడూ నవ్వు మొహంతో మన మధ్య ఉంటూ వచ్చారు. వారి నుండి మనం ఏ సందేశాన్నయినా నవ్వు మొహంతో ఇవ్వొచ్చని నేర్చుకోవచ్చు. ఇది వారి ప్రత్యేకమైన గుణం. అందువల్లనే వారు ప్రతికూల పరిస్థితులలో కూడా సభ ని సజావుగా

నిర్వహించడంలో సఫలీకృతులయ్యారు. చాలా కొద్ది మంది సభ్యులే ఏ పార్టీ సిద్ధాంతాలతో సంబంధం లేకుండా ఉంటారనేది వాస్తవం. ఎక్కువ మంది సభ్యులకు ఏదో ఒక నేపథ్యం ఉంది. కాబట్టి ఒక సిద్ధాంతాన్ని వారు నిలబెట్టడానికి సహజంగానే కృషి చేస్తూ ఉంటారు. కానీ దిగువ సభలో ఏదైతే చేస్తారో అది ఎగువ సభలో కూడా చేయాలని ఆశిస్తుంటారు. కానీ ఆ అవసరం లేదు. ఎందుకంటే ఎగువ సభకు ఒక ప్రతిష్ఠ ఉంది. ప్రతి ఒక్కరూ అందులో తమ వంతు పాత్రను బాగా పోషించారు. అలాగే ఎంతోమంది సభ్యులు వారు ఏ విషయమైనా మాట్లాడదలచినా, ఆ విషయం గురించి బాగా తయారయ్యి ఈ సభలో వారి అంతిమ ప్రసంగం చరిత్రాత్మకం గా ఉండాలని ఆశిస్తారు. ఆ విధంగా ఈ సభ ద్వారా వారి ఆలోచనలను దేశంతో పంచుకుని దేశ అభివృద్ధిలో తోడ్పడదామని అనుకుంటారు, కానీ అలాంటి అవకాశం వారికి ఈమధ్య లభించి ఉండకపోవచ్చు. దానికి అందరము బాధ్యులం.

మీరు కొన్ని ముఖ్యమైన చర్చలలో పాల్గొని, గొప్ప వారసత్వాన్ని ఈ సభకి అందించి ఉంటే సంతృప్తిగా ఉండేవారు. మీకు బాధ్యతతో కూడిన గొప్ప భావన కలిగి ఉండేది. కానీ కొన్ని పరిస్థితుల వల్ల వారికి ఆ అవకాశం లభించలేదు. నిన్న కూడా ఈరోజు మాట్లాడే అవకాశం దొరుకుతుంది అని నేను అనుకోలేదు.కానీ గౌరవనీయ చైర్మన్ గారి నిజాయితీ, కృషి తో పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. శ్రీ విజయ్ గారు కూడా కృషి చేయడం వల్ల ఈరోజు పదవి విరమణ పొందుతున్న సభ్యులు వారి అభిప్రాయాలు ఈరోజు ఇక్కడ వెల్లడి చేయగలుగుతున్నారు. కానీ వారు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కోల్పోయారు. పదవీ విరమణకు ముందు వారు ఎంతో కొంత సహకారం చేసి ఉండి ఉండవచ్చు. అలాంటి అవకాశం వారికి ఇంతకుముందు లభించినా, ఉపయోగించి ఉండి ఉండవచ్చు.కానీ దేశ భవిష్యత్తు లో ఒక ముఖ్యమైన పాత్ర పోషించే ట్రిపుల్ తలాక్ లాంటి చరిత్రాత్మక బిల్లు పై నిర్ణయం చేసే ప్రక్రియలో పాలు పంచుకునే అవకాశాన్ని వారు కోల్పోయారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ఈ

గొప్ప అవకాశం లభిస్తుంది. కానీ ఈరోజు పదవి విరమణ పొందుతున్న సభ్యులు ఆ అవకాశాన్ని కోల్పోయారు. 20, 25 సంవత్సరాల తర్వాత ఇలాంటి చరిత్రాత్మక సందర్భం లో భాగం కానందుకు వారికి బాధ కలగవచ్చు. ఇది నా అభిప్రాయం. ఒకవేళ వారు ఆ విధంగా పాలుపంచుకొని ఉండి ఉంటే వారికి మంచిగా అనిపించేది. మరొకసారి పదవి విరమణ చేస్తున్న సభ్యులకు నా శుభాకాంక్షలు. ఒక సహచరుడిగా నేను మీకు మనవి చేసేది ఏమిటంటే పదవీవిరమణ పొందిన తర్వాత ఈ సభ తలుపులు మూసివేయబడ్డాయి అని మీరు అనుకోకూడదు. ఈ ప్రాంగణాన్ని సందర్శించడానికి వారు ఎప్పుడైనా రావచ్చు. ఇక్కడ ఉన్న ప్రధానమంత్రి కార్యాలయం తలుపులు వారి కోసం తెరిచే ఉంటాయి.

ఏ సమయంలో అయినా వచ్చి వారి విలువైన ఆలోచనలను దేశ సంక్షేమం కోసం పంచుకోవచ్చు. నేను వారి అభిప్రాయాలు వినడానికి ఎప్పుడూ ఆసక్తి గా ఉంటాను.మీరు ఎక్కడ ఉన్నా సరే మీ తోడ్పాటును అందించవచ్చు. మీ ఆలోచనలను నేను ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తాను.మరొక్కసారి నా ధన్యవాదాలు తెలియజేస్తూ మీ భవిష్యత్తు కోసం నా శుభాభినందనలు.

లోక్ సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస
తీర్మానంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ
గారి ప్రసంగం.

20 జులై 2018

లోక్ సభలో అవిశ్వాస తీర్మానానికి ప్రధాన మంత్రి సమాధానం - 20 జూలై 2018

గౌరవనీయులైన స్పీకర్ మేడం, నేను మీరు ఈ సభ ని ఓపిగ్గా నడిపిస్తున్న విధానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ అవిశ్వాస తీర్మానం ఒకరకంగా మన ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన శక్తిగా పరిగణిస్తాము. ఈ ప్రస్తావన టిడిపి ద్వారా వచ్చి ఉండొచ్చు కానీ వారికి మద్దతుగా కొంతమంది గౌరవనీయ సభ్యులు ఈ తీర్మానాన్ని సమర్ధించారు. అలాగే ఈ ప్రస్తావనను వ్యతిరేకిస్తూ చాలా పెద్ద వర్గం కూడా మాట్లాడింది. నేను ఈ అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించవద్దని సభ్యులందరికీ విన్నవించుకుంటున్నాను. 30 సంవత్సరాల తర్వాత పూర్తి ఆధిక్యంతో వచ్చిన ప్రభుత్వం త్వరితగతిన పని చేస్తున్న తీరు పై మరోసారి విశ్వాసం వ్యక్తపరచాలి అని కోరుకుంటున్నాను.

ఒక విధంగా మా మాటలు చెప్పడానికి ఇది మాకు దొరికిన మంచి అవకాశం. అలాగే ఏ విధమైన ప్రతికూలత ఉందో, ఏ విధమైన అభివృద్ధి పట్ల విరోధ భావం ఉందో? ఆ ముఖ చిత్రం కూడా ఈ దేశానికి తెలుస్తుంది. ఏ విధంగా కొంతమందిని ప్రతికూల రాజకీయం చుట్టుముట్టిందో, ఈరోజు అలాంటి వారి అలంకరింపబడిన మొహాలు అన్ని బయటపడ్డాయి. ఎంతోమంది మదిలో ఉన్న ప్రశ్న ఏంటంటే ఈ అవిశ్వాస తీర్మానం ఎందుకు వచ్చింది? ఆ తీర్మానం తీసుకురావడానికి సరిపోయే సంఖ్యా బలం లేదు కదా? ఈ సభలో ఆధిక్యత లేదు, అయినా ఈ విధమైన ప్రస్తావనని ఈ సభలో ఎందుకు తీసుకు వచ్చారు? అని. ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఇంత ఆత్రుత ఉన్నట్టయితే ఎందుకు 48 గంటలు వాయిదా వేయమని, చర్చకి ఏ విధమైన కంగారు లేదని చెప్పారు? అవిశ్వాస తీర్మానంపై చర్చ త్వరగా జరగకపోతే ఆకాశం బద్దలు అవుతుందా లేక భూకంపం వస్తుందా? మీరు చర్చకి పూర్తిగా సన్నద్ధం

కానప్పుడు 48 గంటలు దీన్ని వాయిదా వేయడం ఎందుకు? అసలు ఈ తీర్మానం చేయడం ఎందుకు? అందుకే ఈ తీర్మానాన్ని వాయిదా వేసే ప్రయత్నం జరిగింది కాబట్టి మనకి వారికున్న కష్టాలు ఏంటో అర్థం అయ్యాయి.

నా మాంఝి, నా రహబర్, నా హక్ మే హవాయె,

హై కష్తీ బి జర్ జర్, యహ్ కైసా సఫర్ హై.

నేను ప్రసంగాలు విన్నాను, నేను ఇక్కడ జరిగిన వ్యవహారాలు చూశాను. దీన్ని బట్టి ఇది అజ్ఞానం వల్ల జరిగింది అని నేను అనుకోవడం లేదు లేదా ఒక అబద్ధపు ఆత్మవిశ్వాసం వల్ల జరిగిందని కూడా నేను అనుకోవడం లేదు. ఇది ఎందుకు జరిగిందంటే అహంకారం ఈ విధమైన పనులు చేయడానికి ప్రేరేపిస్తుంది. మోదీని తీసేయండి, ఈరోజు ఉదయం చర్చా మొదలైంది, ఓటింగ్ ఇంకా జరుగలేదు, జయాపజయాల పై నిర్ణయం జరగలేదు. అయినా ఇక్కడికి రావాలన్న ఉత్సాహంతో నన్ను లెగు లెగు లెగు అని అన్నారు. ఇక్కడ ఒకరు లేప లేరు లేదా ఒకరు కూర్చోబెట్ట లేరు. నూట పాతిక కోట్ల దేశ ప్రజలు ఇక్కడ కూర్చో పెట్టగలరు, ఆ ప్రజలే ఇక్కడి నుంచి లేపగలరు. ప్రజాస్వామ్యంలో ప్రజల పై విశ్వాసం ఉండాలి, ఇంత తొందరపాటు దేనికి? మేము ఇక్కడ నిలిచి ఉండగలం, ప్రధానమంత్రి గారు 15 నిమిషాలు కూడా నిలబడలేరు అని అనడం అహంకారం.

గౌరవనీయులైన మేడం స్పీకర్, నేను ఇక్కడ నిలుచుని ఉన్నాను, నాలుగు సంవత్సరాలుగా మేము చేస్తున్న పనులపై నేను నిలబడి ఉన్నాను. మా ఆలోచనలు వారి ఆలోచనల కంటే భిన్నంగా ఉంటాయి. సారాంశం చాలా లోతుగా ఉంటుందని దానిని చెదరగొట్టవద్దని మేము నేర్చుకున్నాము. నేను సారాంశాన్ని గ్రహించడానికి చాలా ప్రయత్నం చేశాను. కానీ ఈ రోజు సారాంశం లభించలేదు. ఎలాగైనా సరే 2019లో అధికారంలోకి రానివ్వం

అని అహంకారంగా మాట్లాడుతున్నారు. వారికి ప్రజల పై విశ్వాసం లేదు, వారే భాగ్యవిధాత అని అనుకుంటున్నారు. అలాంటివారు ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే భాగ్యవిధాతలు. ప్రజాస్వామ్య ప్రక్రియలో విశ్వాసం ఉండడం అవసరం. 2019లో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా అవతరిస్తుందని వారు ప్రధానమంత్రి అవుతాను అని అనుకుంటున్నారు కానీ వేరే వారి కోరికల సంగతేంటి? ఈ విషయంలో కొంత అయోమయ స్థితిలో ఉన్నారు. మేడం స్పీకర్, ఇది ఈ ప్రభుత్వానికి బలపరీక్ష కాదు, ఇది కాంగ్రెస్, వారి మిత్రులకు బలపరీక్ష. ప్రధానమంత్రి అవడానికి వేరే పార్టీల మద్దతు ఎంత ఉందో తెలుసుకోవడానికి, ఒక ట్రయల్ గా ఈ ప్రస్తావన తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అందరినీ కూడగట్టుకోవడానికి వారు చాలా గట్టిగా ప్రయత్నించారు. వారి ముఖ్య ఉద్దేశం వారి జట్టుని ఒకే చోట ఉంచడం. వేరువేరు ధ్రువాలు ఏవైతే ఎప్పుడూ కలుసుకోవో, అవి కూడా కేవలం మోదీని పదవిలో నుండి తీసివేయడానికి ఇక్కడ కలుసుకుంటున్నాయి. నేను కాంగ్రెస్ మిత్రులకి ఒక విన్నపం చేస్తున్నాను, మీరు మీ మిత్రుని పరీక్ష తప్పకుండా తీసుకోండి కానీ దానికి అవిశ్వాస తీర్మానాన్ని ఉపయోగించుకోకండి.మీరు ప్రభుత్వంపై ఎంత అవిశ్వాసం చూపిస్తున్నారో, కనీసం అంత విశ్వాసం మీ మిత్రుల పై చూపించండి.

మేడం స్పీకర్, మావద్ద సంఖ్యా బలం ఉంది కాబట్టే ఇక్కడ కూర్చున్నాం. మాకు 125 కోట్ల దేశ ప్రజల ఆశీర్వాదం ఉంది కాబట్టే ఇక్కడ ఉన్నాం. మీ స్వార్థం కోసం దేశ మనసుపై, దేశ వాసులు ఇచ్చిన ఆశీర్వాదం పై అవిశ్వాసాన్ని ప్రకటించకండి. ఎవ్వరినీ బుజ్జగించకుండా, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయకుండా మేము 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' అనే మంత్రంతోనే పని చేస్తున్నాము.

స్పీకర్ మేడం, మా ప్రభుత్వం అందరి తోడ్పాటుతో, అందరి అభివృద్ధి కోసం పని చేస్తుంది. 18 వేల గ్రామాలకు విద్యుత్ శక్తి సరఫరా చేసే పనిని ఇంతకుముందు ఉన్న ప్రభుత్వాలు చేసి ఉండేవి. ఈ పద్దెనిమిది వేల గ్రామాలలో 15 వేల గ్రామాలు తూర్పు భారతదేశంలో ఉన్నాయి. ఆ 15 వేల గ్రామాల్లో 5 వేల గ్రామాలు పూర్తిగా ఈశాన్య భారత్ లో ఉన్నాయి. ఈ ప్రాంతాలలో ఎవరు నివసిస్తారో మీరు ఊహించొచ్చు. ఆదివాసీలు, పేదలు, దళితులు, పీడితులు, వెనక పడ్డ వర్గాలు, అణగారిన వర్గాలు, అడవుల్లో జీవితాన్ని గడిపేవారు, వీరంతా ఈ గ్రామాల్లో ఉంటారు. వీరికోసం ఎందుకీ పని చేయలేదు? ఎందుకంటే వీరు వారి ఓట్ల లెక్కింపు లోకి రారు, వారికి ఈ జనాభా పై విశ్వాసం లేదు అందుకే ఈశాన్య రాష్ట్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. మేము కేవలం విద్యుత్ మాత్రమే కాదు, మేము ఈ ప్రాంతాలను చేరుకోగలిగే దారులను సృష్టిస్తున్నాము. పేదల పేరు చెప్పి బ్యాంకులను జాతీయం చేయడం జరిగింది కానీ ఈ బ్యాంకులో తలుపులు పేద వారి కోసం ఎప్పుడూ తెరవలేదు. వారు చాలా కాలంగా అధికారంలో ఉన్నారు. పేదలకోసం బ్యాంక్ ద్వారాలు తెరిచి ఉండి ఉండవచ్చు. 32 కోట్ల జన్ ధన్ ఖాతాలు ఈ ప్రభుత్వం పేదల కోసం తెరిచి చూపించింది. ఈ పేద ప్రజలు ఈ జన్ ధన్ ఖాతాల ద్వారా 80 వేల కోట్ల రూపాయలు జమ చేశారు. ఈ ప్రభుత్వం తల్లులు, సోదరీమణుల గౌరవం కోసం ఎనిమిది కోట్ల మరుగుదొడ్లను కట్టించింది. ఈ పనులు పూర్వ ప్రభుత్వాలు కూడా చేసి ఉండి ఉండవచ్చు.

నాలుగున్నర కోట్ల పేద మహిళలకు, ఈరోజు పొగ రహిత జీవితం, మంచి ఆరోగ్యాన్ని ఈ ప్రభుత్వం కల్పించింది. వీరు 9 లేదా 12 సిలిండర్ల విషయంపై చర్చించుకోవడం లో నిమగ్నమై ఉన్నారు, ప్రజలను అయోమయానికి గురి చేశారు. ఒక అంతర్జాతీయ నివేదిక ప్రకారం దాదాపు ఐదు కోట్ల ప్రజలు అతి దారిద్ర్యం నుంచి గత రెండు సంవత్సరాలలో బయటపడ్డారు. 20 కోట్ల మంది పేద ప్రజలకి రోజుకి 90 పైసలు లేదా నెలకి ఒక్క రూపాయి కి

మాత్రమే భీమా పథకం లభించింది. పేదలకు చికిత్స కోసం ఈ ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్' పథకం కింద ఐదు లక్షల రూపాయల సహాయాన్ని అందించే హామీ ఇచ్చింది. ఈ విషయాలన్నీ వారు నమ్మరు. 2022 వరకు రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా అడుగులు వేస్తున్నాము. విత్తనాలు, మార్కెట్ల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళనం చేయబోతున్నాం. వారు ఈ విషయాన్ని కూడా నమ్మరు. 99 నీటి పారుదల పథకాలు, మిగతా పథకాలు ఏవైతే గత కొన్ని ఏళ్లుగా వాయిదా పడుతూ వచ్చాయో, 80 వేల కోట్ల రూపాయలతో అవి పూర్తి చేయడానికి పనులు జరుగుతున్నాయి. కొన్ని పథకాలు పూర్తి అయ్యాయి, మరికొన్ని ప్రజలకు అంకితం ఇవ్వబడ్డాయి. వీటిని కూడా వారు నమ్మరు. 15 కోట్ల రైతులకు నేల ఆరోగ్య కార్డులు ఇవ్వడం జరిగింది. రైతులను ఆధునిక పద్ధతులు నేర్చుకునే దిశగా ప్రోత్సహించడం జరిగింది. కానీ వీటిని కూడా వారు నమ్మరు.

స్పీకర్ మేడం, యూరియా పై వేపపూత పనిని పాక్షికంగా చేసి వదిలివేశారు. 100% ఆ పని చేయకుండా ఆ ప్రయోజనాలు మనం పొందలేము. మేము 100% వేపపూత పనిచేసి ఈ దేశంలోని రైతులందరికీ ప్రయోజనం కలిగేలా చూసాము. ఇప్పుడు యూరియా కి లోటు లేదు. కానీ దీన్ని కూడా వారు నమ్మరు. మేము రైతులలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం కోసం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులకు సహాయం చేస్తున్నాము. ప్రీమియం మొత్తాన్ని తగ్గించడమే కాకుండా బీమా మొత్తాన్ని పెంచడం జరిగింది. ఉదాహరణకి రైతులు భీమా ప్రీమియం గా 2016 -17 లో 1,100 కోట్ల రూపాయలు చెల్లించితే, వారికి 5,500 కోట్ల రూపాయల బీమా మొత్తం సహాయంగా లభించింది. దాని అర్థం, భీమా ప్రీమియం గా తీసుకున్న మొత్తానికి మూడు రెట్లు భీమా మొత్తంగా లభించింది. దీన్ని కూడా వాళ్లు నమ్మరు.

స్పీకర్ మేడం, వారు వారి పాలనలో ఎల్ఈడి బల్బులను 350 నుంచి 450

రూపాయల వరకు ఎందుకు అమ్మేవారో వారే చెప్పాలి. అవే ఎల్ఇడి బల్బులు ఈ రోజు 40 నుంచి 45 రూపాయలకు అమ్మడం జరుగుతుంది. ఇప్పటివరకూ వందకోట్ల బల్బులు అమ్మడం జరిగింది ఇది చిన్న సంఖ్య కాదు.అంతేకాకుండా, 62 లక్షల కంటే ఎక్కువ ఎల్ఈడి బల్బులను వీధిదీపాలు గా 500 పురపాలక సంస్థలు అమర్చి,వారి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకుంది. వారి పాలనలో కేవలం 2 మొబైల్ ఉత్పత్తి చేసే పరిశ్రమలు ఉండేవి. కానీ ఇప్పుడు అలాంటివి 120 పరిశ్రమలు ఉన్నాయి. వీటిని కూడా మీరు నమ్మరు. చదువుకున్న యువత కి స్వయం ఉపాధి పేరు కింద సర్టిఫికెట్లు ఇచ్చేవారు కానీ వారు వారి జీవనోపాధి కోసం చాలాచోట్ల తిరగాల్సి వచ్చేది. ముద్ర యోజన కింద మేము 13 కోట్ల యువకులకు రుణాలు ఇచ్చాము. అంతేకాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా, మన దేశంలో పదివేల స్టార్ట్ అప్ లను యువత నడిపిస్తూ దేశాన్ని వినూత్న భారత్ దిశగా ముందుకు తీసుకెళ్తున్నారు. మేము డిజిటల్ లావాదేవీల గురించి మాట్లాడుతున్నప్పుడు కొంతమంది మేధావులు మన దేశంలో నిరక్షరాస్యులు ఎక్కువ అని, వారు డిజిటల్ లావాదేవీలు ఎలా చేయగలరు? అని అడిగారు. అలాంటి సదుపాయాలు మనదేశంలోని పేదవారు ఎలా అందుకోగలరు అని అడిగారు. స్పీకర్ మేడం, ఎవరైతే ఈ దేశ ప్రజల శక్తిని తక్కువ అంచనా వేస్తారో వారికి ఆ ప్రజానీకం దీటైన జవాబు ఇచ్చింది. భీమ్ ఆప్ మొబైల్ ఫోన్ల ద్వారా ఈ దేశ పౌరులు దాదాపు 41 వేల కోట్ల రూపాయల డిజిటల్ లావాదేవీలు చేశారు. వీరు ఈ దేశ ప్రజలను కూడా నమ్మరు. వారి ఉద్దేశం లో ఈ దేశ ప్రజలు నిరక్షరాస్యులు అని, ఈ విధమైన లావాదేవీలు చేయలేరని అనుకున్నారు. ఇది వారి మనస్తత్వం యొక్క పరిణామం.

స్పీకర్ మేడం, సులభతర వ్యాపారం చేయడంలో మనం 42 పాయింట్లు ఎగబాకాము. వారికి ఇందులో కూడా సందేహమే. అలాంటి సంస్థలపై వారు విశ్వాసం చూపించరు. గ్లోబల్ కాంపిటీటివ్ ఇండెక్స్ లో ముప్పై ఒక్క పాయింట్లు మెరుగుపరచుకున్నాము. వారికి ఆ

విషయంలో కూడా సందేహమే. ఇన్వేవేషన్ ఇండెక్స్ లో 24% మెరుగుపరుచుకున్నాము. మన ప్రభుత్వం సులభతర వ్యాపారాన్ని మెరుగు పరుచుకుంటూ వ్యాపార ఖర్చును తగ్గిస్తుంది. అది మేక్ ఇన్ ఇండియా కానివ్వండి లేదా జిఎస్టి కానివ్వండి వాటిని కూడా వారు నమ్మారు. భారతదేశం ఆర్థిక రంగంలో ఎదుగుతూ ప్రపంచ ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసింది. ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఆరో స్థానంలో ఉంది. దీని గౌరవం ప్రభుత్వాన్ని నడుపుతున్న వారికి లభించదు. ఇది 120 కోట్ల భారతీయుల కష్టానికి దక్కుతుంది. దీనికి వారు గర్వించాలి. భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించడానికి వేగంగా ఆ దిశలో పయనిస్తుంది. మేము నల్లధనంపై యుద్ధం ప్రకటించాము, ఈ యుద్ధం ఆగదు. నాకు తెలుసు దీని వల్ల కొంత మందికి సమస్యలు ఉన్నాయి. వారి సమస్య ఇంకా పరిష్కరించబడలేదు. ఇది వారి ప్రవర్తన నుండి తెలుస్తుంది. మేము టెక్నాలజీని ఉపయోగించి, ప్రభుత్వ నిధులు ఏవైతే దుర్వినియోగ పరచడం జరిగేదో వాటిని ఆపి, దాదాపు 90 వేల కోట్ల రూపాయలు కాపాడాము. అప్పట్లో ఆ సొమ్ములను దుర్వినియోగ పరిచే వారు. ప్రజలకు తెలుసు అవి ఏవిధంగా దుర్వినియోగం అయ్యేవో. మేము దాదాపు రెండున్నర లక్షల డొల్ల కంపెనీలను రద్దు చేశాం. దాదాపు రెండు నుంచి రెండున్నర లక్షల కంపెనీలు మా దృష్టిలో ఉన్నాయి. అవి కూడా త్వరలోనే రద్దు చేయబడతాయి. వాటిని ఎవరు ప్రోత్సహించే వారు? ఎవరు మద్దతునిచ్చే వారు? ఇటువంటి వ్యవస్థల ద్వారా వారి సొంత ప్రయోజనాలు నెరవేర్చుకునే వారు. ఈ విషయాలు అందరికీ తెలుసు.

బినామీ ఆస్తుల చట్టాన్ని ఈ సభలో ఆమోదించడం జరిగింది. అయినా 20 సంవత్సరాల తర్వాత కూడా దానిని అమలు చేయలేదు. ఎందుకు, ఎవరిని వారు రక్షించాలి అనుకుంటున్నారు? మేము ఆ చట్టాన్ని అమలు చేశాము. ఆ చట్టం కింద ఇప్పటివరకు

నాలుగు నుంచి నాలుగున్నర వేల కోట్ల బినామి ఆస్తిని జప్తు చేయడం జరిగిందని సంతోషం గా చెప్తున్నాను. దేశానికి మాపై విశ్వాసం ఉంది, ప్రపంచానికి మాపై విశ్వాసం ఉంది, గొప్ప సంస్థలు మాపై నమ్మకాన్ని చూపించాయి. కానీ ఎవరికైతే ఆత్మవిశ్వాసం లేదో వారు మా మీద విశ్వాసాన్ని ఎలా చూపించగలరు? ఆ విధమైన మనస్తత్వం ఉన్న వారి గురించి మన శాస్త్రాలలో బాగా చెప్పారు.

ధారా నైవ్ పతంతి చాతక్ ముఖే మేఘస్య కిం దోషనాం. దాని అర్థం చాతక పక్షి నోటి లో నీటి బిందువులు నేరుగా పడకపోతే అందులో మేఘాల తప్పు ఏంటి?

మేడం స్పీకర్, కాంగ్రెస్ వారు ఆత్మవిశ్వాసం లోపించి ఉన్నారు. విశ్వాస లోపం వారి కార్య సంస్కృతికి, సాంస్కృతిక జీవనానికి ప్రతీక. వారికి ఏ విషయం పట్ల విశ్వాసం లేదు. వారికి స్వచ్ఛభారత్ లో గాని,అంతర్జాతీయ యోగా దినోత్సవం పై గానీ, ప్రధాన న్యాయమూర్తి పై గానీ, ఆర్థిక వ్యవస్థకు సంబంధించి సమాచారాన్ని అందించే భారతీయ రిజర్వు బ్యాంక్ పై గాని విశ్వాసం లేదు. మన పాస్ పోర్ట్ విలువ విదేశాలలో పెరుగుతుంది. అంతర్జాతీయ వేదికలపై మన దేశాన్ని పొగుడుతున్నారు అయినా వారికి ఈ విషయాలపై విశ్వాసం లేదు. వారికి ఎన్నికల సంఘం, ఈవీఎంలపై విశ్వాసం లేదు. ఎందుకంటే వారికి వారి పైనే నమ్మకం లేదు. ఎందుకు ఈ విధమైన విశ్వాస లోపం వారిలో పెరిగింది? ఇంతకుముందు కేవలం కొంతమంది మాత్రమే కొన్ని హక్కులను అనుభవించేవారు. అది వారి విశిష్ట హక్కుగా భావించేవారు. ఎప్పుడైతే ఈ ప్రత్యేక హక్కులను ప్రజలు నిర్ణయిస్తున్నారో వారి సమస్యలు పెరగడం మొదలయ్యాయి. ఎప్పుడైతే వ్యవస్థను ప్రభావితం చేసే సాంప్రదాయాన్ని ఆపామో వారి సమస్యలు పెరగడం తథ్యం. అవినీతి నుండి ఆదాయం ఆగిపోతే వారి ఆందోళన పెరిగింది. కోర్టు ముందుకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వారికి కొంత కష్టం కలిగింది.అలాంటి విషయాలని

ఇక్కడ ప్రస్తావించడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ మధ్య శివుని పట్ల ఆరాధనాభావం ని కూడా ఇక్కడ చర్చిస్తున్నారు. నేను కూడా మహాశివుని ప్రార్థిస్తున్నాను. అలాగే నూట పాతిక కోట్ల దేశ వాసులని కూడా ప్రార్థిస్తున్నాను.మీకు వారు 2024లో కూడా మరింత బలాన్ని ఇవ్వాలని, మీరు మరోసారి అవిశ్వాస తీర్మానాన్ని తీసుకురావాలనీ కోరుకుంటున్నాను. మీకు శుభం జరుగు గాక.

ఇక్కడ డోక్లాం గురించి కూడా చర్చించారు. మనకి ఏ విషయం పైన అయితే అవగాహన లేదో దాని గురించి మాట్లాడినప్పుడు అది తిరగబెడుతుంది. అది ఒక వ్యక్తిని తక్కువ ప్రభావితం చేయొచ్చు కానీ దేశానికి ఎక్కువ నష్టం జరుగుతుంది. కాబట్టి అలాంటి విషయాలు మాట్లాడే ముందు కొంత సమాచారం సేకరించడం అవసరం. డోక్లాం విషయం లో మొత్తం దేశం, మొత్తం వ్యవస్థ, ప్రభుత్వం కలిసికట్టుగా పనిచేసి, వారి వారి బాధ్యతలను నిర్వహించారని ఈ సందర్భంగా మనం గుర్తుంచుకోవాలి.

డోక్లాం గురించి ఈ రోజు మాట్లాడుతున్నవారు, ఆ రోజు చైనా రాయబారితో కూర్చునేవారు. ఆ తర్వాత ఆ విషయం సినిమా ఫక్కీలో నడిచేది, కొన్నిసార్లు అవునని, కొన్నిసార్లు కాదని నాటకీయంగా జరిగేది. ఒకసారి కలిశానని మరోసారి కలవలేదని చెప్పారు ఎందుకు ఈ విధమైన డోలాయమానం? కాంగ్రెస్ వక్త వారి ఉపాధ్యక్షుడు చైనా రాయబారిని కలవలేదని స్పష్టంగా చెప్పారు. అదే సమయంలో కాంగ్రెస్ ఒక పత్రికా ప్రకటనలో ఆ సమావేశం జరిగిందని ఒప్పుకుంది. దేశానికి సంబంధించిన విషయాల పట్ల గాంబీర్యం ఉండదా? ప్రతి చోట పిల్ల చేష్టలే ఉంటాయా?

రాఫెల్ వివాదాన్ని కూడా ఇక్కడ తీసుకువచ్చారు. నిజాన్ని ఈ విధంగా అణచి వేస్తారని, ఖండిస్తారని నేను ఊహించలేదు. ఇప్పుడు మళ్లీ దేశాన్ని తప్పుదారి పట్టించడానికి

అరుస్తున్నారు. దేశ భద్రతకు సంబంధించిన విషయాలను ఈ విధంగా ఎవరైనా చర్చిస్తారా? ఈ దేశం వారిని ఎప్పుడూ క్షమించదు. ఈ సభలో చేసిన ఆరోపణలకు సంబంధించి రెండు దేశాలు ఒక ప్రకటన చేయడం ఎంత బాధాకరం? రెండు దేశాలు ఆ ఆరోపణలని ఖండించాయి. ఈ విధమైన పిల్ల చేష్టలు జరుగుతూనే ఉంటాయా? ఒక బాధ్యత అంటూ ఉందా లేదా? ఎవరైతే అధికారంలో ఎన్నో సంవత్సరాలు ఉన్నారో వారు ఏ విధమైన ఆధారం లేకుండా అరుస్తున్నారు. వారు నిజాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ దేశ ప్రజలకు ఈ విషయాలు చాలా స్పష్టంగా తెలుసు. ప్రతిసారి ప్రజలు మీకు జవాబులు ఇస్తున్నారు. ఇప్పుడు మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకునే అవకాశం ఉంది మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నించండి. ఈ విధమైన రాజకీయం మన దేశానికి శ్రేయస్కరం కాదు.

స్పీకర్ మేడం, ఈ సభ ద్వారా దేశ ప్రజలందరికీ ఒక హామీ ఇస్తున్నాను. రెండు దేశాల మధ్య ఒప్పందం ఏదైతే జరిగిందో అది రెండు వ్యాపార సంస్థల మధ్య జరిగిన ఒప్పందం కాదు. ఆ ఒప్పందం రెండు బాధ్యతాయుతమైన ప్రభుత్వాల మధ్య జరిగింది, అది పూర్తి పారదర్శకతతో జరిగిన ఒప్పందం. కాబట్టి దేశ భద్రతకు సంబంధించిన విషయాలపై, సున్నితమైన విషయాలపై ఈ విధమైన పిల్ల చేష్టలు మానుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఇది నా బలమైన కోరిక కూడా. నామ్ దార్ ముందు నేను విన్నపం మాత్రమే చేయగలను ఎందుకంటే దేశ సైన్య అధ్యక్షుడి గురించి అసభ్య భాష ఉపయోగించబడుతోంది. ఈరోజు, ప్రతి జవాను, బోర్డర్ లో ఉన్నా లేదా పదవి విరమణ చేసి ఉన్నా, వారికి ఎంతో బాధ కలిగి ఉంటుంది. మనం ఇంట్లో కూర్చుని ఆ బాధని ఊహించలేము. ఎవరైతే దేశం కోసం ప్రాణ త్యాగం చేయడానికి సిద్ధపడ్డారో? ఎవరైతే దేశం బాగా ఉండాలని కష్టపడుతున్నారో, వారి గొప్ప పనులను స్వీకరించే ధైర్యం వీరికి లేదు. వారు సర్జికల్ స్ట్రైక్ ని ఒక బొమ్మలాట గా పిలిచారు. అందుకు దేశం వారిని ఎప్పటికీ క్షమించదు. వారు దూషించాలనుకుంటే వారి కోసం మోదీ ఉన్నారు.

వారి దూషణలు వినడానికి నేను సిద్ధంగా ఉన్నాను కానీ ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసే జవాన్లను దూషించడం దయచేసి మానేయండి. సర్జికల్ స్ట్రైక్ ని బొమ్మలాటగా పేర్కొని భారత సైన్యాన్ని అవమానించ కండి.

గౌరవనీయులైన మేడం స్పీకర్, ఈ విధమైన అవిశ్వాస తీర్మానం ఎన్నో తరాలుగా తీసుకు వస్తున్నారు, ఇది కాంగ్రెస్ పార్టీ రక్తంలోనే ఉంది. అవిశ్వాస తీర్మానం అనే రాజ్యాంగ అమరికని కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో అస్థిరతని సృష్టించటానికి దుర్వినియోగ పరిచింది. నేను వార్తాపత్రికలలో చదివాను.అవిశ్వాస తీర్మానాన్ని స్వీకరించిన వెంటనే ఒక ప్రకటన వెలువడింది "ఎవరు చెప్పారు మా దగ్గర సంఖ్యాబలం లేదని". వారి అహం చూడండి.నేను 1999 సంవత్సరం గురించి ఈ సభకు గుర్తు చేస్తాను.రాష్ట్రపతి భవనం వద్ద మావద్ద 272 సంఖ్యాబలం ఉందని మిగతా వారు మమ్మల్ని చేరుకో పోతున్నారని,అటల్ జి గారి ప్రభుత్వం ఒక్క ఓటుతో అధికారాన్ని కోల్పోయిందనీ చెప్పారు. కానీ వారు చెప్పినట్లుగా 272 సంఖ్యాబలం ఒక బూటకం గా నిరూపించబడి, 13 నెలల్లో ఈ దేశం ఎన్నికలకు వెళ్ళవలసి వచ్చింది.

గౌరవనీయులైన మేడం స్పీకర్, ఈరోజు ఒక స్థిరమైన ప్రభుత్వాన్ని అస్థిర పరచడానికి ఒక ఆట ఆడడం జరిగింది. వారి స్వార్థ ప్రయోజనాలను రాజకీయ అస్థిరతతో నెరవేర్చుకోవడం కాంగ్రెస్ లక్షణం. 1979లో వారు భూమి పుత్రుడైన ఒక రైతు నాయకుడు చౌదరి చరణ్ సింగ్ గారికి మద్దతు ఇస్తామని ఒక భ్రమని కల్పించి ఆ తర్వాత మద్దతును ఉపసంహరించుకున్నారు. ఒక కార్మికుడికి, ఒక రైతుకి ఇంతకంటే అవమానం ఏం ఉంటుంది? ఈ విధమైన పద్ధతిని శ్రీ చంద్రశేఖర్ గారి విషయంలోనూ వీరు అవలంబించారు. ముందు మద్దతు కోసం తాడును విసురుతారు ఆ తర్వాత మోసపూరితంగా దాన్ని వెనక్కి లాగేసుకుంటారు. ఈ ఆట కొనసాగింది. అదే పద్ధతిని 1997లో మరోసారి ప్రయోగించారు,

దేవగౌడ గారిని అవమానించారు. ఆ తర్వాత ఇంద్రకుమార్ గుజ్రాల్ గారిని అవమానించారు. అది దేవగౌడ గారు అయి ఉండొచ్చు లేదా ములాయం సింగ్ యాదవ్ గారు అయ్యుండొచ్చు కాంగ్రెస్ ఏవిధంగా ప్రవర్తించినదో ఎవరు మర్చి పోగలరు? కాంగ్రెస్ పార్టీ కష్టపడి పని చేసి ప్రజా నాయకులుగా, ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్న రాజకీయ పార్టీలను, నాయకులను మోసం చేసి ఈ దేశాన్ని అస్థిరత వైపు ఎన్నోసార్లు నెట్టింది. కాంగ్రెస్ పార్టీ, వారి ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి రెండుసార్లు విశ్వాసాన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేసింది. ఓటుకు నోటు అనే ఆట గురించి అందరికీ తెలుసు. ఇక్కడ మరో విషయం లేవనెత్తారు ప్రధానమంత్రి వారి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడలేరు అని చెప్పారు.

స్పీకర్ మేడం, వారు చెప్పేది నిజమే వారి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూడడానికి నేను ఎవరిని? నేను ఒక పేద తల్లి కొడుకుని, ఒక వెనుకబడిన కుటుంబానికి చెందిన వాడిని, గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన వాడిని. కానీ వీరు పేరు కలవారు, నేను పని చేసే వ్యక్తిని. నేను వారి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసే ధైర్యం చేయలేను. అలా చేయడానికి ప్రయత్నించిన సుభాష్ చంద్రబోస్ ని ఏం చేశారో దానికి ఈ చరిత్ర సాక్షి. మురార్జీ దేశాయి కూడా దానికి ఒక ఉదాహరణ. అలాగే జయప్రకాష్ నారాయణ గారు, చౌదరి చరణ్ సింగ్ గారు, సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు, చంద్రశేఖర్ గారు, ప్రణబ్ ముఖర్జీ గారి పట్ల కూడా అదే విధంగా ప్రవర్తించారు. అంతేకాదు శరద్ పవార్ గారు కూడా దీనికి ఒక ఉదాహరణ. నేను అన్ని లోపలి, బయటి విషయాలు మాట్లాడగలను. కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసే వారిని ఏవిధంగా అవమానించారో, వారిని ఏ విధంగా బయట పడేశారో అది ఒక కుటుంబ చరిత్ర. ఈ విషయం ఈ దేశంలో తెలియనివారు లేరు. మేము పని చేసే వాళ్ళం. పేరున్న వారి కళ్ళల్లో కళ్ళు పెట్టి ఎలా చూడగలం? ఈరోజు యావద్దేశం కళ్ళు గురించి మాట్లాడేవారి కళ్ళు ఏం చేస్తున్నాయో

చూసింది. ఏ విధంగా కన్ను గీటారో చూసింది. నిజాన్ని పదేపదే అణచివేసే ప్రయత్నం జరిగింది.

ఇక్కడ పెట్రోలియంని జీఎస్టీ పరిధిలోకి ఎందుకు తీసుకు రాలేదని అడగడం జరిగింది. గాంధీ పరివారం బయట కాంగ్రెస్ కి ఒక చరిత్ర ఉందని నేను చెప్పదలుచుకున్నాను. మీ కుటుంబం బయట కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చరిత్ర ఉంది. కనీసం పేరు దాన్ని కాపాడుకోండి. యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు మీ ప్రభుత్వం పెట్రోలియంని జీఎస్టీ పరిధిలో నుంచి బయట పెట్టాలని నిర్ణయం తీసుకుంది. వారికి ఆ విషయం కూడా తెలియదు. నేను మీ విషయాన్ని కూడా మాట్లాడతాను జయదేవ్ గారు. నేను ఇక్కడ ప్రతి ఒక్కరి విషయాన్ని మాట్లాడుతాను. అందరినీ నేను గౌరవిస్తాను.

ఇక్కడ నేను కాపలా దారుని కాదు, ఒక భాగస్వామి అని అన్నారు. స్పీకర్ మేడం, నేను కాపలా దారు అలాగే భాగస్వామి అని కూడా గర్వంగా చెప్పగలను. కానీ నేను వారి వలె ఒక డీలర్ లేదా కాంట్రాక్టర్ ని కాదు. మేము ఈ దేశం లోని పేద ప్రజల దుఃఖంలో భాగస్వాములం. ఈ దేశ రైతుల బాధలో భాగస్వాములం. ఈ దేశ యువత ఆశలలో మేము భాగస్వామ్యులం.

ఈ దేశంలో 115 ఆకాంక్షిత జిల్లాలు ఉన్నాయి. మేము వాటి కలలలో, అభివృద్ధిలో భాగస్వాములం. దేశాన్ని కొత్త పథంలో తీసుకువెళ్లే కార్మికులతో మేము భాగస్వాములం. మేము భాగస్వాములుగా ఉన్నాము, ఉంటాము. ప్రజల కష్టాలని పంచుకుంటూ వారి దుఃఖాలలో పాల్గొంటూ, మా బాధ్యతని నిర్వర్తిస్తాము. కాంగ్రెస్ వారిది ఒకటే మంత్రం - వారు అధికారం అయినా ఉండాలి లేదా దేశంలో అస్థిరత అయినా ఉండాలి. వదంతులు రాజ్యమేలాలి. మీరు వారి పరిపాలనా కాలాన్ని చూసినట్లయితే, ప్రజలకి ఏం జరిగిందో

తెలుసు. వదంతులను ఆమోదించడం జరిగింది. వాటిని వ్యాప్తి చేయడం జరిగింది. ఇప్పుడు వారి వద్ద దేశమంతా వదంతులు వ్యాపించే టెక్నాలజీ ఉంది. రిజర్వేషన్లు రద్దు చేస్తారని, అణగారిన వర్గాల పై జరిగే అత్యాచారాలను నిరోధించే చట్టాన్ని కూడా రద్దు చేస్తారని, అలాగే దేశాన్ని హింస అనే అగ్నిలో పడవేసే కుట్ర జరుగుతుందని వదంతులు సృష్టించారు.

స్పీకర్ మేడం, వీరు దళితులను, పీడితులను, బాధితులను, వెనుకబడిన పేద ప్రజలను భావోద్వేగాలతో బెదిరించి రాజకీయాలు చేసేవారు. కార్మికుల, రైతుల కష్టాల గురించి చింతించకుండా, వారి సమస్యలకు పరిష్కారాలు వెతకకుండా, ఈ దేశంలో ఎన్నికలు గెలవడానికి అడ్డదారిలో ప్రయత్నం చేస్తున్నారు. అందువల్లే మన దేశంలో ఎక్కువ మంది సాధికారత నుండి వంచించబడ్డారు. ఎవరైతే బాబాసాహెబ్ అంబేద్కర్ గారి భాష గురించి, ఆహార్యం గురించి, వారి రాజకీయాల గురించి అవహేళనగా మాట్లాడేవారో, వారు ఈ రోజు ఆయన్ని పొగుడుతున్నారు.

మేడం, ఎవరైతే ఆర్టికల్ 356 ని పదే పదే దుర్వినియోగ పరిచారో, వారు మాకు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెబుతున్నారు. వారికి నచ్చని ముఖ్యమంత్రిని తీసి వేసేవారు. ఒక విధమైన అస్థిరతను సృష్టించడానికి స్వాతంత్ర్రం వచ్చిన వెంటనే ఒక ఆట మొదలైంది, అలా ఏ విధమైన అవకాశాన్ని వదల్లేదు. ఆ విధమైన విధాన ఫలితమే, దేశం 1980, 1990, 1998, 1999 లో ఎన్నికల లోకి లాగబడింది. ఎవరైతే ఆ కుటుంబ ఆశలకి కలలకి అడ్డుగా వస్తారో వారి పట్ల ఈ విధంగా ప్రవర్తించేవారు. దేశ ప్రజాస్వామ్యాన్ని బలిగా పెట్టినా సరే. సహజంగా అంత అహం ఉండే వారిని మనం ఏవిధంగా స్వీకరించగలము? మేము ఇక్కడ కూర్చోడం వాళ్లు సహించలేరు. మమ్మల్ని వారు ద్వేషించడం సహజం, ఇది మాకు బాగా అర్థం అవుతుంది.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, కాంగ్రెస్ పార్టీ నేలకి దూరంగా ఉంది. వారు మునిగి పోయారు, వారితో ఉన్న వారు కూడా మునిగిపోతారు. అర్థానికి అనర్థానికి మధ్య చిక్కుకున్న ఒక మేధావి ఎవరికైతే తన తెలివితేటల పై అహంకారం ఉందో, అతను ఒకసారి ఏమన్నాడంటే "కాంగ్రెస్ పార్టీ ఎందుకో, ఎలాగో వేరు వేరు రాష్ట్రాల్లో బలహీన పడింది. నేను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా బలహీనపడిన రాష్ట్రం నుంచి వస్తాను. కాంగ్రెస్ పార్టీ, ఉన్నత వర్గాల నుంచి డబ్బున్న వర్గాలనుంచి, గ్రామస్తులు, మధ్య వర్గాలు, సమాజంలో కింది స్థాయిలో ఉండే కులాలు, పేదవారు, నిరుద్యోగులు, ఆస్తులు, ఆదాయం లేని వారి వద్దకి అధికారం వెళ్లిందని ఎందుకు అర్థం చేసుకోవడం లేదు? ఎవరి గోడు వినిపించుకోలేదో, అధికారం వారి వద్దకు వెళ్ళింది. అధికారం అణగారిన వర్గాల వైపు వికేంద్రీకరించబడినది. అలాంటి విధానం ప్రజాస్వామ్యంలో ఉండాలి కాబట్టి, కాంగ్రెస్ పార్టీ ప్రభావం చాలా రాష్ట్రాలలో తగ్గిపోయింది.

ఈ సందర్భంగా మనం చెప్పుకోవలసిన మాట ఒకటి ఉంది. దేవగౌడ గారి ప్రభుత్వంపై 11 ఏప్రిల్ 1997లో అవిశ్వాస తీర్మానం పై చర్చ జరిగినప్పుడు గౌరవనీయ సభ్యులు శ్రీ చిదంబరం గారు, ఆ సందర్భంలో వారు తప్పు, ఉప్పు మధ్య తేడా ఏంటో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ఆ సందర్భంగా కొంతమంది మేధావులు మాట్లాడిన మాటలు చాలా మందికి అర్థం అయి ఉండక పోవచ్చు.

18 సంవత్సరాల క్రితం అటల్ బిహారీ వాజ్పేయి గారి ప్రభుత్వం మూడు రాష్ట్రాలను ఏర్పాటు చేసింది. అవి ఉత్తరాఖండ్ ఝార్ఖండ్, ఛత్తీస్ ఘడ్. ఆ సమయంలో ఏ విధమైన ఉద్రిక్తతలు తలెత్తలేదు. ఏ విధమైన విరోధాభావం లేకుండా అందరూ కలిసి కూర్చుని అన్ని విషయాలను పరిష్కరించుకున్నారు. ఇప్పుడు ఆ మూడు రాష్ట్రాలు ప్రశాంతంగా ప్రగతి వైపు పరుగులు పెడుతూ దేశ అభివృద్ధిలో తోడ్పాటునందిస్తున్నాయి. కానీ రాజకీయ లబ్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని సంప్రదించకుండా, రాజ్యసభ ని అందుబాటులో ఉంచకుండా, ఒత్తిడితో సభ

ఒక క్రమపద్ధతిలో లేనప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ని విభజించడం జరిగింది. ఇది నిజం. ఆ సందర్భంలో నేను తెలుగు తల్లి అని తెలియక స్ఫూర్తి చెడకుండా చూడాలని అన్నాను కానీ వారు బిడ్డని రక్షించి తల్లిని చంపేశారు. తెలుగు స్ఫూర్తిని కాపాడటం మన బాధ్యత. ఆ సమయంలో నేను ఈ విధంగా మాట్లాడాను, ఇప్పుడు కూడా నేను అదే నమ్ముతాను. 2014 లో ఏం జరిగింది? వారు ఒక రాష్ట్రంలో ఓడిపోయినా పర్లేదు, ఇంకో రాష్ట్రం గెలవచ్చు అనుకున్నారు. కానీ, ప్రజలు చాలా తెలివైన వారు, వారు రెండు రాష్ట్రాలలో ఓడిపోయి, గందరగోళంలో పడ్డారు. వారికి ఇవి కొత్త కాదు. వారు దేశాన్ని భారత్ పాకిస్థాన్లు గా విభజించారు. ఈ నిర్ణయం వల్ల ఇప్పటికీ సమస్యలు ఉన్నాయి. ఆ విధంగానే ఆంధ్రప్రదేశ్ ని కూడా వారు విభజించారు. అక్కడి ప్రజల్ని సంప్రదించి ఉండి ఉంటే ఈ విధంగా జరిగి ఉండేది కాదు. కానీ వారు అలా ఆలోచించలేదు. నాకు బాగా గుర్తుంది మొదటి సంవత్సరం చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య రాష్ట్ర విభజనకు సంబంధించి కొంత ఉద్రిక్తత ఉండేది. ఇవి గొడవలు లాంటివి. గవర్నర్ గారు, హోమ్ మినిస్టర్ గారు ఈ సమస్యలన్నీ పరిష్కరించాల్సి వచ్చేది. కొన్ని సందర్భాలలో నేను కూడా జోక్యం చేసుకోవాల్సి వచ్చేది. ఆ సమయంలో టిడిపి తెలంగాణకు వ్యతిరేకంగా ఉండేది. వారు దానికి వ్యతిరేకంగా నిలబడేవారు. మేము వారిని శాంతపరిచే వాళ్ళం. టిఆర్ఎస్ పరిపక్వత ని చూపించి, వారి శక్తిని అభివృద్ధి వైపు మళ్లించారు. ఆ వైపు ఏం జరిగిందో అది మనకి తెలుసు. వనరుల పంపకానికి సంబంధించి సమస్యలు ఇంకా ఉన్నాయి. దీన్ని బట్టి వారు రాష్ట్రాన్ని ఏ విధంగా విభజించారో అర్థమవుతుంది. వనరులకు సంబంధించి చీలిక ఇంకా ఉంది.

ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధి కోసం అన్ని ప్రయత్నాలు చేస్తూనే మేము దానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్నాము. కొన్ని వార్తా మాధ్యమాలలో నేను నివేదికలు చదివాను. టీడీపీకి చెందిన ఒక గౌరవ సభ్యుడు స్పెషల్ స్టేటస్ కన్నా స్పెషల్

ప్యాకేజీ బాగుందని చెప్పారు. నేను ఆర్థిక సంఘం సిఫార్సులను ఇక్కడ ప్రస్తావించ దలచుకున్నాను. ఈ సిఫార్సులను అనుసరించి ఆర్థిక సంఘం స్పెషల్, జనరల్ స్టేటస్ మధ్య తేడాని చెరిపివేసింది. ఆర్థిక సంఘం పర్వత రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాల కోసం కొత్త శ్రేణిని ప్రవేశపెట్టింది. అలాగే మిగతా రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోకుండా చూసింది. ఆర్థిక సంఘం, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను ఆకాంక్షలను గౌరవిస్తుంది. దయచేసి చివరి వరకు వినండి, మీకు ఆసక్తి ఉన్న విషయాలు ఇంకా చెప్పలేదు. ఎన్డీయే ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలు, ఆకాంక్షలను గౌరవిస్తుంది. కానీ, మేము 14వ ఆర్థిక సంఘం సిఫార్సులకు కట్టుబడి ఉన్నాము. అందుకే ఆంధ్ర ప్రదేశ్ కోసం ఒక ప్రత్యేక సహాయ ప్యాకేజీని రూపొందించడం జరిగింది. ఏ ఆర్థిక సహాయం అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ కేటగిరి స్టేటస్ ద్వారా లభించాలో, అదే సహాయాన్ని ఈ ప్యాకేజీ ద్వారా అందించడం జరుగుతుంది. ఈ నిర్ణయాన్ని 8 సెప్టెంబర్ 2016 న అమలు చేయడం జరిగింది.

4 నవంబర్ 2016 న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వయంగా ఈ ప్యాకేజీని స్వీకరించి, ఆర్థిక మంత్రి గారికి ధన్యవాదాలు కూడా తెలియజేశారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ విభజన చట్టానికి అనుగుణంగా ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడానికి, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ఇవ్వడానికి నిబద్ధతతో ఉంది. కానీ టిడిపి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి మాట మార్చింది. స్పీకర్ మేడం, టిడిపి మా నుంచి విడిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు నేను చంద్రబాబు నాయుడు గారికి ఫోన్ చేశాను. ఈ సమాచారం మీకు కొత్త అయ్యుండొచ్చు కానీ ఇది ఉపయోగకరమైన సమాచారం. టిడిపి, ఎన్డీఏ నుంచి బయటికి వెళ్ళింది. నేను శ్రీ చంద్రబాబు నాయుడు గారితో ఫోన్ లో మాట్లాడాను, వైఎస్ఆర్ కాంగ్రెస్ వారిని ఉచ్చులోకి లాగుతున్నారని చెప్పాను. నేను ఈ పోటీ నుంచి వారిని వారు రక్షించుకోలేరని చెప్పాను. వారికి అక్కడ కొన్ని వివాదాలు ఉండొచ్చు కానీ దానికి ఈ సభని ఉపయోగించడం పద్ధతి

కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఈ అవకాశవాదాన్ని గమనిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రశంసని విమర్శగా మలిచేశారు. ఏదైనా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నప్పుడు దాని ప్రభావం వేరే రంగాలపై కూడా ఉంటుంది. శ్రీ వీరప్ప మొయిలీ గారు 3 సంవత్సరాల క్రితం ఈ విధంగా అన్నారు "మీరు రెండు రాష్ట్రాల మధ్య అసమానతలను ఎలా సృష్టించగలరు? ఇది పెద్ద సమస్య. మీరు మధ్యవర్తి గా ఉన్నారు." ఈ విధంగా మొయిలీ గారు మాట్లాడారు. ఈరోజు నేను ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆశ్వాసం ఇస్తున్నాను, అది రాజధాని కానివ్వండి, రైతుల సంక్షేమం కానివ్వండి. కేంద్ర ప్రభుత్వం లేదా ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం నుంచి తప్పుకోము, ఏ సహాయం చేయగలమో మేము ఆ సహాయం అందిస్తూనే ఉంటాం.మేము ఆంధ్ర ప్రదేశ్ మేలే దేశానికి కూడా మేలు చేస్తుందని నమ్ముతున్నాము. వారి అభివృద్ధి లో ఏ విధమైన లోటూ లేకుండా చూసుకుంటాం. మా పని చేసే విధానం సమస్యలకు పరిష్కారం వెతికే విధంగా ఉండాలని మేము ప్రయత్నిస్తూ ఉంటాము. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ ఇన్ని దశాబ్దాలుగా ఎవరు పెండింగ్ లో ఉంచారు? జీఎస్టీ విధానాన్ని కూడా ఇన్ని సంవత్సరాలుగా ఎవరు వాయిదా వేశారు? కొంతమంది దీన్ని గుజరాత్ ముఖ్యమంత్రి ఆపారు అని చెప్పారు. ఈ సందర్భంగా నేను ఈ సభకి ఒక విషయం చెప్పదలుచుకున్నాను. ఆ సమయంలో అధికారంలో ఉన్నవారికి కూడా తెలుసు. నేను ముఖ్యమంత్రిగా రాసిన ఉత్తరాలు కూడా ఉన్నాయి. నేను అప్పుడు రాష్ట్రాలకు ఉన్న అపోహలు ఆందోళనలు దూరం చెయ్యకుండా జి ఎస్ టి తో మనం ముందుకు వెళ్ళలేము అని చెప్పాను. రాష్ట్రాలకు ఉన్న కొన్ని న్యాయమైన సమస్యలను కూర్చుని విని పరిష్కరించి ఉండవచ్చు. కానీ వీరికి ఉన్న అహంకారం వలన రాష్ట్రాలు చెప్పే ఒక్క మాట కూడా వినడానికి సిద్ధంగా లేరు. నేను ఈ రోజు ఈ విషయం మీ అందరికీ చెప్తాను. బిజెపి యేతర ముఖ్యమంత్రులు, అందులో కాంగ్రెస్ వారు కూడా ఉన్నారు, వారు మేం మాట్లాడలేము మీరే

ఈ విషయాల గురించి మాట్లాడమని నన్ను అడిగే వారు. ఇది రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది అని నేను మాట్లాడాను. నేను ప్రధానమంత్రి అయ్యాక నా ముఖ్యమంత్రిగా ఉన్న అనుభవాన్ని ఉపయోగించాను. నేను ఆ అనుభవం ద్వారా రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించగలను. అన్నిరాష్ట్రాలని ఒక తాటి మీదకి తీసుకు రావచ్చు. మీకు అహం లేనట్లయితే మీరు ఈ రాష్ట్రాల సమస్యలను ఎప్పుడో పరిగణనలోకి తీసుకునేవారు. జీఎస్టీ ఐదు సంవత్సరాల క్రితమే అమలు చేయబడి వుండేది. కానీ మీ పనితీరు ముఖ్యమైన విషయాలను వాయిదా వేయడం.

నల్లధనంపై సిట్ ని ఏర్పాటు చేయమని సుప్రీం కోర్ట్ ఆదేశించింది. ఆ విషయాన్ని పెండింగ్ లో ఎవరు పెట్టారు? అలాగే బినామీ ఆస్తుల చట్టాన్ని కూడా వాయిదా వేసింది ఎవరు? స్పీకర్ మేడం, ఎన్డీఏ ప్రభుత్వం రైతుల కోసం ఖరీఫ్ పంట కనీస మద్దతు ధరని150 శాతం పెంచి ఒక చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీన్ని ఎవరు ఆపారు? 2006 నుండి ఆ నివేదిక మీ వద్దనే ఉంది, మీరు 2014 వరకు అధికారం లోనే ఉన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా మీకు ఆ నివేదిక గుర్తు రాలేదు. రైతులకు కనీస మద్దతు ధర ఒకటిన్నర రెట్లు ఇస్తామని మేము నిర్ణయించాము .యు.పి.ఏ ప్రభుత్వం 2007 లో జాతీయ వ్యవసాయ విధానం ప్రకటించినప్పుడు 50 శాతం పెరుగుదల గాలికి వదిలేసింది. ఆ తర్వాత కూడా ఏడు సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కానీ కనీస మద్దతు ధర కేవలం మాటలకే పరిమితం అయింది, ప్రజలకు, రైతులకు తప్పుడు వాగ్దానాలు ఇవ్వడం జరిగింది. ఈరోజు మరో విషయం చెప్పాలనుకుంటున్నాను, ఈ సమాచారం దేశానికి చాలా ముఖ్యం. ఎవరికైతే ఈ విషయం ఇష్టం లేదో వారికి ఇది ఉపయోగ పడదు కానీ దేశానికి ఇది చాలా అవసరం. మేము అధికారంలోకి 2014లో వచ్చాము. అప్పుడు చాలా మంది మమ్మల్ని ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రం తీసుకురావాలని కోరారు. మా మనసులో కూడా శ్వేతపత్రం తీసుకురావాలని

ఉండేది కానీ మేము కూర్చుని మొత్తం సమాచారం రాబట్టడం మొదలుపెట్టాక, ఒకొక్క విషయం బయట పడుతూ మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆర్థిక వ్యవస్థ ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చిందో చూసి ఆశ్చర్యపోయాం. ఈ కథ 2008లో మొదలయ్యింది, 2009 లో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల కి కేవలం ఒకే సంవత్సరం మిగిలి ఉంది కాబట్టి వీలైనన్ని బ్యాంకులను ఖాళీ చేయాలని కాంగ్రెస్ కు అనిపించింది. ఒకసారి అలవాటు పడిన తరువాత 2009 నుంచి 2014 వరకు బ్యాంకులను రహస్యంగా దోపిడీ చేయడం జరిగింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం బ్యాంకులను దోచుకునే ఆట కొనసాగుతూనే ఉంది. ఒక నిజం ఈ సభలోని సభ్యులందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మేడం స్పీకర్, స్వాతంత్ర్యం వచ్చిన అరవై సంవత్సరాలలో బ్యాంకులు రుణాల కింద మొత్తం 18 లక్షల కోట్లు ఇచ్చింది. అరవై సంవత్సరాలలో 18 లక్షల కోట్లు ఇస్తే, 2008 నుంచి 2014 వరకు ఈ ఆరు సంవత్సరాలలో ఆ మొత్తం 18 లక్షల కోట్ల నుండి 52 లక్షల కోట్లకు పెరిగింది. 60 సంవత్సరాల లో ఏం జరిగిందో అది ఈ ఆరు సంవత్సరాలలో రెట్టింపు జరిగింది. ఇది ఎలా జరిగింది? ఇంటర్నెట్ బ్యాంకింగ్ ప్రపంచంలో చాలా ఆలస్యంగా వచ్చింది కానీ కాంగ్రెస్ వ్యక్తులు తెలివైన వారు. ప్రపంచంలో ఇంటర్నెట్ బ్యాంకింగ్ రాకముందే మనదేశంలో ఫోన్ బ్యాంకింగ్ ప్రారంభించారు. ఈ టెలిఫోన్ బ్యాంకింగ్ అద్భుతం వల్లే ఆరు సంవత్సరాలలో 18 లక్షల కోట్ల రుణాన్ని, 52 లక్షల కోట్లకి పెంచడం జరిగింది. ఆ విధంగా కాంగ్రెస్ పార్టీ, వారికి కావలసిన వ్యక్తులకి బ్యాంకులను దోచి పెట్టింది. వారి పని చేసే విధానం ఏమిటి? ఏవిధమైన కాగితాలను చూసేవారు కాదు కేవలం ఒక ఫోన్ కాల్ పై రుణాన్ని మంజూరు చేయడం జరిగింది. మొదటి రుణాన్ని తీర్చడానికి రెండవ రుణం కూడా ఇప్పించే వారు. పోయింది ఏదో పోయింది, పాత రుణాన్ని తీర్చడానికి కొత్త రుణం ఇస్తూ, ఈ విషవలయంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఇరుక్కుపోయింది. ఈ విధంగా దేశం, దేశంలోని బ్యాంకులు అవే పెద్ద గందరగోళంలో ఇరుక్కుపోయాయి. ఈ ఎన్ పీ ఏ అనేది

ఒకవిధంగా భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ కి ల్యాండ్ మైన్ లాంటిది. మేము పూర్తి పారదర్శకతతో దర్యాప్తు ప్రారంభించాము. NPA వాస్తవ స్థితి ఏమిటో, దీని కోసం ఒక యంత్రాంగాన్ని ప్రారంభించాము. మేము NPA ని సూక్ష్మంగా పరీక్షించే కొద్దీ గందరగోళం పెరుగుతూనే పోయింది. NPA పెరగడానికి మరొక కారణం యూపీఏ ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుంది. దీనివల్ల దేశంలో మూలధన వస్తువుల దిగుమతి భారీగా పెరిగింది. మీరంతా ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే, మూలధన వస్తువుల పై కస్టమ్స్ సుంకాన్ని భారీగా తగ్గించి వాటి దిగుమతిని భారీగా పెంచి వాటిని ముడి చమురు దిగుమతుల తో సమానంగా చేశారు. ఈ దిగుమతులు అన్నీ కూడా బ్యాంకుల నుండి తీసుకున్న రుణాల ద్వారా సమకూర్చ బడ్డాయి. ఇది దేశంలో మూలధన వస్తువులు ఉత్పత్తి పై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. బ్యాంకు రుణం లేకుండా, ప్రాజెక్టుల సరైన అంచనా వేయకుండా, ఈ ప్రాజెక్టు లకి ఆమోదం లభించేది. చాలా ప్రాజెక్టులలో బ్యాంకులు ఈక్విటీ కి బదులుగా రుణాలు ఇచ్చాయి. ఒకవైపు మూలధన వస్తువుల దిగుమతి మరోవైపు ప్రాజెక్టుల నిర్మాణంలో కస్టమ్ డ్యూటీ లేదా ప్రభుత్వ పన్ను కుదింపు చేయడం జరిగింది. అలాగే, ప్రాజెక్టుల కి ప్రభుత్వ అనుమతి ఇవ్వడానికి, కొత్త పన్ను చట్టాలు రూపొందించబడ్డాయి. ఇవి ప్రభుత్వ ఖాతాలోకి వెళ్ళని పన్నులు. ఈ పనుల వల్ల ప్రాజెక్టుల కి అనుమతి లభించడం లో ఆలస్యం జరిగింది. బ్యాంక్ రుణాలు ఇరుక్కుపోయాయి, NPA పెరుగుతూనే ఉంది. ఈ రోజు కూడా NPA పై నేను మాట్లాడుతున్నప్పుడు ప్రజలందరికీ ఈ సభ ద్వారా నిజాలు చెప్పే బాధ్యత నాపై ఉంది. మా ప్రభుత్వం బ్యాంకుల పుస్తకాలలో చిత్తశుద్ధితో ఈ NPAలను చూపించాలని నిర్ణయించింది. మరోవైపు బ్యాంకు వ్యవస్థను మెరుగుపరచడానికి మేము ఎన్నో విధాన నిర్ణయాలు తీసుకున్నాము. ఈ సంస్కరణలు రాబోయే రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థకు సహాయపడతాయి. 50 కోట్లకు పైగా NPA ఉన్న ఖాతాలన్నింటినీ సమీక్షించారు. వీటిలో ఉద్దేశపూర్వక ఎగవేత,

మోసం చేసే అవకాశాలున్న ఖాతాలను గుర్తిస్తున్నారు. బ్యాంకులో ఒత్తిడి ఆస్తుల నిర్వహణకు కొత్త వ్యవస్థను సిద్ధం చేశారు. బ్యాంకుల రీ కాపిటలైజేషన్ కోసం రెండు లక్షల 10 వేల కోట్ల రూపాయలు ఇవ్వబడుతుంది. మా ప్రభుత్వం దివాలా స్మృతి ని రూపొందించింది. దీని ద్వారా NPA లో 25 శాతానికి సమానంగా ఎగవేసిన అతిపెద్ద 12 ఎగవేత దారులపై జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ కేసులను నమోదు చేసింది. ఈ పన్నెండు ప్రధాన కేసులలో సుమారు మూడు లక్షల కోట్ల రూపాయలు చిక్కుకున్నాయి. కేవలం ఒక్క సంవత్సరంలో ఇందులోని మూడు పెద్ద కేసులలో మా ప్రభుత్వం 55% తిరిగి రాబట్టుకుంది. అదే పన్నెండు పెద్ద కేసుల గురించి మాట్లాడితే వాటిలో 45 శాతం తిరిగిరాబట్టుకున్నాం. అలాంటి వ్యక్తుల కోసమే నిన్న లోక్ సభలో ఫ్యూజిటివ్ ఎకనామిక్ ఆఫెండర్ బిల్లును ఆమోదించడం జరిగింది. బ్యాంకు రుణాన్ని ఎగవేసే వారికి ఈ దేశ చట్టాల నుండి తప్పించుకోవడం మరింత కష్టం అయింది. ఇది NPA ను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం, కొనసాగిస్తున్న వ్యవస్థ, ఈరోజు దేశాన్ని చాలా పెద్ద సంక్షోభంలో పడవేసేది. గత ప్రభుత్వం 32 బిలియన్ డాలర్ల ప్రత్యేక విదేశీ కరెన్సీ ప్రెసిడెంట్ డిపాజిట్లు లేదా ఎఫ్ సి ఎం ఆర్ రుణ భారం దేశంపై వేసిందని ఈ సభ ద్వారా దేశానికి తెలియజేస్తున్నాను. ఈ రుణాన్ని భారత్ ఇప్పటికే తిరిగి చెల్లించింది. ఈ పని మా ప్రభుత్వం చేసింది.

మేడం స్పీకర్,దేశంలో గ్రామస్వరాజ్యం ని ముందుకు తీసుకువెళ్లడానికి అలాగే మహాత్మా గాంధీ కన్న కలల్ని నిజం చేయడానికి, 15 ఆగస్టు వరకు 65 వేల గ్రామాలలో అందరికీ బ్యాంకు ఖాతాలు, గ్యాస్ కనెక్షన్లు, విద్యుత్ కనెక్షన్లు, అందరికీ టీకాలు వేయడం, బీమా పథకం సురక్ష కవచం ఇవ్వడం ప్రతి ఇంట్లో ఎల్ఈడీ బల్బులు ఇవ్వడం, ఈ గ్రామాలు 115 జిల్లాలో ఉన్నాయి. అవి తప్పుడు విధానాల వల్ల కలిగిన వెనకబాటుతనం తో

అవిశ్వాసంలో ఉంటే మేము వారికి కొత్త ఆకాంక్షలతో నమ్మకాన్ని కలిగించాం. నూతన భారత్ వ్యవస్థలు తెలివైనవి, సున్నితమైనవి. స్కూల్లో పరిశోధనశాలలో ఉండేవి కావు. అటల్ టింకరింగ్ ల్యాబ్, స్కిల్ ఇండియా, ఖేలో ఇండియా పథకాల ద్వారా ప్రతిభకు గుర్తింపు గౌరవం పెరిగింది. మహిళల జీవితంలో ప్రతి అడుగులో వారికి ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకుని కార్యక్రమాలు తయారు చేయడం జరుగుతుంది ఈ విషయాన్ని నేను గర్వంగా చెప్పగలను. భద్రత పై క్యాబినెట్ కమిటీ లో, ఈ దేశంలోనే మొట్టమొదటి సారిగా ఇద్దరు మహిళలు సభ్యులుగా ఉన్నారు. నిర్ణయం తీసుకోవడంలో ఇద్దరు మహిళా మంత్రులు పాల్గొంటారు. అలాగే మహిళలని ఫైటర్ పైలెట్ గా కూడా తీసుకోవడం జరుగుతుంది. ' ముమ్మారు తలాక్' తో ఇబ్బంది పడుతున్న ముస్లిం సోదరిమణులకు మద్దతుగా ఈ ప్రభుత్వం నిలబడింది. ' బేటీ బచావో బేటీ పడావో' ఒక ఉద్యమంలా మారింది. అనేక జిల్లాలలో ఆడపిల్లలు పుట్టడం పెరిగింది. అలాగే ఆడపిల్లలపై అత్యాచారం చేసే వారిని ఉరి తీసే వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో హింసకు, అత్యాచారానికి అనుమతి ఉండదు. అలాంటి సంఘటనలలో ఒక్క భారతీయుని మరణం కూడా విచారకరం. ఇది మానవత్వం మూల భావనలకు వ్యతిరేకం. ఎక్కడైతే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయో, అక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేను ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవిస్తున్నాను. దేశం 21 వ శతాబ్దపు కలలను నెరవేర్చాల్సి ఉంది. ' భారత్ మాల' ద్వారా దేశంలో హైవేలను విస్తరించడం జరుగుతుంది. అలాగే ' సాగర్ మాలా' ప్రాజెక్టుల ద్వారా పోర్టు అభివృద్ధి, పోర్టు భూముల అభివృద్ధిని సాధిస్తున్నాం. రెండవ, మూడవ శ్రేణి పట్టణాలలో వైమానిక కనెక్టివిటీ పై పనులు వేగంగా జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా నగరాలలో మెట్రోను విస్తరించే పనులు జరుగుతున్నాయి దేశంలో ప్రతి పంచాయతీ కి

ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడానికి వేగంగా పనులు జరిగాయి. ఈ పనులన్నింటికీ దేశమే సాక్ష్యం. గ్రామం నుంచి పెద్ద నగరాల వరకూ, పేద, మధ్యతరగతి వర్గాల జీవితాలలో పెను మార్పులు తీసుకు వచ్చాము. గత ప్రభుత్వాల కంటే మా ప్రభుత్వం ఎక్కువ వేగవంతంగా పనిచేస్తుంది. రహదారుల నిర్మాణం కానివ్వండి,రైల్వే లైన్ల విద్యుదీకరణ కానివ్వండి, ఉత్పత్తి సామర్థ్యం పెంచే ప్రక్రియ కానివ్వండి, కొత్త విద్యాసంస్థలను ఏర్పాటు చేయడం కానివ్వండి, ఐఐటీలు, ఐఐఎంలు, వైద్య సీట్ల సంఖ్యను పెంచడం కానివ్వండి, అదే సిబ్బంది, పాలనా వ్యవస్థ అదే, పైళ్లపై పని చేసే పద్ధతి కూడా అదే, కానీ రాజకీయ సంకల్పం ఉండడంతో ఇవన్నీ సాధ్యం అవుతున్నాయి. దీనివల్లనే మేము దేశ సామర్థ్యం లో కొత్త శక్తి నింపుకుని ముందుకి వెళ్తున్నాం. ఈ దేశంలో ఉపాధి గురించి అనేక భ్రమలు వ్యాప్తి చెందుతున్నాయి. మరోసారి వారు నిజాన్ని అణచి వేయాలని చూస్తున్నారు. నిరాధార మాటలు మాట్లాడుతూ, ఏ విధమైన సమాచారం లేకుండా పుకార్లను వ్యాప్తి చేస్తున్నారు. మీరు ఉపాధి అవకాశాల పట్ల శ్రద్ధ వహించి ఉంటే మేలు జరిగి ఉండేది. కానీ మీరు రాజకీయాలు చేసే పాపం చేసి ఈ దేశ యువతని నిరుత్సాహ పరిచారు. ప్రభుత్వం ఉపాధికి సంబంధించిన సమాచారాన్ని ప్రతి నెల దేశానికి తెలియజేయాలని నిర్ణయించింది. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్, వ్యవస్థీకృత రంగం లో ఉపాధి అవకాశాలు ఎంతగా పెరిగాయో కొలవడానికి ఉపయోగపడే సాధనం. సెప్టెంబర్ 2017 నుంచి మే 2018 వరకు, ఈ తొమ్మిది మాసాలలో దాదాపు 45 లక్షల కొత్త సభ్యులు ఈపీఎఫ్ లో చేరారు. 77 శాతం సభ్యులు 28 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలవారు. అధికారిక వ్యవస్థలో దాదాపు ఐదు లక్షల అరవై ఎనిమిది వేలకు పైగా కొత్త పెన్షన్ పథకం లో చేరారు. అంటే గత 9 నెలల్లో ఎన్ పి ఎస్ లో ఇంత మంది చేరారు. ఎన్ పి ఎస్, ఈపీఎఫ్ సభ్యుల సంఖ్యను జోడించిన్నట్లయితే గత తొమ్మిది నెలల్లో వ్యవస్థీకృత రంగంలో 50 లక్షల మంది కంటే ఎక్కువ మంది ఉపాధి పొందారు. ఈ సంఖ్య ఒక సంవత్సరానికి 70 లక్షల కంటే

ఎక్కువ అవుతుంది. ఈ 70 లక్షల మంది లో ఈ ఎస్ ఐ సి లో నమోదైన వారి సంఖ్య జోడించ లేదు, ఎందుకంటే ప్రస్తుతం ఆధార్ తో జోడించే ప్రక్రియ నడుస్తుంది. ఇవే కాకుండా దేశంలో అనేక వృత్తులు ఉన్నాయి, అందులో యువత తమ ప్రొఫెషనల్ డిగ్రీలతో నమోదు చేసుకొని వారి పనులు వారు చేస్తున్నారు. ఉదాహరణకు డాక్టర్లు, ఇంజనీర్లు, వాస్తుశిల్పులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్ లు, కాస్ట్ అకౌంటెంట్ లు, కంపెనీ సెక్రటరీ లు. ఈ వృత్తుల పట్ల ఒక స్వతంత్ర సంస్థ సర్వే నిర్వహించింది. ఆ సంస్థ సర్వే ప్రకారం 2016-17 లో దాదాపు 17 వేల మంది కొత్త చార్టర్డ్ అకౌంటెంట్ లు వ్యవస్థ లోకి వచ్చారు. ఐదు వేల మంది కొత్త కంపెనీలను స్థాపించారు. ఒక చార్టెడ్ అకౌంటెంట్ 20 మందికి ఉద్యోగం ఇచ్చినట్లయితే ఒక లక్ష మందికి వారి సంస్థల్లో ఉపాధి లభించింది. అలాగే పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు, దంత వైద్యులు, ఆయుష్ వైద్యులు వీరందరూ కూడా 80 వేల కంటే ఎక్కువ మంది కళాశాలల నుండి ప్రతి సంవత్సరం ఉత్తీర్ణులై వస్తారు. ఇందులో 60 శాతం మంది వారి వృత్తిని చేపట్టినట్టయితే, ప్రతి వైద్యుడు ఐదు మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చినట్లయితే ఆ సంఖ్య 240000 చేరుతుంది. 2017 లో దాదాపు 80 వేల మంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు న్యాయవాదులయ్యారు. అందులో కూడా 60 శాతం మంది ప్రాక్టీస్ చేపడితే ఒక్కొక్కరూ కనీసం ఇద్దరు నుండి ముగ్గురికి ఉపాధి కల్పించి ఉంటారు.అంటే దాదాపు 2 లక్షల మందికి ఈ న్యాయవాదుల ద్వారా ఉద్యోగాలు లభించాయి. 2017 లో ఈ మూడు వృత్తులలో 6 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయి.

ఇప్పుడు మనం అనధికార రంగం గురించి మాట్లాడితే, రవాణా రంగంలో ఉపాధి కి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గత సంవత్సరం 7 లక్షల 60 వేల వాణిజ్య వాహనాలు రవాణా రంగంలో అమ్ముడయ్యాయి. ఇందులో 25 శాతం వాహనాలు పాత వాహనాలు బదులుగా కొన్నా, దాదాపు 5 లక్షల 70 వేల వాహనాలు కొత్తగా రవాణా సౌకర్యం కోసం రోడ్డు

పైకి వచ్చినట్లు. ఒక వాహనం మీద ఇద్దరు వ్యక్తులు పనిచేసినా, అందులో 11 లక్షల 40 వేల మందికి ఉపాధి లభించిన్నట్లు. అలాగే ప్రయాణ వాహనాల విక్రయాలు చూసినట్లయితే ఆ సంఖ్య 25 లక్షల 40 వేలు. ఇందులో 20 శాతం వాహనాలు పాత వాహనాలు బదులుగా తీసుకున్నట్లయితే దాదాపు 20 లక్షల కొత్త వాహనాలు రోడ్డు పైకి వచ్చినట్లు. అందులో 25 శాతం వాహనాలు ఒక డ్రైవర్ ని నియమించినా, దాదాపు ఐదు లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు.

అదేవిధంగా గత సంవత్సరం రెండు లక్షల 55 వేల ఆటోలు అమ్ముడైన్నాయి. అందులో 10 శాతం ఆటోలు పాత వాటి బదులుగా కొన్నా దాదాపు రెండు లక్షల 30 వేల కొత్త ఆటోలు రోడ్డుమీదికి వచ్చినట్లు. ఆటోలు రెండు నెలలు నడుస్తాయి కాబట్టి రెండు ఆటోలపై ముగ్గురు ఉపాధి పొందుతున్నారు. ఆ విధంగా మూడు లక్షల 40 వేల మందికి కొత్త ఆటోల ద్వారా ఉపాధి లభించింది. 20 లక్షల ఉపాధి అవకాశాలు కేవలం గత ఒక సంవత్సరం రవాణా రంగం లోనే లభించింది. మనం ఈపీఎఫ్, ఎన్పీఎస్, వృత్తులు,రవాణా రంగం వీటిని కూడిన్నట్లయితే ఒక కోటి మంది కంటే ఎక్కువ మందికి గత సంవత్సరం ఉపాధి అవకాశాలు లభించాయని తెలుస్తోంది. ఈ సర్వే ఒక స్వతంత్ర సంస్థ నిర్వహించింది.నేను స్వతంత్ర సంస్థని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. ఇది ప్రభుత్వ సమాచారం కాదు.అందుకే నేను చెప్పేది ఏమిటంటే, నిజాన్ని, వాస్తవాలని అణచి వేయకూడదు. దేశాన్ని తప్పుదారి పట్టించ వద్దు. ఈరోజు దేశం ఒక క్లిష్టమైన స్థితిలో ఉంది.ఈ దేశంలోని 125 కోట్ల జనాభాలో 85% మంది యువత ఉన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ఈ దేశ భవిష్యత్తుని వారు నిర్ణయిస్తారు. నూతన భారతదేశమే ఈ దేశం కొత్త ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుంది. ఎక్కడైతే అపరిమిత విశ్వాసం, అవకాశాలు, స్థిరత్వం ఉంటాయో, అక్కడ విశ్వాస లోపం ఉండదు, ఏ

సమాజం పట్ల భేదభావం ఉండదు. ఇది ప్రపంచ దృష్టాంతంలో మార్పునకు చాలా ముఖ్యమైన సమయం. మనం ఐక్యంగా ఉండటం చాలా అవసరం.

గౌరవనీయులైన స్పీకర్ మేడం, ఈ చర్చలో పాల్గొన్న గౌరవనీయ సభ్యులందరికీ నేను ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మరోసారి ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందని ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాను. భారత దేశ అభివృద్ధిలో పాలుపంచుకొనే ప్రతి వ్యక్తికి మా మద్దతు ఉంటుంది. నేను అవిశ్వాస తీర్మానం తీసుకు వచ్చిన గొప్ప వ్యక్తులకు మరోసారి 2024లో ఆ తీర్మానాన్ని తీసుకురావాల్సిందిగా ఆహ్వానిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తాను, అలాగే ఈ సభని అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించాలని ప్రార్థిస్తాను. నాకు ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు.

రాజ్య సభ డిప్యూటి ఛైర్మన్ ని
అభినందిస్తున్న సందర్భంగా
ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ
గారి ప్రసంగం.

9 ఆగస్టు 2018

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కి ప్రధానమంత్రి అభినందనలు-9 ఆగస్టు 2018

గౌరవనీయులైన ఛైర్మన్ గారు,

ముందుగా, నూతన ఉప సభాపతి గా ఎన్నికైన శ్రీ హరివంశ్ గారికి యావత్తు సభ తరఫునా, నా తరఫునా అభినందనలు తెలియజేస్తున్నాను. అరుణ్ గారు కూడా కోలుకొని ఈ రోజున మన అందరి మధ్య కు రావడం మనమందరం సంతోషించవలసినటువంటి విషయం. ఈ రోజు ఆగస్టు 9వ తేదీ. స్వాతంత్ర్యోద్యమం లో ఆగస్టు విప్లవం ఒక ముఖ్యమైన మైలు రాయి; ఇందులో బలియా జిల్లా ప్రముఖ పాత్ర ను పోషించింది. 1857 లో స్వాతంత్ర్య సమరం మొదలైన నాటి నుంచి ఆగస్టు విప్లవ భేరీ ని మోగించడం నుంచి ప్రాణ సమర్పణ వరకు స్వాతంత్ర్య పోరాటం లో బలియా అగ్ర భాగాన నిలచింది. అది మంగళ్ పాండే గారు కావచ్చు లేదా చిట్టూ పాండే గారు కావచ్చు లేదా చంద్రశేఖర్ గారి సంప్రదాయం కావచ్చు.. మరి ఈ పరంపర లో హరివంశ్ గారు కూడా పాలుపంచుకొన్నారు.

జయ ప్రకాశ్ గారి గ్రామం లో ఆయన జన్మించారు. ఈ రోజు వరకు కూడా ఆ గ్రామం తో ఆయన కు అనుబంధం ఉంది. జయ ప్రకాశ్ గారి కలలను నిజం చేయడం కోసం ఏర్పాటైన ట్రస్టు లో ఒక ధర్మకర్త గా కూడా ఆయన పని చేస్తున్నారు. తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకొన్న పద స్రష్ట ల సంప్రదాయం లో హరివంశ్ గారు ఒకరు. ఆయన బనారస్ లో ఒక విద్యార్థి గా ఉన్న సంగతి నాకు సంతోషాన్నిచ్చేటటువంటి అంశం. ఆయన బనారస్ లో విద్యాభ్యాసం చేశారు. ఆయన ఆర్థిక శాస్త్రం లో ఎం.ఎ. ను బనారస్ లోనే పూర్తి చేశారు. రిజర్వు బ్యాంకు లో సేవ కు ఆయన ఎంపిక అయ్యారు. అయితే, ఆయన రిజర్వు

బ్యాంకు కు వెళ్ళలేదు. ఆ తరువాత తన కుటుంబం లోని పరిస్థితి దృష్ట్యా ఒక జాతీయ బ్యాంకు లో చేరారు.

గౌరవనీయులయిన సభాపతి గారు,

ఆయన తన జీవితంలో ముఖ్యమైన రెండు సంవత్సరాల పాటు హైదరాబాద్ లో పని చేశారని తెలిస్తే మీరు ప్రసన్నులవుతారు. అప్పుడప్పుడు ఆయన ముంబయి, హైదరాబాద్, ఇంకా ఢిల్లీ వంటి అనేక చోట్లకు వెళ్ళారు. అయితే, ఆ మహానగరాల కాంతులతో ఆయన ఎన్నడూ ప్రభావితుడు కాలేదు. రవివార్ వార్తా పత్రిక లో పని చేయడానికని ఆయన కలకత్తా కు వెళ్ళారు. ఎస్.పి. సింహా గారు ఒక ప్రముఖుడన్న సంగతి మనకు అందరికీ తెలిసిన విషయమే. ఆయన టెలివిజన్ ప్రపంచంలో సుపరిచితుడు. ఆయన ఎస్.పి. సింహా గారి తో కలసి పని చేశారు. ధరమ్‌వీర్ భారతి లో ఆయన శిక్షణార్థి అయిన పత్రికా రచయిత గా పని చేశారు. ఆయన తన జీవితాన్ని అక్కడి నుంచే ఆరంభించారు. ఆయన ధర్‌మ్‌యుగ్ లోనూ పని చేశారు.

చంద్రశేఖర్ గారికి ఆయన నమ్మకస్తుడిగా వ్యవహరించారు. ప్రతి ఒక్కరికీ కూడా తను నిర్వహించే విధుల తాలూకు విలువ తో పాటు గౌరవ లక్షణాలు అబ్బుతాయి. చంద్రశేఖర్ గారి బృందం లో తాను పోషించిన పాత్ర రీత్యా, ఆయనకు సకల సమాచారం అందుబాటులో ఉండేది. చంద్రశేఖర్ గారు రాజీనామా చేయబోతున్నారన్న సంగతి ఆయన ముందుగానే ఎరుగుదురు. ఆయన కు సొంత వార్తాపత్రిక ఉంది. పత్రికా రచన తో ఆయన సాన్నిహిత్యాన్ని కలిగి వుండే వారు. అయితే, చంద్రశేఖర్ గారు రాజీనామా చేయనున్నారన్న సంగతి ని ఆయన తన సొంత వార్తాపత్రిక కు సైతం తెలియనీయ లేదు. తన కార్యాలయ గౌరవాన్ని

కాపాడుతూ ఈ రహస్యాన్ని ఆయన తన వద్దే అట్టిపెట్టుకొన్నారు. తన సొంత వార్తాపత్రికలో ఈ వార్త ను ప్రచురించి, ప్రశంసలు పొందడాన్ని ఆయన అనుమతించలేదు.

హరివంశ్ గారు బిహార్ లో రవివార్ వార్తాపత్రిక లో చేరారు. ఆ కాలం లో అది అవిభక్త బిహార్ గా ఉండింది. ఝార్ ఖండ్ ఆ తరువాత ఏర్పడింది. ఆయన ప్రభాత్ ఖబర్ లో చేరడం కోసం రాంచీ కి వెళ్ళారు. ఆయన అందులో చేరేటప్పటికి ఆ వార్తాపత్రిక సర్క్యులేషన్ 400 ప్రతులు మాత్రమే. జీవితం లో అనేక అవకాశాలను పొందిన వ్యక్తి కి, ఒకవేళ అతడు బ్యాంకింగ్ రంగంలోకి వెళ్ళినా మంచి అవకాశాలు దక్కేవి. ఏమైనా, ఆయన ఒక ప్రతిభావంతుడు. కేవలం 400 కాపీల సర్క్యులేషన్ కలిగిన ఒక వార్తాపత్రిక కు ఆయన తనను తాను అంకితం చేసుకొన్నారు. తన నాలుగు దశాబ్దాల పత్రికారచన వృత్తి లో శక్తివంతమైన పత్రికారచన కు ప్రతిబింబంగా ఉన్నారు. ఆ పత్రికారచన కూడా సమాజం హితం కోసం ముడిపడినటువంటిది. అది అధికారంలో ఉన్న వారి కోసం పాటుపడలేదు.

హరివంశ్ గారి ఎన్నిక వెనుక ఒక అతి పెద్ద అంశం ఏదంటే, సమాజ హితం కోసం పాటుపడిన పత్రికారచన తో ఆయనకు అనుబంధం ఉండడమే అని నేను నమ్ముతాను. ఆయన పాలక వర్గానికి కొమ్ము కాసే పత్రికారచనకు దూరంగా ఉంటూ వచ్చారు.

ఆయన వార్తాపత్రికను ప్రజా ఉద్యమంగా నిర్వహించ సాగారు. పరమవీరచక్ర సాహస పురస్కార విజేత అల్బర్ట్ ఎక్కా గారు దేశం కోసం ప్రాణ సమర్పణ చేసినప్పుడు, ఒక వార్తాపత్రిక లో ఆయన సతీమణి పేదరికం లో మగ్గుతున్నారన్న ఒక వార్త అచ్చయింది. ఇది 20 సంవత్సరాల నాటి మాట. హరివంశ్ గారు కర్తవ్యోన్ముఖులు అయ్యారు. ఆయన ప్రజల వద్ద నుంచి డబ్బును పోగు చేశారు; నాలుగు లక్షల రూపాయలను సేకరించి, ఆ మృత వీరుడి వితంతు మహిళ కు అందజేశారు.

ఒకసారి నక్సల్స్ ఒక ప్రముఖ వ్యక్తి ని అపహరించారు. హరివంశ్ తన వార్తాపత్రిక ద్వారా తనకు సమకూరిన వనరులను ఉపయోగించి, ధైర్యం చేసి నక్సల్ ప్రాంతానికి వెళ్ళారు. ఆయన వారితో సహేతుకంగా వాదించి, ఆ వ్యక్తి ని విడిపించుకు వచ్చారు. ఆయన తన ప్రాణాన్ని పణంగా పెట్టారు.

అంటే ఆయన బాగా చదువుకున్న వ్యక్తి, అంతేకాకుండా, అనేక పుస్తకాలు రాసిన వారు కూడాను. ఒక వార్తాపత్రికను నడపడం, పత్రికా రచయితలను పర్యవేక్షిస్తూ ఉండడం సులభతరమైన విషయం కావచ్చని నేను నమ్ముతాను. సమాజ హితం పట్ల సామాజిక కృషి పట్ల మొగ్గు చూపే వారికి అది ఒక భిన్నమైన అనుభవం. పాలకవర్గం తో ఉండే అనుభవం సంగతి వేరు.

మీరు పార్లమెంటు లో ఒక సభ్యుడి గా ఫలప్రదమైన పదవీకాలాన్ని గురించి ప్రతి ఒక్కరికి ఒక ఉదాహరణ ను చాటారు. అయితే, సభలో చాలా వరకు పరిస్థితి ఎలా ఉందంటే, ఆటగాళ్ళ కన్నా అంపైర్ లే బోలెడు చిక్కులను ఎదుర్కొనే స్థితి నెలకొంది. ఈ కారణంగా ప్రతి ఒక్కరిని నియమాలకు అనుగుణంగా ఆట ఆడవలసిందిగా బలవంత పెట్టడం ఒక సవాలుతో కూడినటువంటి పని. ఇది చాలా పెద్ద పని. అయితే ఈ పనిని హరివంశ్ గారు తప్పక నెరవేర్చగలుగుతారు.

హరివంశ్ గారి భార్య శ్రీమతి ఆశా గారు. ఆవిడ చంపారణ్ కు చెందిన వారు. అంటే ఒక రకంగా వీరి కుటుంబం యావత్తూ జెపి గారితోను, గాంధీ గారితోను ఏదో ఒక రకంగా అనుబంధం కలిగివున్నవారే అని చెప్పాలి. ఆమె రాజనీతి శాస్త్రం లో ఎం.ఎ. చేశారు. ఆమె కు ఉన్న విద్యా సంబంధమైనటువంటి జ్ఞానం ప్రస్తుతం మీకు మరింత సహాయకారి కాగలదు. పార్లమెంటు లో సభ్యులమైన మనందరికీ ప్రస్తుతం భగవంతుడి (హరి) కరుణ లభిస్తుందని

నేను విశ్వసిస్తున్నాను. ఇప్పుడిక ప్రతి ఒక్కరూ హరి (హరివంశ్ గారి) పైన ఆధారపడతారు. మరి మనకు- ఇటు వైపు వారు కావచ్చు, లేదా అటు వైపు వారు కావచ్చు- ఎంపీ లందరికీ మీ మద్దతు ఉంటుంది.

ఏ వైపున చూసినా 'హరి' పేరు కలిగిన వారు అభ్యర్థులుగా ఉన్నటువంటి ఎన్నిక ఇది. ఒక అభ్యర్థి తన పేరుకు ముందు బికె అనే ఉపసర్గ ను కలిగివున్నారు: ఆయనే బికె హరి గారు. అతడికి బికె అనే ఉపసర్గ గాని లేదా వికె అనే ప్రత్యయం గాని లేదు. అయితే, బికె హరి ప్రసాద్ గారిని కూడా నేను అభినందించాలనుకొంటున్నాను. ప్రజాస్వామ్యం గౌరవాన్ని నిలబెట్టే బాధ్యత ను ఆయన నెరవేర్చారు. వారికి ఫలితం ఏమిటన్నది తెలిసినప్పటికీ, ప్రక్రియ లో పాలుపంచుకోవాలని నిర్ణయించుకొన్నారని ప్రతి ఒక్కరూ అంటున్నారు. వోట్లను వేయడం ఎలాగన్న విషయంలో ఎంతో మంది కొత్త వారు శిక్షణ ను అందుకొన్నారన్నమాట.

మరి, ఈ యావత్తు ప్రక్రియ ను ఎంతో చక్కని రీతిలో ముందుకు తీసుకు వెళ్ళినందుకు- గౌరవనీయులైన సభ్యులు అందరికీ, ప్రముఖులు అందరికీ, అలాగే ఉప సభాపతి కి- నేను ధన్యవాదాలను తెలియ జేయాలనుకొంటున్నాను. ఆయనకు ఉన్న అనుభవం, సామాజిక హితం కోసం ఆయన కనబరచే అంకిత భావం పట్ల నేను విశ్వాసంతో ఉన్నాను. 'మనకు ఎటువంటి ఎంపీ కావాలి?' అనే ఒక శీర్షిక ను హరివంశ్ గారు తన వార్తాపత్రిక లో మొదలుపెట్టడం అనేది ఓ విశిష్టమైన అంశం. ఆ కాలంలో తానే ఒక ఎంపీ ని అవుతానన్న సంగతి ని ఆయన ఎరుగరు. కానీ, మనకు ఏ విధమైన ఎంపీ లు కావాలనే అంశం పై ఆయన ఒక బ్రహ్మాండమైన ప్రచార ఉద్యమాన్ని నడిపారు. ఆయన తన కలలను పండించుకొనే ఒక పెద్ద అవకాశాన్ని పొందారని, అంతేకాక మన ఎంపీలందరమూ ఆయన వద్ద నుంచి శిక్షణను పొందుతామని నేను ఆశిస్తున్నాను. భారతదేశం లో విస్తృత చర్చ జరిగిన దశరత్ మాంఝి ని గురించి మొట్టమొదటి సారిగా పరిశోధించి, ఆయన కథ ను ప్రచురించిన

వ్యక్తి హరివంశ్ బాబు యే. అంటే, సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రజల పట్ల సదా అనుబంధాన్ని ఏర్పరచుకొన్న ఒక సజ్జనుడి ద్వారా మనం ప్రస్తుతం మార్గదర్శకత్వాన్ని పొందబోతున్నామన్న మాట. ఆయనను నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను; ఆయనకు ఇవే నా శుభాకాంక్షలు.

2019



ప్రధానమంత్రి ముద్ర యోజనని ప్రారంభిస్తున్న శ్రీ నరేంద్ర మోదీ.

"ముద్ర యోజన - చిన్న మరియు సూక్ష్మ వ్యాపారాలకు చేయూతనివ్వడం ద్వారా ప్రజలను ఆర్థికంగా మరియు సామాజికంగా బలోపేతం చేసి వారికి విజయాన్ని సాధించడానికి ఒక వేదికను అందించింది."

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రసంగం.

7 ఫిబ్రవరి 2019

లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 7 ఫిబ్రవరి 2019

అధ్యక్షా, నేను గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేయడానికి ఇక్కడ మాట్లాడుతున్నాను. ఈసారి వారి ప్రసంగంలో వారు దేశానికి ఒక దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ దూరదృష్టి గురించి మాట్లాడారు. ఈ ప్రభుత్వ పెద్దగా నేను వారికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఒక ప్రభుత్వం యొక్క పరిచయం దాని నిజాయితీ. ఈ ప్రభుత్వం గుర్తింపు, దాని పారదర్శకత, పేదల కోసం జాలి, దేశహితం, అవినీతిపై పోరాటం చేయడం, వేగంగా పనిచేయడం. నాకు ఇంకా టీవీలో కనిపించిన దృశ్యాలు గుర్తున్నాయి, జేబులో డబ్బులు ఏవిధంగా పెట్టుకోబడ్డాయో చూసాం. ఈరోజు ఈ చర్చలో గౌరవనీయులు మల్లికార్జున ఖర్గే గారు, శ్రీ భర్తృహరి గారు, శ్రీ వేణుగోపాల్ గారు, శ్రీమతి హర్సిమ్రత్ కౌర్ బాదల్ గారు, శ్రీ దినేష్ త్రివేది గారు, శ్రీ మొహమ్మద్ సలీం గారు, శ్రీ సౌమిత్ర ఖాన్ గారు అలాగే ఎంతోమంది గౌరవనీయులైన సభ్యులు వారి వారి అభిప్రాయాలను ఇక్కడ వ్యక్తపరిచారు. ఒక అర్థవంతమైన చర్చ జరిగేలా ఇక్కడ ప్రయత్నాలు జరిగాయి. అలాగే ఈ సభ అభిప్రాయాలను ఏ విధంగా విన్నదో ఏ విధంగా వారిని ప్రోత్సహించిందో చూసాం. అందుకే ఇక్కడ అభిప్రాయాలను వ్యక్తీకరించిన వారికి, ప్రోత్సహించిన వారికి ఈ సభలో పాల్గొన్న వారందరికీ కూడా నేను ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. కొన్ని విమర్శలు కూడా చేశారు. కొన్ని తలా తోకా లేని మాటలు కూడా మాట్లాడారు. కొందరు వారి మనసుకు నచ్చిన మాటలు పదేపదే ఇక్కడ మాట్లాడారు. కానీ ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి ప్రతి ఒక్కరికి ఏదో ఒక బలహీనత ఉండే ఉంటుంది. ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి ఆ ప్రభావము ఉండడం సహజం. కానీ, ఇక్కడినుంచి వెళ్ళాక మనం ప్రజలకి మనం చేసిన పనుల గురించి లెక్క చెబుతాం. రాబోయే ఎన్నికలలో మీరంతా ఒక ఆరోగ్యకరమైన

పోటీలో ఉంటారు అని నేను ఆశిస్తున్నాను. కోట్ల మంది యువకులు ఎవరైతే ఈ సారి మొట్టమొదటి సారిగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారో వారికి కూడా నేను అభినందనలు తెలియజేసుకుంటున్నాను. వారంతా కూడా అభినందనలకి హక్కుదారులు. ఎందుకంటే, ఓటు వేయడం లేదా ఓటు అధికారం పొందడం ఒక చిన్న విషయం కాదు. అలాగే మనము కూడా 21వ శతాబ్దంలో పార్లమెంట్ ఎన్నికలలో ఓటు వేసే అధికారం లభించిన వీరందరినీ కూడా స్వాగతించాలి, ఎందుకంటే ఈ విధంగా దేశ పరిపాలనలో వారు భాగస్వాములు కానున్నారు అందుకే ఈ కొత్త గా ఓటు హక్కు సాధించిన యువకులకు నేను మరోసారి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను, ఈ కొత్త తరం దేశానికి ఒక దిశానిర్దేశం చేస్తారని ఆ దిశగా వారు ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారని విశ్వసిస్తున్నాను.

మేడం స్పీకర్, మనం కొత్త భారత్ గురించి మాట్లాడుతున్నప్పుడు ఒక ఆశ, విశ్వాసం గురించి కూడా మాట్లాడదాం. నిరాశ లో మునిగి పోయిన వ్యక్తి సమాజానికి కానీ లేదా అతని కోసం కానీ ఏమీ చేయలేడు. వారు వారి తరానికి కూడా ఏమీ చేయలేరు. ఎవరైతే ఆశతో, విశ్వాసంతో ఉంటారో వారే ఏదో ఒకటి చేయగలరు. ఏడ్చే వారి పక్కన సముదాయించడానికి ఓ పది మంది ఉండొచ్చు కానీ వారిలో మార్పు తీసుకు రాగలిగే వ్యక్తులు ఉండరు. నేను కొత్త భారత్ గురించి మాట్లాడుతున్నప్పుడు స్వామి వివేకానంద గారి మాటలు ప్రస్తావిస్తాను. గతంలో మనం ప్రయాణించిన దారి ఒక ఆవశ్యకత. ఎందుకంటే మధ్య మధ్యలో వచ్చిన వినాశ కాలంలో నుంచే ఒక కొత్త భారతదేశం భవిష్యత్తులో ఉద్భవించబోతుంది. ఆ కొత్త భారతం అంకురించింది, కొత్త చిగుళ్ళు వచ్చాయి, అది ఒక శక్తివంతమైన వృక్షంగా, విశాలమైన వృక్షంగా తయారు కాబోతుంది, అని స్వామి వివేకానంద చెప్పారు. క్లిష్టమైన పరిస్థితులలోనే మన ఆశా, విశ్వాసం మన దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళుతుంది. సవాళ్లని సవాళ్లతో ఎదుర్కొనే స్వభావం ఏ దేశానికి అయితే ఉంటుందో ఆ దేశమే సమస్యలను మట్టి కరిపిస్తుంది.

ఎవరైతే సమస్యలనుంచి పారిపోతారో వాళ్లు కొత్త సవాళ్లను ఎదుర్కోలేరు. అందుకే సవాళ్లను సవాళ్లతో ఎదుర్కోవడం కోసం, మానవజాతి ఆశలను, ఆకాంక్షలను సాధించడం కోసం మా శక్తియుక్తులను ఉపయోగిస్తున్నాం.

ఇక్కడ ఈ రోజు 1947 గురించి మాట్లాడారు. అది మంచి విషయం కానీ మనం చరిత్ర గురించి మాట్లాడుతున్నప్పుడు రెండు కాలాలుగా చర్చిస్తాం. ఒకటి BC మరొకటి AD. ఈరోజు నేను చర్చలో విన్నప్పుడు 1947 నుంచి 2014 వరకు బహుశా BC, AD గురించి ఎవరి ఉద్దేశం వారు చెప్పారు. బీసీ అంటే వారి ఉద్దేశం లో బిఫోర్ కాంగ్రెస్ అంటే కాంగ్రెస్ కి ముందు ఈ దేశంలో ఏమీ లేదు అంతా శూన్యమే, AD అంటే After dynasty, ఏదైతే అభివృద్ధి ఇక్కడ జరిగిందో అది వారి వల్లే జరిగిందని వారు చెప్పారు. కానీ ఏ పనినైనా పోల్చి చూడాలి. వారు చేసిన పని మంచిది కాదని అనడం లేదు అయినా వారు ఇంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

నాలుగున్నర సంవత్సరాల క్రితం ఏం జరిగింది. ఈ రోజు ఏం జరుగుతుంది. గత నాలుగున్నర సంవత్సరాలలో మనం ఏవిధంగా ముందుకు సాగాం? గత నాలుగున్నర సంవత్సరాలలో మనం పదకొండవ స్థానం నుంచి ఈరోజు 6వ స్థానానికి చేరుకున్నాము. మనం 11వ స్థానంలో ఉన్నప్పుడు ఈ సభలో కూర్చున్న కొంతమంది సభ్యులు ఆ 11వ స్థానంలో చేరుకోవడం కూడా గొప్ప గౌరవంగా చెప్పుకున్నారు. నాకు అర్థం కాని విషయం ఏమిటంటే 11వ స్థానంలో మనం చేరుకున్నప్పుడు అది ఒక గౌరవంగా మనం ఆహ్వానించాము కానీ ఆరో స్థానంలో చేరుకున్నప్పుడు వారికి ఎందుకు ఇంత బాధగా ఉందో, ఎందుకు నొప్పిగా ఉందో, అర్థం కావడం లేదు. ముందు ఉన్న పరిస్థితులతో పోల్చుకుంటే ఎక్కువగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వస్తున్నాయి. మేకిన్ ఇండియా ద్వారా మనం ఉత్పత్తిలో కొత్త రికార్డు స్థాపిస్తున్నాము. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఉక్కు ఉత్పాదక దేశంగా

మన దేశం అవతరించింది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్స్ ఉత్పాదన చేసే దేశంగా భారత్ ఈరోజు ఉంది. అలాగే ఆటోమొబైల్ ఉత్పాదనలో కూడా నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది. పంటలు, పాల ఉత్పత్తిలో భారతదేశం ఎన్నో రికార్డులు సొంతం చేసుకుంది. ఇంటర్నెట్ డేటా మన దేశంలో అతి చవకైనది, అలాగే ఇంటర్నెట్ మన దేశంలో ఎక్కువగా వాడడం కూడా జరుగుతుంది. ఆ విధంగా ఒక ఈకో సిస్టంని ప్రారంభించి ఏ విధంగా అయితే అందులో ఒక స్థానాన్ని సంపాదించి ఈ రోజు పెద్ద పెద్ద మల్టీ నేషనల్ కంపెనీలకు కూడా మనం ఒక సవాలు విసురుతున్నామో, అలాగే విమానయాన రంగంలో కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్నాం. కానీ ఇక్కడ ప్రతిపక్షాలు కేవలం వ్యతిరేకించాలి కాబట్టి వారు వ్యతిరేకిస్తున్నారు. మేము చేసే పనులను ఖచ్చితంగా ప్రతిపక్షాలు విమర్శించాలి, మోడీ గురించి విమర్శించాలి, మా విధానం గురించి విమర్శించాలి. ఇది మంచి విషయం. ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది చాలా అవసరం. కానీ మోడీ గురించి విమర్శిస్తూ విమర్శిస్తూ బిజెపి గురించి విమర్శిస్తూ విమర్శిస్తూ మన దేశం గురించి చెడుగా మాట్లాడకూడదు. అందుకే మన దేశం వెనుకబడి పోతుంది. మనలో ఎవరు కూడా పొరపాటున కూడా దేశం గురించి చెడుగా మాట్లాడకూడదు. ఎన్నో విషయాలు ఉన్నాయి లండన్ వెళ్లి ప్రెస్ కాన్ఫరెన్స్ లో మన దేశం గురించి చెడుగా మాట్లాడి ఏవిధంగా గౌరవాన్ని పెంచుతున్నారు? అబద్ధపు ప్రెస్ కాన్ఫరెన్స్ చేసి మీరు నన్ను ఏమీ అనలేదు అని అంటున్నారు. నేను నా హద్దుల్లో ఉండాలనుకుంటున్నాను అదే అందరికీ మంచిది. ఈరోజు ఖర్గే గారు మాట్లాడుతూ మోడీ గారు ప్రజలతో ఏం మాట్లాడతారో అవే విషయాలు రాష్ట్రపతి గారు ఈరోజున సభలో చెప్పారు అని. దీని అర్థం ఏంటంటే ఎప్పుడూ నిజం చెప్పే వాళ్ళు బయట ఒకలాగా లోపల ఒకలాగా మాట్లాడరు. ఎవరైతే నిజం చెప్తారో వారు బయట లోపల ఒకే మాట మాట్లాడుతారు. కాబట్టి నేను మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మీరు ఈ విషయాన్ని ఇక్కడ అందరి

ముందు చెప్పినందుకు మేము ప్రజలతో నిజమే మాట్లాడతాం, అలాగే సభలో కూడా నిజమే మాట్లాడతాం, లోక్ సభలో కూడా నిజమే మాట్లాడతాం. ప్రధానమంత్రి నిజమే మాట్లాడుతున్నారు, రాష్ట్రపతి గారు కూడా నిజమే మాట్లాడుతున్నారు. ఇప్పుడు మీ సమస్య ఏంటంటే మీరు నిజం అలవాటు మరిచిపోయారు. మీరు మోడీగారు సంస్థలని నాశనం చేస్తున్నారన్నారు. మా దగ్గర ఒక నానుడి ఉంది దొంగే కాపలాదారుని తిట్టాడట. మీరు నాకు ఒక విషయం చెప్పండి దేశంలో ఎమర్జెన్సీని కాంగ్రెస్ తీసుకువచ్చింది. కానీ, మీరు మోడీ నాశనం చేశారని అంటున్నారు. కాంగ్రెస్ భారతీయ సేనను అవమానించింది కానీ నేను నాశనం చేశారని అన్నారు. భారతీయ సేన అధ్యక్షుడ్ని మీరు గుండా అంటున్నారు, మళ్లీ మోదీ సంస్థలని నాశనం చేస్తున్నారంటారు. ఎన్నో కథలు చెప్తారు ప్రభుత్వాన్ని కూలదోయడానికి. ఇంత పెద్ద భారతదేశంలో సైన్య గౌరవానికి మచ్చ తీసుకువచ్చారు. బహుశా రెండు వారాల రాజకీయాలు మీరు చేసి ఉంటారు.అయితే మీరు చేసిన పాపం మన సైన్యం హృదయంలో మీరు గాయం చేయడం. భారతీయ సేన ప్రభుత్వాన్ని కూలదోసే కార్యక్రమం చెయ్యదు. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని రోజుల తర్వాత మనకి మంచిరోజులు వచ్చి ఉండవచ్చు, చెడు రోజులు వచ్చి ఉండవచ్చు, ఒక బలహీన ప్రధానమంత్రి ఉండి ఉండవచ్చు, బలహీన ప్రభుత్వం ఉండి ఉండవచ్చు, ఒకే ప్రభుత్వం ఉండి ఉండొచ్చు లేదా సంకీర్ణ ప్రభుత్వం ఉండి ఉండవచ్చు, కానీ దేశంలో సైన్యం ఎప్పుడు ఇలాంటి పాపం చేసి ఎరుగదు. కేవలం రాజకీయం చేయడం కోసం ఇలాంటి మాటలు మాట్లాడడం తప్పు. మనం ఒక బాధ్యతాయుత పౌరులుగా, సభలో ఉన్న సభ్యులుగా ఈ విధమైన మాటలు మాట్లాడకూడదు. ఒకవైపు మీరు మేము సంస్థలని నాశనం చేస్తున్నామంటున్నారు. ఈ దేశంలో ఎన్నికల సంఘం ప్రపంచంలోనే ఒక గౌరవనీయమైన సంస్థగా అవతరించింది. కొన్ని కొన్ని ఫిర్యాదులు ఉన్నప్పటికీ అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్ణయాలను గౌరవించి వాటిని

పాటిస్తాయి. మరి మేము ఎన్నికల సంఘాన్ని కూడా నాశనం చేస్తున్నామా? ఈ సంస్థలకు దిశానిర్దేశం చేసే దిశగా మనం ఆలోచించగలమా? అలాగే మీ వైఫల్యాలను ఈవీఎంలపై రుద్దడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. దేశ బడ్జెట్ పై మనం చర్చిస్తున్నప్పుడు మీరు ఈవీఎంల గురించి మాట్లాడుతున్నారు. మీరు ఇంతగా భయపడిపోయారు. మీ అందరికీ ఏమైంది?

న్యాయ వ్యవస్థను కాంగ్రెస్ బెదిరిస్తుంది. న్యాయవ్యవస్థ తీసుకున్న నిర్ణయాలపై కాంగ్రెస్ కి చెందిన నాయకులు ఏ విధంగా మాట్లాడుతున్నారో చూస్తే ఈ విధంగా ఎన్నడూ జరగలేదు. న్యాయవ్యవస్థ నిర్ణయం మంచిదే కావచ్చు లేదా మంచిది కాకపోవచ్చు. కానీ న్యాయవ్యవస్థను గౌరవించడం మన సంప్రదాయం, ఎందుకంటే ఈ సంస్థను మనం కాపాడుకోవాలి. కానీ మనకి నచ్చలేదని ఏదో ఒకటి అనడం లేదా ఏదో ఒకటి చెప్పించడం లేదా ఏదో ఒకటి రాయించడం చేయకూడదు. మీరు న్యాయ వ్యవస్థని భయపెట్టడానికి మహాభియోగం పేరుతో మొత్తం వ్యవస్థనే కదిలించాలని చూస్తున్నారు. నాపై మీరు నిందలు వేస్తున్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ, ప్రణాళిక సంఘంలో జోకర్లు ఉన్నారు అని చెప్పింది. తెలుసు కదా ఆ మాట ఎవరన్నారో? ఈరోజు మీరు ప్రణాళికా సంఘాన్ని పొగుడుతున్నారు. ఈ ప్రణాళిక సంఘాన్ని ఒక మాజీ ప్రధానమంత్రి జోకర్ల సమూహంగా అభివర్ణించారు. సంస్థ గౌరవం ఇదొక్కటే మీరు వాడుతున్న పదం. కానీ మీరు చేసిన పనులను మీరు చూడడం లేదు. ఆర్టికల్ 356 ని దుర్వినియోగ పరచడం వంద సార్లు కాదు ఎన్నోసార్లు చేశారు. ఎన్నుకున్న ప్రభుత్వాలను మీరు రద్దు చేశారు. శ్రీమతి ఇందిరా గాంధీ ఒక్కరే 50 సార్లు ఈ ఆర్టికల్ ని ప్రయోగించారు. 50 సార్లు ప్రభుత్వాలను రద్దు చేశారు. 2019లో దేని వార్షికోత్సవం చేస్తున్నామో గుర్తుచేసుకోండి. కేరళలో ఉన్న నా మిత్రులకు నేను చెప్పదలుచుకున్నాను, కేరళలో 1959లో నెహ్రూజీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఇందిరా

గాంధీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నారు. వారు కేరళ వెళ్లారు అక్కడ ఏం చేశారో తెలియదు, వారు కేరళ నుండి తిరిగి రాగానే కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. దాని వార్షికోత్సవం 2019లో చేసుకుంటున్నారు. మీరు సంస్థల గౌరవం గురించి మాట్లాడుతున్నారు. మీరు మన దేశంలో ఎన్టీఆర్ తో, ఎంజీఆర్ తో ఏ విధంగా ప్రవర్తించారో తెలుసు. ఇంతే కాదు, క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాలు ప్రెస్ కాన్ఫరెన్స్ లో చించడం జరిగింది. ఏ విధమైన గౌరవం సంస్థల పట్ల మీకు ఉందో అందరికీ తెలుసు. అందుకే మోడీవైపు మీరు వేలు చూపెట్టే ముందు ఒక విషయం తెలుసుకోవాలి, మిగతా నాలుగు వేలు మీ వైపు ఉన్నాయి. స్వతహాగా ఖర్గే గారు ఒక మంచి వ్యక్తి కానీ వారికి ఏ విధమైన బలహీనత ఉందో, ఏ విధమైన సమస్యలు ఉన్నాయో నాకు తెలీదు. ఒక గౌరవనీయమైన వ్యక్తి వారి వ్యతిరేకతను ఇచ్చట చెప్తున్నారు. నేను వారి వ్యతిరేకతను సభ దృష్టికి తీసుకు వస్తాను. వారు ప్రాథమిక చికిత్స గురించి 36 గంటల తర్వాత అడిగానని అన్నారు, అసలు ప్రాథమిక చికిత్స అవసరం ఉందా? మీరు ఒక సీనియర్ వ్యక్తి. మా లాంటి వ్యక్తుల గురించి మీరు ఆలోచిస్తున్నందుకు నేను మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

మేడం స్పీకర్, ఈ సమస్య కి ముఖ్య కారణం, పేదరికం నుంచి బయటకు వచ్చిన ఒక వ్యక్తి ఎవరైతే ఢిల్లీ ఎప్పుడూ చూడలేదో, అలాంటి వ్యక్తి ఒక పెద్ద ఆసనానికి సవాలు విసురుతున్నారు. ఈ విషయం వారికి జీర్ణం కావడం లేదు. వారు ఈ దేశ ఆసనం, యజమానికి దక్కుతుందని అనుకున్నారు. కానీ ఒక మూలన ఉండే వ్యక్తి ఇక్కడికి వచ్చి ఈ ఆసనాన్ని అధిష్టించాడు. వారికి జీర్ణం కావడం లేదు. వారికి ఉన్నమత్తు వారి సమస్య కి కారణం.

మేడం స్పీకర్, ఇప్పుడు నేను లెక్క కి సంబంధించి మాట్లాడతాను. మా ప్రభుత్వం, అలాగే మీ ప్రభుత్వం గురించి కూడా మాట్లాడతాను. 55 సంవత్సరాలు మీవి, యాభై ఐదు

నెలలు మావి. మీరు స్వచ్ఛతను చూడొచ్చు. 2014 వరకు 40 శాతం ఉండేది. ఈరోజు గత నాలుగున్నర సంవత్సరాలలో అది 98 శాతానికి చేరింది. నాలుగున్నర సంవత్సరాలలో 10 కోట్ల మరుగుదొడ్లు కట్టడం జరిగింది. ఎవరైతే మాది ధనవంతుల ప్రభుత్వం అంటారో, నాకు ఈ విషయం చెబుతూ ఆనందం కలుగుతుంది, 10 కోట్ల మరుగుదొడ్లు ఎవరి కోసం అయితే కట్టించామో వారే నా దృష్టిలో ధనవంతులు. వారే నా జీవితం, వారి కోసమే నేను జీవిస్తున్నాను. వారి కోసమే నేను వచ్చాను. గ్యాస్ కనెక్షన్లు 55 సంవత్సరాలలో 12 కోట్లు అయితే గత యాభై ఐదు నెలల్లో 13 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. అందులో ఆరు కోట్ల కలెక్షన్లు ఉజ్వల పథకం కింద ఇవ్వడం జరిగింది. ఎవరికోసం పనులు జరుగుతాయో మీకు నేను చెప్పనవసరం లేదు. బ్యాంకులను జాతీయం చేయడం జరిగింది. పేదల గురించి మాట్లాడడం జరిగింది. రాజకీయం చేశారు, ఎన్నికలు గెలుస్తూ వచ్చారు. ఓట్లు తీసుకుంటూ వచ్చారు, కానీ మనదేశంలో యాభై ఐదు సంవత్సరాలలో కేవలం యాభై శాతం ప్రజలకు బ్యాంకులో ఎకౌంటు ఉండేవి, గత యాభై ఐదు నెలల్లో 100% జనాభాకు ఎకౌంటు ఉండేలాగా చూసాము. మీకు ఈ విషయం వింటే కష్టం కలుగుతుంది. 18000 గ్రామాలు ఇప్పుడు విద్యుత్తు పొందుతున్నాయి. 1947 కంటే ముందు ఈ దేశంలో ఏ గ్రామం లో కూడా విద్యుత్తు ఉండేది కాదు. గత యాభై ఐదు నెలల్లో ప్రభుత్వం చాలా వేగంగా పని చేసింది. స్వాతంత్ర్యం తరువాత ఇన్ని కష్టాలు ఉండేవి కావు ఇంత వ్యతిరేకత ఉండేది కాదు, చట్టాల్లో సమస్యలు ఉండేవి కావు, ఇంతగా మీడియా కూడా ఉండేది కాదు. మీరు ఆ సమయంలో పని చేయాలనుకుంటే మొదటి దశాబ్దంలోనే భారతదేశంలో ప్రతి గ్రామంలో విద్యుత్ ఉండి ఉండేది. ఈ కార్యం 20 సంవత్సరాలలో చేసి ఉండవచ్చు. కానీ ఈ పనిని నేను అధికారంలోకి వచ్చాక చేయాల్సి వచ్చింది. అంతే కాదు, 2004లో మీరు ప్రకటించిన మేనిఫెస్టో చూడండి. అలాగే 2009లో కూడా చూడండి. 2014 మేనిఫెస్టో ను కూడా చూడండి, మీరు ఈ మూడు

సంవత్సరాలలో అంటే 2004లో మీరు మూడు సంవత్సరాలలో అన్నారు, అలాగే 2009లో కూడా మూడు సంవత్సరాలలో అన్నారు, 2014లో కూడా మూడు సంవత్సరాలు అన్నారు. మూడు సంవత్సరాలలో ప్రతి ఇంటికి విద్యుత్తు అందిస్తామన్నారు. మీ మానిఫెస్టో విద్యుత్ ఉందని చెప్పింది, నాకు ఆశ్చర్యం కలిగేది. ఎందుకంటే మీరు పేదరికాన్ని నిర్మూలిస్తామని ఎన్నికల మీద ఎన్నికలు గెలుస్తూనే ఉన్నారు. 2004 లో కూడా మీరు మూడు సంవత్సరాలు అడిగారు. 2009, 2014లో కూడా మూడు సంవత్సరాలు అడిగారు. కానీ ఈ రోజు ప్రతి ఇంటిలో విద్యుత్ చేర్చే పని చేయడానికి పగలు రాత్రి కష్టపడాల్సి వచ్చింది. రెండున్నర కోట్ల కుటుంబాలకు ఈ విద్యుత్ సరఫర పని పూర్తి చేయడం జరిగింది. అలాగే రాబోయే రోజుల్లో 100% విద్యుదీకరణ చేసే దిశగా మనం ముందుకు వెళ్తున్నాం. నేను మీకు ఈ విషయం పట్ల విశ్వాసం కలిగిస్తాను. కొంతమంది మనల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తారు, కానీ వాస్తవాలు మనం విస్మరించలేం. 2014లో 30 సంవత్సరాల తర్వాత ఈ దేశ జనాభా ఒక ప్రభుత్వానికి పూర్తి ఆధిక్యం ఇచ్చింది. ఈ దేశ జనాభా కి తెలుసు సంకీర్ణ ప్రభుత్వం ఉంటే పరిస్థితులు ఎలా ఉంటాయో. పూర్తి ఆధిక్యం ఉన్న ప్రభుత్వం ఉంటే నిర్ణయాలు ఎలా తీసుకుంటామో, ఏవిధంగా మన అభివృద్ధి జరుగుతుందో చూసాము, కాబట్టి ఈ మహా సంకీర్ణం అధికారంలోకి రాదు అనేది కచ్చితంగా చెప్తాను. ఈ మహా సంకీర్ణం కలకత్తాలో గుమిగూడారు. అక్కడ వారి పరిస్థితిని చూసినట్లయితే కేరళలో వారు కూడా లేరు. ఇది ఒక కల్తీ కలయక. ఈ కల్తీ చేసేవారు ఉత్తరప్రదేశ్ లో బయట కూర్చున్నారు. ఈ మహా కల్తీ చేసేవారు అందుకే ఇందులో పాల్గొంటున్నారు. ఒక అస్థిర ప్రభుత్వం, ఒక కాల్పనిక ప్రభుత్వం మాత్రమే ఈ మహా కల్తీ ద్వారా సాధ్యమవుతుంది. ఈ దేశం గత 30 ఏళ్లుగా అలాంటి పరిస్థితిని ఎదుర్కొంది. ఈ సమాజం ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించింది కాబట్టి కల్తీ నుంచి దూరంగా ఉంటుంది. అలాగే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం ఈ సంకీర్ణం నుంచి దూరంగా

ఉంటుంది. ఎప్పుడైతే ఆధిక్యంతో వచ్చిన ప్రభుత్వం ఉంటుందో, ప్రజలకు వారు అంకితభావంతో సేవ చేస్తారు.

2014కు ముందు మీ ప్రభుత్వం ఉండేది. పేదలకు ఇళ్లు ఇవ్వాలని 1947 నుంచి ప్రతి ప్రభుత్వం ఆలోచించింది కానీ 2014 కంటే ఐదు సంవత్సరాల ముందు మీ ప్రభుత్వం కేవలం 25 లక్షల ఇళ్లు మాత్రమే కట్టింది. మేము 55 నెలల్లో ఒక కోటి 30 లక్షల ఇళ్లు మంజూరు చేయడం కూడా జరిగింది. ఆ ఇళ్లలో మరుగుదొడ్లు, విద్యుత్ అలాగే గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరిగింది. ఇంటి చుట్టు గోడ కట్టి ఇవ్వడం జరిగింది. ఈరోజు మీ వ్యక్తులు మా వద్దకు వచ్చి మా ప్రాంతంలో మాకు ఇల్లు మంజూరు చేయమని అడుగుతున్నారు. ఇంకా, డబ్బులు అయితే పేదవాళ్ళ ఖాతాలోకి తిన్నగా వెళుతున్నాయి. మధ్యవర్తులు లేరు. 2014లో మీ మేనిఫెస్టోలో చెప్పడం జరిగింది. 2009లో అలాగే 2014లో కూడా మీరు ఏం చెప్పారంటే, మూడు సంవత్సరాలలో ఈ పనులు చేస్తామని. మీ మూడు సంవత్సరాల పరిస్థితి ఏంటో మాకు తెలీదు. 2004లో మీరు ప్రతి పంచాయతీ కి ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ ఇస్తామన్నారు.డిజిటల్ భారతదేశం గా ముందుకు వెళ్తామన్నారు. 2004లో మీరు ఈ విషయం మాట్లాడారు. అదే విషయం 2009లో కూడా మాట్లాడారు. మళ్లీ అదే విషయం 2014లో కూడా మాట్లాడారు. మేము అధికారంలోకి వచ్చాక 59 గ్రామాలకి ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ ఇవ్వడం జరిగింది. 2004లో ఈ పని ప్రారంభించి ఉంటే 2014 వరకు 59 గ్రామాలలో కనెక్టివిటీ ఇచ్చారు కానీ మా ప్రభుత్వం 55 నెలల్లో ఒక లక్ష 16 వేల గ్రామాలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని మంజూరు చేసింది. మీరు ఎన్నో ప్రమాణాలు చేశారు.

ఈ రోజు ఖర్గేగారు కవితలు చెప్పారు. వారి కవితలలో మేనికి సంబంధించిన పంక్తులు ఉన్నాయి వారికి ఎందుకు ఆ పంక్తులు ఇష్టమో నాకు తెలీదు. కానీ ఆ కవితలో మీరు పుట్టిన పరిస్థితులు కానీ మీరు పెరిగిన పరిస్థితులు గాని చెప్పి ఉంటే బాగుండేది. నాకు తెలుసు మీ

కుటుంబ మనోధైర్యం గురించి. మీకు ఆ విషయాలు గుర్తు ఉండి ఉంటే ఈ మేని పట్ల ఉన్న కవితని మీరు గుర్తుంచుకునే వారు కాదు. కానీ నాకు ఈ విషయాలు మీ వల్ల ప్రతి క్షణం గుర్తు ఉంటాయి. ఆ కవితలో ఏం చెప్పారంటే,

అబద్ధాల గూడెంలో నిజం కొట్టుకోవడం చూశాను

నాలో ఒక బాలుడు బాధపడడం చూశాను

మీ అబద్ధాల వల్ల ఏం జరుగుతుందో ఈ కవిత తో మీకు అర్థం అవ్వాలి, కానీ మీకు అది కనబడదు. అదే కవితలో ముందు ఇలా రాయబడింది. మీకు జాలి ఉంటే, కానీ మీరు అధికార వీధులలో ఉండడం వలన మీరు ఆ నిజం గ్రహించలేకపోయారు. మీలో జాలి ఉండి ఉంటే అందులో కొట్టుమిట్టాడడం మీ హృదయానికి తెలిసి ఉండేది. ఈ కవితలో ఇంకా ఏమి రాసి ఉందంటే

అప్నే ఘర్ కి చార్ దివారి మే అబ్ లిహాఫ్

మే బీ శరణ్ హోతీ హై

జిస్ దిస్ సే కిసీ కో గుర్భత్ మే సడ్కో పర్

ఠిటుర్తే దేఖా హై

అందుకే జాలి ఉంటేనే నొప్పి కలుగుతుంది, అప్పుడే ఏదైనా మాట అర్థమవుతుంది. కాంగ్రెస్ 55 సంవత్సరాలు అధికారాన్ని అనుభవించింది, మేము యాభై ఐదు నెలలు సేవాభావంతో సేవ చేశాము. ఒకవైపు 55 సంవత్సరాల అధికార భోగం, మరోవైపు యాభై ఐదు నెలల సేవాభావం. ఎప్పుడైతే ఒక స్పష్టమైన విధానం ఉన్నదో, ఎప్పుడైతే నిజాయితీగా ఉంటామో, ఎప్పుడైతే మన ఆలోచనలో నిజం ఉంటుందో, నిష్ఠగా 24 గంటలు పేదలకోసం,

దేశ అభివృద్ధి కోసం, దేశ కళ్యాణం కోసం మనల్ని మనం సమర్పితం చేసుకుంటామో, కొత్త శక్తి, కొత్త ప్రేరణ ఎప్పుడూ కలుగుతూనే ఉంటుంది. మీరు ఏ విధమైన పనులు చేశారో చూశాం. మేము 21వ శతాబ్దంలో ఓటర్లను తప్పకుండా గుర్తు చేసుకుంటాం. మీరు ఏ ఉద్దేశంతో 55 సంవత్సరాలు అధికారాన్ని అనుభవించారు? మీరు చూసినట్లయితే కామన్వెల్త్ గేమ్స్ ప్రారంభమయ్యాయి. దేశం పేరు ప్రతిష్టలు ప్రపంచంలో వినబడే దిశగా మనకు ఒక సువర్ణ అవకాశం దొరికింది. కానీ ఒక వైపు మన క్రీడాకారులు పతకాలు గెలవడానికి కష్టపడుతుంటే కొంత మంది కామన్వెల్త్ లో వాళ్ల కోసం wealth వెతుక్కోవడం మొదలెట్టారు. 2జి స్పెక్ట్రం కేటాయింపుల విషయం చూడండి. 2జి స్పెక్ట్రమ్ అనేది అధికార దుర్వినియోగ పరిణామం. ఇక్కడ మీ, మీవారి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటారు. మా ఆలోచన అందరికీ చవకగా డేటా ఇవ్వడం. అలాగే ఫోన్ లో మాట్లాడుతున్నప్పుడు ఖర్చు తగ్గించే లాగా పని చేయడం. ఈ సందర్భంలోనే స్పెక్ట్రమ్ ని వేలం వేసే వ్యవస్థని విస్తృత పరచడం జరిగింది. అలాగే బ్యాంకింగ్ వ్యవస్థ ఏం చేసేది? అప్పట్లో ఫోన్ బ్యాంకింగ్ జరిగేది ఎవరికైనా సాయం చేయాల్సిన విషయం తెలిసినప్పుడు బ్యాంక్ కి ఒక ఫోన్ చేసేవారు. డబ్బులు ఆ బ్యాంకు నుంచి తీసుకునే వారు. అందులో వాటా వీరికి చేరేది. ఏ పని కోసం తీసుకున్నారు? ఆ డబ్బు ఎక్కడ ఉంటుంది? ఇప్పుడు ఆ డబ్బంతా కూడా బయటికి వస్తుంది, అందుకే వీరికి కష్టంగా ఉంది. ఈ విషయాన్ని మనం మర్చిపోలేము. స్వాతంత్ర్యం తరువాత 2008 వరకు బ్యాంకులు మొత్తం 18 లక్షల కోట్లు రుణాలు ఇచ్చాయి. కానీ అధికారంలో ఉన్న అవినీతిపరులు రాజకీయం చేసి దేశాన్ని నడిపే వారు. అధికారాన్ని దుర్వినియోగం చేసి యాభై ఐదు సంవత్సరాలలో మీరు ఫలితాలు చూడండి. 2008 నుంచి 2014 వరకు ఈ ఆరు సంవత్సరాలలో 18 లక్షల కోట్ల నుంచి 52 లక్షల కోట్లు వరకు అప్పులు ఇవ్వబడ్డాయి. ఇవన్నీ కూడా ఫోన్ బ్యాంకింగ్ ఫలితం. ఇది ప్రజల డబ్బు. వీటిని దోచుకోవడం జరిగింది.

ఎవరూ ప్రశ్నించే వారు లేరు. ఇది మీ పద్ధతి. 21వ శతాబ్దపు ఓటర్లు ఈ విషయాలు తెలుసుకోవాలి. ఏ విధంగా దేశాన్ని, వారిని దోచుకున్నారో వారికి తెలియాలి. అప్పట్లో వారి వయసు చిన్నది అయ్యి ఉండొచ్చు కానీ వారికి ఈ విషయాలు చెప్పాల్సిన బాధ్యత మాది.

ముద్ర యోజన ద్వారా ఏడు లక్షల కోట్ల రూపాయలు పంచాము. ఇది 2014 లో మీరు ఉంచిన NPA. ఇది వడ్డీ పెరగడమే తప్ప NPA పెరగడం కాదు. మేము తెచ్చిన విధానాల వల్ల మూడు లక్షల కోట్ల రూపాయలు రాబట్టుకోగలిగాము. ఈ ఏడు లక్షల కోట్లు ఎవరైతే కొలేటరల్ గ్యారెంటీ ఇవ్వలేరో వారికి ఇవ్వడం జరిగింది. దీని వలన వారు వారి కాళ్ళ మీద నిలబడగలిగారు. అలాగే ఉద్యోగ అవకాశాలు కూడా పెరిగాయి. ఈ పని మేము చేశాం. ఎవరైతే దేశం విడిచి పారిపోయారో వారు ట్విట్టర్లో ఈ విధంగా బాధపడుతున్నారు, మేము కేవలం 9 వేల కోట్లు మాత్రమే తీసుకున్నాము కానీ మోదీ 13 వేల కోట్ల ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని. వారు ట్విట్టర్లో బాధపడుతున్నారు, 'మేము ఈ రోజు ఉదయం లేవగానే మా మరొక ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్లు మాకు తెలుస్తుంది. ప్రపంచంలో ఏ దేశంలో మా ఆస్తులు ఉన్నా వాటిని స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది.' ఈ విధమైన చట్టాన్ని మేము తీసుకొచ్చాము. మీరు వారిని దోచుకోనిస్తే మేము చట్టాలు తయారు చేసి వారిని తిరిగి ఇక్కడికి రప్పించే ప్రయత్నం చేస్తున్నాం.

మేడం స్పీకర్, మా కాంగ్రెస్ మిత్రులు కొన్ని పనులు అవుట్ సోర్స్ చేసినట్లు ఉన్నారు. అలాగే రెండు రోజుల ముందు సాయం చేయాల్సిందిగా కోరారు. మేడం స్పీకర్, కాంగ్రెస్ వారు సర్జికల్ స్ట్రైక్ గురించి మాట్లాడారు. నేను 'ఉరి' ఫిలిం గురించి మాట్లాడడం లేదు. నేను సర్జికల్ స్ట్రైక్ గురించే మాట్లాడుతున్నాను. అప్పుడు కాంగ్రెస్ ఏమందంటే వారి సమయంలో కూడా సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయని. అవును మీ వద్ద అన్నివివరాలు ఉండే ఉంటాయి. మీకు గంటల తరబడి మాట్లాడే అవకాశం ఇవ్వబడింది. మీ

సమయంలో సైన్యం పరిస్థితులు చూసినట్టయితే, మీరు సైన్యాన్ని ఒక విధంగా నిరుత్సాహపరిచారు. వారు సర్జికల్ స్ట్రైక్ చేసే నిర్ణయం తీసుకోలేక పోయారు. ఈ విధమైన పరిస్థితులు మీరు సృష్టించారు. ఆ రోజుల్లో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కూడా వారికి లభించేవి కావు అలాంటి పరిస్థితుల్లో మీరు సర్జికల్ స్ట్రైక్ గురించి ఆలోచించగలరు! మీరు ఈ దేశ ప్రజల కళ్లలో దుమ్ము కొట్టలేరు. వారి వద్ద కమ్యూనికేషన్ పరికరాలు కూడా ఉండేవికావు, హెల్మెట్లు ఉండేవికావు, మంచి రకం షూస్ కూడా ఉండేవి కావు. వారి వద్ద యుద్ధ సామాగ్రే కాదు సాధారణ సామాగ్రి కూడా సరైనవి ఉండేవికావు.

2009 లో భారతీయ సైన్యం ఒక లక్షా 86 వేల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కావాలని కోరింది. ఐదు సంవత్సరాల తర్వాత 2014 వరకు ఒక్క బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ కూడా కొనలేదు. ఇప్పుడు మీరు సర్జికల్ స్ట్రైక్ గురించి మాట్లాడుతున్నారు. పరిస్థితిని తెలుసుకుని 2016లో మేము 50 వేల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కొన్నాము. 2018 లో మొత్తం ఒక లక్షా 86 వేల బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు మేము మా జవాన్లకు పంచాము. దేశప్రజలు తెలివైన వాళ్ళు ఎటువంటి తప్పులు చేయరు. కానీ 2014 తర్వాత కూడా యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే తేజస్ యుద్ధ విమానాలు ఈరోజు కూడా భూమి మీదే ఉండేవి. ఆ పార్కింగ్ ఏరియా లో పడి ఉండేవి. అవి ఎప్పటికీ గాలిలో ఎగిరేవి కాదు. 2016 జూలై లో మేము 45 స్క్వాడ్రన్స్ చేర్చాము, 83 తేజస్ యుద్ధ విమానాలు కొనుగోలు చేయడానికి ఆమోదం తెలిపాము. మన సైన్యాన్ని బలోపేతం చేసే ఉద్దేశం మీకు ఎప్పుడూ లేదు. దేశాన్ని రక్షించే మన జవాన్ల పట్ల ఎందుకు మీకు అంత నిర్దయ? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలు సైన్యం, వాయుసేన, నావికా దళానికి సంబంధించిన నిర్ణయాలను ఎందుకు నిర్లక్ష్యం చేశారు? మీరు ఊహించండి, ఆ సమయంలో మన శత్రు దేశాలు ఏదైనా యుద్ధం చేసి ఉంటే ఈరోజు మన దేశం ఎక్కడ ఉండేది? ఈ

విధమైన నేరపూరిత నిర్లక్ష్యం మీ వల్ల జరిగింది. ఈ దేశం మిమ్మల్ని ఎప్పటికీ క్షమించదు. ఈరోజు మనం ఉన్న పరిస్థితులలో మన సైన్యాన్ని ఆధునీకరించడం ఎంతో అవసరం. మీరు నాకు ఒక విషయం చెప్పండి, గత 30 సంవత్సరాలలో మన సైన్యానికి ఒక్క ఆధునిక యుద్ధ విమానం కూడా మనం ఎందుకు కొన్ని ఇవ్వలేకపోయాం? మన పొరుగు దేశాలు వారి యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకుంటూనే ఉన్నాయి. మన దేశ రక్షణకు సంబంధించిన విషయం పట్ల నిర్లక్ష్యం దేశం పట్ల విశ్వాసఘాతుకం. దీనికి ఎవరి బాధ్యత లేదా? ప్రతి ఒక్క ఆరోపణకి నిర్మల సీతారామన్ గారు జవాబు ఇచ్చారు. సుప్రీం కోర్ట్ ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. కానీ ఇక్కడ ప్రశ్న ఏంటంటే కాంగ్రెస్ పార్టీ కి ఈ దేశ సైన్యం బలపడడం ఇష్టం లేదు. నేను తీవ్రంగా ఆరోపిస్తున్నాను, కాంగ్రెస్ పార్టీ మన వాయుసేన బలంగా తయారవ్వాలని కోరుకోవడం లేదు. రాఫెల్ విమానాల కొనుగోలు ఒప్పందం రద్దు కావాలని చూస్తుంది. ఇందులో ఎవరి మేలు ఉందో వారికే తెలియాలి. వారు ఏ కంపెనీ మేలు కోసం ఈ ఆట ఆడుతున్నారో తెలీదు. ఈ విధంగా దేశ సేవ మీరు చేస్తున్నారు. 30 సంవత్సరాలు దేశ సైన్యానికి మీరు ఏ విధమైన సహకారం అందించకుండా ఉన్నారు. చరిత్ర ఈ సత్యానికి సాక్షి. కాంగ్రెస్ పార్టీ, వారి యూపీఏ ప్రభుత్వం కేవలం అధికారాన్ని అనుభవించింది. రక్షణ వ్యవహారాలలో దళారులు లేకుండా పని చేయలేదు. నేను ఆలోచించాను కాంగ్రెస్ పార్టీ రాఫెల్ విమానాలకు సంబంధించిన అబద్ధాలు ఇంత నమ్మకంగా ఎలా చెప్పగలుగుతుందా అని. నేను తర్వాత వివరాలు చూస్తే నాకు అర్థం అయింది వారు గత యాభై ఐదు సంవత్సరాలలో అనుభవించిన అధికారంలో ఒక్క రక్షణ కొనుగోలు కూడా దళారులు లేకుండా చేయలేదు. నిజాయితీగా పారదర్శకతతో ఈ దేశ వాయుసేన బలోపేతం చేయడం జరుగుతుంది.

మేడం స్పీకర్, ఈ కాంగ్రెస్ సభ్యులు మతిస్థిమితం కోల్పోయారు. వారికి నిజం వినే అలవాటు లేదు. వారి మొహాల పై ఆందోళన కనిపిస్తుంది. మేము అధికారంలోకి వచ్చి

దేశంలో వేరువేరు సంస్థలకు ఒక ఉత్తరం పంపడం జరిగింది, అందులో మేము వారికి విదేశాల నుంచి లభించే విరాళాల గురించి అడిగాము. FCRA చట్టం కింద వారికి అనుమతి లభించింది, వారికి అందే డబ్బు వివరాలు చెప్పాల్సిందిగా కోరాము. వారు విదేశాల నుంచి విరాళాలు పొందుతున్నప్పుడు వాటిని ఎక్కడ ఉపయోగించారో చెప్పాల్సి ఉంటుంది. కేవలం ఈ ప్రశ్న అడిగాము. ఏ విధమైన దాడులు చేయలేదు ఏ విధమైన ఇన్ కం టాక్స్ అధికారులు వెళ్లడం లేదు, కేవలం ఒక ఉత్తరం రాయడం జరిగింది. ఆ ఉత్తరానికి వీళ్ళు ఆందోళన చెందుతున్నారు. ఈ దేశంలో విదేశాల నుంచి విరాళాలు తీసుకునే 20 వేల కంటే ఎక్కువ సంస్థలు వాటి వ్యాపార వ్యవహారాలు మానుకోవాల్సి వచ్చింది. ఈ 20,000 సంస్థలు ఏం చేసేవి? దేశ సరిహద్దుల్లో ఉండే గ్రామాల నుంచి పార్లమెంట్ దాకా, న్యాయ వ్యవస్థ నుంచి న్యాయ ప్రక్రియ ను ప్రభావితం చేసే దిశగా పనులు జరిగేవి. అలాంటి సంస్థలపై చర్య తీసుకునే పని మేము చేసాము. మన దేశానికి నష్టం కలిగించడానికి ఈ 20వేల సంస్థలు పనిచేసేవి. మీరు ఈ సంస్థలని ఎందుకు ఆపలేకపోయారు? ఈ సంస్థలని ఎందుకు పని చేయనిచ్చారు? వారికి మీ ఆశీర్వాదం ఉండేదా? వీటి వల్ల ఎవరికి మేలు జరిగేది? ఈ విదేశాల నుంచి వచ్చే సొమ్ము ఏ దారి గుండా వచ్చేది? ఈ యుద్ధం మేము చేస్తున్నాము అందుకే నాలుగు వైపులా కొంతమంది అసభ్య భాష ఉపయోగిస్తున్నారు, తిడుతున్నారు, మాపై నిందలు వేస్తున్నారు. దీనికి కారణం ఏంటంటే ఇంత మంది సమస్యల్లో ఉన్నారు. ఒక నిజాయితీ గల ప్రభుత్వం రావడం వల్ల దేశానికి మేలు చేసే ప్రభుత్వం రావడం వల్ల ఏమవుతుందో దీన్ని బట్టి అర్థం అవుతుంది. 20 వేల సంస్థలు చాలా పెద్ద సంఖ్య. ఇప్పుడు మనం చూసినట్లయితే ఆ సంస్థల్లో పెద్ద పెద్ద పేర్లు ఉండేవి అవన్నీ కూడా అధికారికంగా మన భారతదేశంలో వాటి వ్యాపారాలు చేసుకునేవి. ఇప్పుడు వారు ఆ వ్యాపారాలు మూసివేసి కొత్త వ్యాపారాలు ఏమి చేసుకోవాలని చూస్తున్నాయి.ఈ విధమైన పరిస్థితులు ఇప్పుడు ఉత్పన్నమయ్యాయి.

ఇవన్నీ మీరు చూసే ఉంటారు. నాకు గుర్తుంది సర్దార్ సరోవర్ డాం నర్మదా నది మీద కడుతున్నప్పుడు పండిత్ నెహ్రూ గారు శంకుస్థాపన చేశారు. పండిత్ నెహ్రూ గారు అప్పుడు చేస్తే ఇప్పుడు నేను దాన్ని ప్రారంభించాను. 20వేల సంస్థలు మూసివేయబడ్డాయి. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చు, ఎందుకంటే మేము ప్రతి పైసాకీ లెక్క అడుగుతున్నాం.

మేడం స్పీకర్, 55 సంవత్సరాలు అధికారాన్ని అనుభవించిన కొన్ని పార్టీలకు చెందిన నేతలు వాళ్ళని వాళ్ళు ఈ దేశ సామ్రాజ్యాధిపతి గా భావిస్తున్నారు. వ్యవస్థలను, ఇతరులను వాళ్లు నికృష్టులుగా భావిస్తున్నారు. ప్రతి ఒక్కరిని అవమానించడం వారి స్వభావం. ప్రధాన న్యాయమూర్తిని వివాదాల్లో తీసుకురావడం, వాతావరణాన్ని పాడు చేయడం, న్యాయ వ్యవస్థ ని అవమానించడం, రిజర్వ్ బ్యాంక్ ని అవమానించడం, సేన అధ్యక్షుడ్ని అవమానించడం, ఎన్నికల సంఘాన్ని అవమానించడం, దేశంలోనే అతిపెద్ద విచారణ సంస్థ ని అవమానించడం, ప్రజాస్వామ్యాన్ని అవమానించడం, ఇవన్నీ కూడా అధికారాన్ని అనుభవించిన వారి మనసులో కలిగిన వికృతిగా నేను భావిస్తున్నాను. మహాత్మా గాంధీ గారు ముందే ఊహించారు ఇలాంటి రుగ్మతలను తీసుకునే సామర్థ్యం ఎవరికైనా ఉందంటే అది కేవలం కాంగ్రెస్ కే ఉందని. అందుకే ఆ సమయంలో మహాత్మా గాంధీ గారు కాంగ్రెస్ పార్టీని రద్దు చేయాల్సిందిగా కోరారు. కాంగ్రెస్ ముక్త భారత్ నా కల కాదు అది మహాత్మా గాంధీ గారి కోరిక. మహాత్మా గాంధీ గారి 150వ జయంతిన ఈ పనిని ఆయనకి శ్రద్ధాంజలి గా నేను సమర్పిస్తున్నాను. మీరు ఎంతైనా కల్తీ చేసుకోండి మిమ్మల్ని ఎవరూ రక్షించ లేరు. మా దృష్టిలో మా సంస్థలు వేరు. మా దృష్టిలో మా కన్నా పార్టీ గొప్పది, పార్టీ కన్నా ఈ దేశమే గొప్పది. అందుకే స్పీకర్ మేడం, రాజ్యాంగ సంస్థలని వీరు అవమానిస్తున్నారు. అవినీతి, వారసత్వం అనే కల్తీ సంస్కృతిని కాంగ్రెస్ లో నా మిత్రులు స్వీకరించి ఉన్నారు. వారసత్వం లేకుండా ఈ పార్టీలో ఎవరు ఉండలేరు. ఒక్కరు కూడా ఉండలేరు. ఎందుకంటే వీరి సంస్కారం

అదే. వారి సంస్కృతి కూడా అదే. అందుకే వీరు వారి యజమానుల కోసం మహా కల్తీ అనే ఈ ఆటని చాలా సునాయసంగా ఆడుతున్నారు. వీరంతా కూడా వారసత్వ రాజకీయాలు చేస్తున్నారు దాదాపుగా అందరూ బెయిల్ పై బయట ఉన్నారు. ఆ రోజుల్లో అటల్ బిహారీ వాజపేయి గారికి పూర్తి ఆధిక్యం దొరికి ఉంటే, ఈరోజు మన దేశం చాలా ముందుకు వెళ్లి ఉండేది. మనందరికీ తెలుసు ఈ రోజు ఎవరైతే మనల్ని ఓట్లు అడుగుతున్నారో వాళ్ళు అప్పట్లో కూడా ఈ విధంగానే మనల్ని మోసగించారని.

ఈ రోజు బాబా సాహెబ్ అంబేద్కర్ గారి గురించి మాట్లాడుకున్నాం. కల్తీ దారిలో వెళ్తున్న కొంతమందికి బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పట్ల శ్రద్ధ ఉన్నట్లయితే ఈ మాటలు వారికి పనిచేస్తాయి. బాబాసాహెబ్ అంబేద్కర్ గారు, కాంగ్రెస్ తో కలవడం ఆత్మహత్యతో సమానం అని చెప్పారు. ఖర్గే గారు, మీ సి ఆర్ ఏమీ పాడు కాదు. మీరు చింతించకండి. మీకు మంచే జరుగుతుంది. మా శుభాకాంక్షలు మీ తోనే ఉన్నాయి. మేడం స్పీకర్, ఈరోజు ఈ సభలో ద్రవ్యోల్బణం గురించి మాట్లాడుకున్నాం. వారు చెప్పిన మాటలు వాస్తవాలకి, సత్యానికి దూరంగా ఉన్నాయి. నేను వారికి మన దేశంలో ప్రసిద్ధి చెందిన రెండు పాటలు గుర్తు చేస్తాను. ఒక పాట బాకీ కుచ్ బచాతో మెహంగాయి మార్ గయి. రెండవ పాట మెహంగాయి డాయన్ కా ఏ జాత్ హై. ఈ రెండు పాటలు ఎవరు అధికారంలో ఉన్నప్పుడు వచ్చాయి? మొదటి పాట శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన పాట. అప్పుడు ద్రవ్యోల్బణం 20 శాతం కంటే ఎక్కువ ఉండేది. రెండవ పాట రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉన్నప్పుడు వచ్చింది. అప్పుడు ద్రవ్యోల్బణం 10 శాతం కంటే ఎక్కువ ఉండేది. అప్పుడు ఈ పాటలు రాసినప్పుడు ఇవి ప్రసిద్ధి చెందాయి. ద్రవ్యోల్బణంతో వీరి సంబంధం చాలా బలమైనది. ఈ దేశంలో కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ద్రవ్యోల్బణం పెరిగింది. ఇందిరా గాంధీ గారి సమయంలో 30 శాతం కంటే ఎక్కువ ద్రవ్యోల్బణం పెరిగింది. గత నాలుగున్నర సంవత్సరాలలో సేవా భావంతో

పనిచేస్తున్న ఈ ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతానికి పరిమితం చేసింది. మధ్య వర్గాల వారి కోసం మా ప్రభుత్వం ఎన్నో సహాయ కార్యక్రమాలు చేపట్టింది. ఎందుకంటే మన దేశంలో ఆర్థిక వ్యవహారాలు ఏ విధంగా ఉన్నాయో వాటిని దృష్టిలో పెట్టుకుని మధ్య వర్గాలు వారి ఆశలు, ఆశయాలు పెరగడం సహజం. ఒక దేశ ప్రగతిలో ఇది ఒక అత్యంత అనివార్య భాగంగా నేను గత 55 నెలలలో తెలుసుకున్నాను. కొత్త ఆశలు, కొత్త ఆకాంక్షలు అభివృద్ధికి చిహ్నాలు. కొంతమందికి ప్రజల ఆశలు, ఆకాంక్షలు బరువుగా అనిపిస్తున్నాయి. కానీ నేను వాటి వైపు గర్వంగా చూస్తున్నాను ఎందుకంటే మనం అభివృద్ధి సాధించడం కోసం ఇవి ఒక శక్తిని, ప్రేరణని ఇస్తాయి. జీఎస్టీ విధానం వచ్చాక నిత్య అవసరాలని ఆ పన్ను విధానం నుంచి బయట పెట్టాము. మీకు గుర్తు ఉండే ఉంటుంది పాలుపై కూడా వీరు టాక్స్ తీసుకునేవారు. ఇంకా చాలా వస్తువులపై పన్ను తీసుకునేవారు. మీకు మాట్లాడే హక్కు లేదు. జిఎస్టి కి పూర్వం పన్నులు దాదాపుగా 30 శాతం ఉండేది. జీఎస్టీ మండలి ఈ పన్నులను నిర్ణయిస్తుంది. ఆ మండలిలో మీ పార్టీకి చెందిన సభ్యులు కూడా ఉన్నారు. మీ పార్టీకి చెందిన ముఖ్యమంత్రులు, మీ ప్రభుత్వాల్లో ఉన్నవారు ఈ మండలి లో సభ్యులు. ఈ రోజు దాదాపు 99 శాతం వస్తువులపై కేవలం 18 శాతం లేదా అంతకంటే తక్కువ పన్ను విధిస్తున్నాము. ఈ సంవత్సరం బడ్జెట్లో కూడా ఐదు లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం జరిగింది. ఈ విధమైన కోరిక మా సమయంలోనే కోరలేదు, ఒక ఆర్థిక వేత్త ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కూడా కోరడం జరిగింది. 1992 లో కూడా ఈ కోరిక కోరడం జరిగింది, కానీ ఇన్ని సంవత్సరాలుగా అలాంటి న్యాయబద్ధమైన కోరికలను నిర్లక్ష్యం చేశారు.మేము ఇలాంటి న్యాయబద్ధమైన కోరికను తీర్చాము. విద్యా రుణం మధ్యతరగతి వారు ఎక్కువగా తీసుకుంటారు. దానిపై వడ్డీని మేము 15 శాతం నుంచి తగ్గించి 11 శాతానికి తీసుకు వచ్చాము. ఈరోజు ఒక యువకుడు 10 లక్షల రుణం తీసుకుంటే

అందులో దాదాపు ఒక లక్షా పాతిక వేలు తక్కువ వడ్డీ కట్టవచ్చు. అలాగే ఒక మధ్య తరగతి కుటుంబం గృహ రుణం తీసుకుని ఉంటే దాన్ని తిరిగి చెల్లించడంలో దాదాపు 5 నుంచి 6 లక్షలు మిగుల్చుకోవచ్చు. మా ప్రభుత్వం ఈ పని చేసి చూపించింది.

మా ప్రభుత్వం ఎల్ ఈ డి బల్బు విషయంలో కూడా ఆ పని చేసింది. ఎల్ఈడీ బల్బులు యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎందుకు 300, 400, 450 రూపాయలకు అమ్మేవారో నాకు ఆశ్చర్యం వేస్తుంది. మా ప్రభుత్వం ఏర్పడ్డాక వాటి ధరలు 60-70 రూపాయలు కి దిగిరావడానికి కారణం ఏమిటి? కోట్ల ఎల్ఈడీ బల్బులు ఈ దేశంలో అమ్మారు. మీరు ఊహించొచ్చు వీటి అమ్మకాల ద్వారా పేద, మధ్య వర్గాల వారు వందల కోట్ల రూపాయలు ఆదా చేసుకోగలిగారు. ఎల్ఈడీ బల్బుల ను ప్రవేశపెట్టడం ద్వారా విద్యుత్ బిల్లు పై దాదాపు 50 వేల కోట్ల రూపాయలు మనం పొదుపు చేయగలిగాం. ఈ యాభై వేల కోట్ల రూపాయలు కూడా మన మధ్యతరగతి కుటుంబాలకు ఆదా చేయడం జరిగింది. ఎల్ఈడీ బల్బుల ద్వారా ఇంత పెద్ద విజయాన్ని మనం సాధించగలిగాము. నేను 50 వేల కోట్ల రూపాయల ప్యాకేజీని ప్రకటించి ఉండి ఉంటే ఈ పాటికి వార్తా మాధ్యమాలలో అది ఒక పెద్ద వార్తగా ప్రచురించేవారు. మా ప్రభుత్వం మధ్యతరగతి కుటుంబాలు 50 వేల కోట్ల రూపాయలు ఆదా చేసే దిశగా పనిచేసింది. గుండె కి వాడే స్టెంట్లు ఖరీదు ఎక్కువగా ఉండేది. వాటిని మా ప్రభుత్వం చవకగా అందజేస్తుంది. కీళ్ళ మార్పిడి కూడా ఇప్పుడు చవకగా జరుగుతుంది. అలాగే జిల్లా స్థాయిలో డయాలసిస్ సదుపాయం ఉచితంగా ఏర్పాటు చేశాం. ఇంతకు మునుపు పేదవారు డయాలసిస్ చేయించుకోవడానికి రెండు నుంచి మూడు వేల రూపాయలు ఖర్చు పెట్టే వారు. ఈరోజు మేము ఉచితంగా ఆ సదుపాయం కల్పిస్తున్నాం. అలాగే ఐదు వేల జన ఔషధి కేంద్రాలు మేము స్థాపించాము. వంద రూపాయలు ఖరీదు చేసే జెనరిక్ ఔషధాలు ముప్పై రూపాయలకే లభిస్తున్నాయి. పేద కుటుంబాలు, ఎక్కడైతే ఉమ్మడి

కుటుంబాలు కూడా ఉంటాయో అక్కడ 60 ఏళ్ల పైబడిన కుటుంబ సభ్యులు ఉంటారు. వారికి ఈ విధమైన ఔషధాలు అవసరం. దీని వలన మధ్యతరగతి కుటుంబాలకు బృహత్ప్రయోజనం కలిగింది. పేద వారికి చికిత్స కోసం కూడా మేము ఏర్పాట్లు చేశాం. నాకు ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే కొంతమంది ఆయుష్మాన్ భారత్ కోసం మోది రాసే ఉత్తరం గురించి ఆందోళన చెందుతున్నారు ఎప్పుడైతే ఒక దేశ ప్రధాని ఒక ఉత్తరం రాస్తారో వారు ఒక పెద్ద బాధ్యత తన పై వేసుకుంటున్నారు. బలమైన నిబద్ధతను చూపించి ప్రజల్లో విశ్వాసం నింపుతున్నారు. మీరు చింతించవద్దు. నేనూ, ప్రభుత్వం మీ తోనే ఉన్నాం అని ప్రజలకు వారు ధైర్యం చెబుతున్నారు. ఈరోజు ఈ సభ సంతోషించాలి. ఎందుకంటే ఈ దేశం లోని పేద వ్యక్తి ఆకులు అలములతో తనకి తాను చికిత్స చేసుకుని చావుకి దగ్గర అయ్యేవాడు, ఎందుకంటే వారు వారి పేదరికం వల్ల పెద్ద ఆసుపత్రి కి వెళ్ళలేకపోయేవారు. అలాంటి వారిని ఈ ప్రభుత్వం ఆదుకుంటుంది. పేద వారు తీవ్రమైన వ్యాధులకు చికిత్స చేయించుకోలేక వేచి ఉండే వారు, వారి కుటుంబ సభ్యులు కూడా ఏం చేయాలా అని ఆవేదన చెందేవారు. అలాంటి వ్యక్తులు ఈ విధమైన తీవ్రవ్యాధులతో రెండు నుంచి నాలుగు సంవత్సరాల వరకూ అలాగే ఉండేవారు. కానీ ఆయుష్మాన్ భారత్ వచ్చిన వంద రోజుల్లోనే దాదాపు పదకొండు లక్షల పేద వ్యక్తులు వీటి ప్రయోజనాలను పొందారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారు కూడా ఈ పథకం కింద ప్రయోజనం పొందుతున్నారు. ప్రతి రోజు 15 వేల మంది కంటే ఎక్కువ మంది ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రయోజనాలు పొందుతున్నారు. ఇది మనందరి బాధ్యత. ఎంతోమంది గౌరవనీయ సభ్యులు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఎక్కువమంది ప్రజలు క్యాన్సర్ వ్యాధి, ఇతర వ్యాధుల వలన బాధపడుతున్నారని నిధులు అడిగేవారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి మేము ఈ పని నిరంతరంగా చేశాము. ఇంతకుముందు ఉన్న ప్రధాన మంత్రులు కూడా ఆ పని చేసి ఉన్నారు. కానీ ఆయుష్మాన్

భారత్ అమలు చేసిన తర్వాత ఎంపీలు ఈ విధమైన ఉత్తరాలు రాయాల్సిన అవసరం లేదు. వారి వద్ద ఇప్పుడు గోల్డ్ కార్డ్స్ ఉన్నాయి. వారి పని సత్వరమే జరుగుతుంది. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి కొన్ని నిధులు ఇచ్చే వాళ్ళం. కానీ ఈ పథకం కింద వారి చికిత్స మొత్తం ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ప్రతి పార్లమెంట్ సభ్యుడు సహాయనిధి నుంచి నిధుల కోసం నన్ను కలిసే వారు, వారి ప్రాంతంలో ప్రజలకు అందిన సహాయం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేసేవారు. ఈ పనులు మొదటి, మూడవ వారంలో జరిగేవి, నేను వారికి ఉత్తరాలు కూడా రాసే వాడిని. ఎవరైతే ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి సహాయం పొందుతున్నారో వారు నిజంగానే జబ్బు పడ్డారా లేదా అనే విషయం నేను నిర్ధారించుకోవాల్సి ఉంది. నేను గుజరాత్ లో ఉన్నప్పుడు ఒక ప్రయోగం చేశాం. ప్రజలు సర్క్యూట్ హౌస్ సదుపాయం పొందేవారు. రాజకీయ నాయకులకు అక్కడ రాయితీ మీద సర్క్యూట్ హౌస్ లభించేది. వారు సర్క్యూట్ హౌస్ లో వచ్చి వెళ్ళిన తర్వాత అక్కడి మేనేజర్ వారికి ఒక ఉత్తరం రాసే వారు. మీరు, మీ భార్య ఇక్కడికి ఫలానా తేదీన వచ్చారు. మీకు ఏ విధమైన అసౌకర్యం కలగలేదు కదా అని అడిగేవారు. ఆ తరువాత అక్కడికి ఈ జనాలు రావడం మానేశారు. ఆ విధంగానే నేను చికిత్స కోసం సహాయం అందించిన వాళ్లకి ఉత్తరం రాసేవాణ్ణి. నేను మీ చికిత్స కోసం డబ్బులు పంపించాను ఇప్పుడు మీ ఆరోగ్యం బాగుందని నేను భావిస్తున్నాను అని. ఆ తర్వాత ఈ సహాయాన్ని ఆధార్ తో అనుసంధానం చేయబడింది ఆ విధంగా దళారుల వ్యవస్థను నిర్మూలించడం జరిగింది.

నేను గౌరవనీయ పార్లమెంట్ సభ్యులకు ఒక విన్నపం చేసుకుంటున్నాను, మీ నియోజకవర్గాల్లోని పేద ప్రజలు ఆయుష్మాన్ భారత్ పథకం కింద ప్రయోజనం పొందేలా చూడండి. ఎన్నికలలో ఒక ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని కోరుకుంటున్నాను. ఎన్నికలు వస్తాయి, పోతాయి, కానీ మనం ఎప్పుడు పేదవారికి సేవ చేస్తూ ఉండాలి. ఇంకా రెండు

మూడు నెలల సమయం ఉంది, మీ వద్ద ప్రజల సంక్షేమం కోసం పని చేయడానికి అవకాశం ఉంది.

స్పీకర్ మేడమ్, నేను ఒక విషయం పట్ల విస్తారంగా చెప్పదలుచుకున్నాను. మేము రాజ్యాంగాన్ని సవరించి పేద యువత కలలు నిజం చేసే దిశగా, సమాజం పై ఉన్న బరువుని తక్కువ చేసే దిశగా పనిచేశాం. ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు వర్తిస్తున్న రిజర్వేషన్ ని మార్చకుండా పేద ప్రజల కోసం పది శాతం రిజర్వేషన్ మేము పొందుపరిచాము. ఈ సమస్య మేము అధికారంలోకి వచ్చాక పుట్టలేదు. అది ముందు నుంచే ఉంది. మేము ధైర్యం చూపించి ఈ సమస్యకి పరిష్కారం కనుగొన్నాం. ఈ సభలో ఉన్న సభ్యులందరూ సర్వ సమ్మతితో మాకు అందించిన సహకారానికి నేను వారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈ సందర్భంగా మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ అదనపు రిజర్వేషన్ కి అనుగుణంగా విద్యారంగంలో సీట్ల సంఖ్య పెంచడం జరిగింది. దీని వల్ల ఇతరులకి అన్యాయం జరగకుండా, అలాగే వారి అభివృద్ధికి ఆటంకం కలగకుండా చూడవచ్చు. మీరు 55 సంవత్సరాలు అధికారంలో ఉన్నా, ఒక ప్రామాణిక ఉపాధి విధానాన్ని తీసుకురాలేకపోయారు. గత ప్రభుత్వాల ప్రణాళికలో ఉపాధి అవకాశాలకు సంబంధించి ఒక వ్యవస్థను పొందుపరచ లేకపోయాయి. ఉపాధి అవకాశాల కోసం ఒక సముచిత వ్యవస్థ లేదు. ఎవరైతే ఎక్కువగా అధికారాన్ని అనుభవించారో వారే ఉపాధి అవకాశాలు లేక పోవడానికి బాధ్యులు. మేము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నిస్తున్నాం. ఉపాధి అవకాశాలు 100 రంగాలలో ఉన్నప్పటికీ అంచనాలు మాత్రం కేవలం ఏడు ఎనిమిది రంగాలకే పరిమితమవుతుంది. ప్రస్తుత విధానంలో 100 రంగాలలో ఉద్యోగాలని మూల్యాంకనం చేయాల్సి ఉంది కానీ ఒక అంచనాకు చేరడానికి 7,8 రంగాలలో మాత్రమే సర్వే నిర్వహిస్తున్నారు.

కాలం మారింది, ప్రమాణాలు మారాయి అలాగే ఉద్యోగాలు మారాయి. కాబట్టి ఈరోజు నేను ఈ సభకి ఒక నిజం చెప్పాలనుకుంటున్నాను. ఏ విధమైన భయం లేకుండా వాస్తవాల ఆధారంగా, ప్రత్యేకించి టీవీ చూస్తున్న ప్రజలు నా ఉపన్యాసం లోని ఈ భాగాన్ని చాలా జాగ్రత్తగా వినాల్సిందిగా కోరుచున్నాను. ఎందుకంటే కొంతమంది అధికార దాహంతో తప్పుడు ప్రచారం చేస్తున్నప్పుడు వారికి మీరే సమాధానం చెప్పాలి. మన దేశంలో దాదాపు 85 నుంచి 90 శాతం ఉపాధి అవకాశాలు అసంఘటిత రంగంలో ఉన్నాయి, కేవలం 10 నుంచి 15 శాతం ఉద్యోగాలు మాత్రమే సంఘటిత రంగంలో ఉన్నాయి. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించాలి. కేవలం10 శాతం ఉద్యోగ అవకాశాలు ఇచ్చే రంగం గురించి కొన్ని వివరాలు నేను ఇప్పుడు చెప్తాను. ముందు 10% గురించి మాట్లాడతాను ఆ తర్వాత 90% గురించి చెబుతాను. సెప్టెంబర్ 2017 నుంచి నవంబర్ 2018 అంటే దాదాపు 15 నెలల్లో, ఒక కోటి 80 లక్షల మంది భవిష్య నిధిలో డబ్బులు జమ చేయడం మొదలుపెట్టారు. ఉపాధి లేకుండా అలా చేయడం సాధ్యమా? 64 శాతం మంది ఉద్యోగులు 28 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గల వాళ్ళు కాబట్టి ఖర్గే గారు ఈరోజు ఉదయం చేసిన వాదన తర్కరహితమని తేలింది. ఒక వ్యక్తి వయసు 28 లోపు ఉంటే కొత్త ఉద్యోగిగా పరిగణిస్తాం.

నేను మీ ముందు మరొక వాస్తవం ప్రస్తావిస్తాను. మార్చి 2014లో మనదేశంలోని 65 లక్షల మంది జాతీయ పెన్షన్ పథకం కోసం వారి పేర్లను నమోదు చేసుకున్నారు. గత సంవత్సరం అక్టోబర్లో ఆ సంఖ్య 1 కోటి 20 లక్షలకు చేరుకుంది. ఇది ఏ ఉద్యోగము లేకుండా సాధ్యమా? ఇది ఏమన్నా కాల్పనిక విషయమా? నేను మీకు కొన్ని గణాంకాలు వివరిస్తాను. ప్రతి సంవత్సరం నాన్ కార్పొరేట్ పన్ను చెల్లింపుదారులు వారి ఆదాయాన్ని వారి ఆదాయపు పన్నుల్లో వివరిస్తారు. వారు వారి ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తారు కానీ వారు మాత్రం జీతం

తీసుకోరు. గత నాలుగు సంవత్సరాలలో దాదాపు ఆరు లక్షల 35 వేల మంది కొత్త నిపుణులు మన దేశంలో పని చేయడం మొదలుపెట్టారు. ఒక డాక్టరు క్లినిక్ ని గానీ నర్సింగ్ హోమ్ గాని నిర్వహిస్తున్నప్పుడు కొంత మందికి ఉపాధి కల్పిస్తారు. అలాగే ఒక చార్టెడ్ అకౌంటెంట్ ఇద్దరు ముగ్గురు వ్యక్తులకి ఉద్యోగం ఇస్తాడు. ఈ అధికారిక రంగం మిగతా అన్ని రంగాలలో కేవలం పది శాతం మాత్రమే, ఆరు లక్షల ముప్పై ఐదు వేలు మంది నిపుణులకు ఉపాధి కల్పించారు.

ఇక అనధికార రంగంలోకి వస్తే రవాణా రంగం అన్నిటికంటే ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. ఇందులో అసంఘటిత కార్మికులు పనిచేస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలలో 36 లక్షల వరకు వాణిజ్య వాహనాలు అమ్మడం జరిగింది. దాదాపు ఒకటిన్నర కోట్ల ప్రయాణికుల వాహనాలు విక్రయించబడ్డాయి. 27 లక్షల కంటే ఎక్కువ కొత్త ఆటోల విక్రయం జరిగింది. ఈ వాహనాలు పార్కింగ్ లో ఉంచడానికి కొనబడ్డాయా? ఈ వాహనాల్ని ఉపయోగించడం లేదా? ఈ వాహనాలని నిర్వహించడం లేదా? ఒక అంచనా ప్రకారం గత నాలుగున్నర సంవత్సరాలలో రవాణా రంగంలో ఒక కోటి 25 లక్షల మంది ఉపాధి పొందారు. హోటల్ పరిశ్రమలో ఆమోదించబడిన హోటళ్ళ సంఖ్య 50 శాతం పెరిగింది. ఈ హోటల్లో ఖాళీగా ఉన్నాయా? ఈ హోటల్ లో ఉద్యోగాలు దొరకడం లేదా? పర్యాటక రంగంలో దాదాపు ఒకటిన్నర కోట్ల ఉపాధి అవకాశాలు సృష్టించబడ్డాయి. టాక్సీ అగ్రిగేటర్ సేవలు మనదేశంలో విస్తరిస్తున్నాయి కానీ ప్రతిపక్షంలో కూర్చున్న నా మిత్రులు ఇవి కేవలం యాప్ ఆధారిత కంపెనీలనీ, కేవలం అవ్వే వ్యాపారం చేస్తున్నాయని నమ్ముతున్నారు. కార్లు డ్రైవర్లు లేకుండా నడుస్తున్నాయా? డ్రైవర్లకి ఈ రంగంలో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ముద్రా పథకం కింద నాలుగు కోట్ల పాతిక లక్షల మంది కంటే ఎక్కువ మందికి మొదటిసారిగా రుణం ఇవ్వడం జరిగింది. ఆ వ్యక్తులు వారి పని చేసుకుంటున్నా వారి సమాచారం ఉద్యోగాల కింద

పొందుపరచలేదు. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో రెండు లక్షల కంటే ఎక్కువ నూతన సాధారణ సేవా కేంద్రాలు నెలకొల్పడం జరిగింది. ప్రజలకి ఈ రంగంలో కూడా ఉద్యోగాలు లభించాయి. గతంలో ఎస్.టి.డి బూతులని కూడా ఉపాధి గా చూపించే వారు ఆ గణాంకాలను పార్లమెంట్లో కూడా సమర్పించేవారు. ఈ రోజు సాధారణ సేవా కేంద్రాలు రోజుకీ 18 నుంచి 20 గంటలు పనిచేస్తున్నాయి. ఒక సేవా కేంద్రం లో ముగ్గురు నుంచి ఐదుగురు వ్యక్తులు పనిచేస్తున్నారు.

రహదారులు రెట్టింపు వేగంతో కడుతున్నాము. కొత్త విమానాశ్రయాలని కూడా మనము నెలకొల్పుతున్నాము. రైల్వే స్టేషన్లు ఆధునీకరిస్తున్నాము. కొన్ని కోట్ల కొత్త గృహాలు నిర్మిస్తున్నాను. ఇవి ఉపాధిని కల్పించడం లేదా? మన యువత సొంత కాళ్లపై నిలబడుతున్నారు. స్కిల్ ఇండియా,స్టార్ట్ అప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్ర యోజన వంటివన్నీ మనదేశంలో స్వయం ఉపాధి కోసం మేము ప్రారంభించిన కార్యక్రమాలు. స్పీకర్ మేడం, మన దేశంలోని యువత ఈ దేశ భవిష్యత్తుతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నారు. ఈ బడ్జెట్లో రైతుల పట్ల కూడా శ్రద్ధ వహించాము. మీ పాలన, మా పాలనలో వ్యయాన్ని,కనీస మద్దతు ధర, కనీస మద్దతు ధర కింద చేసిన కొనుగోళ్లు చూసినట్లయితే బీజేపీ ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాలకోసం పని చేస్తున్నాయని మనం అర్థం చేసుకోవచ్చు. 55 సంవత్సరాల అధికార భోగం, రైతుల పట్ల యాభై ఐదు నెలల సేవాభావం మనకి స్పష్టంగా కనబడుతుంది. గత ప్రభుత్వాలు రుణమాఫీ పథకాలతో ఓట్లు దండుకునే వారు. 2009 ఎన్నికలలో విజయం సాధించడానికి మీరు రుణమాఫీ పథకాన్ని ప్రకటించారు. రైతులకు ఇచ్చిన రుణం విలువ ఆరు లక్షల కోట్ల రూపాయలు. ఈ విషయాన్ని వారు పెద్దగా చేసి చూపించారు. రైతు రుణాలు ఆరు లక్షల కోట్ల రూపాయలు అయితే కేవలం 52 వేల కోట్ల రూపాయలు మాత్రమే మాఫీ చేశారు. పెద్ద వ్యాపారవేత్తలు ఈ పథకం నుంచి ప్రయోజనం

పొందారు కానీ పేద రైతులు ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకున్నారు. మీరు రైతులని పట్టించుకోలేదు. అప్పట్లో CAG రిపోర్టుని ఈ సభలో సమర్పించారు. మీరు ఎన్నో ముఖ్యమైన విషయాలను నిర్లక్ష్యం చేశారు. అవినీతి చాలా పెద్ద ఎత్తున జరిగేది. 2జి కుంభకోణం, బొగ్గు కుంభకోణం, ఇతర కుంభకోణాలు ఆ సమయంలో జరిగాయి. సి ఏ జి రిపోర్టు ప్రకారం దాదాపు 35 లక్షల మంది, 52 వేల కోట్ల రూపాయల రుణమాఫీ పథకంలో అనర్హులు, అయినా వారికి డబ్బు ఇవ్వబడింది. ఈ పథకంలో కూడా దళారులు ఉండేవారు. రైతుల సంక్షేమం కోసం మా ఆలోచన, మా ఉద్దేశం చాలా స్పష్టంగా ఉంది. మేము కూడా రుణమాఫీ పథకాన్ని ఎంచుకోవచ్చు. కానీ మేము రైతుల సాధికారత దిశగా ఆలోచించాము. ఇంతకుమునుపు 99 నీటి పారుదల పథకాలు ఉండేవి. ఈరోజు మీరు ప్రధానమంత్రి నీటిపారుదల పథకాన్ని విమర్శిస్తున్నారు. నేను ఇంతకు ముందు చెప్పినట్టుగా నెహ్రూ గారు ఒక పథకానికి శంకుస్థాపన చేస్తే దాన్ని నేను ప్రారంభించాను. వేల కోట్ల రూపాయలు వెచ్చించి పెండింగ్ లో ఉన్న 99 ప్రాజెక్టులని మేము పూర్తి చేసాము.

మేము కొత్త మెగా ఫుడ్ పార్క్ లు, కొత్త శీతల గిడ్డంగులకి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాము. 22,000 గ్రామీణ మార్కెట్ లు ఏర్పాటు చేయడానికి పని వేగవంతంగా జరుగుతోంది. రైతులు వారి పంటలను లాభదాయక ధరకు అమ్మడానికి e-NAMద్వారా ఆన్లైన్ సదుపాయం కల్పించాము.

మేడం స్పీకర్, ఈ బడ్జెట్లో రైతుల కి సాలీనా ఆరువేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించాము. ఈ నిర్ణయం వల్ల దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. దాదాపు 12 కోట్ల మంది రైతులు ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం పొందుతారు. గత ప్రభుత్వాల పథకాలలో దాదాపు కోటిన్నర నుంచి రెండు కోట్ల మంది రైతులు మాత్రమే ప్రయోజనం పొందగలిగే వారు. ఆ పథకాలు కేవలం పెద్ద రైతుల కోసమే తీసుకువచ్చేవారు. చిన్న రైతులు ఎవరి వద్ద అయితే

ఒకటి లేదా రెండు ఎకరాల భూమి ఉండేదో వారికి ఆ పథకాల ప్రయోజనాలు లభించేవి కావు. ఇప్పుడు మేము తీసుకున్న నిర్ణయం వల్ల 85% మంది రైతులు మనదేశంలో ప్రయోజనం పొందుతారు. దళారులు లేకపోవడం వల్ల ఈ ప్రయోజనాలు రైతుల బ్యాంకు ఖాతాలలోకి నేరుగా వెళ్తాయి. కొన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయము అని చెప్పడం నన్ను విస్మయానికి గురిచేస్తుంది. ఆ రాష్ట్రాల రైతులను వారికి 6 వేల రూపాయలు కావాలా వద్దా అని అడగండి. రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఈ డబ్బు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. కొంతమంది ఇందులో కూడా రాజకీయ లబ్ది పొందాలని,ఈ పథకాన్ని అమలు చేయము అని చెబుతున్నారు. వారు రైతుల సంక్షేమం గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. వారు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా అమలు చేయడానికి ఆసక్తి చూపించడం లేదు. వారు రాజకీయాలు చేయడం కన్నా పేదల పట్ల శ్రద్ధ వహించాలి.

షావుకారుల నుండి అప్పు తీసుకున్న రైతులకు ఈ రుణమాఫీ పథకం వర్తించదు. నేను కర్ణాటక రాష్ట్రం ప్రస్తావన తీసుకు వస్తాను. కర్ణాటక నుంచి వచ్చిన రైతు నాయకుడు ఇక్కడ మన మధ్య కూర్చున్నారు. మాజీ ప్రధానమంత్రి గౌరవనీయులు దేవగౌడ గారు, వారు ఒక రైతు బిడ్డ అని చెప్పుకుంటారు. మీ ప్రభుత్వం కూడా ఎన్నో ప్రకటించింది, అలాంటప్పుడు మోదీ కి ఓట్లు ఈ ప్రకటనల ద్వారా వచ్చాయని ఎలా చెప్పగలరు? మీరు 43 లక్షల రైతుల కోసం రుణ మాఫీ పథకాన్ని ప్రకటించారు. ఈ గణాంకాలు కర్ణాటక ప్రభుత్వ రికార్డు లో ఉన్నవి. కానీ ఇంత వరకూ కేవలం 60 వేల రైతులకు మాత్రమే ఈ ప్రయోజనం దక్కింది. మీ ప్రభుత్వం రుణమాఫీ పథకం కేవలం 10 రోజుల్లో అమలు చేస్తామని గొప్పలు చెప్పింది. రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇంకా దీనికి సంబంధించి లేఖలు కూడా జారీ చేయలేదు, మీరు కేవలం గొప్పలు మాత్రమే చెబుతున్నారు.10 సంవత్సరాలలో ఒక్కసారి 50 నుంచి 60

వేల కోట్ల రూపాయల రుణమాఫీ జరిగిందని మీ అందరికీ తెలియజేసుకుంటున్నాను. కేవలం రెండు నుంచి మూడు కోట్ల రైతులకు మాత్రమే ప్రయోజనాలు దక్కాయి. మా పథకం వార్షిక ఆధారంగా తయారు చేయబడినది.పది సంవత్సరాలకి లెక్క చూసినట్లయితే అది ఏడున్నర లక్షల కోట్ల రూపాయలు అని తేలుతుంది. యాభై,యాభై రెండు వేల కోట్ల రూపాయలు, ఏడున్నర లక్షల కోట్ల రూపాయల మధ్య భారీ వ్యత్యాసం ఉంది. జాతీయ కామదేను కమిషన్ కింద మత్స్యకారులు, పశు సంరక్షణ చేసే రైతుల కోసం ప్రత్యేక నిబంధనలు తయారు చేశాము. వారికి కిసాన్ క్రెడిట్ కార్డు ప్రయోజనాలు కూడా లభిస్తాయి. మేము వారి సంక్షేమం గురించి ఆలోచించాము. మా ప్రభుత్వం వారి పట్ల సున్నితంగా వ్యవహరించింది. మేము గత ప్రభుత్వాల పెండింగ్ ప్రాజెక్టులను కూడా పూర్తి చేయడానికి సంతోషంగా పని చేస్తున్నాము. నేను టీకాల గురించి కూడా చెప్పాలి. ఈ పథకం ద్వారా తల్లి, బిడ్డకి ప్రయోజనం కలగాలి. పేదలు, గిరిజనులు, దళితులు, అణగారిన వర్గాలకు చెందిన ప్రజలకు ఈ ప్రయోజనాలు లభించేవికాదు. మేము 'మిషన్ ఇంద్రధనుష్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించాము. దాని పరిధి విస్తరించి విజయవంతంగా అమలు చేస్తున్నాము. ఇంతకుముందు వేరువేరు పథకాల ప్రయోజనాలు పేదలకు అందేవి కాదు. ఇప్పుడు మేము పేదలకి ప్రయోజనాలు కలిగేలా ప్రయత్నాలు చేస్తున్నాము. చదువు మానేసిన వారి కోసం నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి పథకాలు మేము ప్రారంభించాము. స్కిల్ ఇండియా కార్యక్రమం కింద లక్షల మంది యువకులకు మేము శిక్షణ ఇచ్చాము. కమ్యూనిస్టు పార్టీ వాళ్లు అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం చాలా రోజులుగా పోరాడుతున్నారు. దాదాపు 40 నుండి 42 కోట్ల అసంఘటిత కార్మికులు ఉన్నారు. మొట్టమొదటిసారిగా ప్రధానమంత్రి శ్రమ యోగి మంధన్ కార్యక్రమాన్ని ప్రారంభించి వారికి మూడు వేల రూపాయల పెన్షన్ అందేలా ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు పార్టీ ఈ పని చేయలేక పోయింది. ఈ దేశంలోని మత్స్యకారులు వారి కోసం ఒక

ప్రత్యేక మంత్రిత్వ శాఖను కోరారు. ఈ బడ్జెట్లో ప్రత్యేక మంత్రిత్వ శాఖ కోసం ఏర్పాటు చేశాము. వ్యాపారులు, ఒక దేశ ఆర్థిక వ్యవహారాలలో ముఖ్యమైన పాత్రను పోషిస్తారు, కానీ వారి గురించి ఎవరూ ఆలోచించడం లేదు. DIPP స్థానంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ ఇంటర్నల్ ట్రేడ్ తీసుకురావడం జరిగింది. భారత ప్రభుత్వం కింద పనిచేసే ఈ విభాగం కోట్లమంది వ్యాపారుల ప్రయోజనాల కోసం పని చేస్తుంది. ఎన్నో శతాబ్దాల నుంచి సంచార సమాజాలు ఉన్నాయి. గత ప్రభుత్వాలు పాములు ఆడించే వారిని మోసం చేసి విదేశీ అతిథుల ముందు వారి ఆటని చూపించేవారు. ఆ ప్రభుత్వాలు వీరి పట్ల ఏవిధమైన శ్రద్ధ చూపించేవి కాదు. కానీ మేము మొట్టమొదటిసారిగా సమాజం సంక్షేమం కోసం ఒక బోర్డు ని స్థాపించడం జరిగింది. దీనివల్ల వారికి వేర్వేరు పథకాల నుంచి ప్రయోజనాలు అందుతాయి. నేను గుజరాత్ లో ఉన్నప్పుడు సంచార జాతుల కోసం ఇల్లు నిర్మించే కార్యక్రమం గురించి ఆలోచించాను. వారి పిల్లలకు కూడా చదువు ఉండాలని నేను ఆలోచించాను. వారికి ఇళ్లు లేవు కాబట్టి వారి పిల్లలు పాఠశాల కి ఎలా వెళ్తారు అని అడిగారు.నేను వారికి ఇళ్లు నిర్మించి ఇచ్చాను. నేను ఈ విషయం గర్వంగా చెప్పగలను. వారి పిల్లలు ఈ రోజు కంప్యూటర్లపై పనిచేస్తున్నారు. వారు ఒక నాణ్యమైన జీవితాన్ని జీవిస్తున్నారు. మనమందరము కూడా అలాంటి సమాజాల సంక్షేమం కోసం పని చేయాలి.

స్పీకర్ మేడం, సుష్మా గారు విదేశీ విధానం గురించి విస్తారంగా చెప్పారు. నేను ఆ విషయాల్లోకి వెళ్ళను. ఈరోజు భారత దేశం ప్రపంచ పటంలో ఒక ముఖ్యమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఇతర దేశాలు మన విధి విధానాల పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. పారిస్ ఒప్పందాన్ని ఖరారు చేసే ముందు భారత్ కి ప్రపంచ ఫోరంలో సరైన గౌరవం లభించింది. మన దేశాన్ని పెద్ద పెద్ద దేశాలు ఫోన్ ద్వారా సంప్రదించాయి. ఈరోజు భారతదేశం తన స్థానాన్ని సంపాదించుకుంది. పాలస్తీనా, ఇజ్రాయిల్ మన మిత్రులు. వాటి మధ్య పరస్పర సంబంధాలు

బాగా లేకపోయినా మనతో వారు స్నేహభావంతో ఉంటారు. అలాగే సౌదీ అరేబియా, ఇరాన్ ల మధ్య మంచి సంబంధాలు లేవు కానీ వారు కూడా మనకి మంచి మిత్రులు.

మనం ప్రవాస భారతీయులకి ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వం. మేము ఈ దిశగా కొన్ని ప్రయత్నాలు చేశాక అన్ని రాజకీయ పార్టీలు వారికి ప్రాముఖ్యతను ఇస్తున్నాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను.ప్రవాస భారతీయులు మన బలం, వారు మన పథకాలని విస్తరిస్తున్నారు. బనారస్ లో నిర్వహించిన ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో అధికంగా ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

కుంభ్ ని ఒక సంస్కృతి గా ప్రపంచం మొత్తం స్వీకరించింది. గత ప్రభుత్వాలు కుంభ్ ని మతం తో ముడి పెట్టే వారు. కానీ ఈ రోజు ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు ఈ కుంభమేళాకు హాజరవుతున్నారు. వేరువేరు దేశాల రాయబార కార్యాలయాల నుంచి వారి ప్రతినిధులు వచ్చి, వారి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఇదే ఈ దేశం బలం, సున్నిత శక్తి. ఇంతకుమునుపు మనల్ని నిర్లక్ష్యం చేసేవారు. ఈరోజు మనం విజయవంతంగా ముందుకు సాగుతున్నాం.

మేడం స్పీకర్, ఈ దేశ ప్రజలకు నేను భరోసా కల్పిస్తున్నాను, ఏ లక్ష్యాలు అయితే మేము 2014లో పెట్టుకున్నామో వాటిని నిజం చేయడానికి మేము పని చేస్తున్నాము. ఈ కలలు నిజం చేయడానికి సంకల్పించాము. మన వద్ద ఉన్న వనరులను అత్యధికంగా ఉపయోగించడానికి ప్రయత్నిస్తున్నాము. అలాగే దేశ సంక్షేమం కోసం మేము నిరంతరం పోరాడుతున్నాము. మేము ఆ పనులు చేస్తూ ఉన్నాము, చేస్తూనే ఉంటాము. 2018లో అవిశ్వాస తీర్మానంపై చర్చ జరుగుతున్నప్పుడు నన్ను అణగదొక్కడానికి ప్రయత్నాలు జరిగాయి. గంటన్నరపాటు నినాదాల మధ్య నేను నా అభిప్రాయాలు ఈ దేశానికీ, ప్రపంచానికి తెలియజేశాను. 2023 లో కూడా నాకు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని

నేను వారికి శుభాశీస్సులు తెలియజేస్తున్నాను. ఇవి దేశ సేవ చేసే వారి భావోద్వేగాలు. వారి అహం వల్ల వారు నాలుగు వందల నుంచి 40 కి పడిపోయారు. మేము దేశ సేవ చేయడం వల్ల రెండు సీట్ల నుంచి ఈ స్థాయికి చేరుకున్నాము. మనం 1947లో స్వాతంత్ర్యం సాధించిన దేశాలతో పోల్చితే వారు ఎంత అభివృద్ధి సాధించారో మనం ఎంత అభివృద్ధి సాధించామో చూడవచ్చు. ఇదే కాలంలో వేరే దేశాలు ఎన్నో సవాళ్లను అధిగమించాయి. మనకి సామర్థ్యం ఉన్నా ఒక విధానం, దూరదృష్టి, వేగం లేదు. మీరు కేవలం 5 - 15 సంస్థలపై దృష్టి సారించారు. మీరు రైతులకు నీరు, విద్యుత్ ఇవ్వడానికి ప్రయత్నాలు చేయలేదు. మేము 55 నెలలో చేసాము. మేము మా లక్ష్యాలను చేరుకుంటాము. ఖర్గే గారు మీరు కర్ణాటక నుంచి వస్తారు, కానీ ఇన్ని సంవత్సరాల తర్వాత మీరు బసవన్న గారి బోధనల గురించి మాట్లాడారు. మీరు ఈ బోధనలు 25, 30 సంవత్సరాల క్రితం చదివి ఉంటే మీరు తప్పు దారిలో పయనించేవారు కాదు. బసవన్న గారి బోధనలు ప్రతి కాంగ్రెస్ సభ్యుడి ఇంట్లో ఉండాల్సిన అవసరం ఉంది. వారి బోధనలు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కడ పని చేస్తున్నాయో అక్కడ ఉండాలి. అక్కడ మోదీ చిత్రపటాలు పెట్టకండి, లేకపోతే ప్రజలు సమస్యలు నావల్ల వస్తున్నాయి అనుకుంటారు. చింతించకండి,మోదీ ఈ దేశాన్ని దోచుకున్న వ్యక్తుల గుండెల్లో భయాన్ని సృష్టిస్తాడు. ఎందుకంటే ప్రజలు ఆ పని చేసే అధికారం నాకు ఇచ్చారు. దొంగలు, దోపిడీదారులు ఈ దేశంలో భయపడేవారు కాదు, అందుకే దేశం నాశనం చేయబడింది. అలాంటి వారి గుండెల్లో మా ప్రభుత్వం భయాన్ని పుట్టిస్తుంది.

మేడం స్పీకర్, చివరిగా నేను ఈ కవితని పఠించి నా ఉపన్యాసాన్ని ముగిస్తాను.

సూర్యుడు ఎక్కడికి వెళ్తాడు

తను ఇక్కడే ఉండాలి

మన శ్వాసల్లో

మన వేణల్లో

మన సంకల్పాలలో

నిద్రలేని రాత్రులలో

నువ్వు విచారించ వద్దు

నేను ఇక ఏ సూర్యుణ్ని అస్తమించనివ్వను.

ధన్యవాదాలు.

పార్లమెంటులో శ్రీ అటల్ బిహారీ వాజ్ పాయి గారి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రసంగం.

12 ఫిబ్రవరి 2019

శ్రీ అటల్ బిహారీ వాజ్పేయి గారి చిత్రపటం ఆవిష్కరణ - 12 ఫిబ్రవరి 2019

గౌరవనీయులైన రాష్ట్రపతి గారు, ఉప రాష్ట్రపతి గారు, స్పీకర్ మేడం, గులాంనబీ గారు, నరేంద్ర సింగ్ గారు, అటల్ బిహారీ వాజ్పేయి గారి కుటుంబ సభ్యులు, వారి అభిమానులు.

పార్లమెంటు లోని సెంట్రల్ హాల్లో అటల్ బిహారీ వాజ్పేయి గారు ఇక నుండి ఈ కొత్త రూపంలో మనకి ప్రేరణ ఇస్తూ మనల్ని ఆశీర్వదిస్తూ ఉంటారు. అటల్ జీ గారి గొప్ప జీవితం గురించి ఎంతైనా మాట్లాడుకోవచ్చు, అందులో ఏ విషయమూ కూడా ఇంకో విషయం కంటే తక్కువ కాదు. అటల్ జీ గారి మంచితనం గురించి గంటల తరబడి మాట్లాడినా ఆ సమయం సరిపోదు. వారి గురించి కొన్ని మాటలు మాట్లాడిన వెంటనే వారి గొప్ప వ్యక్తిత్వం గురించి మనకి తెలిసిపోతుంది. అలాంటి వ్యక్తులు చాలా అరుదు. ప్రజా జీవితంలో గడుపుతున్న మన లాంటి వారందరూ వారి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. వారు అధికారానికి ఎన్నో దశాబ్దాలు దూరంగా ఉంటూనే పార్లమెంటులో ఎన్నో సంవత్సరాలు గడిపారు. వారు సామాన్య మానవుడికి సేవ చేస్తూ, వారి వాణిని బలంగా వినిపించే వారు. వారు నిజాయితీగా ప్రజా సేవ చేసే వారు, వారి వ్యక్తిగత ప్రయోజనం కోసం ఎప్పుడూ ఎంచుకున్న దారిని మార్చుకోలేదు.

రాజకీయాలలో ఎత్తుపల్లాలు, విజయాలు, అపజయాలు సహజం. కానీ అటల్జీ గారి జీవితాన్ని చూసినట్లయితే సిద్ధాంతాలను, ఆలోచనలను విస్మరించకుండా లక్ష్యం వైపు వెళ్తూ ఉంటే త్వరలోనే మంచి ఫలితాలు సాధించగలమని ఆయన రుజువు చేశారు. వారి ఉపన్యాసాలు ప్రజలలో చాలా ప్రసిద్ధి చెందాయి. భవిష్యత్తులో ఏ పరిశోధకుడు అయిన వారి జీవితాన్ని లోతుగా విశ్లేషిస్తే, మానోవైజ్ఞానిక దృష్టితో ఆలోచిస్తే వారి ఉపన్యాసాల కన్నా వారి

విరామాలే ఎక్కువ బలమైనవి అని తెలుస్తుంది. బహిరంగ సమావేశాలలో వారు కొన్ని విషయాలు మాట్లాడిన తరువాత స్వల్ప విరామం తీసుకునేవారు, ఆ నిశ్శబ్దం నుంచి కూడా ఒక సందేశాన్ని చివరిగా కూర్చున్న వ్యక్తి కూడా తీసుకోవడం అద్భుతం. విరామాలు తీసుకునే వారి సంభాషణా నైపుణ్యం చాలా అద్భుతం. ఎప్పుడు మాట్లాడాలో, ఎప్పుడు నిశబ్దంగా ఉండాలో తెలుసుకోవడం వారి బలం. ఈ విధంగా వారు స్ఫూర్తిదాయకంగా ఉండేవారు. నాకు వారితో ప్రయాణించే అవకాశం దొరికినప్పుడు, వారు ప్రయాణం చేస్తున్నప్పుడు ఎక్కువగా కళ్ళు మూసుకుని కూర్చోవడం గమనించాను. మితంగా మాట్లాడడం వారి స్వభావం. వారికున్న మరో గుణం వ్యంగ్యాన్ని ఇష్టపడడం. పార్టీ సమావేశాలలో వాతావరణం ఎంత గంభీరంగా ఉన్నా, వారు ఏదో ఒకటి మాట్లాడి ఆందోళనని తేలిక పరిచేవారు. వారు పరిస్థితులని వారి నియంత్రణలో ఉంచుకునేవారు. ప్రజాస్వామ్యంలో శత్రువులు ఉండరు అనే గొప్ప ప్రజాస్వామ్య సిద్ధాంతానికి వారు కట్టుబడి ఉండేవారు. ప్రజాస్వామ్యంలో పోటీ, వ్యతిరేకత ఉంటుంది. వాటితో పాటు గౌరవప్రదంగా ఎలా మెలగాలో మన కొత్త తరాలు వారినుంచి నేర్చుకోవాలి. మన ప్రత్యర్థి పట్ల గౌరవంగా ఎలా మెలగాలో, తీవ్ర విమర్శలను ఏ విధంగా స్వీకరించాలో మనం అటల్ జీ గారి జీవితం నుండి నేర్చుకోవచ్చు.

ఈరోజు అటల్ జీ గారికి నివాళి అర్పించాల్సిన సందర్భం. నేను సభలోని సహచరులందరి తరపున గౌరవనీయులైన అటల్ జి గారికి నివాళులు అర్పిస్తున్నాను.

16వ లోక్ సభ చివరి సమావేశంలో

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

గారి ఉపన్యాసం.

13 ఫిబ్రవరి 2019

16వ లోక్ సభ, చివరి సమావేశం లో ప్రధాన మంత్రి గారి ప్రసంగం - 13 ఫిబ్రవరి 2019

గౌరవనీయులైన మేడం స్పీకర్ గారు, నేను నా తరఫున, ఈ సభలోని సభ్యుల తరఫున మీరు ఈ 16వ లోక్ సభని ఎంతో ఓపిగ్గా, ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో నడిపిన విధానానికి అభినందనలు తెలియజేస్తున్నాను. దేవి అహల్యాబాయి గారి జీవితం, బోధనలు మీపై గొప్ప ప్రభావాన్ని చూపించాయి. వారి బోధనలను, ఆదర్శాలను పాటించడంలో మీరు ఇక్కడ ఎంతో కృషి చేశారు. ఆ ఆదర్శాల వల్లనే మీరు ఇక్కడ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుని మీ కుడి వైపు కూర్చున్న వారికి, ఎడమ వైపు కూర్చున్న వారికి మధ్య ఒక సమతుల్యాన్ని పాటించారు. ఆ విలువలు, ఆదర్శాల ఆధారంగా తీసుకున్న నిర్ణయాలు రాబోయే కాలంలో లోక్ సభలో కొన్ని సంప్రదాయాలు తీసుకువచ్చే దిశగా ఎంతో ఉపయోగపడతాయి.

మీరు కొత్త సభ్యుల కోసం SRI సంస్థని స్థాపించేందుకు చేసిన కృషి అమోఘనీయం. ఆ సంస్థ వలన వాదనలు, విషయాలు, సమాచారంలో ఎంతో నాణ్యత పెరిగింది. మేడం స్పీకర్, 2014 లో తొలిసారిగా పార్లమెంటుకి ఎన్నికై వచ్చిన సభ్యులలో నేను ఒకడిని. నాకు పార్లమెంట్ భవనం గురించి ఏమీ తెలియదు. నేను ఒక కొత్త సభ్యునిగా పార్లమెంట్ గురించి తెలుసుకోవడానికి చాలా ఆత్రుతగా ఉండేవాడిని. నేను ఇక్కడ కూర్చుని ఇక్కడ ఉన్న వేరు వేరు మీటలను ఆసక్తిగా చూసేవాడిని, వాటి ఉపయోగం ఏంటో కనుగొనే వాడిని. నేను ఇక్కడ ఒక ఫలకంపై ముగ్గురు మాజీ ప్రధాన మంత్రుల పేర్లు చూశాను కానీ నాకంటే మునుపు పదముగ్గురు ప్రధానమంత్రులుగా సేవలందించారు. నాకు దీనిలోని తర్కం అర్థం కాలేదు.

దైనందిన సూత్రాలు వల్లె వేసే ఉదారవాదుల సమూహం నుంచి కొంత మంది మేధావులు ఈ విషయం పై చర్చించి మా అందరికి కూడా జ్ఞానోదయం చేస్తారని

భావిస్తున్నాను. నేను చెప్పేది ఏంటంటే ఇక్కడ అన్నీ నాకు కొత్తగా అనిపించాయి అందుకే నేను వాటి గురించి ఉత్సుకతతో ఉండేవాణ్ణి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒక ప్రభుత్వం పూర్తి ఆధిక్యంతో ఏర్పడింది. స్వాతంత్ర్యం తరువాత మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ సాయం లేకుండా పూర్తి ఆధిక్యంతో ఏర్పడ్డ ప్రభుత్వం ఇది. అటువంటి ప్రభుత్వం మొదటిసారిగా శ్రీ అటల్ బిహారీ వాజపాయ్ గారి నాయకత్వంలో ఏర్పడింది కానీ ఆ ప్రభుత్వం సంకీర్ణ ప్రభుత్వం. మా ప్రభుత్వం పూర్తి ఆధిక్యంతో 2014 లో ఏర్పడింది. మా ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీకి ఏ విధమైన సంబంధం లేదు. 16వ లోక్ సభలో 17 సమావేశాలు జరిగితే అందులో 8 సమావేశాలు 100% పనిచేశాయి. సగటున మనం 80 శాతం ఫలితాలతో వీడ్కోలు పలుకుతున్నాము. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి గారిది చాలా బాధ్యతాయుతమైన పని. ప్రస్తుతం ఈ మంత్రిత్వ శాఖ కి శ్రీ తోమర్ గారు నేతృత్వం వహిస్తున్నారు. మొదట్లో ఈ శాఖకి శ్రీ వెంకయ్య నాయుడు గారు ఎంతో సామర్థ్యంతో నేతృత్వం వహించారు. వారు ఇప్పుడు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభకి అధ్యక్షుడిగా చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. ఉత్సాహంగా ఉండే మా సహచరుడు శ్రీ అనంత కుమార్ గారిని మేము కోల్పోయాము. అలసిపోకుండా పనిచేసిన ప్రతి ఒక్కరికి నా అభినందనలు. 16వ లోక్ సభలో ఎక్కువ మహిళా సభ్యులు ఉన్నారని గర్వంగా చెప్పుకోవచ్చు. ఈ లోక్ సభలో 44 మహిళలను ఎంపీలుగా ఎన్నుకోవడం జరిగింది. వారి ప్రాతినిధ్యాన్ని, చర్చలలో పాల్గొని వాటిని ఉన్నతంగా తీర్చిదిద్దిన తీరును మనం గుర్తించాలి. మహిళా పార్లమెంటు సభ్యులందరూ మన గౌరవానికి అర్హులు. మన దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఎక్కువ మంది మహిళా కేంద్రమంత్రులు ఉన్నారు, ఇద్దరు మహిళా మంత్రులు, రక్షణ మంత్రిగా, విదేశాంగ మంత్రిగా భద్రతకు సంబంధించిన క్యాబినెట్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మనందరికీ గొప్ప గర్వకారణం, ఆనందకరమైన విషయం ఏంటంటే మొట్టమొదటిసారిగా ఒక మహిళ లోక్ సభ

స్పీకర్ గా ఉంటూ సెక్రెటరీ జనరల్ గా కూడా ఒక మహిళ ఉండడం. లోక్ సభ సెక్రటరీ జనరల్, ఆమె బృందం, పార్లమెంట్ భవనం లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులు. నేను వారందరికీ అభినందనలు తెలియజేస్తూ, ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నేను ప్రభుత్వాన్ని పొగడడానికి ఇక్కడ నిల్చున్నానని ఎవరు అనుకోవద్దు, కానీ గత ఐదు సంవత్సరాలుగా ఈ సభలో మనందరం చేసిన పని ప్రశంసనీయం. ప్రతిపక్షం కూడా వారి ప్రతిష్టను మరింత మెరుగు పరుచుకుని ఉంది. అధికారపక్షం కూడా చేదోడుగా ఉంది. ఈ సభలోని ప్రతి సభ్యుడు ఈ ప్రయత్నంలో తోడ్పడ్డారు. ఈ సభలోని నా సహచరులందరూ అద్భుతమైన సహకారాన్ని అందించారు. గత నాలుగున్నర సంవత్సరాలలో భారతదేశం ప్రపంచంలోని ఆరవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇది మనందరమూ సంతోషించాల్సిన వార్త.ఈ పదవీ కాలం కూడా గర్వించదగిన సమయం. మనమందరము కూడా ఇందులో భాగస్వాములం. విధాన సూత్రీకరణ ఇక్కడే మొదలయ్యింది. మనం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నాం. మనం చాలా వేగంగా ఎదుగుతున్నాం. ఈ సభ ఈ ప్రయత్నంలో ఒక కీలక పాత్రను నిర్వహిస్తుంది.

ఈ రోజు భారత్ విశ్వాసం చాలా పెరిగింది. ఆ విశ్వాసం నుంచి మనకు ముందుకు సాగే బలం దొరుకుతుంది. విశ్వాసం వల్లనే మనం గెలుస్తాము. ఆ విశ్వాసమే మనకి సమస్యలని ఎదుర్కొనే శక్తిని ఇస్తుంది. ఈ విశ్వాసాన్ని తీసుకురావడానికి ఈ సభ సమిష్టిగా, వేగవంతంగా పనిచేసి నిర్ణయం తీసుకునే ప్రక్రియని ముందుకు తీసుకు వెళ్ళింది. ఈరోజు ప్రపంచం లోని ప్రసిద్ధి చెందిన, పేరుగాంచిన సంస్థలు భారత్ ఉజ్వల భవిష్యత్తుకు సంబంధించి ఏ విధమైన సంకోచం లేకుండా ఒకే గళంతో అంచనాలు వేస్తున్నాయి. మనదేశం వేగంగా డిజిటల్ ప్రపంచంలో తన స్థానాన్ని సుస్థిర పరుచుకుంది. దానితోపాటు శక్తి రంగంలో శక్తిని ఆదా చేసే

దిశగా ముందుకు సాగుతోంది. అదే సమయంలో ప్రపంచం గ్లోబల్ వార్మింగ్ గురించి చర్చిస్తుంది.

ఈ గ్లోబల్ వార్మింగ్ యుగంలో, భారత్ అంతర్జాతీయ సౌర కూటమికి నాయకత్వం వహిస్తుంది. రాబోయే దశాబ్దాలలో ఈ రంగంలో భారత్ తీసుకోబోయే నిర్ణయం యొక్క ప్రభావం స్పష్టంగా కనబడే రోజు ఎక్కువ దూరం లేదు. పెట్రోలు ఉత్పత్తి చేసే దేశాల కూటమి ఏ విధంగా అయితే ఒక గొప్ప శక్తిగా ఈ ప్రపంచంలో అవతరించిందో, అదే విధంగా అంతర్జాతీయ సౌరకూటమి కూడా గ్లోబల్ వార్మింగ్ కి వ్యతిరేకంగా యుద్ధం చేస్తూ, ఈ పర్యావరణాన్ని రక్షించే క్రమంలో ఒక గొప్ప శక్తిగా అవతరించబోతుంది.

ఈ ప్రభుత్వ పరిపాలనలో, మన దేశం ప్రపంచానికి ఒక ప్రత్యామ్నాయ జీవనశైలిని అందిస్తుందని నేను నమ్ముతున్నాను. అంతరిక్ష రంగంలో భారత్ ఎక్కువ ఉపగ్రహాలను ప్రయోగించడం ఈ కార్యకాలంలోనే జరిగింది, తద్వారా ప్రపంచంలోనే భారత్ శక్తి మరింత పెరిగింది.

ప్రపంచానికి భారత్, ప్రయోగ వేదికకి గమ్యంగా అవతరించింది. భారత్ ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రబిందువుగా కూడా అవతరించింది. మేకిన్ ఇండియా దిశగా భారత్ ఉత్పత్తి రంగంలో అనేక చర్యలు తీసుకుంటూ, స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. ప్రపంచ దృష్టాంతంలో, భారత్ మాటని శ్రద్ధగా వినడం జరుగుతుంది. కొన్ని సందర్భాలలో ప్రజలకి ఒక భ్రమ కలగొచ్చు మోదీ గారు లేదా సుష్మా గారి కార్య కాలంలో భారత గౌరవం గొప్పగా పెరిగిందని. ప్రజలు ఆ విధంగా అనొచ్చు కానీ వాస్తవం వేరేగా ఉంది. పూర్తి ఆధిక్యం ఉన్న ప్రభుత్వమే దీనికి మూల కారణం. ప్రపంచం కూడా పూర్తి ఆధిక్యం ఉన్న ప్రభుత్వాన్నే గుర్తిస్తుంది. గత 30 ఏళ్లుగా అటువంటి ప్రభుత్వం లేకపోవడం మన

దేశానికి అంతర్జాతీయ దృష్టాంతంలో ఎంతో నష్టం కలిగించింది. 2014లో, 30 ఏళ్ల తర్వాత పూర్తి ఆధిక్యం కలిగిన ఈ దేశ నాయకుడు ప్రపంచంలోని వేరే నాయకుడిని కలిసినప్పుడు, అతనికి తెలుసు అతనికి ఏవిధమైన జనాదేశం ఉందో, ఆ విధమైన ఆధిక్యం ఒక బలం. గత ఐదేళ్లలో, భారత్, ప్రపంచంలో తన ముద్రని వేసుకుంటున్నప్పుడు ఆ శక్తిని నేను ఆస్వాదించాను. ఈ విధమైన గౌరవానికి కారణం మోదీ లేదా సుష్మా గారు కాదు, 2014లో 125 కోట్ల భారతీయులు తీసుకున్న నిర్ణయ ఫలితం ఇది. అదే విధంగా, ఇదే కార్యకాలంలో ప్రపంచంలోని ఎన్నో సంస్థల్లో భారత్ కు ప్రాతినిధ్యం లభించింది. భారత్ అభిప్రాయం ప్రపంచవ్యాప్తంగా వినడం జరిగింది. ఇదే సభ, బంగ్లాదేశ్ తో ఉన్న భూవివాదాన్ని సర్వ సమ్మతితో పరిష్కరించింది. ఒక భారీ లక్ష్యాన్ని సాధించాం. ఈ సమస్య, భారత్ నుంచి వివాదాస్పదంగా బంగ్లాదేశ్ ఏర్పడినప్పటి నుంచి ఎంతోకాలంగా ఉంది. కానీ ఇదే సభ ఈ సమస్యని పరిష్కరించింది. సమిష్టిగా పని చేయడం మన లక్షణం, సమ్మతి సందేశం ప్రపంచానికి గొప్ప శక్తిని ఇచ్చే సందేశం. ఈ సందర్భంగా ఈ సభ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అలాగే అన్ని రాజకీయ పార్టీలకు నా కృతజ్ఞతలు. అదేవిధంగా, మన విదేశాంగ విధానంలో కొత్త అంశం జనించింది. ప్రపంచంలో మానవ హక్కులు, మానవ విలువలు ఒక ప్రత్యేక సమూహ అధికారంగా మిగిలిపోయాయి. మిగతా దేశాలకు వాటితో ఏ విధమైన సంబంధం లేనట్టుగా పరిస్థితులు ఉండేవి. మన దేశాన్ని, మానవ హక్కులను వ్యతిరేకించే దేశంగా చిత్రించబడింది కానీ మన దేశమే మానవత్వం గురించి, వసుధైక కుటుంబం గురించి మాట్లాడుతుంది.

గత ఐదు సంవత్సరాలలో నేపాల్ లో భూకంపం కానివ్వండి లేదా మాల్దీవులలో నీటి సంక్షోభం కానివ్వండి లేదా ఫిజీ లోని తుఫాన్ లేదా శ్రీలంకలో తుఫాన్ కానివ్వండి లేదా బంగ్లాదేశ్ ప్రజలు మ్యన్మార్ ప్రజల వల్ల ఎదుర్కొంటున్న కష్టాలు కానివ్వండి, లేదా విదేశాల్లో

చిక్కుకున్న భారతీయులు కానివ్వండి, యెమెన్ దేశం నుంచి కూడా భారత ప్రభుత్వం వేల మందిని కాపాడింది. నేపాల్ లో 80 దేశాలకు చెందిన పౌరులు చిక్కుకున్నప్పుడు వారిని సురక్షితంగా తీసుకు వచ్చి వారి వారి గమ్యాలకు చేరవేశాం. ఈ విధంగా భారత్ మానవత్వాన్ని చాటి చెప్పడంలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించింది. మేడం, యోగ - ప్రపంచానికే గర్వకారణం. ఇంతవరకూ ఐక్యరాజ్యసమితిలో ఆమోదించబడిన సంకల్పాలలో యోగాకు సంబంధించిన సంకల్పానికి అత్యధిక మద్దతు లభించి, వేగంగా ఆమోదించబడింది.

బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీల జయంతిని ఐక్యరాజ్యసమితి జరుపుకుంటుంది. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి 125 వ జయంతిని ప్రపంచంలోని అన్ని దేశాలు జరుపుకున్నాయి. మహాత్మా గాంధీ 150 వ జయంతి ని కూడా జరుపుకోవడం జరిగింది. "వైష్ణవ జన్ తో తేనే కహి యే" అనే పాట మన మది లో ఉంది. ఆ పాటని 125 దేశాలకు చెందిన ప్రసిద్ధ గాయకులు మహాత్మా గాంధీ గారి 150వ జయంతి నాడు పాడి, వారికి గొప్పగా నివాళి అర్పించారు. ఒక సున్నిత శక్తి ప్రపంచం మొత్తం ఎలా వ్యాపిస్తుందో ఈ ఉదాహరణ ద్వారా మనమందరము ఆస్వాదించవచ్చు. అలాగే 26 జనవరి నాడు అన్ని రాష్ట్రాలు, వారి శకటాలలో ప్రత్యేకంగా మహాత్మాగాంధీ గారిని కేంద్ర బిందువుగా ప్రదర్శించడం చూశాం. ఇది నిజమైన భావంతో మహాత్మా గాంధీ గారి 150వ జయంతిని మనం జరుపుకున్న విధానం, వారిని స్మరించుకున్న విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ సభా కార్యకాలంలోనే మనం రాజ్యాంగ దినోత్సవం జరుపుకున్నాం. మనం బాబాసాహెబ్ అంబేద్కర్ గారి 125 వ జయంతిని కూడా జరుపుకుని ఆ సందర్భంగా ఒక ప్రత్యేక చర్చ నిర్వహించాం. ఐక్యరాజ్యసమితి చేపట్టిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల కోసం మనం సమయాన్ని కేటాయించడం జరిగింది. అలాగే మనం అందరం కలిసి ఈ స్థిరమైన అభివృద్ధి

లక్ష్యాల గురించి ఈ కార్య కాలంలోనే చర్చించాం. మీ కార్య కాలంలోనే ఈ కొత్త ఒరవడిని సృష్టించడం జరిగింది, ఇది కేవలం మీ నాయకత్వంతోనే సాధ్యమయింది. కాబట్టి ఈ సభలోని సభ్యులందరికీ మీ నాయకత్వానికి వందనం చేస్తూ మా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

మేడం, 219 బిల్లులు ప్రవేశ పెట్టాం, 203 బిల్లుల్ని ఈ సభ ఆమోదించింది. ఈరోజు ఈ సభలోని సభ్యులకు 16వ లోక్ సభ విజయాల గురించి మాట్లాడే అవకాశం లభిస్తే వారి నియోజకవర్గంలోని ప్రజలతో ఎన్నికల సందర్భంగా, ఎన్నికల తర్వాత వారి అనుభవాలు పంచుకుంటారు. రాసే అలవాటు ఉన్న సభ్యులు వారి ఆత్మ కథని రాసినప్పుడు ,ఈ సభ, నల్లధనం, అవినీతికి వ్యతిరేకంగా చేసిన కఠినమైన చట్టాలను ఖచ్చితంగా ప్రస్తావిస్తారు. ఈ సభ, దేశంలో ఇంతవరకూ చేయని తీవ్ర ప్రభావం చూపించే చట్టాలను ఆమోదించింది. ఈ సభ కొన్ని ముఖ్యమైన చట్టాలను చేసింది. అవి విదేశాల్లో దాచిన నల్లధనాన్ని కి వ్యతిరేకంగా చట్టం, దివాలా తీసిన కంపెనీల కోసం చట్టం, బినామీ ఆస్తుల పై చట్టం, ఆర్థిక నేరాలు చేసి దేశం వదిలి పారిపోయిన వారికి వ్యతిరేకంగా చట్టం. గత ఐదు సంవత్సరాలలో ఈ సభ, నల్లధనం, అవినీతికి వ్యతిరేకంగా విదేశాలలో కూడా ప్రభావవంతంగా పని చేసే చట్టాలను తయారు చేసిందని బలంగా నమ్ముతున్నాను. ఇది ఇంకా ముందుకు తీసుకు వెళ్తాం. కాబట్టి, ప్రస్తుత తరాలే కాకుండా భవిష్యత్ తరాలు కూడా గౌరవమైన ఈ సభకు, అలాగే మీ సమర్థ నాయకత్వానికి ధన్యవాదాలు తెలియ చేస్తారు.

మేడం,ఈ సభ, అర్ధరాత్రి ఉభయసభల సమావేశాన్ని ఏర్పాటు చేసి జీఎస్టీ బిల్లును ఆమోదించింది. ప్రభుత్వం, మాజీ ఆర్థిక మంత్రి, అప్పటి రాష్ట్రపతి గారి సహకారంతో జిఎస్టి ని అమలు చేసింది. ప్రతి ఒక్కరికి గుర్తింపు లభించాలి. ఈ విషయంలో కూడా sabka saath sabka vikas అనే సిద్ధాంతాన్ని ఆచరించడం జరిగింది. ఆ విధంగానే ఈ సభ గొప్ప చట్టపరమైన శక్తి అయిన ఆధార్ బిల్లును కూడా ఆమోదించింది. ఆధార్ ప్రపంచంలోనే

విశిష్టమైనది. ఇంత భారీ కార్యాన్ని భారత్ ఎలా చేయగలిగినదో తెలుసుకోవడానికి ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. ఈ కార్యకాలంలోనే ఆధార్ చట్టాన్ని తీసుకు వచ్చి ఈ సభ చాలా గొప్ప పని చేసింది. మేడమ్, మన దేశానికి స్వాతంత్రం వచ్చింది కానీ, శత్రువుల ఆస్తిపై ఒక నిర్ణయం తీసుకోవడానికి ఏమి అడ్డంకి వచ్చిందో ఆ దేవుడికే తెలియాలి. శత్రువు ఆస్తుల చట్టాన్ని ఆమోదించడం ద్వారా 1947లో మనకి జరిగిన గాయానికి స్వస్థత చేకూర్చే స్పర్శను ఇచ్చినట్లయింది. సామాజిక న్యాయం కల్పించే దిశగా ఈ సభ,సమాజంపై దీర్ఘకాల ప్రభావాన్ని చూపించింది. ఎటువంటి చేదు అనుభవం లేకుండా, అగ్రకులాల లోని పేద వారి కోసం రిజర్వేషన్ కల్పించడం వెనుక బలమైన కారణం - ఎటువంటి అయోమయం, సందేహం లేకుండా సమాజంలోని అణగారిన వర్గాలకి ప్రాముఖ్యత ఇవ్వాలనే సంకల్పం. వారిని నమ్ముతూ ఈ చట్టాన్ని ఆమోదించడం జరిగింది. ఈ విషయంలో రెండు సభలకు చెందిన సభ్యులు ప్రశంసలకు అర్హులు, 10% రిజర్వేషన్ కల్పించడం ఒక గొప్ప విజయం. అలాగే సుప్రీం కోర్టు ద్వారా బిసి కమిషన్ కి సంబంధించి లేదా ఎస్సీ ఎస్టీ చట్టానికి సంబంధించి కలిగిన అపార్థాన్ని తొలగించడం జరిగింది. ప్రపంచంలోని సంపన్న దేశాలు, భారత్ 12 వారాల నుంచి 26 వారాల వరకు పెంచిన మాతృత్వ సెలవులకు ఆశ్చర్యపోయాయి. ప్రపంచం, భారత దేశాన్ని దూరదృష్టి గల దేశంగా చూస్తుంది. ఈ పనిని ఈ సభ ద్వారానే చేయగలిగాం. పార్లమెంట్ చట్టాలను చేస్తుంది. కానీ, ఈ దేశం, ప్రపంచం ఈ సభను కొన్ని చట్టాలను రద్దు చేసిన సందర్భంగా కూడా గుర్తు పెట్టుకుంటుంది. 1400 ఆటవిక చట్టాలను రద్దు చేసి ఈ సభ లోని సభ్యులు ఒక పరిష్కారం దిశగా మంచి ప్రారంభం ఇచ్చారు. 1400 చట్టాలను రద్దు చేసిన తర్వాత కూడా ఇది ఒక మంచి ప్రారంభం అని నేను చెప్పగలను. ఇంకా ఎన్నో పనులు చేయాల్సి ఉంది, దానికి ములాయం సింగ్ గారు ఆశీస్సులు తెలియజేశారు.

మన దేశాన్ని ఎక్కడికి తీసుకు వెళ్ళాలి అనుకున్నామో అక్కడికి తీసుకు వెళ్ళలేకపోయాము. మన జీతభత్యాలు మనమే నిర్ణయించుకోవడం పార్లమెంట్ సభ్యుల పై ఉన్న కళంకం. పార్లమెంట్ సభ్యుల జీతాలు పెరిగిన రోజు,మనకు ఎంత కావాలో అంత పెంచుకుంటామని, దేశం గురించి ఆలోచించమని అన్ని వర్గాల ప్రజలు విమర్శిస్తారు. ఇలా గత యాభై ఏళ్లుగా జరుగుతున్నది. మొట్టమొదటిసారిగా అటువంటి అపనింద నుంచి తప్పించుకోవడానికి సభ్యులు ఒక దారిని కనుగొన్నారు. ఇతరుల జీతాలు పెరిగినప్పుడే పార్లమెంట్ సభ్యుల జీతాలు పెరిగేలా రాజ్యాంగ నిబంధనను తొలిసారిగా రూపొందించాము. ఇప్పుడు పార్లమెంట్ సభ్యులు దానికి బాధ్యులు కారు, ఆ విధంగా వారు విమర్శల నుండి తప్పించుకోవచ్చు. అటువంటి ఒక మంచి నిర్ణయాన్ని సభ్యులందరూ గుర్తించి ప్రశంసించాలి, ఎందుకంటే సభ్యులందరూ గత ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న నింద నుండి విముక్తి పొందారు.

మన సహచరుడు జితేంద్ర గారు మంచి ఆహారాన్ని అందించారు కానీ బయట ధరల కంటే ఇక్కడి క్యాంటీన్లో ధరలు బాగా తక్కువ అని బయట విమర్శిస్తున్నారు. పార్లమెంట్ సభ్యులు ఎందుకలా చేస్తున్నారు అని అంటారు. జితేంద్ర గారి నాయకత్వంలో పని చేసిన కమిటీ నా మనోభావాలను గౌరవించినందుకు చాలా సంతోషం. అలాగే స్పీకర్ మేడం గారు ఆ నిర్ణయాన్ని స్వీకరించి మనందరికీ కూడా తక్కువ ధరలకే లభించే ఆహారం నుండి విముక్తి కలిగే దిశగా అడుగులు వేశారు.ఈ నిర్ణయం వల్ల మన జేబుపై కొంత అధిక భారం పడవచ్చు కానీ రాబోయే రోజుల్లో ఈ దిశగా మనం మరింత శక్తివంతం అవుతామని నమ్ముతున్నాను.

అలాగే ఈ సభ మరిన్ని విషయాలు ఆనందిస్తుంది. కొన్ని సందర్భాలలో మనం భూకంపం వస్తుందని విన్నాం కానీ ఐదు సంవత్సరాల ఈ కార్యకాలంలో ఏ భూకంపమూ రాలేదు. కొన్ని సందర్భాలలో కొంతమంది పెద్దలు ఎన్నో పెద్ద మాటలు మాట్లాడారు కానీ ఈ

సభా సాంప్రదాయాలు, ప్రజాస్వామ్య గౌరవం ఎంత గొప్పదంటే ఏ విధమైన భూకంపము లేదా మరేదయినా ఈ భవ్యమైన నిర్మాణాన్ని ఏమీ చేయలేకపోయాయి.

ఇది ఈ సభ, ప్రజాస్వామ్య బలం. ఎన్నో సార్లు చేదు వాగ్వాదాలు జరిగాయి. కొన్నిసార్లు ఇటువైపు నుండి అయితే, కొన్నిసార్లు అటువైపు నుంచి. మరికొన్ని సందర్భాలలో వాడకూడని పదాలు వాడడం జరిగింది. ఈ సభలో ఇటువైపు నుండి కానివ్వండి లేదా అటు వైపు నుండి కానివ్వండి, ఈ సభ నాయకుడిగా నేను చెప్పేది ఒక్కటే 'మిచ్ఛామి దుఃఖడం'. 'మిచ్ఛామి దుఃఖడం' క్షమకు సంబంధించి ఒక పెద్ద సందేశాన్ని జైన పర్యుశన ఉత్సవంలో ఇవ్వబడింది. నేను ఆ భావాన్ని ఇక్కడ తెలియజేస్తున్నాను. నేను మల్లిఖార్జున్ గారితో తేలికైన సంభాషణలు చేసేవాణ్ని. వారి గళం ఈరోజు సహకరించి ఉంటే మనం వారి నుండి కొంత లాభపడే వారం. కొన్నిసార్లు వారి మాటలు నాకు వినబడేవి కావు, ఆయన ఏం మాట్లాడారో నేను తర్వాత చూసేవాణ్ణి. వారి మాటలు కొన్ని సందర్భాలలో నాలోని ఆలోచన ప్రక్రియని ఉత్తేజితం చేసేది. ఒక విధంగా నా ఉపన్యాసంలో ఉండే విషయాలు అలాంటి ఆలోచన నుంచి లభించినవే. అందుకు నేను ఖర్గే గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. సభలో పూర్తి సమయం కూర్చోవడం అవసరం. అద్వాని గారు సభలో పూర్తి సమయం కూర్చోవడం చూశాం, అలాగే ఖర్గే గారు కూడా సభలో పూర్తి సమయం కూర్చుంటారు. సభ్యులందరూ ఈ విషయం నేర్చుకోవాలి. ఇది చిన్న విషయం కాదు వారు ప్రజాప్రతినిధిగా 50 సంవత్సరాలు పూర్తి చేయనున్నారు. నేను ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధిగా వారి బాధ్యతలను చక్కగా నిర్వర్తించినందుకు వారికి గౌరవప్రదమైన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నేను మొదటిసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. హత్తుకోవడం, మెడకు చుట్టుకోవడం మధ్య తేడా గ్రహించాను. మొదటిసారిగా ఈ సభలో కొంతమంది కళ్ళతో హావభావాలు వ్యక్తీకరించడం చూశాను. కళ్ళతో

హావభావ ప్రకటన అనే ఆటను నేను చూశాను. అలాగే మన దేశంలోని మీడియా కూడా ఆనందించింది. సభా మర్యాదలను కాపాడడం ప్రతి సభ్యుడి బాధ్యత. మేము ఈ దిశగా మా వంతు ప్రయత్నం చేసాము. ఈసారి నా సహచరుల ప్రతిభని చూసే అవకాశం నాకు లభించింది. ఒక రోజు నేను రాష్ట్రపతి గారి ప్రసంగం పై మాట్లాడుతున్నప్పుడు ఈ సభలో ఎవరో గట్టిగా నవ్వడం వినిపించింది, అలాంటి నవ్వు వినోద పరిశ్రమకు ఎంతో అవసరం. అలాంటివి యూట్యూబ్ లో చూపించే అవకాశం కల్పించాలి. ఇక్కడ నేను విన్న నవ్వు మంచి కళాకారులు కూడా వినిపించ లేరు. టిడిపి సభ్యుడు శ్రీ నారమల్లి శివప్రసాద్ గారు ఇక్కడ లేరు, వారు విచిత్రమైన వేషధారణతో ఇక్కడికి వచ్చేవారు. వారి వేషధారణ సభ్యులను ఆకర్షించేది. మనం ఈ కార్యకాలం నవ్వులతోనూ, సంతోషంగానూ ముగిస్తున్నాము. నాలాంటి ఒక కొత్త సభ్యుడు మీ నుండి ఎంతో నేర్చుకున్నాడు. నేను కొత్త సభ్యుడిని అయినా, మీ సహకారంతో ఏ విధమైన ఇబ్బంది ఎదుర్కోలేదు. నేను నా సహసభ్యులందరికీ నా తొలి కార్యకాలంలో వారు అందించిన మార్గదర్శకత్వం, నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నేను గౌరవనీయులైన శ్రీ ములాయం సింగ్ యాదవ్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. వారి అభిమానం నాకు ఎంతో విలువైనది.

వారి అభిమానం మన అందరికీ విలువైనది. మన సీనియర్ల అభిమానం కూడా విలువైనది. నా గుండె లోతుల్లో నుంచి అందరికీ ధన్యవాదాలు. సభా కార్యకలాపాలు నడపడంలో సహకరించిన సిబ్బంది సభ్యులందరి పట్ల శ్రద్ధ వహించినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. వారు సభా కార్యకలాపాలు సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరోగ్యకర ప్రజాస్వామ్య సంప్రదాయాల కోసం ప్రజల వద్దకు వెళ్తున్న సభ్యులందరికీ నా శుభాకాంక్షలు. ఆరోగ్యకరమైన సాంప్రదాయాల్ని ముందుకు తీసుకువెళుతూ న్యాయమైన ఎన్నికలలో పోటీ చేసి, ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య

సంప్రదాయాన్ని తయారు చేయడంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తారని ఆకాంక్షిస్తున్నాను. మరోసారి ఈ సభ లోని సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

లోక్ సభ స్పీకర్ గా శ్రీ ఓం బిర్లా
ఎన్నికైన సందర్భంగా ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి స్వాగతోపన్యాసం.

19 జూన్ 2019

శ్రీ ఓం బిర్లా లోక్ సభ స్పీకర్ గా ఎన్నికైన సందర్భంగా ప్రధాన మంత్రి గారి ప్రసంగం - 19 జూన్ 2019

గౌరవనీయులైన స్పీకర్ సర్,

ఈ పదవిని మీరు స్వీకరించడం ఈ సభ లోని సభ్యులు అందరూ ఎనలేని సంతోషాన్ని పొందుతున్నటువంటి, గర్వపడుతున్నటువంటి సందర్భం. పాత సభ్యులకు మీతో ఇప్పటికే ఎంతో బాగా పరిచయముంది. ఒక చట్ట సభ సభ్యుడిగా కూడాను, రాజస్థాన్ లో మీరు ఒక సానుకూలమైనటువంటి భూమికను పోషించివున్నారు. మరి రాజకీయాలతో సంబంధం కలిగివున్న వారికి ఈ విషయం తెలుసు.

విద్యార్థి సంఘాలలో చేరడం, విశ్వవిద్యాలయ విద్యార్థి సంబంధ కార్యక్రమాలకు నేతృత్వం వహించడం మొదలుకొని ఏ విరామం లేకుండా ప్రజా జీవనంలో పాలుపంచుకొంటున్న వ్యక్తిని స్పీకర్ పదవి కి మేము అందరమూ ఏకగ్రీవంగా ఆమోదాన్ని తెలపడం అన్నది ఈ రోజున మనందరికి గర్వకారకమైన విషయం. అంతేకాక భారతీయ జనతా పార్టీ కార్యకర్తలలో ఒకరిగా అతడు విద్యార్థి ఉద్యమంలో నుండి వచ్చి యువ మోర్చా సంస్థ లో దాదాపుగా 15 సంవత్సరాల పాటు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో, ఇంకా జాతీయ స్థాయిలో కృషి చేశారు. సంస్థకు అనేక సంవత్సరాల పాటు పని చేసే అవకాశాన్ని నేను కూడా పొందాను. ఈ కారణంగా మేము ఇరువురం సహచరులు గా కలసి పని చేసే అవకాశాన్ని దక్కించుకొన్నాము.

కోటా గడ్డ ఒక విధంగా విద్యకు సంబంధించినంత వరకు కాశీ వలే తయారు అయింది. భవిష్యత్తుకు ప్రాధాన్యాన్ని ఇచ్చే వారు, వారి మదిలో కోటాను గురించి ఆలోచిస్తూ ఉంటారు;

కోటా లో ఉండాలని, కోటా లో చదువుకోవాలని, మరి అలాగే కోటా లో ఒక బ్రతుకు తెరువు ను సముపార్జించుకోవాలని వారు కోరుకుంటారు. రాజస్థాన్ లో ఉన్న ఈ చిన్న నగరం ఒక విధంగా చూస్తే, ఒక బుల్లి భారతదేశం మాదిరిగా పేరు తెచ్చుకొంది. మరి కోటా లో పరివర్తన శ్రీ ఓమ్ బిర్లా గారి నాయకత్వం, తోడ్పాటు, చొరవల వల్ల సాధ్యమయ్యింది.

సాధారణంగా రాజకీయ వాదులకు ప్రజా జీవనంలో ఒక ముఖ చిత్రం అంటూ ఏర్పడింది. ఇది ఎటువంటి చిత్రం అంటే, మేం ఒకరిని మరొకరం ఓడించుకోవడం కోసం రాజకీయాలు ఆడుతూ, ఎల్లవేళలా వాదులాటలలో, పోరాటాలలో నిమగ్నం అయివుంటాము అని. ఏమైనప్పటికి, నిజం అన్నది ఒక్కొక్క సారి బయటకు రాదు. ఇటీవల, రాజకీయ జీవనంలో సామాజిక సేవ శాతం అధికంగా ఉన్నప్పుడు సమాజం లో ఆమోదనీయత మరింత ఎక్కువగా ఉంటుందని దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. కరడుగట్టిన రాజకీయాల యుగం మసకబారిపోతోంది. ఓమ్ బిర్లా గారు ఎటువంటి వ్యక్తి అంటే, ఆయనకు రాజకీయాలతో గల అనుబంధం ఒక ప్రజా ప్రతినిధిగా అత్యంత స్వాభావికం అయినటువంటిది. అయితే, దీనికి భిన్నం గా ఆయన యావత్తు కార్యజీవనం, సామాజిక సేవ చుట్టూ తిరుగుతూ వచ్చింది. సామాజిక జీవనం లో ఏదైనా సమస్య ఉందనుకొన్నప్పుడల్లా, ముందుగా చెంతకు చేరేది ఆయనే. నాకు స్పష్టం గా జ్ఞాపకం ఉంది.. గుజరాత్ భూకంపం కాలం లో ఆయన చాలా కాలం పాటు గుజరాత్ లో ఉన్నారు. ఆయన తన ప్రాంతం నుండి యువ సహచరుల ను తీసుకు వచ్చారు. స్థానిక సదుపాయాన్ని దేనిని ఉపయోగించుకోకుండానే ఆయన తన వద్ద అందుబాటులో ఉన్న వనరులతో దీర్ఘ కాలం పాటు ప్రజలకు సేవలు చేశారు. కేదార్‌నాథ్ విపత్తు వేళ, ఆయన తన బృందం తో పాటు మరొక్క మారు ప్రజలకు సేవ చేయడం కోసం పూనుకున్నారు. కోటా లో కూడాను శీతకాలంలో ఎవరి దగ్గర అయినా దుప్పటి లేదు అంటే ఆయన రాత్రి అంతా కూడాను కోటా లో గాలించి ప్రజల తోడ్పాటుతో దుప్పట్ల ను సర్దుబాటు

చేసి మరీ అవసరమయినవారికి పంచిపెట్టే వారు. ఆయన ప్రజా సేవని ఒక ఉద్యమంలా చేసారు. అది మన వంటి ఎంపీ లు అందరికి ప్రేరణను అందించేటటువంటిది. కోటా లో ఏ ఒక్కరు ఆకలి కడుపు తో నిద్రించకూడదన్నది ఆయన లక్ష్యంగా ఉండింది. మరి ఇందుకోసమే ఆయన "ప్రసాదం" పేరు తో ఒక పథకాన్ని తీసుకు వచ్చారు. ఈ పథకం ఇప్పటికి కూడాను అమలు అవుతోంది. ప్రసాదం పథకంలో భాగంగా ఆయన ప్రజల సహకారంతో అన్నార్తుల ఆకలిని తీర్చుతూ వచ్చారు. ఇదే విధంగా పేద వారికి, అనాథలకు వస్త్రాలను అందించేందుకు ఆయన ఒక 'పరిధాన్' పథకాన్ని ఆరంభించారు. 'పరిధాన్' ఉద్యమం ద్వారా ఆయన పేదల కోసం పాదరక్షలను కూడా సేకరించే వారు. ఎవరైనా జబ్బు పడినప్పుడు రక్తదానం ఏర్పాటు చేయవలసి వచ్చినప్పుడు లేదా ఆసుపత్రుల లో మరేదైనా సేవ అవసరం అయినప్పుడు ఆయన ఆ పనులను ప్రజల తోడ్పాటుతో పూర్తి చేసే వారు. ఒక రకంగా, ఆయన రాజకీయ దృష్టి అంతా కూడాను ప్రజా ఉద్యమం కన్నా ప్రజా సేవయే అని చెప్పవచ్చును.

ప్రస్తుతం అటువంటి సున్నిత వ్యక్తిత్వం స్పీకర్ పీఠాన్ని అలంకరించినందువల్ల, సంవత్సరాల తరబడి సమాజం పట్ల దయతో కూడిన జీవనాన్ని గడుపుతూ వచ్చి, ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటున్న కారణం గా ఒక ప్రేరణ వలె ఆయన మనకు క్రమశిక్షణను బోధిస్తారని, మనకు ప్రేరణ గా నిలుస్తారని, ఈ సభ దేశాని కి తన శ్రేష్టమైనటువంటి తోడ్పాటును అందించగలుగుతుందని నేను నమ్ముతున్నాను. మెరుగైన పద్ధతి లో కర్తవ్య నిర్వహణ చేయగలిగినటువంటి వ్యక్తి ఆయన.

సభలో కూడాను, మనం చూశాము, ఆయన ఎంతో వినమ్రతతో మాటలాడుతారు; చిరునవ్వులు చిందిస్తుంటారు. నాకు ఒక్కొక్కసారి భయం వేస్తుంటుంది ఎవరైనా ఆయన అణకువను, మనస్సాక్షిని వారి ప్రయోజనాల కోసమని ఉపయోగించుకొంటారేమోనని. ఇంతకు ముందు లోక్ సభ స్పీకర్ బోలెడన్ని సవాళ్ళ ను ఎదుర్కోవలసి వచ్చింది. అదే

సమయం లో రాజ్య సభ చైర్‌మన్ ముందు మాత్రం కాస్తంత తక్కువ సవాళ్ళు ఎదురయ్యేవి. ఏమైనప్పటికి, ప్రస్తుతం ముఖ చిత్రం భిన్నంగా మారింది. మునుపటి సమావేశాలను మనం ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకొంటే గనుక, మన స్పీకర్ మేడమ్ ఎల్లప్పుడూ ఉల్లాసంగా ఉంటూ, నవ్వు ముఖం తో కనపడే వారని ప్రతి ఒక్కరూ ఒప్పుకొంటారు. ఆమె ఎవరిని అయినా మందలించవలసి వచ్చినప్పుడు సైతం గద్దించిన అనంతరం నవ్వేసే వారు. కానీ, ఆమె ఒక కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. స్పీకర్ సర్, మేము మీ విధులు సులువు గా పూర్తి కావడం కోసం ఈ సభ పక్షాన, పాలక పక్షం తరఫున మేము 100 శాతం ప్రయత్నాలు చేస్తాము అని మీకు నేను హామీని ఇస్తున్నాను. ఈ సభ ను నడపడంలో ఈ పక్షం ద్వారా నిబంధనలను అతిక్రమించడం లేదా అంతరాయాలను కల్పించడం జరిగింది అంటే గనక వారికి, మా వంటి వారికి వారి స్థాయిని గుర్తు చేసేందుకు మీకు సర్వ హక్కులు ఉంటాయి; మరి దీనిని మేము స్వాగతిస్తాము. దీనికి కారణం ఈ సభ గౌరవాన్ని నిలబెట్టడం అనేది మన అందరి బాధ్యత కాబట్టి. మునుపు మొదటి మూడు, నాలుగు సంవత్సరాలు ప్రశాంతంగా గడచేది. ఒక్క ఎన్నికల సంవత్సరం లో మాత్రమే కొంత సమస్యాత్మకంగా ఉండేది. కానీ, ఇప్పుడు ప్రతి మూడు, నాలుగు నెలల కు ఒక ఎన్నిక జరుగుతోంది. ఇక్కడ నుండి సందేశాలు ఇవ్వాలని కోరుకొనేవారు ఉన్నారు. అటువంటి సందర్భాలు మీకు ఒత్తిడిని సృష్టించవచ్చు. అయినప్పటికీ, ఒక మంచి నాణ్యమైన వాదన, ముఖ్యమైన అంశాలకు సంబంధించి చర్చోపచర్చలు జరిగేటట్టు, అలాగే నిర్ణయాలను సమష్టిగా తీసుకొనేటట్టు సభ ప్రయత్నిస్తుంది. ఈ ఆశ తో, మీకు పాలక పక్షం తరఫున, సభ తరఫున శుభాకాంక్షల ను నేను తెలియ జేస్తున్నాను. మీకు ఇవే ధన్యవాదాలు.

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

25 జూన్ 2019

లోక్ సభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం. - 25 జూన్ 2019

గౌరవనీయులైన స్పీకర్ గారు, 17 వ లోక్ సభ ఏర్పడిన తరువాత రాష్ట్రపతి గారి ప్రసంగం పై కృతజ్ఞతలు తెలిపే తీర్మానాన్ని సమర్థించేందుకు, ధన్యవాదాలు తెలిపేందుకు నేను ఇప్పుడు మాట్లాడుతున్నాను. రాష్ట్రపతి గారు తన ప్రసంగంలో మనం దేశాన్ని ఎక్కడి కి తీసుకు వెళ్ళాలి అనుకుంటున్నామో, ఏ విధంగా తీసుకెళ్లాలి అనుకుంటున్నామో అలాగే భారతదేశంలోని సామాన్యుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి ఏ విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటున్నామో, ఏ విషయాలను మనం నొక్కి చెప్పాలనుకుంటున్నామో దానికి సంబంధించిన ఒక మార్గం వారు వివరించడానికి ప్రయత్నించారు. రాష్ట్రపతి గారి ప్రసంగంలో దేశంలోని సామాన్యుల ఆశలు, ఆకాంక్షలతో పాటు ఈ సభకి మనల్నిఎన్నుకొని ఒక విధంగా వాటిని ప్రతిధ్వనించేలా చేశారు. అందుకే దేశంలోని ప్రజలందరికీ నా ధన్యవాదాలు.

ఒక శక్తివంతమైన, సురక్షితమైన, సంపన్నమైన, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లే దేశం గురించి ఎంతో మంది మహాపురుషులు కలలు కన్నారు. వాటిని నెరవేర్చడానికి సంకల్పించి అధిక వేగంతో, తీవ్రతతో మనందరమూ కలిసిమెలిసి ముందుకు వెళ్లాలి. దేశం కూడా అదే ఆకాంక్షిస్తోంది, నేటి ప్రపంచ వాతావరణంలో ఈ అవకాశాన్ని భారతదేశం వదులుకోకూడదు. అలాంటి మానసిక స్థితి తో మనం ముందుకు వెళదాము. మనందరం కలిసి ముందుకు సాగినట్లు అయితే దేశ ఆకాంక్షలను నెరవేర్చడానికి మనం ఎదుర్కొనే సవాళ్లను, అడ్డంకులను మనం అధిగమించగలమని నమ్ముతున్నాను.

ఈ చర్చలో దాదాపు 60 మంది గౌరవనీయ సభ్యులు పాల్గొన్నారు. తొలిసారిగా ఎన్నుకోబడిన వారు ఎంతో చక్కగా వారి అభిప్రాయాలని వెలిబుచ్చే ప్రయత్నం చేశారు. చర్చ అర్థవంతం చేయడానికి ప్రయత్నించారు, అనుభవజ్ఞులైన వారు కూడా వారి పద్ధతిలో ఈ చర్చని ముందుకు తీసుకు వెళ్లారు. ఈ చర్చని అర్థవంతంగా చేసిన అధిర్ రంజన్ చౌదరి గారు, టి ఆర్ బాలు గారు దయానిధి మారన్ గారు సౌగత రాయ్ గారు, జయదేవ్ గారు మహువా మోయిత్రా గారు, మిథున్ రెడ్డి గారు, వినాయక్ రౌత్ గారు రాజీవ్ రంజన్ సింగ్ గారు, పినాకి మిశ్రా గారు, నామా నాగేశ్వరరావు గారు మహమ్మద్ ఆజం ఖాన్ గారు, అసదుద్దీన్ ఒవైసీ గారు, ప్రతాప్ చంద్ర సారంగి గారు, డాక్టర్ హినా గావిట్ గారు, వీరందరికీ నా ధన్యవాదాలు.

మనమందరం మనుషులం అన్నది వాస్తవం, గత 30రోజుల ప్రభావం మనపై కొనసాగుతూనే ఉంటుంది. ఆ ప్రభావం నుంచి బయటపడడం కష్టం. అందుకే ఎన్నికల ప్రసంగాల ప్రభావం ఇక్కడ కనిపించింది. అవే కథలు ఇక్కడ వినిపించాయి. ఇది ప్రకృతి నియమం. మీరు ఈ సభ ని గౌరవనీయమైన స్థానం లో ఉండి నడిపి ఉన్నారు. అలాగే చర్చలో ప్రతి ఒక్కరిని భాగస్వామిగా చేసి ముందుకు తీసుకువెళ్లారు. మీరు ఇప్పుడున్న స్థానం మీకు కొత్త. కొత్త సభ్యులు ఉన్నప్పుడు, కొంతమంది వారిని మొదట్లోనే ఇబ్బంది పెట్టడానికి చూస్తారు. అయితే ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ మీరు ప్రశంసనీయమైన పద్ధతిలో పనిచేశారు అందుకు మీ అందరినీ నేను అభినందిస్తున్నాను. అలాగే కొత్త స్పీకర్ గారికి సహకరించినందుకు సభకు కృతజ్ఞతలు.

గౌరవనీయులైన స్పీకర్ గారు

అనేక దశాబ్దాల తర్వాత దేశంలో ఒక బలమైన ఆధిక్యం తో ప్రభుత్వం వచ్చింది. మరోసారి అదే ప్రభుత్వాన్ని మరింత ఆధిక్యంతో అధికారంలోకి తీసుకువచ్చారు. ఈరోజు

సరళమైన వాతావరణంలో, ప్రభావవంతమైన ప్రజాస్వామ్యం కలిగిన భారతదేశంలో ప్రతి భారతీయుడు ఓటర్ల అవగాహనని గుర్తించి గర్వ పడవచ్చు. ఓటర్ తన కన్నా దేశాన్ని ఎక్కువ ప్రేమించి, దేశం కోసం నిర్ణయం తీసుకుంటున్నాడు. ఈ ఎన్నికలలో ఇది స్పష్టంగా కనిపించింది. కాబట్టి ఈ దేశంలోని ఓటర్లందరికీ నా అభినందనలు.

నేను, నా జట్టు పూర్తిగా కొత్త వారిమయినా, ఎన్నో విషయాలు తెలియకపోయినా, 2014లో ఈ దేశం మాకు అవకాశం ఇచ్చి పరిస్థితుల నుండి బయటపడడానికి ఒక ప్రయోగం చేసింది. అందుకు మేము సంతోషిస్తున్నాము కానీ 2019లో మాకు ఇవ్వబడిన ఆదేశం మిమ్మల్ని పరీక్షించిన తర్వాత ఇవ్వడం జరిగింది. వారు మమ్మల్ని పరీక్షించి అర్థం చేసుకుని ఆ తర్వాత మమ్మల్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చారు. ఇది ప్రజాస్వామ్య గొప్ప బలం. ప్రతి ఒక్కరూ, గెలిచిన వారు, ఓడిన వారు, లోపలి వారు బయటి వారు అందరూ కూడా విజయవంతంగా కృషిచేసి సర్వజన హితాయ సర్వజన సుఖాయ (అంటే అందరి మంచి కోసం, అందరి సంతోషం కోసం) అనే సిద్ధాంతాలను అమలు చేయడానికి గత ఐదు సంవత్సరాలుగా ప్రజల సంక్షేమం కోసం కష్ట పడ్డారు. ప్రజలు మరోసారి దీనికి ఆమోదం తెలిపి దేశానికి సేవ చేయడం కోసం మమ్మల్ని అధికారంలోకి తీసుకు వచ్చారు.

గౌరవనీయులైన స్పీకర్ గారు, భగవంతుని స్వరూపమైన ప్రజలు మన పనిని ఆమోదించడం కంటే తృప్తికరమైన విషయం ఏమీ లేదు. ఇది గెలుపు, ఓటమి లేదా గణాంకాలకు సంబంధించిన ఆట కాదు. ఇది ప్రజల కోసం జీవించడం, పోరాడటం లాంటిది. గత ఐదు సంవత్సరాల అకుంఠిత అంకితభావం యొక్క ఫలితాలు ఆధ్యాత్మిక అనుభవానికి సమానం. కాబట్టి నా ఆలోచనలు గెలుపు, ఓటములకు అతీతం. భారతీయుల ఆశలు, ఆకాంక్షలు, కలలు నా మదిలో ఎప్పుడూ ఉంటాయి.

గౌరవనీయులైన స్పీకర్ గారు, 2014లో ఈ దేశ ప్రజలు నాకు అవకాశాన్ని ఇచ్చినప్పుడు నా అభిప్రాయాలను సెంట్రల్ హాల్లో మొదటిసారిగా చెప్పాను. ఐదు సంవత్సరాల తర్వాత ప్రజలు ఈవీఎం పై మీటని నొక్కి వారి సంతృప్తిని వ్యక్తం చేశారని నేను తృప్తికి లోను కాగలను. ఈ చర్చ ఆరంభంలో మొదటిసారి ఎంపీగా ఎన్నికైన శ్రీ ప్రతాప్ సారంగి గారు, గిరిజన సమాజానికి చెందిన నా సోదరి డాక్టర్ గావిట్ గారు విషయాల గురించి అన్ని సూక్ష్మ అంశాలను మన ముందు ఉంచారు. అది విన్న తర్వాత నాకు ఇంకేమి జోడించాల్సిన అవసరం లేదనిపిస్తుంది.

గౌరవనీయులైన స్పీకర్ గారు, ప్రజా జీవితంలో మనకి మార్గనిర్దేశం చేసిన గొప్ప వ్యక్తిత్వాలు ఎప్పుడూ పేదల సంక్షేమం గురించి చెప్పేవారు. పూజ్య బాపూజీ, బాబాసాహెబ్ అంబేద్కర్ గారు, దీనదయాళ్ ఉపాధ్యాయ గారు అందరూ ఇదే మాట చెప్పారు. గత ఐదేళ్ళ పదవీకాలంలో, ఎవరు లేని వారికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భావనతో మేము పని చేశాము. స్వాతంత్ర్యం తరువాత మనము అనుకోకుండా ఒక సంస్కృతిని స్వీకరించాం, దానిని వ్యాప్తి చేసి సామాన్యుడు తన హక్కులను సాధించుకోవడానికి సవాళ్లను, అడ్డంకులను సృష్టించాము. నేను ఎవరిని నిందించడం లేదు, కానీ వ్యవస్థ సామాన్య ప్రజలకు వారి హక్కులు పొందడానికి ఇబ్బంది లేకుండా చూడాలి కదా? వ్యవస్థ అలా ఉండాలని మనము భావించాము.

మార్పు తీసుకురావడానికి చాలా సమయం పడుతుందని నాకు తెలుసు. రాష్ట్రాలన్నిటిని ఒక తాటి పైకి తీసుకు రావడం కష్టం. 70 ఏళ్లుగా మనల్ని పట్టి పీడిస్తున్న వ్యాధులని ఐదు సంవత్సరాలలో నయం చేయడం కూడా కష్టం. ఎన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ మనము ఎన్నుకున్న మార్గం నుంచి దారి మళ్లకుండా, నీరుగార్చకుండా నిబద్ధతతో నడుస్తున్నాం. ఈ దేశం ఏది నిజమో ఏది అబద్ధమో చెబుతోంది. మరుగుదొడ్డి

అనేది కేవలం ఒక కాంక్రీట్ నిర్మాణం కాదని గ్యాస్ అంటే కేవలం ఆహారం వండే సాధనం కాదని దేశం గ్రహించింది. ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకాల వెనుక ఉద్దేశం ఏమిటో ఈ దేశం అర్థం చేసుకుంది. 'నేను గ్యాస్ అడగలేదు నా జీవితమంతా విద్యుత్తు లేకుండా గడిపాను, అయినా వాళ్ళు ఎందుకు ఈ పని చేస్తున్నారు?' ఇంతకుముందు ఆ పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్న ఉత్పన్నమయ్యేది. ఈ రోజు వారు విశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. అందుకే మేము ఎందుకు ఈ పనులు చేస్తున్నాము అని అడుగుతున్నారు. 'వారు ఆ పనులు ఎందుకు చేయడం లేదు?' నుంచి 'వారు ఎందుకు చేస్తున్నారు?' అనే ప్రశ్నల మధ్య ప్రయాణం సుదూరమైంది. కానీ ఈ రోజు వారికి నమ్మకం ఉంది, కొత్త సామర్థ్యాలను మనదేశంలో అనుభవిస్తున్నారు. మేము దానిని ముందుకు తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తున్నాము.

ఒక సంక్షేమ రాజ్యం పేదరికంతో పోరాడుతున్నప్పుడు ప్రజలకు సులభతరమైన జీవితాన్ని అందించాలనుకోవడం వాస్తవం, కానీ అదే సమయంలో దేశం కూడా అభివృద్ధి చెందాలి. పేద ప్రజలను అభివృద్ధి చేయాలి, వారికి సాధికారిత అందించాలి కానీ అదే సమయంలో ఆధునిక భారతదేశం ముందుకు సాగాలి. అందుకే అభివృద్ధి ధార, సామాన్యుల సంక్షేమం తో పాటు దేశంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే దిశగా పథకాలను అమలు చేయడంపై దృష్టి సారించాలి. మేము ఈ రెండు విషయాలపై దృష్టి పెట్టాము. ఆధునిక భారత దేశాన్ని నిర్మించడం కోసం హైవేలు, ఐవేలు, రైల్వేలు, జలమార్గాలు, రోడ్లు, UDAN పథకం, స్టార్టప్ లు, ఆవిష్కరణలు, ప్రయోగశాలలు, చంద్రయాన్ లాంటివి ఎన్నో చేశాము. అలాగే మనము అన్ని సవాళ్ళతో పోరాడాలి.

ఎన్నో కొత్త విషయాలు గురించి ఇక్కడ మాట్లాడారు. కొన్ని కఠినమైన విషయాలని ఎన్నికల మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తూ ఇక్కడ చెప్పబడ్డాయి. ప్రతి ఒక్కరికి ఒక వ్యక్తిగత

ఎజెండా ఉంటుంది. నేను దానిపై వ్యాఖ్యానించను. అయితే మన అధికారాన్ని ఎవరూ కించపరచలేరు అని పొరపాటున కూడా మనం చెప్పకూడదు. ఇతరులని కించ పరుస్తూ మనం మన సమయాన్ని వృధా చేయకూడదు. మీరు మీ గాంబీర్యం పట్ల సంతోషంగా ఉండండి. మీరు ఎత్తులో తేలుతూ నేలని చూడలేకపోతున్నారు, మీ మూలాల నుంచి మీరు వేరు చేయబడి ఉన్నారు. నేలపై ఉన్న వారిని మీరు తక్కువగా చూస్తున్నారు, అందుకే మీ గర్వం నాకు మంచిది. మీరు అలాగే ఉంటారని ఆశిస్తున్నాను. గర్వం లో మాకు మీతో పోటీ లేదు. ఎందుకంటే మా కల నేలలో పాతుకుపోయి ప్రజలకి దగ్గరగా ఉండాలని కోరుకోవడమే. దేశాన్ని బలోపేతం చేయడానికి మూలాలతో ముడిపడి ఉండాలి అదే మా స్వప్నం. అందుకే మేము పోటీలో లేము. వారిలోని గర్వం, పొగరు పెరుగుతూనే ఉండాలని అందుకు మా అభినందనలు వారికి తెలియజేస్తున్నాను. కొంతమంది వ్యక్తుల గురించి ప్రస్తావించడం, ప్రశంసించడం జరిగింది. ఒకవేళ వారిని ప్రస్తావించకపోయినా దానిని అవమానంగా తీసుకుంటున్నారు. ఆ ఉద్దేశం లేన్నప్పటికీ అలా జరుగుతూ ఉంటుంది.

2004కు ముందు అటల్ గారి ప్రభుత్వం ఉండేది ఆ తర్వాత 2004 నుండి 2014 వరకు పరిపాలించారు. వారు ఒక్కసారి కూడా అటల్ గారి ప్రభుత్వం తీసుకున్న మంచి చర్యలను లేదా కార్యక్రమాలను ప్రశంసించ లేదని నేను సవాలు చేయగలను. అటల్ గారి ప్రభుత్వాన్ని వదిలేయండి, వారు నరసింహారావు గారి ప్రభుత్వాన్ని కూడా ఎప్పుడు ప్రశంసించ లేదు. అంతేకాకుండా వారి ప్రసంగం లో డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి గురించి కూడా ప్రస్తావించలేదు. అలాంటి గొప్ప వ్యక్తులతో పోలిస్తే నేను ఏమీ కాదు నేను ఒక సాధారణ వ్యక్తిని కానీ మీరు ఒక విషయాన్ని నిర్ధారించుకోవచ్చు. ఎర్రకోట నుంచి ప్రధాన మంత్రిగా నేను రెండు సార్లు చెప్పాను, స్వాతంత్ర్యం తరువాత ప్రతీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఈ దేశ అభివృద్ధిలో అవసరమైన తోడ్పాటును అందజేశాయి. అదే విషయాన్ని ఈ సభలో చాలా సార్లు చెప్పాను,

అదే విషయాన్ని మళ్ళీ చెప్పాలనుకుంటున్నాను. వారికి భిన్నమైన అంచనాలు ఉండి ఉండవచ్చు. కానీ నేను మా గుణం, మనస్తత్వం, ఆలోచనలు వ్యక్తీకరించే ఉదాహరణ ఇవ్వాలనుకుంటున్నాను. నాకు గుజరాత్ ముఖ్యమంత్రిగా చాలా కాలం పని చేసే అవకాశం లభించింది. అది గుజరాత్ రాష్ట్రంలో స్వర్ణోత్సవాలు జరుగుతున్న సందర్భం. కాబట్టి ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. కానీ ఈరోజు నేను ఒక ముఖ్యమైన పని గురించి ప్రస్తావిస్తాను. నేను గత 50 సంవత్సరాలుగా గౌరవనీయులైన గవర్నర్లు ప్రసంగించిన ఉపన్యాసాలను ఒక పుస్తక సంకలనం గా తీసుకు వచ్చి చరిత్రలో నమోదు చేయాలని సూచించాను. ఇప్పుడు చెప్పండి! గత 50 సంవత్సరాలుగా ఉన్న గవర్నర్లు ఏ ప్రభుత్వ పదవీ కాలానికి చెందినవారు?

అది ఒక విధంగా గత ప్రభుత్వాలు సాధించిన సాఫల్యాల సంకలనం. అవి మా పార్టీ ప్రభుత్వాలు కావు. ఏదేమైనా, మన దేశాన్ని ముందుకు నడిపించడంలో తోడ్పాటు అందించి, వ్యవస్థలో ముఖ్యమైన పాత్రను పోషించిన వారిని గుర్తించడం మన మనస్తత్వం. అది ఒక సానుకూలమైన చర్య. అవి వార్తాపత్రిక సంపాదకీయాల సంకలనం కావు, అది గవర్నర్ ప్రసంగాల సంకలనం. అవి ఇప్పటికి అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఇతరుల పనిని ఎప్పుడూ గుర్తించని వారు మమ్మల్ని గత ప్రభుత్వాల పని గుర్తించలేదని మాట్లాడే హక్కు లేదు. నరసింహారావు గారి పదవీకాలంలో వారికి భారతరత్న బిరుదు ఇచ్చి ఉండాల్సింది. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు వారి తొలి పదవి కాలం తర్వాత భారత రత్న అవార్డు అందుకొని ఉండాల్సింది. కానీ కుటుంబం బయటి వ్యక్తులకు ఎప్పుడు ఏమీ లభించదు కానీ మేము భిన్నంగా ఉన్నాము. ప్రణబ్ దా ఏ పార్టీకి చెందిన వారో, ఏ పార్టీకి పని చేసారో మేము ఎప్పుడూ ఆలోచించలేదు. వారికి భారతరత్న అవార్డు ఇవ్వడం కేవలం వారు ఈ దేశానికి చేసిన సేవ ఆధారంగా తీసుకున్న నిర్ణయం. కాబట్టి మమ్మల్ని నిందించవద్దు. మేము వేరే

వారి తోడ్పాటును తిరస్కరించడం లేదు. నేను నూట పాతిక కోట్ల భారతీయులు ఈ దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లారని అన్నప్పుడు, అందులో అందరూ ఉంటారు కాబట్టి ఈ చర్చను కించపరచవద్దు.

వారు "ఇది ఎవరు చేశారు?" అనే నినాదాలు చాలానే చేశారు. ఈ రోజు 25 జూన్. 25 జూన్ ప్రాముఖ్యం చాలా మందికి తెలియదు. వారు వారి పొరుగువారిని అడుగుతున్నారు. 25 జూన్ రాత్రి ఈ దేశం ఆత్మని నలిపి వేయడం జరిగింది. భారత దేశంలో ప్రజాస్వామ్యం మన రాజ్యాంగ పుటలలో నుంచి పుట్టలేదు. చాలా సంవత్సరాలుగా ప్రజాస్వామ్యం మన దేశం ఆత్మ గా ఉంది కానీ ఆ ఆత్మని నలిపేసారు. ఈ దేశ మీడియా నోరు మూసేసారు. ఈ దేశంలోని గొప్ప వ్యక్తులను కటకటాల పాలు చేశారు. ఒకరి అధికారాన్ని కాపాడడం కోసం మొత్తం భారతదేశాన్ని చెరసాలగా చేశారు. ఇది న్యాయ వ్యవస్థను, తీర్పును అగౌరవపరిచే ఒక సజీవ ఉదాహరణ.

ఈ రోజు జూన్ 25న మనమందరము మరోసారి మన ప్రజాస్వామ్యం పట్ల భక్తి, బలమైన సంకల్పాన్ని వ్యక్తపరచాలి. ఒకవైపు రాజ్యాంగం గురించి మాట్లాడుతూ మరోవైపు ఆ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసిన పాపం ఎవరూ మర్చిపోలేరు. ఈ పాపంలో భాగస్వాములైన వారందరూ ఈ మరక చెరగదని గుర్తుంచుకోవాలి. ఈ విషయం మళ్ళీ మళ్ళీ గుర్తు చేయడం వెనుక ఉద్దేశం, మరో వ్యక్తి ఈ పాపం మళ్ళీ చేయకూడదు అని. అలాగే అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదు అని మేము గుర్తు చేస్తున్నాము. ఇది ప్రజాస్వామ్యం పట్ల మనకు కావాల్సిన అంకితభావం ప్రాముఖ్యతను గుర్తు చేసుకోవడానికి చెప్పడం జరిగింది. ఆ సమయంలో వార్తాపత్రికల నోళ్ళు మూసేసారు, ప్రతి ఒక్కరు అరెస్ట్ అవుతానేమో అని భయంతో జీవించేవారు. కానీ ఎన్నికల తర్వాత వారు తమ తీర్పును తెలియజేశారు, వారు ప్రజాస్వామ్యానికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని స్థాపించారు. ఇది మన దేశ ఓటర్ల బలం.

మరోసారి కులం, మతం, వర్గం, భాషను పక్కనపెట్టి, దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం ఓట్లు వేశారు.

గౌరవనీయులైన స్పీకర్ గారు, రాష్ట్రపతి గారు తమ ప్రసంగంలో రెండు ముఖ్యమైన విషయాల గురించి ప్రస్తావించారు. గాంధీ గారి 150వ జయంతి, 75 సంవత్సరాల స్వాతంత్ర్యం. అది ఒక వ్యక్తి జీవితం కానివ్వండి, కుటుంబ జీవితం కానివ్వండి, లేదా సమాజం కానివ్వండి - కొన్ని తేదీలు కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తాయి. అది జీవితాన్ని ఉత్తేజపరుస్తూ మన సంకల్పాలు నెరవేర్చుకోవాలనే ఒక భావనను కలిగిస్తాయి. మన దేశానికి పూజ్య బాపూజీ కంటే గొప్ప ప్రేరణ మరొకటి లేదు. ఈరోజు మన దేశం కోసం త్యాగాలు చేసిన ధైర్యవంతుల జ్ఞాపకాలు ఉన్నాయి. కాబట్టి మనం ఈ అవకాశాన్ని వదులు కోకూడదు.

జాతి కోసం ప్రాణాలర్పించిన వారిని, భారతమాత కోసం సేవ చేస్తున్న యువతని, విజయవంతంగా స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళిన పూజ్య బాపూజీ ని స్మరించుకుంటూ, అలాగే వారు ఇచ్చిన అవకాశాలను గుర్తుచేసుకుంటూ, మనం ఈ దేశంలో ఒక కొత్త స్ఫూర్తిని సృష్టించవచ్చు. ఇది ఒక ప్రభుత్వం లేదా పార్టీ ఎజెండా కాదు, ఇది యావత్ దేశ ఎజెండా. ఇక్కడ దేశం తప్ప పార్టీలు లేవు. రాష్ట్రపతి గారు అదే విషయాన్ని పునరుద్ఘాటించారు. మన తీర్మానాలను నెరవేర్చుకోవడానికి ఇదే సరైన సమయం. మనం ఎన్నికల మైదానంలో ఒకరితో ఒకరు వదిలించుకోవచ్చు కానీ ఈ అవకాశాన్ని మనం వదులుకోకూడదు. స్వాతంత్ర్యానికి ముందు దేశం కోసం ప్రజలు ప్రాణ త్యాగం చేసే వారు కానీ స్వాతంత్ర్యం వచ్చిన 75వ సంవత్సరం లో దేశం కోసం జీవించే అవకాశం మనకి ఉంది.

సభలోని ప్రతి ప్రతినిధికి ఒక మనవి, మనమందరము రాష్ట్రపతి గారి ఆదేశాలను ఆకాంక్షలను, పాటించడానికి ముందుకు వద్దాం, కొత్త భారతదేశాన్ని నిర్మించడానికి ఈ రెండు

ముఖ్యమైన అవకాశాలను సామాన్యుల తో అనుసంధానిద్దాం. భారతదేశం లో వలస పాలన చాలాకాలం సాగింది. ఆ సమయంలో ప్రజలు తిరుగుబాటు చేయని సందర్భం కానీ లేదా దేశంలో ఏదో ఒక మూల స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేయని సందర్భం కానీ లేదు. 1857లో ఒక వ్యవస్థీకృత బృందం ఉద్భవించింది కానీ మహాత్మా గాంధీ గారు ఎక్కువగా తోడ్పాటు అందించారు. వారు ఒక సామాన్య మానవుడిని స్వాతంత్ర్య సమరయోధుడిగా మార్చారు. వారు శుభ్రత కోసం ఊడ్చిన్నప్పుడు అది స్వాతంత్ర్యం కోసమే. వారు విద్యార్థులకు బోధించినా, అది స్వాతంత్ర్యం కోసమే. వారు ఖాదీ బట్టలు ధరించినా, అది స్వాతంత్ర్యం కోసమే.

గౌరవనీయులైన బాపూ గారు ఈ దేశంలో అలాంటి వాతావరణాన్ని సృష్టించారు, దేశం మొత్తం 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాలుపంచుకుంది. 1942-1947 స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక ముఖ్యమైన మలుపు. దేశాన్ని సమస్యల నుంచి విముక్తి కల్పించడానికి, మన బాధ్యతలను నొక్కి చెప్పడానికి, దేశం తన బాధ్యతలను నెరవేర్చడానికి, గాంధీ-150, స్వాతంత్ర్యం-75 స్ఫూర్తితో ప్రేరణ ఇచ్చేలా ముందుకు రాగలమా? రాష్ట్రపతి గారు ఈ విషయాన్ని మన ముందు ఎంతో ముఖ్యమైన రీతిలో ఉంచారని నమ్ముతున్నాను. ఒకప్పుడు స్వాతంత్ర్యాన్ని కోరుతున్నప్పుడు మనం ఈ దేశాన్ని ఎలా నడపగలమో అని ప్రజలు ఆశ్చర్యపోయేవారు. వారు ఎగతాళి చేసేవారు. కానీ స్వాతంత్ర్య సమరయోధులకు ఒక సంకల్పం ఉంది. ఎవరైతే స్వాతంత్ర్యం కోసం జీవితాలను త్యాగం చేశారో వారిలో ఉన్న స్ఫూర్తి స్వేచ్ఛా జీవితం కోసం జీవిస్తున్న వారిని ప్రేరేపించేది. ఈ నాయకత్వానికి సామర్థ్యం ఉంది. ఇది అందరికీ సంబంధించినది. ఇది కేవలం నా కోసమో, నా పార్టీ కోసమో కాదు. మనమందరము కలిసి దీనిని సాధించగలం, ఇది నా వ్యక్తిగత లాభాల కోసం కాదు. నాకు ఆ విధమైన పరిమిత ఆలోచన లేదు. నేను చిన్నగా ఎప్పుడూ ఆలోచించను. అంతేకాక 125 కోట్ల భారతీయుల కల నిజం చేయాలంటే చిన్నగా ఆలోచించే హక్కు నాకు లేదు.

ఎత్తుకు ఎదగాలన్న సంకల్పం చేసుకున్నాక

ఆకాశం ఎత్తును చూడటం అనవసరం.

మనము ఈ స్ఫూర్తితో, కొత్త సంకల్పంతో ముందుకు వెళ్లాలి. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు వారాలే అవుతుంది కానీ పుత్రుడి లక్షణం ఉయ్యాలలో తెలుస్తుందని చెప్పినట్టు, ఈ ప్రభుత్వం పని ఉండబోతుంది. మేము అలాంటి మార్గాన్ని ఎన్నుకోవాలి. మేము దేశం కోసం జీవించడానికి వచ్చాము. ఈ ప్రభుత్వం గత మూడు వారాల్లో అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. ప్రతి క్షణాన్ని వినియోగించింది, 60 సంవత్సరాల తర్వాత చిన్న దుకాణదారులు, రైతులు, వ్యవసాయ కూలీల పెన్షన్ గురించి నిర్ణయం తీసుకున్నాము. రైతులందరినీ 'ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన' పరిధిలోకి తీసుకు వస్తామని మేము హామీ ఇచ్చాము. అది నెరవేర్చాము. మేము సైన్యంలో పని చేసే వారి పిల్లల స్కాలర్‌షిప్ ను పెంచడమే కాకుండా ఆ ప్రయోజనాలను పోలీస్ సిబ్బంది పిల్లలకు కూడా అందించాము. పోలీసులు మన సమాజ భద్రతకు బాధ్యత వహిస్తారు. పార్లమెంట్ లో ముఖ్యమైన మానవ హక్కులకు సంబంధించిన చట్టాలను రూపొందించడానికి మేము సన్నాహాలు పూర్తి చేసాము. కేవలం మూడు వారాల్లోనే ముఖ్యమంత్రుల సమావేశం,అఖిలపక్ష సమావేశం, అఖిలపక్ష అధ్యక్షుల సమావేశం, ఇంకెన్నో పనులు చేసి 2022 యొక్క స్వప్నాన్ని నెరవేర్చడానికి ముందుకు సాగుతున్నాం. ఆ పనులన్నీ లెక్కిస్తే సగటున రోజుకు మూడు పనులు చేసినట్టు కాబట్టి గౌరవనీయులైన స్పీకర్ గారు, రాష్ట్రపతి గారు తమ ప్రసంగంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. గత ప్రభుత్వాలు ఏ పని చేయలేదని నేను ఎప్పుడూ చెప్పలేదు. వివిధ ఆనకట్టల నిర్మాణ పనులపై చర్చ జరుగుతుంది. బాబా సాహెబ్ అంబేద్కర్ గారి పేరు కూడా ప్రస్తావించబడి ఉంటే బాగుండేది. భారతదేశంలో నీటి సంబంధిత కార్యక్రమాలన్నీ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి నాయకత్వంలోనే తీసుకోబడ్డాయి కానీ ప్రజలు ఒక ఎత్తు తర్వాత భూమిని

చూడలేరు. బాబా సాహెబ్ గారు కేంద్ర జల మార్గాల గురించి నీటిపారుదల, నౌకాయానం గురించి మాట్లాడేవారు. బాబా సాహెబ్ గారి సూచనలు ఈ రోజుకి కూడా ఉపయోగకరమైనవి, చెల్లుబాటు అయ్యేవి అని నేను నమ్ముతున్నాను. "మనిషి నీరు చేరుకునే మార్గం కన్నా, నీరు లేకపోవడం వల్లనే ఎక్కువ బాధపడతాడు." అని బాబాసాహెబ్ అంబేద్కర్ గారు చెప్పేవారు. మనం ఆ దిశగా ఆలోచించాలి.

ఆనకట్టలకు సంబంధించిన చర్చలలో, సర్దార్ సరోవర్ ఆనకట్ట కూడా చర్చించబడింది. నాకు మరి కొంత సమయం కేటాయించండి. స్పీకర్ గారు, కొన్ని సందర్భాలలో పుకార్లు వ్యాప్తి చెందుతాయి. వారికున్న పర్యావరణంలో వారు వీటిని ఆనందిస్తారు, నిజాన్ని బయటికి రానివ్వరు. నేను స్పష్టత ఇచ్చిన తర్వాత కూడా నిజం బయటికి వస్తుందన్న ధీమా లేదు. నేను ఇక్కడే ఉంటాను. నా విధిని నిర్వర్తించడంలోనే సంతృప్తి చెందుతాను. పండిట్ నెహ్రూ గారు 1961లో సర్దార్ సరోవర్ ఆనకట్ట కు పునాదిరాయి వేశారు, ఇది సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి కల. కానీ 1961 లోనే పునాదిరాయి వేయబడింది. అయితే ఇది చాలా దశాబ్దాలుగా ఆమోదించబడే లేదు. అనుమతి లేకుండానే పునాదిరాయి వేశారు. ఆ సమయంలో ఆ ప్రాజెక్టు విలువ ఆరు వేల రూపాయల కోట్లు. ఇది పూర్తయ్యే సమయానికి ఆ ఖర్చు 60వేల నుంచి 70 వేల కోట్ల రూపాయలకు పెరిగింది. దాని వల్ల దేశానికి ఏమి మేలు జరిగింది? అంతేకాకుండా యూపీఏ పాలనలో ఆ ప్రాజెక్టును ఆపడానికి ప్రయత్నాలు జరిగాయి. 1986-87 మధ్య ఆ ప్రాజెక్టు వ్యయం ఆరు వేల కోట్ల రూపాయలు. అది 62 వేల కోట్ల రూపాయలకు చేరుకుంది. మేము అధికారంలోకి వచ్చి ఆ ప్రాజెక్టును పూర్తి చేసాము. అందుకు నేను నిరాహార దీక్ష చేయవలసి వచ్చింది,అప్పుడు నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. పని ఆగిపోయింది. ఇప్పుడు ప్రాజెక్టు పూర్తయింది. నేను ప్రధాని మంత్రి అవ్వడానికి ముందు 15 రోజులలో అడ్డంకులు తొలగించాను. ఈ రోజు దాదాపు నాలుగు కోట్ల మందికి నీటి సరఫరా

అందుబాటులో ఉంది. పరిశుభ్రమైన తాగునీరు ఇప్పుడు ఏడు మెట్రో నగరాలకు, 107 మున్సిపాలిటీలకు, తొమ్మిది వేల గ్రామాలకు చేరుకుంది. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలోని ప్రజలకు నీటి కొరత గురించి తెలుసు. అందుకే మేము నీటికి సంబంధించి ప్రత్యేకంగా జలశక్తి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశాము. నీటికి సంబంధించిన విషయాలను మనం తీవ్రంగా పరిగణించాలి. ఈ కాలంలో మనం వీలైనంత వరకు నీటిని ఆదా చేయాలి.

నేను గౌరవనీయ సభ్యులందరికీ, స్వచ్ఛంద సంస్థలకు, ప్రభుత్వ పరిధి బయట పని చేసి, దేశంలో నీటి లభ్యతను పెంచాలని మనవి చేస్తున్నాను. నీటిని ఆదా చేయడం ద్వారా సామాన్యుల ప్రాణాలను మనం కాపాడవచ్చు. నీటికి సంబంధించిన సమస్యలు రెండు వర్గాల ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి – పేదలు, ముఖ్యంగా మన తల్లులు, సోదరీమణులు. మన సోషలిస్టు మిత్రులకు ఏమి జరిగిందో నాకు తెలియదు కానీ రాజా గారు ఈ దేశంలో మహిళలకు రెండు సమస్యల గురించి గట్టిగా మాట్లాడే వారు. ఒకటి నీరు, రెండోది పారిశుద్ధ్యం. లోహియా గారు తల్లులు, సోదరీమణులు ఈ సమస్యల నుంచి విముక్తి పొందాలని నిరంతరం చెబుతూ ఉండేవారు. మేము లోహియా గారి స్వప్నాన్ని నిజం చేయడానికి శ్రద్ధగా పని చేసి తల్లులకు, సోదరీమణులకు మరుగుదొడ్లు కట్టించి పారిశుద్ధ్య సమస్య నుంచి విముక్తి కలిగించాము. అలాగే "ప్రతి ఇంటికి నీరు" అనే మంత్రంతో ముందుకు సాగుతున్నాము.

ఇది ఒక పెద్ద శ్రమతో కూడుకున్న పని అని నాకు తెలుసు. బహుశా ఎవరైనా ఆ పనిని చూసి నా ప్రయత్నంలో నేను విఫలమయ్యానని చెప్పవచ్చు. మోదీకి వారు 70 మార్కులకి బదులు వందకి 50 మార్కులు ఇవ్వవచ్చు. కానీ ఎవరో ఒకరు ప్రారంభించాలి కాబట్టి మేము చేసాం. నేను జలశక్తి మంత్రిత్వ శాఖ గురించి మాట్లాడుతున్నాను, నీటి సంరక్షణ తర్వాత నీటిపారుదల తదుపరి బాధ్యత. చెరుకు సాగుకు సూక్ష్మ సేద్యం

ప్రయోజనకారి అని ప్రపంచంలో నిరూపించబడింది. రైతులకు ఈ విషయం ఎవరు వివరిస్తారు? సూక్ష్మ సేద్యం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వారికి ఎవరు చెప్తారు? ప్రభుత్వ పథకాలు, నిధుల ద్వారా నీటిని ఆదా చేయవచ్చు. ఇలాంటివి చాలా ఉన్నాయి. ప్రతీ నీటి చుక్కను ఆదా చేయడం ద్వారా మన దేశాన్ని ముందుకు తీసుకెళ్లవచ్చు.

వ్యవసాయం మన దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిది. అది మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వెన్నెముక. అయితే మనం పాత ప్రక్రియలు, వ్యవస్థల నుంచి బయటకు రావాలి. పెట్టుబడి ఖర్చులను తగ్గించాలి. సున్నా బడ్జెట్ పై ప్రయోగాలు విజయవంతం అవుతున్నాయి. దిగుబడిలో తగ్గింపు లేదు, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ యుగంలో నాణ్యత కూడా పెరుగుతుంది. మేము రాజకీయాలు లేకుండా పని చేసాం, కార్యక్రమాలని ప్రభుత్వ కార్యక్రమాలుగా పరిగణించలేదు. రైతుల సంక్షేమం కోసం మనందరం కలిసి పని చేయాలి, మనం రైతులకు ఆసరాగా ఉండాలి. వ్యవసాయంలో కార్పోరేట్ పెట్టుబడులు లేవు, మనం వాటిని ప్రోత్సహించాలి. అందుకు కొన్ని నియమాలను, చట్టాలను తయారు చేయాలి. లేనిచో కొంతమంది ట్రాక్టర్ ని అందించడం పెట్టుబడి అని నమ్ముతారు. కానీ మనకి ఆహార తయారీలో, శీతల గిడ్డంగులు, ఇతర గిడ్డంగుల నిర్మాణంలో కార్పోరేట్ పెట్టుబడులు అవసరం. ఇది ఈ సమయంలో మనం చేయవలసిన పని, దానిని ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేయాలి.

APO ల సాయంతో రైతులకు విత్తనం నుంచి మార్కెట్ వరకు ఒక వ్యవస్థని నిర్మించి ఎక్కువ అవకాశాలు కల్పించేలా పని చేయాలి. ఇది వ్యవసాయ రంగంలో ఎగుమతుల్లో అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది. మనము ఈ రంగాలపై దృష్టి సారించాలి 2014లో పప్పు ధాన్యాల ధరలు ఒక సమస్యగా మారింది. అయితే రైతుల స్ఫూర్తిని గమనించండి, నేను వారికి పప్పుధాన్యాల సాగుకు ముందుకు రావాలని ఒక సాధారణ మనవి చేశాను.

అందుకు మన రైతులు కష్టపడి దేశానికి అవి అందించారు. తర్వాత మనం నూనె గింజల కోసం రైతులను ప్రోత్సహించాలి. నూనెలను దిగుమతి చేసుకునే అవసరం మన దేశానికి ఉండకూడదు. మనదేశంలో రైతులకు స్ఫూర్తిని ఇవ్వగలమని నేను నమ్ముతున్నాను. ఒక భవిష్యత్ దృష్టితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థని రైతుల శక్తితో, దేశ అవసరాలతో తీర్చిదిద్దవచ్చు. ఆ దిశగా మనం ముందుకు సాగాలి. గౌరవనీయులైన స్పీకర్ గారు, విమర్శించడానికి గణాంకాలను ఉపయోగించవచ్చు అనేది వాస్తవం. కానీ జాతి కలను నెరవేర్చడం ఒక కాలంలో ఉత్సాహపరిచే విషయమైతే, అదే విషయం మరో కాలంలో ఆమోదయోగ్యం కాదు. ఇదే సభలో ఆర్థిక రంగంలో భారత్ 13వ స్థానం నుంచి 11వ స్థానానికి చేరుకున్నప్పుడు గొప్ప ఉత్సాహంతో బెంచీలు చరిచారు. అది ఒక గొప్ప విషయంగా పేర్కొనబడింది. కానీ భారత్ ఇప్పుడు ఆరవ స్థానానికి చేరుకున్నా ఆ ఉత్సాహం లేదు. దేశం అదే, మనం ఈ దేశ ప్రజలమే. 11వ స్థానానికి చేరుకోవడం సంతోషం ఇస్తే, 6వ స్థానానికి చేరుకోవడం మరింత సంతోషాన్ని కలిగించాలి. ఎంతకాలం మనం గర్వంతో నేలని చూడము? 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ మన స్వప్నం ఎందుకు కాకూడదు? మన దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేయగలిగితే ఎవరు నష్టపోతారు? ఎవరికి ప్రయోజనం? అందుకే మనందరం ఆ దిశగా కష్టపడి పని చేయాలని నేను నమ్ముతున్నాను ఆ స్వప్నం దిశగా మనం అందరం ముందుకు సాగాలి. "మేకిన్ ఇండియా" పథకాన్ని ఎగతాళి చేశారు కానీ ఆ పథకం పాత్రని ఎవ్వరూ విస్మరించలేరు.

గౌరవనీయులైన స్పీకర్ గారు, నేను ఇక్కడ ఎవరినీ విమర్శించడానికి రాలేదు, అందుకు నా సమయాన్ని వృధా చేయదలుచుకోలేదు. నాకు చేయడానికి చాలా పనులు ఉన్నాయి. కానీ దేశానికి కొన్ని విషయాలు తెలియజేయడం చాలా ముఖ్యం. మన దేశానికి లోహాన్ని ఉత్పత్తి చేయడంలో 200 నుంచి 225 సంవత్సరాల అనుభవం ఉంది. స్వాతంత్ర్యం

తరువాత మనదేశంలో లోహాన్ని తయారుచేసే పరిశ్రమలు 18 ఉంటే చైనాలో సున్నా పరిస్థితి ఉండేది. చైనా వద్ద అనుభవం లేదు. ఈరోజు చైనా ప్రపంచమంతా రక్షణ వస్తువులను ఎగుమతి చేస్తుంటే మనం దిగుమతి దారుల లో మొదటి స్థానంలో ఉన్నాం. మనం మన దేశాన్ని ఈ సత్యం నుంచి బయటకు తీసుకు రావాలి. "మేకిన్ ఇండియా" ని ఎగతాళి చేయడం ద్వారా మీరు ఏమి సాధిస్తారు? మీకు రాత్రికి మంచి నిద్ర రావచ్చు కానీ ఈ దేశానికి ఏమి మేలు చేయదు.

గౌరవనీయులైన స్పీకర్ గారు, మీరు ఈ సభలో నాకు మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు నీకు నా కృతజ్ఞతలు భారతదేశం 5 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో స్థానం సంపాదించడానికి మార్గాలు అన్వేషించాలి ఎగుమతులు పెంచుకోవాలి మేక్ ఇన్ ఇండియా మరింత ప్రోత్సహించాలి. అలాగే స్టార్ట్ అప్ లు మొదలు పెడుతున్న యువతని ప్రోత్సహించాలి. మనం "జై జవాన్ జై కిసాన్ జై విజ్ఞాన్, జై అనుసంధాన్" ని ప్రోత్సహించాలి. మన యువత కోసం ఉపాధి అవకాశాలు కల్పించాలి మన దేశంలో పర్యాటక రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయి, కానీ మనం మన దేశం పట్ల కల్పించిన అభిప్రాయము మూలంగా ప్రపంచాన్ని మన వైపు ఆకర్షించుకోవడంలో విఫలమయ్యాము.

పారిశుద్ధ్యం పట్ల ప్రచారం మనకి బలాన్నిచ్చింది. మనమిప్పుడు పర్యాటక రంగానికి ప్రాధాన్యత ఇవ్వచ్చు, ఉపాధి అవకాశాలు మన దేశంలో పెరిగే అవకాశం ఉంది. మన దేశానికి పర్యాటక రంగంలో ప్రపంచంలోనే ఒక కొత్త గుర్తింపు తీసుకు రావచ్చు. మనం ఈ విషయాలను ముందుకు తీసుకువెళ్లాలి. మనం మన దేశాన్ని మౌలిక సదుపాయాల్లో రాబోయే రోజుల్లో ముందుకు తీసుకువెళ్లాలి. దేశ అవసరాల తో పోలిస్తే 100 లక్షల కోట్లు చిన్న మొత్తం. కానీ మనం ఈ భారీ స్వప్నాన్ని ముందుకు తీసుకెళ్లాలి ప్రపంచం అందించే సహాయాన్ని, ఏర్పాట్లను మనం ఉపయోగించుకోవాలి. మన స్వప్నం కొత్త భారత్, ఆధునిక భారత్, ఈజ్

ఆఫ్ లివింగ్ - ఇందులో ఉంది. సామాన్యులకు సౌకర్యవంతమైన జీవితం, వారి కలలను సాకారం చేసుకుని మార్గాలను మనం కల్పించాలి. అలాంటి వ్యవస్థలను మనం అభివృద్ధి చేసుకోవాలి. గ్రామం అయినా నగరమైనా అందరికీ సమానమైన అవకాశాలు కల్పించాలి.

ఈ రోజు మనం డెమోగ్రాఫిక్ డివిడెండు గురించి మాట్లాడుతున్నాము. దేశంలో యువ శక్తి ఉంది కానీ ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మనం మన యువకులని సిద్ధం చేయగలమా? మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి, మన నైపుణ్యాలను అభివృద్ధి చేయాలి, ప్రతి పరిధిని పట్టుకోవాలి. గౌరవనీయులైన రాష్ట్రపతి గారు ఆధునికత వైపు ఎలా ముందుకు వెళ్లవచ్చో చెప్పారు. ప్రభుత్వం మార్కెట్ కోసం JAM తో ముందుకు వచ్చింది. నేను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను పార్టీలకి అతీతంగా ముందుకు వచ్చి JAM పోర్టల్ ని ఉపయోగించమని కోరుకుంటున్నాను. అధిక మొత్తంలో డబ్బు ఆదా అవ్వడమే కాకుండా చాలా మందికి ప్రయోజనం చేకూరుస్తుంది. ఏ వ్యక్తి అయినా తన ఉత్పత్తిని ప్రభుత్వానికి అమ్మవచ్చు. అందుకే అందరూ ఆ దిశగా పనిచేయాలని నేను అభ్యర్థిస్తున్నాను.

అవినీతికి వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగిస్తాం. కొంతమందిని జైలులో పెట్టడం ఎందుకు అని మమ్మల్ని విమర్శిస్తున్నారు. ఎవరిని అయినా జైల్లో పెట్టడానికి ఇది అత్యవసర కాలం కాదు. ఇది ప్రజాస్వామ్యం, ఆ పని చేయడానికి న్యాయవ్యవస్థ ఉంది. మేము చట్టబద్ధంగా పని చేస్తున్నాము, ఎవరికైనా నచ్చితే వారు ఆనందించవచ్చు. ప్రతీకార భావనతో పని చేయకూడదు. కానీ మేము అవినీతికి వ్యతిరేకంగా మా పోరాటం కొనసాగిస్తాము. మేము ఏది చేసినా నిజాయితీగా చేస్తాము. ఒకరి పట్ల వ్యతిరేక భావన తో మేము పని చేయము. ఈ దేశం మనకి చాలా ఇచ్చింది, కాబట్టి మనం తప్పుడు దారిలో నడవాల్సిన అవసరం లేదు. మనం టెక్నాలజీని ఎక్కువగా ఉపయోగించుకోవచ్చు.

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఉగ్రవాదానికి సంబంధించి అభిప్రాయ భేదం ఎందుకు ఉండాలి? అది మానవత్వానికి పెద్ద ముప్పు. అది మానవత్వానికి సవాలు. మానవత్వాన్ని నమ్మే వారందరూ కలిసి దానిపై పోరాడాలి. మహిళా సాధికారత ఇవ్వడానికి కాంగ్రెస్ కు అనేక అవకాశాలు లభించాయి. కానీ వారు కొన్ని విషయాలను చూడలేకపోయారు. యూనిఫామ్ సివిల్ కోడ్ 50వ దశాబ్దంలో చర్చించబడింది. ఆ అవకాశం లభించింది కానీ వదులుకున్నారు. ఆ తర్వాత వారు హిందూ కోడ్ బిల్లు తో ప్రారంభించారు. 35 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ కు రెండో అవకాశం లభించింది. షా బానో కు సుప్రీంకోర్టు పూర్తిగా సహకారం అందించింది. దేశంలో దానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. కానీ ఎత్తు నుండి కింద ఉన్న పరిస్థితులు చూడడానికి నిరాకరించారు, తత్ఫలితంగా మరో అవకాశాన్ని కోల్పోయారు. 35 ఏళ్ల తర్వాత ఈ రోజు మరోసారి కాంగ్రెస్ కు అవకాశం లభించింది. మేము ఈ బిల్లు తో ముందుకు వచ్చాము. ఈ దేశ మహిళల గౌరవాన్ని ఏ మతంతో ముడి పెట్టాల్సిన అవసరం లేదు. షాబానో కేసు లో కొంత మంది మంత్రులు టీవీ ఇంటర్వ్యూలలో దిగ్భ్రాంతికరమైన ప్రకటనలు ఇచ్చారు. దాన్ని ధ్రువీకరించడానికి నాకు దారులు లేవు కానీ నేను విన్న దాన్ని మీకు చెప్తున్నాను. కాంగ్రెస్ కు చెందిన ఒక మంత్రి షాబానో కేసు సందర్భంగా ముస్లింల సంక్షేమానికి భరోసా ఇవ్వడం కాంగ్రెస్ బాధ్యత కాదని చెప్పారు. ఇది తీవ్రమైన విషయం. "వారు మురికి కాలవలో పడి ఉంటానంటే పడి ఉండనివ్వండి." మీకు ఇది యూట్యూబ్లో లభిస్తుంది. నేను మీకు లింకు పంపుతాను.

గౌరవనీయులైన స్పీకర్ గారు, నేను ఎక్కువ సమయం తీసుకోను, గాంధీ – 150, స్వాతంత్ర్యం - 75 లకు సంబంధించి గౌరవనీయులైన రాష్ట్రపతి గారూ మాట్లాడారు. కొన్ని కారణాల వల్ల ప్రతిదీ హక్కుల చుట్టూ కేంద్రీకృతమై ఉంది. అందరూ హక్కుల పట్లే ఆసక్తి చూపించారు. హక్కుల నుంచి విధుల వైపుకు దేశాన్ని తీసుకువెళ్లడానికి మనకు ఇది మంచి

అవకాశం. ప్రజల్లో మనస్సాక్షిని మేల్కొలిపి వారికి దారి చూపించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదే. మనలో చాలా మంది విధుల శక్తి గురించి విన్నాము. మహాత్మా గాంధీ గారు చెప్పే వారు - ప్రతి హక్కు సంబంధిత విధిని కలిగి ఉంటుంది అని చెప్పేవారు. ఒకరు విధిని చేసేటప్పుడు నష్టాన్ని చూడరు. నేను వారు చెప్పిన విషయం పై వివరిస్తాను. ఇది చాలా పాత సామెత! "విధులు మొదట వస్తాయని భారత దేశం ప్రపంచానికి నేర్పింది. హక్కులు విధుల నుండి వస్తాయి. నేటి ఆధునిక భౌతికవాద ప్రపంచంలో ప్రతీ చోట విభేదాలూ కనిపిస్తాయి. ప్రతి ఒక్కరూ హక్కుల గురించి, వారి సౌలభ్యం గురించి మాట్లాడతారు. చాలా అరుదుగా విధుల గురించి మాట్లాడటం జరుగుతుంది. విభేదాల కి ఇదే కారణం. ఇది వాస్తవం. హక్కులు, సౌకర్యాల కోసం పోరాడుతాం. కానీ మనం మన విధులను మర్చిపోతే ఈ హక్కులు, సౌకర్యాలు మనకి లభించవు." ఇలాంటి గొప్ప మాటలు చెప్పిన వ్యక్తిత్వాన్ని, ఎవరినైతే మనం మరిచిపోయామో వారిని స్మరించుకోవడం మన బాధ్యత. మనం ఈ ఆలోచనలను ముందుకు తీసుకు వెళ్ళగలము. ఆ గొప్ప వ్యక్తిత్వం ఈ మాటలను 14 జూలై 1951న ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసిన సందర్భంగా చెప్పారు. ఆ సమయంలో ఆ గొప్ప వ్యక్తి పండిత నెహ్రూ గారు ప్రకటనలోని ఈ పేరాను చదివారు. 1951 నాటి పండిత నెహ్రూ కలలతో ముందుకు సాగి దానిని నెరవేర్చగలమా? మనందరం కలిసి నిర్ణయించుకుని ముందుకు సాగడానికి ప్రయత్నిద్దాం.

మన దేశ చరిత్రలో పుస్తకాలను వదిలేసి స్వాతంత్ర్య సమరంలో పాల్గొనాలని మహాత్మాగాంధీ గారు యువకులకు విజ్ఞప్తి చేయగా, ప్రజలు ముందుకు వచ్చారు. విదేశీ వస్తువులను బహిష్కరించి, భారతీయ వస్తువులను స్వీకరించాలని గాంధీ గారు పిలుపు ఇవ్వగా ప్రజలు పాటించారు. నాలాంటి చిన్న వ్యక్తి గ్యాస్ సబ్సిడీని వదులుకోవాలని ప్రజలను అభ్యర్థించగా ప్రజలు వదులుకున్నారు. దీని అర్థం దేశం సిద్ధంగా ఉంది. రండి మనమందరం

రాజకీయాలకి అతీతంగా నూతన, ఆధునిక భారతదేశాన్ని నిర్మిద్దాం. రాజకీయాల కంటే దేశం గొప్పది. ఏ రాజకీయ పార్టీ కన్నా దేశం పెద్దది. దేశంలోని కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. గౌరవనీయులైన రాష్ట్రపతి గారు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి చూపించిన మార్గాన్ని, మార్గదర్శకత్వాన్ని స్వాగతిస్తూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అలాగే వారి ఉపన్యాసం లోని స్ఫూర్తి కి అనుగుణంగా మనం దేశ సంక్షేమం కోసం పని చేస్తామని ఆశిస్తున్నాను.

ఈ ఆశతో గౌరవనీయులైన సభ్యులు ఈ చర్చను సుసంపన్నం చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను. గౌరవనీయులైన స్పీకర్ గారికి నా ధన్యవాదాలు.

రాజ్యసభ 250వ సమావేశంలో
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ
గారి ప్రసంగం.

18 నవంబర్ 2019

రాజ్యసభ 250 వ సమావేశం పై ప్రధాన మంత్రి గారి వ్యాఖ్య - 18 నవంబర్ 2019

గౌరవనీయులైన అధ్యక్షులు, గౌరవప్రదమైన సభకి, పార్లమెంట్ సభ్యులందరికీ 250 వ సమావేశం సందర్భంగా ఇవే నా శుభాకాంక్షలు. 250 సమావేశాలలో తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి నా అభినందనలు. వారందరినీ సాదరంగా స్మరించుకుంటూ ఉన్నాను.

అధ్యక్షా, మీరు రెండు వేరు వేరు సంఘటనల్ని ఒకే విధంగా వ్యక్తపరిచిన విధానాన్ని రచన పట్ల ఇష్టం ఉన్న వ్యక్తులు గమనించి ఉంటారు. 250వ సమావేశం కేవలం మరో సమావేశం కాదు, అది ఒక అనుభవాల సమాహారం అని రాస్తారు. మీరు చెప్పినట్లుగా బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఎలా ఉంటుందో, చివరి దశలో వేరే రూపు తీసుకుంటుంది. కాలం మారింది, పరిస్థితులు మారాయి, ఈ సభ మారిన పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకున్నది. నా ఉద్దేశంలో ఇది చాలా పెద్ద విషయం. ఈ దిశగా పని చేసిన సభ్యులందరికీ నా అభినందనలు. 20 ఏళ్ల క్రితం ఉన్న అభిప్రాయాన్ని ఒక వ్యక్తి ఎలా మార్చుకోగలడా అనే భావన ఎవరికైనా కలగవచ్చు. కానీ మీరు వ్యక్తపరిచిన విధానం మన ఆలోచనల గమనాన్ని ప్రతిబింబిస్తుంది, మన దేశాభివృద్ధిని ప్రతిబింబిస్తుంది. అలాగే ప్రపంచ పర్యావరణంలోని కొత్త అంశాలలో నాయకత్వ పాత్ర పోషించగలిగే భారత సత్తాను ప్రతిబింబిస్తుంది. ఈ కార్యం ఈ సభ నుండి జరుగుతుంది కాబట్టి ఇది మనకి గర్వకారణం.

ఈ ముఖ్యమైన ఘట్టం లో పాల్గొనడం, తిలకించడం నాకు ఒక ప్రత్యేక గౌరవంగా నేను భావిస్తున్నాను. రెండు సభలు ఉండాలా లేక ఒక సభ ఉండాలా అనే విషయంపై రాజ్యాంగ కర్తల మధ్య చర్చ జరిగి ఉంటుందని మనం స్పష్టంగా చెప్పగలం. రాజ్యాంగ కర్తలు చాలా చక్కనైన ఏర్పాటు చేశారని మన అనుభవం చెబుతుంది. వారు ఈ విషయంలో మంచి

తోడ్పాటు అందించారు. దిగువ సభ రంగంలో ఉంటే ఎగువ సభ దూరదృష్టితో పనిచేస్తుంది. ఆ విధంగా దిగువ సభ భారత అభివృద్ధి గమనానికి సంబంధించిన వాస్తవాలను ప్రతిబింబిస్తే, ఎగువ సభ దూరదృష్టితో తోడ్పాటును అందిస్తుంది. మనం ఈ అందమైన కలయికని రెండు సభల ద్వారా వేర్వేరు అనుభూతుల్ని పొందుతూ ఉన్నాము.

ఈ సభ ఎన్నో చారిత్రాత్మక సంఘటనలకు సాక్షి. చరిత్రని సృష్టించడమే కాదు ఆ సృష్టిని ఈ సభ చూసింది. అలాగే అవసరమైనప్పుడు చరిత్రను తిరగ రాయడంలో విజయం సాధించింది. ఈ విధంగా ప్రముఖ,విశిష్ట మహానుభావులు ఈ సభను నడిపించి, సభా కార్యకలాపాలలో పాల్గొని, మన దేశ అభివృద్ధి గమనాన్ని ప్రారంభించి, స్వాతంత్ర్యం తర్వాత చేయాల్సిన పనులు చేశారు. ఇప్పుడు 50, 60 సంవత్సరాల తర్వాత కొన్ని విషయాలు ఒక రూపును సంతరించుకున్నాయి. కానీ, ఆరంభంలో మనం ఒక తెలియని భయానికి లోనయ్యాము. ఆ సందర్భంలో ప్రతి ఒక్కరు వివేకంతో ముందుకు వెళ్లడం గొప్ప విషయం.

అధ్యక్షా! ఈ సభ చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఇందులో రెండు విషయాలు ఉన్నాయి.ఒకటి శాశ్వతత్వం అంటే - ఒక శాశ్వత, నిత్య సభ, రెండవది వైవిధ్యం. ఈ సభ శాశ్వతం, ఎందుకంటే లోక్ సభను రద్దు చేయవచ్చు కానీ ఈ సభ ఏర్పాటు అయినప్పటి నుండి ఇంతవరకూ రద్దు చేయబడలేదు, అదే శాశ్వతత్వం. వ్యక్తులు వస్తారు, వెళతారు కానీ వ్యవస్థ శాశ్వతం. ఇదే ఈ సభ ప్రత్యేకత. రెండవ ప్రత్యేకత వైవిధ్యం. ఎందుకంటే ఈ సభలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం చాలా ముఖ్యం. ఈ విధంగా సమాఖ్య స్ఫూర్తి మనకి నిరంతరం ప్రేరణని ఇస్తుంది. భారతీయ వైవిధ్యానికి గొప్ప బలం వైవిధ్యంలో ఐక్యత. ఈ సభలో ఈ విషయం చూస్తున్నాను. ఈ సభ దీన్ని ప్రతిబింబిస్తుంది. అలాగే ఈ వైవిధ్యాలతో మనం ముందుకి వెళ్తున్నప్పుడు, ఈ సభకు మరో ప్రయోజనం కలుగుతుంది. ఎన్నికలను దాటుకుని రావడం అందరికీ సాధ్యం కాదు కానీ దేశ ప్రయోజనాలలో ఎన్నికల ప్రాముఖ్యతని తగ్గించలేము.

సభ్యుల అనుభవం, సామర్థ్యం సమానంగా విలువైనవి.ఈ ప్రాంగణంలో వివిధ రంగాల నుండి వచ్చిన శక్తివంతమైన, అనుభవజ్ఞులైన సభ్యుల నైపుణ్యాన్ని, అనుభవాన్ని ఈ దేశ రాజకీయ జీవనంలో, ప్రణాళికలు రూపొందించడం లో ఉపయోగించడమయ్యింది. వారు శాస్త్రజ్ఞులు కావచ్చు, క్రీడాకారులు కావచ్చు, కళాకారులు కావచ్చు, రచయితలు కావచ్చు - అలాంటి వ్యక్తిత్వాల వల్ల కలిగే ప్రయోజనం ఎన్నికల మాధ్యమం ద్వారా కలగకపోవచ్చు. ఈ వ్యవస్థ ద్వారా గొప్ప మేధోసంపత్తి పొందగలిగాము.

దీనికి గొప్ప ఉదాహరణగా నేను బాబాసాహెబ్ అంబేద్కర్ అని నమ్ముతున్నాను. కొన్ని కారణాల వల్ల వారిని లోక్ సభ వరకూ చేరుకొనివ్వలేదు కానీ రాజ్యసభ ద్వారా,బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఉనికి వల్ల ఈ దేశానికి ప్రయోజనం కలిగింది. కాబట్టి ఈ సభ ద్వారా బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి గొప్ప వ్యక్తులు ఈ దేశానికి లాభం చేకూర్చిన్నందుకు మనం గర్వించాలి. గతంలో చాలా కాలం వరకు ప్రతిపక్షం లేకపోవడం మనం చూశాం. ప్రతిపక్షం నామమాత్రంగా ఉండేది. అలాంటి పరిస్థితి అప్పట్లో అధికారంలో ఉన్న వారికి గొప్ప అవకాశం. కానీ అలాంటి పరిస్థితులు ఇప్పుడు లేవు. ఇప్పుడు ప్రతి అడుగులో విభేదాలు ఉన్నాయి. ప్రతి అడుగులో విరోధం ఉంది. ప్రతిపక్షం లేని ఆ రోజుల్లో ఈ సభలో ఉన్న మేధావులు, అనుభవజ్ఞులు పరిపాలనా వ్యవస్థలో ఏకచ్ఛత్రాధిపత్యం రాకుండా చూశారు. ఈ సభ ఎంతో ప్రయాసలకోర్చి పాలనా వ్యవస్థలో ఉన్న వారు సరైన దిశలో వెళ్లేలా ప్రేరేపించారు. అలాంటి సేవ గర్వకారణం, స్మరణీయం.

అధ్యక్షా! ఈ సభను ఉద్దేశించి తొలి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పిన మాటలు నేను గుర్తు చేసుకోదలుచుకున్నాను. ఇదే ఆసనం పై కూర్చుని వారు ఈ విధంగా అన్నారు. “మన అవగాహన, మన ప్రవర్తన, మన ఆలోచనలే ఈ రెండు సభలు పార్లమెంటరీ వ్యవస్థలో ఎలా నిలదొక్కుకుంటాయో నిర్ధారిస్తాయి. మన రాజ్యాంగం లో

భాగమైన ద్విసభ విధానం మన చర్యలను పరీక్షిస్తుంది. మన పార్లమెంటరీ వ్యవస్థలో రెండు సభలు ఉండడం ఇదే మొదటిసారి. ఈ ఏర్పాటును మనం మన ఆలోచనల ద్వారా, సామర్థ్యం ద్వారా, అవగాహన ద్వారా సమర్థించుకోవాలి." ఆయన మాటలు ఈ రోజు కూడా సమంజసం. మీరు గౌరవనీయులైన ప్రణబ్ ముఖర్జీ గారి మాటలు కానివ్వండి లేదా మీ వ్యధ కానివ్వండి వాటిని ఈ మాటలతో వ్యక్తీకరించడం జరిగింది.

250 వ సభ మొదలైన ఈ సందర్భంలో మనకున్న అపార అనుభవంతో పాత, కొత్త తరాల బాధ్యత మరింత పెరగనుంది. డాక్టర్ రాధాకృష్ణన్ గారి ఆశలకు అనుగుణంగా మనం పని చేస్తున్నామా? లేక వారి అంచనాలను అందుకోవడంలో విఫలమవుతున్నామా? అలాగే మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ అంచనాలకు మరింత విలువ జోడిస్తున్నామా అని మనం ఆలోచించుకోవాలి. ఈ సభ కు చెందిన నేటితరం, భవిష్యత్ తరాలు డాక్టర్ రాధాకృష్ణన్ గారి ఆశలకు అనుగుణంగా నడుచుకోగలరని నాకు ఎటువంటి సందేహం లేదు.

గౌరవనీయులైన అధ్యక్షులు చెప్పినట్లు గత 250 సభలలో ఎన్నో ముఖ్యమైన చరిత్రాత్మక బిల్లులను ఇక్కడ ఆమోదించి వాటిని చట్టాలుగా మన దేశంలో అమలు చేయడం జరుగుతుంది. మన దేశాన్ని నడిపించడానికి ఇవే ఆధారం. గత ఐదేళ్లుగా మన పనితీరును చూసినట్లయితే నాకు కూడా ముఖ్యమైన ఘటనలు చూసే అవకాశం దక్కింది. ఎంతోమంది మేధావుల అభిప్రాయాలు వినే అవకాశం దక్కింది. ఆ విధంగా ఎన్నో విషయాలని కొత్తగా చూశాను. అందువల్ల నాకు ప్రయోజనం చేకూరింది. అందరికీ ధన్యవాదాలు. మనం కొత్త విషయాలు అర్థం చేసుకుని నేర్చుకుంటే మనకే మంచిది అన్న విషయం నేను ఇక్కడ తెలుసుకున్నాను. కాబట్టి మీ మధ్య కూర్చుని మీ నుండి నేర్చుకోవడం ఒక ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నాను.

గత ఐదేళ్లలో 'ముమ్మారు తలాక్ చట్టం' ఈ సభలో ఆమోదించబడుతుందో లేదో అని ప్రజలు సందేహించే వారు. ఆ బిల్లు ఇక్కడే ఇరుక్కుపోతుంది అనుకున్నారు కానీ ఈ సభ ఎంతో పరిపక్వతతో మహిళా సాధికారత కోసం పని చేసింది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మనదేశంలో కుట్రలు పన్నారు. ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు చేశారు. కానీ ఈ సభ సామాన్య శ్రేణిలోని పేద వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడం గర్వకారణం. ఆ సందర్భంగా ఎలాంటి ఉద్రిక్తతలు చెలరేగలేదు, ఏ విధమైన నిరసన జరగలేదు. పైగా అందరి సమ్మతితో ఆ పని చేసాం. ఇది కేవలం ఈ సభ వల్లే సాధ్యం అయ్యింది.

అలాగే జీఎస్టీ గురించి మాట్లాడితే అధికారంలో ఉన్నవారు దీని కోసం చాలా కష్టపడ్డారు. లోపాల పై చర్చలు జరిగాయి. అసలు అలాంటి మార్పులు అవసరమా లేదా అని కూడా వాదనలు జరిగాయి. చివరిగా 'ఒక దేశం ఒక పన్ను వ్యవస్థ'ను ఈ సభ సర్వ సమ్మతితో ఆమోదించింది. అందువల్లనే మనం ఈరోజు ప్రపంచం ముందు మన అభిప్రాయాల్ని ఖచ్చితంగా వెల్లిబుచ్చుతున్నాము.

ఇక మన దేశ ఐక్యత, సమగ్రత గురించి మాట్లాడదాం. 1964లో ఈ సభలో ప్రమాణాలు చేశారు. ఒక సంవత్సరం లో ఆ పని చేసి చూపిస్తామన్నారు కానీ చేయలేకపోయారు. ఈ సభ 370, 35A సెక్షన్లని రద్దు చేసి దేశానికి దిశానిర్దేశం చేసింది. ముందుగా ఈ సభలో ఆమోదించాక ఆ తర్వాత లోక్ సభలో కూడా ఆమోదించబడింది కాబట్టి ఈ సభ ఈ దేశ ఐక్యతకు, సమగ్రతకు చాలా ప్రాముఖ్యాన్ని ఇచ్చింది. ఈ సభ మరో విశేషం ఏంటంటే 370వ అధికరణాన్ని ఈ సభలో మొదటి నాయకుడైన శ్రీ ఎన్.గోపాలస్వామి రాజ్యాంగం లో భాగంగా ప్రతిపాదించారు. అదే సభ ఆ అధికరణాన్ని రద్దు చేసింది. ఈ సంఘటన చరిత్రాత్మకమైనది. అది ఇక్కడే జరిగింది

రాజ్యాంగ కర్తలు మనకి ఒక బాధ్యతను అప్పగించారు. మన దేశం సంక్షేమ రాష్ట్రం అయినప్పటికీ ప్రతి రాష్ట్ర సంక్షేమం కూడా మన బాధ్యత. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే కలిసికట్టుగా దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళగలుగుతాయి. ఈ సందర్భంగా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే ఈ సభ ఎంతో ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. రాజ్యాంగ సంస్థలని మనం బలోపేతం చేశాము. మన సమాఖ్య వ్యవస్థ మన దేశ అభివృద్ధిలో ఒక ముఖ్యమైన స్తంభం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేసినప్పుడే అభివృద్ధి సాధ్యం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరోధులుగా ఉండకుండా రాజ్యసభ చూస్తుంది. అలాగే దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లడంలో భాగస్వాములుగా పని చేస్తాము. ఇక్కడి ఆలోచనల సారాన్ని రాష్ట్ర ప్రతినిధులు ఆయా రాష్ట్రాలకు, రాష్ట్ర ప్రభుత్వాలకి తెలియచేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు క్రియాశీలకంగా పని చేయడానికి మనం మరింత ప్రేరేపించాలి. దేశం అభివృద్ధి, రాష్ట్రాల అభివృద్ధి వేరువేరు కాదు. రాష్ట్రం అభివృద్ధి లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదు. దేశం అభివృద్ధికి ఉన్న ప్రణాళికలు రాష్ట్ర అభివృద్ధికి వ్యతిరేకంగా ఉంటే ఆ రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందలేవు. ఈ విషయాలు ఈ సభలో ఎక్కువగా ప్రతిబింబిస్తాయి ఎన్నో విధానాలూ కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తుంది. కేవలం రాజ్యసభ, రాజ్యసభ సభ్యులు రాష్ట్రాల అంచనాలనూ, వారి అభిప్రాయాలను, వారి అనుభవాలను, దైనందిన సమస్యలను ప్రభుత్వ విధానంలో స్పష్టంగా చేకూర్చవచ్చు. వీటి ప్రయోజనాలు సమాఖ్య వ్యవస్థకు కూడా లభిస్తుంది. పనులన్నీ ఒకేసారి జరగవు కొన్ని పనులు ఐదు సంవత్సరాలలో జరగొచ్చు మరి కొన్ని పనులు తరువాతి ఐదు సంవత్సరాల్లో జరగొచ్చు కానీ ఒక దిశ నిర్ధారించడం జరుగుతుంది, పని అక్కడి నుంచే మొదలవుతుంది.

అధ్యక్షా, 2003లో ఈ సభ రెండు వందల సంవత్సరాలు పూర్తి చేసుకుంది.ఆ సందర్భంగా కొన్ని కార్యక్రమాలు జరిగాయి. అప్పట్లో కూడా NDA ప్రభుత్వమే ఉండేది.అటల్

బిహారీ వాజ్పేయి గారు అప్పుడు మన ప్రధానమంత్రి. ఆ సందర్భంగా 200వ సమావేశంలో అటల్ బిహారీ వాజ్పేయి గారు చేసిన ప్రసంగం ఎంతో ఆసక్తికరం. వారు మాట్లాడే విధానం చాలా ప్రత్యేకమైనది. 'రెండవ సభ' పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మరింత శక్తివంతం చేయడానికి ఉందని వారు చెప్పారు. రెండవ సభ ని ఉప సభ గా చేసే తప్పిదం చేయవద్దని వారు హెచ్చరించారు. అటల్ జి గారు చెప్పిన విషయాలు చదువుతున్నప్పుడు నాకూ ఈ రోజున ఇదే విషయాన్ని కొత్తగా చెప్పాల్సి వస్తే నేను రాజ్యసభ ని రెండవ సభగా పేర్కొంటాను. అది ఎప్పటికీ ఉప సభ కాదు, భారత అభివృద్ధిలో అది ఒక సహాయక సభలా ఉండాలి. అటల్ జీ మన పార్లమెంటరీ వ్యవస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒక ఉపన్యాసం ఇచ్చారు. ఆ ఉపన్యాసంలో ఆయన ఒక కవిత రూపంలో కొన్ని విషయాలు చెప్పారు. అందులో ఏం చెప్పారంటే - ఒక నదీ ప్రవాహం ఎప్పుడు మంచిగా ఉంటుందంటే -ఎప్పుడైతే రెండు ఒడ్డులు బలం గా ఉంటాయో అప్పుడు; అలాగే మన భారత పార్లమెంటరీ ప్రవాహానికి ఒక ఒడ్డు లోక్ సభలో జరిగే ప్రజాస్వామ్య ప్రక్రియ అనుకుంటే, మరొక ఒడ్డు రాజ్యసభ! ఈ రెండు ఒడ్లు బలంగా ఉన్నప్పుడే మన ప్రజాస్వామ్య సంప్రదాయాలు చక్కగా నిర్వర్తించవచ్చు. అటల్ జి ఈ సందర్భంగా ఈ విషయాన్ని చెప్పారు. మన దేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది, ఇందులో వైవిధ్యాలు కూడా ఉన్నాయి. కాబట్టి మన జాతీయ దృష్టికోణం నుంచి దారి మళ్లకుండా ఉండడం చాలా ముఖ్యం. జాతీయ దృక్కోణం ఎప్పుడు కేంద్రబిందువుగా ఉండాల్సిందే కానీ జాతీయ దృక్పథం, రాష్ట్ర ప్రయోజనాల మధ్య సమతుల్యం ఉండాలి. ఆ సమతుల్యం తోనే ఈ విధమైన ఆలోచన ని మనం ముందుకు తీసుకెళ్లగలం. కేవలం గౌరవనీయ సభ్యుల వల్లనే ఇది సాధ్యం, మనమంతా ఈ దిశలో నిరంతరం పనిచేస్తున్నామని నేను భావిస్తున్నాను. తనిఖీలు, సమతుల్య మూల సిద్ధాంతాలు (checks and balances principle) రాజ్యసభ కి చాలా ముఖ్యం. కానీ తనిఖీ చేయడం, అడ్డుపడడం మధ్య స్పష్టత

ఉండాలి. అలాగే సమతుల్యం, అడ్డు పడడం మధ్య కూడా స్పష్టత ఉండాలి. సభలో చర్చలు, సంభాషణలు, ఉపన్యాసాలు ఉండాలని ఎంతో మంది ప్రముఖులు ఎన్నోసార్లు చెప్పారు. పెద్ద గొంతుతో వాదించుకోవచ్చు. అందులో ఎటువంటి నష్టమూ లేదు కానీ మనము ఇంకొకరికి అడ్డుపడడం కన్నా సంభాషించు కోవడం అనే దారినే ఎన్నుకోవాలి. నేను ఈరోజు ఎన్.సి.పి, బిజెడి పార్టీల గురించి ప్రస్తావిస్తాను. నేను ఎవరి పేరైనా మర్చిపోతే క్షమించండి. నేను కేవలం ఈ రెండు పార్టీల గురించే ప్రస్తావిస్తున్నాను. ఈ రెండు పార్టీల ప్రత్యేకత ఏంటంటే వారు సభ మధ్యలోకి వెళ్ళకూడదని నిర్ణయించుకున్నారు. ఈ పార్టీల నుండి ఒక్క సభ్యుడు కూడా ఆ నియమాన్ని ఉల్లంఘించలేదు. ఈ నియమాన్ని నా పార్టీతో సహా అన్ని రాజకీయ పార్టీలు పాటించాలి. మనం నేర్చుకోవలసింది ఏంటంటే ఈ నియమాన్ని పాటించినా కూడా ఎన్సీపీ, బీజేడీ పార్టీల రాజకీయ గమనం ఆగలేదు. దీని అర్థం ప్రజల హృదయాలు గెలుచుకోవాలన్నా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలన్నా సభ మధ్యలోకి దూసుకువెళ్లి అడ్డంకులు సృష్టించాల్సిన అవసరం లేదు. నా ఉద్దేశంలో అధికార పార్టీతో సహా మనమందరము ఇటువంటి ఉన్నత సంప్రదాయాల నుంచి నేర్చుకోవాలి. ఎందుకంటే ఈ సాంప్రదాయాలు పాటించడం వల్ల ఏ విధమైన రాజకీయ నష్టం జరగలేదు. వారంతా కూడా మన ముందే ఉన్నారు. అందుకే నేను మొత్తం సభను ఉద్దేశించి ఈ మాట చెబుతున్నాను, ఎన్సీపీ, బిజెపి పార్టీలు పాటిస్తున్న ఈ నియమాన్ని చర్చించి వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేయాలి. ఈరోజు మనం 250వ సమావేశం జరుపుకుంటున్న సందర్భంగా ఇలాంటి గొప్ప సంఘటనల్ని ప్రస్తావించి ప్రజల దృష్టికి తీసుకురావాలని నేను నమ్ముతున్నాను. సభా గౌరవాన్ని కాపాడడానికి ప్రతి సభ్యుడు తన పాత్రను నిర్వహిస్తారని నేను కచ్చితంగా నమ్ముతున్నాను. మీ బాధ, వ్యధ ఇక్కడ ప్రతిబింబిస్తూనే ఉంటుంది. 250వ సమావేశం సందర్భంగా అందరికీ సాధ్యమైనంత తక్కువ బాధ కలిగేలా, వారి అభిప్రాయాలకు గౌరవం కలిగే లాగా ప్రవర్తిస్తామని మనమందరం

ప్రతిజ్ఞ చేద్దాం. క్రమశిక్షణతో మీ ఆశలకు అనుగుణంగా ఈ సభను నిర్వహించడంలో మేము భాగస్వాములం అవుతామని తెలియజేసుకుంటున్నాను. ఈ సంకల్పం తో మరోసారి ఈ ముఖ్యమైన రోజున ప్రతి ఒక్కరికి నా అభినందనలు తెలియజేసుకుంటున్నాను. అలాగే ఈ సభను ఈ స్థాయికి తీసుకు వచ్చిన ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు. ఈ మాటలతో నా ఉపన్యాసాన్ని ముగిస్తున్నాను. ధన్యవాదాలు.

70వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా
పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ
గారి ప్రసంగం.

26 నవంబర్ 2019

70 వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి ప్రధాన మంత్రి గారి ప్రసంగం

26 నవంబర్ 2019

గౌరవనీయులైన రాష్ట్రపతి గారు, ఉప రాష్ట్రపతి గారు, స్పీకర్ గారు, శ్రీ ప్రహ్లాద్ గారు, గౌరవనీయులైన ప్రజాప్రతినిధులు. గతంతో మన సంబంధాన్ని పటిష్ట పరుచుకుంటూ భవిష్యత్తు కోసం కృషి చేయడానికి కొన్ని సందర్భాలు ఉంటాయి. ఈరోజు 26 నవంబర్ ఒక చరిత్రాత్మక రోజు. 70 సంవత్సరాల క్రితం మనం కొత్తరూపు ఉన్న భారత రాజ్యాంగాన్ని ఆమోదించాము. కానీ అదే 26 నవంబర్ తేదీన మన దేశానికి చెందిన గొప్ప సంప్రదాయాలను, వేల సంవత్సరాల సాంస్కృతిక సంపదను, వసుధైక కుటుంబం అనే ఆలోచనను, మన జీవన విధానాన్ని చిన్నాభిన్నం చేసే ప్రయత్నం ఉగ్రవాదులు ముంబైలో చేశారు. ఆ సందర్భంగా ప్రాణాలు కోల్పోయిన వారందరికీ నా జోహార్లు. ఏడు దశాబ్దాల క్రితం ఇదే సెంట్రల్ హాల్లో రాజ్యాంగంలోని ప్రతి అధికరణాన్ని వివరంగా చర్చించడంలో పవిత్ర గళాలు ప్రతిధ్వనించాయి. వాదోపవాదాలు వెల్లువెత్తాయి, యదార్థాలు తెర ముందుకు వచ్చాయి. అభిప్రాయాలపై తర్జన భర్జనలు జరిగాయి. నమ్మకాల గురించి, కళల గురించి, సంకల్పాల గురించి చర్చించడం జరిగింది. ఒక విధంగా ఈ సభాప్రాంగణ జ్ఞానం మహాకుంభ్ లాంటిది. ఇక్కడ నలుమూలలనుంచి కలల్ని సాకారం చేయడానికి ఎంతో కృషి జరిగింది. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారు, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు, సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు, పండిత నెహ్రూ గారు, ఆచార్య శుక్రానీ గారు, మౌలానా ఆజాద్ గారు, పురుషోత్తం దాస్ టాండన్ గారు, సుచేత కృపలానీ గారు, ఎల్ డి కృష్ణస్వామి అయ్యర్ గారు, ఎన్ కె గోపాలస్వామి అయ్యంగార్ గారు, జాన్ మథాయి గారు ఈ విధంగా ఎందరో మహనీయులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వారి తోడ్పాటును అందించడం ద్వారా ఈ విశిష్ట వారసత్వాన్ని మనకు అప్పజెప్పారు. ఈ

సందర్భంగా ఆ మహనీయులను స్మరించుకుంటూ, వారికీ గౌరవప్రదమైన శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. ఆ రోజు బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగాన్ని స్వీకరించడానికి ఒక్క రోజు ముందు అంటే 25 నవంబర్ 1949 న ఆయన చేసిన చివరి ప్రసంగంలో చెప్పిన కొన్ని అంశాలు ప్రస్తావించదలచుకున్నాను. భారతదేశం 1947లో స్వాతంత్ర్యం పొందడం లేదా 1950లో గణతంత్రంగా ఆవిర్భవించడం జరిగిందని బాబా సాహెబ్ గారు యావత్ దేశానికి గుర్తు చేస్తూనే వాస్తవంగా అలా జరగలేదని చెప్పారు. భారతావని ఎప్పటినుంచో స్వతంత్రంగా ఉండేది. ఇక్కడ ఎన్నో గణతంత్ర రాజ్యాలు ఉండేవి. వారు వారి ఆవేదన వ్యక్తపరుస్తూ, మనం స్వాతంత్ర్యాన్ని, గణతంత్ర స్వభావాన్ని మన తప్పిదాల వల్ల కోల్పోయామని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో మన దేశం స్వాతంత్ర్యం సాధించినప్పటికీ, గణతంత్రంగా ఆవిర్భవించినప్పటికీ, వాటిని నిలబెట్టుకోగలమా అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మనం గతం నుంచి నేర్చుకో గలమా?

బాబా సాహెబ్ గారు ఈరోజు ఇక్కడ ఉండి ఉంటే వారు వేసిన ప్రశ్నలకు ఇన్ని సంవత్సరాలలో భారతదేశం ఇచ్చిన సమాధానాలు, స్వాతంత్ర్యాన్ని ప్రజాస్వామ్యాన్ని సుసంపన్నం చేసిన విధానం, అలాగే మనల్ని మనం బలోపేతం చేసుకున్న పద్ధతిని చూసి చాలా సంతోషించేవారు. ఈ సందర్భంగా గత 70 సంవత్సరాలుగా రాజ్యాంగ స్ఫూర్తిని పదిలంగా కాపాడిన కార్యనిర్వాహక, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థకు చెందిన సభ్యులందరినీ స్మరిస్తూ నా వందనాలు. ప్రత్యేకించి, భారత ప్రజాస్వామ్యం పై నమ్మకాన్ని చూపించిన 130 కోట్ల మంది భారతీయులకు నా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మన రాజ్యాంగాన్ని ఒక పవిత్ర గ్రంధంగా, దారి చూపించే కాంతిగా పరిగణిస్తున్నాం.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన 70 సంవత్సరాలలో సంతోషం, శ్రేష్ఠత, ముగింపు వంటి మిశ్రమ భావాలు కలిగాయి. ఈ సంతోషం మన రాజ్యాంగ స్ఫూర్తి దృఢంగా, స్థిరంగా

ఉన్నందువలన కలిగింది. ఆ స్ఫూర్తికి భంగం కలిగించేందుకు జరిగిన కుట్రలను మన దేశ పౌరులు కలిసికట్టుగా భగ్నం చేశారు. రాజ్యాంగానికి ఏ విధమైన హానీ జరగకుండా చూసుకున్నాం. మన రాజ్యాంగ బలంతో శ్రేష్ఠత్వము నమోదుచేసి 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' దిశగా పయనిస్తున్నాము. రాజ్యాంగ పరిధిలో అనేక సంస్కరణలు చేశాం. కొత్త భవిష్యత్తు కోసం, నూతన భారత్ కోసం, వైవిధ్యమైన, విశాలమైన భారతదేశం పురోగతి సాధించాలంటే రాజ్యాంగమే ఏకైక మార్గం. రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవడానికి ఇదే మార్గం. మన రాజ్యాంగం ఒక మహోన్నతమైన పవిత్ర గ్రంథం. ఈ గ్రంథం మన జీవనం, మన సమాజం, మన సాంప్రదాయాలు, మన నమ్మకాలు, మన ప్రవర్తన, మన విలువల చుట్టూ ఆవరించి ఉంది. ఎన్నో సమస్యలకి పరిష్కారాలు ఉన్నాయి మన రాజ్యాంగం ఎందుకింత విశాలమైనది అంటే బయటి వెలుతురు కోసం కిటికీలు తెరిచి ఉంచడం వలన. ఆ వెలుతురును మరింత ప్రజ్వలితం చేసేందుకు అవకాశాలు ఉన్నాయి.

ఈ సందర్భంగా నేను 2014 లో ఎర్రకోట నుంచి మాట్లాడిన మాటలు మళ్ళీ చెప్పదలుచుకున్నాను. నేను రాజ్యాంగం గురించి రెండు పదాలలో చెప్పాలంటే భారతీయుల గౌరవం, భారత ఐక్యత అని చెప్తాను. ఈ రెండు మంత్రాలను మన రాజ్యాంగం నెరవేర్చింది. రాజ్యాంగం పౌరుల గౌరవానికి సర్వోన్నత స్థానం ఇస్తూ భారతీయ ఐక్యత, సమగ్రతను కాపాడుకుంటూ వచ్చింది. మన రాజ్యాంగం విశ్వ ప్రజాస్వామ్యానికి గొప్ప ఉదాహరణ. ఇది మన హక్కుల గురించే కాకుండా బాధ్యతల గురించి కూడా చెబుతుంది. ఒక విధంగా మన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత లౌకిక మైనది. మనమేం చేయగలమో, ఎంత పెద్ద కలలు కనుగలమో, ఎక్కడికి చేరుకోగలమో వీటికి ఒక పరిమితి లేదు. రాజ్యాంగం తనకు తానే హక్కుల గురించి మాట్లాడుతూనే విధులు నిర్వర్తించాలనే బాధ్యతను తనలో ఇముడ్చుకుంది. మనం ఒక వ్యక్తిగా, ఒక కుటుంబంగా, ఒక సమాజంగా మన విధుల పట్ల మన రాజ్యాంగం,

మన దేశం లాగా గంభీరంగా ఉన్నామా? రాజేంద్ర బాబు గారు చెప్పినట్టు రాజ్యాంగంలో రాయబడనిది ఒక ఆనవాయితీగా మనం పాటించాలి. ఇదే మన దేశం ప్రత్యేకత. గడిచిన దశాబ్దాలలో మనం మన హక్కుల గురించి గట్టిగా మాట్లాడాం. అది అత్యవసర మే కాకుండా తప్పనిసరి కూడాను. ఎందుకంటే సమాజంలో నెలకొని ఉన్న కొన్ని వ్యవస్థలు, మన సమాజంలోని సింహ భాగానికి వారి హక్కులు దక్కకుండా తిరస్కరించాయి. హక్కులని పరిచయం చేయకుండా, సమానత్వం, న్యాయం ప్రాముఖ్యతని ఈ పెద్ద వర్గానికి తెలియపరచడం సాధ్యం కాదు. కానీ ఈరోజు దేశ పౌరులుగా మన హక్కులను వినియోగించుకుంటూనే మన బాధ్యతల్ని, కర్తవ్యాల్ని నిర్వర్తించాలి. ఎందుకంటే మనం మన బాధ్యతలు నిర్వర్తించకుండా, మన హక్కులను కాపాడుకోలేము.

హక్కులు, విధుల మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఈ విషయాన్ని మహాత్ముడు చాలా స్పష్టంగా వివరించి చెప్పారు. ఈరోజు దేశం పూజ్య బాపూజీ 150వ జయంతిని జరుపుకుంటున్న తరుణంలో వారి గురించి ప్రస్తావించడం సముచితం. హక్కు అనేది చక్కగా నిర్వర్తించిన విధి అని వారు అనేవారు. వారు ఒక సందర్భంలో ఏమి వ్రాసారు అంటే, "నేను నిరక్షరాస్యులైన, వివేకం కలిగిన నా తల్లి నుండి ఒక విషయం నేర్చుకున్నాను. మనము నిజాయితీగా, అంకితభావంతో నిర్వర్తించిన విధుల నుండి మన హక్కులు జనిస్తాయి అని ఆవిడ చెప్పేది. గత శతాబ్దం లోని చివరి దశాబ్దాలలో ప్రపంచం పౌర హక్కుల గురించి మాట్లాడుతుంటే, గాంధీ గారు మాత్రం ఒక్క అడుగు ముందుకు వేసి విధుల గురించి కూడా మాట్లాడదాం అన్నారు. 1947 లో యునెస్కో డైరెక్టర్ జనరల్ డాక్టర్ జూలియన్ హక్స్ లే 60 మంది ప్రముఖులకి ఒక లేఖ రాస్తూ వారి మార్గదర్శకత్వాన్ని కోరారు. మానవ హక్కుల తాలూకు ప్రపంచ నియమావళికి ఏది ప్రాతిపదిక అయితే బాగుంటుందో సూచించాల్సిందిగా ఆయన కోరారు. ఆ లేఖలలో మహాత్మాగాంధీ సహా ప్రపంచంలోని పలు ప్రముఖుల

అభిప్రాయాలు కోరారు. కానీ మహాత్మా గాంధీ గారి ఆలోచనలు వేరే విధంగా ఉండేవి. వారి ఉద్దేశంలో పౌరులు వారి విధులను పూర్తిగా నిర్వర్తించినప్పుడే వారు హక్కులను పొందగలరు. ఒక విధంగా మనం విధులు నిర్వర్తించినప్పుడే మనం మన హక్కులను కాపాడుకోగలం. గాంధీ మహాత్ముడు ఈ ఆలోచనలకు ఆద్యుడు. మనం విధులు, కర్తవ్యాల గురించి మాట్లాడుతున్నప్పుడు ఇవి సాధారణ బాధ్యతలు, ఏవైతే మన సంకల్పాలను నిజం చేసే దిశగా మనం నిర్వర్తించాల్సి ఉంటుందో అని. మనం సేవను విధిగా భావించే విషయం పట్ల కూడా శ్రద్ధ వహించాలి. ప్రతి సమాజానికి సేవలు, విలువలు, సాంప్రదాయాలు చాలా ముఖ్యం. కానీ విధి అనేది సేవ కంటే ఎక్కువ. కొన్నిసార్లు మనం దీని పట్ల శ్రద్ధ వహించం. రోడ్డు మీద ఒక వ్యక్తికి మనం సహాయం చేస్తే అది సేవ. అలాంటి సేవ భావమే మానవ జాతిని, సమాజాన్ని బలోపేతం చేస్తుంది. విధి దీనికి కొంచెం భిన్నం. దారిలో ఎవరికైనా సాయం చేయడం మంచిదే కానీ ట్రాఫిక్ నియమాలు పాటించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే వ్యవస్థలో భాగం అవ్వడం మన బాధ్యత. మీరు చేసే పని వల్ల మీ దేశం బలోపేతం అవుతుందా లేదా? అనే ప్రశ్న మనకి మనమే వేసుకోవాలి. ఒక కుటుంబ సభ్యునిగా మనం మన కుటుంబాన్ని బలోపేతం చేస్తాం. అదేవిధంగా, మన దేశాన్ని శక్తివంతం చేసేలా, మరింత బలోపేతం చేసేలా ఒక పౌరుడిగా ఆ దిశగా మనం పని చేయాలి.

ఒక పౌరుడు తన పిల్లవాడిని బడికి పంపించడం వల్ల తల్లిదండ్రుల బాధ్యత నెరవేరినట్లు కానీ అదే తల్లిదండ్రులు తమ పిల్లల్ని మాతృభాష నేర్చుకోమని చెబితే అది ఒక పౌరుడిగా బాధ్యతలను నిర్వర్తించినట్టు. ఆ విధంగా వారు దేశ సేవ చేసినట్టు. అలాగే ఒక వ్యక్తి ప్రతి నీటి బిందువును ఆదా చేసినా అది వారు తమ పౌర విధిని నిర్వర్తించిన్నట్లు అవుతుంది.ఒకరు చెప్పకుండా పౌరులు వారికి వారి వెళ్లి టీకా వేయించుకున్న వారు వారి విధులను నిర్వర్తించిన్నట్లు అవుతుంది. ఒకరు తనని ఒప్పించే అవసరం లేకుండా ఒక పౌరుడు ఓటు

హక్కును వినియోగించుకుంటే తను తన విధిని నిర్వర్తించిన్నట్లు అవుతుంది. సకాలంలో పన్నులు చెల్లించడం విధిని నిర్వర్తించే ఇలాంటి బాధ్యతలు ఎన్నో ఉన్నాయి. ఒక పౌరుడు ఇలాంటి బాధ్యతల్ని సహజంగా, పవిత్రంగా చేసినప్పుడు మన దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం సులభం అవుతుంది. ప్రతి పౌరుడి మదిలో ఇలాంటి ప్రశ్నలు పతాకస్థాయిలో లేకపోతే మన పౌర ధర్మం బలహీనంగా మిగిలిపోతుంది. అది ఏదో ఒక రూపంలో వేరొకరి హక్కులకు హాని చేయవచ్చు. కావున ఇతరుల హక్కులను కాపాడడం కోసం మనం మన విధులపై శ్రద్ధ వహించాలి. ప్రజాప్రతినిధులుగా మనకు మరిన్ని బాధ్యతలు ఉంటాయి. ఒకవైపు రాజ్యాంగ విలువలను పటిష్టం చేసుకుంటూ మరోవైపు మనల్ని మనం ఆదర్శవంతులుగా నిరూపించుకోవాలి. అది మన బాధ్యత. సమాజంలో అర్థవంతమైన మార్పు తీసుకురావడానికి మన విధులు నిర్వర్తించాలి. ప్రతి కార్యక్రమంలో, ప్రతి చర్చలో మనం మన బాధ్యత పై దృష్టి సారించాలి. ప్రజలతో మాట్లాడుతున్నప్పుడు మనం నిధుల గురించి తప్పకుండా ప్రస్తావించాలి. మన రాజ్యాంగం "భారత ప్రజలమైన మేము" అని మొదలవుతుంది, భారత ప్రజలే భారతదేశపు బలం. మనమే దీని ప్రేరణ, మనమే దీని ఉద్దేశ్యం.

"నేను - సమాజం కోసం, దేశం కోసం నేను" అనే భావమే విధులకు సంకేతం. ఇదే మన ప్రేరణ కి కారకం. ఈ సంకల్పంతో బాధ్యతాయుతమైన పౌరులుగా మీరు మీ విధులను నిర్వర్తించాలి అని పిలుపునిస్తున్నాను. రండి! మనం మన గణతంత్రాన్ని - మనమందరం మన విధులలో నిమగ్నమయ్యే కొత్త సంస్కృతి దిశగా తీసుకు వెళ్దాం. మనమందరం కొత్త పౌరులుగా పవిత్ర పౌరులుగా మారదాం. ఈ రాజ్యాంగ దినోత్సవం మన రాజ్యాంగ సిద్ధాంతాలను నిలబెడుతుందని, దేశ నిర్మాణంలో అంకితభావంతో పని చేసేందుకు

తోడ్పడుతుందని, రాజ్యాంగ కార్యకర్తలు కన్న కలలు నిజం చేసే శక్తిని ప్రసాదిస్తుందని ఆశిస్తున్నాను.

ఈ పవిత్ర ప్రాంగణంలో జరిగిన మేధోమథనం ఈనాటికీ ఇక్కడ ప్రతిధ్వనిస్తుంది. ఈ ప్రతిధ్వని మనల్ని ఆశీర్వదిస్తుంది, ప్రేరేపిస్తుంది, మనకి శక్తిని ఇస్తుంది. ఈ ప్రతిధ్వని మనకి ఒక దిశ సూచించడం తధ్యం. ఈ భావంతో మరో సారి పూజనీయులైన బాబాసాహెబ్ అంబేద్కర్ గారికి పవిత్ర సందర్భ మైన రాజ్యాంగ దినోత్సవం నాడు నమస్కరిస్తున్నాను. రాజ్యాంగ కర్తలకు శిరస్సువంచి నమస్కరిస్తున్నాను. దేశ ప్రజలందరికీ నా శుభాకాంక్షలు. ధన్యవాదాలు.

2020



కిసాన్ క్రెడిట్ కార్డ్ యోజన లబ్ధిదారితో శ్రీ నరేంద్ర మోదీ.

"కిసాన్ కళ్యాణ్ మేళాలో ప్రసంగిస్తున్న శ్రీ నరేంద్ర మోదీ. మన దేశంలోని రైతుల ఆత్మవిశ్వాసమే మన ముఖ్యమైన బలం."

శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటు సందర్భంగా లోక్ సభలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రసంగం.

5 ఫిబ్రవరి 2020

శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ యొక్క స్థాపన - 5 ఫిబ్రవరి 2020

గౌరవనీయులైన స్పీకర్ సర్,

ఈ రోజున నేను, ఒక అతి ముఖ్యమైనటువంటి, చరిత్రాత్మకమైనటువంటి విషయానికి సంబంధించిన సమాచారాన్ని దేశానికి వెల్లడించడం కోసం, మీ మధ్యకు ప్రత్యేకంగా విచ్చేశాను.

ఈ విషయం మన సాటి కోట్లాది సోదరీమణులకు, సోదరులకు మల్లేనే నా హృదయానికి కూడా ఎంతో సన్నిహితమైనటువంటి విషయం. మరి దీనిని గురించి మాట్లాడటాన్ని నేను ఎంతో గౌరవప్రదం గా భావిస్తున్నాను. ఈ విషయం శ్రీ రామ జన్మ భూమి తో ముడిపడి ఉంది. ఇది అయోధ్య లో భగవాన్ శ్రీ రాముని జన్మ స్థలం లో ఒక వైభవోపేతమైనటువంటి ఆలయ నిర్మాణానికి సంబంధించింది.

గౌరవనీయులైన స్పీకర్ సర్,

2019వ సంవత్సరం నవంబర్ 9వ తేదీ నాడు గురు నానక్ దేవ్ జీ 550వ ప్రకాశ్ పర్వ్ సందర్భంగా కర్ తార్ పుర్ సాహిబ్ కారిడార్ ను దేశ ప్రజలకు అంకితం ఇవ్వడం కోసం నేను పంజాబ్ కు వెళ్ళాను. అటువంటి పవిత్రమైన వాతావరణం లో రామ జన్మ భూమి విషయం పై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన చరిత్రాత్మక నిర్ణయాన్ని గురించి నేను తెలుసుకోవడం జరిగింది.

వివాదంలో ఉన్నటువంటి రామ జన్మ భూమికి సంబంధించిన అంతర, బాహ్య ప్రాంగణాల పై భగవాన్ శ్రీ రామ్ లాలా విరాజ్ మాన్ కు హక్కు ఉందని మాననీయ సర్వోన్నత న్యాయస్థానం ఆ నిర్ణయంలో పేర్కొంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకదానితో మరొకటి సంప్రదింపులు జరుపుకొని, 5 ఎకరాల భూమి ని సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు కేటాయించాలని కూడా మాననీయ సర్వోన్నత న్యాయస్థానం తన ఆదేశంలో తెలిపింది.

గౌరవనీయులైన స్పీకర్ సర్,

ఈ రోజున ఈ సమున్నత సభ దృష్టికి, యావత్తు దేశం దృష్టికి నేను ఎంతో సంతోషంతో తెలియజేసేది ఏమిటంటే- కేంద్ర మంత్రివర్గం ఇవాళ ఉదయం సమావేశమై, సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలను పరిగణన లోకి తీసుకొని ఈ అంశం లో ముఖ్యమైన నిర్ణయాలను చేసింది.

సర్వోన్నత న్యాయస్థానం నిర్దేశించిన దానికి అనుగుణంగా మా ప్రభుత్వం భగవాన్ శ్రీ రాముని జన్మ స్థలం లో ఒక భవ్య మందిరాన్ని నిర్మించేందుకు, సంబంధిత ఇతర అంశాల పై ఒక సమగ్ర పథకాన్ని రూపొందించింది.

సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు – "శ్రీ రామ్ జన్మ భూమి తీర్థ క్షేత్ర" – అనే ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ట్రస్టును ప్రారంభించాలనే ఒక ప్రతిపాదనకు ఆమోదం తెలియజేయడమైంది.

అయోధ్యలో భగవాన్ శ్రీ రాముని జన్మ స్థలంలో ఒక చాలా గొప్పదైనటువంటి, పవిత్రమైనటువంటి శ్రీ రామ దేవాలయాన్ని నిర్మించేందుకు, దానితో సంబంధం ఉన్న అంశాలలో నిర్ణయాలు తీసుకొనేందుకు ఈ ట్రస్టుకు పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది.

గౌరవనీయులైన స్పీకర్ సర్,

మాననీయ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా, కూలంకుష సంప్రదింపులు, చర్చోపచర్చలు జరిపిన అనంతరం, సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు 5 ఎకరాల భూమిని కేటాయించవలసిందిగా ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని అభ్యర్థించడమైంది. దీనికి, ఆ రాష్ట్ర ప్రభుత్వం కూడా సమ్మతిని వ్యక్తం చేసింది.

గౌరవనీయులైన స్పీకర్ సర్,

భగవాన్ శ్రీ రాముని దివ్య ఘనతను, అయోధ్య చారిత్రక సందర్భాన్ని, అలాగే అయోధ్య ధామ్ పవిత్రతను గురించి మనందరికీ ఎంతో బాగా తెలుసు. ఇవన్నీ కూడా భారతదేశం ఆత్మకు, ఆదర్శాలకు, నైతికతకు అభిన్నమైనటువంటివిగా ఉన్నాయి.

అయోధ్యలో భగవాన్ శ్రీ రామునికి ఒక భారీ మందిర నిర్మాణం, వర్తమానం కాలం లోను, భవిష్యత్తు కాలం లోను రామ్ లాలా దర్శనం కోరి తరలివచ్చే తీర్థ యాత్రికుల సంఖ్యను, అలాగే వారి భావోద్వేగాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మరొక ముఖ్యమైన నిర్ణయాన్ని కూడా తీసుకొన్నది.

అయోధ్య చట్టం పరిధి లో సేకరించినటువంటి మొత్తం సుమారు గా 67,703 ఎకరాల భూమి (దీని లో లోపలి, వెలుపలి ప్రాంగణాలు కూడా కలసివున్నాయి)ని నూతనంగా

ఏర్పాటైన "శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర" ట్రస్టు కు ధారదత్తం చేయాలని నా ప్రభుత్వం నిర్ణయించింది.

గౌరవనీయులైన స్పీకర్ సర్,

2019వ సంవత్సరం నవంబర్ 9వ తేదీ నాడు రామ జన్మభూమి అంశం లో కోర్టు ఉత్తర్వు వెలువడిన అనంతరం భారతదేశ ప్రజలు మన ప్రజాస్వామిక వ్యవస్థల పట్ల సంపూర్ణ విశ్వాసాన్ని కలిగివుంటూ, గొప్ప పరిణతిని ప్రదర్శించారు. మన సాటి పౌరుల పరిపక్వత కలిగిన నడవడికకు ఈ రోజున ఈ సభలో నమస్కరిస్తున్నాను.

మన సంస్కృతి, మన సంప్రదాయాలు మనకు "వసుధైవ కుటుంబకమ్", "సర్వే భవన్తు సుఖిన:" ల తాలూకు తత్వాన్ని ప్రసాదించాయి. మరి ఈ స్ఫూర్తి తో ముందుకు సాగడానికి మనకు ప్రేరణను అందించాయి. భారతదేశంలో అన్ని విశ్వాసాలకు చెందిన ప్రజలు, వారు హిందువులు కావచ్చు, ముస్లిములు కావచ్చు, సిఖ్ఖులు కావచ్చు, క్రైస్తవులు కావచ్చు, బౌద్ధులు కావచ్చు, పారశీలు లేదా జైనులు కావచ్చు.. అందరూ ఒక పెద్ద పరివారం లో సభ్యులే.

ఈ కుటుంబం లోని ప్రతి ఒక్క సభ్యుడు/సభ్యురాలు అభివృద్ధి చెందుతూ, ఆరోగ్యంగాను, సంతోషంతోను ఉంటూ, సౌభాగ్యాన్ని పొందుతూ, మన దేశం పురోగమించాలనే భావన తో నా ప్రభుత్వం 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్' సూత్రం తో ముందుకు కదులుతున్నది.

ఈ ప్రాముఖ్యం గల ఘడియలో అయోధ్యలో శ్రీ రామ్ ధామ్ జీర్ణోద్ధారణకై భారీ రామ మందిర నిర్మాణం కోసం ముక్తకంఠంతో మద్దతును ఇవ్వడంలో కలసి రావలసిందిగా నేను ఈ సమున్నత సభా సభ్యులందరికి పిలుపునిస్తున్నాను.

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

6 ఫిబ్రవరి 2020

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 6 ఫిబ్రవరి 2020

గౌరవనీయులైన స్పీకర్ గారు, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా నా కృతజ్ఞతలను వ్యక్తం చేయడానికి నేను ఇక్కడ నిలబడ్డాను. మాననీయ రాష్ట్రపతిగారు తన ప్రసంగం లో 'న్యూ ఇండియా' తాలూకు దార్శనికతను వెల్లడించారు. 21వ శతాబ్దం లో మూడో దశాబ్ది లో గౌరవనీయ రాష్ట్రపతి చేసినటువంటి ఈ ప్రకటన ఈ దశాబ్దం లో మనందరికి దిశను ఇచ్చేటటువంటి, దేశానికి చెందిన కోట్లాది పౌరులలో విశ్వాసాన్ని పెంపొందించే, మరి వారికి ప్రేరణను ఇచ్చేటటువంటి ఒక ప్రసంగం. ఈ చర్చలో అనుభవజ్ఞులు అయినటువంటి గౌరవనీయ సభ్యులు అందరూ వారి వారి అభిప్రాయాలను చాలా ప్రభావవంతమైన రీతిలో వెలిబుచ్చారు. అలాగే, వారి వ్యక్తిగత అభిప్రాయాలను కూడా సభ లో వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు వారిదైన శైలి లో చర్చను పరిపుష్టం చేయడానికి ప్రయత్నించారు. శ్రీ అధీర్ రంజన్ చౌధరీ గారు, డాక్టర్ శశి థరూర్ గారు, శ్రీ ఒవైసీ గారు, శ్రీ రాంప్రతాప్ యాదవ్ గారు, శ్రీ ప్రీతి చౌధరీ గారు, శ్రీ మిశ్రా గారు, శ్రీ అఖిలేశ్ యాదవ్ జీ, ఇలా చాలా పేర్లు ఉన్నాయి. నేను గనుక ప్రతి ఒక్క పేరు ను చెప్పాలి అంటే అందుకు సమయం సరిపోదు. ప్రతి ఒక్కరు వారి ఆలోచనలను వారిదైన తరహాలో సభలో తెలియజేశారు. కానీ, ఈ పనులన్నింటి విషయం లో ప్రభుత్వం అంత హడావుడి పడుతోంది ఎందుకు? అనేటటువంటి ఒక ప్రశ్న ఉదయించింది. అన్ని పనుల ను ఒకేమారు ఎందుకు చేస్తున్నట్లు?

నేను ఆరంభం లో శ్రీ సర్వేశ్వర్ దయాళ్ గారి కవితను గురించి ప్రముఖంగా ప్రస్తావించదలచాను. అది బహుశా మా ప్రభుత్వం స్వభావాన్ని, అలాగే, మా సంస్కృతి ని

కూడా సూచించవచ్చును. మేము పాత పంథా నుండి దూరంగా జరిగి, ఒక వేగవంతమైన రీతి లో ముందుకు పోయేందుకు ప్రయత్నం చేస్తున్నాం.

సర్వేశ్వర్ దయాళ్ గారు తన కవిత లో...

లీక్ పర్ వే చలేస్ జిస్ కే

చరణ్ దుర్బల్ ఔర్ హారే హై,

హమే తో జో హమారీ యాత్రా సే బనే

ఐసే అనిర్మిత్ పంథ్ హీ ప్యారే హై .. అని.

(ఎవరి పాదాలు, ఓడిపోయాయో, బలనమయినవో

వారే, వేసిన దారుల్లో నడుస్తారు

నాకు, నా ప్రయాణంలో

నేను సృష్టించిన దారే ప్రియమయినది)

గౌరవనీయులైన అధ్యక్షా,

ప్రస్తుతం, ప్రజలు కేవలం ప్రభుత్వాన్ని మార్చారు అనేది కాదు ప్రసక్తి. వారి ఆసక్తులు కూడా మారాలని కోరుకున్నారనిపిస్తున్నది. ఒక క్రొత్త దార్శనికతతో పని చేయాలన్న అపేక్ష కారణంగా మాకు ఇక్కడకు వచ్చి సేవ చేసే అవకాశం లభించింది. అయితే, మేము కూడా ప్రతిపక్షాలు పని చేసిన విధంగా పనిచేసి ఉన్నా లేదా వారికి అలవాటైన మార్గంలో మేము

కూడా నడిచి ఉన్నా, బహుశా 70 సంవత్సరాలు గడచిపోయిన తరువాత కూడాను 370 అధికరణాన్ని ఈ దేశం లో రద్దు చేయడం అనేది జరిగి ఉండేది కాదు. వారు వెళ్లిన దారిలో వెళ్ళిన పక్షం లో 'ముమ్మారు తలాక్' అనే కత్తి, ఇప్పటికీ ముస్లిమ్ సోదరీమణులను ఇంకా భయపెడుతూనే ఉండేది. మేము గనక వారిదైన త్రోవన వెళ్లి ఉంటే, ఒక చిన్నారి బాలిక పైన అత్యాచారం జరిగిన సందర్భంలో అపరాధులకు మరణ శిక్షను విధించాలన్న చట్టం వచ్చి ఉండేదే కాదు. మేము వారి ఆలోచనల సరళిని అనుసరించిన పక్షంలో రామ జన్మ భూమి ఈ రోజున కూడా వివాదం గానే మిగిలి ఉండేది. వారిదైన విధానమే కొనసాగి ఉంటే, కర్తార్ కారిడార్ ఎన్నటికీ నిర్మాణం అయి ఉండేది కాదు. వారి విధానం, వారి పద్ధతులు మాత్రమే అమలైన పక్షం లో బాంగ్లాదేశ్ సరిహద్దు వివాదాన్ని భారతదేశం ఏనాటికీ పరిష్కరించుకొనేది కాదు.

గౌరవనీయులైన స్పీకర్ గారు,

అన్నిటి కన్నా ముందుగా కిరణ్ రిజిజు గారిని నేను అభినందిస్తున్నాను. దీనికి కారణం, ఆయన నిర్వహించినటువంటి 'ఫిట్ ఇండియా మూవ్‌మంట్'. ఫిట్ ఇండియా మూవ్‌మంట్ ను ఆయన చాలా గొప్పగా ప్రోత్సహిస్తున్నారు. ఆయన ఉపన్యాసాలు ఇస్తారు; అంతేకాక, ఆ ఉపన్యాసాల తో పాటు, జిమ్ లో ఆయన కసరత్తులు చేస్తారు. ఎందుకంటే, ఇది 'ఫిట్ ఇండియా' ఉద్యమాన్ని బలోపేతం చేస్తుంది. దీనిని ప్రోత్సహిస్తున్నందుకు గౌరవనీయ సభ్యులకు నేను ధన్యవాదాలు పలుకుతున్నాను. గౌరవనీయులైన స్పీకర్ గారు,

సవాళ్ల ను ఎదుర్కోవడం కోసం దేశం ప్రతిక్షణం ప్రయత్నం చేస్తోంది అన్న నిజాన్ని ఎవ్వరూ కూడా త్రోసి పుచ్చజాలరు. కొన్ని కొన్ని సందర్భాలలో సవాళ్ళకేసి దృష్టి ని సారించని

వారిని కూడా ఈ దేశం గమనించింది. సవాళ్ళ ను ఎదుర్కొనే సత్తా లేనటువంటి కొంతమంది వ్యక్తులను కూడా మనము చూశాము. అయితే, భారతదేశం నుండి ప్రస్తుతం ప్రపంచం ఆశిస్తోంది ఏమిటి అంటే మనం గనక సవాళ్ళను సవాలు చేయకపోయినట్లయితే, మనం గనక ధైర్యాన్ని ప్రదర్శించకపోయినట్లయితే, మనం అందరిని కలుపుకొని వేగాన్ని పెంచకపోయినట్లయితే, దేశం లెక్కలేనన్ని సమస్యల తో దీర్ఘకాలం పాటు పోరాటం చేయవలసివుంటుంది.

గౌరవనీయులైన స్పీకర్ గారు, మేము గనుక కాంగ్రెస్ అనుసరించిన మార్గాలలో వెళ్ళవలసి వస్తే, యాభై సంవత్సరాలు గడిచాక కూడా శత్రు ఆస్తుల విషయంలో చట్టం చేయడం కోసం దేశం వేచి ఉండవలసి వచ్చేది. 35 సంవత్సరాలు అయిన తరువాత కూడా, దేశం తదుపరి తరం యుద్ధ విమానం కోసం నిరీక్షించవలసి వచ్చేది. 28 సంవత్సరాలు గడిచాక కూడాను బినామీ సంపత్తి చట్టం అమలు లోకి వచ్చి ఉండేది కాదు. 20 సంవత్సరాల అనంతరం కూడాను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామకం జరిగి ఉండేది కాదు.

గౌరవనీయులైన అధ్యక్షా,

మా ప్రభుత్వం త్వరిత గతిని కలిగి ఉన్నందువల్లన, పాత ఆచారాల నుండి బయటపడి ఒక నూతనమైనటువంటి మార్గాన్ని అనుసరించాలన్నది మా ఉద్దేశ్యం. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు గడచిన తరువాత కూడా అభివృద్ధి కోసం దీర్ఘకాలం పాటు ఎదురు చూడటానికి దేశం సిద్ధంగా లేదని, అలా వేచి ఉండకూడదని మేము బాగా అర్థం చేసుకొన్నాము. అభివృద్ధి లో వేగం తో పాటు పరిమాణం కూడా పెరగాలన్నదే మా ప్రయత్నం. నిర్ణయానికి తోడుగా దృఢ దీక్ష కూడా ఉండాలి. సున్నితత్వంతో పాటు, పరిష్కారం

కూడా ఉండాలి. మేము శరవేగంగా కృషి చేశాము. అంత వేగంగా చేస్తున్న కృషి ఫలితం వలనే, దేశ ప్రజలు అయిదు సంవత్సరాలలో గమనించి, తదనంతరం అదే వేగంతోను, మరింత శక్తితోను పయనాన్ని కొనసాగించడానికి మాకు మళ్లీ నిలబడేందుకు అవకాశాన్ని ఇచ్చారు.

ఒకవేళ ఇది ఒక వేగవంతమైన ప్రయాణం కాకపోయివున్నట్లయితే, 37 కోట్ల ప్రజల బ్యాంకు ఖాతాలు అంత తక్కువ కాలంలో తెరవబడేవే కావు. ఈ వేగం త్వరితగతిని అందుకోకపోయి ఉంటే గనుక మరుగుదొడ్లు తాలూకు పని 11 కోట్ల మంది ప్రజల ఇళ్ల లో పూర్తి అయ్యేదే కాదు. ఈ వేగం పుంజుకోకపోయిన పక్షంలో, 13 కోట్ల కుటుంబాల లో గ్యాస్ స్టవ్ లు వెలిగి వుండేవి కావు. ఈ వేగం పుంజుకోకపోయి ఉంటే, పేద ప్రజానీకం కోసం 2 కోట్ల నూతన గృహాలు నిర్మాణం అయ్యేవే కాదు. ఈ వేగం శరవేగాన్ని సంతరించుకోకపోయి వుంటే గనక ఢిల్లీ చాలా కాలం పాటు 1700కు పైగా అనధీకృత గృహ సముదాయాలు, 4 మిలియన్ కు పైగా ప్రజల జీవితాలు- ఏపైతే ఒక ఆధారం లేక అల్లాడిపోతున్నాయో- వాటితోనే సరిపెట్టుకోవలసి వచ్చేది. ఆ పని ఇంకా అసంపూర్తిగానే ఉండేది. ఇవాళ వారికి వారి ఇంటి హక్కు సైతం లభించింది.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఈశాన్య ప్రాంతాన్నిగురించి కూడా ఇక్కడ చర్చించడం జరిగింది. రాజకీయ సమీకరణాలలో మార్పును తెచ్చే సామర్థ్యాన్ని సంతరించుకోవడానికి ఈశాన్య ప్రాంతాలు ఎన్నో దశాబ్దాల పాటు వేచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ అలాంటి పరిస్థితి లేనందువల్ల, ఆ ప్రాంతాలు రాజకీయ కొలబద్దలను బట్టి నిర్ణయాలు తీసుకొన్నప్పుడల్లా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఈశాన్య ప్రాంతం ఓట్ల దృష్టితో చూడాల్సిన ప్రాంతం కాదు. భారతదేశ

పౌరులకు భారతదేశ ఐక్యత, అఖండతల అండతో ఒక సుదూర ప్రాంతంలో కూర్చొన్న వారికి, వారి సత్తాను భారతదేశం అభివృద్ధి కోసం సరి అయిన విధంగా ఉపయోగించుకోవడం, దేశాన్ని ముందుకు తీసుకు పోవడం కోసం కృషి చేస్తున్నటువంటి శక్తులను తగిన ఆదరణ భావంతో వినియోగించుకోవలసి ఉంది. అక్కడ నివసిస్తున్న పౌరులందరి మీద గొప్ప నమ్మకంతో ముందంజ వేయాలన్నది మా ప్రయత్నంగా ఉంటూ వచ్చింది.

మరి ఈ కారణంగా గత అయిదు సంవత్సరాల కాలంలో ఈశాన్య ప్రాంతం దేనికైతే ఢిల్లీ ఎంతో దూరంగా ఉంది అనిపించేదో, ఈ రోజున వారి గుమ్మం ముందుకు వెళ్ళి ఢిల్లీ నిలబడింది. వారు మంత్రి కార్యాలయాన్ని క్రమం తప్పకుండా సందర్శించడం కొనసాగించారు. రెండో అంచె, మూడో అంచెల చిన్న పట్టణాలలో రాత్రి పూట మకాం పెట్టి ప్రజల తో మమేకం అయ్యి, వారి విశ్వాసాన్ని సంపాదించారు. మరి మేము 21వ శతాబ్దపు అభివృద్ధి తాలూకు అవసరాలను, అది విద్యుత్తు అయినా, రైలు మార్గం అయినా, విమానాశ్రయం అయినా, లేదా మొబైల్ కనెక్టివిటీ అయినా కావచ్చు.. నెరవేర్చడానికి ప్రయత్నం చేశాము. ఆ విశ్వాసం ఏ రకమైన ఫలితాలను ఇవ్వగలుగుతుందో ఈ ప్రభుత్వ పదవీ కాలంలో చూడవచ్చును. బోడోలను గురించిన చర్చ ఇక్కడ జరిగింది. మరి ఇది మొట్టమొదటిసారిగా చోటు చేసుకొందని ప్రస్తావనకు వచ్చింది. ఇలా మొదటిసారి జరిగిందని మేము ఏమీ అనలేదు. అనేక ప్రయోగాలు జరిగాయని, అటువంటి ప్రయోగాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయని మేము అంటున్నాము. కానీ, జరగాల్సింది అంతా జరిగిపోయింది. అది రాజకీయ కొలమానాలలో తూకం వేసి చేయడం అయింది. ఏమి చేసినప్పటికీ కూడా, అర్థ మనస్కం గా చేయడమైంది. ఏది జరిగినప్పటికిని అది కేవలం ఒక లాంఛనం. మరి ఈ కారణం గా ఒప్పందాలు కేవలం కాగితం మీద జరిగాయి; ఫోటో అచ్చు అయింది, మరి కరతాళ ధ్వనులు లభించాయి. ఆ విషయాన్ని కూడా గర్వం గా మాట్లాడుకోవడం జరుగుతోంది.

కానీ, బోడో సమస్యలను అనేక సంవత్సరాలైన తరువాత కూడా తీర్చనే లేదు. 4 వేల మందికి పైగా అమాయక ప్రజానీకాన్ని మృత్యు కుహరం లోకి నెట్టివేయడం జరిగింది. సామాజిక జీవనాన్ని అపాయం లో పడవేసేటటువంటి అనేక విధాలైన వ్యాధులు తలలు ఎత్తుతూనే ఉన్నాయి. ఈసారి కుదిరిన ఒప్పందం సైతం ఈశాన్య ప్రాంతానికి ఒక సందేశం. అలాగే, దేశం లోని సామాన్య మానవుడి కి న్యాయాన్ని అందించేవారికి కూడా ఇది ఒక సందేశం. అంతేగాక, మా కార్యాలు పదేపదే ప్రచారానికి నోచుకోవు. ఎల్లెడలా వ్యాప్తి లోకి రావు. కానీ, మేము కష్టించి పనిచేస్తాము, మా వంతు ప్రయత్నాలను కొనసాగిస్తుంటాము. అయితే, ఈ పర్యాయం జరిగిన ఒప్పందం ఒక ప్రత్యేకతని కలిగి వుంది. సాయుధ దళాలు అన్నీ కూడాను ఒక తాటి మీదకు వచ్చాయి. అన్ని అస్త్రాలతో అజ్ఞాతం లోకి వెళ్ళిన వారు అందరు లొంగిపోయారు. మరి శాంతి ఒడంబడికలోని రెండో భాగం ఏమని చెబుతోంది అంటే ఇక దీని తరువాత బోడో సమస్య కు సంబంధించిన అటువంటి ఏ ఒక్క డిమాండు ఉండదు అని. ఈశాన్య ప్రాంతం లో తొలిసారి గా ఉదయించిన రవి గా మేము ఉన్నాము. అయితే ఉషోదయం మాత్రం రానే లేదు. సూర్యుడు వస్తున్నా, చీకట్లు చెల్లాచెదురు అవలేదు. ఇవాళ ఒక క్రొత్త ఉదయం సైతం వచ్చింది. ఒక నవీనమైన ప్రభాతం కూడా విచ్చేసింది. ఒక నవ జ్యోతి సైతం చేరుకొంది. మరి ఆ కాంతి మీరు మీ కంటి అద్దాల ను మార్చుకొన్నప్పుడు మీకు కనబడుతుంది.

నా సంభాషణ మధ్య లో కాసేపు విశ్రమించేందుకు నాకు వీలు కల్పించినందుకుగాను మీకు నేను ధన్యవాదాలను పలుకుతున్నాను. నిన్నటి రోజున స్వామి వివేకానందుల వారి పేరు మీద కొన్ని విషయాలు చెప్పడమైంది. అయితే, నాకు ఒక చిన్న పాత కథ గుర్తు కు వస్తున్నది. ఒకసారి కొంత మంది ఒక రైలు లో ప్రయాణం చేస్తూ వున్నారు. మరి మనం రైలు లో ప్రయాణించేటప్పుడు ఆ రైలు వేగాన్ని అందుకొన్నప్పుడు, పట్టాల మీద నుండి శబ్దం

వస్తుందనేది ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. అక్కడ కూర్చొని ఉన్న ఒక సాధు పుంగవుడు చూడండి.. పట్టాల మీద నుండి ఎటువంటి శబ్దం వస్తోందో.. అది ప్రాణం లేనటువంటి పట్టాలు మనకు - ప్రభు కర్ దే బేడా పార్ (ఓ దైవమా, మేము మా గమ్యస్థానాన్ని చేరుకోవడం లో మాకు సహాయం చేయండి).. అని మనతో చెప్తున్నట్లుగా లేదూ.. అని అన్నారు. అయితే, మరొక్క సన్యాసి అన్నారు కదా - కాదు, ప్రభు తేరీ లీలా అపరం పార్ .. (ఈ మాటల కు- ఓ ప్రభూ మీ సృష్టి పరిపూర్ణమైనదిగా ఉంది- అని భావం) అని అన్నట్లు గా నాకు వినపడుతోంది అని. అక్కడ ఒక మౌల్వీ కూడా కూర్చొని ఉన్నారు. ఆయన నాకు మరేదో వినపడుతోంది అని అన్నారు. మీరు ఏమి ఆలకించారు చెప్పండి అంటూ సాధువులు ఆయనను అడిగారు. దానికి ఆయన- నేను యా అల్లాహ్ తేరి రహమత్.. అనే మాటలను విన్నానంటూ బదులిచ్చారు. ఈ మాటలకు 'ఓ దైవమా ఇదంతా నీ దయ' అని భావం. అక్కడ ఒక మల్లయోధుడు ఆసీనుడై ఉన్నాడు. ఆ పహల్వాన్ అన్నాడు కదా, తాను- ఖా రబ్ డీ కర్ కసరత్ .. అని. (దీని అర్థం రబ్బీ ని తిని కసరత్తు చేయి అని).

నిన్నటి రోజున వివేకానందుల వారి పేరిట చెప్పబడిన సంగతి ఏమిటంటే, మస్తిష్కం లో ఏదైతే ఉందో అది నోటి వెంబడి వచ్చే మాటల లో ప్రతిబింబిస్తుంది.. మీరు దానిని చూడాలంటే అంత దూరం వెళ్ళవలసిన అవసరం లేదు. అది చాలా దగ్గరలోనే ఉంది. గౌరవనీయులైన అధ్యక్షా,

రైతుల గురించి నేను చర్చల్లో పాల్గొన్నాను. అనేక ముఖ్యమైన పనులు... అనేక కొత్త మార్గాల్లో, సరికొత్త ఆలోచన విధానంతో గతంలోనూ పూర్తిచేయబడ్డాయి. గౌరవనీయులైన రాష్ట్రపతి గారు కూడా వీటిని తన ప్రసంగంలో ప్రస్తావించారు. కానీ, ఇక్కడ వాటిగురించి చర్చించడానికి ఒక ప్రయత్నం జరిగింది... అది తెలియక జరిగిందో, ఉద్దేశపూర్వకంగా జరిగిందో

నాకైతే తెలియదు. ఎందుకంటే... కొన్ని విషయాలు ఇలాగే ఉంటాయి- మనకు తెలిసి ఉంటే బహుశా అలా చేయలేమేమో! పంటలకు కనీస మద్దతు ధర ఒకటిన్నర రెట్లుగా ఉండాలన్నది ప్రత్యేకమైన అంశమని మనందరికీ తెలుసు. అలాగే దానిపై నిర్ణయంలో సుదీర్ఘ ప్రతిష్టంభన గురించి కూడా తెలుసు. అది మా ప్రభుత్వ హయాం కాదు... మునుపటి ప్రభుత్వ కాలంనాటిది. అయినప్పటికీ దీన్ని రైతులపట్ల మా బాధ్యతగా స్వీకరించి మేం నెరవేర్చాం. నీటిపారుదల పథకాల పనులు 80-90 శాతం పూర్తయ్యాక కూడా ఇరవయ్యేసి సంవత్సరాలుగా అదే దశలో ఆగిపోయి ఉన్నట్లు తెలిసి నేను ఆశ్చర్యపోయాను. దీన్ని గురించి ప్రశ్నించే వారెవరూ లేరు. ఒక ఫోటో పంపి, అయిపోయిందనిపించారు. ఇలాంటి 99 అసంపూర్తి పథకాల బాధ్యతను మేం స్వీకరించి, దాదాపు లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేయడంద్వారా వాటిని తార్కికంగా పూర్తిచేశాం. ఈ పథకాలద్వారా నేడు రైతులు ప్రయోజనం పొందడం జరుగుతుంది.

ఇక ప్రధానమంత్రి పంటల భీమా పథకం... దీన్ని దేశంలోని రైతులంతా నిరంతరం విశ్వసిస్తున్నారు. ఈ పథకం కింద సుమారు 13 వేల కోట్ల రూపాయల మేర రైతులు పంట భీమా రుసుము కింద చెల్లించారు. అయితే, ప్రకృతి విపత్తులు సంభవించిన నేపథ్యంలో ఈ భీమా పథకం కింద సుమారు 56 వేల కోట్ల రూపాయలదాకా రైతులు పరిహారం పొందారు. అలాగే రైతుల ఆదాయం పెరిగింది... ఇవన్నీ మా ప్రాథమ్యాలు. అలాగే సాగు వ్యయం తగ్గించాలన్నది కూడా మా ప్రాధాన్యాల్లో మరొకటి. ఇక కనీస మద్దతు ధర పేరిట లోగడ జరిగిందేమిటి? దేశంలో పప్పు దినుసులు, నూనెగింజల కొనుగోలు 7 లక్షల టన్నులు కాగా, ఇప్పుడది 100 లక్షల టన్నులకు పెరిగింది. ఈ-నామ్ పథకం ఇప్పుడు మన డిజిటల్ ప్రపంచంలో ఒకటైంది. ప్రపంచ స్థాయిలో ధరలు ఎలా ఉన్నాయో మన రైతులు ఇప్పుడు తమ మొబైల్ ఫోన్లద్వారా తెలుసుకుని అర్థం చేసుకుంటున్నారు. ఆ మేరకు ఈ-నామ్ పథకం

ద్వారా తమ మార్కెట్లో వారు పంట ఉత్పత్తులను విక్రయించుకోవచ్చు. ఇప్పటిదాకా ఈ వ్యవస్థలో 1.75 కోట్ల మంది రైతులు భాగస్వాములు కావడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది. అదేవిధంగా ఈ-నామ్ పథకం కింద రైతులు తమ ఉత్పత్తులను విక్రయించడంద్వారా లక్ష కోట్ల రూపాయల విలువైన వ్యాపారం చేశారు. అంతేకాదు... కిసాన్ క్రెడిట్ కార్డుకూ మేం ప్రాచుర్యం తెచ్చాం. పశుపోషణ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాలను ప్రోత్సహించాం. అలాగే సౌరశక్తి దిశగా సాగేందుకు కృషి చేయాల్సి ఉంది. కాబట్టి సౌర పంపుల గురించి మాట్లాడుకుందాం... ఈ విధంగా అనేక కొత్త అంశాలు వ్యవస్థలో భాగమవుతూ వస్తున్నాయి. కాబట్టే దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల్లో నేడు పెను మార్పులు కనిపిస్తున్నాయి.

మేము 2014లో అధికారానికి వచ్చేముందు వ్యవసాయ శాఖ బడ్జెట్ 27వేల కోట్ల రూపాయలుకాగా- ఇప్పుడు దాన్ని మేము 5 రెట్లకుపైగా పెంచి, దాదాపు 1.5 లక్షల కోట్ల రూపాయలకు చేర్చాం. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం కింద లబ్ధి నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరుతోంది. ఆ మేరకు ఇప్పటిదాకా 45వేల కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాలకు బదిలీ అయ్యాయి. దీనివల్ల దళారులతోపాటు ఫైళ్ల జంఝాటం కూడా మాయమైంది... ఒక్క క్లిక్‌తో డబ్బు ఖాతాలోకి వెళ్లిపోతోంది. అయితే, మనం రాజకీయాలు కూడా చేయాల్సి ఉందని నేనిప్పుడు ప్రజా ప్రతినిధులందరికీ కచ్చితంగా సూచిస్తున్నాను. మీకున్న ఇబ్బందులేమిటో నాకు తెలుసు... కానీ, మనం రైతుల ప్రయోజనాలతో రాజకీయం నెరపుదామా? ఆ మేరకు రైతుల పేరిట తమతమ రాష్ట్రాల్లో గొంతెత్తే వారెవరో గమనించాల్సిందిగా గౌరవనీయ సభ్యులందరికీ నేను మనవి చేస్తున్నాను. అదే సమయంలో వారి రాష్ట్రంలోని రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ప్రయోజనం అందుతున్నదో.. లేదో కూడా వారు చూడాలి.

ఆ మేరకు ఆయా ప్రభుత్వాలు తమ రాష్ట్రంలోని రైతుల జాబితా ఎందుకు ఇవ్వడం లేదు? ఈ పథకంలో సదరు రాష్ట్రాలు ఎందుకు చేరడం లేదు? దీనివల్ల హాని ఎవరికి... నష్టపోతున్నదెవరు? ఆయా రాష్ట్రాల రైతులు మాత్రమే. కొన్నిచోట్ల సంభవిస్తున్న ఇలాంటి పరిణామాల గురించి తెలిసీ, బాహాటంగా మాట్లాడలేని స్థితిలోగల గౌరవనీయులైన సభ్యులెవరైనా ఉంటే- తెలుసుకోగోరుతున్నాను. అదేవిధంగా ఎంతో మాట్లాడిన సదరు గౌరవనీయ సభ్యులతోనూ నేను మాట్లాడతానని వారికి తెలుసు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆర్భాటంగా గొప్ప వాగ్దానాలు చేసి, ఓట్లు దండుకుని, అధికారంలోకి వచ్చినా రైతులకు తామిచ్చిన హామీలను నెరవేర్చని రాష్ట్రాలను ఒకసారి చూడండి. రైతుల ఓట్లతో పదవీ ప్రమాణ స్వీకారం చేసి, అధికార పగ్గాలు చేపట్టినా వారికిచ్చిన వాగ్దానాలను మాత్రం నెరవేర్చిన ఉదాహరణల్లేవు. రైతులకిచ్చిన మాట నిలబెట్టుకోవాలని అలాంటి రాష్ట్రాలకు ప్రతినిధులుగా ఇక్కడ కూర్చుని ఉన్న గౌరవనీయ సభ్యులు అక్కడి ప్రభుత్వాలకు కనీసం ఒక మాటగానైనా చెప్పాలని కోరుతున్నాను.

గౌరవనీయులైన అధ్యక్షా!

అఖిలపక్ష సమావేశం జరిగినప్పుడల్లా- నేను ఈ మేరకు నా దృక్పథాన్ని సమగ్రంగా వివరిస్తూ విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాను. అటుపైన పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు మీడియా ప్రతినిధులతో నేను మాట్లాడినప్పుడు కూడా మనమంతా దేశ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన అంశాలపై చర్చకు మన పూర్తి సమయాన్ని కేటాయించాలని నేను చెప్పాను. అవగాహన, సామర్థ్యం, ప్రతిభల సమ్మేళనాన్ని మేం ఉభయసభల ముందుంచాం. ఎందుకంటే- జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులద్వారా ప్రయోజనం పొందే దిశగా మన దేశం అనుసరించాల్సిన దశ-దిశలను సూచించడం కోసమే. ఈ సమావేశం కొనసాగినంత

సేపు... విరామానంతరం తిరిగి సమావేశమయ్యాక కూడా అందుబాటులోగల అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందడుగు వేసే సరికొత్త సూచనలతో మనమంతా సమగ్రంగా చర్చిద్దామని సభ్యులందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఆ మేరకు మీకిదే నా ఆహ్వానం!

అవును! ముఖ్యమైన ఆర్థిక అంశాల పై ఉమ్మడి బాధ్యత ఉంటుందని నేను అంగీకరిస్తాను. ఈ రోజున ఏ పరిస్థితి లో ఉన్నామో తెలుసుకోవాలంటే గతం ఏమిటన్నది కూడా మనకు తెలియాలి. గతం లో మనం ఎక్కడ ఉన్నామో అర్థం చేసుకోవాలి. ఇది వాస్తవం. అయితే మన గౌరవనీయులైన సభ్యులు అది ఎందుకు జరగలేదని? ఎప్పుడు జరుగుతుంది? ఎలా జరుగుతుందో అని అంటున్నారు. కొంతమంది మీరు విమర్శిస్తారని భావిస్తారు, కానీ మీ విమర్శను నేను స్వీకరించను. మీరు నన్ను అర్థం చేసుకొన్నందుకు సంతోషం. ఏదైనా జరగాలి అంటే.. అతను చేస్తారు.. అన్న నమ్మకం మీకు ఉంది. అందుకే నేను దానిని విమర్శ గా పరిగణించను. నేను మార్గదర్శకాన్ని, స్ఫూర్తిని నమ్మేవాడిని. ఈ సలహాలు అన్నిటి ని ఆహ్వానిస్తున్నాను. వాటి ని అంగీకరించడానికి ప్రయత్నిస్తాను. మంచి అంశాలు ఉంటే అవి ఎందుకు జరుగలేదు?, ఒకవేళ జరిగి వుంటే, అవి ఎలా జరిగాయి? అని ఆలోచిస్తాను. ఈ దేశాన్ని గురించి మనం అందరం ఆలోచించాలి.

గతాన్ని వదలిపెట్టి వర్తమానాన్ని అవగాహన చేసుకోవడం కష్టం. గతం ఏమిటి అన్నది మనకు అందరికి తెలుసు. పత్రికల పతాక శీర్షికల లో 'అవినీతి' ప్రముఖ స్థానాన్ని ఆక్రమించేది. సభ లో కూడా అవినీతి పై ఆగ్రహపూరితమైన వాదోపవాదాలు జరిగేవి. వృత్తి నైపుణ్యం లేని అసమర్థ బ్యాంకింగు ను ఎవరు మరచిపోగలరు ? బలహీనమైన మౌలిక విధానాన్ని ఎవరు మరచిపోగలరు ? మేము యోజనాబద్ధమైన చర్యలను తీసుకోవడం, సరైన దిశ లో వెళ్లడం ద్వారా సమస్యలకు తగు పరిష్కారాలను సాధించగలిగాము. దీనికి దీర్ఘకాలిక లక్ష్యాలను పెట్టుకొన్నాము. ఈ చర్యల ఫలితం వల్లే నేడు ద్రవ్య లోటు ను, ద్రవ్యోల్బణాన్ని

అదుపు లో ఉంచగలిగామని, సూక్ష్మ ఆర్థిక సుస్థిరత ను సాధించగలిగామని నేను నమ్ముతున్నాను.

మీరు నా యందు మీ విశ్వాసాన్ని దృఢపరచినందుకు నేను మీ పట్ల కృతజ్ఞుడి నై ఉన్నాను. మేము చేసి చూపెడతాము. కానీ, మేము ఒక విషయాన్ని మాత్రం చేయబోము. అది ఏమిటి అంటే మేము మీ నిరుద్యోగాన్ని అంతం చేయము.

జి ఎస్ టి పై ఒక ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకొన్నాము. ఆర్థిక పరిస్థితిని పటిష్టంగా ఉంచడానికి దీర్ఘకాల చర్యలన్నిటిని మా ప్రభుత్వం తీసుకొంటున్నది. వాటిలో కార్పొరేట్ పన్ను తగ్గింపు, దివాలా కు సంబంధించిన చట్టం, ఐబిసి ని ప్రవేశపెట్టడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సరళీకరణ, బ్యాంకులకు నిధుల తో ఉద్దీపనానికి సంబంధించి బ్యాంకుల రీకేపిటలైజేషన్ ల వంటి చర్య లు దీనిలో భాగమే. ఈ చర్యల వల్ల అనేక లాభాలు కనిపిస్తున్నాయి. మీ ప్రభుత్వం ఉన్నపుడు నిపుణులు, ఆర్థికవేత్తలు సవివరం గా చర్చించిన సంస్కరణలను మీరు అమలు చేయలేదు. మేము వాటిని అమలుపరుస్తున్నాము. మదుపరుల లో విశ్వాసాన్ని పెంపొందించడానికి, ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేయడానికి అనేక ముఖ్య నిర్ణయాలను తీసుకొన్నాము.

జి ఎస్ టి ఆదాయం 2019వ సంవత్సరం జనవరి నుండి 2020వ సంవత్సరం జనవరి మధ్య ఒక లక్షన్నర కోట్ల రూపాయలు దాదాపు ఆరు రెట్లు నమోదు అయింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్ డిఐ) చూస్తే 2018వ సంవత్సరం ఏప్రిల్- సెప్టెంబర్ ల మధ్య కాలం లో 22 బిలియన్ డాలర్లు గా నమోదు అయింది. నేడు అదే కాలపరిధి లో ఎఫ్ డిఐ 26 బిలియన్ డాలర్లు మించింది. దేశ ఆర్థిక పరిస్థితి పట్ల విదేశీ పెట్టుబడిదారుల కు ఉన్న నమ్మకాని కి ఇది ఒక రుజువు. ఆర్థిక రంగం లో అనంతమైన అవకాశాలు

ఉన్నాయి. ఇదీ విదేశీ పెట్టుబడిదారుల నమ్మకం. అందువల్ల వారు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. వదంతుల ను ప్రచారం లోకి తెచ్చేటటువంటి ప్రయత్నాలు చేసినప్పటికీ పెట్టుబడిదారులు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి రావడం పెద్ద విజయం.

మరింత పెద్ద మొత్తం లో పెట్టుబడులు రాబట్టాలి. ఉత్తమమైన మౌలిక అభివృద్ధి జరగాలి. అదనపు విలువ జతపడాలి. గరిష్ఠ స్థాయి లో ఉద్యోగ కల్పన జరగాలి అన్నదే మా దార్శనికత. రైతుల నుండి నేను చాలా నేర్చుకొన్నాను. దుక్కు దున్నిన తరువాత రైతు మండుటెండల లో మళ్ళీ చేనులోకి అడుగుపెడతాడు. అప్పటి వరకు విత్తనాలు వేయడు. సరైన సమయంలో విత్తు నాటుతాడు. ఇపుడు గత పది నిమిషాల నుండి ఇక్కడ జరుగుతుంది చూస్తే. నేను పంట కోసం దుక్కు ను దున్నుతున్నాను. మీరు ఇప్పుడు సిద్ధం గా ఉన్నారు. నేను ఇక ఒక్కటొక్కటి గా విత్తనాన్ని నాటుతాను.

గౌరవనీయులైన అధ్యక్షా,

ముద్ర, స్టార్ట్-అప్ ఇండియా, స్టాండ్-అప్ ఇండియా ల వంటి పథకాలు స్వయం ఉపాధి కి ఎంతో దోహదపడ్డాయి. అంతే కాదు, ముద్ర పథకాన్ని వినియోగించుకొని కోట్ల మంది మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. దీనితో పాటు కనీసం మరో ఇద్దరి కో, ముగ్గురి కో ఉపాధి ని కూడా కల్పిస్తున్నారు. ముద్ర పథకం కింది వివిధ బ్యాంకుల నుండి ఆర్థిక సహాయాన్ని పొందిన వారిలో 70 శాతం మంది మన తల్లులు, సోదరీమణులే ఉన్నారు. ఆర్థికంగా పెద్దగా చురుకుగా లేని వారు కూడా దేశ ఆర్థిక అభివృద్ధి లో భాగస్తులు అవుతున్నారు. 28,000 స్టార్ట్-అప్ లు గుర్తింపును పొందాయి, అవి కూడా 2వ అంచె, 3వ అంచె నగరాల్లోనే ఏర్పాటయ్యాయి. దీనిని బట్టి యువత కొత్త సంకల్పం తో ముందుకు

దూసుకుపోతున్నట్లు స్పష్టం అవుతుంది. 22 కోట్ల రుణాలు ఆమోదించబడ్డాయి. కోట్ల మంది కి ఉపాధి అవకాశాలు లభించాయి.

నవ పారిశ్రామికవేత్త ల జాబితా లో భారతదేశం మూడో స్థానాన్ని ఆక్రమించింది. 2017వ సంవత్సరం సెప్టెంబర్ - 2019వ సంవత్సరం నవంబర్ ల మధ్య కొత్త గా 1.49 కోట్ల మంది ఖాతాదారులు EPFO నికర జాబితా లో నమోదయ్యారు. ఎటువంటి ఉద్యోగం లేకుండా డబ్బు ను జమ చేయరు కదా.

నిన్న ఒక కాంగ్రెస్ నాయకుడి ప్రసంగాన్ని విన్నాను.. మోదీ ని ప్రజలు ఆరు నెలల్లో కర్రలతో కొడతారట.. అవును ఇప్పుడు కష్టమే, కాబట్టి వారికి మరో 6 నెలలు కావాలి. ఆరు నెలలు మంచిదే. నేను నిర్ణయించుకొన్నాను, వచ్చే ఆరు నెలల్లో నేను సూర్య నమస్కారం చేసే సమయాన్ని పెంచుకుందాం అనుకుంటున్నాను. ఇటువంటి తిట్లు 20 సంవత్సరాలుగా చూస్తున్నాను. చూసి చూసి నేను నిందలకు అలవాటు పడిపోయాను. సూర్య నమస్కారాలు నిత్యం చేయడం ద్వారా నేను నా వెన్నును మరింత దృఢం గా చేసుకొన్నాను. దీని వల్ల నన్ను కర్రల తో కొట్టినా తట్టుకొనేటట్టు చేసుకొన్నాను. ధన్యవాదాలు, ఆయన ముందుగానే ఈ విషయం చెప్పాడు.. వచ్చే ఆరు నెలలు నా శారీరక కసరత్తును పెంచుకోడానికి తగిన సమయం లభించింది.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఇండస్ట్రీ 4.0, డిజిటల్ ఎకానమి కోట్లాది ఉద్యోగాల కల్పన కు ఉపకరించే అవకాశం ఉంది. నైపుణ్య అభివృద్ధి కి సభ లో ప్రతిపాదన చేశాము. దీని ద్వారా నిపుణులైన ఉద్యోగుల ను తయారు చేయడమే కాకుండా కార్మిక సంస్కరణ లు కూడా జరుగుతాయి. ఇంకా కొన్ని

ఇతర ప్రతిపాదన లు కూడా ఉన్నాయి. ఈ సభ వాటి ని పరిగణన లోకి తీసుకొని ఆమోదిస్తే దేశం లో ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరగడానికి ఉన్న అడ్డంకుల ను అధిగమించవచ్చును. గౌరవనీయులైనటువంటి సభ్యులందరి ని కోరుతున్నాను. కార్మిక సంస్కరణల కు సభ్యులంతా సహకరిస్తే ఉద్యోగ కల్పన కు కొత్త అవకాశాలు లభిస్తాయి. సులభతర వ్యాపారం, సులభతర జీవనం ద్వారా 5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థ ను భారతదేశం లో ఆవిష్కరించగలమనే విశ్వాసం నాకుంది.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఇది వాస్తవం. రాబోయే రోజుల్లో 16 కోట్ల మౌలిక రంగ కార్యక్రమాల కల సాకారం కాబోతోంది. గత నా పదవీ కాలం లో ఆర్థిక రంగానికి మౌలిక రంగం ఎంత పరిపుష్టి ని కలిగించిందో మీరు గమనించి ఉంటారు. మౌలిక రంగం పై ప్రత్యేక దృష్టి పెడితే ఆర్థిక రంగాని కి ఊతం ఇవ్వడమే కాకుండా, ఉద్యోగ కల్పన కూడా జోరు అందుకొంటుంది. కొత్త పరిశ్రమ లు నెలకొల్పబడతాయి. అందువల్ల మౌలిక రంగాన్ని ఇంకా ముందుకు తీసుకు పోవాలని నిర్ణయించాం. మౌలిక రంగం అంటే గతం లో కాంక్రీట్ సిమెంట్ వరకే పరిమితం అయ్యేది. టెండర్ లు, దళారుల మాటలే వినబడేవి. మౌలిక రంగాన్ని గురించి మాట్లాడితే ప్రజలు దీనిలో ఏదో వ్యవహారం ఉంది అని గుసగుసలాడుకొనే పరిస్థితి ఉండేది. కానీ నేడు మౌలిక రంగం అంటే.. 21 వ శతాబ్దపు ఆధునిక భారతదేశాన్ని ఆవిష్కరించగలుగుతున్నాము. మౌలిక రంగం అంటే కేవలం కాంక్రీట్ సిమెంట్ కాదు, కొత్త భవిష్యత్తు కు ఒక మార్గం అని నేను దృఢం గా విశ్వసిస్తున్నాను. మౌలిక రంగమే కార్గిల్ నుండి కన్యాకుమారి ని, కచ్ నుండి కోహిమా ను కలిపే శక్తి ని కలిగివుంది. ఆకాంక్ష ను, విజయాన్ని మౌలిక రంగం ఏకీకృతం చేస్తుంది.

ప్రజల ఆశలకు, కలలకు రెక్కలను తొడిగేది ఏమైనా ఉందీ అంటే అది మౌలిక రంగమే. సృజనాత్మకత వినియోగదారులతో అనుసంధానం అవుతుందీ అంటే అది మౌలిక రంగం వల్ల మాత్రమే. చిన్నారి, పాఠశాల తో సంధానం కావడం చిన్న విషయమే అయినప్పటికి, అది మౌలిక రంగం వల్లే సాధ్యం అవుతుంది. వ్యాపారవేత్తను వినియోగదారు తో అనుసంధానం చేసేది మౌలిక రంగమే. అది ప్రజలందరి ని అనుసంధానిస్తుంది. గర్భిణి ని ఆస్పత్రి తో అనుసంధానించేది మౌలిక రంగమే. అందువల్లే సాగునీటి రంగం నుండి పరిశ్రమల వరకు, సామాజిక మౌలిక రంగం నుండి గ్రామీణ మౌలికం వరకు, రహదారుల నుండి ఓడ రేవుల వరకు, విమానయానం నుండి జల మార్గం వరకు మేము అనేక చర్యల ను చేపట్టాము. గత ఐదు సంవత్సరాల ల్లో వీటన్నిటి ని దేశం ముందు సాక్షాత్కరింపజేశాము. ప్రజలు దీనిని గుర్తించారు కాబట్టే మమ్మల్ని ఈ స్థానం లో కూర్చోబెట్టారు. ఇదీ మౌలికరంగానికి ఉన్న బలం.

గౌరవనీయులైన అధ్యక్షా,

మౌలిక రంగం లో పరిణామాలు ఎలా చోటు చేసుకొన్నాయో ఉదాహరణలతో సహా వివరిస్తాను. ఢిల్లీ ద్వారా వెళ్లే వేలాది ట్రక్కులు ఒకానొకప్పుడు తీవ్ర ట్రాఫిక్ సమస్య కు, వాతావరణ కాలుష్యాని కి కారణమయ్యేవి. 2009వ సంవత్సరం లో యుపిఎ ప్రభుత్వం ఢిల్లీ పొలిమేరల నుండి ఎక్స్ ప్రెస్ హైవే ను నిర్మించాలని ప్రతిపాదించింది. 2014వ సంవత్సరం లో మేము అధికారంలోకి వచ్చేటప్పుడు ఆ ప్రతిపాదన కేవలం కాగితాలకే పరిమితం అయి ఉంది. వెంటనే మేము చొరవ తీసుకొని ఒక ఉద్యమం తరహా లో పనులను మొదలుపెట్టాము. ఇప్పుడు ఎక్స్ ప్రెస్ వే పూర్తి అయింది. 40,000కి పైగా ట్రక్కు లు ఢిల్లీ లోకి రాకుండానే బయట నుండి వెళ్తున్నాయి. ఈ ప్రయత్నం తో ఢిల్లీ ని కాలుష్యం బారి నుండి

కాపాడగలిగాము. కాబట్టి మౌలిక అభివృద్ధి ఆవశ్యకత ఏమిటి ? 2009వ సంవత్సరం నుండి 2014వ సంవత్సరం మధ్య కాలం లో కేవలం ఒక కాగితం ముక్క కు పరిమితం అయింది. ఇదీ వ్యత్యాసం. ఇది అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. గౌరవనీయులైన అధ్యక్షా,

కొన్ని అంశాల లో నేను స్పష్టత ను ఇవ్వదలుచుకొన్నాను. థరూర్ గారు, క్షమించాలి. రాజ్యాంగ పరిరక్షణ ను గురించి ఇక్కడ కొందరు మాట్లాడారు. నేను కూడా నమ్ముతున్నాను, కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ కోసం 100 సార్లు మాట్లాడాలి. ఇది ఒక మంత్రం లా వంద సార్లు రాజ్యాంగాన్ని కాపాడాలి అంటూ మాట్లాడాలి. దీని ద్వారా రాజ్యాంగం వల్ల ఏమి జరుగుతుందో అందరి కి అర్థం అవుతుంది. ఈ విషయం మీకు బోధపడి ఉంటుంది. ఎప్పుడు రాజ్యాంగాన్ని గురించి మాట్లాడినా మీ తప్పులు ఏమిటో తెలుసుకోవచ్చు. అలాగే రాజ్యాంగం శక్తి ఏమిటో కూడా అర్థం అవుతుంది.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఈ విషయాన్ని గురించి మాట్లాడటానికి ఇది సరైన సమయం. ఎమర్జెన్సీ రోజుల్లో రాజ్యాంగ పరిరక్షణ ను ఎందుకు పరిగణన లోకి తీసుకోలేదు ? వీళ్లా రాజ్యాంగాన్ని గురించి మాట్లాడేది. న్యాయ వ్యవస్థ కు ఉన్న హక్కుల ను కాలరాసిన వీళ్లా రాజ్యాంగాన్ని గురించి చెప్పేది. జీవించే హక్కు ను కాలరాసిన ఈ మనుషులు రాజ్యాంగాన్ని చదవాలి. అత్యధికం గా సవరణలు, ప్రతిపాదనలు తెచ్చి తూట్లు పొడిచిన వీరికి రాజ్యాంగం గురించి మాట్లాడే హక్కు లేదు. డజను కు పైగా సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వాల ను కూల్చివేశారు. ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాల ను రద్దు చేశారు.

మంత్రిమండలి తీర్మానించింది. ప్రజాస్వామ్యబద్ధ, రాజ్యాంగబద్ధ మంత్రిమండలి చేసిన తీర్మానాల కాగితాలను ప్రెస్ కాన్ఫరెన్స్ లో చింపివేసిన ఘటనను చూశాము. రాజ్యాంగ పరిరక్షణ మంత్ర జపం చేసే వారి చర్యలు ఇవి. ప్రధాన మంత్రి కి, ప్రధాన మంత్రి కార్యాలయానికి అతీతంగా జాతీయ సలహా మండలి అనే ఒక వ్యవస్థ ను ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని రిమోట్ కంట్రోల్ తో నడిపిన వీరు ముందు గా రాజ్యాంగాన్ని గురించి అర్థం చేసుకోవాలి.

గౌరవనీయులైన అధ్యక్షా,

రాజ్యాంగ పరిరక్షణ పేరు తో ఢిల్లీ లో ఏమి జరుగుతోందో దేశమంతా చూస్తోంది. అర్థం చేసుకొంది. నిశ్శబ్దం ఏమిటో ఏదో ఒక రోజు వెల్లడి అవుతుంది. రాజ్యాంగం లో సర్వోన్నత న్యాయస్థానం ఒక ముఖ్యమైన అంగం. అటువంటి సుప్రీం కోర్టే నిరసన ప్రదర్శనలు ప్రజలకు ఇబ్బందులుగా మారకూడదు, ఉద్యమాలు హింసాత్మకంగా మారకూడదు అని స్పష్టం చేసింది. అలాంటిది రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న వ్యక్తులు కమ్యూనిస్ట్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వ్యక్తులు వోట్ బ్యాంకు రాజకీయాల కోసం ప్రజల ను రెచ్చగొడుతున్నారు.
గౌరవనీయులైన అధ్యక్షా,

ఒక కవి అంటాడు..

“ఖూబ్ పర్దా హై, కి చిల్ మన్ సే లగే బైఠే హై.

ఖూబ్ పర్దా హై, కి చిల్ మన్ సే లగే బైఠే హై.

సాఫ్ ఛుప్ తే భీ నహీ,

సామ్నే ఆతే భీ నహీ".

అని.

ప్రజలు అన్నీ ఎరుగుదురు, ప్రతిదీ అర్థం చేసుకోగలరు.

గౌరవనీయులైన అధ్యక్షా,

గత కాలం లో సభ లో కొందరు సభ్యులు మాట్లాడిన భాష ఆక్షేపణీయం గా ఉంది. ఇక్కడ కూర్చున్న కొందరు సభ్యులు పశ్చిమ బెంగాల్ లో ఎన్నో బాధల ను అనుభవించారు. దాదా, అక్కడ ఏమి జరుగుతుందో వారు చెబితే, ఎంత బాధ పడుతున్నారో మీకు అర్థం అవుతుంది. అక్కడ అమాయకులు ఎలా హత్యలకు గురవుతున్నారో వారు ఎంతో బాగా ఎరుగుదురు.

గౌరవనీయులైన అధ్యక్షా,

వారిని అడగదలుచుకున్నాను, కాంగ్రెస్ హయాంలో రాజ్యాంగం పరిస్థితి ఏమిటి, ప్రజల హక్కుల స్థితి ఏమిటి ? రాజ్యాంగం అంత ముఖ్యమని వారు భావిస్తే, మనందరం ఒప్పుకొంటాం, మీరు అంగీకరిస్తే జమ్ము కశ్మీర్ లో భారతదేశ రాజ్యాంగాన్ని అమలు చేయడాన్ని ఎవరు అడ్డుకొన్నారు ? జమ్ము కశ్మీర్ కు చెందిన నా సోదర సోదరీమణుల హక్కుల ను కాలరాసిన పాపం ఎవరిది ? శశి గారు, మీరు జమ్ము & కశ్మీర్ అల్లుడు కదా, మీరు రాజ్యాంగాన్ని గురించి మాట్లాడుతున్నారే, ఆ కశ్మీర్ ఆడబిడ్డ ను గురించి కూడా ఆలోచించాలి కదా. గౌరవనీయులైన అధ్యక్షా, ఒక సభ్యుడు మాట్లాడుతారు కశ్మీర్ అస్తిత్వం కోల్పోయిందని, మరో సభ్యుడు మాట్లాడుతారు కశ్మీర్ కేవలం ఒక చిన్న పాటి భూభాగం అని.

గౌరవనీయులైన అధ్యక్షా,

కశ్మీర్ ను కేవలం ఒక చిన్న ముక్క గా మాట్లాడే వారికి ఈ దేశాన్ని గురించి ఏమీ తెలియదు. వారి మేధో దారిద్ర్యాన్ని సూచిస్తుంది. కశ్మీర్ అనేది భారతదేశానికి కిరీట ఆభరణం. అధ్యక్షా,

కశ్మీర్ ను బాంబులకు, వేర్పాటువాదానికి ప్రతీక గా చేశారు. కశ్మీర్ గురించి మాట్లాడిన వారు, కశ్మీర్ గుర్తింపు ను 1990వ సంవత్సరం జనవరి 19వ తేదీ న ఖననం చేసేశారు. కశ్మీర్ గుర్తింపు అంటే సూఫీ సంప్రదాయం. లాల్ దేడ్, నంద్ రుషి, సయ్యద్ బుల్ బుల్ శాహ్, మీర్ సయ్యద్ అలీ హమ్దానీ... వీరు కశ్మీర్ కు ప్రతీకలు. గౌరవనీయులైన అధ్యక్షా,

370 వ అధికరణను తొలగిస్తే కశ్మీర్ లో మంటలు రగులుకొంటాయని కొందరు అన్నారు. ఏమిటి అటువంటి వారి ఆలోచన విధానం? నేను ప్రజల కు చెప్పదలచుకున్నాను, 370 అధికరణ తొలగిస్తే కశ్మీర్ మండిపోతుంది అన్నారు, కొందరు జైల్ లో ఉన్నారు. సభ్యుల కు మనోపూర్వకం గా చెబుతున్నాను.. రాజ్యాంగాన్ని ఈ సభ కాపాడుకొంటుంది. గౌరవనీయులైన అధ్యక్షా,

ఆగస్ట్ 5వ తేదీ న మెహబూబా ముఫ్తీ గారు ఏమన్నారు- రాజ్యాంగం పట్ల విధేయులైన సభ్యులారా కాస్త శ్రద్ధ తో వినండి. ఆమె చేసినవి చాలా తీవ్రమైన వ్యాఖ్య లు.. కశ్మీర్ ను భారతదేశం మోసం చేసింది అని ఆమె అన్నారు. మనం కలసి జీవించాలని అనుకొన్న దేశమే మనకు ద్రోహం చేసిందని ఆమె అనడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అంటే 1947వ సంవత్సరం లో మనం చేసుకొన్న ఎంపిక తప్పు అని అనడమే కదా ! రాజ్యాంగ పరిరక్షకులమని చెప్పుకొంటున్న వారు ఈ భాషను అంగీకరిస్తారా ? అటువంటి వారి తరఫు న మీరు వకాల్తా

పుచ్చుకుంటున్నారే ! అదే విధం గా ఉమర్ అబ్దుల్లా గారు అన్నారు.. 370 వ అధికరణాన్ని రద్దు చేస్తే భూకంపం వస్తుంది, కశ్మీర్ భారత్ నుండి వేరవుతుంది అని.

గౌరవనీయులైన అధ్యక్షా,

370వ అధికరణాన్ని తొలగిస్తే కశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యానికి పరిస్థితులు దారి తీస్తాయని, జాతీయ జెండ ఎగురవేసే వారే ఉండరు అని ఫారూఖ్ అబ్దుల్లా గారు అంటారు. ఇటువంటి భావాలు ఉన్న వారి ని రాజ్యాంగం పై నమ్మకం ఉన్నవారు ఎవరైనా సమర్థించగలరా? ఇటువంటి వారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.
గౌరవనీయులైన అధ్యక్షా,

కశ్మీర్ ప్రజల పై విశ్వాసం లేని వారే ఇటువంటి మాటలు మాట్లాడుతారు. మాకు కశ్మీర్ ప్రజల పై పూర్తి నమ్మకం, విశ్వాసం ఉంది. వారి పై నమ్మకం ఉంచాము కాబట్టి 370 వ అధికరణాన్ని తొలగించాము. నేడు వేగవంతం గా అభివృద్ధి జరిగేలా చర్యల ను తీసుకొన్నాము. కశ్మీర్ కానివ్వండి, ఈశాన్య రాష్ట్రాలు కానివ్వండి, కేరళ కానివ్వండి.. దేశం లో ఏ ప్రాంతం లో కూడా పరిస్థితి క్షీణించడానికి ఆస్కారాన్ని ఇవ్వబోము. మా మంత్రులు కూడా నిరంతరం కశ్మీర్ లో పర్యటిస్తున్నారు. ప్రజల తో మాట్లాడుతున్నారు. అక్కడి సమస్యల ను ప్రజల తో నిరంతరం చర్చిస్తూ పరిష్కరిస్తున్నాము.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఈ సభాప్రాంగణం నుండి, ఈ రోజున నేను జమ్ము కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను, అంచనాలను నెరవేర్చడానికి, జమ్ము కశ్మీర్ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు, అభివృద్ధికి మేము కట్టుబడి ఉన్నామని చెప్తున్నాను. మేము రాజ్యాంగానికి అంకితభావం తో ఉన్నాము,

అందరమూ కట్టుబడి ఉన్నాము. అయితే అదే కాలం లో నేను లద్దాఖ్ ను గురించి కూడా కొంత మాట్లాడాలనుకొంటున్నాను.

గౌరవనీయులైన అధ్యక్షా,

సిక్కిమ్ మన దేశంలో ఒక సేంద్రీయ రాష్ట్రం గా స్థిరపడిన రాష్ట్రం. ఒక విధంగా, సిక్కిమ్ వంటి చిన్న రాష్ట్రాలు దేశంలోని అనేక రాష్ట్రాల కు స్ఫూర్తి ని ఇచ్చాయి. సిక్కిమ్ రైతులు, సిక్కిమ్ పౌరులు ఈ ప్రశంసల కు అర్హులు. **లద్దాఖ్-** నా మనస్సు లో లద్దాఖ్ ముఖచిత్రం చాలా స్పష్టం గా ఉన్నదని నేను నమ్ముతున్నాను. మరి ఈ కారణం గా మన పొరుగు దేశం భూటాన్ పర్యావరణం విషయం లో ఏ విధం గా ప్రశంసలు పొందిందో, కార్బన్ న్యూట్రల్ కంట్రీ గా ప్రపంచం లో గుర్తింపు ను తెచ్చుకొందో, ఆ విధం గా లద్దాఖ్ ఉండాలని కోరుకుంటున్నాము. ఈ దేశ ప్రజలమైన మనము ఒక సంకల్పం చేసుకుంటాము, లద్దాఖ్ ను కార్బన్ న్యూట్రల్ ప్రాంతంగా కూడా అభివృద్ధి చేస్తామని మనమందరం సంకల్పించుకోవాలి. ఇది దేశానికి ఒక గుర్తింపును సృష్టిస్తుంది. అలాగే ఇది ఒక నమూనాగా భవిష్యత్ తరాల కు ప్రయోజనాన్ని చేకూర్చుతుందని నేను ఖచ్చితంగా అనుకొంటున్నాను. నేను లద్దాఖ్ కు వెళ్ళినప్పుడు, వారితో ఉన్నప్పుడు; దీని విషయం లో ఒక డిజైన్ ను తయారు చేసే దిశ గా ముందుకు సాగుతున్నాను.
గౌరవనీయులైన అధ్యక్షా,

ఇక్కడ ఈ సభ ఆమోదించిన చట్టం, ఉభయ సభల లోను సదరు సవరణ ఆమోదించబడింది, దేనిని అయితే నోటిపై కూడా చేయడం జరిగిందో, ఆ విషయం లో కూడా ఎంతో కొంత ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొంతమంది సిఎఎ ను తీసుకు రావడానికి ఏమిటి ఆ ఆతురత అని అడుగుతున్నారు . గౌరవనీయులైన సభ్యులు కొందరు ఈ ప్రభుత్వం

వివక్ష ను చూపుతోందని, ఈ ప్రభుత్వం హిందువులు, ముస్లిములు అంశాన్ని తెర పైకి తీసుకు వస్తోందని అన్నారు. కొంతమంది అయితే మేము దేశాన్ని విభజించాలనుకుంటున్నామని, ఇంకా ఎన్నో మాటలు అన్నారు. మరి ఇక్కడ నుండి కూడా చాలా మాట్లాడారు. ఊహాత్మక భయాన్ని సృష్టించడానికి సంపూర్ణ శక్తి ఉపయోగించబడింది. ఈ మాటలు అనే వారే ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకొనే వారి ప్రక్క న నిలబడి ఛాయాచిత్రాలు తీసుకొంటారు. పాకిస్తాన్ దశాబ్దాలు గా ఒకే భాష ను మాట్లాడుతున్నది, పాకిస్తాన్ అదే విషయాన్ని చెప్తూ వస్తోంది.

భారతదేశ ముస్లిముల ను రెచ్చగొట్టడానికి పాకిస్తాన్ ఏ అవకాశాన్ని వదలిపెట్టలేదు. భారతదేశ ముస్లిముల ను తప్పుదారి పట్టించడానికి, పాకిస్తాన్ ప్రతి ఆట ను ఆడింది, ప్రతి రంగు ను చూపించింది. ప్రజలు అధికారానికి దూరం గా ఉంచి ఇంటి కి పంపించినటువంటి వారు దేశం ఎన్నడూ ఊహించనైనా ఊహించనటువంటి పనిని ఈ రోజున చేస్తుండటాన్ని చూసి నేను హైరానా పడుతున్నాను. భారతదేశం నినాదాన్ని, జై హింద్ నినాదాన్ని ఇచ్చింది మన ముస్లిములే అని మాకు గుర్తు చేస్తున్నారు. సమస్య ఏమిటంటే కాంగ్రెస్ దృష్టి లో ఈ మనుషులు ఎప్పటికీ కేవలం ముస్లిములే. మాకు, మా దృష్టి లో వారు భారతీయులు, హిందుస్తానీలు. ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ అయినా కావచ్చు.

గౌరవనీయులైన అధ్యక్షా,

నేను బాలునిగా ఉన్నప్పుడు, ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ గారి చరణాలను స్పర్శించే అవకాశం నాకు దొరికింది. దీనిని నేను గర్వంగా భావించుకొంటున్నాను.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఖాన్ అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ అయినా, అశ్ఫాక్ ఉల్లా ఖాన్ అయినా, బేగమ్ హజ్ రత్ మహల్ అయినా, వీర్ షహీద్ అబ్దుల్ కరీమ్ అయినా లేదా పూర్వ రాష్ట్రపతి శ్రీ ఎపిజె అబ్దుల్ కలామ్ అయినా, అందరూ మా దృష్టిలో భారతీయులే.
గౌరవనీయులైన అధ్యక్షా,

కాంగ్రెస్, దాని లాంటి పక్షాలు, భారతదేశపు నేత్రాలతో భారతదేశాన్ని చూడటం ప్రారంభించిన రోజున, వాటి తప్పును గ్రహిస్తాయి. సర్, పౌరసత్వ సవరణ చట్టం పై వారు ఒక గలాభా ను సృష్టించినందుకు కాంగ్రెస్ కు, వారి ఇకోసిస్టమ్ కు నేను చాలా కృతజ్ఞుడినై వున్నాను. వారు వ్యతిరేకించకపోతే, వారు దానిపై అంతగా శబ్దం చేయకపోతే, బహుశా ఈ దేశం వారి నిజమైన స్వభావాన్ని తెలుసుకొని ఉండేది కాదు. పార్టీ కోసం ఎవరు, దేశం కోసం ఎవరు ఉన్నారని ఈ దేశం చూసింది. మరి నేను కోరుకొంటున్నాను 'జబ్ చర్చా నికల్ పడీ హై తో బాత్ దూర్ తక్ చలీ జాయెగీ' అని (చర్చ అనేది మొదలైందీ అంటే విషయం చాలా దూరం వరకు వెళ్తుంది అని భావం).

గౌరవనీయులైన అధ్యక్షా,

ప్రధాన మంత్రి అవ్వాలని ఎవరైనా కోరుకోవచ్చును, అందులో తప్పు ఏమీ లేదు. కానీ ఒకరు ప్రధాని కావడానికి, హిందుస్తాన్ పై ఒక గీత గీయబడి దేశం విభజించబడింది. విభజన తరువాత, పాకిస్తాన్ లోని హిందువులు, సిఖ్ఖులు, ఇతర అల్పసంఖ్యాక వర్గాల పైన దారుణాలు ఎలా జరిగాయో, హింస, దౌర్జన్యాలను గురించి ఊహించలేము. మీరు ఎప్పుడైనా భూపేంద్ర కుమార్ దత్త్ పేరు ను విన్నారా ? అని నేను కాంగ్రెస్ సహచరుల ను

అడగాలనుకొంటున్నాను. ఈ విషయాన్ని కాంగ్రెస్ తెలుసుకోవడం చాలా ముఖ్యం; ఇక్కడ లేని వారు కూడా తెలుసుకోవాలి.

భూపేంద్ర కుమార్ దత్త్ ఒకానొక సమయం లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ లో ఉన్నారు. ఆయన అందులో ఒక సభ్యుడు కూడాను. స్వాతంత్ర్య పోరాటం లో 23 సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపారు. ఆయన న్యాయం కోసం జైలు లోపల 78 రోజుల పాటు నిరాహార దీక్ష చేసినటువంటి ఒక గొప్ప వ్యక్తి. ఇది కూడా ఆయన పేరిట ఒక రికార్డు గా ఉన్నది. విభజన అనంతరం, భూపేంద్ర కుమార్ దత్త్ పాకిస్తాన్ లోనే ఉండిపోయారు. అక్కడి రాజ్యాంగ పరిషత్తు లో కూడా సభ్యుని గా ఉన్నారు. రాజ్యాంగం పనులు జరుగుతున్నప్పుడు, రాజ్యాంగం పని ఇంకా పురోగతి లో ఉన్నప్పుడు- అది ప్రారంభం మాత్రమే- ఆ కాలం లో అదే రాజ్యాంగ పరిషత్తు లో భూపేంద్ర కుమార్ దత్త్ చెప్పిన మాటలను నేను మరో మారు ప్రస్తావించదలచాను. ఎందుకంటే మా పై ఆరోపణల ను రుద్దుతున్న వారు దీని ని అర్థం చేసుకోవడం చాలా అవసరం.

భూపేంద్ర కుమార్ దత్త్ అన్నారు – 'ఇప్పటి దాక పాకిస్తాన్ లో వాస్తవానికి మైనార్టీలను పూర్తిగా అణచివేశారు. తూర్పు బెంగాల్ లో ప్రాతినిధ్యం వహిస్తున్న దాదాపు కోటి మంది ప్రజలు పూర్తిగా నిరాశావాదంతో జీవిస్తున్నారు.' విభజన జరిగిన వెనువెంటనే రాజ్యాంగ పరిషత్తు లో భూపేంద్ర కుమార్ దత్త్ ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి కూడా, అల్పసంఖ్యాక వర్గాలు, అక్కడి అల్పసంఖ్యాక ప్రజల పరిస్థితి ఇది. ఆ తరువాత, పాకిస్తాన్ లో పరిస్థితి చాలా ఘోరం గా దిగజారింది. భూపేంద్ర దత్త్ భారతదేశాని కి వచ్చి ఆశ్రయం పొందవలసి వచ్చింది. తరువాత ఆయన కూడా ఈ భారత మాత ఒడి లో తుది శ్వాస ను వదిలారు.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఆనాటి మరొక గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు ఆ రోజుల్లో పాకిస్తాన్ లోనే ఉండిపోయారు. ఆయనే జోగేంద్ర నాథ్ మండల్. ఆయన తీవ్ర అణచివేత బారిన పడ్డ, దోపిడి కి గురైన, అణగారినటువంటి సమాజానికి ప్రాతినిధ్యం వహించారు. ఆయన పాకిస్తాన్ మొదటి న్యాయ మంత్రి గా చేశారు. 1950వ సంవత్సరం అక్టోబర్ 9వ తేదీన – స్వాతంత్ర్యం వచ్చి, విభజన జరిగి రెండు- మూడు సంవత్సరాలు గడిచాయి. ఆయన 1950వ సంవత్సరం అక్టోబర్ 9వ తేదీ న రాజీనామా చేశారు. రాజీనామా లేఖ లో రాసిన ఆయన రాజీనామా పేరా ను నేను ఉట్టంకించదలచాను. ఆయన – "పాకిస్తాన్ నుండి హిందువులను తరిమి వేసే విధానం పశ్చిమ పాకిస్తాన్ లో పూర్తిగా విజయవంతమయితే, తూర్పు పాకిస్తాన్ లో ఆ పని పూర్తి అవ్వడానికి దగ్గరలో ఉంది " అని వ్రాశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే – "పాకిస్తాన్ ముస్లిం లీగ్ కి సంతృప్తి, సురక్ష భావన కలిగించలేదు. వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక జీవితాల పై ఎలాంటి ప్రభావం ఉండకూడదని ఇప్పుడు వారు హిందూ మేధావులని వదిలించుకోవాలని చూస్తున్నారు" అని. ఈ విషయాన్ని మండల్ గారు తన రాజీనామా లేఖ లో వ్రాశారు. ఆయన కూడా చివరకు భారతదేశాని కి రావలసి వచ్చింది. మరి ఆయనా భారత మాత ఒడి లోనే కన్నుమూశారు. చాలా దశాబ్దాలు గడచిపోయినప్పటికి కూడా పాకిస్తాన్ ఆలోచన మారలేదు. అల్పసంఖ్యాక వర్గాలు నేడు సైతం హింసించబడుతున్నారు. 'నంకనా సాహిబ్' కు ఏమి జరిగిందో - దేశం మరియు ప్రపంచం మొత్తం చూసింది. ఇది హిందువులు, సిక్కులకు మాత్రమే జరుగుతుందని కాదు, ఇతర అల్పసంఖ్యాక వర్గాల విషయం లోనూ అదే జరుగుతుంది. క్రైస్తవులు కూడా ఇలాంటి బాధలను ఎదుర్కోవలసి ఉంటుంది.

సభ లో చర్చ సందర్భం గా గాంధీజీ ప్రకటన పై వ్యాఖ్యలు చేశారు. సిఎఎ పై ప్రభుత్వం చెబుతున్నది గాంధీజీ సెంటిమెంట్ కాదని అన్నారు. ఏదేమైనా, కాంగ్రెస్ వంటి పక్షాలు దశాబ్దాల క్రితమే గాంధీజీ బోధనల ను వదలిపెట్టాయి. వారు గాంధీజీ ని విడచిపెట్టారు. అందువల్ల నేను గానీ ఈ దేశం గానీ వారి నుండి ఏమీ ఆశించము. అయితే కాంగ్రెస్ మనుగడ లో ఉండడానికి ఏది మూలాధారమో వాటి గురించి నేను ఈ రోజున మాట్లాడదలుస్తున్నాను.

1950 లో నెహ్రూ-లియాకత్ ఒప్పందం కుదుర్చుకోబడింది. భారతదేశం, పాకిస్తాన్ లలో నివసిస్తున్న అల్పసంఖ్యాక వర్గాల రక్షణ పై ఈ ఒప్పందం కుదిరింది. పాకిస్తాన్ లో మతపరమైన అల్పసంఖ్యాక వర్గాల పట్ల వివక్షతో వ్యవహరించకూడదన్నది ఒప్పందం ప్రాతిపదిక. పాకిస్తాన్ లో ఉన్న మతపరమైన అల్పసంఖ్యాక వర్గాల కు సంబంధించి నెహ్రూ, లియాకత్ ల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇప్పుడు కాంగ్రెస్ సమాధానం చెప్పాల్సి వుంది. నెహ్రూ లాంటి గొప్ప లౌకిక వాది, నెహ్రూ లాంటి గొప్ప ఆలోచనాపరుడు, ఇంత పెద్ద దార్శనికుడు మరి మీకు ఆయనే అన్నీ. ఆ కాలం లో అల్పసంఖ్యాక వర్గాల కు బదులు గా 'పౌరులందరూ' అనే పదాన్ని ఆయన ఎందుకు ఉపయోగించలేదు ? ఆయన చాలా గొప్పవారు అయితే, చాలా ఉదారం గా ఉంటే, అప్పుడు ఆయన ఎందుకు చేయలేదు? ఏదో కారణం ఉండి వుండాలి. కానీ, ఈ సత్యాన్ని మీరు ఎంత కాలం పాటు ఖండిస్తారు ?

గౌరవనీయులైన అధ్యక్షా, గౌరవనీయులైన సభ్యులారా, ఇది ఆ కాలం నాటి విషయం. నేను ఆ కాలాన్ని గురించి మాట్లాడుతున్నాను. నెహ్రూ గారు ఒప్పందం లో పాకిస్తాన్ అల్పసంఖ్యాక వర్గాలు అనే మాట కు ఎలా ఒప్పుకొన్నారు? తప్పక ఏదో ఒక కారణం ఉండి వుంటుంది. ఈ రోజు న మేము ఏ మాట ను అయితే

పలుకుతున్నామో, అదే మాట ను ఆ కాలం లో నెహ్రూ గారు చెప్పారు. గౌరవనీయులైన అధ్యక్షా,

నెహ్రూ 'అల్పసంఖ్యాక వర్గాలు' మాటను ఎందుకు ఉపయోగించారు? ఇది వారు చెప్పరు ఎందుకు అంటే వారికి ఇబ్బంది ఉంది కాబట్టి. కానీ, నెహ్రూ స్వయంగా దీనికి సమాధానం ఇచ్చారు. నెహ్రూ-లియాకత్ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఒక సంవత్సరం ముందు అసోం లో తత్కాలీన ముఖ్యమంత్రి శ్రీ గోపీనాథ్ గారికి ఒక లేఖను వ్రాశారు. మరి గోపీనాథ్ గారి కి వ్రాసినటువంటి ఉత్తరం లో వ్రాసింది ఏమిటో దానిని నేను ఉట్టంకించదలుస్తున్నాను.

నెహ్రూజీ ఇలా వ్రాశారు – 'మీరు హిందూ శరణార్థులు, ముస్లిమ్ వలసదారుల మధ్య తేడా ను గుర్తించవలసి వుంటుంది. ఈ శరణార్థుల బాధ్యతను దేశం తీసుకోవలసి వుంటుంది.' ఈ లేఖను అప్పటి భారతదేశ ప్రధాని పండిత్ నెహ్రూ గారు అప్పటి అసోం ముఖ్యమంత్రి కి వ్రాశారు. నెహ్రూ-లియాకత్ ఒప్పందం కుదిరిన కొద్ది నెలల్లో, 1950వ సంవత్సరం నవంబర్ 5వ తేదీన నెహ్రూ గారు ఈ పార్లమెంటు ప్రాంగణం లో మాట్లాడుతూ, 'భారతదేశం లో స్థిరపడటానికి వచ్చిన బాధిత ప్రజలకి పౌరసత్వం లభిస్తుందనడం లో సందేహం లేదు. చట్టం దీని కి అనుకూలం గా లేకపోతే చట్టాన్ని మార్చాలి' అని అన్నారు.

1963వ సంవత్సరం లో లోక్ సభ లో సావధాన తీర్మానం జరిగింది. ఆ కాలం లో ప్రధాన మంత్రి నెహ్రూ యే విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి పదవి బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీ దినేశ్ గారు ఈ తీర్మానాని కి సమాధానం ఇస్తున్నప్పుడు చివర లో ప్రధాన మంత్రి నెహ్రూ గారు ఆయనను మధ్య లో ఆపి

చెప్పిన మాటలను నేను ఉట్టంకిస్తున్నాను- తూర్పు పాకిస్తాన్ లో అక్కడ ఉన్న అధికార వర్గం హిందువుల పై తీవ్ర ఒత్తిడి ని తీసుకు వస్తోందన్నారు. ఇది పండిత్ గారి ప్రకటన. పాకిస్తాన్ లోని పరిస్థితి ని దృష్టిలో పెట్టుకొని, గాంధీ గారు మాత్రమే కాదు, ఇది నెహ్రూ గారి భావన గా కూడా ఉండింది. చాలా పత్రాలు, లేఖ లు, స్థాయీ సంఘం నివేదిక లు ఉన్నాయి. అన్నీ కూడాను ఇటువంటి చట్టాని కి వత్తాసు పలుకుతూ సాగాయి.

ఈ సభ లోని వాస్తవాల ఆధారం గా, నేను ప్రత్యేకం గా కాంగ్రెస్ ను అడగాలనుకుంటున్నాను. మరి వారి ఇకోసిస్టమ్ కూడా ఈ నా ప్రశ్నలను అర్థం చేసుకొంటుందనుకుంటాను. నేను చెప్పిన ఈ విషయాల తో పండిత్ నెహ్రూ మతతత్వవాది యా? నేను కాస్త తెలుసుకోవాలి అని అనుకొంటున్నాను. పండిత్ నెహ్రూ హిందవులు, ముస్లిముల మధ్య భేదం పాటించారా ? పండిత్ నెహ్రూ హిందూ దేశం నిర్మించాలనుకొన్నారా ?

గౌరవనీయులైన అధ్యక్షా,

కాంగ్రెస్ తో ఇదే సమస్య. అది విషయాల ను సృష్టిస్తుంది, తప్పుడు వాగ్దానాలు చేస్తుంది, దశాబ్దాలు గా వాగ్దానాల ను వాయిదా వేస్తూంది. ప్రస్తుతం మా ప్రభుత్వం మా దేశ నిర్మాతల మనోభావాల ఆధారంగా నిర్ణయాలను తీసుకొంటున్నప్పుడు, కాంగ్రెస్ సమస్యల ను ఎదుర్కొంటోంది. ఈ సభ ద్వారా, ఈ దేశం లోని 130 కోట్ల మంది పౌరులకు, రాజ్యాంగ గౌరవాన్ని గురించి చాలా బాధ్యత తోను, అవగాహన తోను నేను పునరుద్ఘాటించాలనుకుంటున్నాను. నేను ఈ విషయం చెప్పాలనుకుంటున్నాను. రాజ్యాంగాన్ని పూర్తి గా గౌరవించాలని నేను కోరుకుంటున్నాను. నేను 130 కోట్ల మంది పౌరుల కు చెప్పాలనుకుంటున్నాను.

సిఎఎ చట్టం వల్ల హిందుస్తాన్ లోని ఏ పౌరుల మీద ఎటువంటి ప్రభావం ఉండదు. అది హిందువు, ముస్లిము, సిఖ్ఖు, క్రిస్టియన్ అయినా ఎవరిని కూడా ప్రభావితం చేయదు. ఇది భారతదేశ మైనారిటీల కు హానిని కలిగించదు. ఇంకా దేశ ప్రజల చేత తిరస్కరించబడిన వారు వోట్ బ్యాంకు రాజకీయాలు చేయడానికి ఈ ఆటల ను ఆడుతున్నారు.

నేను అడగాలనుకొంటున్నాను- మైనారిటీల పేరిట తమ రాజకీయ అజెండా ను మరింత గా పెంచుకొంటున్న వారిని, ప్రత్యేకం గా కాంగ్రెస్ వారి ని- నేను అడగాలనుకుంటున్నాను. 1984 ఢిల్లీ అల్లర్ల ను కాంగ్రెస్ గుర్తు పెట్టుకొందా, అది మైనారిటీల మీద కాదా? మీరు మన సిఖ్ఖు సోదరుల మెడలలో టైర్ల ను వేసి మరీ సజీవ దహనం చేశారు కదా. ఇది మాత్రమే కాదు, సిఖ్ఖు వ్యతిరేక అల్లర్ల లో నిందితులను జైలు కు పంపించడానికి మీరు ఏమీ చేయలేదు. అంతే కాక, ఈ రోజున నిందితులుగా ఉన్న వారు, సిఖ్ఖు వ్యతిరేక అల్లర్ల ను ప్రేరేపించారని ఆరోపించ బడిన వారి ని, మీరు ప్రస్తుతం ముఖ్యమంత్రులు గా చేస్తున్నారు. సిఖ్ఖు వ్యతిరేక అల్లర్లలో నిందితులకు శిక్ష పడేందుకు మా వితంతు మాతృ మూర్తులు న్యాయం కోసం మూడు దశాబ్దాలు వేచి వుండవలసి వచ్చింది. వారు మైనారిటీ లు కాదా ? మైనారిటీ కి రెండు త్రాసు లు ఉంటాయా ? ఏం, ఇవే మీ మార్గాలు అవుతాయా ?

గౌరవనీయులైన అధ్యక్షా,

ఇన్ని సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ, నేడు దేశ అంచనాలకు అనుగుణంగా బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా పని చేయవలసిన ఈ రోజు తప్పుడు మార్గం లో పయనించడం దేశం దురదృష్టం. ఈ మార్గం మీకు కూడా ఇబ్బంది కలిగించబోతోంది, అలాగే ఇది దేశాన్ని కూడా ఇబ్బందుల లోకి నెట్టబోతోంది. నేను ఈ

హెచ్చరిక ను చేస్తున్నాను.. ఎందుకంటే మనం అందరం దేశాన్ని గురించి ఆలోచించాలి. మన దేశ ఉజ్వల భవిష్యత్తు ను గురించి ఆలోచించాలి.

మీరు దానిని గురించి ఆలోచిస్తే, రాజస్థాన్ విధాన సభ ఏదైనా నిర్ణయాన్ని తీసుకొని, ఒక వ్యవస్థ ను రూపొందిస్తే, దానిని రాజస్థాన్ లో ఎవరూ పాటించడాని కి సిద్ధపడకుండా, ఊరేగింపులు చేపట్టి, హింసకు పాల్పడి, కాల్పులు జరిపితే, అక్కడ మీ ప్రభుత్వం ఉంది- పరిస్థితి ఎలా ఉంటుంది ? మధ్య ప్రదేశ్- అక్కడ మీరు అధికారం లో ఉన్నారు. మధ్య ప్రదేశ్ విధాన సభ ఒక నిర్ణయాన్ని తీసుకొంటుంది. మరి ఆ నిర్ణయాని కి వ్యతిరేకం గా ప్రజలు వీధుల్లోకి వస్తారు. ఇలాగ దేశాన్ని నడిపించగలమా?

మీరు ఇంత తప్పు చేశారు. ఈ కారణం గానే అక్కడ కూర్చోవలసి వచ్చింది. మీ నిర్వాకాల ఫలితం గా ప్రజానీకం మిమ్ములను అక్కడ కూర్చోబెట్టింది. అందువల్ల ప్రజాస్వామిక పద్ధతి లో దేశం లో ప్రతి ఒక్కరి కి వారి అభిప్రాయాన్ని వెల్లడి చేసేందుకు హక్కు ఉంది. కానీ అబద్ధం, వదంతులు వ్యాప్తి చేయడం ద్వారా మనుషుల ను తప్పుదోవ పట్టించి మనం దేశానికి ఏ మంచిని చేయజాలము.

మరి అందుకే ఈ రోజున రాజ్యాంగాన్ని గురించి మాట్లాడే వారికి ..

రండి- రాజ్యాంగాన్ని గౌరవించండి.

రండి - కలసి కూర్చొని దేశాన్ని నడుపుదాము.

రండి - దేశాన్ని ముందుకు తీసుకుపోదాము.

5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థ కోసం ఒక సంకల్పం తీసుకొని మనం సాగిపోదాము.

రండి - స్వచ్ఛమైన తాగునీరు లభించకుండా ఉన్నటువంటి దేశం లోని 15 కోట్ల కుటుంబాల కు, దానిని అందుబాటులోకి తీసుకువచ్చే సంకల్పాన్ని చెప్పుకొందాము.

రండి- దేశం లోని ప్రతి పేద వ్యక్తి కి పక్కా గృహ నిర్మాణం కోసం కలసి పని చేద్దాము; తద్వారా వారికి పక్కా ఇల్లు లభిస్తుంది.

రండి- దేశ రైతులు, మత్స్యకారులు, పశువుల సంరక్షకులు ఎవరైనా, వారి ఆదాయాన్ని విజయవంతంగా పెంచడానికి కలసి పని చేద్దాము.

ప్రతి పంచాయతీ కి బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ ని ఇద్దాము.

రండి- ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ ను నిర్మించాలనే సంకల్పం తో మనం ముందుకు నడచివెళ్దాము.. అంటూ నేను ప్రత్యేకం గా మనవి చేస్తున్నాను.

గౌరవనీయులైన అధ్యక్షా,

భారతదేశ ఉజ్వల భవిష్యత్తు కోసం మనం కలసి కూర్చొని ముందంజ వేద్దాము. ఈ ఒక్క భావన తో నేను గౌరవనీయ రాష్ట్రపతి గారికి అనేకానేక ధన్యవాదాలు తెలియజేస్తూ, నా ప్రసంగానికి విరామాన్ని ఇస్తున్నాను. మీకు నేను నా ప్రత్యేక కృతజ్ఞతలను వ్యక్తం చేస్తున్నాను.

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

6 ఫిబ్రవరి 2020

రాజ్యసభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 6 ఫిబ్రవరి 2020

గౌరవనీయులయిన చైర్మన్ గారు,

మాన్యులు రాష్ట్రపతి గారు, పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం నుండి నేర్చుకొన్న పాఠాలు, 130 కోట్ల మంది భారతీయుల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబించేవిగా ఉన్నాయి. మాన్యులు రాష్ట్రపతి గారి ప్రసంగానికి మద్దతుగా నేను స్వయంగా ఈ సభ కు హాజరయ్యాను.

ఈ ప్రసంగంపై సుమారు 45 మందికి పైగా గౌరవ సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇది పెద్దల సభ. అనుభవజ్ఞులైన గొప్ప వారి సభ. చర్చ స్థాయిని పెంచడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించారు. శ్రీ గులాం నబీ ఆజాద్ గారు, శ్రీ ఆనంద్ శర్మ గారు, శ్రీ భూపేంద్ర యాదవ్ గారు, శ్రీ సుధాంశు త్రివేది గారు, శ్రీ సుధాకర్ శేఖర్ గారు, శ్రీ రామచంద్ర ప్రసాద్ గారు, శ్రీ రాంగోపాల్ గారు, శ్రీ సతీశ్ చంద్ర మిశ్ర గారు, శ్రీ సంజయ్ రౌత్ గారు, శ్రీ స్వపన్‌దాస్ గారు, శ్రీ ప్రసన్న ఆచార్య గారు, శ్రీ నవనీత్ గారు లాంటి గౌరవ సభ్యులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వీరందరి ప్రసంగాల నుండి నేను నోట్స్ తీసుకొనేటపుడు ఎన్నో కొత్త విషయాలు వెలుగుచూశాయి. గడచిన సమావేశాలలో ఈ సభ ఎంతో ఫలవంతంగా సాగిందన్నది వాస్తవం. ఇది గౌరవనీయ సభ్యులందరి సహకారంతో సాధ్యమైంది. ఇందుకు ఈ సమున్నత సభ గౌరవ సభ్యులందరికీ అభినందనలు. ఈ సభ ఎంతో అనుభవం కలిగిన సభ్యుల సభ. అందువల్ల సహజంగానే దేశ ప్రజలకు ఎన్నో ఆకాంక్ష లు ఉంటాయి. అధికార పక్ష స్థానాల లో ఆసీనులు అయిన సభ్యుల కు ఎన్నో ఆకాంక్ష లు ఉంటాయి. నా వరకు నాకు కూడా ఎన్నో ఆకాంక్ష లు ఉన్నాయి. మీ కృషి కారణం గా, దేశం కోసం ఎన్నో మంచి

విషయాలు వెలుగు చూస్తాయని, నా వంటి కొత్త సభ్యులకు విలువైన మార్గదర్శనం లభిస్తుందని నా ఆకాంక్ష. అయితే ఈ ఆకాంక్షలు ఇలా ఉన్నప్పటికీ నేను నిరాశకు లోనయ్యాను. మీరు ఇంతకు ముందు ఉన్న చోటు కే పరిమితం అయినట్లు ఉంది. కొన్ని సందర్భాలలో వెనుకకు పోతునట్టు కూడా అనిపిస్తోంది. దేశ ప్రజలలో నిరాశాపూరిత పరిస్థితిని కలిగించే బదులు మీరు దేశానికి సరైన దిశానిర్దేశం చేసి ఉంటే బాగుండేది. ప్రభుత్వానికి కొత్త ఉత్సాహం, కొత్త ఆలోచనలు, కొత్త శక్తి అందించడానికి బదులు స్తబ్దతే మంచిది అని మీరు భావించినట్లు ఉన్నారు. ఈ సందర్భంగా నాకు కాకా హాతరసి హాస్య కవిత గుర్తుకు వస్తోంది.

ప్రకృతి బదలాతీ క్షణ్ -క్షణ్ దేఖో,

బదల్ రహే అణు, కణ్-కణ్ దేఖో,

తుమ్ నిష్క్రియా సే పడే హువే హో,

భాగ్యవాద్ పర్ అడే హువే హో,

ఛోడో మిత్ర్ ! పురానీ డఫ్ లీ,

జీవన్ మే పరివర్తన్ లావో,

పరంపరా సే ఊంచే ఉఠాకర్,

కుఛ్ తో స్టాండర్డ్ బనావో..

అంటూ ఆయన ఎంత చక్కగా చెప్పారో.

ప్రకృతి ప్రతి క్షణం మారుతుంది చూడు

అణువు మారుతుంది కణం కణం చూడు

అదృష్టాన్ని నమ్ముకుని ఏమి చేయకుండా కూర్చున్నావు.

వదులు మిత్రమా పాత డప్పుని

జీవితంలో మార్పు తీసుకుని రా

సాంప్రదాయాలను వదిలేసి

ఒక స్థాయికి ఎదుగు.

గౌరవనీయ చైర్మన్ గారు,

చర్చను ప్రారంభిస్తూ గులాం నబీ గారు తమ ప్రసంగంలో కోపాన్ని ప్రదర్శించారు. చాలా సందర్భాలలో ప్రభుత్వాన్ని పలు రకాలుగా విమర్శించడానికి ప్రయత్నించారు. అయితే అది చాలా సహజమైన విషయం. అయితే వారు నిరాధారమైన విషయాలను ప్రస్తావిస్తున్నారు. జమ్ము, కశ్మీర్ పై సభ లో ఎటువంటి చర్చ లేకుండానే నిర్ణయం జరిగినట్లు చెప్పారు. దీనిపై చర్చను దేశ ప్రజలు ఒక రోజంతా టీవీలలో చూశారు, విన్నారు. విస్తృత స్థాయిలో జరిగిన ఈ చర్చను దేశ ప్రజానీకం వీక్షించింది. ఈ విస్తృత చర్చ తరువాతే సభ నిర్ణయానికి వచ్చింది. గౌరవ సభ్యులు వారి వోటు హక్కు ను వినియోగించుకోవడం ద్వారా దీనిని నిర్ణయించారు.

ఆజాద్ సాహిబ్, మీ జ్ఞాపక శక్తి ని మరింత రిఫ్రెష్ చేయనివ్వండి. ప్రజలు పాత దోపిడీదారులను అంత త్వరగా మరచిపోరు. తెలంగాణ పై సభ ఎలా నిర్ణయించిందో గుర్తు పెట్టుకోండి. సభ కు తాళం వేశారు. టీవీ లు ఆపివేశారు. చర్చకు అవకాశమే లేదు. ఎటువంటి పరిస్థితుల లో అది ఆమోదించారో ఎవరూ మరచిపోలేరు.

కాబట్టి మాకు మీరు సీనియర్ గా సలహా ఇవ్వండి, కాని, ఇప్పటికైనా నిజం అంగీకరించాలి. దశాబ్దాల అనంతరం, కొత్త రాష్ట్రం ఏర్పాటుకు మీకు అవకాశం దొరికింది. ప్రతి ఒక్కరినీ కలుపుకొని వారి ఆకాంక్షల మేరకు, ఉత్సాహంతో చేసి ఉండవచ్చు. కొద్దిసేపటి క్రితమే , ఆనంద్ జీ చెబుతూ వచ్చారు, మీరు రాష్ట్రాలను అడిగారా, ఇతరులను అడిగారా అని. ఆయన చాలా చెబుతున్నారు. అంతెందుకు , కనీసం వారు ఆంధ్ర- తెలంగాణ ప్రజల ను వారి ఆకాంక్ష ఏమిటో అడిగి ఉండవచ్చు. కానీ మీరేం చేశారన్నది చరిత్ర. అప్పటి ప్రధాన మంత్రి శ్రీ మన్ మోహన్ సింగ్ గారు, ఒక విషయం లోక్ సభ లో చెప్పారు. దానిని ఈ రోజున మనం గుర్తుంచుకోవాలని నేను భావిస్తున్నాను.

వారు ఇలా అన్నారు.

“తెలంగాణ అంశం పై జరుగుతున్న నిరసనల కారణం గా భారతదేశం లో ప్రజాస్వామ్యానికి నష్టం వాటిల్లుతోంది. అటల్ గారి ప్రభుత్వం పూర్తి గౌరవం తో, శాంతియుతం గా, సామరస్యపూర్వకం గా ఉత్తరాఖండ్, ఝార్ ఖండ్ , ఛత్తీస్ గఢ్ ల ను ఏర్పాటు చేసింది. ఇవాళ ఈ మూడు కొత్త రాష్ట్రాలు తమదైన పంథాలో దేశ ప్రగతి కి దోహదం చేస్తున్నాయి.” జమ్ము, కశ్మీర్, లద్దాఖ్ ల పై తీసుకొన్న ఏ నిర్ణయం అయినా సరే దానిని సుదీర్ఘమైన, సంపూర్ణమైన చర్చ ద్వారానే తీసుకోవడం జరిగింది.

జమ్ము, కశ్మీర్ పరిస్థితుల పై కొంత సమాచారాన్ని ఇక్కడ సమర్పించారు. నా దగ్గర కూడా కొన్ని గణాంకాలు ఉన్నాయి. నేను కూడా సభ లో దీనిపై ఒక ప్రకటన ను చేయాలని భావిస్తున్నాను. 20 జూన్ 2018 - ప్రభుత్వం పతనం తరువాత, రాష్ట్రపతి పాలన విధించబడింది. ఆర్టికల్ 370 ను తొలగించాలని నిర్ణయించడం జరిగింది. దాని తరువాత, తొలిసారిగా, పూర్వపు రాష్ట్రం లోని అణగారిన వర్గాల ప్రజలు, పేదలు రిజర్వేషన్

ప్రయోజనాలను పొందగలిగారు. తొలిసారిగా జమ్ము, కశ్మీర్ లోని పహాడి - మాట్లాడే ప్రజలు రిజర్వేషన్ ప్రయోజనాలను పొందారు. తొలిసారిగా జమ్ము, కశ్మీర్ లోని మహిళలు, రాష్ట్రం వెలుపలి వ్యక్తిని వివాహం చేసుకున్నప్పటికీ ఆస్తి ని కలిగి ఉండే హక్కు కొనసాగించడానికి హక్కు పొందారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా బ్లాక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కు ఎన్నికలు జరిగాయి. తొలిసారిగా జమ్ము, కశ్మీర్ లో ఆర్ఇఆర్ఎ చట్టం అమలులోకి వచ్చింది. తొలిసారిగా స్టార్ట్ అప్ పాలిసి, ఎగుమతులు, వాణిజ్య విధానం, లాజిస్టిక్ పాలసీలను జమ్ము, కశ్మీర్ లో అమలు చేస్తున్నారు. దేశ ప్రజల కు ఆశ్చర్యం గొలిపే మరో అంశం, తొలిసారిగా, జమ్ము, కశ్మీర్ లో అవినీతి నిరోధక బ్యూరో ఏర్పాటైంది. తొలిసారిగా, సరిహద్దుల వెలుపల నుండి వేర్పాటువాదులకు నిధులు అందుబాటులోకి రావడాన్ని నియంత్రించడం జరిగింది. తొలిసారిగా వేర్పాటు వాదులను సన్మానించే సంప్రదాయానికి చరమ గీతం పాడడం జరిగింది.తొలిసారిగా, జమ్ము, కశ్మీర్ లో పోలీసు, భద్రతా దళాలు ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిర్ణయాత్మక చర్య లు తీసుకోగలుగుతున్నారు. తొలిసారిగా, జమ్ము, కశ్మీర్ లో పోలీసు సిబ్బంది , ఇతర కేంద్ర ప్రభుత్వ సిబ్బంది వలె దశాబ్దాలు గా పొందుతున్న అలవెన్సుల ప్రయోజనాలను పొందారు. తొలిసారి గా జమ్ము, కశ్మీర్ పోలీసులు ఇప్పుడు ఎల్ టిసి తీసుకుని కన్యాకుమారి కి లేదా ఈశాన్య రాష్ట్రాల కు, అండమాన్- నికోబార్ కు వెళ్లవచ్చు.

గౌరవనీయులైన చైర్మన్ గారు,

గవర్నర్ పాలన తరువాత 18 నెలల్లో 4400 సర్పంచ్ లు, 35 వేల కు పైగా పంచ్ పదవులకు శాంతియుతంగా ఎన్నికలు జరిగాయి. 18 నెలల్లో, 2.5 లక్షల టాయిలెట్లను జమ్ము, కశ్మీర్ లో నిర్మించడం జరిగింది.

18 నెలల్లో, జమ్ము, కశ్మీర్ లో 3 లక్షల 30 వేల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ కల్పించడం జరిగింది. 18 నెలల్లో, జమ్ము, కశ్మీర్ లోని 3.5 లక్షల మందికి పైగా ప్రజల కు ఆయుష్మాన్ యోజన కింద గోల్డ్ కార్డు లు ఇవ్వడం జరిగింది. పట్టుమని 18 నెలల్లో జమ్ము, కశ్మీర్ లో ఒకటిన్నర లక్షల మంది వయోధికులు, మహిళ లు, దివ్యాంగుల ను పెన్షన్ పథకం తో జోడించడమైంది. అభివృద్ధి ఇంతకు ముందు కూడా జరిగినట్టు ఆజాద్ సాహిబ్ చెప్పుకొచ్చారు. మేము అభివృద్ధి జరగలేదని అనలేదు. అయితే అభివృద్ధి ఎలా చోటు చేసుకొంటూ వచ్చిందో నేను ఒక ఉదాహరణను చెబుతాను.

2018 మార్చి నాటికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో కేవలం 3.5 వేల ఇళ్లు నిర్మితమయ్యాయి. రెండు సంవత్సరాల లోపల 24 వేల ఇళ్లు ఈ పథకం లో నిర్మించబడ్డాయి. ఇప్పుడు అనుసంధానాన్ని పెంచేందుకు, పాఠశాలల పరిస్థితిని మెరుగుపరచేందుకు, ఆస్పత్రుల స్థాయిని పెంచేందుకు, నీటిపారుదల సదుపాయాలను పెంచేందుకు, పర్యాటకాన్ని పెంచేందుకు పిఎమ్ పాకేజ్ తో పాటు, ఎన్నో ఇతర పథకాలను ముందుకు తీసుకుపోవడం జరుగుతోంది.

గౌరవనీయ వైకోజీ గారిది ఒక శైలి. వారు ఎప్పుడూ చాలా భావావేశభరితులై ఉంటారు. 2019వ సంవత్సరం ఆగస్టు 5 వ తేదీ న జమ్ము, కశ్మీర్ కు బ్లాక్ డే అని వారు చెప్పారు. వైకోజీ ఇది బ్లాక్ డే కాదు. ఉగ్రవాదాన్ని, వేర్పాటు వాదాన్ని ప్రోత్సహించే వారికి ఇది బ్లాక్‌డే అని రుజువు అయ్యింది. లక్షలాది కుటుంబాల లో ఇవాళ కొత్త విశ్వాసాన్ని, ఒక గొప్ప ఆశా కిరణాన్ని చూస్తున్నాము.

గౌరవనీయ చైర్మన్ గారు, ఈశాన్య ప్రాంతాన్ని గురించి కూడా ఇక్కడ చర్చ జరిగింది. ఆజాద్ సాహిబ్ చెబుతున్నారు, ఈశాన్యం తగలబడిపోతున్నదని. అక్కడ అది తగలబడి

పోతుంటే, ముందు మీరు మీ ఎంపీ ల ప్రతినిధి బృందాన్ని అక్కడకు పంపి ఉండే వారు. అక్కడ విలేకరుల సమావేశాన్ని పెట్టించి ఉండేవారు. ఆ ఫోటోలు కూడా ప్రచురింపబడేలా చేసి ఉండేవారు. అందువల్ల అజాద్ సాహిబ్ చెబుతున్న సమాచారం బహుశా 2014వ సంవత్సరానికన్నా క్రితంది కావచ్చు. అలాగే నేను అక్కడి తాజా సమాచారాన్ని ఇవ్వదలచాను. ఈశాన్యం, భారతదేశ అభివృద్ధి ప్రయాణం లో మున్నెన్నడూ లేనంతటి రీతిగా ముందు వరుస లోని భాగస్వామి గా ఉంటోంది. 40-50 సంవత్సరాలు గా ఈశాన్య రాష్ట్రాల లో హింసాత్మక ఉద్యమాలు చోటుచేసుకొంటూ వచ్చాయి. అప్పట్లో దిగ్బంధాలు ఉండేవి. అవి ఎంత ఆందోళన కలిగించేవో అందరికీ తెలుసు. అయితే ఇవాళ హింస సమసిపోయింది. దిగ్బంధాలు నిలచిపోయాయి. ఈశాన్య రాష్ట్రాలు శాంతి బాట లో ప్రగతి పథాన ముందుకు సాగుతున్నాయి.

నేను ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించదలచుకున్నాను. బ్రూ (Bru) తెగ సమస్య దాదాపు 25-30 సంవత్సరాలుగా ఉంది. మీకు కూడా తెలుసు. మనందరికీ తెలుసు.. సుమారు 30 వేల మంది అనిశ్చిత పరిస్థితుల లో జీవనాన్ని సాగిస్తున్నారు. చిన్న చిన్న గదుల లో అది కూడా తాత్కాలిక గుడిసెల లో వీరు ఉండవలసి వస్తోంది. ఇందులో 100-100 మంది బలవంతం గా జీవనం సాగించాల్సిన పరిస్థితి. ఇది మూడు దశాబ్దాలు గా కొనసాగుతోంది. ఇంతకంటే హింస మరొకటి ఉండదు. వారు చేసిన నేరం ఏమీ లేదు. దయనీయమైన పరిస్థితిని చూడండి, ఈశాన్య రాష్ట్రాలలో మీ పార్టీ చాలా ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. మీ మిత్ర పార్టీ త్రిపుర లో అధికారం లో ఉంది. మీకు మిత్రులు ఉన్నారు. సన్నిహిత మిత్రులు. మీకు చిత్తశుద్ధి ఉంటే , మిజోరం ప్రభుత్వం మీతో ఉంటే, మీ స్నేహితులు త్రిపుర లో ఉన్నప్పుడు, మీరు కేంద్రం లో అధికారం లో ఉన్నారు. మీరు అనుకుంటే, బ్రూ- రియాంగ్ తెగ సమస్య కు సంతోషకరమైన పరిష్కారం సాధించి ఉండే వారు.

కానీ ఇవాళ, ఎన్నో సంవత్సరాల తరువాత, ఈ సమస్య ను మేము పరిష్కరించాము. అంతేకాదు, దీనికి శాశ్వత పరిష్కారాన్ని సాధించాము.

వారి పట్ల ఉదాసీనత కు కారణం ఏమిటో నాకు ఇప్పుడు అర్థ మైంది. ఇళ్ళ నుండి, గ్రామం నుండి విడిపోయిన బ్రూ ప్రజలు ఎంతో నష్టపోయారు. వారి బాధ అపరిమితం. కానీ వారి వోట్లు చాలా తక్కువ. ఇది వోట్ల ఆట గా ఉండేది. అందువల్ల వారి అపరిమిత బాధను తెలుసుకోలేకపోయారు. అలా వారి సమస్యను పరిష్కరించలేకపోయారు. ఇదీ మన చరిత్ర. దీనిని మరచిపోవద్దు.

కానీ, మా ఆలోచన భిన్నంగా ఉంది. మేము 'సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' మంత్రం ద్వారా అందరినీ కలుపుకొని ముందుకు తీసుకు పోవడాన్ని విశ్వసిస్తాము. మేము, ఇతరుల పట్ల ప్రేమ తో వారి సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత తో చేయగలిగినదంతా చేస్తున్నాము. వారి బాధలను మేము అర్థం చేసుకొంటాము. ఇవాళ 29 వేల మంది ప్రజలు వారి స్వంత ఇళ్లను పొందుతున్నారు. ఈ విషయంలో దేశం గర్వపడుతోంది. వారికి స్వంత గుర్తింపు ఉంటుంది. వారికంటూ స్వంత ప్రదేశం ఉంటుంది. వారు వారి కలల ను నెరవేర్చుకోవచ్చు. వారు వారి పిల్లల భవిష్యత్తును నిర్ణయించుకోగలరు.

ఈ రకంగా ఈశాన్య రాష్ట్రాలలో అది బ్రూ తెగ వారిది కావచ్చు లేదా ఇతరులది ఎవరిదైనా కావచ్చు సమస్యలను పరిష్కరించవచ్చని మేము విశ్వసిస్తున్నాము. బోడో సమస్య పై నేను వివరాలలోకి వెళ్లదలచుకోలేదు. అయితే దానికి సంబంధించి కూడా చాలా చాలా ముఖ్యమైన పని పూర్తి అయింది. దీని ప్రత్యేకత ఏమంటే, హింసామార్గం లోని అన్ని సాయుధ సమూహాలు కలసికట్టుగా దగ్గరయ్యాయి. ఈ ఒప్పందం కుదిరిన తరువాత ఇక పూర్తి కాని డిమాండులు అంటూ ఏమీ లేవని ప్రతి ఒక్కరు అంగీకరించారు. శ్రీ సుఖేందు శేఖర్ గారి తో పాటు ఎంతో మంది సహచరులు ఇక్కడ ఆర్థిక అంశాలను

చర్చించారు. అఖిలపక్ష సమావేశం జరిగినప్పుడు కూడా నేను వినమ్రం గా చెబుతూ వచ్చాను. మనం సమావేశం అంతటిని ఆర్థిక అంశాల పై చర్చకు కేటాయించాలి అని. దీని పై తీవ్ర చర్చ జరగాలి. అన్ని అంశాల ను ప్రముఖం గా ప్రస్తావించాలి. మనకు ఉన్న మేధస్సు, సామర్థ్యాల మేరకు చర్చ ను అర్థవంతం చేయాలి. అప్పుడే మనం కొత్త అంశాల ను కనుగొనగలం. అంతేకాదు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక పరిస్థితి ని దృష్టి లో పెట్టుకొని భారతదేశం ఎలా గరిష్ఠ ప్రయోజనాన్ని పొందగలదో కొత్త మార్గాన్ని ఆలోచించాలి. అలాగే భారతదేశం తన మూలాల ను ఎలా బలోపేతం చేసుకోగలదో, దాని ఆర్థిక ప్రయోజనాల ను ఎలా బలోపేతం చేసుకోగలదో ఆలోచించాలి. వీటిని మనం విస్తృతంగా చర్చించవచ్చు. వీటిని మనం లోతుగా చర్చిద్దాము. ఈ విషయమై నేను అఖిల పక్ష సమావేశంలో ప్రతి ఒక్కరికి విజ్ఞప్తి చేశాను. ఈ సమావేశాలను పూర్తిగా దేశ ఆర్థిక అంశాల పై చర్చకు కేటాయించాలని నేను కోరుకుంటున్నాను.

బడ్జెటును చర్చించాలి. దీనిని మరింత వివరంగా చర్చించాలి, అప్పుడది ఈ ప్రక్రియ ను ఫలప్రదం చేస్తుంది. ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉండవచ్చు. వాదోపవాదాలు చోటు చేసుకోవచ్చు. అయినా, అర్థవంతమైన చర్చ ద్వారా తేనె వంటి ఫలితం వస్తుంది. అందుకే నేను ప్రతి ఒక్కరిని మరోసారి ఆర్థిక వ్యవస్థ పైన, ఆర్థిక పరిస్థితి పైన, ఆర్థిక విధానాల పైన, ఆర్థిక స్థితిగతుల పైన చర్చించవలసిందిగా మనవి చేస్తున్నాను. మనకు నిపుణులైన వారు, ఉదాహరణకు డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి వారు మన మధ్య ఉన్నారు. ఇటువంటి చర్చల ద్వారా దేశం తప్పకుండా ప్రయోజనం పొందుతుంది. మనం ఆ పనిని చేయాలి. ఈ విషయం లో మనం అరమరికలు లేని మనస్సు తో ఉండాలి. అయితే, ఆర్థిక పరిస్థితి కి సంబంధించి ఇక్కడ చర్చించిన అంశాల విషయం లో, దేశం నిరుత్సాహపడవలసిన అవసరం లేదు. నిరుత్సాహాన్ని వ్యాప్తి చేయడం ద్వారా వారు పొందగలిగింది ఏమీ లేదు. ఇవాళ

కూడా , మౌలికమైన అంశాలు, అంటే దేశ ఆర్థిక వ్యవస్థ కు సంబంధించిన మౌలిక అంశాలు, ప్రాతిపదికలు, దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతో బలంగా, స్థిరంగా ఉండడం తో పాటు మరింత ముందుకు పోవడానికి పూర్తి శక్తితో ఉన్నాయి. ఈ రకమైన నాణ్యత దానిలో ఉంది. చిన్న చిన్న ఆలోచనలతో ఏ దేశమూ ముందుకు పోజాలదు. ఇప్పుడు మన దేశ యువతరం, మనం గొప్ప గొప్ప ఆలోచనలతో ముందుకు పోవాలని, సమున్నతంగా ఆలోచించాలని, మరింత శక్తి తో ముందుకు పోవాలని ఆకాంక్షిస్తోంది. ఈ మౌలిక మంత్రాన్ని దృష్టి లో పెట్టుకొని 5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదిగేందుకు కృషి చేయాలి. మనం మన దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేద్దాము. అనుసంధానం చేసేందుకు ప్రయత్నం చేద్దాము. నిరాశచెందాల్సిన అవసరం ఎంత మాత్రం లేదు. మొదటి రోజే ఆదుర్దా పడవలసిన అగత్యం లేదు. ఏది సాధ్యమో , ఏది అసాధ్యమో చూద్దాము. ప్రతిసారీ మనల్ని మనం కొంతవరకే ముందుకుపోవడానికి పరిమితం చేసుకోవద్దు. కొందరు రెండు అడుగులే వేయవచ్చు. మనం వాళ్లనే అనుకరిస్తామా? కొన్ని సందర్భాలలో కనీసం ఐదు అడుగులైనా వేయడానికి ప్రయత్నించవచ్చు. కొన్ని సార్లు మీరు ఏడు అడుగులు వేయడానికి ప్రయత్నించవచ్చు. లేదా కొన్ని సందర్భాలలో మీరు నాతో కలిసి నడవవచ్చు.

నిరాశ దేశానికి ఎప్పుడూ మంచిది కాదు, అందువల్ల 5 ట్రిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థను గురించి మాట్లాడటం వల్ల మంచి ఫలితం ఏమిటంటే దానిని వ్యతిరేకించే వారు కూడా 5 ట్రిలియన్ డాలర్ల గురించి మాట్లాడవలసి ఉంటుంది. ప్రతి ఒక్కరూ 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను గురించి ఆలోచించాలి. ఇది పెద్ద మార్పు. ఇక ఇప్పుడు అంతర్జాతీయ ధోరణికి అనుగుణంగా కాన్వాస్ రూపొందించబడింది. మనం ఆలోచనా సరళిని మార్చేశాం. ఈ కలను సాకారం చేయడానికి ఎమ్ఎస్ఎమ్ఇలు, జౌళి

ప్రాంగణాలు వంటివి, ఉపాధి అవకాశాలు కలిగిన వాటికి గ్రామాలు, పట్టణాలలో మౌలిక సదుపాయాలు ఉండాలి. మేము సాంకేతిక విజ్ఞానాన్ని, స్టార్ట్ అప్ లను ప్రోత్సహించేందుకు ప్రయత్నిస్తున్నాము. పర్యాటక రంగం అనేది ఒక పెద్ద అవకాశంగా ఉన్నది.

కారణం ఏమైతేనేం కాని, దేశం లో గడచిన 70 సంవత్సరాలలో పర్యాటకంలో దేశానికి పేరు సాధించడంలో, పర్యాటకాన్ని ప్రోత్సహించే అవకాశాన్ని జారవిడుచుకొన్నాము. ఇవాళ్టికీ మనకు అవకాశం ఉంది. ఇప్పటికైనా మన దేశం దృష్టి కోణం లోంచి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి. భారతదేశ పర్యాటక రంగాన్ని పశ్చిమ దేశాల దృష్టికోణం లోంచి అభివృద్ధి చేయలేం. ప్రపంచం భారతదేశాన్ని దర్శించడానికి రావాలి. మేం మేక్ ఇన్ ఇండియా ను ప్రత్యేకంగా తీసుకొంటున్నాము. దీని సఫలత స్పష్టంగా కనిపిస్తోంది. మీరు విదేశీ పెట్టుబడులకు సంబంధించిన గణాంకాలను చూస్తూ ఉండి ఉంటారు. మేం మొత్తం పన్ను వ్యవస్థను సులభతరం చేయడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాము. సులభతర వాణిజ్యంలో భారతదేశ ర్యాంకింగ్ ల విషయంలో కాని, లేదా సులభతర జీవనానికి సంబంధించిన అంశాల విషయంలో కాని.. రెండింటి విషయంలోనూ మేం గట్టి కృషి చేశాము. బ్యాంకింగ్ రంగానికి సంబంధించి నాకు కొన్ని విషయాలు గుర్తుకు వస్తున్నాయి. నేను గుజరాత్ లో ఉన్నప్పుడు, చాలా మంది నిపుణులు తమ వ్యాసాలలో, ఒక విషయం చెబుతూ ఉండే వారు. దేశంలో బ్యాంకుల ను విలీనం చేయాలి అని. ఇదే జరిగితే ఇది ఒక గొప్ప సంస్కరణ అవుతుందని అంటూ ఉండేవారు. మనము ఇటువంటి వ్యాసాలను ఎన్నింటినో చదివాము. ఇవాళ ఈ ప్రభుత్వం ఎన్నో బ్యాంకులను సులభంగా విలీనం చేసింది. ఇవాళ శక్తిమంతమైన బ్యాంకింగ్ రంగం సిద్ధం గా ఉంది. ఇది అబివృద్ధిపథం లో ఎదుగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయనుంది.

ఇవాళ, తయారీ రంగాన్ని కొత్త దృష్టి కోణం లోంచి చూడాలి. బ్యాంకులలో డబ్బు నిలచిపోవడానికి కారణం ఏమిటో చూడాలి. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నేను దీనిని గురించి సవివరంగా తెలిపాను. నేను ఎవరినీ పదే పదే తక్కువ చేయడానికి ప్రయత్నించను. దేశం ముందు వాస్తవాలను ఉంచడం ద్వారా నేను ముందుకు సాగడానికి ప్రయత్నిస్తాను. నేను అటువంటి విషయాలలో సమయాన్ని వృధా పోనీయను. లేకపోతే చెప్పాల్సింది చాలా ఉంది.

ఏ అంశం పై అయినా చర్చ కు కొదువ లేదు. మనం జిఎస్ టి పై ఎన్నో సార్లు చర్చించాము. ఎన్నోసార్లు మార్పులు చేశాము. ఇది మంచిదనుకోమంటారా, చెడ్డదనుకోమంటారా. నాకు ఆశ్చర్యం వేస్తోంది. జిఎస్ టి రూపకల్పన సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన కీలకమైన విజయం. ఇది రాష్ట్రాలు, కాంగ్రెస్‌పాలిత రాష్ట్రప్రభుత్వాల ఆకాంక్షలను కూడా ప్రతిబింబిస్తోంది. మనకు దేవుడిచ్చిన తెలివితేటలు ఉన్నాయని మనం చర్చించడం మానివేస్తామా? మనం దీనిని మరింత మెరుగుపరచేందుకు ప్రయత్నించకుండా వదలివేస్తామా? ఇది మా విధానంకాదు. మా అభిప్రాయం ఏమిటంటే అవసరమైన చోట మార్పు లు చేయాలి. ఇది ఒక పెద్ద దేశం. ఈ దేశంలో ఎన్నో అంశాలు ఉన్నాయి. రాష్ట్రాల బడ్జెటు వచ్చినపుడు, అమ్మకపు పన్ను లేదా ఇతర పన్నుల గురించి మీరు చూసే ఉంటారు. ఎన్నో చర్చలు. రాష్ట్రాలు చివరకు అనేక మార్పులు చేశాయి. ఇప్పుడు ఈ అంశం రాష్ట్రాల నుండి దూరం దూరంగా వెళ్లిపోయి సమ్మిళతమైంది. ఇది భారంగా అనిపించవచ్చు. జిఎస్ టి చాలా సరళంగా ఉండి ఉంటే బాగుండేదని చెప్పారు. నేను అర్థం చేసుకోగలను. ఇలా ఉండాలి, అంత ఉండాలి, అన్నారు. నేను ఒక్క విషయం అడుగుతాను. మీకు ఇంత పరిజ్ఞానం ఉన్నప్పుడు, దీనిని సులభతరం చేసే స్పష్టమైన దార్శనికత ఉన్నప్పుడు, మిత్రులారా, మరి మీరు ఎందుకు ఇంతకాలం

ఊరుకున్నారు? అవును, అందుకే చెబుతున్నాను, ఈ గందరగోళాన్ని వ్యాప్తి చేయవద్దని. అవును నేను చెబుతాను ఈ రోజున మీరు వినాలి.

ప్రణబ్ దా ఆర్థిక మంత్రి గా ఉన్నప్పుడు గుజరాత్ కు విచ్చేశారు. అప్పుడు మేము సుదీర్ఘ చర్చలు జరిపాం. దాదా, ఇది సాంకేతిక విజ్ఞానాధారితమైనటువంటి వ్యవస్థ కదా, ఏం జరిగింది అని అడిగాను. అది లేకుండా పనిచేయలేము. దానికి కాస్త ఆగండి అని దాదా చెప్పారు. మీ ప్రశ్న-- అంటూ తన కార్యదర్శి ని పిలిచారు. మోదీ జీ ఏం చెబుతున్నారో వినండి అన్నారు. దానికి నేను, ఇది సాంకేతిక విజ్ఞాన ప్రేరిత వ్యవస్థ. సాంకేతిక పరిజ్ఞానం లేకుండా ముందుకు పోలేం అన్నాను. అప్పుడు ఆయన అన్నారు, మేము ఇప్పుడే నిర్ణయం తీసుకొన్నాము, మేము ఒక కంపెనీ సేవల ను అందిపుచ్చుకొంటాము, మేము దానిని చేపట్టబోతున్నాము అన్నారు. నేను దీనిని జిఎస్ టి ని గురించి మాట్లాడడానికి వచ్చినప్పటి కాలం గురించి మాట్లాడుతున్నాను. అయినా అప్పట్లో అటువంటి వ్యవస్థ ఏదీ లేదు. ఇక రెండోది, జిఎస్ టి విజయవంతం కావాలంటే, ఉత్పత్తి చేసే రాష్ట్రాల సమస్యలను పరిష్కరించాలని సూచించాను. తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రల వంటి రాష్ట్రాలు ఉన్నాయి. ఇవి చాలావరకు తయారీ ప్రధానమైనటువంటి రాష్ట్రాలు. వీటికి వినియోగ రాష్ట్రాలు, వినియోగదారులు కష్టమేమీ కాదు. నేను ఇవాళ గర్వంగా చెప్పగలను, అరుణ్ జైట్లీ గారు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు వారు ఈ సమస్యలను పరిశీలించి, పరిష్కరించారు. ఆ తరువాత, దేశం మొత్తం జిఎస్ టి వెంట నడచింది. నేను ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు ఈ అంశాన్ని లేవనెత్తినందున, ఆ సమస్యలన్నిటిని నేను ప్రధాన మంత్రి గా పరిష్కరించాను. ఆ రకం గా జిఎస్ టి సమస్యలను పరిష్కరించడం ద్వారా మార్గాన్ని సుగమం చేశాను.

ఇది మాత్రమే కాదు, మనం మార్పు ను గురించి మాట్లాడితే, అప్పుడు కొన్ని సార్లు, మళ్ళీ, మళ్ళీ ఈ మార్పు ఎందుకు ? అని అంటాము. మన మేధావులైన పూర్వికులు

మనకు గొప్ప రాజ్యాంగాన్ని ఇచ్చారు, అయితే వారు దానిలో కూడా మెరుగుదల కోసం వీలు కల్పించారు. సంస్కరణలు ఎప్పుడూ స్వయం ప్రతిపత్తిని కలిగివుండాలి. ఇతరుల ఆలోచనలను పంచుకోవడం ద్వారా మనం ముందుకు కదులుతాము. దేశ ప్రయోజనాలను దృష్టి లో పెట్టుకొని ప్రతీ మంచి సలహాను స్వాగతిస్తాము.

గౌరవనీయులైన చైర్మన్ గారూ, భారత దేశ ఆర్థిక వ్యవస్థ లో ఒక విషయం ఉంది; అది చాలా తక్కువగా ప్రాచుర్యం పొందింది. దీని పై దృష్టిని సారించవలసిన అవసరం ఉంది. భారతదేశంలో వస్తున్న ఈ అతి పెద్ద మార్పు వల్ల మన రెండో అంచె, మూడో అంచె నగరాలు చాలా బాగా సహకరించుకొంటున్నాయి. క్రీడల లో మనం చూసినట్లయితే, రెండో అంచె, మూడో అంచె నగరాల బాలలు బాగా రాణిస్తున్నారు. అదే విధంగా చదువులలో కూడా, రెండో అంచె, మూడో అంచె నగరాల బాలలు బాగా రాణిస్తున్నారు. అలాగే, అత్యధిక సంఖ్య లో అంకుర సంస్థలు సైతం రెండో అంచె, మూడో అంచె నగరాలలో పుట్టుకు వస్తున్నాయి. అందువల్ల, ఏ విధమైన బరువు బాధ్యతలు లేని ఉత్సాహవంతులైన యువకులు, కొండంత ఉత్సాహంతో, శక్తితో ముందుకు వస్తున్నారు. అందుకు అనుగుణంగా మేము ఈ చిన్న నగరాలు, పట్టణాలు, వాటి ఆర్థిక వ్యవస్థలను చాలా దగ్గర నుండి గమనించి, ఆ దిశగా వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నాము. మన దేశంలో డిజిటల్ లావాదేవీలు - ఈ సభలో డిజిటల్ లావాదేవీల పై వక్తలు చేసిన ప్రసంగాలను బయటకు తీస్తే, అవి వారు మాట్లాడినవేనా అని ఎవరికి వారు ఆశ్చర్యపోతున్నారు. కొంతమంది అయితే మొబైల్ ఫోన్ లతో అద్భుతాలు చేస్తున్నారు. వారు డిజిటల్ బ్యాంకింగ్ ను, బిల్లింగ్ ను కూడా మొదలుపెట్టారు. చిన్న చిన్న ప్రాంతాల లో చాలా చోట్ల ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలను చూస్తూ వుంటే నాకు చాలా ఆశ్చర్యం వేస్తోంది. రెండో అంచె, మూడో అంచె నగరాలు కూడా అత్యాధునిక మౌలిక సదుపాయాల నిర్మాణం లో

ముందంజలో ఉన్నాయి. మన రైల్వేస్, మన రహదారులు, మన విమానాశ్రయాలు, వాటి మొత్తం అన్ని విభాగాలు- విమాన మార్గాల విషయానికి వస్తే , 250వ మార్గం మొన్న ప్రారంభం అయింది. దేశం లో 250వ మార్గం అంటే మామూలు విషయం కాదు. మన విమాన ప్రయాణ విధానం ఎంతో వేగంగా మారిపోయింది. రానున్న రోజులలో ఇంకా వేగంగా మారనుంది. గత ఐదు సంవత్సరాల కాలంలో, మనం 65 విమానాశ్రయాలను కలిగివుంటే ప్రస్తుతం వీటి సంఖ్య100 కు పైబడింది. మరి ఇవన్నీ కూడాను ఆ నూతన ప్రదేశాల అభివృద్ధిని పెంచనున్నాయి.

అదేవిధంగా, గడచిన ఐదు సంవత్సరాల కాలం లో మేము ఒక్క ప్రభుత్వాన్ని మార్చడమే కాక మన ఆలోచనల సరళిలో కూడా మార్పు తెచ్చాము. మేము పని చేసే పద్ధతి ని సైతం మార్చాము. మేము వైఖరినీ మార్చాము. ఇప్పుడు డిజిటల్ ఇండియాను గురించి మాట్లాడుకుందాము. బ్రాడ్ బ్యాండ్ సంధానం విషయానికి వస్తే, మొదట పని ఆరంభం అయింది. ప్రణాళిక ను రూపొందించడం జరిగింది. అయితే ఆ ప్రణాళిక విధానం, ఆలోచన ఎంతటి విలువను కలిగివున్నాయంటే ఆ బ్రాడ్ బ్యాండ్ సంధానం 59 గ్రామ పంచాయతులకు మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఐదు సంవత్సరాల అనంతరం, ఇప్పుడు సుమారు లక్షా 25 వేల గ్రామాల కు బ్రాడ్ బ్యాండ్ సంధానం లభ్యమైంది. బ్రాడ్ బ్యాండ్ ను ప్రారంభించడమొక్కటే కాదు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రామాలు, ఇతర కార్యాలయాల తో పాటు ముఖ్యంగా సాధారణ సేవా కేంద్రాలు కూడా బ్రాడ్ బ్యాండ్ పరిధి లోకి వచ్చాయి.

2014వ సంవత్సరం లో ఎప్పుడైతే మేము అధికారం లోకి వచ్చామో, మన దేశం లో 80 వేల సాధారణ సేవ కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 3 లక్షల 65 వేలకు పెరిగింది. వాటిని ఆయా గ్రామాల యువకులు నిర్వహిస్తున్నారు.

గ్రామాల అవసరాల ను తీర్చడానికి, వారు తమ సాంకేతిక సేవల ను పూర్తి స్థాయి లో వినియోగిస్తున్నారు.

దేశం లో ఇప్పుడు సుమారు 12 లక్షల కు పైగా యువజనులు వారి స్వగ్రామాల లో నివసిస్తున్నారు. సాయంత్రం పూట వారు వారి తల్లితండ్రుల కు కూడా సహాయపడుతున్నారు; వారు వ్యవసాయ పనుల లో కూడా నిమగ్నం అవుతారు. 12 లక్షల మంది గ్రామీణ యువత ను ఈ విధమైన ఉపాధిలోకి చేర్చడమైంది. ఈ దేశం గర్వపడుతోంది. గర్వపడాలి. మనం డిజిటల్ లావాదేవీలను అవహేళన చేశాము. దానిని అడ్డం పెట్టుకొని ప్రభుత్వాన్ని విమర్శించాము. భీమ్ యాప్ స్వీకరణ ఈ రోజుల లో ఒక శక్తివంతమైన ప్లాట్ ఫార్మ్ గాను, ఆర్థిక పరమైన డిజిటల్ లావాదేవీలకు సురక్షితమైన వేదికగాను ప్రపంచ వ్యాప్తం గా పెరుగుతున్నది. మరి అనేక దేశాలలో ఈ యాప్ ను గురించి మరింత గా తెలుసుకొనేందుకు మనలను సంప్రదిస్తున్నాయి. ఇది దేశానికి ఒక గర్వకారణమైనటువంటి విషయం, దీనిని నరేంద్ర మోదీ ఏమీ సృష్టించలేదు. డిజిటల్ లావాదేవీల కోసం మనం ఈ రోజు ఒక అద్భుతంగా పనిచేసే వేదికను కలిగి వున్నామంటే - ఇది మన దేశపు తెలివితేటల ఫలితం, మన దేశ యువత ప్రతిభ తాలూకు ఫలం. మనం ఇవాళ డిజిటల్ లావాదేవీల కై ఉత్తమమైన పనితీరును కనబరుస్తున్నటువంటి వేదికను కలిగివున్నాము.

చైర్మన్ సర్, ఇదే జనవరి మాసం లో, మొబైల్ ఫోన్ ద్వారా, భీమ్ యాప్ నుండి దాదాపు 2 లక్షల 16 వేల కోట్ల రూపాయల మేరకు నగదు లావాదేవీ లు జరిగాయి. ఈ విధంగా మన దేశం, మార్పును అక్కున చేర్చుకొంటున్నది. రూపే కార్డు- మీకు రూపే కార్డును ప్రారంభించిన సంగతిని గురించి తెలిసే వుంటుంది. అత్యంత స్వల్ప సంఖ్య లో కేవలం ఒక వేయి రూపే కార్డులను విడుదల

చేయడం జరిగింది. మొత్తం డెబిట్ కార్డుల ప్రపంచంలో అప్పుడు మన వాటా కేవలం పాయింట్ ఆరు శాతంగా ఉంది. నేడు అది 50 శాతానికి చేరుకుంది. ఈ రోజున రూపే డెబిట్ కార్డు అంతర్జాతీయంగా ప్రపంచంలోని అనేక దేశాలలో అంగీకరించబడుతోంది. అందువల్ల, భారతీయ 'రూపే' కార్డు, తన స్థానాన్ని సుస్థిరపరచుకొంటోంది. ఇది మనందరికీ ఎంతో గర్వకారణమైనటువంటి విషయం.

గౌరవనీయులైన చైర్మన్ గారు, ఇదే విధంగా ప్రభుత్వం- జల్ జీవన్ మిషన్ - అనే మరొక పథకం పైన కూడా దృష్టి పెట్టింది. ప్రాథమిక సమస్యలను నూటికి నూరు శాతం పరిష్కరించే దిశ గా, మేము ప్రయత్నించాము.

మరుగు దొడ్లు - నూరు శాతం

గృహాలు - నూరు శాతం

విద్యుత్తు - నూరు శాతం

గ్రామంలో విద్యుత్తు సరఫరా - నూరు శాతం

ఈ పనులన్నిటిని మేము చేశాము. కష్టాల నుండి దేశానికి విముక్తిని కలిగించాలనే వైఖరి తో మేము ముందుకు కదులుతున్నాము. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయడానికి ఒక భారీ ప్రచార కార్యక్రమాన్ని మేము చేపట్టాము. ఈ పథకం ప్రత్యేకత ఏమిటంటే, ఇది కేంద్ర ప్రభుత్వ పథకం అయినప్పటికీ, దీనికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తాయి. అయితే, ఇది కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో పనిచేస్తుంది. వాస్తవానికి దీని అమలు బాధ్యత, సూక్ష్మ సమాఖ్య పద్ధతిలో నేరుగా మన గ్రామాలు, గ్రామాల్లోని సంఘాలకే ఉంటుంది. ప్రతి ఇంటికి నీటిని సరఫరా చేసే పద్ధతిని వారికి

వారే నిర్ణయించుకొని, ప్రణాళికను రూపొందించుకొంటారు. ఈ ప్రణాళికను కూడా మేము మరింత ముందుకు తీసుకుపోతాము.

మన సహకారాత్మక సమాఖ్య విధానానికి సరి అయిన ఉదాహరణ- వంద కు పైగా ఉన్నటువంటి ఆకాంక్ష భరిత జిల్లాలు (apirational districts). మన దేశం లో వోటు బ్యాంకు రాజకీయాల కోసం అభివృద్ధి చెందిన, వెనుక బడిన అంటూ వేర్పాటు చేశాము, అయితే ఈ దేశం లోని ప్రాంతాలు ఇంకా వెనుకబడే ఉన్నాయి. వాటిపై శ్రద్ధ వహించవలసిన అవసరం ఉంది. ఈ విషయంలో మనం చాలా ఆలస్యం చేశాము. చాలా రాష్ట్రాలలోని కొన్ని జిల్లాలు ఇప్పటికీ ఇంకా పూర్తి గా వెనుకబడి ఉన్నాయి. దీనికి చాలా పరిమితులు, కారణాలు ఉన్నాయి. వాటిని మనం పరిష్కరిస్తే, దేశం పెద్ద ఎత్తున మెరుగుపడుతుంది. కొన్ని సందర్భాలలో, ఒక్కో జిల్లా లో, అధికారి పదవీవిరమణ చేస్తున్నప్పటికీ, వాటిని అలాగే వదిలిపెట్టడం జరుగుతోంది. అంటే, అక్కడ శక్తివంతమైన, ప్రతిభావంతమైన అధికారులను ఎవరూ నియమించలేదు. అయితే, అక్కడ ఎవరో ఒకరు ఉన్నారని వారు అనుకుంటారు. మేము ఆ పరిస్థితిని మార్చాము. మేము గరిష్ఠంగా వంద ఆకాంక్ష భరిత జిల్లాలను గుర్తించాము. వాటిలో వివిధ రాష్ట్రాల కు చెందిన జిల్లాలు ఉన్నాయి. ఆ జిల్లాల లో 50 చొప్పున ఆశాజనక బ్లాకులను గుర్తించి, వాటి నిర్వహణ విధానంలో, పరిపాలనలో మార్పును తీసుకురావలసిందిగా కోరాము. ప్రాదేశిక ధృక్కోణంలో మార్పును తీసుకు రావడానికి ప్రయత్నించమని కోరాము.

ఈ రోజున, జిల్లా స్థాయి లో కూడా ఆ పరివర్తన ప్రారంభమైంది. సహకారాత్మక సమాఖ్య విధానాన్ని అక్కడ అమలు చేయడంతో ఆ ఆకాంక్షయుత జిల్లాలు ఒక మంచి ఆహ్లాదకరమైనటువంటి వాతావరణంలో పురోగమిస్తున్నాయి. ఆయా జిల్లాల అధికారుల మధ్య ఒక విధమైన సానుకూల పోటీ తత్వం నెలకొనడంతో ప్రతి ఒక్కరు ముందుకు

సాగుతున్నారు. పక్క జిల్లా లో టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు కాబట్టి, మన జిల్లా లో కూడా ఈ వారం ఆ కార్యక్రమాన్ని చేపట్టాలి అని అనుకుంటున్నారు. ఆ విధంగా, ప్రజల సౌకర్యాల ను మెరుగుపరచాలనే దృష్టి తో అక్కడ మంచి కార్యక్రమాల ను చేపట్టడం జరుగుతోంది. ప్రతి జిల్లా లో ఆరోగ్య సేవలు అందుబాటు లో ఉండాలనే ఆశయంతో- మేము ఆయుష్మాన్ భారత్ ను కూడా అమలు చేస్తున్నాము. ఆయా ప్రాంతాలు పురోగమించాలనే ఉద్దేశంతో- ఈ సారి ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చాము. దీనికి తోడు, ఆశాజనక జిల్లాల లోని ప్రజలు మన గిరిజన సోదరులు, సోదరీమణులు, దివ్యాంగులు కావడంతో వారు మరింత సున్నితత్వం తో పని చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

దేశం లోని ఆదివాసీ పోరాట యోధులను గుర్తించి, గౌరవించే కార్యక్రమాన్ని గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్నాము. దేశ స్వాతంత్ర్యం కోసం కృషి చేసిన ఆదివాసీల సేవలకు గుర్తింపుగా, వారు దేశాన్ని రక్షించడానికి, దేశాన్ని రూపొందించడానికి వారు నిర్వహించిన పాత్రను ప్రజలందరికీ తెలియజెప్పేలా, ఒక ప్రదర్శన శాల, ఒక పరిశోధన సంస్థను నెలకొల్పాలి. అది ముందు తరాలకు ఒక స్ఫూర్తిగా నిలుస్తుంది. దేశాన్ని సమైక్య పరచడానికి దోహదపడుతుంది. ఆ దిశగా కూడా కృషి జరుగుతోంది. మన గిరిజన బాల బాలికలకు ఎన్నో మంచి అలవాట్లు ఉన్నాయి. అయితే, వారికి తగిన అవకాశాలు అందుబాటులో లేవు. అది క్రీడలు కావచ్చు, విద్య కావచ్చు. వారికి ఏకలవ్య పాఠశాలల ద్వారా మంచి అవకాశాలు కల్పించాలి. ఉన్నత ప్రమాణాలతో పాఠశాలలను ప్రారంభించడం ద్వారా, అటువంటి ప్రతిభావంతులైన పిల్లలకు అవకాశాలను కల్పించడం కోసం, మేము గట్టిగా కృషి చేసాము

గిరిజన పిల్లలకు విద్యా సౌకర్యాల కల్పన తో పాటు, ఈ ప్రాంతాల్లో సుమారు 30 వేల స్వయం సహాయ బృందాలను ప్రారంభించాము. అడవులను సంపద సృష్టించే అడవులు గా

వినియోగించుకుని, వారు మరింత పురోగమించడానికి వీలుగా, వారికి సాధికారితను కల్పించే దిశ గా కూడా కృషి చేశాము. మహిళా సాధికారిత రంగంలో భాగంగా ఈ విషయాలను రాష్ట్రపతి ప్రసంగంలో క్లుప్తంగా ప్రస్తావించడం జరిగింది. దేశ చరిత్ర లో మొదటిసారి గా, సైనిక పాఠశాలల్లో బాలికలను చేర్చుకొనే ప్రక్రియను ప్రారంభించాము. అదేవిధంగా, మిలటరీ పోలీసు దళంలో మహిళల నియామక ప్రక్రియ పనులు కూడా జరుగుతున్నాయి. మహిళల రక్షణ కోసం, దేశంలో ఆరు వందలకు పైగా కేంద్రాలను నిర్మించడం జరిగింది. దేశం లోని ప్రతి పాఠశాలలో ఆరో తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు స్వీయ రక్షణలో శిక్షణనివ్వడం జరుగుతోంది.

దేశ వ్యాప్తంగా లైంగిక నేరస్తులను గుర్తించి, వారి వివరాలను నమోదు చేసి, వారి కదలికల పై నిఘా పెట్టడం జరిగింది. దీనితో పాటు, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పని చేసే ఒక కేంద్రాన్ని నెలకొల్పడానికి కూడా ప్రణాళికను సిద్ధం చేశాము. పిల్లల పై లైంగిక హింస కేసులను సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా, ఇటువంటి నేరాల ను కూడా పోస్కో చట్టం పరిధిలోకి తీసుకువచ్చాము. నేరస్తులను శిక్షించడానికి వీలుగా ఈ చట్టాన్ని సవరించడం జరిగింది. ఇటువంటి కేసుల లో సత్వర న్యాయం జరగాలి. ఇందుకోసం దేశవ్యాప్తం గా ఒక వేయి కి పైగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను నెలకొల్పనున్నాము.

గౌరవనీయులైన చైర్మన్, సిఎఎ పై సభ లో చర్చ జరిగింది. దీనికి వ్యతిరేకం గా అనేక ప్రాంతాలలో నిరసన ల పేరిట గందరగోళం సృష్టించడం జరిగింది. నిరసన తెలియజేసే హక్కు గా దీనిని పరిగణిస్తూ హింసాత్మక సంఘటనలు చోటు చేసుకొన్నాయి. ఈ విషయాలను సభ లో ప్రస్తావించడానికి అనేక సార్లు ప్రయత్నించడం జరిగింది. ఇటువంటి అప్రజాస్వామిక కార్యకలాపాలను కప్పిపుచ్చుకోవడం కోసం రాజ్యాంగం పేరిట తరచు ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయం లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిని నేను అర్థం చేసుకున్నాను.

అయితే, కేరళ లోని లెఫ్ట్ ఫ్రంట్ మిత్రులు కాస్త అర్థం చేసుకోవాలి. ఇక్కడ కు వచ్చే ముందు, కేరళ లో కొనసాగుతున్న నిరసన ప్రదర్శనల లో ఉగ్రవాద బృందాల హస్తం ఉందని రాష్ట్ర శాసనసభ లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను- వారు తెలుసుకోవాలి. అంతేకాదు, వారిని కఠినంగా శిక్షించాలని కూడా ఆయన హెచ్చరించారు. అటువంటి పరిస్థితుల లో, కేరళ, ఢిల్లీ లేదా దేశం లోని ఇతర ప్రాంతాల లో గందరగోళాన్ని, హింసను సృష్టిస్తున్న వారిని మీరు ఎలా సమర్థిస్తారు ?

పౌరసత్వ సవరణ చట్టం గురించి మనం ఏమి చెప్పాము? ఏమి ప్రచారం చేస్తున్నాము? అనేది సహచరులందరూ, ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. ఈ విధం గా తప్పుడు సమాచారాన్ని అందించడం, దేశాన్ని తప్పు దోవ పట్టించడం వంటి ధోరణి ని మనందరం ఆపు చేయ్యాలా? వద్దా? ఇది మన కర్తవ్యం అవునా? కాదా ? ఇటువంటి అసత్య ప్రచారం లో మనం కూడా భాగస్వాములం అవుదామా? ఒకవేళ, దీనివల్ల రాజకీయం గా ఎవరికీ మేలు జరగదు అని అనుకుంటే, అదే విధంగా, ఇది సరైన పద్ధతి కాదు అనుకుంటే, మనం కూర్చుని, మనం సరైన మార్గం లో పయనిస్తున్నామా? లేదా? అని ఆలోచిద్దాము, అంతేకానీ, ఈ రెండు నాలుకల ధోరణి ఎందుకు? ఒక వైపు 24 గంటలు అల్పసంఖ్యాక వర్గాల కోసం గొప్ప గొప్ప మాటలను చెబుతారు, ఇప్పటికిప్పుడు ఆనంద్ గారు చెప్పిన మాటలను విన్నాను. అయితే, మీరు వారి బాధలను ఎందుకు అర్థం చేసుకోరు? గతంలో మీరు చేసిన పొరపాట్ల వల్ల, పొరుగు దేశాలలో వారు అల్పసంఖ్యాకవర్గాలుగా మారారు. ఇటువంటి సున్నితమైన సమస్య పై ప్రజలను భయపెట్టే బదులు, వాస్తవ సమాచారాన్ని అందించాలని దేశం ఆశిస్తోంది. ఇది మనందరి భాద్యత. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, చాలా మంది ప్రతిపక్షానికి చెందిన మిత్ర పక్షాలు బాగా

ఆవేశపడుతున్నాయి. ఒకప్పుడు చాలా మౌనం గా ఉన్న వారు ఇప్పుడు హింసాత్మకం గా మారారు.

చైర్మన్ సర్, అయితే ఈ రోజు న ఈ సభ చాలా అనుభవం కలిగివున్న వారికి చెందిన సభ. అందుకని, ఈ రోజు న నేను కొంతమంది ప్రముఖులు చెప్పిన మాటల ను చదవాలని అనుకొంటున్నాను.

మొదటి ప్రకటన :

"పాకిస్తాన్ తూర్పు భాగం లో నివసిస్తున్న మైనారిటీ సమాజాలకు చెందిన వారి గౌరవం, ఆస్తి, జీవితాలకు అభద్రత దృష్ట్యా, అదే విధంగా పాకిస్తాన్ లోని ఆ ప్రదేశం లోని ప్రజల సాధారణ మానవ హక్కుల ఉల్లంఘన సంఘటనల దృష్ట్యా, తూర్పు పాకిస్తాన్ లోని మైనారిటీ సమాజాల కు చెందిన ప్రజలు భారత దేశంలోకి వలస రావడంపై ఉన్న నిబంధనల ను భారత ప్రభుత్వం సడలించడం తో పాటు, ఈ విషయం పై ప్రపంచ దేశాల అభిప్రాయం తెలుసుకోడానికి తగిన చర్యల ను చేపట్టాలని ఈ సభ అభిప్రాయ పడుతోంది." ఈ విషయం సభ లో ప్రకటించబడింది. అయితే, కొంతమంది జనసంఘ్ నాయకులు మాత్రమే మాట్లాడగలరని, ఇప్పుడు మీరు భావిస్తున్నారు. ఇటువంటి విషయాలు ఎవరు చెప్పగలరు? ఆ కాలం లో బీజేపీ లేదు. అయితే జనసంఘ్ ఉంది. అందువల్ల, కొంతమంది జనసంఘ్ కు చెందిన వారు మాట్లాడగలరని, వారు భావించి ఉండవచ్చు. అయితే, ఈ ప్రకటన ఏ బిజెపి లేదా జనసంఘ్ నాయకునికీ సంబంధించినది కాదు. అదే ప్రముఖ వ్యక్తి చేసిన మరొక ప్రకటన ను మీకు చెప్పాలని అనుకుంటున్నాను. "తూర్పు పాకిస్తాన్ కు సంబంధించినంత వరకు, ముస్లిమేతరులందరి ని తొలగించాలని నిర్ణయించినట్లు తెలిసింది. అది ఒక ఇస్లామ్ దేశం. ఇస్లామ్ రాజ్యంగా, ఆ దేశం లో ఇస్లామ్ పై నమ్మకం

ఉన్న వారు మాత్రమే అక్కడ నివసించాలనీ, ముస్లిమేతర ప్రజలు అక్కడ నివసించలేరని వారు భావిస్తారు. అందువల్ల, హిందువులను బహిష్కరించారు, క్రైస్తవులను బహిష్కరించారు. ఇంతవరకు, సుమారు 37 వేల మందికి పైగా క్రైస్తవులు అక్కడ నుండి భారతదేశానికి వలస వచ్చినట్లు నాకు తెలిసింది. బౌద్ధులు కూడా అక్కడ నుండి తరిమివేయబడ్డారు."

ఇది కూడా ఏదైనా ఒక జనసంఘ్ లేదా బిజెపి నాయకుని ప్రకటన కాదు. ఈ మాటలు మన దేశ ప్రియతమ ప్రధాన మంత్రులలో ఒకరైన ప్రముఖ వ్యక్తికి చెందినవి అని సభ కు నేను తెలియజేస్తున్నాను. ఇది గౌరవనీయులైన లాల్ బహాదుర్ శాస్త్రి గారి ప్రకటన. ఇప్పుడు వారిని కూడా మతతత్వ వాది అని అంటారా? వారిని కూడా హిందూ, ముస్లిం వేర్పాటు వాదులు గా పేర్కొంటారా? లాల్ బహాదుర్ శాస్త్రి గారు 1964వ సంవత్సరం ఏప్రిల్ 3వ తేదీన పార్లమెంటు లో ఈ ప్రకటన చేశారు. ఆ కాలం లో నెహ్రూ గారు ప్రధాన మంత్రి గా ఉన్నారు. అప్పుడు మతపరమైన హింస కారణంగా శరణార్థులు భారతదేశాని కి వలస వస్తున్న విషయాన్ని పార్లమెంటు లో చర్చిస్తున్నారు. ఆ కాలం లో శాస్త్రి గారు ఈ ప్రకటన చేశారు.

గౌరవనీయులైన చైర్మన్,

గౌరవనీయమైన సభకు నేను మరొక ప్రకటనను గురించి చెబుతాను. దీనిని ముఖ్యంగా నా సామ్యవాది మిత్రులకు అంకితమిస్తున్నాను. ఎందుకంటే, దీనికి ప్రేరణ అక్కడ నుండి రావచ్చు. జాగ్రత్తగా వినండి.
"భారతదేశానికి చెందిన ముస్లిములు జీవించాలి. పాకిస్తాన్ కు చెందిన హిందువులు జీవించాలి. పాకిస్తాన్ కు చెందిన హిందువులు పాకిస్తాన్ పౌరులు అన్న వాస్తవాన్ని నేను తీవ్రంగా ఖండిస్తాను. అందువల్ల, వారిని గురించి మనం పట్టించుకోవలసిన అవసరం

లేదు. పాకిస్తాన్ కు చెందిన హిందువు ఎక్కడైనా పౌరుడే అన్న దానికి సంబంధం లేకుండా, అతడి ని హిందుస్తాన్ కు చెందిన హిందువులను లేదా ముస్లిముల వలెనే రక్షించడం అనేది మన బాధ్యత గా ఉంది."

ఈ మాటలను అన్నది ఎవరు? ఇది కూడా జనసంఘ్ లో లేదా బిజెపి లో ఎవరికీ చెందినది కాదు. ఇది శ్రీ రాం మనోహర్ లోహియా గారు చేసిన ప్రకటన. మన స్వామ్యవాద సహచరులు, మమ్మల్ని నమ్మినా, నమ్మకపోయినా గాని కనీసం లోహియా గారి తో విభేదించకండి. ఇది వారికి నేను చేస్తున్న అభ్యర్థన.

గౌరవనీయులైన చైర్మన్ గారు, శాస్త్రి గారిదే మరొక ప్రకటనను ఈ సభ లో చదవాలని నేను అనుకొంటున్నాను. శరణార్థుల విషయం లో రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టవలసిన పాత్ర పై ఆయన ఈ ప్రకటనను చేశారు. లాల్ బహాదూర్ శాస్త్రి గారు చేసిన ఈ ప్రసంగాన్ని మీరు వినాలి. వోట్ బ్యాంకు రాజకీయాల కోసం రాష్ట్ర శాసనసభల లో తీర్మానాలు ప్రవేశపెట్టడం ద్వారా వారు ఏ విధమైన నాటకాలు ఆడుతున్నారు? మీరు ఎక్కడకు వెళ్తున్నారో మీకు తెలుస్తుంది, మీరు ఎక్కడ ఉన్నారు? మీ ప్రజలకు ఏమయ్యింది?

చైర్మన్ సర్, లాల్ బహాదుర్ శాస్త్రి గారు ఇలా అన్నారు..

"మన దేశం లో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు శరణార్థులకు ఆశ్రయాన్ని కల్పించడం అనే ఈ అంశాన్ని ఒక జాతీయ సమస్య గా గుర్తించాయి. ఈ విషయంలో వారిని అభినందిద్దాము. ఇందుకు చాలా ఆనందంగా ఉంది. బిహార్ గాని, ఒడిశా గాని, మధ్య ప్రదేశ్ గాని, ఉత్తర్ ప్రదేశ్ లేదా మహారాష్ట్ర లేదా ఆంధ్ర, అన్ని రాష్ట్రాలు వారు ఇక్కడ స్థిరపడడానికి సహాయపడతామంటూ తమ సన్నద్ధత ను తెలియజేస్తూ భారత ప్రభుత్వాని కి లేఖ లు వ్రాశాయి. కొంతమంది అన్నారు 50 వేల మంది పురుషులను, మరి కొంత మంది 15 వేల

కుటుంబాలను, కొంత మంది 10 వేల కుటుంబాల బాధ్యతను స్వీకరించడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు తెలియజేశారు."

1964 లో దేశంలోని చాలా రాష్ట్రాల లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారం లో ఉన్న కాలం లో శాస్త్రి గారు ఈ ప్రకటనను చేశారు. అయితే, ఈ రోజున, మనం చాలా మంచి పనిని చేస్తున్నాము, మీ వోట్ బ్యాంకు రాజకీయాల కోసం మీరు అడ్డంకులను సృష్టిస్తున్నారు.

గౌరవనీయులైన అధ్యక్షా,

నేను మరొక ఉదాహరణను చెప్పాలనుకొంటున్నాను. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొన్ని నెలల్లోనే, 1947వ సంవత్సరం నవంబర్ 25వ తేదీ న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1947వ సంవత్సరం నవంబర్ 25వ తేదీ నాటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రతిపాదన ఈ విధం గా ఉంది:
"పాకిస్తాన్ నుండి సరిహద్దు దాటి భారత దేశంలో ప్రవేశించే ముస్లిమేతరులు వారి ప్రాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి వీలుగా వారికి అవసరమైన రక్షణను కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది." ఈ రోజు న మీరు ఆ భాష మాట్లాడుతున్నట్లైతే, ఇది ముస్లిమేతరులకు.

గౌరవనీయులైన అధ్యక్షా,

నేను నమ్మని సంగతి ఏమిటంటే 1947వ సంవత్సరం నవంబర్ 25వ తేదీ న కాంగ్రెస్ మతతత్వం తో వ్యవహరించిందన్న సంగతి ని. నేను నమ్మను. ఇప్పుడు అది అకస్మాత్తు గా లౌకిక పార్టీ అయ్యింది. దీనిని సైతం నేను నమ్మడం లేదు. 1947వ సంవత్సరం నవంబర్ 25వ తేదీ న ముస్లిమేతరులు అని వ్రాయడానికి బదులు, పాకిస్తాన్ నుండి వస్తున్న ప్రజలందరూ అని వ్రాయవలసింది, కానీ ఈ విధం గా ఎందుకు మీరు వ్రాయలేదు.

ముస్లిమేతరులు అని ఎందుకు వ్రాశారు?విభజన అనంతర కాలం లో పాకిస్తాన్ లో ఉండిపోయిన హిందువుల లో చాలా మంది దళిత సోదరులు, దళిత సోదరీమణులు. వారి ని ఉద్దేశించి బాబాసాహెబ్ ఆంబేడ్కర్ ఏమన్నారంటే- "షెడ్యూల్డ్ కులాల వారు పాకిస్తాన్ లోపల ఉంటే శిక్షింపబడుతారు. అందువల్ల భారతదేశానికి రావలసిందిగా వారిని నేను కోరదలచాను." అని. బాబాసాహెబ్ ఆంబేడ్కర్ ఈ సందేశాన్ని ఇచ్చారు. ఈ ప్రకటనలన్నీ గొప్ప గొప్ప వ్యక్తులు ఇచ్చారు. వారు ఈ దేశ నిర్మాత లు. వారు అందరూ మతతత్వ వాదులా ? వోట్ బ్యాంకు రాజకీయాల కారణంగా కాంగ్రెస్ పార్టీ, దాని సహచర దేశ నిర్మాతలు కూడా ఈ విషయాలను విస్మరిస్తున్నారు. ఇది దేశం చాలా విచారించవలసినటువంటి విషయం.

గౌరవనీయులైన అధ్యక్షా,

1997వ సంవత్సరంలో, చాలా మంది సహచరులు ఇక్కడ ఉన్నారు, వారిలో కొంతమంది సభ లో కూడా ఉండవచ్చు. అప్పటి ప్రభుత్వ సూచనల మేరకు హిందువులు, సిఖ్ఖులు అనే పదాలను ఆ సంవత్సరంలోనే ఉపయోగించడం మొదలుపెట్టారు. అంతకు ముందు లేని పదాలను, అప్పుడు చేర్చారు. 2011 వ సంవత్సరంలో పాకిస్తాన్ నుండి వస్తున్న క్రైస్తవులు, బౌద్ధులు అనే పదాల ను కూడా జోడించారు. ఇదంతా 2011వ సంవత్సరం లో జరిగింది.

పౌరసత్వ సవరణ చట్టాన్ని 2003వ సంవత్సరంలో లోక్ సభ లో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ స్థాయి సంఘం ఈ విషయాన్ని చర్చించి, పౌరసత్వ సవరణ చట్టం, 2003 ను ముందుకు తీసుకు వెళ్లింది. అప్పుడు ఆ కమిటీలో కాంగ్రెస్ పార్టీ తరఫున సభ్యులుగా ఉన్న వారిలో చాలా మంది, ఇప్పుడు ఇక్కడ కూడా ఉన్నారు. పార్లమెంట్

స్థాయి సంఘం అదే నివేదిక లో ఇలా పేర్కొన్నది.. "పొరుగు దేశాల నుండి వస్తున్న అల్పసంఖ్యాకులను రెండు భాగాలుగా చూడాలి, ఒక భాగం మతపరమైన హింసల వల్ల వచ్చే వారయితే, మరొక భాగం అలజడుల కారణ గా వచ్చే అక్రమ వలసదారులుగా గుర్తించాలి." ఇది కమిటీ నివేదిక. ఈ రోజున, ఈ ప్రభుత్వం దీనిని గురించి మాట్లాడుతూంటే, 17 సంవత్సరాల తరువాత ఇప్పుడు ఈ విషయమై గొడవ ఎందుకు ? చైర్మన్ సర్, పాకిస్థాన్ నుండి వచ్చిన హిందూ సమాజానికి చెందిన మైనారిటీలకు భారతీయ పౌరసత్వం మంజూరు చేయడానికి, రాజస్థాన్ ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు, కేంద్ర ప్రభుత్వం, రాజస్థాన్ కు చెందిన రెండు జిల్లాల కలెక్టర్లకు, గుజరాత్ కు చెందిన నాలుగు జిల్లాల కలెక్టర్ లకు, 2004వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన, అనుమతిని ఇచ్చింది. 2005వ సంవత్సరంలో, 2006వ సంవత్సరంలో ఈ నియమం కూడా అమలు లో ఉంది. 2005 లోను, 2006 లోను మీరు కూడా ఉన్నారు. రాజ్యాంగ ప్రాథమిక స్ఫూర్తి కి అప్పుడు ఎటువంటి ముప్పూ లేదు, ఇది దానికి వ్యతిరేకంగా కాదు. గత పది సంవత్సరాలుగా ఇది బాగానే ఉంది. దీనిపై ఎటువంటి గొడవ చేయలేదు. ఈ రోజు న అకస్మాత్తుగా మీ ప్రపంచం మారిపోయింది. ఓటమి, ఓటమి మిమ్మల్ని కలవరపెడుతుంది, ఇది నేను ఎన్నడూ ఊహించనిది.

గౌరవనీయులైన అధ్యక్షా, ఎన్ పి ఆర్ ను గురించి కూడా విస్తృతంగా చర్చ జరుగుతోంది. జన గణన, ఎన్ పిఆర్ అనేవి సాధారణ పరిపాలన కార్యకలాపాలు. గతం లో దేశం లో అనేక సార్లు జరిగాయి. కానీ, వోట్ బ్యాంకు రాజకీయాల కారణం గా తప్పనిసరి పరిస్థితి ఏర్పడినప్పుడు 2010వ సంవత్సరంలో అప్పుడు ఎన్ పిఆర్ ప్రవేశపెట్టిన వారే ఈ రోజున తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి, వ్యతిరేకిస్తున్నారు.

గౌరవనీయులైన అధ్యక్షా, మీరు జన గణన కూడా చూస్తే, దేశాని కి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, మొదటి దశాబ్దం లో కొన్ని ప్రశ్నలు ఉండేవి, రెండో దశాబ్దంలో కొన్ని ప్రశ్నలను తొలగించి, కొన్ని ప్రశ్నలను చేర్చారు. అవసరమైనప్పుడు, పరిపాలనలో అవి మామూలే, స్వల్పంగా మార్పులు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. మనం వదంతుల ను వ్యాప్తి చేయకూడదు. మన దేశంలో మాతృభాష పై గతంలో ఎప్పుడూ ఇంత పెద్ద సంక్షోభం తల ఎత్తలేదు. ఈ రోజున పెద్ద సంఖ్యలో ప్రజలు సూరత్ నుండి ఒడిశాకు వలస వెళ్ళారు. అందువల్ల, ఒడియా పాఠశాలలను నడపలేము అని గుజరాత్ ప్రభుత్వం అంటే, అప్పుడు అది ఎంత కాలం కొనసాగుతుంది. ఎంతమంది ఏ మాతృభాషను మాట్లాడుతున్నారు, అతని తండ్రి ఏ భాష మాట్లాడుతున్నాడు అనే సమాచారాన్ని ప్రభుత్వం సేకరించి, అప్పుడు సూరత్ లో ఒడియా పాఠశాలలు ప్రారంభించాలని నేను భావిస్తున్నాను. గతం లో వలసలు లేవు, ఇప్పుడు వలసలు పెరుగుతున్నందున ఇది అవసరమైంది.

గౌరవనీయులైన అధ్యక్షా, గతం లో మన దేశానికి వలసలు చాలా తక్కువ స్థాయి లో ఉండేవి. కాల క్రమం లో, నగరాల పట్ల, నగరాల అభివృద్ధి పట్ల ఆకర్షణ పెరగడం వల్ల, మారుతున్న ప్రజల ఆకాంక్షల వల్ల, గత 30 - 40 సంవత్సరాల లో వలసలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇప్పుడు, నేను కూడా వలసలను గురించి ఆలోచిస్తున్నాను, ఈ రోజు వరకు, ఏ జిల్లాల నుండి వలసలు ఉన్నాయి, జిల్లా నుండి ఎవరు వెళ్లిపోతున్నదీ తెలియకుండా, ఆ జిల్లా అభివృద్ధి కి ప్రాధాన్యాలను నిర్ణయించలేము. ఇవన్నీ మీకు ముఖ్యం.. రెండోది, అనేక వదంతులను వ్యాప్తి చేయడం, ప్రజలను తప్పు దోవ పట్టించడం, 2010వ సంవత్సరం లో మీరు ఎన్ పిఆర్ ను తీసుకు వచ్చారు. 2014వ సంవత్సరం నుండి మేము ఇక్కడ కూర్చున్నాము. ఇదే ఎన్ పిఆర్ ను గురించి మేము ఎవరినైనా ప్రశ్నించామా, మా దగ్గర రికార్డులు ఉన్నాయి. మీ ఎన్ పిఆర్ రికార్డు మా

దగ్గర ఉంది. మీ కాలంలో ఎన్ పిఆర్ రికార్డు. ఎన్ పిఆర్ ఆధారం గా ఈ దేశ పౌరుడు ఎవరూ హింసించబడలేదు.

గౌరవనీయులైన అధ్యక్షా, ఇదే కాదు. ప్రతి ఒక్క వ్యక్తి ఈ ప్రక్రియలో భాగం కావాలని, ప్రతి సాధారణ నివాసి, ఎన్ పిఆర్ లో తమ పేరును నమోదు చేసుకోవలసిన అవసరం ఉందని, ఎన్ పిఆర్ ను ప్రారంభించే సమయం లో, యుపిఎ హయాం లో అప్పుటి హోం మంత్రి ప్రత్యేకం గా నొక్కి పలికారు. ఎన్ పిఆర్ కు ప్రచారాన్ని కల్పించాలని, ఎన్ పిఆర్ లో చేరవలసిందంటూ ప్రజలకు అవగాహనను కల్పించాలని ఆయన ప్రసార మాధ్యమాలకు కూడా విజ్ఞప్తి చేశారు. ఆ విధంగా, అప్పటి హోం మంత్రి బహిరంగ విజ్ఞప్తి ని చేశారు.

యుపిఎ 2010వ సంవత్సరం లో ఎన్ పిఆర్ ను ప్రవేశపెట్టింది. 2011వ సంవత్సరం లో ఎన్ పిఆర్ కోసం బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరించడం కూడా మొదలుపెట్టారు. 2014వ సంవత్సరం లో మీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి, ఎన్ పిఆర్ లో భాగం గా కోట్లాది పౌరుల సమాచారాన్ని సేకరించడం, రికార్డు చేయడం పూర్తి అయింది. అయితే, బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరించే పని కొనసాగుతోంది. నేను, మీరు అధికారంలో ఉన్నప్పటి సంగతిని గురించి చెప్తున్నాను. 2015వ సంవత్సరంలో మీరు తయారు చేసిన ఆ ఎన్ పి ఆర్ రికార్డులను మేము ప్రస్తుత పరిస్థితికి అనుగుణంగా సవరించాము. ఈ ఎన్ పిఆర్ రికార్డుల ఆధారంగా, ఆ సమాచారాన్ని మేము సానుకూల మార్గంలో వినియోగించి, ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన, ప్రత్యక్ష ప్రయోజన బదిలీల వంటి ప్రభుత్వ పథకాలన్నిటిలో మిగిలిపోయిన లబ్దిదారులను చేర్చి పేదవారికి ప్రయోజనాలను చేకూర్చాము.

ఆయితే, ఈ రోజున, ఈ విషయాన్ని రాజకీయం చేసి, మీరు ఎన్ పిఆర్ ను వ్యతిరేకిస్తున్నారు. కోట్లాది మంది పేద ప్రజలు ప్రజా సంక్షేమ పథకాలలో భాగం కాకుండా అడ్డుకొని మీరు పాపం చేస్తున్నారు. పనికి మాలిన రాజకీయ ప్రయోజనం కోసం వారు చేస్తున్న పని వల్ల, వారి పేదల వ్యతిరేక వ్యక్తిత్వం బయటపడుతోంది. 2020వ సంవత్సరం జన గణన తో పాటు, ఎన్ పిఆర్ రికార్డులను సవరించాలని మేము భావించాము. తద్వారా పేదల కోసం అమలు అవుతున్న పథకాలు మరింత సమర్ధవంతంగా, నిజాయతీగా వారికి చేరే అవకాశం ఏర్పడుతుంది. కానీ, ఇప్పుడు మీరు ప్రతిపక్షంలో ఉన్నారు, మీరు ప్రారంభించిన ఎన్ పిఆర్ నే మీరు చెడుగా పేర్కొంటున్నారు.

గౌరవనీయులైన అధ్యక్షా, అన్ని రాష్ట్రాలు, తగిన గజెట్ నోటిఫికేషన్ లను జారీ చేయడం ద్వారా, ఎన్ పిఆర్ ను ఆమోదించాయి. ఇప్పుడు కొన్ని రాష్ట్రాలు అర్ధాంతరంగా వాటి ఆమోదాన్ని వెనుకకు తీసుకొని, ఈ ప్రక్రియకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. దీని ప్రాముఖ్యాన్ని, దీని వల్ల పేదలకు కలిగే లాభాలను ఉద్దేశపూర్వకంగా అలక్ష్యం చేస్తున్నాయి. వారు 70 సంవత్సరాలలో చేయని పనులను మేము చేస్తున్నపుడు, ఇప్పుడు వారు ప్రతిపక్షం లో కూర్చుని ఈ రకం గా మాట్లాడం భావ్యం కాదు. మీరే స్వయంగా తీసుకు వచ్చి, ప్రచారం చేసి, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రసారం చేసి, ఇప్పుడు దానిని అంటరానిదిగా పేర్కొంటూ వ్యతిరేకించడానికి ప్రయత్నిస్తున్నారు. మీరు వోట్ బ్యాంకు రాజకీయాల కు అనుగుణంగా నిర్ణయాలు తీసుకొంటారు అనడానికి ఇదే ప్రత్యక్ష ఉదాహరణ. ఒకవేళ మిమ్మల్ని తృప్తి పరచవలసిన విషయం ఏదైనా ఉందంటే అది అభివృద్ధి, విభజనల మధ్యే ఉంటుంది. మీరు ప్రజలను విభజించే మార్గాన్నే బాహాటంగా ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి అవకాశవాద ప్రతిపక్షం ఏ పార్టీ కైనా ప్రయోజనాన్ని కలిగించవచ్చు లేదా నష్టాన్ని

కలిగించవచ్చు; అయితే, దీనివల్ల దేశం తప్పక దెబ్బతింటుంది. ఇది దేశం లో విశ్వాసాన్ని దెబ్బతీసే పరిస్థితిని కలుగజేస్తుంది. అందువల్ల, నా అభ్యర్థన ఏమిటంటే మనం వాస్తవాలను మాత్రమే వెలికి తీద్దాము. సరి అయినటువంటి విషయాలను మాత్రమే ప్రజలలోకి తీసుకు పోదాము.

ఈ దశాబ్దం లో భారతదేశం పట్ల ప్రపంచం భారీ అంచనాలను పెట్టుకొంది. అదే విధంగా మన పట్ల భారతీయులు కూడా భారీ అంచనాలను పెట్టుకొన్నారు. 130 కోట్ల భారతీయుల ఆకాంక్షలకు అనుగుణం గా వారి అంచనాలను నెరవేర్చడానికి మనం అందరమూ కృషి చేద్దాము.

జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అన్ని విషయాలలో, సభ చర్చలతో, ఏకాభిప్రాయంతో ముందుకు పోవాలి. అంటే కలసి నడుద్దాము, ఏకోన్ముఖంగా ముందుకు పోదాము. ఈ సంకల్పం తో అడుగులు వేద్దాము. వాదోపవాదాలు చేద్దాము, చర్చించుకొందాము, ఆ తరువాతనే నిర్ణయాల ను తీసుకొందాము. శ్రీ దిగ్విజయ్ సింగ్ గారు ఇక్కడ ఒక పద్యాన్ని చదివి వినిపించారు. కాబట్టి ఆ పద్యాన్ని నేను గుర్తుకు తెచ్చుకొంటున్నాను.

నాకు ఇల్లంటూ లేదు, ఒక్క ఖాళీ స్థలాలే ఉన్నాయి
సత్యం, కరుణ, వాంఛ, స్వప్నాల తో నిండి ఉందది. నా దేశ అభివృద్ధి, గొప్పదనం చూడాలన్న కోరిక ఉంది. నా చుట్టూరా శాంతి, సంతోషం నిండి వుండాలన్నది నా స్వప్నం.

భారత దేశ ముద్దు బిడ్డ, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. కలామ్ గారి ఈ వాక్యాలు అంటే నాకు చాలా ఇష్టం. మరి మీకు నచ్చిన వాక్యాలను మీరు కూడా ఇష్టపడవచ్చును. మీరు ఈ సామెత ను విని ఉంటారు.. " జాకీ రహీ భావనా జైసీ, ప్రభు

మూరత్ దేఖీ తిన్ జైసీ". మీ పంథా ను మార్చుకోవాలా? లేక 20వ శతాబ్దపు ఆలోచన తో 21వ శతాబ్దం లో జీవనాన్ని కొనసాగించాలా? అనేది ఇప్పుడు మీరు నిర్ణయించుకోవాలి. ఈ న్యూ ఇండియా ముందుకు కదలింది. ఇది కర్తవ్యపాలన మార్గం లో సాగడం మొదలుపెట్టింది. మరి కర్తవ్యం అంటేనే హక్కులన్నింటి సారాన్ని మూర్తీభవించుకొనేది. ఇది మాత్రమే గాంధీ మహాత్ముడు ఇచ్చిన సందేశం. గాంధీ గారు బోధించిన విధి నిర్వహణ పంథా లో మనమంతా ముందుకు పోదాము. సుసంపన్నమైన, సమర్ధమైన, అచంచలమైన న్యూ ఇండియా నిర్మాణాన్ని ప్రారంభిద్దాము. భారతదేశం యొక్క ప్రతి ఆకాంక్ష, ప్రతి సంకల్పం, మన అందరి సమష్టి కృషి తోనే సాకారం అవుతుంది.

రాష్ట్రపతి గారికి, సభ్యులందరికి నేను మరొక్క మారు నా హృదయ పూర్వక కృతజ్ఞతలను వ్యక్తం చేస్తున్నాను. దేశ ఐక్యతకు, అఖండతకు ప్రాధాన్యాన్ని ఇవ్వడం ద్వారా, భారత రాజ్యాంగం లోని ఉన్నత భావాలను గౌరవించడం ద్వారా, దేశం పురోగమించడానికి మన వంతు సహకారాన్ని అందిస్తూ, మనం కలసి నడుద్దాము. చర్చ ను సుసంపన్నం చేసిన గౌరవనీయులైన సభ్యులకు, గౌరవనీయులైన రాష్ట్రపతి గారికి, ఈ స్ఫూర్తి తో, నేను నా కృతజ్ఞతలను మరొక్క సారి మనసారా తెలియజేసుకొంటున్నాను. మీకు అందరికి అనేకానేక ధన్యవాదాలు.

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ గా శ్రీ హరి వంశ్ నారాయణ సింగ్ ఎన్నికైన సందర్భంగా

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

గారి ప్రసంగం.

14 సెప్టెంబర్ 2020

రాజ్య సభ డిప్యూటీ చైర్మన్ గా శ్రీ హరివంశ్ సింగ్ గారి ఎన్నిక - 14 సెప్టెంబర్ 2020

శ్రీ హరివంశ్ జీ ఈ సభ కు డిప్యూటీ చైర్మన్ గా రెండో సారి ఎన్నికైనందుకు యావత్తు సభ పక్షాన, దేశ ప్రజలందరి తరఫున శ్రీ హరివంశ్ గారిని నేను అభినందిస్తున్నాను. సామాజిక సేవ, పత్రికా రచన రంగాల్లో హరివంశ్ గారు తనదైన నిజాయతీపూర్వక ఇమేజ్ ను సంపాదించుకున్న తీరు పట్ల నా మనసు లో ఆయనను నేను ఎంతో గౌరవిస్తున్నాను. ఆయన తో అతి సన్నిహిత పరిచయం ఉన్న వారికి కూడా ఆయన అంటే నాకు ఉన్న గౌరవం, అభిమానాలు ఉండి ఉంటాయని నేను అనుకుంటున్నాను; అలాగే ఈ సభ లో సభ్యులందరికి కూడా ఇవే భావన లు ఉండి ఉంటాయని నేను తలుస్తాను. ఈ గౌరవాపేక్షలను హరివంశ్ గారు స్వయంగా సంపాదించుకున్నారు. ఆయన పని చేసే విధానాన్ని బట్టి, సభ కార్యకలాపాల ను ఆయన నిర్వహించే తీరును బట్టి చూస్తే ఇది స్వాభావికమే. సభ లో మీరు పోషించిన నిష్పక్షపాత భూమిక ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తోంది.

చైర్మన్ గారూ,

ఇది వరకు ఎన్నడూ చూడని అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఈ సారి సభ కార్యకలాపాలను నిర్వహించడం జరుగుతోంది. కరోనా కారణంగా తలెత్తిన పరిస్థితులలో ఈ సభ తన విధుల ను నిర్వహించి, దేశం పట్ల తనకు ఉన్న ముఖ్యమైన కర్తవ్యాలను నెరవేర్చేలా చూడటం మన అందరి బాధ్యత. మనం అన్ని ముందు జాగ్రత్తలను తీసుకొంటూ, మార్గదర్శక సూత్రాలను పాటిస్తూ, విధులను నెరవేర్చుతామని నేను విశ్వసిస్తున్నాను.

చైర్మన్ గారు,

సభ ను సాఫీగా నడపడంలో డిప్యూటీ చైర్మన్ కు రాజ్యసభ సభ్యులు ఎంత ఎక్కువగా సహకరిస్తే అంత ఎక్కువగా కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం జరుగుతుంది; ప్రతి ఒక్కరూ కూడా సురక్షితంగా ఉండగలుగుతారు.

చైర్మన్ సర్,

పార్లమెంటు ఎగువ సభ బాధ్యతలను నిర్వహించడానికి శ్రీ హరివంశ్ గారి పట్ల మనం కనబరచిన విశ్వాసాన్ని ఆయన ప్రతి స్థాయిలోనూ నిలబెట్టుకొన్నారు. నేను క్రితం సారి చేసిన ప్రసంగంలో, దైవం ఎలా అయితే ప్రతి ఒక్కరి కోసం ఉన్నారన్న విషయం లో నాకు గట్టి నమ్మకం ఉందో అదే మాదిరిగా ఈ సభ దైవం కూడా అధికార పక్ష సభ్యుల తో పాటు ప్రతిపక్ష సభ్యులకు కూడా అండగా ఉంటారని నాకు ఒక బలమైన నమ్మకం ఉందని నేను అన్నాను. మన సభ దైవం అయిన హరివంశ్ గారు ప్రతి ఒక్కరి పట్ల ఎలాంటి వివక్ష ను చూపకుండా పక్షపాతం లేకుండా వ్యవహరించాలి, ఆయన అధికార పక్షానికో, లేక ప్రతిపక్షాలకో వంత పాడకుండా నడుచుకోవాలి.

సభ అనే మైదానం లో ఆటగాళ్ళ కంటే ఎక్కువగా సమస్యలను ఎదుర్కొనేది అంపైర్లే అని కూడా నేను చెప్పాను. పార్లమెంటు సభ్యుల ను నియమాలకు అనుగుణంగా ఆట ఆడవలసిందిగా కట్టడి చేయడం ఎంతో సవాలుతో కూడుకొన్న పని. ఆయన ఉత్తమ అంపైర్ అవుతారని నాకు పూర్తి విశ్వాసం ఉంది. కానీ, హరివంశ్ గారు, ఆయన గురించి తెలియని వారి విశ్వాసాన్ని సైతం తన నిర్ణయాల ద్వారా గెలుచుకున్నారు.

చైర్మన్ సర్,

హరివంశ్ జీ తన బాధ్యత ను ఫలప్రదంగా ఎలా నిర్వహించారో అనే దానికి ఈ రెండు సంవత్సరాలు నిదర్శనంగా ఉన్నాయి. హరివంశ్ గారు ప్రధాన చట్టాలపై సమగ్ర చర్చల ను

నిర్వహించడం ద్వారా, బిల్లులు వెంటవెంటనే ఆమోదం పొందేలా చూడటం ద్వారా ఈ సభ ను సమర్ధంగా నడిపారు. ఈ కాలంలో, దేశ భవిష్యత్తుకు సంబంధించిన ఎన్నో చరిత్రాత్మక బిల్లులు ఈ సభ ఆమోదానికి నోచుకున్నాయి. గత సంవత్సరమే, ఈ సభ పదేళ్ళ లో అత్యధిక పనితీరును కనబరచి, ఒక రికార్డును సృష్టించింది. అది కూడా, కిందటేడాది లోక్ సభ ఎన్నికలు జరుగుతూ ఉన్న కాలంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

గరిష్ఠ బిల్లుల ను ఆమోదించడంతో పాటు మరింత ఎక్కువ సానుకూలత వ్యక్తం కావడం సభ్యులందరికీ గర్వకారణం. ప్రతి ఒక్కరూ వారి ఆలోచనలను అరమరికలు లేకుండా వ్యక్తం చేయగలిగారు. సభకు అంతరాయం ఏర్పడకుండా ఉమ్మడి ప్రయత్నాలు జరగడం అనుభవం లోకి వచ్చింది. ఇది సభ గౌరవాన్ని కూడా పెంచింది. ఎగువ సభ నుంచి రాజ్యాంగ శిల్పులు ఆకాంక్షించింది కూడా ఇదే. ప్రజాస్వామిక మర్యాదకు, అలాగే జెపి, కర్పూరి ఠాకూర్ లకు జన్మనిచ్చిన, బాపూ చంపారణ్ ఒక భాగంగా ఉన్న బిహార్ గడ్డ నుంచి వచ్చిన ఒక ప్రజాస్వామ్య మార్గదర్శకుడు ముందంజ వేసి, తన బాధ్యతల ను ఏ రకంగా నెరవేర్చారో హరివంశ్ గారు చాటిచెప్పారు.

హరివంశ్ గారిని గురించి ఆయన కు బాగా సన్నిహితులైన వారితో మీరు చర్చించారంటే గనక, అప్పుడు ఆయన ఎందుకు ఇంత వినమ్రుడిగా ఉన్నది మీకు అర్థమవుతుంది. ఆయన ఊళ్లో ఒక వేప చెట్టు నీడన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఒక బడి లో తన మొట్టమొదటి చదువులు చదువుకున్నారు. క్షేత్ర వాస్తవాల తో ఆయన అనుబంధాన్ని పెంచుకోగలరన్న సంగతిని ఆయన చదువుకున్న తీరే తేటతెల్లం చేస్తుంది.

హరివంశ్ గారు జయప్రకాశ్ జీ మాదిరిగానే సీతాబ్ దియారా అనే ఊరి నుంచి వచ్చిన సంగతి మన అందరికీ ఎంతో బాగా తెలుసు. ఈ పల్లె జయప్రకాశ్ గారు పుట్టిన ఊరు.

దియారా గ్రామం గంగానది, ఘాగ్రా నదుల మధ్య ఉంది. అంతేకాదు ఉత్తర్ ప్రదేశ్ కు, బిహార్ లోని ఆరా, బలియా, ఛప్రా జిల్లాలు మూడింటికి నడుమ ఉన్న దియారా గ్రామం వరద పోటెత్తితే ఓ దీవి గా మారిపోతుంటుంది. ఇక్కడ ఒక పంట ను పండించడమే గగనం. ఎక్కడికైనా వెళ్ళాలంటే పడవ లో నది ని దాటడం తప్ప వేరే దారి లేదు.

హరివంశ్ గారు తన గ్రామం లోని పరిస్థితుల ను అర్థం చేసుకొని, ఉన్నదానితో తృప్తి పడటం మేలు అనే ఆచరణాత్మక జ్ఞానాన్ని అందుకున్నారు. ఆయన నేపథ్యానికి సంబంధించిన ఒక సంఘటన ను ఎవరో ఒకసారి నాతో చెప్పారు. అదేమిటంటే, హరివంశ్ గారు ఉన్నత పాఠశాల కు మొట్టమొదటిసారిగా వెళ్ళినప్పుడు ఆయన కు పాదరక్షలు కావలిసొచ్చాయి. ఆయన దగ్గర పాదరక్షలు లేవు. ఎందుకంటే, ఆయన ఎప్పుడూ వాటిని కొనలేదు. దీంతో హరివంశ్ గారి కోసం పాదరక్షల ను సిద్ధం చేయాలంటూ పల్లెలో చెప్పులు కుట్టే పనిని చేసే వ్యక్తి ని కోరారు. ఆయన వద్దకు హరివంశ్ గారు తరచుగా వెళ్ళి పాదరక్షల తయారీ ఎంతవరకు వచ్చిందో చూస్తూ ఉండే వారు. ఒక ధనికుడు తన భవంతి నిర్మాణ పనులు ఎలా సాగుతున్నదీ చూడటానికి పలుమార్లు అక్కడికి వెళ్తూ ఉంటాడో అలాగే హరివంశ్ గారు తన పాదరక్షల పని ఎంతవరకు వచ్చిందో పర్యవేక్షించడానికి అక్కడికి అనేకసార్లు వెళ్ళే వారు. ప్రతి రోజూ తన చెప్పులు ఎప్పటికి తయారవుతాయో ఆ చర్మకారుడిని హరివంశ్ అడుగుతూ ఉండే వారు. హరివంశ్ గారు ఎందుకు అంత నిరాడంబరంగా ఉండేవారన్న సంగతిని మీరు దీనిని బట్టి ఊహించవచ్చును.

ఆయన పై జెపి ప్రభావం ఎంతో ఎక్కువగా ఉంది. ఆ కాలం లో పుస్తకాల పట్ల ఆయన ఇష్టం కూడా పెరిగిపోయింది. దీనికి సంబంధించిన ఒక సంఘటన నా దృష్టికి వచ్చింది. హరివంశ్ గారు మొట్టమొదటిసారిగా ప్రభుత్వ ఉపకార వేతనాన్ని అందుకున్నప్పుడు స్కాలర్‌షిప్ డబ్బు అంతటినీ ఆయన ఇంటికి తీసుకువస్తాడని ఆయన కుటుంబసభ్యుల లో

కొంత మంది ఆశించారు. స్కాలర్‌షిప్ డబ్బులను ఇంటికి తీసుకువచ్చే బదులు హరివంశ్ గారు ఆ డబ్బును పుస్తకాలు కొనేందుకు ఖర్చుపెట్టేశారు. కొన్ని ఆత్మకథలు, ఇతర సాహిత్యం సహా బోలెడన్ని పుస్తకాలను కొని ఇంటికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి పుస్తకాలంటే హరివంశ్ గారికి ఉన్న ప్రేమ చెక్కుచెదరకుండా ఉండిపోయింది.

చైర్మన్ సర్,

హరివంశ్ గారు సామాజిక సమస్యల తో కూడిన పాత్రికేయ వృత్తి లో దాదాపుగా నాలుగు దశాబ్దాల పాటు పని చేసి 2014 లో పార్లమెంటులో అడుగుపెట్టారు. సభ డిప్యూటీ చైర్ పర్సన్ గా ఆ పదవి ఔచిత్యాన్ని హరివంశ్ గారు పరిరక్షించారు. పార్లమెంటు సభ్యునిగా ఆయన పదవీ కాలం కూడా అంతే సమ్మానపూర్వకంగా గడిచింది. ఒక సభా సభ్యుని గా హరివంశ్ గారు.. అది ఆర్థిక వ్యవస్థ కు సంబంధించి కావచ్చు, లేదా వ్యూహాత్మక భద్రత కు సంబంధించి కావచ్చు.. తన ఆలోచనల ను ఎంతో ప్రభావవంతమైన విధంగా వ్యక్తం చేశారు.

ఆయన తన అభిప్రాయాల ను హుందాగా వెల్లడి చేయడం ద్వారా తనకంటూ ఒక ముద్ర ను సంపాదించుకొన్నారనేది మన అందరికీ తెలుసు. ఆయన సభ లో ఒక సభ్యునిగా తన జ్ఞానంతో, తన అనుభవంతో దేశానికి సేవ చేయడానికి సకల ప్రయత్నాలు చేశారు. హరివంశ్ గారు అంతర్జాతీయ వేదికల లో.. అవి ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ కు చెందిన అనేక సమావేశాలు కావచ్చు, లేదా ఇతర దేశాలలో భారతీయ సాంస్కృతిక ప్రతినిధి వర్గాల లో ఒక సభ్యునిగా తన బాధ్యత ను నిర్వర్తించడం కావచ్చు. భారతదేశ గౌరవాన్ని, ఉన్నతిని పెంపొందించేందుకు కూడా కృషి చేశారు. ఆ తరహా వేదికలన్నిటిలో భారతదేశ హోదాను, దేశ పార్లమెంటు గౌరవాన్ని హరివంశ్ గారు పెంచారు.

చైర్మన్ సర్,

వారు సభకి డిప్యూటీ చైర్మన్ గానే కాకుండా రాజ్యసభ లోని ఎన్నో కమిటీలకు చైర్మన్ గా కూడా వ్యవహరించారు. వారు కమిటీలకు చైర్మన్ గా వాటి పనితీరును మెరుగుపరుస్తూనే వాటి పాత్రను సమర్థవంతంగా ప్రతిబింబించారు. క్రితం సారి కూడా నేను చెప్పాను, హరివంశ్ గారు ఎప్పుడూ, ఒక పాత్రికేయుడు పార్లమెంట్ సభ్యుడిగా ఏ విధంగా ప్రవర్తించాలి అనే విషయాన్ని ఒక లక్ష్యంగా తీసుకున్నారు. అయినా పార్లమెంట్ సభ్యుడు అయ్యాక మిగతా సభ్యులందరినీ మనస్సాక్షిగా ప్రవర్తించే విధంగా ప్రయత్నాలు చేశారు.

చైర్మన్ సర్,

హరి వంశ్ గారు, వారి పార్లమెంట్ కార్యం, బాధ్యతలతో పాటు ఒక ఆలోచనా పరుడిగా, మేధావిగా సమంగా క్రియాశీలకంగా ఉంటారు. వారు దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తూ ఉంటారు. సామాన్య ప్రజానీకాన్ని భారతీయ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, వ్యూహాత్మక సవాళ్ల గురించి జాగృతం చేస్తూ ఉంటారు. వారిలోని పాత్రికేయుడు, రచయిత అలాగే చెక్కుచెదరకుండా ఉన్నారు. వారి పుస్తకం మాజీ ప్రధానమంత్రి, శ్రీ చంద్రశేఖర్ గారి జీవితాన్ని ప్రతిబింబిస్తూనే హరివంశ్ గారి రచనా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. నేను, నా సహచర సభ్యులు డిప్యూటీ చైర్మన్ గా హరివంశ్ గారి మార్గదర్శకత్వం లభిస్తున్నందుకు అదృష్టవంతులుగా భావిస్తాము.

గౌరవనీయులైన చైర్మన్ గారు,

పార్లమెంట్ లోని ఎగువ సభ 250 సమావేశాలు నిర్వహించి ఒక ప్రయాణాన్ని ప్రారంభించింది. ఈ ప్రయాణం మన ప్రజాస్వామ్య పరిపక్వతకు నాంది. మరోసారి, హరివంశ్ గారికి ఈ ముఖ్యమైన, అతి పెద్ద బాధ్యత లభించినందుకు ఎన్నో శుభాకాంక్షలు,

అభినందనలు. మీరు ఆరోగ్యంగా ఉంటూ మీ విధులను ఎగువ సభ అంచనాలకు అనుగుణంగా నిర్వర్తిస్తూ ఒక ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తారని నేను ఆశిస్తున్నాను. హరివంశ్ గారికి పోటీగా నిలబడిన మనోజ్ జా గారికి కూడా నా అభినందనలు. ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్య గౌరవానికి చాలా ముఖ్యం. బీహార్ రాష్ట్రం ప్రజాస్వామిక విలువలకు పెట్టిన పేరు. హరి వంశ్ గారు వైశాలి సాంప్రదాయాలను, బీహార్ పేరు ప్రఖ్యాతులను, ఆదర్శాలను ఈ సభ ద్వారా మరింత మెరుగు పరుస్తారని విశ్వసిస్తున్నాను.

ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకున్న ఈ సభలోని గౌరవనీయ సభ్యులందరికీ నా ధన్యవాదాలు. మరోసారి హరివంశ్ గారికి, సభ్యులందరికీ శుభాకాంక్షలు. ధన్యవాదాలు.

2021



స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0 మరియు AMRUT 2.0 కార్యక్రమాన్ని ఢిల్లీలో ప్రారంభిస్తున్న సందర్భంగా శ్రీ నరేంద్ర మోదీ.

"స్వచ్ఛభారత్ మరియు అమృత్ కార్యక్రమాల ప్రయాణంలో ఒక లక్ష్యం ఉంది, హుందాతనం ఉంది, ఆత్మగౌరవం ఉంది, దేశం యొక్క ఆశయం ఉంది మరియు మాతృభూమి కోసం సాటి లేని ప్రేమ ఉంది."

రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

8 ఫిబ్రవరి 2021

రాజ్యసభ లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 8 ఫిబ్రవరి 2021

గౌరవనీయులైన సభాపతి గారు,

ప్రపంచం మొత్తం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. మానవ జాతి ఇంత కష్టతరమైన సమయాన్ని చూడవలసి ఉంటుందని ఎవరూ అనుకోలేదు. ఇటువంటి పరిస్థితులలో, ఈ దశాబ్దం ప్రారంభంలో ఉభయ సభలను ఉద్దేశించి మన గౌరవనీయ రాష్ట్రపతి చేసిన ప్రసంగం సవాళ్లతో నిండి ఉన్న ప్రపంచంలో ఒక కొత్త ఆశ, కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఈ దశాబ్దంలో స్వావలంబన సాధించడానికి, భారతదేశానికి మార్గం సుగమం చేసారు.

గౌరవనీయులైన సభాపతి గారు,

రాష్ట్రపతి గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఇవాళ మీ అందరి మధ్య నేను నిలబడ్డాను. రాజ్యసభలో 13-14 గంటలకు పైగా 50 మందికి పైగా గౌరవనీయులయిన సభ్యులు తమ అభిప్రాయాలను, విలువైన ఆలోచనలను, అనేక అంశాలను చర్చించారు. అందువల్ల ఈ చర్చను సుసంపన్నం చేసినందుకు గౌరవనీయ సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. రాష్ట్రపతి గారి ప్రసంగాన్ని వినడానికి ప్రతిఒక్కరూ హాజరై ఉంటే బాగుండేది, ప్రజాస్వామ్య ప్రతిష్ట పెరిగేది, రాష్ట్రపతి ప్రసంగాన్ని వినలేదని తరువాత చెప్పలేము. కానీ రాష్ట్రపతి ప్రసంగం యొక్క శక్తి చాలా గొప్పది, వినకుండానే చాలా మాట్లాడారు. ఇది నిజంగా ప్రసంగం యొక్క శక్తి, ఆలోచనల శక్తి, ఆదర్శాల శక్తి. అందువల్ల ఈ ప్రసంగం విలువ చాలా గొప్పదని నేను భావిస్తున్నాను.

గౌరవనీయులైన సభాపతి గారు,

నేను చెప్పినట్లుగా, దశాబ్దంలో రాష్ట్రపతి గారి మొదటి ప్రసంగం అనేక సవాళ్ల నేపథ్యంలో వచ్చింది. కానీ, ప్రపంచం మొత్తాన్ని, భారత యువతను చూసినప్పుడు, భారతదేశం వాస్తవానికి అవకాశాల భూమి అని అనిపిస్తుంది. మన కోసం చాలా అవకాశాలు ఎదురుచూస్తున్నాయి. అందుకే యువత ఉన్న దేశం, ఉత్సాహంతో నిండిన దేశం, అనేక కలలు, ఆకాంక్షలు సాధించడానికి ప్రయత్నిస్తున్న దేశం ఈ అవకాశాన్ని ఎప్పటికీ వదులుకోదు. స్వాతంత్ర్యం వచ్చి 75 వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం మనందరికీ ఒక అవకాశం. ఇది నిజంగా ఉత్తేజకరమైన అవకాశం. మనం ఎక్కడ ఉన్నా, భారత మాత కుమారుడిగా, 75 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మనం ప్రేరణగా చేసుకోవాలి. రాబోయే సంవత్సరాల్లో దేశాన్ని సిద్ధం చేయడానికి మనకు ఏదైనా చేసే అవకాశం ఉండాలి, 2047 లో దేశం స్వాతంత్ర్య శతాబ్దిని జరుపుకునేటప్పుడు, మనం దేశాన్ని ఎంత దూరం తీసుకెళ్తామో, ఈ కలలను మనం పదే పదే గమనిస్తూ నే ఉండాలి. ఈ రోజు, ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తోంది. భారతదేశం పై అంచనాలు ఉన్నాయి, భారతదేశం ఇలా చేస్తే, ప్రపంచంలోని అనేక సమస్యలు పరిష్కరించబడతాయి అనే నమ్మకం ప్రజలలో ఉంది, ఈ నమ్మకం, ఈ విశ్వాసం నేడు ప్రపంచంలో భారత్ పై పెరిగింది.

గౌరవనీయులైన సభాపతి గారు,

నేను అవకాశాల గురించి చర్చిస్తున్నప్పుడు, గొప్ప కవి మైథిలి శరణ్ గుప్తా రాసిన కవితను చదవాలనుకుంటున్నాను. గుప్తా ఇలా చెప్పారు –

అవకాశం మీ కోసం వస్తుంది, అయినప్పటికీ మీరు నిశ్శబ్దంగా ఉంటారు.

మీ కార్యాచరణ క్షేత్రం చాలా పెద్దది, ప్రతి క్షణం విలువైనది,

ఓ భారతదేశమా మేలుకో, నీ కళ్ళు తెరువు.

దీనిని మైథిలి శరణ్ గుప్తా రాశారు. కానీ, అతను 21వ శతాబ్దం ప్రారంభంలో రాయవలసి వస్తే, ఏమి రాసి ఉండేవారో నేను ఊహించగలను-

అవకాశం మీ కోసం వస్తుంది, మీరు ఆత్మవిశ్వాసం తో నిండి ఉంటారు.

ప్రతి అడ్డంకి, ప్రతి పరిమితిని ఛేదించండి, హే భారత్, స్వయం సమృద్ధి పథంలో పయనించండి.

గౌరవనీయులైన సభాపతి గారు,

కరోనా యుగంలో ప్రపంచంలో ఉత్పన్నమయిన పరిస్థితిలో, ఎవరికీ సహాయం చేయడం అసాధ్యం. కరోనా, ఒక దేశం మరొక దేశానికి సహాయం చేయలేని వాతావరణాన్ని సృష్టించింది, ఒక దేశం మరొక దేశానికి సహాయం చేయలేకపోయింది, కుటుంబంలోని సభ్యుడు కూడా కుటుంబంలోని మరొక సభ్యుడికి సహాయం చేయలేకపోయాడు. భారతదేశం కోసం, ప్రపంచం నలుమూలల నుండి అపోహలు తలెత్తుతున్నాయి. కరోనా మహమ్మారిని భారత్ ఎదుర్కోలేకపోతే, భారతదేశానికి మాత్రమే కాకుండా మొత్తం మానవ జాతికి కూడా విపత్తు సంభవిస్తుందని ప్రపంచం ఆందోళన చెందింది. బిలియన్ల ప్రభావం ఉంటుంది, లక్షలాది మంది చనిపోతారు. భయపెట్టడానికి చాలా విషయాలు ఉన్నాయి. ఇలా ఎందుకు జరిగిందో మేము ప్రశ్నించము. ఎందుకంటే, తెలియని శత్రువు ఏమి చేయగలదో ఎవరికీ తెలియదు. ప్రతి ఒక్కరూ వారికి తోచినట్టుగా అంచనా వేశారు.

ప్రతి ఒక్కరూ కొత్త ఆలోచనలతో, కొత్త మార్గంలో నడవాల్సి వచ్చింది. కొంతమంది మేధావులు, శక్తివంతమైన వ్యక్తులు భిన్నమైన అభిప్రాయాలను కలిగి ఉండవచ్చు. కాని ఈ శత్రువు అపరిచితుడు. మనము కూడా కొత్త మార్గం అన్వేషించాలనుకుంటున్నాము.

మార్గాలు కనుగొని ప్రజల ప్రాణాలను కాపాడాలసిన అవసరం ఉంది. ఆ సమయంలో, దేవుడు ఈ దేశానికి ఇచ్చిన జ్ఞానం, శక్తి, బలం ఉపయోగించి, దేశాన్ని రక్షించడానికి కృషి చేశాం. మానవజాతిని, ప్రపంచాన్ని రక్షించడంలో భారతదేశం చాలా ముఖ్యమైన పాత్ర పోషించిందని ఇప్పుడు ప్రపంచం గర్వంగా చెబుతోంది. ఈ యుద్ధంలో విజయం, ఏ ప్రభుత్వానికీ, ఏ వ్యక్తికీ చెందదు. కానీ అది ఖచ్చితంగా భారతదేశానికి చెందుతుంది. గర్వం వలన నష్టమేంటి? ప్రపంచం ముందు ఆత్మ విశ్వాసంతో ఎందుకు మాట్లాడకూడదు? ఈ దేశం సాధించింది. పేదలు దీనిని సాధించారు. మీరు సోషల్ మీడియాలో చూసారు, ఒక వృద్ధ తల్లి ఒక చిన్న గుడిసె పక్కన కాలిబాటపై కూర్చుని ఆమె గుడిసె వెలుపల ఒక దీపం వెలిగించి, భారతదేశ సంక్షేమం కోసం ప్రార్థిస్తోంది. మీరు ఆమెను ఎగతాళి చేస్తున్నారా? ఆమె భావాలను ఎగతాళి చేస్తున్నారా? పాఠశాల తలుపు ఎప్పుడూ చూడని వారు కూడా దేశం కోసం ఏదైనా చేయాలన్న ఆలోచనతో, దేశానికి దీపం వెలిగించి తమ దేశానికి సేవ చేయాలనే ఆలోచన చేశారు. తద్వారా దేశంలో ఒక సామూహిక శక్తి మేల్కొంది. వారు తమ శక్తిని, సామర్థ్యాన్ని పరిచయం చేశారు. కానీ ఎగతాళి చేయడం జరిగింది. ఎదుర్కోడానికి చాలా సమస్యలు ఉన్నాయి, చేయవలసినవి చాలా ఉన్నాయి. కానీ దేశాన్ని నిరుత్సాహపరిచే పనులు చేయవద్దు, దేశ శక్తిని తక్కువ అంచనా వేసే వారికి ఎప్పటికీ ప్రయోజనం ఉండదు.

మన కరోనా యోధులు, మన ముందు వలస కార్మికులు, మీరు ఊహించవచ్చు, ఎవరైనా కరోనా కు బలి అవుతారనే భయం అన్ని వైపులా ఉన్నప్పుడు, విధి నిర్వర్తించడం చిన్న విషయం కాదు. వారి బాధ్యతలను నిర్వర్తించడం మనం గర్వపడాల్సిన విషయం. వారిని గౌరవించడం మన బాధ్యత. వారి ప్రయత్నాల వలన దేశం ఈ రోజు ఫలితాలు చూపిస్తుంది.

ఇది విమర్శల కోసం కాదు. మనం గతంలోకి తొంగి చూస్తే, ఆ పరిస్థితులలో జీవించాము. మశూచి గురించి మాట్లాడితే భయం కలిగేది. పోలియో కూడా భయపెట్టేది. మనం టీకాలు తీసుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేశాం? అందుకు ఎన్ని ఇబ్బందులు ఉండేవి? ఎప్పుడూ అవి లభిస్తాయి? ఎంత వరకు అందుబాటులో ఉంటాయి? ఏ విధంగా అవి లభిస్తాయి? ఎంతమందికి లభిస్తాయి? ఇలాంటివన్నీ మనం చూశాం. అలాంటి పరిస్థితుల్లో మీరు చూస్తే, ఏవైతే మూడవ ప్రపంచ దేశాలుగా లెక్కించబడ్డాయో ఆ దేశాలు ఈ రోజు మానవ జాతి సంక్షేమం కోసం టీకాలతో ముందుకు వచ్చాయి. చాలా తక్కువ సమయంలో మన శాస్త్రవేత్తలు యుద్ధప్రాతిపదికన నిమగ్నమై పని చేశారు. మానవ జాతి చరిత్రలో భారతదేశం చేసిన కృషికి ఇది ఒక అద్భుతమైన గాధ. అందుకు మనం గర్వపడాలి, ఇది కొత్త ఆత్మవిశ్వాసానికి ప్రేరణ లాంటిది. ప్రపంచంలోని అతి పెద్ద టీకా కార్యక్రమం మనదేశంలో జరుగుతున్నందున మనం ఈ కృషి పట్ల గర్విస్తూ ఆ ధైర్యాన్ని ప్రేరేపించాలి. ఈరోజు ప్రపంచంలో వేగంగా టీకాలు వేస్తే, అది మన తల్లి అయిన భారతదేశం ఒడిలో జరుగుతుంది. భారతదేశ సామర్థ్యం ఎక్కడికి చేరుకోలేదు?

ఈ రోజు కరోనా వల్ల, భారతదేశానికి ప్రపంచంతో ఉన్న సంబంధాలకు కొత్త అర్థాన్ని ఇచ్చింది. మొదట్లో ఏ మందులు పనిచేస్తాయో తెలియనప్పుడు, వ్యాక్సిన్ లేనప్పుడు, ప్రపంచ దృష్టి భారతీయ ఔషధాల వైపు మళ్ళింది. భారత్ ప్రపంచంలోనే ఔషధాల కేంద్రంగా అవతరించింది. ఆ సమయంలో మన దేశం 150 దేశాలకు మందులను అందించింది. మానవ జాతిని రక్షించడానికి మనం వెనకాడలేదు. అంతేకాదు భారతీయ టీకాలు అందుకున్నందుకు ప్రపంచం గర్వపడుతుంది. ఎప్పుడైనా సంపన్నులు ప్రపంచంలోని ప్రతిష్టాత్మకమైన ఆస్పత్రుల కి పెద్ద ఆపరేషన్ కోసం వెళ్ళినప్పుడు వారి కళ్ళు భారతీయ వైద్యుల కోసం వెతుకుతాయని మనందరికీ తెలుసు. వైద్య బృందంలో భారతీయ వైద్యుడు ఉండడం వారికి ధీమా ఇస్తుంది.

ఇది మన దేశం సంపాదించుకున్న పేరు. అందుకు మనం గర్వపడాలి. కాబట్టి మనం ఈ కీర్తితో ముందుకు సాగాలి.

కరోనా కాలంలో భారత దేశం ఏ విధంగా ప్రపంచ దృష్టిలో ప్రత్యేకమైన గుర్తింపును సృష్టించిందో, అదే స్ఫూర్తిని సమాఖ్య వ్యవస్థ ద్వారా కేంద్రం మరియు రాష్ట్రాలు చూపించాయి. సంక్షోభంలో మనం ఎలా కలిసి పని చేయాలి, మన శక్తిని ఒకే దిశలో ఏ విధంగా కేంద్రీకరించాలి అనేది మన అంతర్గత శక్తి. సహకార సమాఖ్య వాదాన్ని బలోపేతం చేయడానికి కృషి చేసిన రాష్ట్రాలను నేను అభినందిస్తున్నాను ఎందుకంటే ఈ సభలో అన్ని రాష్ట్రాల ప్రాతినిధ్యం ఉంది. అన్ని రాష్ట్రాలు కరోనా సంక్షోభంలో సమస్యలను ఒక అవకాశంగా మార్చుకున్నాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ ప్రశంసలకు అర్హులు. ప్రజాస్వామ్యం గురించి ఇక్కడ ఎన్నో నీతులు చెప్తారు కానీ ఈ దేశంలోని ఏ పౌరుడు ఆ విషయాలను నమ్మడు. భారతీయ ప్రజాస్వామ్యాన్ని ఈ విధంగా చీల్చడం సాధ్యం కాదు. మనం అలాంటి తప్పులు చేయకూడదు. నేను డెరెక్ గారి ప్రభావవంతమైన మాటలు విన్నాను - వాక్ స్వాతంత్ర్యం, బెదిరింపులు, వెంటాడడం. నేను వారిని వింటున్నప్పుడు వారు బెంగాల్ గురించి మాట్లాడుతున్నారో లేదా దేశం గురించి మాట్లాడుతున్నారో అర్థం కాలేదు. సహజంగా వారు రోజంతా ఏదైతే చూస్తూ ఉంటారో దాన్ని ఇక్కడ పొరపాటున చెప్పి ఉంటారు. కాంగ్రెస్ కు చెందిన బాజ్వా గారు కూడా అనర్గళంగా మాట్లాడారు. వారు అతిగా మాట్లాడుతున్న తీరును చూస్తే వారు త్వరలోనే అత్యవసర రోజులకు వెళ్తారని నేను అనుకున్నాను. ఒక్క అడుగు దూరంలోనే, వారు 84 గురించి కూడా ప్రస్తావిస్తారు అనుకున్నాను కానీ వారు అలా చేయలేదు. దేశాన్ని కాంగ్రెస్ ఎల్లప్పుడూ నిరాశపరిచింది, మీరు కూడా నిరాశ పరిచారు.

గౌరవనీయులైన చైర్మన్ గారు

ఈ సభ ముందు నేను నేను ఒక వాక్యాన్ని చెప్పదలుచుకున్నాను, ఎవరికైతే ప్రజాస్వామ్యం, మన ప్రాథమిక శక్తిపై సందేహాలు ఉన్నాయో వారు దీన్ని అర్థం చేసుకోవాలని ప్రత్యేకంగా విన్నవించుకుంటున్నాను. "మన ప్రజాస్వామ్యం ఏ కోణంలోనూ పాశ్చాత్య సంస్థ కాదు. ఇది ఒక మానవ సంస్థ. భారతదేశ చరిత్రలో ప్రజాస్వామ్య సంస్థల ఉదాహరణలు చాలా ఉన్నాయి. ప్రాచీన భారతదేశంలో 81 స్వతంత్ర రాజ్యాల గురించి వివరణ లభిస్తుంది. భారతదేశ జాతీయ వాదం పై జరుగుతున్న దాడుల పట్ల దేశపౌరులను హెచ్చరించడం అవసరం. భారతదేశ జాతీయవాదం స్వార్థపూరితమైనది కాదు, ఇరుకైనది కాదు, దూకుడు స్వభావం కలది కూడా కాదు. ఇది 'సత్యం శివం సుందరం' విలువలతో ప్రేరణ పొందింది."

గౌరవనీయులైన చైర్మన్ గారు, అది ఆజాద్ హింద్ ఫౌజ్ మొదటి ప్రధాని నేతాజీ సుభాష్ చంద్రబోస్ గారు చెప్పిన మాట. యాదృచ్ఛికంగా మనము వారి 125వ జయంతిని జరుపుకుంటున్నాము. కానీ, దురదృష్టవశాత్తు వారి స్ఫూర్తిని, వారి అభిప్రాయాలను, ఆదర్శాలను మరిచిపోయాము. దాని ఫలితంగా ఈరోజు మనల్ని మనం శిక్షించుకుంటున్నాం. కొన్నిసార్లు, ప్రపంచం సృష్టించిన పదాలను మనం వాడుకోవడం నన్ను ఆశ్చర్యపరుస్తుంది. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారతదేశాన్ని పేర్కొన్నప్పుడు వినడానికి చాలా బాగుంది. అవును, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కానీ మన యువతరానికి భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి అని మనం నేర్పించలేదు. మనం కేవలం అతి పెద్ద ప్రజాస్వామ్యమే కాదు, ఈ దేశం ప్రజాస్వామ్యానికి తల్లి. మన భవిష్యత్ తరాలకు ఇది నేర్పించాలి, ఈ విషయాన్ని గర్వంగా వారికి చెప్పాలి. ఎందుకంటే ఇవి మన పూర్వీకులు మనకు ఇచ్చిన వారసత్వం. భారతదేశం పాలనా వ్యవస్థ ప్రజాస్వామ్య బద్ధమైనది కాబట్టి అందువలనే, మనం ప్రజాస్వామ్య దేశం కాదు. మన వ్యవస్థ ప్రజాస్వామ్య బద్ధమైనది

ఎందుకంటే భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, మనస్సు, ప్రజాస్వామ్య బద్ధమైనవి. సహజంగా మనం ప్రజాస్వామ్యవాదులం. ఈ దేశం దాన్ని పాటించి చూపింది.

అత్యవసర రోజులను గుర్తు చేసుకుంటే న్యాయ వ్యవస్థ, మీడియా పాలన పరిస్థితి ఏమిటో మనకు అర్థమవుతుంది. ప్రతీది జైలుగా మార్చబడింది. అయినా కానీ దేశ పౌరుల నమ్మకాన్ని కదిలించలేక పోయారు. ఎందుకంటే ప్రజలు ప్రజాస్వామ్య వర్ణాలతో జీవించి ఉన్నారు. వారికి అవకాశం లభించిన వెంటనే ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేశారు. ఇది ప్రజల శక్తి, మన సంస్కృతి శక్తి, మన ప్రజాస్వామ్య విలువల బలం. ఏ ప్రభుత్వం దీన్ని విధించింది అనేది ఇక్కడ ప్రశ్న కాదు. నేను ఆ విషయాన్ని చర్చించడం లేదు, నన్ను ఇక్కడికి అలాంటి విషయాలపై సమయాన్ని వెచ్చించడానికి పంపించలేదు. ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుకుంటూ మనం ముందుకు సాగాలి. 'ఆత్మ నిర్భర్ భారత్' పై కూడా ఇక్కడ చర్చించారు. మా సహచరుడు ధర్మేంద్ర ప్రధాన్ గారు ఈ విషయంపై విస్తారంగా వివరించారు. ఒక్కటి మాత్రం వాస్తవం, ఆర్థిక రంగంలో భారతదేశం తనని తాను స్థాపించుకుంది. కరోనా సమయంలో కూడా ప్రపంచంలో పెట్టుబడుల కోసం ప్రజలు ఆరాటపడ్డారు. భారత దేశం లో రికార్డు పెట్టుబడులు పెడుతున్నారు. ప్రపంచంలోని దేశాల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వాస్తవాలు సూచిస్తున్నాయి మరోవైపు ప్రపంచం భారతదేశ వృద్ధిని రెండు అంకెల వృద్ధిగా అంచనా వేస్తోంది. ఒకవైపు నిరాశ వాతావరణం ఉంటే మరోవైపు భారతదేశం లో ఆశాకిరణం కనిపిస్తోంది, ప్రపంచం ఈ విషయాన్ని గట్టిగా నమ్ముతోంది.

ఈ రోజు భారత దేశ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. అలాగే రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి జరుగుతుంది. ఇంటర్నెట్ వినియోగదారుల్లో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద దేశంగా భారత్ ఉంది. భారత దేశంలో యూపీఐ ద్వారా ప్రతి నెలా 4 లక్షల కోట్ల రూపాయల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయి. రెండు మూడు

సంవత్సరాల క్రితం ఈ సభలో జరిగిన ప్రసంగాలు గుర్తు చేసుకోండి. అప్పుడు ప్రజల వద్ద మొబైల్ ఫోన్లు లేవని, ఏ విధంగా వారు డిజిటల్ లావాదేవీలు చేస్తారని అన్నారు. దేశ శక్తిని చూడండి. నెలకు నాలుగు లక్షల కోట్ల రూపాయల డిజిటల్ లావాదేవీలు!!! భారత్ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీదారు గా అవతరించింది. దేశంలో ఎన్నో స్టార్టప్ లు, యూనికాన్ లు చేపట్టడం జరిగింది, వీటిని ప్రపంచమంతా ప్రోత్సహిస్తుంది. మన యువతరం ఆ పని చేసి చూపించింది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచంలోని ఐదు దేశాలలో మనల్ని మనం స్థాపించుకున్నాము, రాబోయే రోజుల్లో ఈ దిశగా మనం ముందుకు సాగబోతున్నాము. అది నీరు కానివ్వండి, భూమి కానివ్వండి, ఆకాశం కానివ్వండి లేదా అంతరిక్షం కానివ్వండి, భారతదేశం తనని తాను కాపాడుకోవడానికి సామర్థ్యంతో స్థిరంగా ఉంది. భారత సర్జికల్, వైమానిక దాడులు ప్రపంచం చూసి ఉంది.

గౌరవనీయులైన చైర్మన్ గారు

2014లో ఈ సభా ప్రాంగణంలో నేను మొట్టమొదటిసారిగా నాయకుడిగా ఎన్నికైనప్పుడు, నా మొట్టమొదటి ప్రసంగంలో ఈ ప్రభుత్వం పేదలకి అంకితం అని చెప్పాను. రెండవ సారి ఎన్నికైన తర్వాత కూడా నేను ఈ రోజు అదే మాట చెప్తున్నాను. మేము మారలేదు, మా దిశను మార్చుకోలేదు. అదే ఉద్దేశంతో పని చేస్తున్నాము. ఎందుకంటే పేదరికం నుంచి విముక్తి కల్పించి ముందుకు సాగాలి. మనం మరింత కృషి చేస్తూ ముందుకు సాగాలి. ఇంతకుముందు కృషి చేసినట్లయితే మనం దాన్ని ఆపకుండా మరింత ప్రయత్నం చేయాలి. సౌకర్యం వంతమైన జీవితం కోసం కనీస అవసరాలు కల్పించినట్లు అయితే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, పేద వారికి ఆత్మవిశ్వాసం కలిగితే వారు పేదరికానికి వ్యతిరేకంగా నిలబడగలరు, ఎవరి సహాయం పై ఆధారపడరు. ఇది నా అనుభవం. పది కోట్ల కంటే ఎక్కువ మరుగుదొడ్లు నిర్మించడం, 41 కోట్ల ప్రజల ఖాతాలు తెరవడం, రెండు కోట్ల ఇళ్లు

పేద వారి కోసం నిర్మించడం, ఎనిమిది కోట్ల కంటే ఎక్కువ ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం, 5 లక్షల వరకు ఉచిత వైద్య సహాయం అందించడం. ఇలాంటివన్నీ పేదల జీవితాల్లో గొప్ప శక్తిగా మారాయి. పేదల జీవితాలను మార్చేసి, కొత్త విశ్వాసాన్ని సృష్టించే అనేక పథకాలు ఉన్నాయి.

గౌరవనీయులైన చైర్మన్ గారు, మన ముందు సవాళ్ళు ఉన్నాయి ప్రపంచంలోని సంపన్న దేశాలకు కూడా సవాళ్లు ఉంటాయి. వాటి సవాళ్లు వేరు మన సవాళ్లు వేరు. కానీ మనం సమస్యలో భాగం కావాలి అనుకుంటున్నామా లేక పరిష్కారం లో భాగం కావాలి అనుకుంటున్నామా అనేది నిర్ణయించుకోవాలి. అది ఒక సన్నని గీత. మనం సమస్యలో భాగం కావాలనుకుంటే రాజకీయాలు కొనసాగుతాయి. కానీ మనం పరిష్కారంలో భాగం కావాలనుకుంటే జాతీయ విధానం పెద్ద అడుగులతో ముందుకు సాగుతుంది. వర్తమాన, భవిష్యత్తు తరాల కోసం ఆలోచించాల్సిన బాధ్యత మనపై ఉంది. సమస్యలు ఉన్నాయి, కానీ మనం కలిసి పని చేస్తే, ఆత్మవిశ్వాసంతో పని చేస్తే, మనం పరిస్థితులు మార్చి ఆశించిన ఫలితాలను సాధించగలం. ఇది నా దృఢవిశ్వాసం.

గౌరవనీయులైన చైర్మన్ గారు, రైతుల ఆందోళన పై సభలో చాలా చర్చలు జరిగాయి ఈ చర్చలన్నీ ఆందోళన చుట్టూ తిరిగాయి కానీ ఆందోళనకు గల కారణాలు గురించి వారు మౌనంగా ఉన్నారు. ఆందోళన ఏమిటి? ఆందోళన ఎందుకు జరుగుతుంది? ఇవన్నీ కూడా చాలా ముఖ్యం. కానీ ఈ ప్రాథమిక సమస్యలపై చర్చ జరపడం చాలా ముఖ్యం. గౌరవనీయులైన వ్యవసాయ మంత్రి గారు మంచి ప్రశ్నలు అడిగారు కానీ వాటికి సమాధానాలు లభించవు, ఎందుకనో మాకు తెలుసు, అయినా ఆ విషయాన్ని వారు గొప్పగా చర్చించారు. వారికి నా కృతజ్ఞతలు. వారు ఈ చర్చని గంభీరంగా తీసుకుని, ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రశంసించారు. ఎందుకంటే వారు వారి జీవితాన్ని రైతులకే అంకితం చేశారు. వారు

ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూనే కొన్ని మంచి సూచనలు చేశారు. వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

గౌరవనీయులైన చైర్మన్ గారు,

వ్యవసాయం ప్రాథమిక సమస్య ఏమిటి? ఈ సమస్య మూలం ఏమిటి? ఈరోజు నేను మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ గారు చెప్పిన మాటలు వివరిస్తాను. ఇక్కడ చౌదరి చరణ్ సింగ్ గారి వారసత్వాన్ని తీసుకోవడంలో గర్వపడే వారు చాలా మంది ఉన్నారు, వారి మాటలు కచ్చితంగా అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను. చౌదరి చరణ్ సింగ్ గారు తరచూ 1971లో జనాభా గణన ప్రస్తావించేవారు. రైతుల జనాభా లెక్కల ప్రకారం 33 శాతం మంది రైతులు 2 బిగాలు లేదా అంతకంటే తక్కువ భూమి కలిగి ఉన్నారు. 18 శాతం మంది రైతులు, రెండు నుంచి నాలుగు బిగాల భూమి అంటే అర హెక్టార్ నుంచి ఒక హెక్టారు భూమి కలిగి ఉన్నారు. ఈ 51 శాతం మంది రైతులు ఎంత కష్టపడినా, అంత చిన్న భూమితో నిజాయితీగా జీవించలేరు. ఇది చౌదరి చరణ్ సింగ్ గారి వ్యాఖ్య. చౌదరి చరణ్ సింగ్ గారు చిన్న రైతుల దయనీయ పరిస్థితి చూసి ఎప్పుడు బాధ పడేవారు. వారి గురించే ఎప్పుడూ ఆలోచించే వారు. ఇప్పుడు చూడండి ఏమైందో. ఒక హెక్టారు కంటే తక్కువ భూమి కలిగిన రైతులు 1971 లో 51 శాతం ఉంటే అది ఇప్పుడు 68 శాతానికి పెరిగింది. దీని అర్థం తక్కువ భూమి ఉన్న రైతుల సంఖ్య ఈ దేశంలో పెరుగుతూ పోతున్నది. ఇందులో చిన్న, సన్నకారు రైతులను జోడిస్తే రెండు హెక్టార్లు కన్నా నా తక్కువ భూమి ఉన్న రైతుల శాతం 86% చేరుకుంటుంది. అలాంటి రైతుల సంఖ్య 12 కోట్లు. ఈ 12 కోట్ల రైతుల పట్ల మనకు ఎటువంటి బాధ్యత లేదా? ఈ 12 కోట్ల రైతులను మన పథకాల కేంద్రంగా మనము ఆదుకోలేమా? ఈ ప్రశ్నకు సమాధానం చౌదరి చరణ్ సింగ్ గారు మనకోసం వదిలిపెట్టారు. ఆ

ప్రశ్నకు సమాధానం కనుగొని చౌదరి చరణ్ సింగ్ గారికి నిజమైన నివాళి అర్పించాలి. ఈ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలి.

గత ప్రభుత్వాలు చిన్న రైతుల గురించి ఆలోచించాయా? నేను ఈ మాట విమర్శించడానికి చెప్పడం లేదు కానీ మనం ఆలోచించాలి. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు రుణమాఫీ ప్రకటనలు జరుగుతాయి. ఇది రైతులకు సంబంధించిన విషయం, కానీ అవి ఓట్లకోసం అని అందరికీ తెలుసు. రుణాలు మాఫీ అయినప్పుడు చిన్న రైతులు వాటినుండి వంచించబడతారు. వారికి ఏమీ లభించదు ఎందుకంటే రుణమాఫీ అనేది ఈ బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే వారి కోసం చిన్న రైతులకు బ్యాంకులో ఖాతా కూడా ఉండదు. అలాంటప్పుడు వారికి రుణం ఎలా లభిస్తుంది? మనం రాజకీయాలు చేశాము, కానీ చిన్న రైతుల కోసం ఏమీ చేయ లేదు. ఒకటి లేదా రెండు ఎకరాల భూమి ఉన్న చిన్న రైతుకు బ్యాంకులో ఖాతా ఉండదు, రుణమూ లభించదు, అలాగే వారికి రుణమాఫీ ప్రయోజనమూ లభించదు. అలాగే ఇంతకు ముందు ఉన్న నా పంట బీమా పథకం ఏమిటి? అది ఒక రకమైన బ్యాంకు గ్యారెంటీగా పని చేసేది. అది చిన్న రైతులకు అందుబాటులో ఉండేది కాదు. ఆ పథకం బ్యాంకుల నుండి రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే లభించేది. వారికి మాత్రమే బీమా లభించేది, బ్యాంకుల సొమ్ముకు భద్రత లభించేది. ఈ రోజు రెండు ఎకరాల లోపు భూమి ఉండి బ్యాంకుల నుండి రుణాలు తీసుకునే రైతులు ఎంత మంది ఉన్నారు? చిన్న రైతులకు నీటిపారుదల సౌకర్యం కూడా అందుబాటులో లేదు. పెద్ద రైతులు భారీ పంపుసెట్లు, గొట్టపు బావులను ఏర్పాటు చేసుకుని, దానికి వినియోగించే విద్యుత్తును కూడా ఉచితంగా పొందుతారు. చిన్న రైతులకు నీటిపారుదల కూడా ఒక సమస్య. వారికి గొట్టపు బావులు అమర్చుకొనే స్తోమత ఉండదు. కొన్ని సందర్భాలలో వారు పెద్ద రైతుల నుంచి వీటిని కొనుగోలు చేస్తారు, పెద్ద రైతు అడిగిన ధర వారికి ఇస్తారు. పెద్ద రైతులకు యూరియా

లభించడం లో ఎలాంటి ఇబ్బంది లేదు. చిన్న రైతులు మాత్రం యూరియా కోసం రాత్రంతా క్యూలో నిలబడతారు. కొన్నిసార్లు వారిపై లాఠీఛార్జ్ చేయడం కూడా జరుగుతుంది. వారు ఒట్టి చేతులతో ఇంటికి వెళ్ళాల్సిన పరిస్థితి ఉండేది. ఈ పరిస్థితులు మాకు తెలుసు. 2014 తర్వాత మేము కొన్ని మార్పులు చేశాం. బీమా పథకం పరిధిని విస్తరించాము. తద్వారా చిన్న రైతులు కూడా ఆ పథకాన్ని పొందగలరు. మేము చిన్న మొత్తంతో ప్రారంభించాము. పంట బీమా పథకం కింద గత 4,5 సంవత్సరాలలో రైతులకు 90 వేల కోట్ల రూపాయలు విలువైన క్లెమ్ లు లభించాయి. రుణమాఫీ పథకాల కంటే ఈ సొమ్ము చాలా ఎక్కువ.

ఇప్పుడు కిసాన్ క్రెడిట్ కార్డులను చూడండి. అంతకుముందు కూడా రైతులకు క్రెడిట్ కార్డులు ఉండేవి అయితే అవి పెద్ద రైతులకు మాత్రమే ఉండేవి, వారు చాలా తక్కువ వడ్డీతో బ్యాంకుల నుంచి రుణాలు పొందే వారు. కొన్ని రాష్ట్రాలలో వారికి 0% వడ్డీకి రుణాలు లభించాయి. వారు ఆ డబ్బును వేరే పనుల కోసం ఉపయోగించేవారు. చిన్న రైతులకు అవి లభించలేదు. అప్పుడు మేము దేశంలోని ప్రతి రైతుకి క్రెడిట్ కార్డు ఉండాలని నిర్ణయించాము. అంతేకాకుండా ఆ పరిధి మత్స్యకారులకు విస్తరించాము, తద్వారా వారు కూడా వాటి ప్రయోజనం పొందగలరు. 1.75 కోట్లకు పైగా రైతులు కిసాన్ క్రెడిట్ కార్డును పొందారు. ఎక్కువ మంది రైతులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకునేలా దీన్ని మరింత విస్తరించాలని మేము ఇతర రాష్ట్రాలను అభ్యర్థిస్తున్నాము. రాష్ట్రాల నుండి ఎంత సహాయం లభిస్తే రైతులకు అంత మేలు జరుగుతుంది. అదేవిధంగా మేము ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ప్రవేశపెట్టాము. ఈ పథకం కింద డబ్బు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు వెళుతుంది. ఇందులో ఎప్పుడూ ఏ సహాయం లభించని రైతులు కూడా ఉన్నారు. దీని ద్వారా 10 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందాయి.

బెంగాల్ లో రాజకీయాలు చేసి ఉండకపోతే బెంగాల్ రైతులు ఈ పథకంలో చేరి ఉంటే ఈ సంఖ్య మరింత ఎక్కువ అయి ఉండేది, ఒక లక్షా 15 వేల కోట్ల రూపాయలు చిన్న రైతుల ఖాతాల్లోకి వెళ్ళేవి. ఈ పథకాలన్నిటికీ కేంద్రబిందువు సాయిల్ హెల్త్ కార్డ్. మేము 100% రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు ఇవ్వడం గురించి మాట్లాడాము. వీటివల్ల రైతు వద్ద ఎలాంటి భూమి ఉందో, అందులో ఏ పంట బాగా పండుతుందో తెలుస్తుంది. సాయిల్ హెల్త్ కార్డ్ కోసం 100% పని చేశాము. అలాగే వేప పూసిన యూరియాను 100% పూర్తి చేసాము. ఈ 100% వెనక ఉన్న ఉద్దేశం, పేద రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా యూరియా లభించాలి. అదేవిధంగా చిన్న, సన్నకారు రైతుల కోసం పెన్షన్ పథకాన్ని తీసుకువచ్చాము. ఇప్పుడు చిన్న రైతులు కూడా ఈ పథకంలో భాగం అవుతున్నారు. అలాగే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన - ఇది కేవలం రోడ్ల కి పరిమితం కాదు. రైతుల అదృష్టం మార్చడానికి చాలా ముఖ్యమైన పథకం. అందుకే ఆ పథకం పై దృష్టి సారించాము. మొట్టమొదటిసారిగా కిసాన్ రైలు గురించి నిర్ణయం తీసుకున్నాము. చిన్న రైతుకు తన ఉత్పత్తులను అమ్మడానికి ఇబ్బంది ఉండేది. ఈరోజు గ్రామాల్లోని రైతులు కూరగాయలు, పళ్లను ముంబైలోని మార్కెట్లలో అమ్ముతున్నారు, ఇది కిసాన్ రైలు వల్ల సాధ్యమైంది. చిన్న రైతుకి ప్రయోజనం కలుగుతుంది. కిసాన్ ఉడాన్ యోజన - ఇంతకుముందు ఈశాన్య ప్రాంతంలోని మన రైతులు రవాణా వ్యవస్థ లేకపోవడం వల్ల తమ ఉత్తమ ఉత్పత్తులను అమ్మ లేక పోయేవారు. ఈరోజు వారికి కిసాన్ ఉడాన్ యోజన ప్రయోజనం లభిస్తుంది. చిన్న రైతుల ఇబ్బందుల గురించి అందరికీ తెలుసు. వారి సాధికారత కోసం ఎప్పటికప్పుడు డిమాండ్లు వింటూ ఉంటాము.

గౌరవనీయులైన శరద్ పవార్ గారు, కాంగ్రెస్ నుండి ప్రతి ఒక్కరూ, ప్రతి ప్రభుత్వం, వ్యవసాయ సంస్కరణలను సమర్పించాయి. సంస్కరణలు జరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇది ఈరోజు జరిగిన విషయం కాదు. గత ప్రభుత్వాలలో కూడా ఇది ఉంది.

శరద్ పవార్ గారు ఈ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నానని ప్రకటన కూడా చేశారు. సంస్కరణల ప్రక్రియకు సంబంధించి వారికి కొన్ని ప్రశ్నలు ఉండొచ్చు, కానీ, వారు సంస్కరణలకు ఎప్పుడూ అభ్యంతరం తెలపలేదు. శ్రీ సింధియా గారు ఈ చట్టం లోని అంశాలను క్లుప్తంగా వివరించారు. గత రెండు దశాబ్దాలుగా ఈ చర్చలు జరుగుతున్నాయి, ఇది మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదలుపెట్టిన పని కాదు. ప్రతి ఒక్కరూ ఆ పని చేయడానికి సమయం ఆసన్నమైందని చెప్పారు. ఒక కామా లేదా ఫుల్ స్టాప్ సంబంధించి ప్రశ్నలు ఉండొచ్చు కానీ ఎవరూ కూడా ఈ సమస్యపై వారి ఆలోచన ఉత్తమమైనదని చెప్పలేరు. మా విధానం ఉత్తమమైనదని నేను చెప్పలేను అలాగే పది సంవత్సరాల తర్వాత కొత్త విధానం ఉండదని కూడా చెప్పలేం. అది కాకపోవచ్చు. సామాజిక జీవితం మార్పు చెందుతూ ఉంటుంది.

ప్రస్తుత పరిస్థితులలో మేము విషయాలను మెరుగుపరచాలని నిర్ణయించుకున్నాము. కొత్త విషయాలను పురోగతి వైపు జోడిస్తున్నాము. అవాంతరాలు ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యం? ఈ సమస్యపై కొందరు అకస్మాత్తుగా వెనుదిరగడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు వారు ప్రభుత్వాన్ని, నిరసన సమస్యపై ఇరుకున పెట్టాలని చూస్తున్నారు, సంస్కరణలు చాలా ముఖ్యమని రైతులకు ఏకకాలంలో చెబుతున్నారు. ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి అందుకే కొత్త విషయాలు మనం ప్రవేశపెట్టాలి. దేశం ఈ విధంగానే ముందుకు సాగుతుంది కానీ రాజకీయాలు, సొంత ఆలోచనలను అధిగమిస్తామని నేను భావిస్తున్నాను. గౌరవనీయులైన డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు ఎక్కడ ఉన్నారు? వారు చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇక్కడ నేను ప్రస్తావిస్తాను. ఎవరైతే ఈ నిర్ణయంపై వెన్ను చూపిస్తున్నారో, నాతో అంగీకరించకపోవచ్చు కానీ, వారు మన్మోహన్ సింగ్ గారితో కచ్చితంగా అంగీకరిస్తారు. "1930 లలో ఏర్పడిన మార్కెటింగ్ వ్యవస్థ లో ఉన్న జడత్వాల కారణంగా మన రైతులు వారి

ఉత్పత్తులను ఎక్కువ ధర లభించే చోట అమ్ముకోలేక పోతున్నారు. అలాంటి అడ్డంకులను తొలగించడం మా ఉద్దేశ్యం, ఏవైతే భారతదేశ విస్తారమైన సామర్థ్యాన్ని ఒక పెద్ద ఉమ్మడి మార్కెట్ గా చేయడంలో అవాంతరంగా ఉన్నాయో వాటిని." ఇది మన్మోహన్ సింగ్ గారు మాట్లాడిన మాట. వారు భారతదేశానికి ఒక వ్యవసాయ మార్కెట్ ను అందించి రైతులకు వారి ఉత్పత్తులను అమ్ముకునే స్వేచ్ఛ లభించాలని వారి ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు. మేము చేస్తున్నది అదే అందుకు మీరు గర్వించాలి. గౌరవనీయులైన మన్మోహన్ సింగ్ గారు ఈ మాట అన్నారు, ఆ పని మోడీ చేస్తున్నారు, అందుకు మనం గర్వించాలి. ఎవరైతే ఇందులో రాజకీయం చేస్తున్నారో వారు కూడా వారి రాష్ట్రాలలో ఇందుకు సంబంధించి ఎంతో కొంత చేశారు. ప్రతిపక్ష పార్టీలన్నీ వారు పాలిస్తున్న రాష్ట్రాలలో దీనికి సంబంధించి ఎంతో కొంత చేశారు. ఇదే మార్గమని వారికి కూడా తెలుసు. ఈ సమస్యపై ఎవరూ కూడా చట్టం స్ఫూర్తిని చర్చించలేదు. ప్రక్రియ సరైనది కాదు, త్వరగా చేశారనేది వారి ఫిర్యాదు. ఒక కుటుంబంలో వివాహం జరిగినప్పుడల్లా ఒక వృద్ధ మహిళ నన్ను ఎక్కడ ఆహ్వానించారు? అని ఫిర్యాదు చేయడం మనం చూస్తుంటాం. ఇంత పెద్ద కుటుంబంలో అలా జరగడం సహజం.

ఇప్పుడు వేరు వేరు సమస్యలపై దృష్టి పెడదాము. ఉదాహరణకు పాల ఉత్పత్తిని తీసుకోండి. ఇది ఎలాంటి నిబంధనలకు ముడి పెట్టలేదు. కానీ ప్రైవేటు, సహకార సంస్థలు పాల రంగంలో కలిసికట్టుగా ఒక బలమైన వ్యవస్థను ఏర్పాటు చేశాయి. రెండూ కలిసి ఆ పనిని చేస్తున్నాయి. మనదేశంలో అద్భుతమైన పాల సరఫరా వ్యవస్థ ఉంది. ఇది నా పదవీ కాలంలో జరగలేదు. ఇది నేను రాకముందు జరిగిందని మీరు గర్వించవచ్చు. మనమందరము కూడా గర్వించాలి. పళ్లు, కూరగాయలకు సంబంధించిన వ్యాపారం నేరుగా మార్కెట్లతో సంబంధం కలిగి ఉంటుంది. మార్కెట్ల జోక్యం లేదు కాబట్టి ఇది లాభదాయకంగా ఉంటుంది. పారిశ్రామికవేత్తలు ఎవరైతే పాల ఉత్పత్తులను, కూరగాయలను కొంటున్నారో,

వారు పాడి రైతుల భూములిని గాని ఆ రైతుని కానీ లేదా పాడిని గాని ఆక్రమిస్తున్నారా? లేదు. పాలు అమ్ముతున్నారు, పశువులను కాదు. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలు పాడి పరిశ్రమ తో పాటు 28 శాతానికి పైగా ఉంది కానీ మనం వ్యవసాయం గురించి చర్చిస్తున్నప్పుడు ఈ అంశాన్ని మర్చిపోతాము. 28 శాతం తోడ్పాటు లభిస్తుంది, దాదాపు 8 లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ ఉంది. పాల ఉత్పత్తుల విలువ తృణధాన్యాల, పప్పుధాన్యాల మొత్తం విలువ కంటే ఎక్కువ. మనం ఈ అంశాన్ని చూడలేదు. పాడి రైతులకు పూర్తి స్వేచ్ఛ ఉంది. అలాంటప్పుడు పప్పు ధాన్యాలు, తృణధాన్యాలు పండించే చిన్న, సన్నకారు రైతులకు స్వేచ్ఛ ఎందుకు ఉండకూడదు? ఈ ప్రశ్నలకు జవాబు లభించినప్పుడు, మనం సరైన మార్గంలో ముందుకు వెళ్తాము.

గౌరవనీయులైన చైర్మన్ గారు, మన ప్రవర్తనలో ఇది ప్రతిబింబిస్తుంది అనేది నిజం. ఇంట్లో చిన్న మార్పులు చేయవలసి వచ్చినప్పుడు కూడా కొంత ఆందోళన ఉంటుంది. కుర్చీ మీద టవలు ఇక్కడ ఎందుకు ఉంది? లాంటి ప్రశ్నలు ఉంటాయి. భారత దేశం చాలా విస్తారమైన దేశం, మనం పెరిగిన సంప్రదాయాలు చూసినట్టయితే ఏదైనా కొత్త విషయం వచ్చినప్పుడు కొంత గందరగోళం ఏర్పడడం సహజం. మనం హరిత విప్లవం పై చర్చ జరిగిన రోజులు గుర్తు చేసుకోవాలి. అప్పుడు వ్యవసాయ సంస్కరణలు చేసినప్పుడు కొంత భయం కొంత ఆందోళన ఉండేది. ప్రతి విషయం చక్కగా వ్రాయబడింది. వ్యవసాయ సంస్కరణలు చేయాలనే కఠిన నిర్ణయం శాస్త్రి గారు తీసుకున్నప్పుడు, ఆయన సహచరులు ఎవరూ వ్యవసాయ మంత్రి అవ్వడానికి సిద్ధంగా లేరు. తమ చేతులు కాలిపోతాయని, రైతులు కోపంగా ఉంటారని, వారి రాజకీయాలు అయిపోతాయని వారు భావించారు. ఇది శాస్త్రి గారి పదవీ కాలంలో జరిగిన సంఘటన, చివరిగా శాస్త్రి గారు సుబ్రహ్మణ్యం గారిని వ్యవసాయ మంత్రిగా చేశారు. శాస్త్రి గారి ప్రస్తావించిన సంస్కరణలను ప్రణాళిక సంఘం వ్యతిరేకించింది. ఆర్థిక

మంత్రిత్వశాఖ తో సహా మొత్తం మంత్రివర్గంలో నిరసన ఉండేది. కానీ శాస్త్రి గారు దేశ శ్రేయస్సు కోసం ముందుకు సాగారు. వామపక్షాలు ఈ రోజు మాట్లాడుతున్న భాషని ఆ రోజు మాట్లాడారు. వారు శాస్త్రి గారిని, కాంగ్రెస్ పార్టీని అమెరికా చెప్పినట్టు చేస్తున్నట్టుగా నిందించారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ నాయకులను అమెరికా ఏజెంట్లుగా పేర్కొనేవారు. వ్యవసాయ సంస్కరణలు చిన్న రైతులను నాశనం చేస్తున్నాయని వారు చెప్పారు. వందలాది నిరసన కార్యక్రమాలు దేశమంతా నిర్వహించారు. ఒక భారీ ఉద్యమం జరిగింది. వీటన్నిటి మధ్య లాల్ బహదూర్ శాస్త్రి గారు, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ సంస్కరణలను కొనసాగించాయి, దాని ఫలితంగా PL-480 కార్యక్రమం కింద మనం దిగుమతి చేసుకునేవి, మన రైతులు మన దేశంలోనే ఉత్పత్తి చేస్తున్నారు. రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేశాక కూడా, వ్యవసాయం రంగంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. దీన్ని ఎవరూ కాదనలేరు కానీ మనమందరము సమస్యలకు పరిష్కారం కనుగొనాలి. సమయం వేచి ఉండదని నేను నమ్ముతున్నాను.

కరోనా నేపథ్యంలో కూడా మన రైతులు రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేశారని రాంగోపాల్ గారు చాలా మంచి విషయం చెప్పారు. కరోనా సమయంలో విత్తనాలకు, ఎరువులకు ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వం నిర్ధారించింది. తత్ఫలితంగా అందరి కృషి వలన నిల్వలు నిండుగా ఉన్నాయి. అదే సమయంలో పంటల కొనుగోళ్లు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. కొత్త పరిష్కారాలు కనుగొనడం ద్వారా మనం ముందుకు సాగాల్సి ఉంటుందని నేను నమ్ముతున్నాను. నేను ఇంతకు ముందు చెప్పినట్టుగా ఎన్నో చట్టాలకు 2 నుంచి 5 సంవత్సరాల లోపు సంస్కరణలు చేయవలసిన అవసరం ఉంటుంది. మనము స్థిరమైన వాతావరణంలో జీవించలేము. ఎప్పుడైతే మంచి సలహాలు ఉంటాయో వాటిని మంచి సంస్కరణలతో అనుసరించాలి. మా ప్రభుత్వం మాత్రమే కాదు మునుపటి ప్రభుత్వాలు కూడా

మంచి సంస్కరణలను అంగీకరించాయి, ఇది ప్రజాస్వామ్య సంప్రదాయం. కాబట్టి మంచి సలహాలతో మనం ముందుకు సాగాలి. నేను మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను. వ్యవసాయ రంగంలో ఉన్న సమస్యలకు పరిష్కారాలు వెతుకుతూ, నిరసనకారులను ఒప్పిస్తూ మనం మన దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలి. ఈ రోజు కాకపోతే భవిష్యత్తులో ఎవరైతే ఇక్కడ ఉంటారో వారు ఈ పని చేయాల్సి ఉంటుంది. నేను ఈరోజు ఈ పని చేశాను. విమర్శలు రానివ్వండి కానీ మంచి పని కోసం మనం ఐక్యంగా ఉండాలి. విమర్శలు నేను తీసుకుంటాను, పేరు మీరు తీసుకోండి. కానీ మనం కలిసి ముందుకు వెళ్లాలి. మన వ్యవసాయ మంత్రి క్రమం తప్పకుండా రైతులతో మాట్లాడుతున్నారు. నిరంతర సమావేశాలు జరుగుతున్నాయి. ఏ విధమైన ఆందోళన లేదు. ఒకరినొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిరసనకారులకు నిరసన తెలిపే హక్కు ఉందని మేము చెప్తున్నాము. కానీ వృద్ధులు ఎవరైతే నిరసనలో కూర్చున్నారో అది మంచిది కాదు. వారిని వెనక్కి పంపి వేయండి. నిరసన ముగించండి. మనం తదుపరి చర్చలు చేయడానికి తలుపులు తెరిచే ఉన్నాయి. ఈ విషయాన్ని ఇంతకుముందు కూడా చెప్పాను, ఈ సభ ద్వారా నేను మరోసారి చర్చలకు ఆహ్వానిస్తున్నాను.

గౌరవనీయులైన చైర్మన్ గారు, మన వ్యవసాయం సమృద్ధిగా ఉండడానికి నిర్ణయాలు తీసుకోవడానికి మనం సమయాన్ని వృధా చేయకూడదు. మనం ముందుకు సాగాలి. దేశాన్ని వెనక్కి తీసుకు వెళ్ళకూడదు. అధికార పార్టీ అయినా, ప్రతిపక్షమైనా, ఆందోళన చేస్తున్న సహచరులైనా సరే, మనం సంస్కరణలకు అవకాశం ఇవ్వాలి. ఈ మార్పు మనకి ప్రయోజనం చేకూరుస్తుందో లేదో చూడాలి. ఏవైనా లోపాలు ఉన్నట్లయితే వాటిని సరిదిద్దాలి. ఎక్కడైనా అజాగ్రత్త ఉన్నట్లయితే దాన్ని సరి చేసుకోవాలి. అన్ని మార్గాలు మూసివేయబడలేదు. అందుకే మార్కెట్లను ఆధునికరిస్తే పోటీ మరింత ఎక్కువ ఉంటుందని నేను భరోసా

ఇస్తున్నాను. ఇందుకు బడ్జెట్లో ఏర్పాట్లు కూడా చేయడం జరిగింది. కనీస మద్దతు ధర ఉంది, ఉండేది, ఉంటుంది కూడా. ఈ సభ పవిత్రతను మనం అర్థం చేసుకోవాలి. 80 కోట్లకు పైగా ప్రజలు చౌక రేషన్ ను పొందడం కొనసాగాలి. కాబట్టి గందరగోళాన్ని వ్యాప్తి చేయకండి ఎందుకంటే ఈ దేశం మనకు ప్రత్యేక బాధ్యత ఇచ్చింది. రైతుల ఆదాయాన్ని పెంచడానికి మనం మరి కొన్ని చర్యలు చేపట్టాలి. జనాభా పెరుగుతుంది, కుటుంబంలో సభ్యుల సంఖ్య కూడా పెరుగుతుంది భూమి చిన్నచిన్న ముక్కలు అయిపోతుంది. అలాంటి సందర్భంలో రైతులపై భారాన్ని తగ్గించడానికి ఏదో ఒకటి చేయాలి, రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించాలి, వారి బాధలను తగ్గించే దిశగా పని చేయాలి. మనం రాజకీయ సమీకరణాల్లో చిక్కుకుని ఆలస్యం చేస్తే రైతులను అంధకారంలోకి నెట్టివేసిన్నట్టే. రైతుల ఉజ్వల భవిష్యత్తు కోసం మనం ఇలాంటివి నిరోధించాలి. నేను అందరినీ ప్రార్థిస్తున్నాను, మనం దీని గురించి ఆలోచించాలి.

గౌరవనీయులైన చైర్మన్ గారు, రైతులను స్వావలంబన దిశగా తీసుకువెళ్లడానికి వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ, పశు సంవర్ధకతను పెంపొందించాలి. అదేవిధంగా పశువుల లో ఉండే పాదం, నోటి వ్యాధికి సంబంధించి ఒక పెద్ద కార్యక్రమాన్ని ప్రారంభించాము. ఇది పశువుల రైతులకు, ఇతర రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది. అదేవిధంగా మత్స్య రంగానికి ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను సృష్టించి 20 వేల కోట్ల రూపాయలు మత్స్య సంపద యోజన కోసం కేటాయించడం జరిగింది, తద్వారా ఈ రంగానికి కొత్త ఉత్సాహం లభిస్తుంది. "మధు విప్లవం" లో కూడా గొప్ప అవకాశాలు ఉన్నాయి, అందుకు ఎక్కువ భూమి అవసరం లేదు. పొలంలో పని చేస్తూ 40 వేల రూపాయల నుంచి 2 లక్షల రూపాయల వరకు సంపాదించవచ్చు. ప్రపంచంలో తేనె, తేనెటీగ మైనానికి గొప్ప డిమాండు ఉంది. భారతదేశం తేనెటీగల మైనాన్ని ఎగుమతి చేయగలదు. ఒక చిన్న రైతుకు

ప్రత్యామ్నాయ సంపాదనను పొందడానికి మేము వాతావరణాన్ని సృష్టించాము. తేనెటీగల పెంపకం కోసం వందల ఎకరాల భూమి అవసరం లేదు. వారికున్న భూమిలోనే ఈ పని సునాయసంగా చేయవచ్చు. మన రైతులు సౌర విద్యుత్తు ఉత్పత్తి దారులు అవ్వాలి. సౌర వ్యవస్థ ద్వారా తన పొలంలో విద్యుత్తును ఉత్పత్తి చేసి సౌర పంపును వినియోగించి, అతనికున్న నీటి అవసరాలు తీర్చుకోవాలి. ఈ విధంగా రైతు తన ఖర్చులను తగ్గించుకోవచ్చు, తన పంట ఉత్పత్తిని పెంచుకోవచ్చు ఒక పంట బదులు రెండు పంటలు వేసుకోవచ్చు, రెండు పంటల బదులు, మూడు పంటలు వేసుకోవచ్చు. రైతు పంట సరిగా లేని చోటు మార్చుకోవచ్చు. మనం ఈ దిశగా వెళ్లాలి. భారతదేశం బలం, సమస్యలను పరిష్కరించుకోవడంలో, కొత్త దారులను వెతుక్కోవడంలో ఉంది. మార్గాలు మరింత తెరుచుకుంటాయి. కానీ కొంతమంది భారతదేశాన్ని అస్థిర పరచడానికి, శాంతిని భగ్నం చేయడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అలాంటి వారిని మనం గుర్తించాలి.

విభజన సమయంలో పంజాబ్ కు ఏం జరిగిందో మనం మర్చిపోకూడదు. పంజాబ్ ఎక్కువగా నష్టపోయింది. 84 అల్లర్లు జరిగినప్పుడు పంజాబ్ లో ఎక్కువమంది కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నో విషాద సంఘటనలతో పంజాబ్ బాధించబడింది. జమ్మూ కాశ్మీర్లో ఏమైంది? అమాయకులు చంపబడ్డారు. ఈశాన్యంలో కూడా తుపాకులు బుల్లెట్ల వర్షం కురిపించాయి. ఈ విధమైన సంఘటనలు దేశానికి ఏదో ఒక రూపంలో తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఈ విధమైన సంఘటనల వెనుక ఏ శక్తులు ఉన్నాయి? ప్రతి ప్రభుత్వం వీటిని చూసింది,అర్థం చేసుకుంది, శోధించింది. అందుకే మనం ఈ సమస్యలను వేగంగా పరిష్కరించి ముందుకు వెళ్తున్నాము. కొంతమంది పంజాబ్ లోని సిక్కు సోదరుల మనసులను విషపూరితం చేస్తున్న విషయం మనం మర్చిపోకూడదు. ఈ దేశం ప్రతి సిక్కు పౌరుడి పట్ల గర్వంగా ఉంది. ఈ దేశం కోసం వారు ఏమి చేయలేదు? వారిని ఎంత గౌరవించినా అది

సరిపోదు. నాకు పంజాబ్ లో రొట్టె తినే అవకాశం లభించింది. నా జీవితంలోని ముఖ్యమైన కాలాన్ని నేను పంజాబ్ లో గడిపాను, కాబట్టి నాకు తెలుసు. కొంతమంది భాష వారి గురించి చెబుతుంది. ఎవరైతే తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తారో, దాని వల్ల దేశానికి ఏ ప్రయోజనం లేదు. అందుకే మనం ఈ పరిస్థితి గురించి ఆలోచించాలి.

గౌరవనీయులైన చైర్మన్ గారు, మనకు కొన్ని పదాలు బాగా తెలుసు - శ్రమజీవులు (శ్రమించేవారు), బుద్ధిజీవులు (మేధావులు). కొంతకాలంగా, ఒక కొత్త జాతి పుట్టడం నేను గమనించాను, ఒక కొత్త సమాజం ముందుకు వచ్చింది. అది ఆందోళన జీవుల(నిరసనలపై జీవించేవారు) సమాజం. న్యాయవాదులు ఆందోళన చేస్తే, వారు అక్కడ ఉంటారు. విద్యార్థులు ఆందోళన చేస్తే, వారు అక్కడ కనిపిస్తారు. కార్మికుల నిరసన ఉంటే, వారు అక్కడ కనిపిస్తారు. కొన్నిసార్లు వారు తెరవెనుక, కొన్నిసార్లు తెర ముందు ఉంటారు. ఇది ఆందోళన జీవుల జాతి. వారు నిరసన లేకుండా జీవించలేరు, ఇలాంటి నిరసనలను సజీవంగా ఉంచడానికి మార్గాలను అన్వేషిస్తూ ఉంటారు. ప్రతీ చోట కనిపించి, వారి సైద్ధాంతిక వైఖరిని తెలియజేస్తూ, తప్పుదారి పట్టిస్తూ, నిరసన చేయడానికి కొత్త పద్ధతులు చెప్పే ఇలాంటివారిని మనం గుర్తించాలి. ఇలాంటి ఆందోళన జీవుల పట్ల ఈ దేశం అప్రమత్తంగా ఉండాలి. వారు ఏమి చేయరు, కానీ ఇప్పటికే ఉన్నదానికి పేరు తీసుకోవడం వారి బలం. వీరు పరాన్న జీవులు. ఇక్కడ నా మాటలు వింటున్న ప్రతి ఒక్కరూ ఆనందిస్తూ ఉంటారు, ఎందుకంటే వారు ప్రభుత్వాలు నడుపుతున్న రాష్ట్రాలలో కూడా ఈ విధమైన పరాన్నజీవుల నిరసనలు వారు చూసి ఉన్నారు. అదే విధంగా నేను మరో కొత్త విషయం గమనించాను. దేశం అభివృద్ధి చెందుతుంది. మనం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అయినా ఎఫ్.డి.ఐ గురించి మాట్లాడుతున్నాను. కానీ ఈ మధ్య ఒక కొత్త FDI వచ్చింది ఈ కొత్త FDI నుంచి దేశాన్ని రక్షించండి. మనకి FDI అంటే విదేశీ ప్రత్యక్ష

పెట్టుబడులు కావాలి. కానీ ఈ కొత్త FDI అంటే విదేశీ విధ్వంసక భావజాలం. దీని పట్ల మనం అప్రమత్తంగా ఉండి దేశాన్ని రక్షించాలి.

గౌరవనీయులైన చైర్మన్ గారు, మన దేశ అభివృద్ధి లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సొంత విలువ ఉంది. ఆత్మ నిర్భర్ భారత్ కోసం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఒక ముఖ్యమైన భాగం. ఆత్మ నిర్భర్ భారత్ అనేది ఒక ప్రభుత్వ కార్యక్రమం కాకూడదు. అది 130 కోట్ల దేశపౌరుల సంకల్పం అయి ఉండాలి. మనం దీని పట్ల గర్వపడాలి, ఏ విధమైన సందేహం ఉండకూడదు. మహాత్మా గాంధీ వంటి గొప్ప వ్యక్తులు మనకు ఈ మార్గాన్ని చూపించారు. మనం కొంత ఆ మార్గం నుంచి దారి తప్పినా మళ్ళీ తిరిగి ఆ మార్గం పైకి వచ్చి ఆత్మ నిర్భర్ భారత్ దిశగా ముందుకు సాగాలి. గ్రామం, పట్టణం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తూ మనం ఆత్మ నిర్భర్ భారత్ వైపు సాగాలి. మనం ఆ దిశగా వెళ్తున్నప్పుడు ఈ దేశంలోని సామాన్య పౌరుడి విశ్వాసం కూడా పెరుగుతుందని నేను నమ్ముతున్నాను. క్వశ్చన్ అవర్ లో జల జీవన్ మిషన్ పై చర్చ జరిగింది. చాలా తక్కువ సమయంలో మూడు కోట్ల కుటుంబాలకు కుళాయి ద్వారా తాగునీరు అందించడం జరిగింది. ప్రతి ఒక్కరూ ఆర్థిక వ్యవస్థలో వాటాదారులు గా ఉన్నప్పుడే స్వావలంబన సాధ్యమవుతుంది. మన సోదరి సోనాల్, తన ప్రసంగంలో సోదరీమణులు, కుమార్తెల భాగస్వామ్యం పై దృష్టి పెట్టడాన్ని వివరంగా చర్చించారు.

కరోనా కాలంలో అది రేషన్ కానివ్వండి, ఆర్థిక సహాయం లేదా ఉచిత సిలిండర్లు కానివ్వండి, ప్రభుత్వం మన తల్లులు, చెల్లెళ్ల పట్ల శ్రద్ధ వహించింది. వారు కూడా వీటిని నిర్వహించి ఒక శక్తిగా ఎదిగారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మహిళలు ఎంతో ఓపికతో వారి కుటుంబాలను జాగ్రత్తగా చూసుకున్నారు. వారు పరిస్థితులను నిర్వహించిన తీరు, ప్రతి కుటుంబంలో తల్లులు కరోనా కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో ముఖ్యమైన పాత్ర పోషించిన తీరు చూస్తే వారికి ఎన్ని కృతజ్ఞతలు తెలిపినా తక్కువే. ఇది మన సోదరీమణులు,

కుమార్తెలకు ఉన్న స్ఫూర్తి, అదేవిధంగా తల్లులు, సోదరీమణులు 'ఆత్మ నిర్భర్ భారత్' లో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తారని నమ్ముతున్నాను. నేడు యుద్ధభూమిలో మన కుమార్తెల భాగస్వామ్యం పెరుగుతుంది. కొత్తగా ఏర్పాటు చేసిన లేబర్ కోర్టులు ప్రతి రంగంలో పనిచేసే మన కుమార్తెలకు సమాన వేతనం పొందే హక్కును ఇచ్చాయి. ముద్ర పథకం కింద 70 శాతం రుణాలు మన సోదరీమణులు పొందుతున్నారు. ఒక విధంగా ఇది అదనం. 7కోట్ల మహిళల భాగస్వామ్యం తో 60 లక్షల స్వయం సహాయక బృందాలు ఈరోజు ఉన్నాయి. ఇవన్నీ కూడా ఆత్మ నిర్భర్ భారత్ దిశగా మన ప్రయత్నాలకు కొత్త బలాన్ని ఇస్తున్నాయి.

మనం భారత దేశ యువ శక్తికి ఎంత ప్రాధాన్యత ఇచ్చి, ఎక్కువ అవకాశాలు ఇస్తామో, అది మన దేశ ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది గా మారుతుంది అనేది నా అభిప్రాయం. కొత్త జాతీయ విద్యా విధానం మన యువతరానికి కొత్త అవకాశాలు ఇవ్వడానికి చేసిన ప్రయత్నం. విద్యా విధానాన్ని చర్చించడానికి కొంత సమయాన్ని కేటాయించడం నాకు సంతోషాన్ని ఇచ్చింది. విద్యా విధానాన్ని దేశం అందుకున్న తీరు కొత్త నమ్మకాన్ని సృష్టించింది. కొత్త విద్యా విధానం దేశంలో విద్యను కొత్త విధంగా అందించడంలో సహాయపడుతుందని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. మన ఎం ఎస్ ఎం ఈ రంగంలో ఉపాధి కి ఎక్కువ అవకాశాలు లభిస్తున్నాయి. కరోనా కాలంలో ఉద్దీపన ప్రకటించినప్పుడు ఎం ఎస్ ఎం ఈ లపై పూర్తి దృష్టి పెట్టడం జరిగింది. దాని ఫలితంగానే మన ఎం ఎస్ ఎం ఈ లు ఆర్థిక పునరుద్ధరణలో చాలా పెద్ద పాత్ర పోషిస్తున్నాయి, దానిని మనం ముందుకు తీసుకు వెళ్తున్నాము.

మేము మొదటినుంచి 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' అనే మంత్రం తోనే ముందుకు వెళ్తున్నాము. ఈ కారణంగానే ఈశాన్య ప్రాంతాలు, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు క్రమంగా తగ్గుతూ అక్కడ ఉన్న సహ పౌరులకు అభివృద్ధి ప్రధాన స్రవంతిలోకి

తిరిగి వచ్చే అవకాశాలు లభిస్తున్నాయి. భారతదేశ ఉజ్వల భవిష్యత్తు లో తూర్పు భారతదేశం చాలా పెద్ద పాత్ర పోషించబోతుందని నేను స్పష్టంగా చూడగలుగుతున్నాను.

నేను గులాంనబీ గారిని వింటున్నాను. ఏదేమైనా మృదువుగా, సున్నితంగా మాట్లాడుతూ కఠిన పదాలను ఉపయోగించకపోవడం గులాం నబీ గారి స్వభావం. పార్లమెంట్ సభ్యులు అందరూ వారి నుంచి ఈ విషయం నేర్చుకోవాలి, అలా చేయమని వారిని నేను కోరుతున్నాను. వారు జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఎన్నికలని ప్రశంసించారు. జమ్ము కాశ్మీర్ వారి హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుందని వారు చెప్పారు. ఇది సహజం ఎందుకంటే జమ్మూ కాశ్మీర్ పట్ల ఇదే స్ఫూర్తి దేశమంతటా ఉంది. జమ్మూ కాశ్మీర్ ని సొంత కాళ్లపై నిలబెట్టడానికి పంచాయతీ,బి డి సి, డి డి సి ఎన్నికలు నిర్వహించడం జరిగింది, గులాంనబీ గారు దీనిని మెచ్చుకున్నారు. ఈ విధమైన అభినందనలు తెలియజేసినందుకు వారికి నా కృతజ్ఞతలు. మీరు నన్ను పొగిడినందుకు భయపడుతున్నాను. మీ పార్టీ దీనిని సరైన స్ఫూర్తితో తీసుకుంటుందని నేను నమ్ముతున్నాను, జి 23 అభిప్రాయంగా దీనిని తీసుకోదని అనుకుంటున్నాను.

గౌరవనీయులైన చైర్మన్ గారు, కరోనా ప్రత్యేక కాలంలో కూడా సరిహద్దు వద్ద సవాలు చేసే ప్రయత్నాలు జరిగాయి. మన సహ సైనికులు వారి ధైర్యాన్ని, బలాల్ని చూపిస్తూ అద్భుతమైన సమాధానం ఇచ్చారు. ప్రతి భారతీయుడు వారిపట్ల గర్వపడుతున్నారు. కష్టకాలంలో కూడా మన జవాన్లు మన దేశాన్ని రక్షించారు. మన జవానుల శౌర్యం ని మెచ్చుకున్న నా సహచరులు అందరికీ నా కృతజ్ఞతలు. వాస్తవాధీన రేఖ పై భారతదేశం వైఖరి చాలా స్పష్టంగా ఉంది. దేశం ఆ వైఖరి పట్ల గర్వంగా ఉంది. సరిహద్దు మౌలిక సదుపాయాలు, సరిహద్దు భద్రత పట్ల మా నిబద్ధత లో ఏ విధమైన సడలింపు ఉత్పన్నమయ్యే ప్రశ్న లేదు. మా ఆలోచనలు, ఉద్దేశాలు తెలిసినవారు ఈ విషయంలో మమ్మల్ని ఎప్పటికీ ప్రశ్నించరు.

మేము నిబద్ధతగల వ్యక్తులని వారికి తెలుసు, ఈ విషయాల పట్ల మేము మరోలా ఆలోచించము.

గౌరవనీయులైన చైర్మన్ గారు, సభలో ప్రశంసనీయమైన చర్చ జరిపినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. చివరిగా నేను ఒక మంత్రాన్ని ప్రస్తావించి నా ఉపన్యాసానికి స్వల్ప విరామం ఇస్తాను. వేదాల నుంచి మనకి గొప్ప ఆలోచనలు వస్తాయి, ఈ మంత్రం 130 కోట్ల పౌరులకు గొప్ప ప్రేరణ. ఆ మంత్రం ఈ విధంగా ఉంది

అయుతో అహం, అయుతో మే ఆత్మ, అయుతం మే, అయుతం చక్షుః, అయుతం శ్రోత్రం. అంటే "నేను ఒక్కడిని కాదు నేను ఒంటరిగా లేను, నేను కోట్ల మందిని చూస్తూ వారి సహచర్యాన్ని అనుభవిస్తున్నాను." కాబట్టి నా ఆధ్యాత్మిక శక్తి కోట్లమందిది, నా దృష్టి లక్షలాదిమందిది, వినికిడి శక్తి లక్షలాది మందిది, నా కర్మ శక్తి కూడా. గౌరవనీయులైన చైర్మన్ గారు, వేదాల స్ఫూర్తితో, స్పృహతో, 130 కోట్లకు పైగా దేశ పౌరులతో భారతదేశం ప్రతి ఒక్కరి తో ముందుకు సాగుతుంది. ఈరోజు 130 కోట్ల పౌరుల కలలు భారత దేశ కలలు. ఈరోజు 130 కోట్ల పౌరుల ఆకాంక్షలు, ఈ దేశం ఆకాంక్షలు. ఈరోజు 130 కోట్ల పౌరుల భవిష్యత్తు, భారత ఉజ్వల భవిష్యత్తుకు హామీ. అందుకే ఈరోజు దేశం, విధానాలను రూపొందిస్తున్నపుడు తక్షణ లాభం లేదా నష్టం కోసం కాకుండా దీర్ఘకాల ప్రయోజనాల కోసం ప్రయత్నాలు చేస్తోంది. దేశం 2047 లో స్వతంత్ర శతాబ్దాన్ని జరుపుకోవడానికి, ఈరోజు కొత్త శిఖరాలను చేరుకునే కలలకు పునాది వేస్తున్నాము, ఆ పనిని పూర్తి చేయగలమన్న నమ్మకం నాకు ఉంది.

గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగానికి నేను మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సభలో చర్చ జరిగిన తీరు, చర్చ జరిగిన వాతావరణం చాలా బాగుంది

అనే వాస్తవం మీకు చెప్పాలనుకుంటున్నాను. ఎవరు ఎంతో బాగా మాట్లాడారు, నాపై దాడులు కూడా జరిగాయి. ఏది ఏమైనా నేను మీకు సహాయ పడగలగడం నేను ఆనందించే విషయం. కరోనా కారణంగా మీరు ఎక్కడికి వెళ్ళలేక పోతున్నారు, ఇళ్లలోనే ఉంటున్నారు. కాబట్టి కొంత ఆందోళనకరమైన క్షణాలు మీరు మీ ఇంట్లో అనుభవించి ఉండొచ్చు. ఇప్పుడు మీ కోపాన్ని ఇక్కడ వెళ్లగక్కారు కాబట్టి మీరు కొంత తేలికపడి ఉంటారు. ఇప్పుడు మీరు మీ ఇంట్లో సమయాన్ని ఆనందంగా గడపవచ్చు. మీకు ఆనందం లభించడానికి నేను సహాయపడగలగడం, ఒక గౌరవంగా నేను భావిస్తున్నాను. మీరు ఈ విధమైన ఆనందకరమైన క్షణాలు ఎప్పుడూ అనుభవించాలని కోరుకుంటున్నాను. చర్చిస్తూ ఉండండి, సభను సజీవంగా ఉంచండి. మోది ఇక్కడ ఉన్నారు, కాబట్టి ఈ అవకాశాన్ని ఆస్వాదించండి.

చాలా కృతజ్ఞతలు.

రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సందర్భంగా
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి
ఉపన్యాసం.

9 ఫిబ్రవరి 2021

రాజ్యసభ సభ్యులకు వీడ్కోలు - 9 ఫిబ్రవరి 2021

ఈ సభ ప్రతిష్టను పెంచి, సభను చైతన్య పరచి, సభ ద్వారా ప్రజా సేవలో నిమగ్నమైన మన నలుగురు సహచరులు, వారి పదవీకాలం ముగియబోతున్న తరుణంలో కొత్త జీవనం వైపు పయనిస్తున్నారు.

శ్రీ గులాం నబీ ఆజాద్ గారు, శ్రీ షంషేర్ సింగ్ గారు, మీర్ మహమ్మద్ ఫియాజ్ గారు, నజీర్ అహ్మద్ గారు; మీ అనుభవాలతో, మీ జ్ఞానంతో ఈ సభ ప్రతిష్టను పెంచినందుకు, దేశ ప్రయోజనం కోసం, మీ ప్రాంతంలోని సమస్యల పరిష్కారానికి తోడ్పడిన నలుగురు ప్రముఖులకు ముందుగా నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సభలో నా సహచరులు మీర్ మహమ్మద్ గారు, నజీర్ అహ్మద్ గారు వీరిద్దరినీ చాలా కొద్దిమంది గమనించి ఉండవచ్చు, కాని నా గదిలో వారు పంచుకున్న విభిన్న విషయాలను వినకుండా, అర్థం చేసుకోకుండా ఒక్క సెషన్ కూడా గడవలేదు. వారు కాశ్మీర్‌కు సంబంధించిన సూక్ష్మ విషయాలను పంచుకునేవారు. మేము కూర్చుని మాట్లాడేటప్పుడు, వారు నా ముందు వేర్వేరు కోణాలను, వివిధ అంశాలను ఉంచేవారు; నా ముందు ఉంచిన చాలా అంశాలు నాకు కూడా ఎంతో శక్తినిచ్చాయి. కాబట్టి, నాతో వారి వ్యక్తిగత బంధానికి, వారి నుంచి నేను అందుకున్న సమాచారం కోసం మా సహచరులు ఇద్దరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. వారి నిబద్ధత, సామర్థ్యం, దేశానికి ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్‌కు పని చేస్తుందని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. దేశ ఐక్యత, ఆనందం, శాంతి, శ్రేయస్సు పెరగడం కోసం ఇది ప్రయోజనకరంగా ఉంటుందని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను.

మన సహచరులలో ఒకరైన, షంషేర్ సింగ్ గారు, నేను నా సంస్థకు సంబంధించిన పనిలో ఉన్నాను కనుక, నేను అతనితో ఎన్ని సంవత్సరాలు పనిచేశానో కూడా గుర్తు లేదు. చాలా సంవత్సరాలు నాకు జమ్మూ కాశ్మీర్‌లో పనిచేసే అవకాశం కూడా లభించింది, కాబట్టి నా తోటి కార్మికుడిగా స్కూటర్‌లో ప్రయాణించే అవకాశం వచ్చింది. చాలా చిన్న వయస్సులో అత్యవసర పరిస్థితుల్లో జైలుకు వెళ్ళిన వారిలో షంషేర్ సింగ్ కూడా ఉన్నారు. ఈ సభలో షంషేర్ జి హాజరు శాతం 96%. ప్రజలు తనకు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చడానికి ఆయన చేసిన ప్రయత్నాలలో ఉన్న తీవ్రతను ఇది తెలియజేస్తుంది. తను 100 శాతం ఇచ్చారు. ఆయన మృదువుగా మాట్లాడేవారు, సరళుడు. జమ్మూ కాశ్మీర్ నుండి పదవీ విరమణ చేస్తున్న నలుగురు గౌరవనీయ సభ్యుల జీవితాల్లో ఈ పదవీకాలం ఉత్తమ దశ అని నేను నమ్ముతున్నాను, ఎందుకంటే చరిత్ర కొత్త మలుపు తీసుకుంది, వారు దానికి సాక్షిగా మారారు. ఇది వారి జీవితంలో ఒక ప్రధాన సంఘటన.

గులాం నబీ జీ తర్వాత ఎవరు ఈ పదవిని చేపట్టినా, గులాం నబీ జీతో సరిపోల్చడం చాలా కష్టమవుతుందని నేను అనుకుంటున్నాను. ఎందుకంటే గులాం నబీ గారు తమ పార్టీ గురించి మాత్రమే కాకుండా దేశం, సభ పట్ల కూడా అంతే శ్రద్ధ తీసుకునేవారు. ఇది చిన్న విషయం కాదు; అవును, ఇది చాలా పెద్ద విషయం. చాలా ముఖ్యమైన విషయం. లేదంటే సాధారణంగా ప్రతిపక్ష నేతగా పెత్తనం చెలాయించాలని ప్రజలు కోరుకుంటారు. కానీ ఆయన, శరద్ పవార్ వంటి నాయకులు ఎప్పుడూ సభకు, దేశానికి ప్రాధాన్యం ఇచ్చారు. గులాం నబీ గారు ప్రశంసనీయమైన పని చేశారు!

కరోనా కాలంలో ఫ్లోర్ లీడర్ల సమావేశం జరిగిన రోజు నాకు ఇప్పటికీ గుర్తుంది; అదే రోజు గులాం నబీ గారి నుంచి నాకు ఫోన్ వచ్చింది. "మోడీజీ, ఇదంతా బాగానే ఉంది, కానీ దయచేసి ఒక పని చేయండి, పార్టీ నాయకులందరి సమావేశాన్ని పిలవండి" అని ఆయన

అన్నారు. పార్టీ నాయకులతో, పార్టీ అధ్యక్షులందరితో కూర్చుని చర్చించమని ఆయన నన్ను సూచించిన వాస్తవాన్ని నేను నిజంగా ఇష్టపడ్డాను, అభినందించాను. గులాం నబీ జీ సూచన మేరకు నేను చేసాను... ఈ విషయం చెప్పనివ్వండి.... ఈ విధమైన సమాచార మార్పిడికి మూలకారణం, ఆయనకు రెండు పక్షాల అనుభవం ఉంది - అధికార పక్షం, ప్రతిపక్షం. 28 ఏళ్ల పదవీకాలం అనేది చాలా పెద్ద విషయం.

ఇది చాలా కాలం క్రితం, బహుశా అటల్జీ పదవీకాలంలో, నాకు ఖచ్చితంగా గుర్తు లేదు. నేను సభలో ఏదో పని కోసం ఇక్కడకు వచ్చాను. నేను అప్పుడు రాజకీయాల్లో లేను, అంటే ఎన్నికల రాజకీయాల్లో కాదు. నేను సంస్థ కోసం పని చేసేవాడిని. కాబట్టి, నేను, గులాం నబీ జీ ఒకే లాబీలో చర్చలు చేస్తున్నాము. జర్నలిస్టులకు ప్రతి ఒక్కరిపై నిఘా ఉంచే అలవాటు ఉన్నందున, ఈ ఇద్దరూ స్నేహపూర్వకంగా ఎలా మాట్లాడతారని వారు భావించారు? మేము మాట్లాడుతుండగా, నవ్వుతుండగా, మేము బయటకు రాగానే విలేకరులు మమ్మల్ని చుట్టుముట్టారు. గులాం నబీ గారు అప్పుడు ఓ అద్భుతమైన సమాధానం ఇచ్చారు. ఆ సమాధానం మనకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అతను చెప్పాడు, 'సోదరా..!, మీరు వార్తాపత్రికలలో మా పోరాటాల గురించి చదివారు, మీరు టీవీలో లేదా బహిరంగ సమావేశాలలో మేము పోట్లాడుతున్నట్లు మీరు చూస్తున్నారు, కాని వాస్తవానికి కుటుంబం లాంటి అనుబంధం మాకు ఉంది. మాకు బలమైన బంధం ఉంది, ఆనందాన్ని, దు:ఖాన్ని పంచుకుంటాం.' ఈ స్ఫూర్తి చాలా కీలకమైనది.

గులాం నబీ గారి అభిరుచి గురించి చాలా కొద్ది మందికి తెలుసు, మీరు ఎప్పుడైనా ఆయనతో కూర్చుంటే, ఆయన దాని గురించి మీకు చెప్తాడు. మనం ప్రభుత్వ బంగ్లాల్లో నివసిస్తుంటే, మన దృష్టి బంగ్లా గోడలపై లేదా సోఫా సెట్లపైనే ఉంటుంది, కాని గులాం నబీ గారు ఆ బంగ్లాలో ఒక తోటను పెంచారు, అది కాశ్మీర్ లోయలను గుర్తు చేస్తుంది. ఆయన

దాని గురించి చాలా గర్వపడుతూ ఉంటారు, ఆయన దానికి సమయం ఇస్తారు. కొత్త విషయాలను జోడిస్తూ ఉంటారు. పోటీలో ప్రతిసారీ, వారి బంగ్లా మొదటి స్థానంలో ఉంటుంది. అంటే తన అధికారిక స్థానాన్ని ఎంతో ప్రేమతో నిర్వహించాడు. ఆయన హృదయపూర్వకంగా ఆ పని చేశాడు.

మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, నేను కూడా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసేవాడిని. ఆ కాలంలో మేము చాలా దగ్గరగా ఉండేవారం. మన మధ్య సంబంధం ఎప్పుడూ కొనసాగుతూనే ఉంది, లేదు అనడానికి ఒక్క సందర్భం కూడా లేదు. గుజరాత్ నుంచి వచ్చే పర్యాటకులు జమ్మూ కాశ్మీర్ కు వెళ్లే మొత్తం పర్యాటకుల్లో భారీ వాటా కలిగి ఉన్నారు. ఒకసారి ఆ యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేశారు. బహుశా ఎనిమిది మంది మరణించారు. వెంటనే నాకు గులాం నబీ గారి నుంచి ఒక ఫోన్ వచ్చింది, ఆ ఫోన్ కాల్ కేవలం సమాచారం అందించడం కొరకు కాదు. ఫోన్ లో అతని కన్నీళ్లు ఆగలేదు. ఆ సమయంలో ప్రణబ్ ముఖర్జీ రక్షణ మంత్రిగా ఉన్నారు. ఆయనకు ఫోన్ చేసి, “సార్, మృతదేహాలను తీసుకురావడానికి భద్రతా బలగాల విమానం సాధ్యమేనా" అన్నాను. అప్పుడు అర్ధరాత్రి అయ్యింది., "చింతించకండి, నేను ఏర్పాట్లు చేస్తాను" అని అన్నారు శ్రీ ముఖర్జీ. కానీ రాత్రి పూట గులాం నబీ గారు మళ్ళీ ఫోన్ చేసినప్పుడు, ఆయన ఎయిర్ పోర్ట్ లో ఉన్నారు. ఆ రాత్రి, ఆయన విమానాశ్రయం నుండి నాకు ఫోన్ చేశాడు, ఒక కుటుంబ సభ్యుడి వలె చాలా ఆందోళన చెందాడు. పదవులు, అధికారం అనేవి జీవితంలో వస్తూ ఉంటాయి. కానీ వాటిని ఎలా నిర్వహించాలో... ఇది నాకు చాలా భావోద్వేగ క్షణం. మరుసటి రోజు అందరూ చేరుకున్నారా అని అడుగుతూ నాకు కాల్ వచ్చింది. అందువల్ల, స్నేహితుడిగా, గులాం నబీ జి, అతని అనుభవాలు, సంఘటనలన్నింటినీ నేను గౌరవిస్తాను. ఆయన ఆప్యాయత, వినయం, ఈ దేశం కోసం ఏదైనా చేయాలన్న అతని కోరిక, ఆయనని ఎప్పుడూ ఒక చోట

ప్రశాంతంగా కూర్చోనివ్వదని నేను నమ్ముతున్నాను. అతను ఏ బాధ్యతను నిర్వహిస్తారో నాకు ఖచ్చితంగా తెలుసు, అతను ఖచ్చితంగా విలువను జోడిస్తారు, అతని సహకారాన్ని అందిస్తారు, దేశం కూడా అతని నుండి ప్రయోజనం పొందుతుంది అని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఆయన చేసిన సేవలకు మరోసారి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సభకు తాను ఇక ఏమాత్రం చెందరని భావించవద్దని వ్యక్తిగతంగా కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. సభలోని నలుగురు గౌరవనీయులైన సభ్యులందరికీ నా తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి. మీ ఆలోచనలు, మీ సూచనలు కూడా స్వాగతించదగినవే, ఎందుకంటే మీ అనుభవాలు దేశానికి ఎంతో ముఖ్యమైనవి, ఉపయోగకరమైనవి. అందువల్ల నేను కూడా అదే ఆశిస్తాను. నేను మిమ్మల్ని పదవీ విరమణ చేయనివ్వను. మరోసారి, శుభాకాంక్షలు!

ధన్యవాదాలు

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి
ధన్యవాద తీర్మానంపై ప్రధానమంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారి సమాధానం.

10 ఫిబ్రవరి 2021

లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం - 10 ఫిబ్రవరి 2021

గౌరవనీయులైన అధ్యక్ష్య,

రాష్ట్రపతి గారి ప్రోత్సాహకరమైన ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై చర్చలో పాల్గొనడానికి, రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలపడానికి నేను కొన్ని మాటలు జోడించాలనుకుంటున్నాను. రాష్ట్రపతి గారి ప్రసంగం భారత దేశ 130 కోట్ల మంది పౌరుల సంకల్ప శక్తికి ప్రతిబింబం. క్లిష్టమైన, ప్రతికూల పరిస్థితులలో కూడా, ఈ దేశం తన మార్గాన్ని ఎలా ఎంచుకుంటుందో, మార్గాన్ని ఎలా నిర్ణయిస్తుందో, దాన్ని సాధించడంలో ముందుకు ఏ విధంగా సాగుతుందో, రాష్ట్రపతి గారు తన ప్రసంగంలో వివరంగా చెప్పారు. దేశంలోని ప్రజలలో కొత్త విశ్వాసాన్ని కలిగించడం, దేశం కోసం ఏదైనా చేసేవిధంగా ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తుంది. కాబట్టి మన కృతజ్ఞతను ఎంత ఎక్కువగా వ్యక్తం చేసినా అంత తక్కువే. ఈ సభలో 15 గంటలకు పైగా చర్చ జరిగింది. చర్చను ఫలవంతమైనదిగా, అర్థవంతంగా చేయడం లో మన గౌరవనీయ పార్లమెంటు సభ్యులందరూ రాత్రి 12 గంటల వరకు మేల్కొని ఉన్నారు. ఈ సందర్భంగా అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నేను ముఖ్యంగా మన మహిళా ఎంపీలకు కృతజ్ఞతలు తెలియజేయాలనుకుంటున్నాను. ఈ చర్చలో వారు అధికంగా పాల్గొని, పదునైన ఆలోచనలు వ్యక్త పరిచారు. విషయాలని శోధించి మన ముందు ఉంచే ప్రయత్నం చేశారు. వారిని వారు ఈ విధంగా సిద్ధం చేసుకుని ఈ సభని సుసంపన్నం చేశారు. అందువల్ల మహిళా పార్లమెంటు సభ్యుల సంసిద్ధత, వారి తర్కం, అవగాహన కు నేను ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నాను.

గౌరవనీయులైన అధ్యక్ష్య,

భారత దేశం స్వాతంత్ర్యం పొందిన 75వ సంవత్సరం లో మనం అడుగు పెడుతున్న వేళ, 75 సంవత్సరాల పండగ ప్రతి భారతీయుడికి గర్వకారణం, మనం ముందుకు సాగడానికి ఒక వేడుక లాంటిది కూడా. అందువల్ల, సామాజిక వ్యవస్థలో, మనం ఎక్కడ ఉన్నా, ఏ మూల ఉన్నా, మనం సాంఘిక, ఆర్థిక వ్యవస్థలో ఎక్కడ ఉన్నా, మనమంతా కలిసి ఈ స్వాతంత్ర్య పండుగ నుండి ఒక కొత్త ప్రేరణను పొందుదాం. 2047 లో దేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని జరుపుకునే సమయానికి, ఈ 25 ఏళ్లలో మనం ఈ దేశాన్ని ఎక్కడికి తీసుకెళ్లాలి, ఈ దేశం ప్రపంచంలో ఎక్కడ ఉండాలి, ఈ సంకల్పం దేశంలోని ప్రతి పౌరుడి హృదయంలో ఉండాలి. అది ఈ పరిసరాల పని, ఈ సముదాయము, ఈ పవిత్ర భూమి బాధ్యత, ఈ పంచాయితీ పని.

గౌరవనీయులైన అధ్యక్ష్య,

దేశానికి స్వాతంత్ర్యం లభించిన్నప్పుడు, చివరి బ్రిటిష్ కమాండర్ ఇక్కడనుంచి వెళ్తూ, భారతదేశం అనేక దేశాల ఖండమని, దాన్ని ఎవరూ ఒక దేశంగా చేయలేరని ఆయన అన్నారు. ఈ విధమైన ప్రకటనలు చేశారు. కానీ భారత్ ప్రజలు ఈ అభిప్రాయాన్ని భగ్నం చేశారు. ఈ రకమైన సందేహాలున్నవారు తొలగించబడ్డారు. మన స్వంత ఆకాంక్షలు, మన సాంస్కృతిక ఐక్యత, మన సంప్రదాయలతో నేడు ప్రపంచం ముందు ఒక దేశంగా, ప్రపంచం కోసం ఒక ఆశాకిరణం గా నిలబడి ఉన్నాం. 75 ఏళ్ల మన ప్రయాణంలో ఇది సాధ్యం అయ్యింది. భారతదేశం ఒక మాయభరిత ప్రజాస్వామ్యమనే భ్రమలను కూడా మనం పటాపంచలు చేశాం. ఈ విధంగా మన శ్వాసలో ప్రజాస్వామ్యం అల్లబడుతుంది. ప్రతి ఆలోచన, ప్రతి ప్రయత్నం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిండి ఉంటుంది. మనకు చాలా ఎన్నికలు

జరిగాయి, పాలన లో మార్పులు వచ్చాయి, చాలా సులభంగా అధికార మార్పులు జరిగాయి. మారిన అధికార వ్యవస్థను కూడా అందరి హృదయాలు ఆమోదించాయి.

గౌరవనీయులైన అధ్యక్ష్య,

75 సంవత్సరాల క్రమంలో, ప్రజాస్వామ్య విలువల కోసం వైవిధ్యం చూపిన దేశం మనది. వందలాది భాషలు, వేలాది మాండలికాలు, విభిన్న శైలులు. ఏదీ వైవిధ్యాలతో నిండి లేదు? అయినప్పటికీ, మనము దీన్ని సాధించడం ద్వారా ఒక లక్ష్యాన్ని, మార్గాన్ని చూపించాము. ఈ రోజు మనం భారతదేశం గురించి మాట్లాడేటప్పుడు, సహజంగానే స్వామి వివేకానంద చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. వివేకానందుడు, ప్రతి దేశానికి, నెరవేర్చాల్సిన విధి, చేరడానికి ఒక లక్ష్యం, అందించడానికి ఒక సందేశం ఉంటుందని చెప్పారు. అంటే ప్రతీ దేశం వద్ద ఒక సందేశం ఉంటుంది, దాన్ని అందరికీ అందచేయాలి. ప్రతి దేశానికి సాధించాల్సిన లక్ష్యం ఉంటుంది. ప్రతి దేశానికి నెరవేర్చే విధి ఉంటుంది. కరోనా సమయంలో భారతదేశం తనను తాను సంభాలించుకుని, ప్రపంచాన్ని నిలబెట్టడానికి సహాయపడిన విధానం ఒక మలుపు. మేము వేదాల నుండి వివేకానంద వరకు, మేము భావాలు, సంస్కారాలు నేర్చుకుని ఎదిగాము.

అవే

సర్వే భవంతు సుఖినః । యే సర్వే భవంతు సుఖినః । సర్వే సంతు నిరామయా ।

గౌరవనీయులైన అధ్యక్ష్య,

కరోనా కాలంలో భారత్ అది చేసి చూపించింది. భారతదేశం, ఆత్మనిర్భర్ భారత్ రూపంలో ఒక దాని తర్వాత ఒకటి, దృఢమైన చర్యలు తీసుకుంది, సాధారణ ప్రజానీకం కూడా

కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. కానీ, రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన రోజులను మనం గుర్తుచేసుకుందాం. రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచాన్ని కుదిపేసాయి. మానవ విలువలు సంక్షోభంలో పడ్డాయి. నిరాశ ప్రబలంగా ఉంది, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఒక కొత్త క్రమం ఏర్పడింది. సైనిక సహకారం కాదు శాంతి మార్గాన్ని అనుసరించాలనే ప్రతిజ్ఞ తీసుకోబడింది. ఈ మంత్రం ప్రపంచమంతా వ్యాపించి ఉంది. ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేయబడింది. సంస్థలు నిర్మించబడ్డాయి. వివిధ రకాల యంత్రాంగాలు సృష్టించబడ్డాయి, తద్వారా ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం శాంతి దిశలో సజావుగా సాగాలి. కానీ ఆ అనుభవం మరోలా మారింది. ఆ అనుభవం ఏమిటంటే, ప్రపంచంలో శాంతి ని గురించి, ప్రపంచ యుద్ధం తరువాత, ప్రతి ఒక్కరూ శాంతి లో ఉన్న శక్తి గురించి మాట్లాడటం ప్రారంభించారు. కానీ తమ సైనిక శక్తిని పెంచుకోవడం ప్రారంభించారు.

ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచానికి ఉన్న సైనిక శక్తి, ఐరాస ఏర్పడ్డ తరువాత, చాలా రెట్లు పెరిగింది. చిన్న దేశాలు కూడా సైనిక శక్తి పెంచుకోవడంలో పోటీపడటం ప్రారంభించాయి. శాంతి గురించి చాలా చర్చ జరిగింది, కానీ వాస్తవం ఏమిటంటే, గొప్ప శక్తులు, బలమైన శక్తులు సైనిక శక్తి వైపు వెళ్ళాయని ప్రపంచం అంగీకరించాలి. ఈ కాలంలో చేసిన ఆవిష్కరణలు, పరిశోధనల సంఖ్య, సైనిక శక్తి కోసం జరిగాయి. కరోనా తర్వాత కూడా, ఒక కొత్త ప్రపంచ క్రమం కనబడుతుంది. కరోనా తరువాత ప్రపంచంలో సంబంధాల వాతావరణం ఒక కొత్త రూపు తీసుకుంటుంది.

గౌరవనీయులైన అధ్యక్ష్యా,

మారుతున్న ప్రపంచాన్ని మనం మౌన ప్రేక్షకులుగా చూస్తూ, ఎక్కడో ఒకచోట మనల్ని మనం సర్దుబాటు చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఆ కాలంలో మనం ఎదుర్కొన్న

పరిస్థితులు అవే. నేడు కరోనా తర్వాత కాలం లో కొత్త ప్రపంచ క్రమం సిద్ధం కానుంది. ఇది ఏ రూపంలో ఉంటుందో, అది ఎలా ప్రారంభమవుతుందో, సమయమే చెబుతుంది. కానీ, ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభం వల్ల, ప్రపంచం దాని గురించి ఆలోచించక తప్పలేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ ను ప్రపంచం నుంచి వేరుగా ఉంచలేం. భారతదేశం ఒక మూలన మనుగడ సాగించజాలదు. మనం కూడా బలమైన ఆటగాడిగా ఎదగాలి. కానీ కేవలం జనాభా ప్రాతిపదికన, మనం ప్రపంచంలో బలవంతులమని చెప్పలేం. అది ఒక శక్తి, కాని అది సరిపోదు. నూతన ప్రపంచ క్రమంలో, భారతదేశం సాధికారత కలిగి ఉండాలి, భారతదేశం తన స్థానాన్ని మార్చుకోగల సామర్థ్యం కలిగి ఉండాలి. దానికి మార్గం స్వావలంబన భారతదేశం. ఈ రోజు ఫార్మసీ రంగంలో మనం స్వయం సమృద్ధిగా ఉన్నాము. భారతదేశం స్వావలంబన దిశగా సాగుతుంది.. మన అణువణువునా, **सर्वे भवंतु सुखिनः** అనే ఒక మంత్రం ఉంది. మనం ప్రపంచ సంక్షేమం కోసం పనిచేస్తాము. అది ఎంత శక్తివంతమైతే, మానవ సంక్షేమానికి, ప్రపంచ శ్రేయస్సుకోసం అంత పెద్ద పాత్ర పోషించగలుగుతుంది. కాబట్టి, స్వావలంబన కలిగిన భారతదేశం అనే ఈ భావనను మనం బలోపేతం చేయవలసి ఉంటుంది. ఇది ఏ రాజకీయ నాయకుడి ఆలోచన కాదు. నేడు, భారతదేశమంతటా “Vocal for local” వినబడుతుంది. ప్రజలు స్థానిక ఉత్పత్తులను చేతితో చేస్తారు. ఈ విధమయిన ఆత్మ గౌరవం ఒక స్వావలంబన భారతదేశం కోసం ఉపయోగ పడుతుంది, మన ఆలోచనలు, విధానాలు, నిర్ణయాలు స్వావలంబన కోసం అవసరమయిన మార్పులు తీసుకువచ్చే దిశగా ఉంటాయని నేను నమ్ముతున్నాను, అదే నా అభిప్రాయం కూడా.

గౌరవనీయులైన అధ్యక్ష్య,

దాదాపు అందరూ గౌరవనీయ సభ్యులు ఈ చర్చలో కరోనా గురించి చర్చించారు. ప్రపంచంలోని గొప్ప నిపుణులు అంచనా వేసి, కరోనా వల్ల ఎంత నష్టం కలగనుందో చెప్పారు.

భారతదేశంలో భయావహ వాతావరణాన్ని సృష్టించడానికి అన్ని ప్రయత్నాలు జరిగాయి. తెలియని శత్రువు ఉన్నాడు, కాబట్టి ఎవరూ నమ్మకంగా ఏమీ చెప్పలేరు. నమ్మకంగా ఎవరూ ఏమీ చేయలేరు. అటువంటి అదృశ్య శత్రువు పై పోరాడవలసి వచ్చింది. ఇంత పెద్ద దేశం, ఎక్కువ జనసాంద్రత కలిగిన దేశం, తక్కువ వ్యవస్థలు ఉన్న దేశం, ప్రపంచానికి అనుమానం కలగడం సహజం. ప్రపంచంలోని అతిపెద్ద దేశాలు కరోనా ముందు మోకరిల్లిన్నప్పుడు, భారతదేశం ఎలా నిలబడగలదు? ఇప్పుడు భారతదేశంలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉంటే, ప్రపంచాన్ని ఎవరూ రక్షించలేరనే సమీకరణాలను కూడా వర్తింపచేశారు. అటువంటి పరిస్థితిలో, 130 కోట్ల మంది దేశవాసుల క్రమశిక్షణ, వారి అంకితభావం ఈ రోజు మనలను రక్షించింది. 130 కోట్ల భారతీయులకి పేరు దక్కుతుంది, దానిని మనం గౌరవించాలి. భారతదేశానికి ఒక గుర్తింపును సృష్టించే అవకాశం కూడా ఇదే. మనల్ని మనం నిందించుకుంటూనే, మమ్మల్ని స్వీకరించమని ప్రపంచాన్ని కోరడం ఎప్పుడూ సాధ్యం కాదు. మేము ఇంట్లో కూర్చుని మా లోపాలను గుర్తించి సరిదిద్దడానికి ప్రయత్నిస్తాము. కానీ మనం ప్రపంచం ముందుకు వెళ్ళే అనుభవాన్ని కూడా విశ్వాసంతో ఉంచుతాము. అప్పుడు ప్రపంచం మనలను స్వీకరిస్తుంది. మీరు మీ పిల్లలను ఇంట్లో స్వీకరించకపోతే బయట పిల్లవాడిని ఎవరూ స్వీకరించరు. ఇది ప్రపంచ నియమం కాబట్టి మనం ఈ మాట చెప్పుకోవాలి.

గౌరవనీయులైన అధ్యక్ష్య,

మనీష్ తివారీ గారు ఒక విషయం చెప్పారు. "దేవుని దయవల్ల, మేము కరోనా నుంచి బయటపడ్డాము" అని అతను చెప్పాడు. నేను తప్పకుండా దీని గురించి చెప్పాలనుకుంటున్నాను. ఇది దేవుని దయ. ఈ సమస్య వలన ప్రపంచం అతలాకుతలం అయ్యింది. మనము దేవుని దయ వలన బయటపడ్డాము.. ఎందుకంటే వైద్యులు, నర్సులు దేవుని రూపంలో వచ్చారు. ఎందుకంటే ఆ డాక్టర్లు, నర్సులు తమ పిల్లలతో సాయంత్రం

ఇంటికి తిరిగి వస్తామని చెబుతారు. 15 రోజుల వరకు తిరిగి వెళ్లలేదు. వారు దేవుని రూపంలో చెప్పేవారు. మనము కరోనా పై గెలవగలిగాము. ఎందుకంటే పారిశుధ్య కార్మికులు, వారి జీవితాన్ని పణంగా పెట్టి పని చేశారు. రోగి వద్దకు వెళ్లడానికి ఎవరూ సాహసించన్నప్పుడు, పారిశుధ్య కార్మికులు అక్కడకు వెళ్లి శుభ్రతను నిర్వహించారు. దేవుడు ఒక పారిశుధ్య కార్మికుడి రూపంలో వచ్చాడు. అంబులెన్స్ డ్రైవర్ అక్షరాస్యుడు కాదు. తను తీసుకు వెళ్తున్న రోగి కరోనా పాజిటివ్ అని అతనికి తెలుసు, అంబులెన్స్ డ్రైవర్ దేవుని రూపంలో వచ్చాడు. అందుకే మనల్ని రక్షించిన అతడు భగవంతుడి రూపం. కాని దేవుడు వేరు వేరు రూపాలలో వచ్చాడు. మనం వారిని ఎంతగా ప్రసంశించినా, స్తుతించినా, మన దేశ విజయాలని స్తుతించినా, మనలో ఒక కొత్త శక్తి సృష్టించబడుతుంది. అనేక కారణాల వల్ల నిరాశ చెందిన వారిని, 130 కోట్ల మంది ధైర్యాన్ని ఒక్క క్షణం గుర్తుంచుకోవాలని నేను కోరుతున్నాను. మీలో కూడా శక్తి వస్తుంది.

గౌరవనీయులైన అధ్యక్ష్యా,

ఈ కరోనా కాలం, పరీక్షకు కారణం. నిజమైన పరీక్ష, సంక్షోభం ఉన్నప్పుడే జరుగుతుంది. ఇది సాధారణ పరిస్థతులలో త్వరగా గుర్తుకు రాదు. ప్రపంచంలోని పెద్ద దేశాలలో కరోనా వల్ల చాలా నష్టం జరిగింది. కాని వారు ఈ సంక్షోభ సమయంలో ప్రతి ఒక్కరికీ సహాయం చేయడానికి నేరుగా తమ పౌరులకు డబ్బు పంపాలని నిర్ణయించుకున్నారు. ఈ కరోనా, లాక్డౌన్, కర్ఫ్యూ, భయాల మధ్య ఖజానాలో పౌండ్లు, డాలర్లు కుప్పలు కుప్పలుగా ఉన్నప్పటికీ ప్రపంచంలోని అనేక దేశాలు తమ పౌరులకు చేరవేయలేకపోయాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. బ్యాంక్ మూసివేత, పోస్ట్ మూసివేత, వ్యవస్థల మూసివేత, ఏమీ చేయలేకపోయాము. ఒక ఉద్దేశం ఉంది, ప్రకటనలు చేశాము. కరోనా యుగంలో కూడా 75 కోట్లకు పైగా భారతీయులకు రేషన్లు అందించగల భారతదేశం, 8 నెలల వరకు రేషన్

ఇవ్వగలదు. ఇదే సమయంలో జన ధన్, ఆధార్, మొబైల్ ద్వారా 2 లక్షల కోట్ల రూపాయలను ప్రజలకి అందించడం జరిగింది. ఈ జన ధన్ ఖాతా పేదలకు ఉపయోగపడింది, కాని కొన్నిసార్లు ఆధార్‌ను ఆపడానికి కోర్టుకు ఎవరు వెళ్లారా అని ఆలోచిస్తూ ఉంటాను. సుప్రీంకోర్టు తలుపు ఎవరు తట్టారు? నేను కొన్నిసార్లు ఆశ్చర్యపోయాను, ఈ రోజు నేను మళ్ళీ మళ్ళీ ఈ మాట చెబుతాను. అధ్యక్షా, దయచేసి నన్ను మన్నించండి. నాకు ఒక నిమిషం విరామం ఇచ్చినందుకు, మీకు కృతజ్ఞతలు. ఈ సభలో అజ్ఞానం కూడా కొన్నిసార్లు చాలా ఇబ్బంది కలిగిస్తుంది.

గౌరవనీయులైన అధ్యక్ష్య,

ఈ కరోనా యుగంలో తోపుడు బళ్ల వ్యాపారులు, చిరు వ్యాపారులకు డబ్బు లభించాలి. వారికి డబ్బు లభించేలా మేము చేయగలిగాం. గౌరవప్రదమైన స్పీకర్, ఈ పరిస్థితులలో కూడా మన ఆర్థిక వ్యవస్థలో మేము సంస్కరణలను కొనసాగించాము, భారతదేశం వంటి ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి, మేము కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకున్నాము. మీరు చూడవచ్చు, మొదటి రోజు నుండి మేము అనేక విధాలుగా సంస్కరణల చర్యలు తీసుకున్నాము. దాని ఫలితంగా, నేడు ట్రాక్టర్లు, వాహనాలు రికార్డు స్థాయిలో అమ్ముడవుతున్నాయి. నేడు జీఎస్టీ సేకరణ అత్యధిక స్థాయిలో ఉంది. ఈ గణాంకాలన్నీ మన ఆర్థిక వ్యవస్థకి కొత్త శక్తిని ఇస్తున్నాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరించిన శక్తితో అభివృద్ధి చెందుతోందని, సుమారు 2 అంకెల వృద్ధి ఉంటుందని దేశ విదేశాలలో కూడా అంచనా వేశారు. రెండంకెల వృద్ధి అవకాశాలను నిపుణులు కూడా చెప్పారు. ఈ సంక్షోభం సమయంలో కూడా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దేశం ప్రగతి సాధిస్తుందని నేను ఖచ్చితంగా నమ్ముతున్నాను.

గౌరవనీయులైన అధ్యక్షా, ఈ కరోనా సమయంలోనే 3 వ్యవసాయ చట్టాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ వ్యవసాయ సంస్కరణలు చాలా అవసరమైనవి, చాలా ముఖ్యమైనవి. వ్యవసాయ రంగంలో ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సవాళ్ల నుంచి బయటకు రావడానికి మనం నిరంతరం ప్రయత్నం చేయాలి. ఆ దిశగా మేము నిజాయితీగా కృషి చేసాము. భవిష్యత్తులో మనం ఎదుర్కోబోయే సమస్యల పై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని ఎంతోమంది మేధావులు చెప్పారు. ఆ దిశగా మేము ప్రయత్నాలు చేసాము. నేను ఇక్కడ జరుగుతున్న చర్చను గమనిస్తున్నాను. ప్రత్యేకించి మా కాంగ్రెస్ సహచరులు ఈ చట్టం రూపు రేఖల పై చర్చించారు, అది నలుపా తెలుపా అని వాదించారు. కానీ వారు ఆ చట్టాల విషయాలనో లేక ఉద్దేశాన్నో చర్చించి ఉంటే ఈ దేశ రైతులకు సరైన విషయం చేరి ఉండేది. దాదా కూడా ఇక్కడ ఉపన్యసించారు. వారు విషయాన్ని బాగా అభ్యసించి మంచి విషయాలు మాట్లాడతారని నేను అనుకున్నాను. కానీ వారు ఎక్కువగా ప్రధానమంత్రి, అతని సహచరులు బెంగాల్ లో ఎందుకు ప్రయాణిస్తున్నారు? వారు ఎందుకు అలా చేస్తున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? అనే విషయాలపై ఎక్కువగా మాట్లాడారు. కాబట్టి వారి జ్ఞాన లాభం మనకి ఈసారి లభించలేదు. మీకు ఎన్నికల అనంతరం అవకాశం లభిస్తే మాట్లాడవచ్చు. ఈ రంగం ఎంతో ముఖ్యమైనది అందుకే మేము ఈ పని చేస్తున్నాం. మీరు ఈ రంగాన్ని విస్మరించారు అందుకే మేము ఇందులో పని చేస్తున్నాం. ఉద్యమానికి సంబంధించినంతవరకు ఒక విషయాన్ని అర్థం చేసుకుందాం. ఢిల్లీ సరిహద్దుల వద్ద కూర్చుని ఉన్న మన రైతు సోదర సోదరీమణులు అపోహలు, పుకార్లకు బలైపోయారు. నా ఉపన్యాసం అయిపోయాక మీరు ఏం చేయాలో చేయండి. మీకు ఇప్పటికే అవకాశం లభించింది. మీరు వారి కోసం ఆ విధమైన పదాలను ఉపయోగించగలరు, మేము ఆ విధంగా చేయలేము. చూడండి నేను మీకు ఎంత సేవ చేస్తున్నానో, ఈ విషయం ఎక్కడ నమోదు కావాలో అక్కడ నమోదు అయిపోయింది.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఆందోళన చేస్తున్న రైతు సహచరుల మనోభావాలను ఈ సభ, ఈ ప్రభుత్వం గౌరవిస్తుంది, గౌరవిస్తూనే ఉంటుంది. అందుకే మా ప్రభుత్వంలోని సినియర్ మంత్రి ఈ ఆందోళన పంజాబ్ లో జరుగుతున్నప్పటి నుంచి నిరంతరం చర్చలు జరుపుతున్నారు. రైతుల పట్ల గౌరవ భావంతో ఈ పని చేస్తున్నారు.

గౌరవనీయులైన అధ్యక్షా,

ఈ ఆందోళన పంజాబ్ లో జరుగుతున్నప్పటి నుండి చర్చలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ఈ చర్చలు, ఆందోళనకారులు ఢిల్లీ వచ్చాక ప్రారంభించలేదు. ఆ చర్చల సందర్భంగా రైతుల మనసులో ఉన్న సందేహాలను తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేశారు. మేము ఒక్కొక్క విషయంపై చర్చిస్తామని వారికి చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని నరేంద్ర సింగ్ తోమర్ గారు వివరంగా చెప్పారు. రాజ్యసభలో ప్రతి నిబంధనను చర్చించాలని, ఏవైనా లోపాలుంటే, వాటి వలన వాస్తవంగా రైతుకు నష్టం జరుగుతున్నట్టయితే, మార్పులు చేయడంలో నష్టమేంటి? ఈ దేశం దేశ ప్రజల కోసం నిర్ణయాలు తీసుకున్నప్పుడు, అవి రైతుల ప్రయోజనం కోసం తీసుకోవడం జరిగింది. ఇప్పుడు కూడా ఏవైనా స్పష్టమైన నిబంధనలు మార్చాలని వారు నమ్మకం గా ఉంటే మాకు ఏ విధమైన సంకోచం లేదు. ఒక ఆర్డినెన్స్ ద్వారా ఈ మూడు చట్టాలను అమలు చేయడం జరిగింది. ఆ తరువాత పార్లమెంటులో ఆమోదించడం జరిగింది. ఈ చట్టం అమలు చేసిన తరువాత దేశంలో ఎక్కడా మార్కెట్లు మూసివేయబడలేదు, కనీస మద్దతు ధర ని ఎక్కడా ఆపలేదు. ఈ నిజాన్ని దాచి పెట్టి ఇక్కడ మాట్లాడటం జరుగుతుంది. దీనికి ఏ విధమైన అర్థం లేదు. అంతేకాకుండా కనీస

మద్దతు ధర పై పంటలను ఎక్కువగా కొనడం జరిగింది. ఈ మార్పు ఈ చట్టాలను తయారు చేసిన తర్వాత చూశాం.

గౌరవనీయులైన అధ్యక్షా,

మనకు వినబడుతున్న వ్యతిరేక గళాలు, సృష్టించబడుతున్న అడ్డంకులు, ఒక ఉద్దేశపూర్వక వ్యూహం ప్రకారం జరుగుతున్న ప్రయత్నాలు. అబద్దాలు, అపోహలు ఏవైతే వ్యాపించబడ్డాయో, వాటిని పటాపంచలు చేసినట్లయితే నిజం తెలిసిపోతుంది. ఆ తర్వాత వారు అక్కడ నిలదొక్కుకోవడం కష్టంగా మారనుంది. అందుకే వారు బయట చేసినట్టుగానే ఇక్కడ కూడా గందరగోళం సృష్టిస్తున్నారు. కానీ మీరు ఎప్పటికీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోలేరు.

గౌరవనీయులైన అధ్యక్షా

ఆర్డినెన్స్ చేసిన తరువాత, పార్లమెంటులో చట్టం ఆమోదించబడిన తరువాత నేను రైతులను ఒక విషయం అడగాలనుకుంటున్నాను. వారి హక్కులు తీసుకోబడ్డాయా? లేదా వారి వద్ద ఉన్న వ్యవస్థలు తొలగించబడ్డాయా? ఈ చట్టం వల్ల వారి నుండి ఏదైనా లాక్కోవడం జరిగిందా? ఈ విషయంపై ఎవరూ చర్చించరు, నా ప్రశ్నకు జవాబు కూడా ఇవ్వరు. అంతా కూడా మునుపటిలాగానే ఉంది. ఈ చట్టం వలన కేవలం ఒక అదనపు అవకాశం కల్పించబడినది. ఆ చట్టం తప్పనిసరి కాదు కేవలం ఐచ్చికం. ఏ చట్టమైనా తప్పనిసరి చేసినప్పుడే వ్యతిరేకించడం సబబు. మీ పంటను మీకు నచ్చిన చోట తీసుకుని వెళ్ళి అమ్ముకోవచ్చు. రైతులకు ఎక్కడ ఎక్కువ ధర లభిస్తుందో అక్కడికి వెళ్ళే వెసులుబాటు కల్పించబడింది. అధిర్ రంజన్ గారు మీరు హద్దులు మీరుతున్నారు. నేను మిమ్మల్ని గౌరవిస్తాను. నేను ముందే చెప్పాను మీరు చేస్తున్న పనులన్నీ నమోదయ్యాయని. బెంగాల్

లో మీకు టీఎంసి కంటే ఎక్కువ ప్రాచుర్యం లభించనుంది. అధిర్ రంజన్ గారు ఇది బాగోలేదు. నేను మిమ్మల్ని ఎంతగానో గౌరవిస్తాను, మీరు ఈ రోజు ఇలా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? దయచేసి అలా చేయకండి.

అధ్యక్షా, ఈ చట్టం తప్పనిసరి కాదు. అది కేవలం ఐచ్చికం, ఎక్కడైతే ఆ విధమైన ఏర్పాటు ఉందో అక్కడ వ్యతిరేకతకు ఆస్కారం లేదు. అందుకే నేను ప్రజలకు ఒక విషయం చెప్పదలుచుకున్నాను. నేను గమనించిన దాంట్లో ఉద్యమం ఇలా జరగదు. ఇది ఒక కొత్త పద్ధతి. ఉద్యమకారులు ఈ విధమైన పద్ధతులు అవలంబించారు, కేవలం ఉద్యమ జీవులే ఈ విధమైన పద్ధతులను పాటిస్తారు. వారు ఇలా జరిగితే అలా అని, అలా జరిగితే ఇలా అని చెప్తున్నారు. ఏదైతే జరగలేదో, ఏదైతే జరగదో, దాని గురించి భయాన్ని సృష్టించి ఏం లాభం? గత కొన్నేళ్లుగా సుప్రీంకోర్టు తీర్పు కోసం చూస్తున్నారు. ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు కానీ ఒక్కసారిగా తుఫాను సృష్టించబడి దేశాన్ని తగలబెట్టే ప్రయత్నం జరుగుతుంది. ఈ విధమైన పద్ధతులు ఎవరైతే ప్రజాస్వామ్యంలో విశ్వాసం చూపుతారో ఎవరైతే అహింసను నమ్ముతారో వారందరికీ ఇది ఆందోళన కలిగించే విషయం. ఇది ప్రభుత్వానికి సంబంధించినది కాదు. దేశానికి సంబంధించిన విషయం. గౌరవనీయులైన స్పీకర్ గారు పాత మార్కెట్లపై ఏవిధమైన నిర్బంధం లేదు. ఇదే కాకుండా ఈ బడ్జెట్లో ఈ మార్కెట్లను ఆధునీకరించడానికి, వాటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి బడ్జెట్ లో ఏర్పాట్లు చేయబడ్డాయి, బడ్జెట్ ద్వారా మా నిర్ణయాలు సర్వజన హితాయ, సర్వజన సుఖాయ అనే స్ఫూర్తితోనే తీసుకుంటున్నాము. గౌరవనీయులైన స్పీకర్ గారు, సభ లోని సభ్యులు కాంగ్రెస్, ఇతర పార్టీలు గట్టిగా వాళ్ళ మాటలు చెప్పాయని అనుకోవచ్చు కానీ ఏ విషయాలనువారు చెప్పి ఉండాల్సిందో, వారు చెప్పలేదు. వారు కొంత అధ్యయనం చేసి రావాలని మనం అనుకుంటాం. ఇంతే కాదు, ఈ సభలో మొదటిసారి కొత్త వాదన విని నేను ఆశ్చర్యపోయాను. మేము అడగనిదే ఎందుకు

ఇచ్చారని కొంతమంది సభ్యులు చెప్పారు. ముందుగా ఈ చట్టాన్ని తీసుకోవాలా వద్దా అనేది మీ ఇష్టం. దీన్ని మీకు ఎవరూ అంటగట్టడం లేదు. ఇది కేవలం ఐచ్చికం. ఇది ఒక వ్యవస్థ, దేశం చాలా పెద్దది. దేశంలోని ఏదో ఒక మూల దీని వల్ల ప్రయోజనం ఉంటుంది. బహుశా ఎవరికీ ప్రయోజనం ఉండకపోవచ్చు. కానీ ఇది తప్పనిసరి కాదు. అందుకే అడగడానికి ఇవ్వడానికి ఆస్కారం లేదు కానీ ఈ దేశంలో కట్నానికి వ్యతిరేకంగా చట్టాలు చేశారు. ఈ దేశంలో ఎవరూ అలాంటి చట్టాన్ని అడగలేదు, కానీ దేశ ప్రగతి కోసం అలాంటి చట్టాన్ని తయారు చేయడం జరిగింది.

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఎవరూ డిమాండ్ చేయకపోయినా, ప్రగతిశీల దేశం కోసం ముమ్మారు తలాక్ కు వ్యతిరేకంగా చట్టాలను తీసుకు రావడం అవసరం. బాల్య వివాహం లాంటి చెడు సాంప్రదాయాన్ని అరికట్టాల్సిన అవసరం ఉంది కాబట్టి బాల్య వివాహాలను అరికట్టడానికి ఒక చట్టాన్ని తీసుకురావడం అత్యావశ్యకం అయ్యింది. దేశాన్ని అభివృద్ధి చేయడానికి సుసంపన్నం చేయడానికి ఇలాంటి చట్టాలు అవసరం. కుమార్తెలకు ఆస్తిలో సమాన హక్కులు కావాలని ఎవరైనా డిమాండ్ చేశారా? విద్యా హక్కు కోసం ఎవరైనా డిమాండ్ చేశారా? కానీ అలాంటి సంస్కరణలు, చట్టాలు దేశంలో అభివృద్ధి కోసం మార్పు కోసం అవసరం. దేశంలో ఇలాంటి సంస్కరణలు ఎప్పుడైనా చూసామా? ప్రపంచానికి తెలుసు, వీటిని స్వీకరించడం కూడా జరిగింది.

గౌరవనీయులైన స్పీకర్ గారు, కాంగ్రెస్ పార్టీ భారతదేశంలో పురాతనమైన రాజకీయ పార్టీ అని మనము నమ్ముతున్నాము. ఆరు దశాబ్దాలుగా వారు ఒంటి చేత్తో ఈ దేశాన్ని పాలించారు. దురదృష్టవశాత్తు ఆ పార్టీ ఎంతగా విచ్ఛిన్నమైందంటే వారి వారసులు రాజ్యసభలో, లోక్ సభలో వ్యతిరేక మార్గాల్లో నడుస్తున్నారు. అలాంటి విభజించబడిన, అయోమయ రాజకీయ పార్టీ దేశం కోసం ఎటువంటి మేలు చేయలేదు. ఈరోజు దేశం

ఎదుర్కొంటున్న సమస్యలకు వారు ఎలాంటి పరిష్కారాన్ని చూపలేరు. ఇంతకన్నా పెద్ద దురదృష్టం ఏదైనా ఉందా? రాజ్యసభలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుసంపన్నమైన, ఉత్తేజపరిచే చర్చలలో వారి అభిప్రాయాలను వివరంగా వ్యక్తపరుస్తున్నారు. కానీ లోక్ సభలో ఉన్న వారు..... ఈ విషయాన్ని సమయానికే వదిలేద్దాం.

గౌరవనీయులైన స్పీకర్ గారు, నేను మీ దృష్టికి ఈపీఎఫ్ పెన్షన్ పథకాన్ని తీసుకు వస్తున్నాను. 2014 తర్వాత నా పదవీకాలంలో, చాలా సందర్భాలలో 7 రూపాయలు, 25 రూపాయలు, యాభై రూపాయలు లేదా 250 రూపాయల వరకు స్వల్ప పెన్షన్ ని పొందుతున్న లబ్ధిదారుల గురించి తెలిసింది. ఈ విధమైన పద్ధతిని మన దేశంలో ఉంది. వారు ఆ పెన్షన్ పొందడానికి కార్యాలయాన్ని చేరుకోవడానికి అంతకంటే ఎక్కువ ఆటో ఖర్చులకి వెచ్చిస్తున్నారని నేను గ్రహించాను. ఎవరూ ఎటువంటి డిమాండ్ చేయలేదు, ఏ విధమైన దరఖాస్తు మాకు కార్మికుల సంఘం నుంచి లభించలేదు. స్పీకర్ గారు, మేము సవరణలు తీసుకు వచ్చి కనీస పింఛను వెయ్యి రూపాయలకు తీసుకు వచ్చాము. ఈ నిర్ణయాన్ని మేము ఒకరి అభ్యర్థన కారణంగా అమలు చేయలేదు. మా వద్ద కి రైతు సంఘాలు వచ్చి చిన్న రైతుల కోసం కనీస ఆర్థిక సహాయం అభ్యర్థించ లేదు. అయిననూ మేము ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద ఆర్థిక సహాయాన్ని వారికి అందించాము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఒక ఆధునిక సమాజానికి మార్పు చాలా అవసరం. ఆ కాలంలో నిరసనలు ఎలా ఉండేవో మనము చూసాము. గొప్ప నాయకులు రాజారామ్ మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, ఎంతో మంది విప్లవకారులు ఆటుపోట్లకు వ్యతిరేకంగా పోరాడి సమాజంలో భారీ సామాజిక సంస్కరణలు తీసుకువచ్చారు. సమాజంలో ఉన్న వ్యవస్థలో మార్పును అమలు చేయడానికి మనం ప్రయత్నాలు చేస్తున్నప్పుడు వ్యతిరేకత ఉండడం సహజం. కానీ కొత్త పద్ధతి వెనక

ఉన్న నిజాన్ని గ్రహించి దాన్ని త్వరగా స్వీకరించడం జరిగింది. భారత్ చాలా పెద్ద దేశం కావడం వల్ల ఒక నిర్ణయం పై ఏకాభిప్రాయానికి రావడం దాదాపు అసాధ్యం. ఈ దేశం వైవిధ్యాలతో నిండి ఉంది. ఒక చోట కొంతమందికి లాభదాయకమైనది, మరోచోట అంత లాభం లేకపోవచ్చు. కొన్నిచోట్ల మునుపటి ప్రయోజనాన్ని కూడా కోల్పోవచ్చు. మేము ఎక్కువ మందికి లాభం చేకూర్చే దిశగా పని చేస్తున్నాము. అందుకే "సర్వజన హితాయ సర్వజన సుఖాయ" అనే సామాజిక సంక్షేమ దృష్టితోనే నిర్ణయాలు తీసుకుంటాము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, మేము దీనిని అడిగామా అనే వాదనను నేను తిరస్కరిస్తాను. మనము నిరంకుశవాదులమా? మన దేశ పౌరులు దేనికోసం వేడుకోవలసిన అవసరం లేదు. వారిని ఎందుకు వేడుకునేలా చెయ్యాలి? ఈ విధమైన ఆలోచన మన ప్రజాస్వామ్య పద్ధతులకు అనుగుణంగా లేదు. ప్రభుత్వానికి కరుణ ఉండాలి. ప్రజల సంక్షేమాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకువెళ్లే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. భారత పౌరులు ఆయుష్మాన్ భారత్ పథకం కోసం అభ్యర్థించలేదు. కానీ పేద ప్రజల్ని వైద్య సమస్యల నుండి కాపాడవలసిన అవసరం ఉందని మేము గ్రహించాము. దేశ పౌరులు బ్యాంకులో ఖాతా కోసం నిరసన ప్రదర్శనలు కానీ లేఖలు రాయడం గానీ చేయలేదు. మేము జన్ ధన్ పథకం ద్వారా వారికి వ్యక్తిగత ఖాతాలను పొందుపరిచాము. స్వచ్ఛభారత్ గురించి ఎవరైనా డిమాండ్ చేసారా? ఈ దేశ ప్రజలు ఇష్టపూర్వకంగా ఆ పథకాన్ని అమలు చేశారు. ఎవరైనా వారికి మరుగుదొడ్లు కావాలని కోరారా? ఎవరూ అడగలేదు. కానీ మేమే ముందుకు వచ్చి పది కోట్ల ఇళ్లల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి పూనుకున్నాము. ఇది ప్రజాస్వామ్యం, నిరంకుశ వాదం కాదు. మేము ప్రజల భావోద్వేగాలను, అవసరాలను గ్రహించి వారి అంచనాలను అందుకోవడానికి చురుకైన చర్యలు తీసుకున్నాము. పౌరులు వారి హక్కుల గురించి అభ్యర్థించడం ద్వారా వారిలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించలేము. మన దేశాన్ని

అభివృద్ధి చేయడానికి యాజమాన్యం మరియు హక్కులకు సంబంధించిన ఆలోచనలు ప్రోత్సహించాలి. పౌరులు వారి సదుపాయాల కోసం అడగవలసి వస్తే వారు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోవచ్చు. కాబట్టి పౌరుల సామర్థ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి మేము తగిన చర్యలు తీసుకున్నాము. దాదా ఒక్క నిమిషం ఉండండి, నేను కూడా అదే చెబుతున్నాను. అతను కోరుకుంటే పాత సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు, వదులుకోవలసిన అవసరం లేదు. పాత నిబంధన విస్మరించడం లేదు, ఎవరైనా పాతవాటిని కొనసాగించవచ్చు. నేను దాని గురించి మరింత వివరిస్తాను.

గౌరవనీయులైన స్పీకర్ గారు, నిలిచిపోయిన నీరు అనేక వ్యాధులకు కారణమవుతుందని మనందరికీ తెలుసు. ప్రవహించే నీరు జీవితాలను సుసంపన్నం చేస్తూ ఆనందాన్ని ఇస్తుంది. అయితే సంబంధితమైన దానిని కొనసాగనివ్వాలి. ఎవరైనా ఏదైనా అడిగినప్పుడే మనం అది చెయ్యాలి అనుకోవడం సరైనది కాదు. సమయానుకూలంగా మనం కొన్ని బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవాలి. యధాతథ స్థితి అనే ఆలోచన ఈ దేశాన్ని నాశనం చేయడంలో పెద్ద పాత్ర పోషించింది. ఈ విధమైన స్థిర మనస్తత్వంతో మనం మనల్ని మార్చుకోలేము. ఈ దేశ యువత ఎప్పటికీ వేచి ఉండలేదు. ఈరోజు నేను యధాతథ స్థితిని మనం అంటిపెట్టుకుని ఉంటే ఏం జరుగుతుందో ఒక కథారూపంలో చెప్తాను. 40,50 సంవత్సరాల క్రితం జరిగిన కథ. నేను కూడా ఎవరి నుంచో విని ఉన్నాను కాబట్టి తేదీలు ఖచ్చితమైనవి కాకపోవచ్చు. నేను అప్పుడు ఏం విన్నానో గుర్తు తెచ్చుకుని మీతో పంచుకోగలను. 60 వ దశకంలో తమిళనాడు రాష్ట్రంలో కార్మికుల వేతనాలు పెంచడానికి ఒక కమిషన్ ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కమిషన్ చైర్మన్ ఒక పెద్ద రహస్యం ఒక రహస్యపు కవరులో అందుకున్నారు. అందులో వారు ఒక దరఖాస్తుని చూసారు. ఒక వ్యక్తి తను ఎన్నో సంవత్సరాలుగా నిజాయితీగా పనిచేస్తున్నప్పటికీ ఏ విధమైన పెంపు అందుకోలేదని కాబట్టి

ఆ ఉత్తరం ద్వారా ఎక్కువ వేతనం కావాలని కోరాడు. ఆ చైర్మన్ ఆ వ్యక్తి పేరు, హోదా కోరుతూ బదులిచ్చారు. ఆ వ్యక్తి తను మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో సి సి ఏ గా పనిచేస్తున్నట్టు సమాధానం ఇచ్చారు. చైర్మన్ గారికి సి సి ఏ పాత్ర ఏంటో అర్థం కాక మరింత సమాచారం కోసం తిరిగి రాశారు. దానికి ఆ వ్యక్తి తను నిబంధనలకు కట్టుబడి ఉన్నందున మరింత సమాచారం ఇవ్వలేనని, వివరాలు 1975 తర్వాత మాత్రమే చెప్పగలను అని బదులిచ్చాడు. దానికి బదులుగా చైర్మన్ అలాంటప్పుడు ఇప్పుడు నన్ను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు అని అడిగారు, దానికి బదులుగా మీరు 1975 లో పనిచేసే కమిషన్ ను సంప్రదించాల్సిందిగా చెప్పారు. ఆ వ్యక్తి విషయం చేయి దాటుతుందని గ్రహించి, అసలు విషయం చెప్పడానికి అంగీకరించాడు. ఆ వ్యక్తి బదులిస్తూ నేను సి సి ఏ గా ఎన్నో సంవత్సరాలుగా ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో పని చేస్తున్నాను. సి సి ఏ అంటే చర్చిల్ సిగార్ అసిస్టెంట్. వాస్తవం ఏమిటంటే 1940లో చర్చిల్ బ్రిటన్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తిరుచ్చి నుంచి చుట్టలను పంపేవారు, ఆ వ్యక్తి చుట్టల పంపిణీ జరగడానికి బాధ్యత వహించేవాడు. అందుకే సి సి ఏ అనే పదవి తిరుచ్చి నుంచి చుట్టల సరఫరాని నిర్ధారించడానికి ఉండేది. 1945లో చర్చిల్ ఎన్నికలు ఓడిపోయినా ఆ పదవి అలాగే కొనసాగుతూ, చుట్టల సరఫరా కూడా కొనసాగింది. ఆ తర్వాత భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. స్పీకర్ గారు, అయినా ఆ పదవి కొనసాగుతూనే వచ్చింది. చర్చిల్ కు చుట్టల సరఫరాను నిర్ధారించే బాధ్యత ప్రధాన కార్యదర్శి కార్యాలయంలో కొనసాగుతూ వచ్చింది. అందువల్ల ఆ వ్యక్తి తన జీతం పెంచాలని, పదోన్నతి కోరుకున్నాడు. యధాతథ స్థితి పరిణామం ఎలా ఉంటుందో ఇంతకన్నా పెద్ద ఉదాహరణ ఉండదు. అందుకే మనం యధాతథ స్థితిని ప్రశ్నించాలి, వ్యవస్థను పునఃసమీక్షించుకుంటూ ఉండాలి. నేను ముఖ్యమంత్రి అయినప్పుడు 'ఈరోజు బుడగలు లేదా స్లిప్పులు విసిరివేయబడలేదు' అనే రిపోర్టు నా వద్దకు వచ్చేది. బహుశా ఈ ఏర్పాటు రెండవ

ప్రపంచ యుద్ధంలో ఉండేది. అది అప్పటికీ ఆచరణలో ఉంది, అలాంటి పద్ధతులు మన వ్యవస్థలో ఇప్పటికీ పాతుకుపోయి ఉన్నాయి. మనం రిబ్బన్ కత్తిరించి, దీపాలను వెలిగించి, ఫోటోలు తీసుకోవడం లోనే ఆనందిస్తాము. అంతే చాలు అనుకుంటాము, కానీ మనం ఈ దేశాన్ని మార్చడానికి బాధ్యతాయుతమైన ప్రయత్నాలు చేయాలి. తప్పులు జరగవచ్చు కానీ ఉద్దేశ్యం మంచిదే అయితే ఫలితాలు కూడా బాగుంటాయి. అప్పుడప్పుడు మనం ఓడిపోవచ్చు. ఒక పత్రాన్ని ధ్రువీకరించడానికి కార్పొరేటర్ ఇంటి ముందు పొడవైన క్యూ ఉండడం మీరు చూసే ఉంటారు. అతను ఆ పత్రంపై ముద్ర వేస్తాడు. అది కూడా అతను చేయడు, అక్కడ ఒక వ్యక్తి కూర్చుని ఆ పని చేస్తాడు. ఈ విధమైన వ్యవస్థ చాలా రోజులుగా కొనసాగుతుంది, ఎవరు దానిని ప్రశ్నించలేదు. నేను బాధ్యతలు స్వీకరించిన తర్వాత, మనం మన పౌరులను విశ్వసించాలని అందుకే ధ్రువీకరణ పద్ధతిని రద్దు చేసాము. దానివల్ల ప్రజలకు మేలు జరిగింది. మనము పరివర్తన, సంస్కరణల కోసం పని చేయాలి.

నాకు ఇప్పటికీ ఇంటర్వ్యూ ప్రక్రియ అర్థం కాదు. ఒక వ్యక్తి లోపలికి ప్రవేశిస్తే ముగ్గురు వ్యక్తులు పానలిస్టుగా కూర్చుంటారు. వారు ఆ వ్యక్తి మానసిక స్థితిని చదువుతారు, అతని పేరును కూడా సరిగ్గా అడగరు. ఆ తర్వాత వారు బయటకు వెళ్తారు. ఈ విధంగా ఇంటర్వ్యూ జరుగుతుంది. దీనిని బట్టి ఆదేశాలు ఏవిధంగా జారీ చేయబడతాయో చూడవచ్చు. ఎందుకు ఆ విధమైన జిమ్మిక్కు మనకి అవసరం? మనము విద్య, ఇతర అర్హతలు డేటాబేస్ ను ఎందుకు తయారు చేయకూడదు? కంప్యూటర్ మెరిట్ జాబితా రూపొందించండి. 3వ తరగతి, 4వ తరగతి ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో దీనిని ఉపయోగించవచ్చు. అలాగే ప్రజలకు కేవలం సిఫార్సు ఉంటేనే ఉద్యోగం దొరుకుతుంది అనే భ్రమ ఉంది. అందుకే మేము ఈ విధమైన పద్ధతిని రద్దు చేశాము. నా ఉద్దేశం లో దేశంలో మార్పులు తీసుకురావాలి. దేశంలోని ప్రజలు

వైఫల్యం పట్ల భయం తో యథాతథ స్థితిని అంగీకరించడం దేశానికి మంచిది కాదు. వ్యవస్థను మార్చడానికి మనం ప్రయత్నాలు చేయాలి. సమయానుకూలంగా మార్పులు తీసుకురావాలి.

మన దేశంలో వ్యవసాయం, సాగు అనేవి చాలా పాత సాంప్రదాయాలు, మన సంస్కృతిలో అవి ఒక భాగం. ఇది ప్రధాన స్రవంతిలోని చర్య. అందుకే గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టడంలో మన రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయం లోని అనేక అంశాలను మన ఋషులు అనేక గ్రంథాలలో వివరించారు. చాలా అద్భుతమైన అనుభవాలు రచించడం జరిగింది. మన రాజులు కూడా పొలాలు దున్నడం జరిగింది. జనకమహారాజు, కృష్ణుడు, అతని సోదరుడు బలరాముడు గురించిన కథలు ఎవరు వినలేదు? ప్రతి సంపన్న కుటుంబం వ్యవసాయంలో నిమగ్నమై ఉండేది. ఇది పంటల సాగుకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, వ్యవసాయం భారతీయ సంస్కృతి, సామాజిక నిర్మాణంలో ఒక ఒక కీలకమైన భాగం. అందుకే అది మన సంస్కృతిలో అంతర్లీనమైన భాగమని పునరుద్ఘాటిస్తున్నాను. మన పండుగలు, విజయోత్సవాలు, ఇతర శుభ సందర్భాలు అన్నీ కూడా పంటల కోతలతో ముడిపడి ఉన్నాయి. ఇది మన సాంప్రదాయం. జానపద గీతాలు, సంగీతం - రైతుల జీవితం, పంటల పైనే ఆధారపడి ఉంటాయి. కాలానుగుణ పంటల ప్రకారం మన పండుగలను జరుపుకుంటారు. అది మన దేశం ప్రత్యేకత. మనం ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నప్పుడు సంపదలు, ఆస్తులు ప్రతి ధ్వనించేలా 'ధనధాన్య' అనే పదాలను ఉపయోగిస్తారు. ఈ రెండు పదాలు విడదీయలేనివి. అది మనం మన పంటలకు ఇచ్చే విలువ, ప్రాముఖ్యత. మన సామాజిక వ్యవస్థలో అది ఒక అంతర్భాగం. ప్రస్తుతం పరిస్థితులు పట్టాలు తప్పినందున, మనం ఒక గౌరవాన్ని తిరిగి తీసుకురావడం ఎంతో ప్రాధాన్యత తో కూడిన అంశం.

రాజ్యసభలో చిన్న రైతులకు సంబంధించిన అంశాలను నేను చర్చించాను. వారు మనదేశ జనాభాలో 80 నుంచి 85 శాతం ఉన్నారు. వారిని అభివృద్ధి నుంచి దూరం చేసి మనము ప్రగతి సాధించలేము. వారి గురించి మనం ఎంతో వినయంగా ఆలోచించాలి. నేను ప్రతి అంశాన్ని వివరిస్తూ చిన్న రైతులు రైతుల వర్గంగా ఏ విధంగా వివక్షకు గురయ్యారో వివరించాను. ఈ రంగంలో భారీ పరివర్తన తీసుకు రావాల్సిన అవసరం ఉంది. ఏ రోజైతే రైతులు తలెత్తుకోగలరో ఆరోజు మీరందరూ కూడా జవాబుదారీగా ఉంటారు. నేను ఈ విషయాన్ని మదిలో ఉంచుకుంటాను. ఒకవైపు జనాభా పెరుగుతుంటే మరోవైపు భూ యాజమాన్యం తగ్గుతుంది, అది కుటుంబాల మధ్య మరింత విభజించబడుతుంది. ఒకసారి చౌదరి చరణ్ సింగ్ గారు మన వద్ద చాలా మంది రైతులు ఉన్నారు కానీ వారి భూ యాజమాన్యం తగ్గుతుందని చెప్పారు. ఆ రోజు ఎంతో దూరం లేదు, ఎప్పుడైతే వారి ట్రాక్టర్ ని తిప్పుకునేటంత భూమి కూడా వారి వద్ద మిగిలి ఉండదో రోజు. అంతగా వారి భూములు కుంచించుకుపోతాయి. చౌదరి చరణ్ సింగ్ గారి మాటలు మనం గుర్తుంచుకోవాలి. అటువంటి గొప్ప వ్యక్తులు ఇలాంటి అంశాలను లేవనెత్తినప్పుడు పరిష్కారాలు కనుక్కోవడం మన నైతిక బాధ్యత.

స్వాతంత్ర్యం తరువాత మన దేశంలో 28 శాతం వ్యవసాయ కూలీలు ఉండేవారు. గత దశాబ్దంలో జనాభా లెక్కల ప్రకారం ఈ సంఖ్య 55 శాతానికి పెరిగింది. ఇది ఖచ్చితంగా దేశానికి తీవ్రమైన ఆందోళన కలిగించే విషయం. భూమి పరిమాణం తగ్గిపోవడం వల్ల రాబడి గణనీయంగా తగ్గి మన రైతులకు సంక్షోభాలను ఎదుర్కొంటున్నారు. దుర్భరమైన పరిస్థితులు వారిని వేరే వారి వ్యవసాయ భూముల్లో బానిసలుగా తయారు చేశాయి. మన వ్యవసాయ రంగానికి అవసరమైన పెట్టుబడి లభించక పోవడం దురదృష్టకరం. ప్రభుత్వం తగినంత చేయలేకపోయింది, రాష్ట్ర ప్రభుత్వాలు, రైతులు కూడా ఏమీ చేయలేని పరిస్థితిలో

ఉన్నారు. రైతులు వారి సంపాదనతో వారి కుటుంబ అవసరాలను, ఇతర అవసరాలను అతికష్టంగా తీర్చి జీవనం గడుపుతున్నారు. అందుకే ఈ రంగంలో పెట్టుబడులు రావాల్సిన అవసరం ఉంది.ఈ రంగంలో భారీ పెట్టుబడులను ప్రోత్సహించనంతవరకు వ్యవసాయ మౌలిక సదుపాయాలను ఆధునీకరించాలనే లక్ష్యం పెట్టుకోలేము. అభివృద్ధిచెందిన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా చిన్న రైతులు ప్రయోజనాలు పొందవచ్చు. మన వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే సమయం ఆసన్నమైంది. మన రైతులను స్వావలంబన దిశగా తీసుకువెళ్లి వారి పంటలను అమ్ముకునే స్వేచ్ఛ వారికి అందించాలి. ఈ దిశగా మనం కృషి చేయాలి. మార్కెట్లోని ప్రస్తుత పరిస్థితులపై పరిశోధన జరుగుతోంది. మార్కెట్ కు అవసరమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేసి ప్రపంచ మార్కెట్లో మనకంటూ ఒక స్థానాన్ని మనం సృష్టించుకోవాలి. మనకి కొన్ని నిర్దిష్ట అవసరాలు ఉన్నాయి, ఆ వస్తువుల దిగుమతులను మనం ప్రోత్సహించకూడదు. నేను చాలా కాలం క్రితం సంస్థ కోసం పనిచేస్తున్నప్పుడు, ఫారుక్ సాహెబ్ గారి ఆధ్వర్యంలో ఉత్తర భారత దేశంలో పనిచేసే అవకాశం లభించింది. హర్యానాకు చెందిన ఒక రైతు అతని పొలానికి నన్ను ఒకసారి తీసుకు వెళ్ళాడు. తను నన్ను చాలా అభ్యర్థించడం వల్ల నేను అతని ఆహ్వానాన్ని తిరస్కరించ లేకపోయాను. తన వద్ద 1-1.5 ఎకరం భూమి ఉంది కానీ అందులోనే తను చాలా పురోగతి సాధించారు. అతను అలా అడిగాక, నాకు తెలుసుకోవాలని కుతూహలం కలిగింది. తను కూడా విషయాలు పంచుకోవడానికి ఉత్తేజితుడై ఉన్నాడు. ఆ తర్వాత నేను అతని పొలాన్ని సందర్శించడానికి ఒప్పుకున్నాను. ఇది ముప్పై నలభై సంవత్సరాల క్రితం మాట. అతను ఢిల్లీలోని ఫైవ్ స్టార్ హోటల్స్ దిగుమతి చేసుకునే ఖరీదైన కూరగాయల గురించి తెలుసుకుంటాడు. వారికి బేబీ కార్న్ లేదా చెర్రి టొమాటో కావాలంటే తన చిన్న భూమిలోనే నిపుణుల సహాయంతో వాటిని పరిమితమైన వాతావరణంలో సాగు చేసి ఢిల్లీలోని ఫైవ్ స్టార్ హోటల్ కి సరఫరా చేసేవాడు.

మనం వ్యవస్థని కొంచెం మార్చాలి. మనం ఏనాడైనా కచ్ ఎడారిలో స్ట్రాబెర్రీలను పండించగలమని అనుకున్నామా? స్ట్రాబెర్రీలు కేవలం చల్లటి వాతావరణం లోనే పెరుగుతాయని మనం భావించాం.

మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లలో కూడా స్ట్రాబెర్రీ సాగు చేయడం ప్రోత్సాహకరంగా ఉంది. నీటి కొరత ఉన్నటు వంటి ప్రదేశాలలో కూడా రైతులు దీనిని విజయవంతంగా సాగుచేస్తున్నారు. ఇది మన అపారమైన సామర్థ్యాలను ప్రతిబింబిస్తుంది. కేవలం మనం రైతులకు మార్గదర్శకత్వం వహించి కొత్త వంగడాలను సాగు చేసేలా ప్రేరేపించాలి. మన రైతులు త్వరలోనే ముందుకు వచ్చి వారి వ్యవసాయ పద్ధతులను సరిగ్గా ఊహించుకుంటారని నాకు బలమైన నమ్మకం ఉంది. గతంలో రైతులకు కలిగిన చెడు అనుభవాల దృష్ట్యా వారి నమ్మకాన్ని గెలవడం అంత సులభం కాదు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. వారి చేయి పట్టుకొని వారిని అభివృద్ధి పథం వైపు తీసుకువెళ్లాలి. వారు మొదటి అడుగు వేయడమే ఆలస్యం. ఒక్కసారి నమ్మితే వారు అద్భుతాలు చేయగలరు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెంచినట్లయితే మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రపంచ మార్కెట్లో మనకంటూ ఒక స్థానాన్ని సృష్టించుకోవాలి. మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మార్చడానికి వ్యవసాయ వ్యాపార పరిశ్రమకు కూడా అవసరమైన ఊతం లభిస్తుంది. కాబట్టి ఈ ప్రయత్నాలు, మన దృష్టి ఈ రంగాన్ని స్వావలంబనం చేసే దిశగా ఉండాలి. ప్రతికూల పరిస్థితులలో కూడా మన రైతులు రికార్డ్ స్థాయిలో ఉత్పత్తిని చేశారు కరోనా సమయంలో కూడా చాలా మంది రైతులు అసాధారణ ఉత్పత్తిని నమోదు చేశారు రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిదీ వారు ఎదుర్కొనే సమస్యలు, సవాళ్లకు సరైన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవసాయ సంస్కరణలు సరైన దిశలో తీసుకున్న చిన్న అడుగులు. రైతులకు సమాన అవకాశాలతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

అందించాలి. ఇది వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ఈ సమస్యలను మనం ఆశావాదంతో, సమయానుకూలంగా ఎదుర్కోవాలి.

ఈ విధమైన కాలంచెల్లిన ప్రమాణాలు మన రైతుల పరిస్థితులను మెరుగు పరచగలిగి ఉంటే ఇప్పటికీ అది మనం సాధించి ఉండేవాళ్ళం. మనం రెండవ హరిత విప్లవం గురించి మాట్లాడాము. అభివృద్ధి కోసం మనం కొత్త ప్రణాళికలను తీసుకు రావడంతో పాటు ఆ దిశగా ఆలోచించాలి. దీంట్లో రాజకీయాలకి ఆస్కారం ఉండకూడదు. మన దేశం మంచికోసం ఈ సమయంలో మనం పాటుపడాలి. మనందరం దీని కోసం ఐక్యంగా ఉండాలి. అది ప్రభుత్వం కానివ్వండి, లేదా ప్రతిపక్షం కానివ్వండి, ఇది సమిష్టి బాధ్యత. మనం 18 వ శతాబ్దపు ఆలోచనతో 21వ శతాబ్దంలో వ్యవసాయ రంగంలో విజయాలు సాధించి ముందుకు సాగలేము. మనము మన పరిమిత ఆలోచన ప్రక్రియ నుంచి బయటకి రావాలి.

మన రైతులు పేదరికపు విష చక్రంలో చిక్కు కోవాలని ఎవరూ కోరుకోరు. వారు నాణ్యమైన జీవితం గడపడానికి హక్కు కోల్పోవాలని కోరుకోరు. వారు ఒకరిపై ఆధారపడి బానిసలుగా ఉండకూడదు అని నేను భావిస్తున్నాను. వారు బలవంతంగా ప్రభుత్వ సహాయంపై జీవించకూడదు. ఇది మనందరి బాధ్యత ఈ బాధ్యతను మనం మన భుజాలపై ఎత్తుకుని మన రైతులు సుసంపన్నం అయ్యేలా, దేశ ప్రగతిలో ఏదోవిధంగా తోడ్పాటు అందించేలా చేయాలి. మనం వారికి అభివృద్ధి చెందే అవకాశాలు అందించినట్లయితే వారు సాధించగలరు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు ఒక స్వతంత్ర దేశం బానిసత్వ వాసనతో కొనసాగితే స్వేచ్ఛా స్ఫూర్తి చాలా దూరం వ్యాపించదు అని చెప్పేవారు. మన రైతులకు కొత్త హక్కులు లభించనంత వరకు మనం పూర్తి స్వాతంత్ర్యం లభించింది అని చెప్పలేము కాబట్టి మనందరం

కలిసికట్టుగా సమూల మార్పులు తీసుకు వచ్చి రైతులకు అవసరమైన తోడ్పాటును అందించి దీర్ఘకాలిక అభివృద్ధికి సిద్ధం చేయాలి. మన ప్రయత్నాలు హాని చేసే ఉద్దేశంతో కాకుండా వారి సంక్షేమం కోసం చేయాలి.

మా ప్రభుత్వం రైతులకు అడుగడుగున సహకరించింది. గత ఆరు సంవత్సరాలలో మేము ఎన్నో చిన్న, పెద్ద మార్పులు తీసుకొచ్చి రైతులకు విత్తనం నుంచి మార్కెట్ వరకు సహాయాన్ని అందించాము. ఉదాహరణకి పాడి, సహకార రంగం బలంగా ఉన్నాయి. అలాగే వాటి విలువను కూడా వృద్ధి చేయడం జరిగింది. ప్రభుత్వ జోక్యం తో ఈ రంగం బలమైన వృద్ధిని సాధించింది. మనము క్రమంగా మన దృష్టిని పళ్ళు, కూరగాయలతో పాటు ఉద్యానవనం వైపు సారించి, అలాగే ధాన్యాలు, పప్పుల ఉత్పత్తిని పెంచవచ్చు. ఈ రంగాలు చాలా శక్తివంతమవుతాయి. మన వద్ద విజయవంతమైన వ్యాపారం ఉంది. మనం దానిని అమలు చేయాలి. వారికి మనం ప్రత్యామ్నాయ మార్కెట్లను అందించాలి. మన ప్రభుత్వం తీసుకున్న మరో ముఖ్యమైన అడుగు - 10 వేల మంది రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు. దీని వల్ల చిన్న రైతులు ఒక బలమైన శక్తిగా ఎదుగుతారు. మహారాష్ట్ర ఈ విధమైన ప్రయోగాన్ని, FPO ఏర్పాటు చేసి చూసింది. ఆ విధంగానే కమ్యూనిస్టు రాష్ట్రమైనా కేరళ కూడా FPOలను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయడానికి ఇష్టపడుతుంది. ఎన్నో ఇతర రాష్ట్రాలు కూడా వీటిని అనుసరిస్తున్నాయి. దీనివలన రైతులు ఒక బలమైన శక్తిగా ఏర్పడి వారికి నచ్చిన మార్కెట్ ను సృష్టించుకోగలరు. పదివేల ఏర్పాటు తర్వాత ఈ చిన్న రైతుల శక్తిని వారి గ్రామాలలో మనం చూడవచ్చు. రైతులు మార్కెట్ ని నిర్దేశిస్తారు, బలవంతులుగా ఎదుగుతారని నా నమ్మకం. FPO ల ద్వారా రైతులు బ్యాంకుల నుండి ఆర్థిక సాయం పొందడంతో పాటు చిన్న గిడ్డంగి సదుపాయాల సహకారాన్ని కూడా పొందగలరు. వారు మరి కొంచెం శక్తివంతమయ్యాక, తమ సొంత శీతల గిడ్డంగుల సదుపాయాన్ని కూడా పొందగలరు.

స్వయం సహాయక బృందాలతో సంబంధం ఉన్న 7 కోట్ల సోదరీమణులను శక్తివంతం చేయడానికి ప్రభుత్వం ఒక లక్ష కోట్ల రూపాయల నిధిని ఏర్పాటు చేసింది. ఎంతైనా వారు రైతుల బిడ్డలు వారు ఏదో రకంగా వ్యవసాయ కుటుంబాలతో సంబంధాలు కలిగి ఉంటారు. ఈ విధమైన ఏర్పాటు చేసి రైతు సమాజ సంక్షేమానికి ఉపయోగిస్తున్నాము. అవి ఆర్థిక కార్యకలాపాలకు పెద్ద కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఒకసారి గుజరాత్ లోని బల్సాడ్ గిరిజన ప్రాంతంలో స్వయం సహాయక బృందాల సహాయంతో ఒక ప్రాజెక్టును చేయడం జరిగింది. అక్కడి గిరిజన భూములు చిన్నవిగా, అసమానంగా ఉండేవి. ఒకసారి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారు ఈ ప్రాంతాన్ని సందర్శించి వారి పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం గొప్ప గౌరవం. అక్కడ ఏ విధమైన నియమనిబంధనలు ఉండకూడదని, వారు ఆ రైతులతో కొంత సమయం గడపాలనుకుంటున్నారని చెప్పారు. ఆ ప్రాజెక్టు చాలా విజయవంతమైనది, అక్కడి మహిళలు అక్కడి గిరిజన ప్రాంతం లో చాలా కష్ట పడే వారు. వారు అక్కడ గోవాలో లభించే నాణ్యమైన పుట్టగొడుగులు, జీడిపప్పులను సాగు చేసేవారు. వారు మార్కట్ ను సృష్టించారు. వారు చిన్న రైతులు, వారి వద్ద చాలా తక్కువ భూమి ఉండేది, అయినా వారి కష్టం మంచి ఫలితాలను ఇచ్చింది. డాక్టర్ కలాం గారు స్వయంగా కలవడం ద్వారా వారి విజయ గాధ గురించి వ్రాసారు. అందుకే మనం కొత్త ఆలోచనలు, పథకాలతో ముందుకు దూసుకుపోవాలని చెప్తున్నాను. పప్పు ధాన్యాల సేకరణ లో మేము సవాళ్లు ఎదుర్కొంటున్నాము. 2014లో మేము రైతులకు ఒక అభ్యర్థన చేసాము. కష్టపడి పనిచేసి మనల్ని సమస్య నుంచి విముక్తి కల్పించడమే కాకుండా వారి కోసం ఒక మార్కెట్ ను సృష్టించారు. ఈ రోజుల్లో కూడా రైతులు ఏవిధంగా వారి ఉత్పత్తులను ఆన్ లైన్ మరియు ఆఫ్ లైన్ మాధ్యమం e-NAM ద్వారా ఎలా అమ్ముకుంటున్నారో చూస్తున్నాం. కరోనా సమయంలో మనము కిసాన్ రైళ్లు, కిసాన్ విమానాలతో ప్రయోగాలు చేశాము. దానివలన చిన్న రైతుల

కోసం పెద్ద మార్కెట్లు తెరవబడ్డాయి, వారి ఉత్పత్తులకు సరైన విలువను వారు పొందగలిగారు. ఈ రైళ్లు ఒకవిధంగా చక్రాలపై నడిచే శీతల గిడ్డంగులు. ఈ సభలో ఉన్న మంత్రులను ఈ విషయాన్ని గమనించాల్సిందిగా కోరుతున్నాను. రైళ్లు కేవలం రవాణా సదుపాయం కోసం ఉన్నాయని అనిపించినా ఇవి మారుమూల గ్రామాల్లోని చిన్న రైతులను వేరే రాష్ట్రాల్లోని పెద్ద మార్కెట్లతో అనుసంధానించాయి. దీని ప్రభావం చూడండి, నాసిక్ లోని ఒక రైతు ముజఫర్ నగర్ లోని ఒక వ్యాపార వేత్త తో కలవగలిగాడు. తనది పెద్ద వ్యాపారం కాదు కానీ అతను తన 30కిలోల దానిమ్మను ఒక పెద్ద మార్కెట్ కు కేవలం 124 రూపాయలకే పంపగలిగాడు. కొరియర్ వారు కూడా అంత తక్కువ మొత్తంలో ఆ సదుపాయాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తారు. కానీ మౌలిక సదుపాయాల సౌకర్యం కారణంగా ఒక చిన్న రైతు పెద్ద మార్కెట్ లో తన ఉత్పత్తిని ప్రత్యక్షంగా అమ్ముకో గలుగుతున్నాడు.

ఎవరైనా కేవలం 60 రూపాయలు చెల్లించి గుడ్లను సరఫరా చేయడం నేను చూశాను. అతను వాటిని సురక్షితంగా, సమయానికి పంపడమే కాకుండా దానిని అమ్ముకో గలుగుతున్నాడు. దేవ్లాలి లో ఒక చిన్న రైతు కివి పళ్ళను దానాపూర్ కి పంపాడు. కేవలం అరవై రెండు రూపాయలకే ఆ వ్యక్తి తన అరవై కిలోల కివి పళ్ళను వేరే రాష్ట్రం లోని ఒక పెద్ద మార్కెట్లో అమ్మ గలిగాడు. కిసాన్ రైలు అనేది ఒక చిన్న ఆవిష్కరణ కానీ అది ఒక పెద్ద మార్పుకి దోహదపడుతుంది. మనం విజయానికి ఉదాహరణలు చూసాము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, చౌదరి చరణ్ సింగ్ గారు భారత ఆర్థిక శాస్త్రం పై ఒక పుస్తకం రాశారు. ఆ పుస్తకంలో ఆయన యావత్ రాష్ట్రాన్ని ఒక ప్రాంతంగా పరిగణించాలని సూచించారు. మరో మాటలో చెప్పాలంటే వారి పుస్తకం లో చెప్పినట్టుగా సరుకును రాష్ట్రాల సరిహద్దుల ద్వారా సరఫరా చేయడానికి ఏ విధమైన పరిమితులు ఉండకూడదు. వ్యవసాయ

సంస్కరణలు కిసాన్ రైలు, ఈనామ్ మార్కెట్లకు ఎలక్ట్రానిక్ ప్లేట్లు ఏర్పాటు చేయడం, టోకు మార్కెట్లు ఏర్పాటు చేసి చిన్న రైతులకు పెద్ద అవకాశాలు కల్పించాము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఈ దేశాన్ని ఎన్నో దశాబ్దాలుగా ఇప్పుడు విమర్శించేవారు పాలించారు. వారికి రైతుల సమస్యలు గురించి తెలియదు అని అంటే నేను నమ్మను. వారికి రైతు సమస్యల గురించి బాగా తెలుసు. అలాగే వారికి అవగాహన కూడా ఉండేది. అందుకే నేను వారికి వారి మాటలను ఈరోజు గుర్తు చేస్తున్నాను. వారు ప్రస్తుతం ఇక్కడ లేరు కానీ దేశ ప్రయోజనాల దృష్ట్యా దీన్ని వివరించడం చాలా అవసరం. నేను ఒక ప్రకటన చదువుతున్నాను "2005లోనే తమ రాష్ట్రంలో ఏపీఎంసీ చట్టాన్ని సవరించడానికి మా రాష్ట్రం చొరవ తీసుకుంది. ప్రత్యక్ష మార్కెట్, కాంట్రాక్ట్ వ్యవసాయం కోసం ఒక ప్రైవేట్ మార్కెట్ ను ఏర్పాటు చేసి వినియోగదారులు, రైతు మార్కెట్ లు, ఈ ట్రేడింగ్ కి సంబంధించిన నిబంధనలను 2007లోనే పొందుపరిచాం. సవరించబడిన చట్టాన్ని అమలు చేయడానికి 24 ప్రైవేట్ మార్కెట్లను ఇప్పటికే రాష్ట్రంలో ఏర్పాటు చేశాము" ఈ మాటలు ఎవరు చెప్పారు? ఎవరు ఏపీఎంసీ చట్టాన్ని సవరించామని గర్వంగా చెప్పారు? 24 మార్కెట్లు అప్పటికే పనిచేస్తున్నాయని ఎవరు గర్వపడుతూ చెప్పారు? ఇవన్నీ కూడా అప్పటి వ్యవసాయ మంత్రి శ్రీ శరద్ పవార్ గారు డా. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో చెప్పారు. కానీ ఈ రోజు వారు వాటిని ఖండిస్తున్నారు. అందుకే ఇప్పుడు రైతులను తప్పుదారి పట్టిస్తున్న వారి ఉద్దేశాల పట్ల నాకు సందేహాలు ఉన్నాయి. వివిధ మార్కెట్ లు పూర్తిగా పని చేస్తున్నాయి. అప్పట్లో మార్కెట్ యజమానులు, మధ్యవర్తులు ధరలని నియంత్రించే, నిర్ణయించే ప్రభావం గురించి శరద్ పవార్ గారిని ప్రశ్నించినప్పుడు వారు ఒక ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. వారు ఏపీఎంసీ లోని సంస్కరణలు రైతులను రక్షించడానికి, వారికి ఒక ప్రత్యామ్నాయ మార్కెట్ ను ఇవ్వడానికి చేసినట్లు చెప్పారు. వారు, ఎక్కువ మంది వ్యాపారవేత్తలు ఇందులో

నమోదు చేసుకుని పోటీ పెరగడం వల్ల మార్కెట్లోని ముఠా వ్యవస్థ దానికదే అంతరించిపోతుందని చెప్పారు. అందుకే మనం ఈ విషయాలను లోతుగా అర్థం చేసుకోవడం చాలా అవసరం.

ఈ సభలో కూర్చుని ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన స్నేహితులు కూడా వ్యవసాయ సంస్కరణలు ప్రవేశ పెట్టడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. పదిహేను వందల చట్టాలను మేము రద్దు చేసాము. మేము ప్రగతిశీల రాజకీయాలకు ఆద్యులం. మేము తిరోగమన రాజకీయాల్లో పాల్గొనడానికి ఇష్టపడము. భోజపురి లో ఒక సామెత ఉంది "నా ఖేలాబ్, నా ఖేలన్ దేబ్, ఖేల్ మీ బిగాడత్" దాని అర్థం మేము ఆడము, ఆడనివ్వము, ఆటను పాడు చేస్తాము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, దేశ సామర్థ్యాలను పెంచడానికి మాకు అందరి ఏకీకృత సహకారం అవసరం కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి కామాఖ్య వరకు మన పౌరులందరూ వారి స్వేదాన్ని, రక్తాన్ని దేశం కోసం ఇచ్చినపుడే దేశం అభివృద్ధి చెందుతుంది. కాంగ్రెస్ పార్టీలోని నా మిత్రులకు నేను ఒక విషయం గుర్తు చేస్తున్నాను. ప్రభుత్వ రంగం ఈ దేశానికి అవసరం కానీ ప్రైవేటు రంగం కూడా దేశ అభివృద్ధికి అంతే ముఖ్యం. ప్రభుత్వం మొబైల్ తయారీని ప్రోత్సహించింది. ప్రైవేటు పార్టీలు, ఉత్పత్తిదారులు వచ్చారు. ఈరోజు పేద కుటుంబాలకు కూడా స్మార్ట్ ఫోన్లు అందుబాటులో ఉన్నాయి. టెలికాం రంగంలో పోటీ పెరిగి ఈరోజు మొబైల్ ఖర్చు దాదాపు తగ్గిపోయింది, ప్రపంచంలోనే చౌకైన డేటా భారతదేశంలో లభిస్తుంది. అలాగే మందులు, వ్యాక్సిన్ల ఉత్పత్తిదారులు; అవి ప్రభుత్వ సంస్థలా? ఈరోజు భారతదేశం మానవాళికి ఎంతో ఉపయోగపడుతుంది. అందులో ప్రైవేటు రంగం పెద్ద పాత్ర పోషిస్తుంది. ప్రైవేటు రంగం మన దేశాన్ని ప్రపంచ పటంలో నిలబెట్టింది, మనం మన యువతని నమ్మాల్సిన అవసరం ఉంది. వారిని నిరుత్సాహ పరచకుండా వారి పై నమ్మకాన్ని

ఉంచాలి. మనం ప్రైవేట్ కార్యకలాపాలను కించపరచడం గానీ తిరస్కరించడం కానీ చేయలేము. జాతీయ అభివృద్ధికి కేవలం ప్రభుత్వమే బాధ్యత వహించే రోజులు పోయాయి.

ప్రపంచం మారిపోయింది. దేశం తన సమాజం ద్వారానే నిలబడుతుంది, ప్రతి ఒక్కరికి అవకాశాలు ఉండాలి. అవమానకరమైన భాషను ఉపయోగించి ఇతరుల్ని చెడుగా చిత్రీకరించడం ఓటుబ్యాంకు రాజకీయాల పాత పద్ధతి. దేశానికి సంపద సృష్టికర్తలు అవసరమని నేను ఎర్ర కోట నుండి ప్రసంగించాను. మనము ఏవిధంగా సంపదను సృష్టించి పేదవారి అవసరాలకు పంచగలము? ఉపాధి అవకాశాలు ఎలా సృష్టించగలం? కేవలం అధికారులే ఈ దేశానికి అంతా చేస్తున్నారా? ఒక ఐఏఎస్ అధికారి ఎరువుల కంపెనీ నడపగలరా? వారు ఒక్కసారి ఐఏఎస్ అయితే వారు రసాయన పరిశ్రమ లేక విమానం నడపాలి. ఏ విధమైన అధికారాన్ని మనము సృష్టించాము? కేవలం అధికారులకు ఈ దేశ పగ్గాలు అప్పగించి మనం ఏమి సాధించగలం? వారు ఈ దేశ పౌరులు అయితే ఈ దేశ యువత కూడా ఈ దేశానికి చెందిన వారే. మనం ఎంత ఎక్కువగా అవకాశాలు సృష్టిస్తే అంత ఎక్కువగా ప్రయోజనం పొందగలము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, మనం ఇప్పుడు ఏదైతే చూస్తున్నామో, దానికి మద్దతు ఇవ్వడానికి సరైన కారణం లేదు. వారు భయాలను సృష్టించి వాతావరణాన్ని పాడు చేసి ఈ విధమైన ఆందోళన జీవుల్ని తయారు చేస్తున్నారు. గౌరవనీయులైన స్పీకర్ గారు, రైతుల నిరసన పవిత్రతని నేను గౌరవిస్తున్నాను, అని చాలా బాధ్యతాయుతంగా చెప్తున్నాను. అది రైతుల నిరసన అని నేను భావిస్తున్నాను. భారత ప్రజాస్వామ్యంలో నిరసన అనేది ఎప్పటికీ ముఖ్యమైనది. కానీ కొంతమంది ఆందోళనకారులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిరసనలు చేస్తుంటే వాటి పర్యవసానం ఎలా ఉంటుంది? మూడు వ్యవసాయ చట్టాలపై నిరసన చేస్తూ, దోషుల చిత్రాలతో కవాతు చేస్తూ, జైలులో ఉన్న

ఉగ్రవాదులు, నక్సలైట్లు, మతోన్మాద శక్తులు, అల్లరి మూకలను విడుదల చేయాలని డిమాండ్ చేయడం ఎవరైనా వివరించగలరా? ఇది ఆ నిరసనను కించపరిచే ప్రయత్నం కాదా?

గౌరవనీయులైన స్పీకర్ గారు, ఈ దేశంలో టోల్ ప్లాజా వ్యవస్థని అన్ని ప్రభుత్వాలు ఏకగ్రీవంగా అంగీకరించాయి. టోల్ ప్లాజాని ధ్వంసం చేయడం, ఆక్రమించడం, వాటిని నిర్వీర్యం చేయడం - కొనసాగుతున్న నిరసనను కించపరిచే ప్రయత్నం కాదా? పంజాబ్ లో అనేక టెలికామ్ టవర్లను ధ్వంసం చేసినప్పుడు అవి రైతుల ఆందోళనతో ఏ విధంగా జోడించబడ్డాయి? ఈ పవిత్రమైన నిరసనను దెబ్బతీసే ఉద్దేశంతోనే ఆందోళన జీవులు పని చేస్తున్నారు. ఈ దేశంలో ఆందోళన జీవులు ఎవరో ఆందోళనకారులు ఎవరో కనిపెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ఇలాంటి దేశద్రోహుల నుంచి మన దేశాన్ని కాపాడుకోవాలి. మీరు అబద్ధాలను, పుకార్లను వ్యాప్తి చేస్తూ దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. ముట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. మన దేశం చాలా పెద్దది, సామాన్య పౌరుల ఆకాంక్షలు కూడా పెద్దవే. అందుకే మనం మనల్ని అభివృద్ధి చేసుకునే దిశగా దృష్టి సారించాలి. మన దేశంలోని ఒక పెద్ద సమూహానికి ఉన్న ఒక లక్షణం సరైన విషయాలని మాట్లాడదాం. సరైన విషయాలు మాట్లాడడం లో తప్పు లేదు కానీ వారు సరైన పనులు చేయడంలో విశ్వాసం ఉంచరు. వారు కేవలం మంచి విషయాల గురించి మాట్లాడుతారు కానీ మంచి పనులు చేస్తున్నప్పుడు అడ్డుపడతారు. మనం ఈ తేడాని గ్రహించాలి. వారు కేవలం మాట్లాడతారు, అరుదుగా అర్థవంతమైన పనులు చేస్తారు. ఎవరైతే ఎన్నికల సంస్కరణలు గురించి మాట్లాడుతున్నారో వారే 'ఒక దేశం ఒక ఎన్నిక' కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతారు. వీరు వేదికలపై నుంచి గట్టిగా లింగ సమానత్వం గురించి మాట్లాడుతారు, కానీ ముమ్మారు తలాక్ అంతం చేయడాన్ని నిరసిస్తూ ఉంటారు. ఒకవైపు పర్యావరణం గురించి గట్టిగా మాట్లాడుతూనే మరోవైపు జల విద్యుత్ శక్తి లేదా అణు శక్తి ఉన్న ప్రదేశం లో నిరసన జెండాలను చూపిస్తారు.

వారు దేశవ్యాప్తంగా నిరసనలకు ఆజ్యం పోస్తారు. ఇలాంటి వాటికి తమిళనాడు ఒక బాధిత రాష్ట్రం.

అదే విధంగా మొదట వారు ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యం పై రిట్ పిటిషన్, పి ఐ ఎల్ వేస్తారు. అదే సమయంలో వారు గడ్డిని తగలబెట్టే వారికి మద్దతుగా సంఘీభావం తెలుపుతారు. ఇవి దేశ పౌరులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు అని స్పష్టంగా తెలుస్తుంది, మనమంతా మేల్కొని ఈ విధమైన తప్పుడు ఉద్దేశాలను గుర్తించాలి. గత ఆరేళ్లలో ప్రతిపక్షాల ఎజెండా ఎలా మారిందో నేను గమనిస్తున్నాను. మేము కూడా ప్రతిపక్షం లో ఉన్నాము. మీరు గమనించే ఉంటారు, మేము దేశ అభివృద్ధి కోసం మా స్వరాన్ని పెంచే వాళ్ళం, పాలకపక్షం లోని అవినీతి నాయకులను ఎండగట్టే వాళ్ళం. మేము మా స్వరాన్ని బలపరిచి నిజాయితీగా పని చేస్తాం. నేడు ప్రతిపక్షం జాతీయ అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించడానికి కనీసం ఆసక్తి చూపకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వారు కొన్ని సమస్యలను లేవనెత్తుతారని, అప్పుడు, మేము నిమగ్నమై చేస్తున్న మంచి పనుల గురించి చెబుదామని నేను ఎదురు చూస్తున్నాను. కానీ వారు మాకు అరుదుగా అవకాశం ఇస్తారు. ఇప్పుడు వారికి ఆ విధమైన ఆలోచన లేదు కాబట్టి ముఖ్యమైన విషయాలపై మాట్లాడడానికి వారి వద్ద ఏమీ లేదు. అందుకే ఎన్ని రోడ్డులు లేదా ఎన్ని వంతెనలు నిర్మించాము అని వారు అడగడం మానేసారు. సరిహద్దు నిర్వహణ స్థితి లేదా రైల్వేల గురించి వారు అడగడం లేదు. ఇలాంటి విషయాలను చర్చించడానికి వారు కనీస ఆసక్తి చూపించడం లేదు.

గౌరవనీయులైన స్పీకర్ గారు, 21వ శతాబ్దంలో మౌలిక సదుపాయాలు ముఖ్యమైన పాత్రని పోషిస్తున్నాయి. భారతదేశం అభివృద్ధి సాధించాలంటే మన మౌలిక సదుపాయాలను

మరింత బలోపేతం చేయడం చాలా అవసరం. ఆత్మ నిర్భర్ భారత్ ని ప్రభావవంతంగా అమలు చేయడానికి ఇది అవసరం అని మనం అంగీకరించాలి.

మన వద్ద బలమైన, అభివృద్ధి చెందిన మౌలిక సదుపాయాలు ఉంటేనే మనదేశం వేగంగా, విస్తృతంగా అభివృద్ధి చెందగలదు. మన కృషి ఆ దిశలో ఉండాలి. అధునాతన మౌలిక సదుపాయాలు అలక్ష్యానికి గురైనా మధ్యతరగతి వర్గాలకు నూతన అభివృద్ధి అవకాశాలను కల్పించే పర్యావరణాన్ని అందిస్తుంది. ఉపాధి అవకాశాలకు అద్భుతమైన అవకాశం ఉంటుంది. ఇది ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావాన్ని తీసుకువచ్చే అవకాశం ఉంది. అందుకే మనం ప్రధానంగా దేశంలో మౌలిక సదుపాయాలను సృష్టించడం పై దృష్టి పెట్టాలి. ఇది ఓటు బ్యాంకును పెంచుకునే ఎజెండా కాదు. ఒక రోడ్డు నిర్మాణాన్ని, ఎన్నికల్లో గెలవడానికి ప్రకటించడం లాంటిది కాకూడదు. మరొక సందర్భంలో ఎన్నికలలో గెలవడానికి అదే రహదారిపై తెల్ల పట్టీలు వేస్తారు మూడోసారి కొంత మట్టి వేస్తారు మేము చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రజల ఓట్లని దండుకోవడానికి కాదు. మేము నిజాయితీగా జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కోసం పని చేస్తున్నాము. అందుకే మౌలిక సదుపాయాల ప్రాముఖ్యతని నొక్కి చెబుతున్నాను. ప్రస్తుత బడ్జెట్ లో నూట పది లక్షల కోట్ల విలువైన పథకాలను ప్రత్యేకంగా పొందుపరచడం ద్వారా దేశాన్ని అభివృద్ధి, ప్రగతి వైపు తీసుకువెళ్లడానికి ప్రతిష్ఠాత్మకమైన కేటాయింపులు చేయడం జరిగింది. దేశంలోని 27 నగరాలలో మెట్రో ట్రైన్ సదుపాయం, ఆరు లక్షల గ్రామాలలో వేగవంతమైన ఇంటర్నెట్, విద్యుత్ రంగంలో వన్ నేషన్ వన్ గ్రిడ్. వీటన్నిటినీ కూడా సాధించడంలో మనం విజయవంతం అయ్యాము. ఈరోజు సౌర విద్యుత్ తో సహా పునరుత్పాదక శక్తి రంగంలో భారతదేశం ప్రపంచంలోని మొదటి ఐదు దేశాలలో చోటు దక్కించుకుంది. త్వరలోనే

భారతదేశంలో ప్రపంచంలోని అతిపెద్ద సౌర, హైబ్రిడ్ వాయు శక్తి కలిగి ఉంటుంది. మనం కొత్త ప్రమాణాల ప్రకారం కొత్త అభివృద్ధిని చూడబోతున్నాం.

దేశంలోని వివిధ ప్రాంతాలలో ముఖ్యంగా తూర్పు భారతదేశంలో అసమతుల్య అభివృద్ధిని మనము చూసాము. తూర్పు భారత దేశాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే దానిని పశ్చిమ భారత దేశ ఆర్థిక అభివృద్ధి స్థాయికి తీసుకు రావాలి. ఈ విధంగా దేశం తన అంతర్గత సామర్థ్యాలను పెంచుకోగలరు. అందుకే తూర్పు రాష్ట్రాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి వాటి అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాము. అది గ్యాస్ పైప్ లైన్లు వెయ్యడం కానివ్వండి, రోడ్లు, విమానాశ్రయాలు నిర్మించడం కానివ్వండి, రైల్వే లైన్ లు కానివ్వండి, ఇంటర్నెట్ అనుసంధానించడం కానివ్వండి లేదా ఈశాన్య రాష్ట్రాలని వేరే రాష్ట్రాలతో అనుసంధానించే భారీ నీటి మార్గాల ప్రాజెక్టు కానివ్వండి, మన దేశాన్ని సమతుల్య వృద్ధి వైపు నడిపించడానికి మేము దృష్టి కేంద్రీకరించామని నేను భావిస్తున్నాను. అభివృద్ధి ప్రయాణంలో దేశంలోని ఏ ప్రాంతం, మిగిలిపోకుండా చూసుకుంటున్నాము. ప్రగతిశీల, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్వహించాలని మా ఆలోచన అలాంటిది. అందుకే మేము తూర్పు భారతదేశం పై శ్రద్ధ చూపుతూ మిషన్ మోడ్ లో పనిచేస్తున్నాము. మేము 12 జిల్లాల్లో సిఎన్జీ, పీఎన్జీ, సిటీ గ్యాస్ పంపిణీ నెట్వర్క్ ను విజయవంతంగా ఏర్పాటు చేసాము.ఈ గ్యాస్ పైప్ లైన్ల వ్యవస్థ ఈశాన్య రాష్ట్రాల్లోని ఎరువుల తయారీకి ఊతం అందించింది. ఇంతకుముందు మూసివేయబడిన అనేక ఎరువుల కర్మాగారాలు పునరుద్ధరించబడ్డాయి. గ్యాస్ పైప్ లైన్ వ్యవస్థని మరింత అభివృద్ధి చేసి ఈ కర్మాగారాలకు తెరుచుకునే అవకాశాలు ఇవ్వడానికి నిశ్చయించుకున్నాము.

గౌరవనీయులైన స్పీకర్ గారు, గత ఎన్నో సంవత్సరాలుగా మనము ప్రత్యేక సరుకు రవాణా కారిడార్ గురించి వింటున్నాము. మేము బాధ్యతలు స్వీకరించినప్పుడు సరుకు

రవాణా కారిడార్ స్థితి ఏమిటి? కేవలం ఒక కిలోమీటరు మేర పని మాత్రమే పూర్తి అయ్యింది. గత ఆరు సంవత్సరాల్లో సుమారు 600 కిలోమీటర్లు పని పూర్తయ్యి వాడుకలో ఉన్నాయి, ఈ విభాగంలో సరుకుల రవాణా జరుగుతుంది. యూపీఐ పదవి కాలం లో సరిహద్దు మౌలిక సదుపాయాలను పూర్తిగా విస్మరించబడ్డాయి, బాధ్యతారహితంగా నిర్వహించబడ్డాయి. ఏ దేశ భద్రత కైనా ఇది చాలా కీలకం. ఇలాంటి విషయాలు బాహాటంగా చర్చించలేము ఎందుకంటే అది దేశ భద్రతకు సంబంధించిన విషయం. ఇది తీవ్రమైన విషయం. వారు ఇది ముఖ్యమని అనుకోలేదు. ఎందుకంటే అక్కడ జనాభా లేదు, ఓటుబ్యాంకు లేదు. అక్కడ సైనికులు మాత్రమే ఉంటారు కాబట్టి తర్వాత చూసుకోవచ్చు అనుకున్నారు. దురదృష్టవశాత్తు ఒక రక్షణ మంత్రి కూడా పార్లమెంటులో "సరిహద్దు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం లేదు, ఎందుకంటే శత్రుదేశం వాటిని తమ ప్రయోజనాల కోసం వాడుకోవచ్చు" అని అన్నారు. ఇంతకంటే సిగ్గు పడాల్సిన విషయం మరొకటి ఉండదు. మేము ఈ విధమైన ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా నిలబడి, సరిహద్దు మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్దేశించిన అంచనాలను, లక్ష్యాలను చేరుకున్నాము.

వాస్తవాధీన రేఖ పై వంతెనలు నిర్మించడం జరిగింది. నా అంచనా ప్రకారం 75 పైగా వంతెనలపై వేగవంతంగా పనులు జరుగుతున్నాయి. మేము ఎన్నో వందల కిలోమీటర్ల రోడ్లు ఇప్పటికే నిర్మించాము. ఇప్పటికీ మేము నిర్ధారించుకున్న లక్ష్యాలలో 75% పూర్తి చేసాము, దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా దీనిని కొనసాగిస్తాము. హిమాచల్ ప్రదేశ్ లోని అటల్ సొరంగం దుర్భర పరిస్థితి గురించి మనందరికీ తెలుసు. ఇది అటల్ జీ గారి జీవిత కాలంలో ఆయన కలల ప్రాజెక్ట్. దురదృష్టవశాత్తు ఈ ప్రాజెక్టు అధికార తంత్రంలో చిక్కుకుని నెరవేరకుండా ఉండిపోయింది. కొంతకాలం ఈ ప్రాజెక్టులోని చిన్న భాగం పూర్తి చేసిన మళ్ళీ పని ఆగిపోయింది. ఏదో ఒక కారణం వలన ఈ ప్రాజెక్టు పూర్తి కాలేదు. గత ఆరు

సంవత్సరాలుగా ప్రాజెక్టుని పూర్తిచేయాలని ప్రయత్నాలు చేస్తూ ఈరోజు ఈ సొరంగాన్ని ప్రజల ఉపయోగం కోసం వాడుకలోకి తీసుకు వచ్చాము. దేశ సైన్యం, పౌరులు అక్కడ స్వేచ్ఛగా తిరగుతున్నారు. అయితే ఏ రోడ్లు ఆరు నెలల వరకూ మూసివేయబడి ఉండేవో అవి ఇప్పుడు ప్రయాణానికి అందుబాటులో ఉన్నాయి. అటల్ సొరంగం ఒక వరంగా మన ముందుకు వచ్చింది.

అదేవిధంగా దేశం ఏ సంక్షోభాన్ని అయినా ఎదుర్కొన్నప్పుడు, దానిని నిర్వహించ గలిగి సామర్థ్యం మనకి ఉందని నేను స్పష్టం చేయాలనుకుంటున్నాను. మన సాయుధ దళాలకు తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొనే సామర్థ్యం ఉంది. మన దేశ గౌరవాన్ని నిలబెట్టడానికి మన సైన్యం కట్టుబడి ఉంది, ఏ విధమైన కష్టాలకి తలవంచదని నేను నమ్ముతున్నాను. వారు అంకితభావంతో, చిత్తశుద్ధితో వారి సేవలు అందిస్తున్నారు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా వారు తమ విధులను నెరవేరుస్తున్నారు. అత్యంత సమర్థులైన జవాన్లు, సాయుధ దళాల పట్ల మనము గర్వపడుతున్నాము. దేశ అభివృద్ధి కోసం ముఖ్యమైన నిర్ణయాలు ఈ దేశం ధైర్యంగా, విశ్వాసంతో తీసుకుంటుంది. నేను ఒకసారి ఒక గజల్ విన్నాను. నాకు పెద్దగా ఆసక్తి లేకపోయినా ఈ పంక్తులు నాలో ప్రతిధ్వనించాయి. 'మై జిసే ఓడ్ తా బిచాతా హు ఓ గజల్ ఆప్కో సునాతా హు.' దాని అర్థం నేను జీవించిన కథలను మీకు గజల్ గా పాడి వినిపిస్తాను. మన స్నేహితులు ఎవరైతే మనల్ని విడిచి పెట్టి వెళ్లారో వారి జీవితకాలంలో కథలను, వారు జీవించిన, గడిపిన వస్తువుల గురించి చెప్పారు. వారు తమ జీవిత కాలంలో జరిగిన వృత్తాంతాలను పెంచుకుంటూ ఉంటారు. కాబట్టి ఇప్పుడు మనం ధైర్యంగా ముందుకు వెళ్లాల్సిన సమయం వచ్చింది అని నేను అనుకుంటున్నాను. కరోనా తర్వాత ఏర్పడ్డ ప్రపంచ పరిస్థితులలో, ఏమీ మారదు, అంతా సరే లాంటివి తిరోగమన మనస్తత్వాన్ని సూచిస్తాయి. వాటిని అరికట్టవలసిన అవసరం ఉందని నేను

పునరుద్ఘాటిస్తున్నాను. 130 కోట్ల భారతీయుల సామర్థ్యాలపై విశ్వాసంతో మనం ముందుకు సాగుతున్నాము. ఖచ్చితంగా లక్షల్లో సమస్యలు ఉంటాయి, అలాగే కోట్లలో పరిష్కారాలు కూడా ఉంటాయి.

మనం ఒక బలమైన జాతి. అభివృద్ధి, ప్రగతి పథంలో మనం మన రాజ్యాంగ వ్యవస్థను విశ్వసించాలి. మనం దీన్ని దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్తామని నాకు నమ్మకం ఉంది. దళారుల సంస్కృతి ముగిసింది అనేది వాస్తవం. దేశంలోని మధ్య తరగతి వర్గం ఈ అభివృద్ధి ప్రయాణంలో కీలక పాత్ర పోషించనుంది. అందుకే ప్రభుత్వం మెరుగుదల కోసం వేగంగా పనిచేస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం న్యాయ సంబంధిత మౌలిక సదుపాయాలను ప్రవేశపెట్టింది.

గౌరవనీయులైన అధ్యక్షా, దేశంలో అభివృద్ధి, పురోగతి మధ్య ఒక సమతుల్యాన్ని స్థాపించడానికి ఈ ప్రభుత్వం నిరంతరం ప్రయత్నాలు చేస్తుంది. అనేక అంశాలపై తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరిచినందుకు గౌరవ రాష్ట్రపతి గారికి నేను ఎంతో రుణపడి ఉంటాను. రాజకీయ ఎజెండా ఉన్నవారికి అభినందనలు కానీ మేము జాతీయ జెండా తో ముందుకు వెళ్తున్నాము మేము అది కొనసాగిస్తాం. మరోసారి దేశంలోని రైతులను సమస్యలకు పరిష్కారం కనుగొనే ఉద్దేశంతో చర్చలకు ఆహ్వానిస్తున్నాను. ఈ ఆకాంక్షతో గౌరవనీయులైన రాష్ట్రపతి గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

ధన్యవాదాలు.

Azadi Ka Amrit Mahotsav

